




మాతృదేవో భవ!




గ్రంథం పేరు : మాతృసవనము

ప్రకాశకులు : శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి

ప్రచురణ : జీవా, వైదిక పరిశోధన ప్రకాశన విభాగము

ప్రథమ ముద్రణ : 2020

ప్రతులు : 1000

ప్రతులకు

జీయర్ ఇంటిగ్రేటెడ్ వేదిక్ అకాడమీ
శ్రీరామనగరం, పాలమాకుల
రంగారెడ్డి జిల్లా.
ఫోన్ 95535 49971 72

జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్
సీతానగరం. 522501
మంగళగిరి, గుంటూరుజిల్లా
ఫోన్ 08645 272929 272353

శ్రీరామానుజవాణి
11-49-136
శివాలయం వీధి
విజయవాడ - 1
ఫోన్ 0866 2420820

సేకరణ : వేద, ఆగమ, ప్రబంధ, తత్త్వశాస్త్రవిద్యార్థులు

కూర్పు : ప్రపన్న వైశారది

పరిష్కరణ : డా॥ పి.జ్యోతి, ప్రపన్న వైశారది, రాధా కల్వపూడి

డిటిపి : దయాసాగర్, శ్రీనివాస్, హేమశ్రీ, ఉషశ్రీ, కల్పన, శాంతి, నీళ, సీతారామాచార్యులు, యుగంధరాచార్యులు,

డిజైనింగ్ : గోపరాజు కృష్ణమోహనాచార్యులు

ముద్రణ : వ్యాసా ఆఫ్‌సెట్ ప్రింటర్స్ - విజయవాడ



*Visit Us*

jetsitanagaram@yahoo.com www.chinnajeeyar.org www.statueofequality.org



# విషయసూచిక

## వైదిక కుటుంబం


1 శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారి మంగళాశాసనము 11

2 శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారికి అమ్మగారి వినతి 17

3 ఉపరాష్ట్రపతి శ్రీమాన్ వెంకయ్యనాయుడు గారి సందేశము 20

4 భూమిక 21


## జీయర్ స్వాములు


1 శ్రీశ్రీశ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామి 26

2 శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి 28

3 శ్రీశ్రీశ్రీ శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి 29

4 శ్రీశ్రీశ్రీ అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి 31


## ఉభయ వేదాంత పండితులు


1 శ్రీమాన్ నేపాల్ కృష్ణమాచార్యులు 33

2 శ్రీమాన్ సముద్రాల వేంకటరంగరామానుజాచార్యులు 35

3 శ్రీమాన్ గుదిమెళ్ళ వేణుగోపాలాచార్యులు (వేణుస్వామి) 38

4 శ్రీమాన్ ధనకుధరం సీతారామానుజాచార్యులు 40

5 శ్రీమాన్ టి.పి. రాఘవాచార్య స్వామి కుముదవల్లి దంపతులు 42

6 శ్రీమాన్ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు 47

7 శ్రీమాన్ శ్రీ కందాడై రామానుజాచార్యులు 49

8 శ్రీమాన్ డా.ముడుంబై నరసింహరంగాచార్యులు 50

9 శ్రీమాన్ ముడుంబై శ్రీమన్నారాయణాచార్యులు 52

10 శ్రీమాన్ చలమచర్ల శేషాచార్యులు 53


## వేద పండితులు


1 శ్రీమాన్ కొమాండూర్ ఇళైయవిల్లి స్థలశాయి - కృష్ణయజుర్వేదం 57

2 శ్రీమాన్ కరి పురుషోత్తమాచార్యులు - కృష్ణయజుర్వేద సలక్షణ ఘనపాఠి 58

3 శ్రీమాన్ సందుగుల రాఘవాచార్యులు - ఋగ్వేద సలక్షణ ఘనపాఠి 61

4 శ్రీమాన్ గుదిమెళ్ళ మురళీ కృష్ణమాచార్యులు- అథర్వ వేదం 62

5 శ్రీమతి గుదిమెళ్ళ నీళాదేవి 64

6 శ్రీమాన్ భ.సు. ప్రహ్లాదాచార్యులు- అథర్వ వేదం 65

7 శ్రీమాన్ కె.వరప్రసాదాచార్యులు- మైత్రాయణి 66

8 శ్రీమాన్ వేదాంతం వేంకట నరసింహాచార్యులు - కృష్ణయజుర్వేదం 68

9 శ్రీమాన్ చక్రవర్తుల యాదగిరాచార్యులు- యజుర్వేదం 69

10 శ్రీమాన్ వోలేటి వంశీకృష్ణమాచార్యులు- ఋగ్వేదం 70

11 శ్రీమాన్ గట్టు శేషాచార్యులు - కృష్ణయజుర్వేదం 71

12 శ్రీమాన్ రావూరి వరదన్ - శుక్ల యజుర్వేదం 72


తల్లిదండ్రులు జన్మనిస్తారు. ఆచార్యులు జ్ఞానజన్మనిచ్చి భక్తిపథంలో నడిపిస్తారు.




13 శ్రీమాన్ గోవర్ధనం రంగనాథాచార్యులు - యజుర్వేదం 73
14 శ్రీమాన్ కలకుంట్ల విష్ణువర్ధనాచార్యులు - శుక్లయజుర్వేదం 73
15 శ్రీమాన్ ముడుంబై శ్రీకాంతాచార్యులు - ఋగ్వేదం 74
16 శ్రీమాన్ మోదేకుర్తి సంతోష్‌కుమారాచార్యులు - శుక్లయజుర్వేదఘనపాఠి 74
17 శ్రీమాన్ సుదర్శన మాధవన్ - కృష్ణయజుర్వేదం 75
18 శ్రీమాన్ గోపరాజు కృష్ణమోహనాచార్యులు - మైత్రాయణీశాఖ 76


## ఆగమ పండితులు


1 శ్రీమాన్ పురాణం వెంకటాచార్యులు 78
2 శ్రీమాన్ సముద్రాల శ్రీనివాసాచార్యులు 79
3 శ్రీమాన్ ముడుంబై మధుసూదనాచార్యులు 80
4 శ్రీమాన్ మరింగంటి యుగంధరాచార్యులు 83
5 శ్రీమాన్ అరవిల్లి పవనకుమారాచార్యులు 86
6 శ్రీమాన్ మరింగంటి రాఘవాచార్యులు 88
7 శ్రీమాన్ మరంగంటి సీతారామాచార్యులు 90
8 శ్రీమాన్ గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ్ 93
9 శ్రీమాన్ డా.అద్దంకి శ్రీనివాస్ 95
10 శ్రీమాన్ కె.చంద్రశేఖర భాస్కర భూపతి 96
11 శ్రీమాన్ కె.మాధవన్‌స్వామి 97
12 శ్రీమాన్ న.చ.సంపత్కుమార కృష్ణమాచార్యులు 99
13 శ్రీమాన్ కందాడై గోవిందాచార్యులు 101


## ఆత్మీయ కుటుంబం


1 శ్రీమతి టి.కె.తాయారు - తృతీయ పుత్రిక 110
2 శ్రీమాన్ టి.కె.వి.శేషు (బాబి) - మనుమడు 112
3 శ్రీమాన్ టి.కె.వి.ధన్వంతరి (కన్న) - మనుమడు 114
4 శ్రీమాన్ టి.కె.వి.రామానుజ హేమంతాచార్యులు - మనుమడు 116
5 శ్రీమాన్ తూపురాణి గిరి-దీప దంపతులు - మనుమడు 117
6 శ్రీమాన్ మంగయాచార్యులు(కిషోర్ బాబు) - ద్వితీయపుత్రుడు 118
7 శ్రీమతి గోదాదేవి - చతుర్థపుత్రిక 119
8 చి.దేవిక, చి.వేదవ్యాస్ - మనుమలు 121
9 శ్రీమాన్ తూపురాణి ఉదయవర్లు - పినతండ్రి కుమారులు 122
10 శ్రీమాన్ ముడుంబై నరసింహాచార్యులు - చెల్లెలి కుమారుడు 123
11 శ్రీమాన్ న.చ.కృష్ణమోహనాచార్యులు - తమ్ముడు 123
12 శ్రీమతి తూపురాణి లక్ష్మీతాయారు - పెద్ద మరదలు 124
13 శ్రీమాన్ అ॥చి॥ తిరువేంగళాచార్యులు- పెద్దబావగారి కుమారుడు 126
14 శ్రీమాన్ న.చ.శ్రీమన్నారాయణాచార్యులు - ఆడపడుచుగారి తనయుడు 128
15 శ్రీమతి ముడుంబై శారదాదేవి - ఆడపడచుగారి చతుర్థపుత్రిక 128
16 శ్రీమతి ముడుంబై చూడామణి - ఆడపడచుగారి ప్రథమపుత్రిక 129


భగవత్కృపను మనపై ప్రసరింపచేసేవారే ఆచార్యులు




17 శ్రీమతి బదరీలక్ష్మీ - ఆడపడుచుగారి తృతీయపుత్రిక 130
18 శ్రీమతి రమాదేవి - సోదరి కుమార్తె 131
19 శ్రీమాన్ టి. కృష్ణమాచార్యులు - సోదరుడు 132
20 శ్రీమతి టి.కె. చూడామణి - పినతండ్రి కుమార్తె 134
21 శ్రీమతి కె.వి. జానకి - ఆత్మీయానుబంధం 139
22 శ్రీమతి డా.చక్రవర్తుల లక్ష్మీ నరసమ్మ - ఆత్మీయానుబంధం 141


## ఆశ్రమకుటుంబం


1 శ్రీమాన్ డా॥ జూపల్లి రామేశ్వరరావు - మైహోమ్ గ్రూప్స్ చైర్మన్ 143
2 శ్రీమతి జూపల్లి శ్రీకుమారి 145
3 శ్రీమతి వనజా భాస్కర్ రావు - సహస్రాబ్ది వైస్ ప్రెసిడెంట్ 146
4 శ్రీమాన్ సూర్యనారాయణ - జీవా, వికాస్ ట్రెజరర్ 148
5 శ్రీమాన్ ఎర్నేని రామారావు - సహస్రాబ్ది మెంబర్, పూర్వ కేంద్ర వి.టి.అధ్యక్షులు 149
6 శ్రీమాన్ కుందూరు మహేందర్ రెడ్డి - పూర్వ కేంద్ర వి.టి.అధ్యక్షులు 150
7 శ్రీమాన్ ప్రొ.పురుషోత్తమరావు - జీవా జనరల్ సెక్రటరీ 151
8 శ్రీమాన్ టి. రమేష్ గుప్తా - కేంద్ర వి.టి.అధ్యక్షులు 153
9 శ్రీమతి ప్రొఫెసర్ పాకనాటి జ్యోతి - వరంగల్ వి.టి.అధ్యక్షురాలు 154
10 శ్రీమాన్ డా॥ యం. ఆనంద్ - జెట్ హైదరాబాదు ప్రెసిడెంట్ 156
11 Smt. Ninananda - ప్రజ్ఞా కరిక్యులమ్ 157
12 శ్రీమతి విజయ లక్ష్మి - ఆక్యుప్రెషర్ 159
13 శ్రీమాన్ డా.కోటి నాగార్జున - జిమ్స్ ఆయుర్వేదాలయం 161
14 శ్రీమాన్ సిద్ధాంతం శ్రీనివాస్ - ఆర్టిస్ట్ 161
15 మహాభారత్ అభియాన్ 162
16 శ్రీమతి అరుణారాఘవరెడ్డిగారు - దివ్యసాకేతం 163
17 శ్రీమతి శిరీషగారు - దివ్యసాకేతం 164


## మాతృమూర్తులు


1. శ్రీమతి దిట్టకవి విజయలక్ష్మి - గోపీ స్వామి తల్లిగారు 167
2. శ్రీమతి ముడుంబై సీతాపిరాట్టి - చిన్నమధుస్వామి తల్లిగారు 167
3. శ్రీమతి రుక్మాబాయి - ఉషశ్రీ తల్లిగారు 168
4. శ్రీమతి సముద్రాల సూర్యకుమారి - శ్రీమాన్ రంగరామానుజస్వామి వారి శ్రీమతి 169
5. శ్రీమతి పద్మ - అమ్మగారి ఆప్తస్నేహితురాలు 170
6 శ్రీమతి కె.వి.యస్. సుబ్బలక్ష్మి - ప్రపన్న వైశారది తల్లిగారు 170
7 శ్రీమతి ముడుంబై రామానుజమ్మ - అమ్మగారి ఆప్తస్నేహితురాలు 171
8 శ్రీమతి వంగీపురం వేంకట రాజ్యలక్ష్మి - దివ్యసాకేత విష్ణుపురాణం స్వామివారి శ్రీమతి 172
9 శ్రీమతి ఆర్.కరుణ 174
10 శ్రీమతి బూరుగడ్డ మంజుల - శ్రీశ్రీశ్రీ అహోబిల జీయర్‌స్వామివారి సోదరి 175
11 శ్రీమతి ముడుంబై సత్యభామ - రాజమహేంద్రి చిరంజీవిగారి శ్రీమతి 176


తనకున్న సంపదను పంచేవాడికి పరమాత్మ అనేక ప్రతిఫలాల్ని అందిస్తాడు



## ప్రముఖులు


| | | |
|---|---|---|
| 1 | శ్రీమాన్ డా॥రాజారాంగారు - జెట్ సెంట్రల్ కమిటీ మెంబర్, రాజమహేంద్రి | 177 |
| 2 | శ్రీమతి మైథిలీ ప్రసాద్ చౌదరిగారు - రాజమహేంద్రి | 178 |
| 3 | శ్రీమాన్ కరి పాపారాయుడుగారు - అర్తమూరు | 180 |
| 4 | శ్రీమాన్ డి. కోటేశ్వరరావు - రిటైర్డ్ ఎస్.పి, పెరుమాళ్ళను తిరిగి తెచ్చినవారు | 181 |
| 5 | శ్రీమాన్ డా. జగన్నాథరెడ్డిగారు - కరీంనగర్ | 182 |
| 6 | శ్రీమాన్ పద్మభూషణ్ డా. కె.ఐ. వరప్రసాద్ - శాంతా బయోటెక్స్ | 183 |
| 7 | శ్రీమాన్ డా॥ కర్రి రామారెడ్డి - రాజమహేంద్రి | 184 |
| 8 | కుమారి హరిచందన | 184 |
| 9 | శ్రీమాన్ విజయభాస్కర్‌గారు - ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, వనపర్తి | 185 |
| 10 | శ్రీమతి Dr. పసుమర్తి రామలక్ష్మి - ఎస్.వి.భక్తి చానల్ | 186 |
| 11 | Dr. Chilakapati Vijayaraghavacharyulu | 187 |
| 12 | శ్రీశ్రీశ్రీ వెంకయ్య స్వామి - గాలిపాలెం | 188 |
| 13 | శ్రీమాన్ అజిత్ | 188 |
| 14 | Dr. Devaki | 189 |
| 15 | శ్రీమాన్ జొన్నవిత్తుల రామలింగేశ్వర శాస్త్రి - కవి, సినీవాగ్గేయకారులు | 190 |


## JET WORLD FAMILY


| | | |
|---|---|---|
| 1 | Smt. Aparna Kamatam - JET USA President | 192 |
| 2 | Smt. Chithra Madhavan - Founder Member of JET USA, Chicago | 194 |
| 3 | Smn. Srinivas Pallavi Shakelly, Siddhanth, Purvi, Volunteers - New Jersey, USA | 195 |
| 4 | Smt. Jamuna - JET New Jersey Secretary | 196 |
| 5 | Sri Krishna Naidu - New Jersey | 196 |
| 6 | Smn. Vuduta Srinivas - New Jersey | 196 |
| 7 | Smt. Neelima Kasuganti - New Jersey | 197 |
| 8 | Smn. P. Viswambhar - JET Chennai | 198 |
| 9 | Smn. Hari Voruganti - Jeeyar Channel Hyderabad | 198 |
| 10 | Smt. Solange - HH Disciple Brazil | 198 |
| 11 | Smn. Prasanth Nallan Chakravartula - JET AUS President | 199 |
| 12 | Smn. Vishnu & Aruna - JET USA Ex President | 199 |
| 13 | Smt. Radhard Kalvapudi - Prajna Central committtee member | 200 |
| 14 | Smt. Renu Srinivasachary Tamirisa - ALT Houston | 202 |


అహం అంటే ఆత్మ. అదికాని శరీరాన్ని అహమనుకొని భ్రమపడడమే అహంకారం.



## వి.టి. సేవ


| | | |
|---|---|---|
| 1 | శ్రీమాన్ కృష్ణకాంత్ – వి.టి.సేవా, డాలస్ | 203 |
| 2 | శ్రీమతి మాధవీరవీంద్ర – వి.టి. సేవా మహిళా ఆరోగ్య వికాస్ | 204 |
| 3 | Smn. Kiran Vangala - VT Seva, Seattle | 205 |
| 4 | శ్రీమతి పవిత్ర దాట్ల – వాషింగ్‌టన్ డి.సి. | 206 |
| 5 | శ్రీమతి శ్వేత ప్రవీణ్ – వి.టి.సేవా హ్యూస్టన్ | 207 |
| 6 | కుమారి అభిజ్ఞ – జీవా | 208 |
| 7 | శ్రీమతి మీనాక్షీ సుందరం – మాజీ హైదరాబాద్ జెట్ ప్రెసిడెంట్ | 210 |


## నేత్ర కళాశాల


| | | |
|---|---|---|
| 1 | శ్రీమాన్ కొమాండూరి యాదగిరి స్వామి – జీవా | 210 |
| 2 | శ్రీమతి శ్రీమతి బేబి – వారిజ | 211 |
| 3 | శ్రీమతి కృష్ణకుమారి – జీవా | 212 |
| 4 | శ్రీమతి అమృతవల్లి – జీవా | 213 |


## జీవా బృందం


| | | |
|---|---|---|
| 1 | శ్రీమాన్ వీరబాబు – గోశాల | 215 |
| 2 | శ్రీమతి భరతలక్ష్మి – కార్యాలయం | 217 |
| 3 | శ్రీమతి లక్ష్మి – తదీయారాధన | 217 |
| 4 | శ్రీమతి నాగలక్ష్మి – గోశాల | 218 |
| 5 | శ్రీమతి గోదా అశోక్ | 218 |
| 6 | శ్రీమతి మంగ, శ్రీలక్ష్మి, సుమాలా – దివ్యసాకేతం | 219 |
| 7 | శ్రీమాన్ గోపాలకృష్ణ రూపా దంపతులు – శ్రీస్వామివారి రామదూత సారథి | 220 |


## భక్త బృందం


| | | |
|---|---|---|
| 1 | శ్రీమతి పద్మావతి రామానుజం | 222 |
| 2 | శ్రీమతి జయలక్ష్మి | 223 |
| 3 | శ్రీమతి అనురాధామూర్తి (నవ్వుల అనూరాధ) | 224 |
| 4 | శ్రీమతి బృంద | 225 |
| 5 | శ్రీమతి పెరుందేవి | 226 |
| 6 | శ్రీమతి సుభాషిణీ | 226 |
| 7 | శ్రీమతి కొండమ్మ | 227 |
| 8 | శ్రీమతి శ్రీలక్ష్మి ఎం | 229 |
| 9 | శ్రీమతి కృష్ణజ్యోతి | 229 |
| 10 | శ్రీమాన్ చక్రవర్తుల రామానుజాచార్యులు | 220 |
| 11 | శ్రీమాన్ ద్వారకా రమణ | 231 |
| 12 | శ్రీమతి హరిప్రియ | 232 |
| 13 | శ్రీమతి శోభ | 232 |


మనసులో తలచినదే పలకడం, పలికినదే ఆచరించడం సాధన!




| | | |
|---|---|---|
| 15 | శ్రీమతి పూసపాటి విశాలాక్షి | 233 |
| 16 | శ్రీమతి లక్ష్మి తదీయారాధన | 233 |
| 17 | శ్రీమతి డి. పద్మలత | 234 |
| 18 | శ్రీమతి ఈ.వి. విజయలక్ష్మి | 235 |
| 19 | శ్రీమాన్ వేమారెడ్డి శ్యామసుందర రెడ్డి, సుజాత | 235 |
| 20 | శ్రీమాన్ కోవూరు హనుమంతరావు, శ్రీమతి కోవూరు లక్ష్మి | 236 |
| 21 | శ్రీమాన్ ప్రసన్న రాఘవాచార్యులు | 237 |
| 22 | శ్రీమతి శ్రీవిద్య | 237 |
| 23 | శ్రీమాన్ 'ధీ' శ్రీనివాస్ | 238 |
| 24. | శ్రీమతి దామిడి రేణుక | 239 |
| 25 | శ్రీమతి కే. గీతాంజలి | 240 |
| 26 | శ్రీమతి రమ్య | 240 |
| 27 | శ్రీమతి ఉషశ్రీ | 241 |
| 28 | శ్రీమతి అనూరాధ | 242 |
| 29 | శ్రీమతి ఎ. మహాలక్ష్మీ | 243 |
| 30 | శ్రీమతి సువర్ణకుమారి | 244 |


## తత్త్వశాస్త్ర విద్యార్థులు


| | | |
|---|---|---|
| 1 | శ్రీమతి న.చ. విష్ణుప్రియా అయ్యంగార్ | 246 |
| 2 | శ్రీమతి డా. గుదిమెళ్ళ మంజుల | 248 |
| 3 | శ్రీమాన్ పీతాంబరం రఘునాథాచార్యస్వామి | 249 |
| 4 | కుమారి ఉషశ్రీ | 251 |
| 5 | శ్రీమతి అరుణ | 253 |
| 6 | కుమారి కల్పన | 255 |
| 7 | శ్రీమాన్ శాంతారాం | 257 |
| 8 | శ్రీమాన్ న.చ.శ్రీనివాస అయ్యంగార్ | 259 |
| 9 | ప్రపన్నవైశారదీ | 260 |
| 10 | పరమపద విశేషాలు | 265 |
| 11 | శ్రీమాతుశ్చరమపద్యాని | 282 |


జ్ఞానం, వైరాగ్యం, శాంతి కలిగిన సాత్త్వికులతో సహవాసం చేయాలి.




ఆచార్య తనియన్
వేదాంతద్వయ తత్త్వజ్ఞం మంత్ర మంత్రార్థదం గురుం ।
శ్రీమన్నారాయణాచార్య రామానుజ యతిం భజే ॥

ఆచార్యదేవో భవ!



రుషా నిరస్తోపి శిశుస్తనంధయో న జాతు మాతుశ్చరణౌ జిహాసతి





# SRI RAMANUJA SAHASRABDI

Mangalasasanams
H.H Tridandi Chinna Srimannarayana Ramanuja Jeeyar Swamiji

శ్రీరామనగరం, శంషాబాద్.
22.7.2020

శ్రీమతే నారాయణాయ నమః!
అనేక మంగళాశాసనములు!

'మాతృదేవోభవ' అన్నది నీకు కనిపించే దైవము తల్లి, తండ్రి, గురువు, అతిథి కూడా దైవ స్వరూపాలే అంటూ వేద పురుషుడు తైత్తిరీయ ఉపనిషత్తులో ఉపదేశించాడు. తెలుగులో 'అమ్మ' అని గర్వపడతారు. ఇది ఎంత తియ్యనైన పలుకు! పిల్లకి తొలి పలుకు 'అమ్మ' కనిపించే దైవము ఎందుకైందంటావా అమ్మే కదా! కాని, పరమాత్మ కూడా!

ఇది సాక్షాత్తు భగవత్ప్రియము. వేదములకు 'ఓం' కదా. అందులో మూడు అక్షరాలు ఉన్నాయి. అ+ఉ+మ. 'అ' అంటే సృష్టిస్థితిలయాలు చేసే భగవత్తత్త్వం. 'ఉ' అంటే 'విడరాని సంబంధము'. 'మ' అంటే 'జ్ఞానం కల జీవరాశి అంతా' అని అర్థం. సారాంశం ఏమిటంటే జీవరాశి అంతా జగత్కారణమైన నారాయణునితో విడరాని బంధం కలిగి ఉంది, అని. సరే! ఇదంతా వేదాంతానికి సంబంధించినది. అయితే, "అమ్మ" పదం ఆ ఓంకారం నుంచి తెలుగు వారు ఉచ్చారణ చేసుకున్నారు ప్రత్యేకంగా. ఎలా! చూడండి.....

నారాయణుడు జీవులని సృష్టిస్తాడు. అందులో కొందరే స్త్రీమూర్తులవుతారు. అందులో కూడ కొందరే మాతృమూర్తులవుతారు. అయితే వారిలో కూడా కొందరు మాత్రమే కన్న సంతానాన్ని వాత్సల్యంగా పెంచి పెద్ద చేయగలుగుతారు. కని, పెంచి, విద్యాబుద్ధులు నేర్పి, ఒక పరంపరను కొనసాగింపచేయగలగడం అనేది అందరూ చేయలేరు. అది చేసే తల్లి మాత్రమే "అమ్మ" పదానికి అర్హురాలు. మిగిలిన వారు కారు అనేది గమనించాలి. దేవుడు చేసే సృష్టిలో తన బాధ్యతగా, బాధలను, కష్టాలను సహించి స్వీకరించే ఒక జీవవిశేషమైన 'అమ్మ' సాక్షాత్తు భగవంతుని ప్రతిరూపమే. అనేది 'అమ్మ' పదంలో ఉంది. ఓంకారంలోని "ఉ" అక్షరాన్ని కొంచెం ప్రక్కన పెడదాం. ఇక 'అ+మ' ఉంటాయి. దేవుడు + జీవరాశుల సంబంధం కదా! అందులో మనుష్యులను గ్రహించి, మనుష్యులలో స్త్రీలను, స్త్రీలలో మాతృమూర్తిని అతను గ్రహించాలి. అది "మ". తన సృష్టిని తన బాధ్యతగా సాగ

— 2 —

నిర్వహించినందువల్ల, అంటే, ఉపదేశించిన కృత్యాన్ని సక్రమంగా నెరవేర్చినందువల్ల సాక్షాత్తూ దేవుడే తానే 'అ' అయ్యాడన్నమాట.
ఒకసారి ఈ అక్షరాలను కలిపి చూడండి. అ+మ్, మ్+అ = అమ్మ.
నిజానికి పిల్లల్ని కన్నవాళ్ళంతా తల్లులే. పేరా మాతలు. పేరా మదర్స్. పేరా 'మమ్మీ' మరేదో... మరేదో...
కానీ దేవుడిచ్చిన పనిని చక్కగా నెరవేర్చిన తల్లి మాత్రమే "అమ్మ" పదానికి అర్హురాలు. అందుకే అక్షరాలు 'అమ్మ' 'అవ్వ' అంటూ అమ్మ పదంతో ఆరంభించటం తెలుగు వారి సంప్రదాయం. అయినా కూడా, వేర సంప్రదాయాన్ని ఇతర భాషీయులు కలిగితే, సంస్కృతం కంటే కూడా, బాగా ముందే పుట్టుకున్న ఘనత తెలుగుతనానిది. 'అమ్మగారు' దీనికి సాక్షి.

ఈ దేహానికి ఓ అక్షరాన్నిచ్చి, సంస్కారాన్నిచ్చి, పెంచి పోషించిన 'అమ్మ'గారు అంగీకరించినందువల్లనే మేము శ్రీశ్రీశ్రీ పెద్దజీయరు స్వామివారి సేవాభాగ్యాన్ని పొందగలిగాం. వారి పూర్వాశ్రమపు కాలంలో, వారిద్వారానే పంచసంస్కార మంత్రోపదేశాలు పొందిన తర్వాతనే... వారి సూచన మేరకు శిరసావహించి, మాకు యజ్ఞోపవీతమాన్ని స్వీకరించే అదృష్టాన్ని ప్రసాదించారు. అప్పటికి వారి కోరిక ఒక్కటే! తన 'అంత్యేష్టి', అంటే, దేహాంతానంతర క్రియలు చేయాల్సిన అంత్యక్రియలు మా చేతుల ద్వారా జరిగితే చాలును, అని మాత్రమే. అంగీకరించి 'అలాగే' అన్నాం. కానీ మనస్సులో భయం ఉండేది. ఆ రోజు స్వామివారిగారు ఎక్కడుంటామో.. ఏ పనిలో ఉంటామో.. ఏ దేశములో ఉంటామో.. ఏ అవస్థలో ఉంటామో... అనే బెంగ ఉండేది. ఆ భగవాన వాగ్దానం.. ఏ మాత్రం తొణకనివ్వలేదు. ఆ తర్వాత వారే చూసుకున్నారు.....
తరలి వచ్చింది. కదిలితే స్ఫురించేదు. కదిలిస్తే స్ఫురించేదు. దానికి తెనుగుబాటు కదిలే దాక చూసారు. ప్రాణాలు పోతే, మాని ఒకచోట ఉండే సమయం చూసుకున్నారు. చాతుర్మాస్య నడక ద్వారా ఎంతో ముగించి వచ్చేటట్టు చేసుకున్నారు.

— — →

'అ'కారవాచ్యుని అపరావతారమే 'అమ్మ'...



— 3 —

[illegible] భద్రాద్రి (శ్రీరామునికి) ప్రసాదం చేసి సర్వాలంకార కర్తృత్వం వహిస్తూ, [illegible] స్వీకరించి ఆనందించారు.

అయితే.... ఎప్పుడు ఏమి వ్రాసినా, తనని నిత్యం ఏ సూచన చేసినా, ఏ రకంగా ఆశీర్వదించినా "(శ్రీమన్నారాయణుని) [illegible] చెప్పేవారు. ఆచార్య ప్రకారం [illegible]. [illegible] ఆచార్యుల (శ్రీ) [illegible] [illegible] [illegible]" [illegible]. [illegible] [illegible] చేసేవారు. [illegible] చేసేవారు.

[illegible], వారి [illegible] వ సంవత్సరం నుండి [illegible] భద్రాద్రి [illegible] ఆచార్యుల ప్రసాదంతో పాటు [illegible] స్వీకరించారు... '[illegible] చేయాలని, [illegible]' [illegible]. [illegible]... [illegible] '[illegible] ఆచార్యులతో [illegible]' [illegible]. [illegible] శుక్రవారం. రాత్రి సమయం సుమారు గం. 9.30 [illegible]. [illegible] సోమవారం నాడు వారి [illegible]. [illegible] శుక్రవారం. [illegible] "[illegible]". [illegible] రాత్రి గం. 9.30 సమయం. (ప్ర)[illegible] ఆచార్య (శ్రీ) చరణాలను [illegible]. [illegible] [illegible] ప్రసాదించారు.

[illegible] కాలం కదా! [illegible] ప్రమాదము[illegible]. [illegible] (శ్రీ) [illegible] సంకేతంగా [illegible]. (శ్రీ)[illegible] (శ్రీ) చరణాల [illegible], [illegible] [illegible] సంపూర్ణం చేయు [illegible], [illegible] '[illegible]' [illegible] (శ్రీ)[illegible] [illegible].


— — — →

— 4 —

చరమ కార్యాలు నిర్వహించడానికి నాన్నగారి సామంతాచార్యులు ప్రత్యేకముగా [illegible] ప్రేమతో, వివిధ కార్యక్రమాలు [illegible] [illegible] పేరాయన [illegible] ప్రస్తుతీకరణం. [illegible] మంగళాశాసనాలు. [illegible] 12 వ దినం దాక కూడా [illegible] 12 దినాలు [illegible] మంగళం. [illegible] 14, 15 [illegible] 16 వ [illegible] [illegible] 12 దినాల [illegible] 18 వ [illegible] గం. 1.00 కి [illegible] 19 వ [illegible] [illegible] సుమా! [illegible]

[illegible]





[illegible] USA [illegible]

[illegible]

[illegible] 9 - 2020



వాత్సల్యనిర్భరతయా జననీ కుమారం స్తన్యేన వర్ధయతి దష్టపయోధరాపి





అమ్మగారి ఆరాధ్యదైవము, ఆచార్యులైన శ్రీపెద్దజీయర్‌స్వామివారి శ్రీపాదాలు



# శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామివారికి అమ్మగారి వినతి

[illegible]

ఆచార్య ముఖవికాసమే నీ జన్మ సార్థకత మిగిలినవేవీ అడ్డుకోలేవు



[illegible]

**బిడ్డల భవిష్యత్తుపట్ల దివ్యదృష్టికలది అమ్మ! అమ్మదీవెన దివ్యమైనది!**



-౩-

స్వామీ! ఒక్క మనవి.

నా బాబుని [redacted] ఏడాదికి ఒకసారి
నా దగ్గరకు పంపుతారు కద. 10,15 రోజులు ఉండి వెళ్తా
డు. తల్లిగారింట ఒక్కడే కాబట్టి చూస్తారు. రెండు
సార్లు వచ్చారు తనతో మనవి చేసుకుంటాను. రాముని బ్రాహ్మ
గారి వద్దుండి వేదశాస్త్రాలు ప్రైవేటుగా విద్య పొందాలని ఉంది.
అనవసర విషయాల్లో ఆకర్షితుడు కాకుండా మనసు పెట్టే
సందర్భం అనుగ్రహించ ప్రార్థన.

ఇంకేముంది ఇటువంటి విషయాలు ఉన్నాయని
తనకు ఉత్తరం రాయటం ఉండగా ఇప్పుడే శ్రీ
మఠం వారు ఒక నిర్ణయం చేశారు.
ఆలోకనంగా చేశారు. తమరి ఆజ్ఞ
దయా కృపా విశేషాలు లభించటం

-౪-

ప్రార్థన చేసుకుని ఇప్పటికే వచ్చారు. దీని వల్ల
సంక్రాంతి చేసిన పిల్లలు ఇద్దరం రాజమండ్రిలో
ఒక ఇంటి పాలు ఇవ్వని కాని తరలి
నే తల్లి [redacted] దగ్గరికి వచ్చి చేరుతాడు.
వారి అర్థం చేసుకుంటారనా.

తప్పు ఉంటే క్షమించ ప్రార్థన.

తమ పాదదాసురాలు
అశోకు



भारत के उपराष्ट्रपति

VICE-PRESIDENT OF INDIA

## సంతాప సందేశం

శ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి వారి మాతృమూర్తి శ్రీమతి అలివేలు మంగతాయారు గారు పరమపదించారని తెలిసి ఎంతో విచారించాను.

శ్రీ జీయర్ స్వామి వారి ధార్మిక, సామాజిక దృక్కోణాన్ని బాల్యం నుంచే ప్రభావితం చేయడంలో ఆమె పాత్ర ఎనలేనిది. ఓ సంప్రదాయ మధ్యతరగతి గృహిణిగా పిల్లల జీవితాలను ఆమె తీర్చిదిద్దిన తీరు ఆదర్శనీయం. 23 సంవత్సరాల వయసు కుమారుడు సన్యాసిగా మారుతానని కోరితే, సమాజ శ్రేయస్సు కోసం అంగీకరించిన త్యాగనిరతి వారిది.

చిన్నతనం నుంచే భారతీయ సనాతన విలువలు, సంప్రదాయాలు, దయా గుణం, సామాజిక చింతన వంటివి పిల్లల మనసుల్లో నాటడం ద్వారా వారి వ్యక్తిత్వాన్ని ఎలా తీర్చిదిద్దవచ్చో శ్రీమతి మంగతాయారు గారు శ్రీ జీయర్ స్వామిని పెంచిన తీరు నుంచి గ్రహించవచ్చు.

శ్రీమతి మంగతాయారు గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

న్యూఢిల్లీ,

13 సెప్టెంబరు 2020

(ముప్పవరపు వెంకయ్య నాయుడు)



**వ్యక్తిత్వపు విలువలని ధర్మాన్ని, సంప్రదాయాన్ని ఉగ్గుపాలతో రంగరించి పోసేది అమ్మే!**



ఓం అస్మత్ గురుభ్యో నమః

# భూమిక

**భగవద్బంధువులారా!**

**జై శ్రీమన్నారాయణ!**

శార్వరి పేరుకు తగినట్లుగానే ఈ ఏడాది అన్ని విధాల అన్ని రంగాలలో అందరి జీవితాల్లోనూ చీకటిని నింపుతోంది. జగదాచార్యులు మనందరికీ ఆరాధ్య ఆచార్యులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి మాతృమూర్తి శ్రీమతి అలిమేలు మంగ తాయారమ్మ గారిని కోల్పోయి మనమంతా కూడా చిక్కటి చీకటిలో మునిగి ఉన్నాం.

శ్రీస్వామివారు, నడిగడ్డపాలెంలో పరమాచార్య సన్నిధిలో చాతుర్మాస్యదీక్షకై, జూలై 3న బయలుదేరారు. అప్పటికే మన అమ్మగారు నీరసంగా ఉండటంతో రెండు నెలలుగా వారి కుమార్తె ఇంటిలో ఉంటున్నారు. ఆ రోజు శ్రీస్వామివారిని సేవించాలని జీవా ఆశ్రమానికి వేంచేశారు. తిరిగి బయలుదేరేటప్పుడు మళ్ళీ ఎప్పటికి సేవిస్తానో అన్న ఆవేదన వ్యక్తం చేశారు. జరగనున్న సంగతి ముందుగానే తెలిసిందో ఏమో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పట్టుకుని వదిలి వెళ్ళలేక ఆవేదనను వ్యక్తపరుస్తూ త్వరగా శ్రీ స్వామివారిని మరల సేవించుకునేలా భగవంతుణ్ణి ప్రార్థించండి అన్నారు. ఆ తల్లి మనసుకి ధైర్యం చెప్పాలని తెలిసీ తెలియనితనంతో ఏవో రెండు మాటలు చెప్పాం అందరం. ఒక్క రెండు నెలల కాలమేనమ్మా ...తిరిగి వేంచేస్తారు.

శ్రీపెద్దస్వామివారి సన్నిధిలో సేదతీరడానికి, మరింత శక్తి పొందడానికి, శ్రీ స్వామివారు చాతుర్మాస్యదీక్ష ఈ సంవత్సరం ఆచార్యుల సన్నిధిలో జరుపుతున్నారు. కాగానే ఇక్కడికే వేంచేస్తారు మీరు తప్పక దర్శిస్తారు అంటూ మాట్లాడాము. శబరిలా, దృఢ సంకల్పంతో శ్రీస్వామివారు తిరిగి వచ్చేదాకా రెండు నెలల కాలం అమ్మగారు శరీరాన్ని నిలుపుకునే ప్రయత్నం చేశారేమో అనిపిస్తోంది జరిగింది చూస్తే.... ఎందుకంటే, శ్రీ స్వామివారు దీక్షపూర్తిచేసుకొని వచ్చేవరకు ఎదురు చూస్తూ ఎన్ని బాధలు ఉన్నా స్వామి రాకకై తట్టుకొని ఉన్నారు. వారిని దర్శించిన సరిగ్గా వారం రోజులకే, ఈ నెల 11న అమ్మగారు పరమపదసోపానం అధిరోహించారు. శ్రీస్వామివారు కూడా అమ్మగారి ప్రయాణ సన్నాహాలను గుర్తించారేమో ఈ సారి దీక్ష 2 నెలల్లోనే పూర్తిచేసి ఆ తల్లిని అనుగ్రహించారు.

శ్రీ స్వామివారి దీక్ష ఒక రెండు రోజుల్లో ముగుస్తుంది అనగా మన జీవా ఆత్మ బంధువులు కొందరు వారిని సేవించవచ్చి, అమ్మగారి పరిస్థితిని వివరిస్తూ హాస్పిటల్‌లో చేర్చవలసి వస్తుందేమో అన్నారు. దానికి సమాధానంగా శ్రీస్వామివారు, అమ్మ మనసును తాము బాగా గ్రహించినట్లుగ, ఆమెకున్న కొద్దిసేపు ఇంట్లోనే ప్రశాంతంగా గడప

**అమ్మ ప్రాణాలొడ్డి జన్మనిస్తుంది! ఆ బిడ్డకై ప్రాణాలడ్డి ఎదురుచూస్తుంది!**



నీయండి హాస్పిటల్.... అంటూ ఆమెకి చికాకు కలిగించకండి అని సూచన చేశారు. అప్పటికే శ్రీస్వామివారి హృదయం, **బద్ధః పరికరః.... మోక్షాయ గమనం ప్రతి...** అన్నట్లుగ అమ్మగారు చేస్తున్న తపస్సును గ్రహించగలిగింది. దీక్ష కాగానే భద్రాద్రిరాముని సేవించి వెంటనే ఆ స్వామి తీర్థ ప్రసాదాలను తీసుకుని నేరుగా మాతృమూర్తి సన్నిధికి వేంచేశారు. ఎన్నడూ ఊహించని వారి ఆగమనానికి తన దైవమైన శ్రీరాముని అనుగ్రహానికి ఆ తల్లి హృదయం ఆనందంతో నిండిపోయింది. శ్రీస్వామివారి దర్శనాపేక్ష తప్ప ఆమెకి ఇతర కోరికలేమీ లేవని శ్రీస్వామివారు మాటల సందర్భంలో ప్రశ్నించి పరీక్షించి మరీ రూఢిచేసుకున్నారు. ఆతల్లికూడా శబరిలానే త్రిదండరాముని దర్శనం కాగానే ముక్తిమార్గాన్ని అనుగ్రహించవలసినదిగ వేడుకున్నారు. పెరుమాళ్ళ సంకల్పం కూడా అదేనేమో.... నిష్కల్మష హృదయంతో నిష్కామంగా నిరంతర మంగళాశాసన ప్రదాయినిని తనసన్నిధికి పిలిపించుకున్నాడు.

సన్న్యాస దీక్షా సమయంలో అమ్మకిచ్చిన మాట నిలబెట్టుకోవడానికి, శ్రీస్వామివారే స్వయంగా దగ్గరుండి అంత్యేష్టి కార్యక్రమాలను నిర్వహించారు. అది చూసిన ఎందరికో మాతృభక్తి అంటే ఎట్లుండాలో జ్ఞాపకం వచ్చినట్లయింది. మరెందరికో ఆదిశంకరులు గుర్తుకు వచ్చారు. కానీ, మరి కొంతమందికి..సన్న్యాసి ఏమిటి ఇలాంటి కార్యం చేయడం ఏమిటని సంశయం తలెత్తింది. మూడు పదులు కూడా దాటని వయసులో భర్తృవియోగంతో, గత **55 సంవత్సరాలుగా తన జీవితాన్ని సత్ శబ్దవాచ్యుడైన పరమాత్మయందు న్యాసం చేసి, ఆచార్యనిష్ఠతో గడిపిన సన్న్యాసిని ఆ తల్లి. ఆమెకిది తగును** అని అన్పించకమానదు అమ్మగారిని తెలిసినవారికెవరికైనా.

యుక్తవయస్సులో 5గురు సంతానంతో గడపదాటి బాహ్యప్రపంచలోకి అడుగు పెట్టిన ఆతల్లి... ఎన్ని త్యాగాలు చేసిందో, పక్షిలా తన రెక్కలమాటున బిడ్డలను కాపాడుకునేందుకు ఇంటా బయటా ఎన్ని ఒంటరిపోరాటాలు చేసిందో... పరమాత్మకెరుక.... అలాంటి స్థితిలో కూడా కాస్త ఎదిగి ఆసరాగా ఉంటాడనుకున్నబిడ్డను ఆచార్యులే ఆజ్ఞాపిస్తే ఆనందంగ సమర్పించివేసింది...జగత్కుటుంబాన్నే తీర్చిదిద్దేవానిగ ఎదగాలని దీవించింది. పరమాత్మ యందు భక్తి, ఆచార్యులపట్ల నిష్ఠావిశ్వాసాలే రక్షా కవచంగ తిరిగి తన ఒంటరి పోరాటాన్ని కొనసాగించింది.....అంతటి త్యాగమూర్తి కోరుకున్నదొక్కటే తన ప్రథమ పుత్రుని ద్వారా ముక్తిపొందాలని....

**ఆతల్లిది ఎంతటి దివ్యదృష్టో! ఎంతటి విశ్వాసమో! తన ఆచార్యుల సన్నిధిలో తనబిడ్డడు మంత్రప్రదాతగ, ముక్తిప్రదాతగ ఎదగగలడని!. అందుకే ఆనాడే కోరింది! తన తనయుని చేతులారా తన అంత్యేష్టి నెరవేరాలని!** ఆశ్చర్యము! అద్భుతము!! కదా. అదే పరమాత్ముని అభిమతమని జరిగిన సన్నివేశపరంపర సుస్పష్టం చేస్తుంటే సంశయాలెందుకు.



ఆ త్యాగమూర్తికి, జగద్గురువునందించిన జగన్మాతకి జోతలిడక...ఆమె జీవితం మనకొక పాఠశాల....నేర్చుకుందాం. తరిద్దాం...అదెలానో తరచి చూసి అందించాలనే తలంపుతో ప్రారంభమైనదే ఈ మాతృసవనము.

పెరుమాళ్ అనుగ్రహంతో అమ్మగారితో ఆత్మీయుల అనుభవాలని ఒక చోట కూర్చి ముద్రణగా తేవాలనే ప్రేరణని దాసురాలిలో కలిగించి కైంకర్యము అనుగ్రహించి నెరవేర్చుకుంటున్న జగదాచార్యులు, అస్మదాచార్యులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారికి హృదయపూర్వక, కృతజ్ఞతాపూర్వక, వినయపూర్వక దాసోహము. శ్రీస్వామివారి సంకల్పం కార్యరూపం దాల్చేలా ప్రోత్సహించిన శ్రీమాన్ నేపాల్ కృష్ణమాచార్య స్వామివారికి, డా.సముద్రాల వేంకటరంగరామానుజాచార్య స్వామివారికి, శ్రీశ్రీశ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామివారికి, శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్‌స్వామివారికి కృతజ్ఞతా పూర్వక ప్రణామం. పూర్వాశ్రమం నుండి అమ్మగారిని సేవించిన అనుబంధంతో ఆదరంతో గౌరవంతో మంగళాశాసనాలందించిన శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్‌స్వామివారికి, శ్రీశ్రీశ్రీ అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామివారికి ధన్యవాదపూర్వక ప్రణామం. ముఖ్యంగా శ్రీశ్రీశ్రీ పెద్దస్వామివారి కాలం నుండి ఆధ్యాత్మికానుబంధంతో అనువర్తించే ఉభయవేదాంత ప్రవర్తాకాచార్యులందరూ ప్రేమతో సత్వరమే సందేశాలను అనుగ్రహించారు ధన్యవాద పూర్వక ప్రణామములు. మన ఆచార్యుల వేదవిశ్వవిద్యాలయంలో వైదిక విద్యతో పాటు అమ్మగారి వాత్సల్యాన్ని కూడా పొందిన వేద, ఆగమ పండితులందరూ  సత్వరమే తమ అనుభవాలని అందించినందుకు ధన్యవాదాలు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మీడియా ద్వారానో తెలిపిన వెంటనే స్పందించిన మీ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

కేవలం రెండు రోజుల వ్యవధిలో స్పందించి, అమ్మగారితో తమ అనుబంధాన్ని, ఆమె నుండి నేర్చిన పాఠాలను అందరికీ పంచే ప్రయత్నంలో, మీరంతా అందించిన స్పందనలను,  అక్షరబద్ధం కావించడంలో రేయింబవళ్ళు సహకరించిన నా తోటి తత్త్వశాస్త్ర విద్యార్థినులు, కుమారి ఉషశ్రీ, కుమారి కల్పన,  శ్రీమతి అరుణ, శ్రీమతి శాంతి, ఆగమపండితులు యుగంధరాచార్య (డాలస్, యు.ఎస్.ఏ)వారికి, శ్రీమాన్ సీతారామాచార్య(రాజమహేంద్రి), ప్రూఫ్ సరిచూసిన ప్రొఫెసర్.పి.జ్యోతి(వరంగల్ వికాసతరంగిణి అధ్యక్షురాలు) గారికి, గ్రంథం డిజైన్ లో సహకరించిన శ్రీమతి రాధగారికి, గ్రంథాలు సకాలంలో అందేట్లుగ సహకరించిన శ్రీమాన్ ఎర్నేని రామారావుగారికి, కుమారి నీళ (తత్త్వశాస్త్రం)కి నా హృదయపూర్వక ధన్యవాదాలు. గ్రంథాన్ని ముద్రణకు అనుకూలంగ డి.టి.పి. సహకారం అందించిన మై హోమ్  ఉద్యోగులు శ్రీమాన్ శ్రీనివాస్, శ్రీమాన్ దయాసాగర్ గారికి కృతజ్ఞతలు. ముద్రణకు అనుకూలంగ నవ్యంగా తీర్చిదిద్ది అందించిన శ్రీమాన్ కృష్ణమోహనాచార్యులు (మైత్రాయణీ) సీతానగరం గురువుగారికి ధన్యవాదాలు.

**విశ్వాసంతో అడుగేస్తే ఆచార్య ఆజ్ఞా పాలనలో సర్వశక్తులూ సహకరిస్తాయి.**



అమ్మగారి పరమపదోత్సవం నాటికి అందించాలని... తపనతో....యథా సమయం, యథావకాశం మా తొలి ప్రయత్నంగ కేవలం ఫోటో ప్రింట్స్‌ని మాత్రమే అందించాము. ఊహించిన దానికంటే బహుళంగ మీరందించిన స్పందనలని యథాతథంగ ప్రచురించే ఈ చిరు ప్రయత్నంలో మరికొంత మంది భాగవతోత్తముల అనుభవాలని చేరుస్తున్నాం. న భూతో న భవిష్యతి అన్నట్లుగ, పరమహంసలైన ఏడుగురు జీయర్ స్వాములు వేంచేసి, పరమపదమే పుడమిపై విరిసిందా అన్నట్లుగ జరిపిన అమ్మగారి పరమపదోత్సవ విశేషాలను కూడా ఇందులో పొందుపరిచి అందిస్తున్నాము. ఆర్తితో ఆతృతతో చేసిన ఈ చిరుకైంకర్యంలో దోషాలు దొర్లి ఉంటే క్షమించగలరని భావిస్తూ.....
భగవత్సాన్నిధ్యాన్ని చేరిన అమ్మగారి పురుషకారంతో మన ఆచార్యుల అపూర్వ సత్సంకల్పాలన్నీ నిరాటంకంగ నెరవేరాలని, భగవద్రామానుజ సమతామూర్తి స్ఫూర్తికేంద్ర నిర్మాణమూ, ఆవిష్కరణాపరిపూర్ణమై, సమతాసందేశం భూమండలమంతా వ్యాపించి సౌహార్దపూర్వక వాతావరణం నెలకొల్పే వైదిక, సేవా కార్యక్రమాలు మరిన్ని మన ఆచార్యుల ద్వారా వైభవోపేతంగ జరగాలని ప్రార్థిస్తూ ......

జైశ్రీమన్నారాయణ

ప్రపన్న వైశారదీ (శారదారామానుజదాసి)
**తత్త్వశాస్త్ర విద్యార్థిని**



**ఆచార్యుల పదసన్నిధే శిష్యుల పాలిట పెన్నిధి!**





సంతత చిరునగవుల కాంతులీను శిశువు నగుమోము తప్ప తల్లి ఆశించేదేముంది!



# శ్రీశ్రీశ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామి

**శ్రీమదుభయ వేదాంతాచార్య పీఠము,**
**జీవా, శ్రీరామనగరము**

ప్రకృతి చాలా గొప్పది. తనలో దాగి ఉన్న అందాలను అందరికి చూపుతుంది. మనిషి సౌందర్య పిపాసి. ఎక్కడ అందమైన వస్తువు ఉన్నా అలా నిలిచిపోతాడు. దాన్నే ఆస్వాదిస్తాడు. ఇంతవరకు ఫరవాలేదు. అన్నీ నాకే కావాలనుకోవడమే ఆసురీ ప్రవృత్తి. ఇక్కడ ఓ విషయం మనం గమనించాలి.

వస్తువులను ప్రేమిస్తాము. కానీ, దాని వెనక ఉండే భావాన్ని బట్టి దాని పవిత్రతను గుర్తిస్తాము. నేను దీనిని ప్రేమించాను. ఇది నాకే సొంతం. అలాకాకపోతే ఆ వస్తువు లేదా వ్యక్తి ఇక ఎవరికీ దక్కకూడదు అనే స్థితి పరమ దారుణము. దీనిని ప్రేమ అని అనరు. నేనేమైనా ఫరవాలేదు, నే ప్రేమించే వ్యక్తి ఎప్పటికీ సుఖంగా ఉండాలి అని ఎప్పుడూ ఇవ్వడమే తప్ప ఆశించడం ఉండదు నిజమైన ప్రేమకు. అలాంటి ప్రేమ ఒక్క తల్లికే సాధ్యమేమో!

లోకంలో ఎందరో ఎన్నిటినో ప్రేమిస్తారు. వాటన్నిటిలో **తల్లిప్రేమ ఒక్కటే ఏరకమైన మాలిన్యం లేనిది.** తనకు లేకపోయినా పిల్లవాడి కడుపునింపే మాతృప్రేమకు తుల్యమైనది ఈ సృష్టిలోనే ఉండదు. ప్రతి స్త్రీ మాతృత్వాన్ని పొందుతుంది. తన పిల్లవాడు గొప్ప ధనవంతుడు కావాలి సుఖించాలని ప్రతి తల్లి సహజంగా కోరుతుంది. కానీ వీరమాత, దీనికంటే భిన్నంగా కోరుతుందట.

తన పిల్లవాడు దేశభక్తుడు, దైవభక్తుడు కావాలి. తాను కష్టపడినా తనవలన లోకమంతా సుఖించేలా ఆ శిశువు తయారుకావాలని చక్కని ప్రేరణనిచ్చే తల్లులు బహుకొద్దిమందే. వారిలో ఈ 20వ శతాబ్దపు కాలంలో **వీరమాతగా తన పుత్రుని లోకం కోసం త్యాగం చేసిన మహా తపస్వి** శ్రీమతి చిలకమఱ్ఱి అలివేలు మంగతాయారు(అమ్మగారు).

తమ పుత్రుడు ఎప్పుడూ లోకహితైషిగా మంగళకార్యాలు చేయాలని ఆశిస్తూ ప్రతి రోజూ మంగళాశాసనం చేసేవారు. గత కొద్ది సంవత్సరాలుగా అనారోగ్యంతో ఉన్నా ఏ రోజు పెరుమాళ్ళ సేవను మానలేదు. తామే స్వయంపాకం చేసుకునేవారు. చక్కని ఆచారధారతో, చెరగని చిరునగవుతో అందరిని మంచివైపు ప్రేరేపించిన అమ్మ పెరుమాళ్ళను చేరి, తన మాతృప్రేమను ఆశ్రితులందరికీ పంచి వారిద్వారా జగదాచార్యులు, చినరామానుజునికి పల్లాండు అంటూ మంగళాశాసనము చేస్తూనే ఉంటారు.

ఈ ఏడాది చాతుర్మాస్యం పూర్తయ్యాక శ్రీస్వామివారితో కలిసి సేవించినప్పుడు చాల ఆశ్చర్యం అనిపించింది. మాట్లాడే ఓపిక లేదు. కూర్చోలేకపోతున్నారు. విశ్రాన్తి తీసుకోమన్నారు శ్రీ స్వామివారు. కళ్ళుమూసి అన్నీ వింటూనే

ఆచార్యదర్శనం సాక్షాత్తు పరమపద దర్శనం.



ఉన్నారు. కాసేపు అయ్యాక శ్రీవారు బయలుదేరుతామన్నారు. చిన్నగా తమ కుమార్తె తాయారుకు సంజ్ఞతో కొబ్బరికాయ తెమ్మని చెప్పి, ఆ స్థితిలో **విశిష్టాద్వైత..** అంటూ మంగళాశాసనం చేశారు. ఇక నా గురించి పెరుమాళ్ళకు చెప్పండి అని నమస్కరించారు.

**ప్రకృతిమాయలో కౌసల్య, యశోదాదులు సైతం సాక్షాత్తు స్వామిని మానవునిగా దర్శించారు. కానీ, అమ్మగారు శ్రీస్వామివారిని ఆ శ్రీమన్నారాయణుడే అనే భావన కలిగి ఉండేవారేమో బహుశా! అదే నామధేయంతో చూచే వారికి ఆరూప సాక్షాత్కారం కల్గుతూ ఉంటుంది.**

తల్లి చేసే భావనను బట్టి పిల్లలు ఎదుగుతారు. ఒక్కతల్లి పరిపూర్ణ ఆశీస్సులు ఉంటే ఆశిశువుకు ఆటంకాలే ఉండవు. అందరికంటే గొప్పవాడు కాగలడు. ఇది సత్యము. అంతటి ప్రేమ మూర్తికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలము. తల్లిప్రేమకు తుల్యమైనది ఏమీ లేదు.

**ప్రాపంచిక సుఖాలే గొప్పవని పిల్లలకు నేర్పడం మానాలి. దేశంకోసం, దైవంకోసం తన సంతానాన్ని అర్పించే తల్లులు భగవంతునితో సమానంగా ఆరాధ్యులే. రాబోయే తరాలకు అమ్మగారు ఆదర్శంగా నిలిచారు.**

ఇన్నాళ్ళూ ఈ లోకంలో అమ్మగారు ప్రతిరోజు చిన్నశ్రీమన్నారాయణ యతికి మంగళాశాసనం చేశారు. ఇప్పుడు పరమ పదంలో పెద్దశ్రీమన్నారాయణ యతికి మంగళాశాసనాలు చేస్తూ మన కార్యాలు సఫలం చేస్తారని విశ్వసిస్తున్నాము.

**జైశ్రీమన్నారాయణ !**



సఫలమవుతున్న నీ ప్రతిపనీ ఆచార్య కటాక్షమే.

# శ్రీశ్రీశ్రీ దేవనాథ
# రామానుజ జీయర్ స్వామి

**శ్రీమదుభయ వేదాంతాచార్య పీఠము, జీవా, శ్రీరామనగరము**

సదా, సర్వదా వందనీయురాలు, వాత్సల్యమూర్తి, ప్రేమమూర్తి, సుకుమారహృదయ, మూర్తీభవించిన భాగవతనిష్ఠ శ్రీమతి అలివేలు మంగతాయారుగారు (అమ్మగారు).



**ఒక ఆచార్యులు, శ్రీ పెద్దజీయర్ స్వామివారి ఇంట మెట్టి,**
**మరొక ఆచార్యులు, శ్రీ చిన్నజీయర్ స్వామివారికి జన్మనిచ్చిన పుణ్యమూర్తి.**
**లోకంలో మాతృమూర్తులంతా ఋణపడేట్టుగా మాతృస్థానానికే**
**ఎనలేని గౌరవాన్ని నిలిపిన ధన్యశీలి.**
**ఆచార్యులను అభిమానించే ప్రతి ఒక్కరు మాతృసంబంధంగా భావించే అనురాగదీప్తి.**
**ఆచార్యుల అడుగుజాడలలో నడవాలనుకునే మనందరికీ దివ్యస్ఫూర్తి.**

శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారి ప్రతిసంకల్పానికి ప్రేరణ, తన దీవెనల బలమే అనడంలో అతిశయోక్తి లేదు.

అలాంటి మాతృమూర్తి భాద్రపద కృష్ణ నవమి, శుభ ఆర్ద్రా నక్షత్ర సంగమదినం, శుక్రవారం శ్రీమన్నారాయణ శ్రీచరణసన్నిధికి చేరడం లౌకికంగా మనందరికి ఇది ఒక పెద్ద లోటు. నిజంగా బాధాకరం కూడా. అయితే నా పిల్లవాడు చిన్నపిల్లవాడయ్యా, నీ వైభవాన్ని, ఆచార్యపరంపరా వైభవాన్ని ప్రకాశింపచేసే బృహత్కార్యాన్ని భుజస్కంధాలపై వేసుకున్నాడు ఏం పట్టనట్టు చూస్తూ కూర్చున్నావా? అని పరమాత్మని నిలదీయడానికి పరమాత్మని చేరి ఉంటారని దాసుని భావన.

అమ్మగారితో 1992 నుండి ఒక చక్కటి అనుబంధం దాసునిది. ఎంతో ప్రేమగా, వాత్సల్యంగా జీయర్ స్వామివారితో సమానంగా ఆదరించేవారు. వారి మనస్సు అంత గొప్పది. నిర్మలమైనది. ఎప్పుడూ ఆచార్యులకు మంగళం పాడడమే తమ జీవనకృత్యంగా భావించే అమ్మ, ఇకపై పరమపదంలో ఉండే శ్రియఃపతికి, నిత్యముక్తుల గోష్ఠికి మంగళం పాడుతూ ప్రకాశించాలని మనమంతా ప్రార్థిద్దాం!

ముక్తగణంలో చేరిన అమ్మగారు, మన ఆచార్యులు సంకల్పించిన నిరుపమాన సమతామూర్తి స్ఫూర్తికేంద్ర వ్యవస్థాపనలో ఉండే ఆటంకాలు తొలగించి, మరిన్ని విశేష కార్యక్రమాల ద్వారా ఆ సమతా సందేశాన్ని భూమండలం నలుమూలల వ్యాపింపచేసే కైంకర్యం మనందరికి లభించేటట్టు ఆ పరమాత్ముని సన్నిధిలో, పరమాచార్యుని సన్నిధిలో పురుషకారం చేస్తారని విశ్వసిస్తూ...

అపూర్వ ఆచార్యులను మనందరికీ, లోకానికి అందించిన మాతృశ్రీ శ్రీచరణాలలో కృతజ్ఞతా పూర్వకంగా ప్రణమిల్లుతూ.....

జైశ్రీమన్నారాయణ !

ఆచార్యులు దివ్యదేహధారులు. నీ శరీరం లాంటి పాంచభౌతిక శరీరం కాదు వారిది.



జయ గోవింద !  జయ గోవింద!

# శ్రీ భాష్యకార సిద్ధాన్త పీఠము

రిజిష్టర్ నెం. 8/2000

1-4-2, సూర్యనారాయణపురం, జీయర్ మార్గ్, అక్ష వంతెన వద్ద, అమ్మలపాలెం రోడ్,
భీమవరం - 534 202, ప.గో.జిల్లా, ఆంధ్ర. ఫోన్ : 08816-227599

వ్యవస్థాపకులు : శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరుస్వామివారు



తేది: ____________

శ్రీమతి లక్ష్మమ్మ గారు చాలా పుణ్యవంత రాలు గారు మన చిన్న జీయరుస్వామి వారి పూర్వాశ్రమ మాతృమూర్తి గాను ఆచార్యుల తరువాత వారి శిష్యురాలిగాను ముఖ్యులుగా ఉండగా సమస్త ఆస్తిక లోకానికి విస్మయమైనది.

మాతృత్వానికి పరిపూర్ణరూపం ఆ తల్లి. చిన్నజీయరుస్వామివారిని ప్రసాదము లోకానికి అందించిన అంబరమే ఆ తల్లి.

ఒకప్రక్క మామగారు (పెద్దజీయరుస్వామివారు) మరొకప్రక్క పుత్ర సంతానం (చిన జీయరుస్వామివారు) ఇద్దరూ యతులై వారి చేత పునీతం గావింపబడ్డ పవిత్ర లక్ష్మి ఆ తల్లి.

తేజోవంతమైన ముఖవర్చస్సు, చక్కని గాత్రం వినయ విధేయతలు ఆ తల్లిని పరిచయం చేసిన ఆమె సహజ గుణాలు.

భాగవత సంబంధమే భగవదనుగ్రహ కారకం!

జయము గోవిందా !

# శ్రీ భాష్యకార సిద్ధాన్త పీఠము

రిజిష్టర్ నెం. 8/2000

1-4-2, సూర్యనారాయణపురం, జీయర్ మార్గ్, ... వద్ద, ... రోడ్,
భీమవరం - 534 202. ప.గో.జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ ఫోన్ : 08816-227599

వ్యవస్థాపకులు : శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరుస్వామివారు

తేది ______

మూడు ఆశ్రమముల వారితో ఉన్న పరిచయంతో శ్రీమాన్ [illegible] ఎన్నో కార్యక్రమాలు జరగడం [illegible] చేసిన సేవల వలన మాకు ఆనందం మాధుర్యం [illegible].

మహాలక్ష్మీ యాగానికి ఆహ్వానించగానే అభిమానంతో వచ్చి పాల్గొని మాకు, భక్తులకు చాలా ఆనందం కలిగించారు. ఆ ఇద్దరు యతుల దేహ సంబంధం, ఆత్మ సంబంధం గల ఆ అద్వితీయ మూర్తులైన పెరుమాళ్, ఆచార్య కైంకర్యములలో నిత్యమూ ఉండాలని శ్రీ [illegible] గార్కి పెరుమాళ్ళను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ.

అనేక మంగళాశాసనములతో

[illegible signature]
భీమవరం
18/9/2020.



ఆచార్యులు దయతో పంచసంస్కారం ద్వారా జ్ఞాన జన్మనిచ్చే పితృస్వరూపులు.



శ్రీమతే రామానుజాయ నమః :

# శ్రీమత్ అష్టాక్షరీ పీఠం

రిజిష్టర్ నెం. 66/2002
డో. నెం. 11-3/21-30, గుర్నాథ రోడ్డు, విద్యాధరపురం,
కామకోటినగర్, విజయవాడ-520 012.

వ్యవస్థాపకులు : పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ
సంపత్కుమార రామానుజ జీయరు స్వామివారు

శ్రీమతే నారాయణాయ నమః!
అస్మద్ గురుభ్యో నమః;

తేది.............................

[illegible]

18/9/20

'ఆచార్యుడు నా వంటివాడే, భేదమేమీలేదు', అనుకోవడం నీ అధోగతికి తొలిమెట్టు.



ఆత్మకు మంత్రం తల్లి, ఆచార్యుడు తండ్రి.



# అమ్మ పలుకులు

**నేపాల్ కృష్ణమాచార్యులు,**
**జీవా, శ్రీరామనగరం**



"కౌసల్యా శుశుభే తేన పుత్రేణామిత తేజసా" అన్నాడు వాల్మీకి భగవానుడు. అపరిమిత తేజస్సుకలపుత్రుడైన శ్రీరామచంద్రుని సంబంధంతో కౌసల్యమ్మ, బాగా ప్రకాశించినదట. అలాగే మన జగదాచార్యులైన శ్రీచిన్న జీయర్‌స్వామివారిని పుత్రులుగా లభించి, వారిని శ్రీభగవద్రామానుజ దర్శనప్రచారానికి కానుకగా ఔదార్యంతో సమర్పించుకొన్న అలివేలుమంగమ్మ తల్లి, లోకంలో ప్రకాశించారు. ఆచంద్రార్కం ప్రకాశిస్తూనే ఉంటారు. నిర్మలకీర్తికాయంతో అమ్మ, ఎప్పుడూ మన హృదయాలలోనే వేంచేసి ఉంటారు వారు. అటు నిత్యవిభూతిలో ఆచార్య సేవలలో ఉన్నారు. వారు ఇటు లీలావిభూతిలో ప్రేరకులై జ్ఞానస్వరూపంతో మన మనోమందిరాలలోనే సంచరిస్తారు. ఇందులో ఏమీ సందేహం లేదు. అమ్మ, కృతకృత్యులయ్యారు.

వారిలో ఉండే మంచి గుణాలలో కొన్నిటినైనా మనము, అలవర్చుకోగలిగితే అది వారిపట్ల నిజమైన కృతజ్ఞత అవుతుంది. సామాన్యంగా మనం మానవులముగా మంచి గుణాలను సంపాయించుకోవాలి. వైష్ణవులముగా ఇంకెన్నో విశిష్టమైన గుణాలను ఆర్జించాలి. **అమ్మగారు, మాటలతోకన్నా తన ఆచరణతోనే మనకు చాలా నేర్పారు.**

**వారిలో నడయాడే సత్త్వగుణం, సదాచారం, స్వావలంబిత్వం, అచంచలమైన ఆచార్యనిష్ఠ, భగవద్భక్తి, సహజ వినయంతో కూడిన పలుకులు, మృదుభాషిత్వం, అవసరంకంటే ఒక్కమాట కూడా అధికంగా మాట్లాడకపోవడం, ఆత్మోజ్జీవనపరమైన ఆలోచనలాంటి అనర్ఘములైన గుణాలు బాగుపడాలనేవారిని ఎప్పటికీ సన్మార్గంలోకి ప్రేరేపిస్తూనే ఉంటాయి.**

అమ్మగారితో నాకున్న అనుభవాన్ని కొద్దిగా తెలియజేస్తాను–

1994లో శ్రీచిన్న జీయర్ స్వామివారు తిరుమలలో సహస్రకుండాత్మకమైన శ్రీమహావిష్ణుయాగం నిర్వహించిన విషయం చాలామందికి తెలుసును. అప్పట్లో న్యాయవేదాంత విద్వాంసులు శ్రీ తె. కం. గోపాలాచార్యస్వామివారు, 91 దాటిన వయస్సులో యాత్రాదులను మానివేసి నడిగడ్డపాలెం ఆశ్రమంలో తమ శాస్త్రచింతనాది వ్యాసంగంతో వేంచేసియుండేవారు. ఆ యాగాన్ని శ్రమకోర్చి అయినా దేవరవారు సేవించి మంగళాశాసనం చేయాలని శ్రీచిన్న జీయర్‌స్వామివారు వారిని ప్రార్థించారు. శ్రీగోపాలాచార్యస్వామివారు, యాగానికి వేంచేసి 5 రోజులు ప్రత్యక్షంగా అన్వయించారు. శ్రీచిన్న జీయర్‌స్వామివారికి, వారు రాగలగడం చాలా ఆనందాన్ని కలిగించింది. అప్పుడు నేను, గోపాలాచార్యస్వామివారి సేవలోనేయున్నాను.

'ఆచార్యుడు' అనే గాలాన్ని పంపి భగవంతుడు మనిషిని ఉద్ధరిస్తాడు.



ఒకరోజు, ప్రొద్దున మంగళాశాసనం సమయానికి అమ్మగారు, శ్రీగోపాలాచార్యస్వామి వారిని సేవించుకోవడానికొచ్చారు. "చూశావా! చిన్న జీయర్‌స్వామి వైభవాన్ని? వారిని గురుకులీయ అధ్యయనానికి, ఆశ్రమ స్వీకారానికి నువ్వు అంగీకరించిన మంచి కార్యానికి ఫలితమది. వారు ఇలా ఎన్నో కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహిస్తారు. ఇలాగా నీ జీవనం చాలా ధన్యం సుమా!" అని శ్రీ గోపాలాచార్యస్వామివారు, అమ్మగారిని ఆశీర్వదించిన సన్నివేశాన్ని చూసి నేను చాలా ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కూడా పొందాను.

మరొక చిన్న సన్నివేశం–

అమ్మగారిని కార్యక్రమాలలో సేవించుకొంటూండేవాడిని నేను. శ్రీగోపాలాచార్యస్వామివారు పరమపదించిన తరువాత పాఠప్రవచనాలలో ఉత్తరదేశంలోనే ఉండిపోయాను. శ్రీచిన్న జీయర్‌స్వామివారు, "ఇక్కడకొచ్చెయి" అన్నారు. సీతానగరం వచ్చాను. నేను, స్వామివారు ఒకచోట చింతనంలో కూర్చున్నాం. చాలా రోజులు వ్యవధి ఉండడంతో అమ్మగారు బహుశః నన్ను గుర్తించలేకపోయారు. మాట్లాడకుండానే సైగతో "ఆయన ఎవరు?" అని స్వామివారిని అడిగారు. స్వామివారన్నారు– "అయ్యో! మర్చిపోయారా? కృష్ణ. వేంకటాచారికి సహాధ్యాయి. ఎంత అద్భుతమైన సంస్కృతం మాట్లాడతాడో?" అని సమాధానం చెప్పారు. అప్పటినుండి మరలఎక్కువ వ్యవధి లేదు కనుక అమ్మగారు నన్ను చాలా సన్నిహితంగా గుర్తిస్తూనేయుండేవారు.

మరొక చిన్న సన్నివేశం–

2012లో నన్ను గోపాలోపాయన పురస్కారాన్ని గ్రహించమని శ్రీస్వామివారు, వేణుగోపాల్‌స్వామి నేను అయోధ్యలో ఉండగా ఫోన్ చేశారు. శ్రీస్వామివారి ఆదేశాన్ని శిరసా వహిస్తూ 'గోపాలోపాయన' పురస్కారాన్ని స్వీకరించాను. ఆ తరువాత జీవాలోనే చాతుర్మాస్యం జరిగింది. నేను శ్రీస్వామివారితోటే పూర్తిగా ఉన్నాను. శ్రీస్వామివారు, దివ్యసాకేతమండపంలోనే వేంచేసి యున్నారు. నేను శ్రీస్వామివారి పాత కుటీరంలో పైన ఉండేవాణ్ణి. ఒకరోజు, ద్వాదశి తిథి వచ్చింది. అమ్మగారు ఒకరే, నన్ను వెదుకుతూ ఆ కుటీరం క్రిందకి వచ్చారు. నన్ను పిలిపించారు. "అమ్మా! ఇంతదూరం నడిచివచ్చారు? పిలిపిస్తే వచ్చేవాణ్ణి కదా!" అన్నాను. "ద్వాదశి సంభావన మీకే ఇవ్వాలని వచ్చాను" అన్నారు. ఇది వారికి నాపైన ఉన్న వాత్సల్యం. ఇలాంటివి ఎన్నో సన్నివేశాలు. ఇది వారి వినయానికి, నిరభిమానానికి నిదర్శనం.

అప్పుడప్పుడు మన జీవా ఆశ్రమంలో వారి నివాసానికి వెళ్ళి సేవించుకొని పలుకరిస్తూండేవాణ్ణి. చాలా సంతోషించేవారు. "మీరు మీ జ్ఞానాన్ని పంచాలి" అని అంటుండేవారు. "స్వామివారెలా ఉన్నారు? సమయానికి విశ్రాంతి తీసుకుంటున్నారా? మరల ఎక్కడికైనా ప్రయాణముందా? మీరు వారితో ఉన్నప్పుడు నాకు ధైర్యంగా ఉంటుంది" అని అంటుండేవారు. ఇలాగా వారు, నన్ను వాత్సల్యంతోను, ఆచార్యానుగ్రహంతో నాలో దాగిన నాలుగు అక్షరాలను గౌరవంతోను చూశారు. ఒక్కొక్కసారి నేను దండం పెట్టకముందే వారు శిరస్సు వంచేవారు. నాకు చాలా సిగ్గనిపించేది. ఇది అమ్మగారిలో సహజంగా ఉండే వినయానికి, వైష్ణవత్వానికి నిదర్శనం. స్వరూపజ్ఞురాలైన ఆ తల్లికి జీవితాంతం నేను ఋణపడే యుంటాను. కృతజ్ఞతతోనే యుంటాను. ఇలాంటి సన్నివేశాలు చాలా ఉన్నాయి. "మాతస్త్వాం శిరసా నమామి సతతం, గాయామి త్వత్కం గుణమ్"– మంగళమ్.

❖❖❖❖❖❖

పూజనీయుల నడవడియే మనకాదర్శం.



# మాతృపరివస్యా



మహామహోపాధ్యాయ, శాస్త్రరత్నాకర, శాస్త్రభాస్కర,
రాష్ట్రపతి అవార్డు గ్రహీత

**డా॥ సముద్రాల వేంకటరంగరామానుజాచార్యులు**

మానవునిగా పుట్టిన ప్రతివ్యక్తికీ సంబంధగ్రహణ మూలంగానే ప్రీతి పుడుతుంది. "ఇది నాది" అని తనకు సంబంధించినదిగా తెలిసిన వస్తువుపట్ల ప్రీతి ఆవిర్భవిస్తుంది. ఆ సంబంధజ్ఞానం దృఢపడినకొద్దీ, ఆ ప్రీతి దినదిన ప్రవర్ధమానమై దృఢపడి విడువలేనంతటి బంధాన్ని ఏర్పరచుకొంటుంది; ఒకవ్యక్తితో మరొక వ్యక్తికి ఏర్పడే ప్రీతికి కూడా ఇదే నిదానం.

కాని, సంబంధ జ్ఞానంలేని దశలోనే స్వారసికంగా పుట్టి, నిర్వ్యాజంగా పెరిగే ప్రీతి కేవలం తల్లిదండ్రుల విషయంలో మాత్రమే. పుట్టిన బిడ్డ, పుట్టగానే సంబంధజ్ఞానం లేకుండానే ప్రేమను ఆవిష్కరించేది తల్లిపట్ల మాత్రమే. ఆ తరువాత, ఆతల్లి కలిగించిన ప్రత్యభిజ్ఞానం మూలంగా తండ్రితో ఏర్పడే బంధం రెండవది. కనుక మాతృ సంబంధం జీవులకు ఈ సాంసారిక ప్రక్రియలో అనాదిసిద్ధం. తల్లిదండ్రులతో ఏర్పడిన మాతా పితృసంబంధం కూడా అనాది సిద్ధమే. కనుకనే, భగవంతునితోను, భగవతితోను మనం పరమస్పృహణీయంగా సంభవించే సంబంధం కూడా ఇదే.

కనుకనే లక్ష్మీ – నారాయణులను సకలజగన్మాతా పితరులుగా సంభావించడం సార్వవిషయకం, సార్వకాలికం, సార్వదేశికం.

మాతాపితృతత్త్వాలను వేరుచేయక ఒకేతత్త్వంగా భావించే దృష్టితో మాతృ–పితృ శబ్దాలకు ఏకశేషంచేసి 'పితరౌ' అంటుంది శాస్త్రం. కనుక ఎక్కడైనా 'పితరులు' అని ప్రయోగిస్తే అది అవిశేషంగా తల్లిదండ్రులకిద్దరికీ అన్వయిస్తుంది. అయినా, ఈ 'ఏకశేషం' అనే కలయికలో కూడా మాతకే ప్రథమ గ్రహణం. అందువల్లనే 'మాతా చ పితా చ' అని వ్యుత్పత్తి చెప్పి 'పితరౌ' అని శబ్దం తయారు చేయబడింది. మరి, తల్లికి పూర్వప్రయోగం ఉన్నప్పుడు 'మాతరౌ' అనే అనవచ్చుకదా! పితరౌ అని ఎందుకనాలి? అని ఒకశంక కలుగవచ్చు. నిజమే. ఇక్కడ పితృశబ్దం తల్లిదండ్రులిద్దర్నీ చెబుతోంది. అంతేకాదు 'పితృత్వ' మంటే రక్షకత్వం, లేదా పాలకత్వం, ఈ లక్షణం ముందు తల్లిలోను, ఆమెద్వారా తరువాత తండ్రిలోను సంక్రమిస్తుంది. కనుక శైశవంలో పుట్టిన బిడ్డకు "పాలిచ్చి" పెంచుతుంది. ఇక్కడ 'పాలిచ్చుట' తనలో ఒకభాగాన్ని ఈయడంతో పాటు, రక్షించడం కూడా. ఇలా అమ్మ 'పాలిస్తే', తండ్రి 'పరిపాలి'స్తాడు ఉత్తమ సంస్కారాలనిచ్చి. తల్లిది ఆంతర పాలనం అయితే, తండ్రిది బాహ్యపాలనం. మొత్తంమీద "పాలనం" తల్లిదండ్రులకిద్దరికీ చెందిన సమానలక్షణం కనుక, వారిరువురినీ కలిపి "పితరౌ" అని సంస్కృతంలోను, 'పితరులు' అని తెలుగులోను వ్యవహరిస్తాం. రక్షించువారని దానికి అర్థం.

ఇలా తల్లికి అనాదిగా ఏర్పడిన ఈ అభ్యర్హితత్వాన్నే వేదమూ పాటించింది తన ఉపదేశప్రక్రియలో. విద్యాబుద్ధులు నేర్చి ఆచార్యకులంనుండి వెలికి వచ్చి బాహ్య ప్రపంచాన్ని చూచే బ్రహ్మచారికి, గృహస్థుడు కావడానికి ముందు చేసిన ఉపదేశమే – "మాతృదేవోభవ' పితృదేవోభవ" అని. ఈ క్రమంలోని ఔచిత్యమేమిటో అదే ఇంతవరకూ చెప్పుకున్నాం.

సంప్రదాయంలో కూడా తండ్రి అయిన నారాయణుని వల్ల మనకు రక్షణం కావాలన్నప్పుడు తల్లి లక్ష్మి అనుగ్రహిస్తేనే తప్ప వేరుగా మార్గంలేదు. లోకంలోనూ ఈ ప్రక్రియసమానమే. తల్లికి ఇష్టంలేకుండా, ఆవిడకు చెప్పకుండా ఏ బిడ్డనూ తండ్రి తనంతతాను రక్షించినవైనం ఇంచుమించుగా లేదనే చెప్పాలి. ఒకవేళ తండ్రి అలా చేయవలసివస్తే, ఆ తరువాతనైనా తల్లిని ఒప్పించి, నొప్పించకుండానే తనరక్షణ ప్రక్రియను కొనసాగిస్తాడు తండ్రి. ఇది లోకానుభవ సిద్ధమే. ఇదీ తల్లికి ఉన్నస్థానం, సమున్నతస్థానం.

కనుకనే, ఏ ఆశ్రమంలో ఉన్నా మాతృస్థానానికి వైకల్యం ఎంతమాత్రం లేదు. పితృశబ్దానికి లేని ఒక విలక్షణత మాతృశబ్దానికి ఉంది. అసలీశబ్దమే **'మాన్యతే పూజ్యతే ఇతి మాతా'** అనే నిర్వచనాన్నిబట్టి మాఙ్–మానే అనే సంస్కృతధాతువు నుండి పుట్టింది. పూజింపబడునది అని అర్థం.

తండ్రికంటే తల్లికి ఒక అతిశయాన్ని పురాణాలు ఉద్ఘోషించాయి.

బ్రహ్మవైవర్తం ఇలా అంటుంది.

**"జనకో జన్మదాతృత్వాత్, పాలనాచ్చ పితా స్మృతః' ।**
**గరీయాన్ జన్మదాతుశ్చ యోన్నదాతా పితా మునే ॥**
**వినాన్నాన్నశ్వరోదేహో ననిత్యః పితురుద్భవః ।**
**తయోః శతగుణే మాతా పూజ్యా మాన్యా చ వందితా ॥**
**గర్భధారణ పోషణాభ్యాం సా చ తాభ్యాం గరీయసీ ।"**

జన్మనిచ్చిన వాడు జనకుడు, ఈతడే పాలించడంచేత పిత అయ్యాడు. అయితే ఈ పితకంటే కూడా, మరొకరెవరైనా అన్నంపెట్టిపోషించినవాడుంటే, ఆ అన్నదాత కూడా పితయే. ఆతడు మరీగొప్పవాడు. కానీ, వీరిరువురికంటే నూరురెట్లు తల్లిగొప్పది. ఆదరించి పూజింపదగింది, నమస్కరింపతగింది. ఎందువల్ల? పదినెలలు గర్భానమోసి, ప్రసవక్లేశాన్ననుభవించి, తన స్తన్యాన్నిచ్చి పోషిస్తుంది కనుక. అంటుంది బ్రహ్మవైవర్తం. ఎన్నో పురాణాలు గురువుకంటే, ఆచార్యునికంటే, ఉపాధ్యాయునికంటే, ఇంకా చాలామందికంటే, మాత చాలా గొప్పదని ఉద్ఘోషిస్తున్నాయి.

ఇంతటి మాన్యతకల తల్లి – తన బిడ్డ ఏ అవస్థలో ఉన్నా, ఎంత ఉత్తమ స్థితిలో ఉన్నా, తన మాన్యతను

సజ్జనులను తలచినా వారి స్వభావాలు అలవడవచ్చు.



ఏదశలోనూ కోల్పోదు. "పుట్టిన బిడ్డచెడ్డవాడుకావచ్చు కాని తల్లిచెడ్డది కాజాలదు" అంటారు శంకరభగవత్పాదులు. "కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి" అని.

ఇలాంటి తల్లి ఎవరికైనా తల్లే. ఆమెను కోలుపోవడం లౌకికులకైనా, అలౌకికులకైనా చాలా శోచనీయమే. అయినా కాలగతికి ఎంతటివారైనా తలవగ్గవలసిందేకదా! ఇంతకాలం చాలా సన్నిహితంగా ఉంటూ తన బిడ్డను "ఉత్తమాశ్రమి"గా దర్శించగల్గిన తల్లి "శ్రీమతి అలివేలు మంగతాయారు" గారు మహాధన్యురాలు. ఇలాంటి యోగ్యతను సంతరించుకున్న బిడ్డను కనడం ఒకధన్యత, ఆయన చేసే అతిలోకకృత్యాలను దగ్గర ఉండి కన్నులారా చూడగల్గడం మరొక ధన్యత, అంతకంటే, ఉత్తమాశ్రమి అయినా తన పుత్రుని ద్వారానే చరమేష్టిని జరిపించుకోగల్గడం ఆమెకు కలిగిన 'మహాధన్యత'. ఆమెను 20 సంవత్సరాలు పైగానే ఎరిగిఉన్నా, దాదాపు 10 సంవత్సరాలుగా సన్నిహితంగా ఒకే ప్రాంగణంలో ఉంటూ, ఆమె, ఆయా సందర్భాలలో స్పందించిన వైనాన్ని దగ్గరగా చూడగల్గిన మేము మరీధన్యులమని, ఆమెకు దాసోహాలు సమర్పిస్తున్నాము.

జైశ్రీమన్నారాయణ !



లౌకిక ప్రపంచ సంబంధ ప్రదర్శన ఆచార్యుని ముందు కూడదు. అది వారు చూడరు కాబట్టి.



# గగనం - గగనాకారం



గుదిమెళ్ళ వేణుగోపాలాచార్యులు (వేణుస్వామి)

శ్రీచిన్నజీయర్ స్వామి వారి

(గరుడాళ్వార్ / విష్వక్సేనులు)

శ్లో॥ "గగనం - గగనాకారం సాగరః సాగరోపమః
రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ"

ఆకాశమునకు ఆకాశమే సాటి. సముద్రానికి సముద్రవే సాటి.. రామరావణ యుద్ధానికి రామరావణ యుద్ధమే సాటి... వాటిని పోల్చడానికి లోకంలో ఏ వస్తువు లేదు. అలాగే మాతృమూర్తికి మాతృమూర్తే సాటి.....

"న మాతుః పరదైవతమ్" లోకవిదితం.

అటు భారతనారీలోకానికి, ఇటు శ్రీవైష్ణవ భక్తి సంప్రదాయానికి ఆదర్శం... భారతావని అందించిన నారీ శిరోమణి మాతృమూర్తి భాగీరథీ సమానురాలు అలివేలు మంగతాయారు.

ఎంతటి మహెూన్నతులైనా, ఎంత మహానుభావులైనా, మహా మహిమాన్వితులైనా, అవతార పురుషులైనా తల్లి గర్భము నుండి రావలసినదే. అమ్మ ద్వారా సంస్కరించబడి.. ఆర్జించిన జ్ఞానం సమాజ శ్రేయస్సు కోసం అందిస్తున్న తల్లులు ఎందరో.. కనుకనే "న మాతుః పరదైవతమ్" అన్నది కదా వేదం.

ఆనాడు రామో విగ్రహవాన్ ధర్మః అని త్రేతాయుగంలో కీర్తింపబడిన శ్రీరామచంద్రుని.... ద్వాపరయుగంలో శ్రీకృష్ణ పరమాత్ముని.. కలియుగంలో భగవద్రామానుజులను లోకకళ్యాణార్థం లోకానికి అర్పించినది మాతృమూర్తులే...కాంతిమతి దేవికి నీవు గారపు బిడ్డడివై ఖ్యాతి గాంచినావా? రాజహారే! యతిరాజహారే!!

మన పెద్దజీయరు స్వామి వారిని కన్న తల్లి చూడమ్మ, పెంచిన తల్లి లక్ష్మీనరసమ్మ ఎంత ధన్యులో కదా!. భగవద్రామానుజ పరంపరలో నడవడానికి దారి చూపిన స్వామికి మనం సదా కృతజ్ఞులం.

ఈనాడు కలియుగంలో.. నడయాడే దైవం... భగవద్రామానుజుల, శ్రీమన్నారాయణ తత్త్వాలని కలబోసి లోకానికి అందించేందుకు చిన్న శ్రీమన్నారాయణుని తీర్చిదిద్దినదీ ఈ మాతృమూర్తే...

వారి జీవితం మనకు స్ఫూర్తిదాయకం..

ఆ తల్లి స్వామి భవిష్యత్తుకై ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ అనునిత్యం శ్రమించిన శ్రామికురాలు... ఈ మాతృమూర్తి సంస్కారమే మనకు కల్పతరువు.

ఈ చరాచరజగత్తులో ఎవరూ నిర్వచించలేని పదం అమ్మ. ఆ వాత్సల్య సుధారస గంగలో స్నానం చేసి పవిత్రులం కావడమే మన అదృష్ట సంపద. అంతులేని, అడ్డులేని, అన్నింటికి ఆధారమైన అమ్మతత్త్వాన్ని అర్థం

భగవంతుడు మనలని కరుణించేలా వానిలో సంకల్పం కలిగించేది ఆచార్యులే



చేసుకోవడం చాలా కష్టతరమైనది. ఆమెను అర్థం చేసుకోవాలంటే.... అమ్మ పదాన్ని నిర్వచించాలనీ అంటే ఆమె అనుగ్రహం మనకుండి తీరాలి. ఆ కరుణార్ద్ర హృదయమే మనల్ని నడిపించాలి. 'పరా' వాద్యాన్ని ఆమె అందివ్వాలి. ఆ శక్తి కావాలంటే ఆమె దివ్యానుగ్రహం వల్లనే మనకు అది, సాధ్యం కాగలదు. అమ్మ అనే మాటే ఓ కావ్యం. ఓ అమృతభావం.

తన బిడ్డలను దిశానిర్దేశం చేసి వారి వారి జన్మలకు సార్థకతను ప్రసాదించగల వరప్రసాదిని అమ్మ. ఆదిగురువు అమ్మ. ఓ ఉత్తమ కార్య సాధనను అప్పజెప్పి దానిని ఆ బిడ్డ సాధించేలా చేయగలిగేది అమ్మే. శ్రీవైష్ణవ సంప్రదాయ సముద్ధరణకు లోకానికి పెద్దజీయరు స్వామి వారిని వారి అమ్మగారు నారాయణ! నారాయణా! అని అందిస్తే, శ్రీరామానుజ దాసులైన పెద్దజీయరుస్వామి వారు తన రెండవ కుమారుని పెద్ద కుమారులైన చిన్నజీయరు స్వామి వారిని మనకందించి శ్రీవైష్ణవ తత్త్వాన్ని ఎల్లెడలా ప్రవహింపజేశారు.

ఈ విషయంలో మన స్వామి వారికి అమ్మమాటే ఆదర్శం. ఆలంబన. ఆత్మ స్థైర్యాన్నిచ్చి, ధర్మ సంస్థాపన కోసం తన మామయ్య గారి ఆజ్ఞను శిరసావహించి, లోక కల్యాణం కోసం బిడ్డను దైవశక్తిగా మలచిన జగజ్జీవన జ్యోతి అమ్మ అలివేలు మంగతాయారు, నిజంగా రామానుజ దాసురాలే. భగవతత్త్వాన్ని అందరకూ అందించేలా, చక్కని యతీశ్వరునిగా శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయరు స్వామిగా తన బిడ్డను సమర్పించి లోకారాధన చేసిన దివ్యస్థపతి. ఆకులమన్నాడ చిలకమఱ్ఱి వంశాన్ని పరమ పవిత్రం గావించిన ఆదర్శ గృహిణీమతల్లి.

నిరాడంబరత, సహనశీలత, సౌమనస్యం, చెరగని చిరు మందహాసం, నిరంతర శ్రీమన్నారాయణుని సేవ, మాతృప్రేమ మన అమ్మ అలివేలు మంగతాయారమ్మకే ఉన్న సద్గుణాలు.

పవిత్రతలకే పవిత్రమై, మంగళములకే మంగళమైన పెరుమాళ్ళ తత్త్వాన్ని, ఆచార్యులై, పరమహంస పరివ్రాజకులై జగదోద్ధారణ గావిస్తున్న శ్రీచిన్నజీయరు స్వామి వారికి శుభం కలిగేలా మంగళహారతిని అనునిత్యం అందించిన అపూర్వ జననీమణి అలివేలు మంగతాయారు అమ్మ. ఆ యమ్మ కరుణామూర్తి.

ఈ క్షేత్రంలో ఎంతో మంది భక్తులు ఉన్నారు. అందరూ అమ్మను ప్రేమించిన వారే...! మనమేమి చెప్పగలం తల్లి గురించి ఎవరి తల్లి వారికి గగనమే సాగరమే అయినా, లోకాన్ని ఉద్ధరిస్తూ... మనల్ని ఉజ్జీవింపజేస్తున్న స్వామిని అందించిన ఆ తల్లి మనందరికీ గగనం సాగరం..

అమ్మకు మనం ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. ఆ భాగ్యం శ్రీమాన్ జూపల్లి రామేశ్వర్ రావు గారికి లభించింది. తల్లి గారి కార్యక్రమాలకు స్థలాన్ని ఏర్పాటు చేశారు. వారిని పొగడటం కాదు. ఈ సందర్భంగా ఆ రకమైన సేవాభాగ్యం వారికి లభించటం ముదావహం. అని భావిస్తున్నాడు దాసుడు..

సదా శ్రీమన్నారాయణుని భజనలో స్నానిస్తూ, సర్వజన హితాన్ని కాంక్షిస్తూ, అంతా రామమయం అని భావిస్తూ విష్ణుపద సాయుజ్యం పొందిన అమ్మ పదపద్మాలకు ప్రణమిల్లుతూ... అక్షరాలా అంజలి ఘటిస్తూ.... జైశ్రీమన్నారాయణ నామాన్ని పఠిస్తూ....

❖❖❖❖❖❖

ఆచార్యుల నాశ్రయించి వారి ద్వారా జ్ఞానం పొందినప్పుడే నీవు సత్తాకలవాడవు అవుతావు



శ్రీరామాయనమః     శ్రీ హనుమతే నమః

శ్రీమతే రామానుజాయనమః: శ్రీ లక్ష్మీ నారాయణో విజయతే శ్రీ శ్రీమన్నారాయణః

# సమాశ్రమ దివ్య మహోత్సవమ్



[illegible]

సీ॥ శ్రీశేష నగరాజ శిష్యరాజ స్వామి
సుందర వరహాస బంధురములు
సిరుల గూర్చెడు తల్లి శ్రీవారి దేవేరి
పద్మావతీ దివ్య ప్రాభవములు
సింహాద్రి నాథుని శ్రీ తనూ విలసిత
చందనాంచిత దివ్య సౌరభములు
శ్రీ భూత పుర జాత దేశాంశ సంభూత
భాష్యకారుల కోటి భాను ప్రభలు
దివ్య- పావన- పావని- రామ నామ
మధుర- మందార- మకరంద సుధలు చింద
అవని పెద- చిన- జీయరు లవతరించె
దాస- దాసాను దాసుల దయను బ్రోవ.

[illegible] శ్రీనివాస స్వామి
[illegible] జీయరు [illegible] యీతడె
[illegible]
[illegible] యీతడె
[illegible]
[illegible] జేసిన [illegible] యీతడె
[illegible]
[illegible] యతులను గన్న [illegible] యీతడె

చిన్ని శిశు రూపమున నున్న నేమి వారె
ముద్దులొలికెడు మోమున మోదములర
సన్న గీతుల నామాల చెన్ను మీరి
చిన్న జీయరు గన్నట్టి మిన్న యీతడె.

✕

కరుణ దయల మేలు మంగళ [illegible] సుతుడు
మంచు సంసార వార్ధి దాటించు ఘనుడు
ఆశ్రయించిన నమ దాస్య స్వామి యతడు
అతి దేశాంశ సంభూతు డవతరించె.

✕

చిన్ని శిశు రూపమున నున్న నేమి వారె
ముద్దులొలికెడు మోమున మోదములర
చిన్ని గీతుల నామాలు చెన్ను మీరి
చిన్న జీయరు గన్నట్టి మిన్న యీతడె.

✕

పద్మనాభ మంగాంబ దంపతులను
ఆ క్రమంబున సేవించె యతుల భక్తి
పెద్ద జీయరు స్వామియు పేర్మి మీఱి
చేర సాక్షాత్కరింప సాష్టాంగ పడిరి.

✕

పరమ భక్తాగ్ర గణ్యలౌ భాగవతుల
దంపతుల చిన్ని ఫలముల దాన సంగ
కొంగు బంగారు గా మూట గట్టుకున్న
సుదతి మంగతాయి బిడ్డకెను సుతుల గూర్చి

తరణి నింగియు చిన్న, తల్లి దండ్రుల కన్న
పుత్ర సంతతి యందు సుమిత్ర మిన్న
వెంట నాచార్య సేవకై వెడలె నాడు
ప్రజల పాలించె నాకదు డా గంబుజ నమన.

✕

ఆచార్యుని చూడగానే ఎక్కడ ఎలా ఉన్నావో అలాగే సాగిలపడడం నీ ప్రపత్తికి నిదర్శనం.



బద్ధ జీవుల నెల్ల సముద్ధరింప
అపర రామానుజాంశతో నవతరించె
నీవు రామానుజుండు శ్రేష్ఠుండు నక్రమముగను
నాడు సంకల్ప రీతుల నడుపగలవు.

×

అరయ సప్తాక్షరీ ద్వయ చరమ శ్లోక
వరయమనుష్ఠాన వైరాగ్య వరము తోడ
జగతి నారాయణాంశ తేజంబు మీర
ధరణి నావలె నడచు (త్రి) దండధారి.

వేద పురాణాది వివిధ శాస్త్రంబులు
అలవోకగా బల్కు యులను నిలవు
దివ్య సూరుల భవ్య దివ్య ప్రబంధాల
భాష్యముల్ బోధించు భవ్యులకును
జిహ్వపై బంగారు సింహాసనము పైని
హాయవదనుడు కొలువై యు నిలుచు
ద్విశత శ్లోక సమాన విశద రామానుజ
మూర్తి నీవదు నిచ్చి సూక్తి నిచ్చు

విష్ణు సాహస్ర గీతల వేదులార
నేలమంతటి వివిపించి పలుక జేయు
చిన్ని బాలలకు పొంద వక్తృమును పొంది
అవేద యుతి రాజు పాదాల నా(శ్ర)యించు.

×

అమల కుల సాధ్వి! వినుము నే యతిరహస్య
మాతృభాషకై దక్షించు నవని యందు
పెద్ద తనయున వీడక ప్రేమ తోడ
రాజమాతను వాలె యతిరాజు జూచు.

×

పెద్ద జీయరు వివరింప పేర్మి గనుచు
భావి రామానుజార్య ప్రభావ శక్తి
పుత్రు నలమేలు మంగదా హృష్ట గానుచు
నేత్ర యుగళము పైటచే నొత్తు కానిచె.

సాక్షి యలమేలు మంగమ్మ స్వామి తోడ
విన్నవించెను నీ రీతి తనదు వాంఛ
జన్మ జన్మల మాకిట్టి జన్మ నిచ్చి
జనులు సేవించు రామానుజుల నేరె.

×

దంపతుల బిడ్డ, మాకు మీ దర్శనమును
దయను కలిగించుటే గాక నయము మీరు
పెద్ద వరముల నిచ్చిరి (ప్రీ)తి తోడ
స్వామి తిరువడి కివియె సాష్టాంగ నతులు.

×

దాని జాడక నేనుండ లేను సామి
స్వామి గమనింప నామది జల్ల బడును
నిత్య మంగళ హారతి నే నిచ్చు నెల్ల
వరము కోరితి జీయరు వారు నాకు

×

వద్దు యానతి తల వాల్చి వనయముండే
స్వామి పాదాబ్జ నీవు సాష్టాంగ పడగ
భావి జీయరు స్వామికి బాల్యమునను
స్వామి కృప జేసె మంగళాశాసనములు.

×

అంత హారతి నైనాని యతుల దాని
శుభద గళమున (శ్రీ) భట్టనాథు దారి
గరుడ గమనుండు గగనాన గనుపడంగ
గానమొనరించె 'పల్లాండు' జ్ఞాని గాన.

వరకు చార్యాది (శ్రీ) భాష్య పఠనమందు
కృష్ణ పక్షాన నవమిని తృష్ణ తోడ
చిన్న జీయరు గాంచుచు నీర్ప్ర గతిని
అలఘు నాచార్య తిరువడి యమర్చె.

ఆచార్యోపదేశం లేనివానికి ఆత్మజ్ఞానంపై విశ్వాసం కలుగదు.



# కనులముందు కదలాడిన కౌసల్యే యగునీమె

టి.పి. రాఘవాచార్య స్వామి కుముదవల్లి దంపతులు
సింహాచలం



పరమహంస పరివ్రాజకాచార్య, శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు ప్రపంచంలో అందరికీ అపర రామానుజులు. కానీ, మా దివ్య సాకేతంలోవారికి మాత్రం వారు సాక్షాత్తూ శ్రీ రామచంద్రులవారే! ఎందుకంటే వారు మా కౌసల్యమ్మగారి ముద్దుబిడ్డ!

ఓ మూడు పుష్కరాలవెనుక ఒకానొక కాశ్యప విశ్వామిత్ర మహర్షి లోక కల్యాణం కోసం ఓ మహాయజ్ఞం సంకల్పించినారు. ఆ యజ్ఞాన్ని "కొనసాగించడానికి" ఆయనకు ఓ సమర్థుడు, ఆర్జవం కలవాడు అయిన యువకుడు కావలసి వచ్చింది. ఆయన అప్పుడు, చిన్నారి రాముణ్ణి తనతో పంపండని మా రామచంద్రుని తల్లి కౌసల్యను కోరినారట! లోక సంరక్షణ చేయడానికి ఆ పిల్లవాణ్ణి తనకు అప్పగించండని ఆ లోకహితముని వేడికోలు! దాటరానిది కదా మహర్షి వాక్యం! దోయిలి ఒగ్గినాది ఆ తల్లి. మహర్షి ఆజ్ఞను ఔదల దాల్చినాది.

మా యమ్మ కలియుగ కౌసల్య కన్నుల నీరు బయటకు రానీయలేదు. కానీ, అవి లోపలికి కాలువలు కట్టినాయి. గుండె చెరువైనది - కాదు - కన్నీటి కడలే అయింది. కానీ, ఏమి చేయగలదు? ఒక ప్రక్క కడుపుతీపి, వేరొక ప్రక్క - లోక హితం కోరి చేయి చాచి నిలచిన మహర్షి! తానొక్కతే బాధపడినా, సకల లోక సంక్షేమం కోసమని, నూనూగు మీసాలైనా రాని మా రామచంద్రుణ్ణి ఆ కాశ్యప విశ్వామిత్ర మహర్షులవారి చేతబెట్టినది-గుండె రాయి చేసుకొంది. కానీ, ఆ కళ్ళు నేటికీ జీవనదీ స్రవంతులే!

ఆ ముదుసలి మునిపుంగవుని వెనుక తపోభూములకు తరలినాడు మా చిన్నారి రాముడు. ఆ త్రేతాయుగపు విశ్వామిత్ర మహర్షి రామచంద్రుణ్ణి తనతో తీసుకొని వెళ్ళడం ఒక తాత్కాలిక ప్రయోజనం కోసమని! ఒక ఏడాదికో, రెండేళ్ళకో తిరిగివస్తాడు; కన్నతండ్రిని కళ్ళచూస్తాను అనే నిబ్బరం ఆ కౌసల్యది. కానీ మా యమ్మ కలియుగ కౌసల్యకు అట్టి భరోసా ఏదీ!

త్రేతాయుగపు కౌసల్యమ్మకు, కుమారుడు వనవాసానికి వెళ్ళడం ఇంకో ఆఘాతం! అయినా, ఒకమారు విశ్వామిత్ర మహర్షితో యాగసంరక్షణకోసం పంపిన అనుభవం ఉంది కదా! ఎంతలే! పదునాలుగేళ్ళే కదా! మా ఊర్మిళ కన్నుమూసి తెరిచేలోగా మా రామ లక్ష్మణులు తిరిగిరారా! అనుకొంటూ గుండె దిటవు చేసుకొని శ్రీరామచంద్రుని వనవాసానికి అనుజ్ఞ ఇచ్చింది ఆ కౌసల్య!

**ఆచార్య ముఖవికాసమే నీ జన్మ సార్థకత. మిగిలినవి ఏవీ నిన్ను ఆదుకొనలేవు.**



మరి మా కలియుగ కౌసల్య! మహర్షి అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయిన బిడ్డ ఇంక తన ఒడిబిడ్డ ఎన్నటికీ కాడు అని తెలిసి కొయ్యబారిపోయి మ్రానైపోయిందే ! "నాలుగో గది" (సన్న్యాసం)లో అడుగిడిన రామయ్య మళ్ళీ "రెండో గది (సంసారం)"లోకి రానే రాడు అని స్పష్టంగా తెలిసి, గుండెను రాయి చేసేసుకుందే!

ఈ కాశ్యప విశ్వామిత్రుని వెంట నడచిన మా చిన్న రామయ్య, తాను ఒక కౌసల్యకు కొడుకై ఆమె కన్నీరు తుడవడం కన్నా, వేల లక్షల కోట్ల కౌసల్యలకు పెద్దకొడుకై, వాళ్ళందరినీ ఉజ్జీవింపచేసి, అలనాటి త్రేతాయుగపు రామచంద్రుడు అయోధ్యలోని సకల జీవరాశినీ పరమపదానికి తరలించుకొనిపోయినట్లు, ఈ నాటి ఈ మనందరిమధ్య నడయాడే నారాయణుడు, మన కౌసల్యమ్మ ముద్దుల పట్టి, ఒక నగరం అని కాదు, ఒక ప్రాంతం అని కాదు, ఒక దేశం అని కాదు, నేల నాలుగు చెఱగుల మధ్య ఉన్న జనాన్ని నారాయణ పదాశ్రితులను చేయడానికి కంకణం కట్టుకున్నాడు.

త్రేతాయుగం నాటి కౌశిక విశ్వామిత్రునితో వెళ్ళిన శ్రీరామునికి తమ్ముడు లక్ష్మణుని సహాయం ఉంది. కానీ ఈయనకి కనీసం లక్ష్మణుని తోడు కూడా లేదు. ఆ కౌశికుడు దశరథరాముని చేత తాటకీ, మారీచ, సుబాహ్వాది రాక్షసులని దునుమాడించి, ఆయనను సకల శస్త్రాస్త్ర విద్యా పారంగతుణ్ణి చేసి, మిథిలకు తీసుకొని వెళ్ళి, శివ ధనుర్భంగం చేయించి, సీతమ్మను ఆయన చేతబెట్టినాడు. కానీ, ఈ నాటి ఈ కాశ్యప విశ్వామిత్రుడో? ఈయనా కావలసిన విద్యలన్నీ నేర్పారు. కానీ, ఈయన సీతా స్వయంవరానికి తీసుకొని వెళ్ళడంగాని, సీతాకల్యాణం జరిపించడంగానీ చేయలేదు. కానీ ఓ మహత్తర బాధ్యతను అప్పగించినారు. "ఈ ప్రపంచంలోని ఆత్మలన్నీ సీతలే! నీవు వీటినన్నింటినీ, పది ఇంద్రియాలనే దశకంఠుని చెఱనుండి విడిపించి ఆత్మారాముని సన్నిధికి చేర్చవయ్యా" అని ఆదేశించారు.

మా కలియుగ కౌసల్య ఈ రామచంద్రుణ్ణి కాశ్యప విశ్వామిత్రునికి అప్పగిస్తూ, పెద్దాయన కలలు కంటున్న ఆ ప్రపంచం గురించి చెప్పి, " ఓయీ శ్రీరామచంద్రా! ఇదిగో, పెద్దాయన కన్న కలలను నిజం చెయ్యి! ఒక తల్లి కన్నీరు వేల, కోట్ల తల్లుల కన్నీటిని తుడవగలిగితే, ఒక కడవ కాదు, వేల కడవల కన్నీరు కారుస్తాను. ఇదే నీ యాగం! ఇదే నీ దీక్ష! ఇదే నీ తపస్సు! ఇదిగో, చూడు! కొందరు తమ కోసమే బ్రతుకుతారు. మరి కొందరు, తమ బ్రతుకు తాము బ్రతుకుతూ, ఇతరులకూ సహాయం చేద్దాం అనుకొంటారు. కానీ, ఉత్తములైనవాళ్ళు మాత్రం, ఇతరులకు సహాయం చేయడానికే భగవంతుడు తమకు బ్రతుకునిచ్చేడని విశ్వసించి అలా బ్రతుకుతారు. లోకాన్ని సేవించడంకోసం తమకు ఇష్టమైన వస్తువుల్నిగాని, మనుషుల్ని గాని వదులుకోడానికి వెనుకాడరు.

ఈ జీవుల్ని చూడు. వీరు భయంకర వ్యామోహపు బంధనాల్లో ఉన్నారు. వీళ్ళను ఆ బంధనాల్లోంచి విడిపించాలనే అసలు ఆ పెద్దాయన తపోభూములకు వచ్చేరు. నగర జీవితంలో ఉన్నప్పుడు కూడా ఈ జీవులను ఆ బంధనాలనుండి విడిపించాలనే ఎన్నో ప్రయత్నాలనూ, ఉద్యమాలనూ చేశారు. వారి సహాధ్యాయి గోపాల వశిష్ఠుడు వారికి తోడ్పడి వారిని ప్రోత్సహించినారు.

అహంకార మమకారాలనే ఆ రావణ కుంభకర్ణులను ఎదుర్కొని, ఈ జీవులనే సీతలను వారి కబంధ హస్తాలనుండి విడిపించాలని విశ్వప్రయత్నాలు చేశారు ఆ పెద్దాయన. దీక్షితుడై 25 సంవత్సరాలపాటు ఎన్నో యజ్ఞ, యాగ, తపో దీక్షలద్వారా జీవులను ఆ వ్యామోహ బంధాలనుండి విడిపించాలని విశ్వప్రయత్నాలు చేశారు.



కొంత వరకే నిలువరింపగలిగారు. రావణుణ్ణి ఎదుర్కొని అలసిపోయిన వృద్ధ జటాయువులా అయిపోయారు. సంపూర్ణ విజయం సాధించడానికి తపశ్శక్తితో బాటు దైవశక్తీ అవసరం అనిపించింది. యువశక్తి, యువరక్తం అవసరం అనిపించింది. వారి అభిప్రాయాన్ని మేమూ సమర్థించినాం!

ఫలితంగా ఆ పెద్దాయన నిన్ను తపో భూములకు తీసుకొని పోదలచినారు. నీవు ఆ దుష్ట శక్తులను ఎదుర్కోవడానికి కావలసిన పూర్వ రంగాన్నంతా ఏర్పరచినారు. నాయనా! రామచంద్రా! ఇంక నీవు కర్తవ్యోన్ముఖుడవు కమ్ము. క్రూరరాక్షసవ్యామోహ బంధనాలనుండి ఈ ఆత్మలను విడిపించు. నీ అవతార ప్రయోజనాన్ని నెరవేర్చుకో! నీకు అన్ని వర్గాలవారినుండీ సహకారం లభిస్తుంది" అని అంటూ కంటినీరు బయటకు రానీయక తాను గోరుముద్దలు పెట్టి పెద్దచేసిన ఆ రామయ్యతండ్రికి సుద్దులు చెప్పింది మా కౌసల్యమ్మ!

ఎంత గొప్ప రామచద్రునికి తల్లే అయినా, ఎంత కౌసల్యే అయినా, మా అమ్మ అమ్మే కదా! ఈ కలియుగ కౌసల్యకు హఠాత్తుగా శంకరులు జ్ఞాపకం వచ్చారు. అతడూ ఇలాగే! చిన్ననాటే, ఏదో సాకు పెట్టుకొని లోకాన్ని ఉద్ధరింపడానికని సామాన్య జీవితాన్ని వదలి ఆముష్మిక పథంలో సాగినాడు. మా యమ్మకు ఆ శంకరుల మహాభినిష్క్రమణం గుర్తుకొచ్చింది. ఆనాడు ఆ తల్లి శంకరునివద్ద తీసుకొన్న వాగ్దానమూ గుర్తుకొచ్చింది.

"తండ్రీ! ఒక్కమాట! నాకు ఒక్క వాగ్దానం మాత్రం చెయ్యవయ్యా! రామావతారకాలంలో ఆ జటాయువునకు పట్టిన అదృష్టాన్ని నాకు కూడా కల్గింపవయ్యా! ఎక్కడ ఉన్నా, నా అంత్యఘడియలలో నా ప్రక్కన ఉండి నా అంత్యేష్టి నీ చేతులమీద జరగనియ్యవయ్యా!" అని కన్నుల నీరిడుకొని బేలగా అడిగింది. "తప్పకుండా తల్లీ!" అని మాటయిచ్చి ముందుకు సాగిపోయాడు మన నడయాడే నారాయణుడు, మన దివ్య సాకేత నాయకుడు. ఇది ఎప్పుడో మూడు పుష్కరాల వెనుక సంగతి!

బంధువులారా! మీకందరకూ ఇప్పటికే అర్థం అయి ఉంటుంది ఆ కలియుగ కౌసల్య ఎవ్వరో! ఆ కాశ్యప విశ్వామిత్రుడెవరో! ఆ రామచంద్రుడెవ్వరో! ఆమె ఇంకెవ్వరో కాదు మన భాగ్యరాశి, మన పుణ్యాలప్రోవు, మన ఏడుగడ, మన జీయరుస్వామివారిని ఈ లోకానికి పరిచయం చేసిన దేవకి! మన దివ్యసాకేతంలో నడయాడే మన రాముని కన్న కౌసల్య! మన వేదాంత భానుణ్ణి ఈ లోకానికి పరిచయం చేసిన తూర్పుదిక్కు! శ్రీ పెద్దజీయర్‌స్వామివారి పూర్వాశ్రమంలోని పుత్ర వధువు! మనందరం ఎంతో గౌరవాదరాభిమానాలతో "అమ్మగారు, అమ్మగారు" అని కృతజ్ఞతాభావంతో వంగి నమస్కరించే మహాతల్లి! శ్రీమతి అలిమేలు మంగ తాయారమ్మగారు!

ఇంత చెప్పిన తరువాత ఆ కాశ్యప విశ్వామిత్రమహర్షి అంటే శ్రీ పెద్దజీయర్‌స్వామివారు అని, ఆ రామచంద్రుడంటే శ్రీ చిన్న జీయర్‌స్వామివారనీ వేరే చెప్పనక్కరలేదు కదా!

ఆనాటినుండి ఈ నాటిదాకా, 'అమ్మగారు' అదే నిబద్ధతతో, అదే క్రమశిక్షణతో, అదే గౌరవ మర్యాదలతో, ఎవరూ తమ తమ పూర్వ చర్యలను పునస్సమీక్షించుకోనక్కరలేనట్టుగా అద్భుతంగా, ఆదర్శప్రాయంగా, తమ శేష జీవితాన్ని ఒక యజ్ఞంలా, ఒక తపస్సులా, గడిపారు. చేతికందివచ్చిన పెద్దకొడుకు లోకాన్ని ఉద్ధరించడానికని కాషాయం ధరించినా, మొక్కవోని ధైర్యంతో, జీవితాన్ని, కుటుంబాన్ని నెట్టుకొచ్చిన ధీశాలి, స్థితప్రజ్ఞురాలు!

ఆలోచించనిదే నిర్ణయం తీసుకోరు, నిర్ణయం తీసుకున్న తరువాత, ఇంక మరలిపోరు. మాట తప్పరు. చెట్టు లక్షణాలే పిల్ల మొక్కకీ వస్తాయి! పట్టుదల, నిబద్ధత రక్తంలోనే ఉన్నాయి! "ఔటాఫ్ ది వే" వెళ్ళడమో, "ఎడ్వాన్‌టేజ్" తీసుకోవడమో ప్రశ్నే లేదు. నాకు శ్రీ జీయర్‌స్వామివారితో మూడున్నర దశాబ్దాల పరిచయం! నాకిప్పటికీ అమ్మగారి సంతానం ఎందరెందరో, ఎక్కడెక్కడ ఉంటారో, ఏం ఏం చేస్తూంటారో కూడా తెలియదు! అతి సామాన్య భక్తులలా వచ్చి అలా అలా వెళ్ళిపోతూంటారు. అమ్మగారు కూడా ఎంతో సాత్వికంగా, మరెంతో తాత్వికంగా,

సదాచార్యుని ఆశ్రయించక గడచిన జన్మలన్నీ వ్యర్థములే.



కోవెలకు వచ్చినా, ఉత్సవాలకు వచ్చినా అలా అలా చల్లగా, మెల్లగా సాగిపోతారే గాని, హడావుడి గందరగోళం చేయరు, ఇతరులు చేయబోయినా సహింపరు.

అన్నట్టు అమ్మగారు మంచి గాయని కూడా! మంచి అద్భుతమైన సంప్రదాయ గీతాలు ఉత్సవ సమయాల్లో పాడేవారు. రాఘవాచార్యులు ఓ మూడేళ్ళు శంషాబాద్ శ్రీరామనగరం ఆశ్రమంలో ఉండి జీయర్‌స్వామివారిని సేవించుకొన్నాడు. అప్పుడప్పుడు ఏవో ఓ నాలుగు పాటలు వ్రాస్తే, అమ్మగారు వాటిని చూచి ఎంత ఆనందపడేవారో! ఎంత ప్రోత్సాహపరచేవారో!

నా యిల్లాలు శ్రీమతి కుముదవల్లి అంటే అమ్మగారికి ఎంత ఆదరమో, ఎంత అభిమానమో! "ఎదురైనచో తన మదకరీంద్రము నిల్పి" అని శ్రీకృష్ణదేవరాయలవారు అల్లసాని పెద్దనను ఆదరించినట్లు, అమ్మగారు మా కుముదవల్లిని ఎంత దూరంలో చూచినా కబురుపంపి, పిలిపించి, ప్రక్కన కుర్చీవేయించి, కూర్చొనబెట్టి ప్రేమగా ఆదరంగా పలుకరించే అమ్మగారి సౌలభ్యం ఎంతటిదో కదా అని మురిసిపోతుంది నా యిల్లాలు.

అమ్మగారు మంచి 'సౌశీల్యవతి', అంటుంది మా కుముదవల్లి! అదేంటమ్మా, అంటే, " మహతాం మందైస్సహ నీరంధ్రేణ సంశ్లేషం సౌశీల్యం " ఒక గొప్పవాడు, ఒక తక్కువవానితో అరమరికలు లేనివిధంగా స్నేహంగా ప్రవర్తించడమే సౌశీల్యం అంటే అని కదా మీరంటూంటారు ! అమ్మగారు అంతగొప్పవారు. నేనేమో ఓ మామూలు సాదా సీదా వైష్ణవుని ఇల్లాలిని. అలాంటి నన్నే ఆమె ఎంత ఆదరంగా చూస్తారు! ఇది సౌశీల్యం కాక ఇంకేమిటండీ" అంటుంది నా యిల్లాలు.

అమ్మగారికి ఇంకో మంచి లక్షణమూ ఉందంటుంది మా కుముదవల్లి. "స్మితభాషీ, పూర్వ భాషీ చ రాఘవః అన్నట్టు, అమ్మగారు నేను పలుకరించి దాసోహం చేసేలోపలే ఆమే ముందుగా నవ్వుమొగంతో, "బాగున్నారా! రండి, రండి, ఇక్కడ నా ప్రక్కన కూర్చోండి " అని ఆదరిస్తారని మురిసిపోతుంది.

మా కుముదవల్లికి సింహాచలంలో ఉండడం కంటే దివ్యసాకేతంలో ఉండడం అంటేనే ఎక్కువ ఇష్టంగా ఉండేది. ఇక్కడే ఎక్కువ మానసిక ప్రశాంతత ఉంటుంది అనేది. దీనికి కారణమూ అమ్మగారే. ఆమెకు కూడా, నారాయణగూడలో ఉండడంకంటే దివ్యసాకేతంలో ఉంటేనే ఎక్కువ ప్రశాంతంగా ఉంటుందమ్మా అనేవారు.

అనారోగ్యకారణాలవల్ల మేం బసను సింహాచలానికి మార్చబోతూంటే అమ్మగారు ఎంతో నొచ్చుకున్నారు. "తల్లీ! అందరూ ఆరోగ్యానికి, క్షేమానికి, ప్రశాంతతకి, ఈ ఆశ్రమానికి వస్తారు. పిల్లలను చూడాలని అనిపిస్తే వెళ్ళి, ఓ నాలుగు రోజులు ఉండి, మళ్ళీ ఆశ్రమానికి తిరిగిరండి! ఇక్కడున్న తాత్త్వికత, ప్రశాంతత, ఇంకెక్కడా ఉండదు తల్లీ! విద్యార్థులు, గురువులు, పండితులు, పెద్దలైన మీవంటి లక్ష్మీనారాయణులవంటి పుణ్య దంపతుల జంటలు – ఇలాంటివాళ్ళందరూ ఉంటేనే ఆశ్రమానికి ఓ కళా, ఓ నిండుదనమూ! అంచేత తప్పకుండా మళ్ళీ ఆశ్రమానికి వచ్చేయండి, కొద్ది రోజులు విశ్రాంతి తీసుకొని" అని అమ్మగారు మరీ మరీ చెప్పేవారు, అంటుంది, కన్నీళ్ళతో మా కుముదవల్లి. అమ్మగారు ఒకటి రెండు మారులు మేం బసచేసి ఉన్న గెస్ట్‌హౌస్‌కు వచ్చి మా కుముదవల్లిని పలుకరించేవారు. ఆమెకు మా దంపతులంటే ఎంతో ఆదరాభిమానాలు.

**ఆచార్యుని ఆశ్రయం వల్ల సత్త్వగుణమే పునాదిగా ఏర్పడి మనలో భగవద్భక్తి అంకురిస్తుంది.**



కాలం ఎల్లకాలం ఒకేలా సాగిపోదుకదా! ఈ లోకంలో తాను నిర్వహింపవలసిన పాత్ర అయిపోయిందని భావించారు అమ్మగారు! నిశ్శబ్దంగా తిరిగిరాని లోకాలకు మరలిపోయినారు.

ఎక్కడో కేరళలో మరణించిన మాతృమూర్తి అంత్యక్రియలు చేయడానికి బదరికాశ్రమప్రాంతంనుండి ఆకాశమార్గంలో వచ్చిన ఆ అద్వైతాచార్యుని లాగే, అమ్మగారి అంత్యేష్టిని, ఇచ్చిన మాట ప్రకారం శ్రీస్వామివారే స్వహస్తాలతో నిర్వహించినారు! జటాయువునకు శ్రీరామచంద్రుడు ఉత్తమలోకాలను ప్రసాదించినట్టే ఇదీనీ !

ఈ లోకాలను నడిపిస్తూ పాలిస్తూ ఉండే “ఆయన”కు అప్పుడప్పుడు వింత వింత ఆలోచనలు వస్తూంటాయి! అందరూ ఆయన పాదాలను ఆశ్రయించడానికి ఆత్రుత పడుతూంటే, “ఏమిటి ఈ పాదాల రుచి! ఎందుకు ఇంతమంది భాగవతులు ఈ పాదాలకోసం పాకులాడుతున్నారు!” అని ఆలోచించి, సరే, ఆ రుచి ఏమిటో మనమే తెలుసుకుందాం, అని, మఱ్ఱిఆకుపై చిన్న పాపడుగా పండుకొని, ఆ కాలి బొటనవ్రేలును నోటబెట్టుకుంటున్నాడట! అలాంటి ఆ స్వామి తల్లిప్రేమ, అమ్మలాలనా, ఎప్పుడో రామావతారంలోనో, కృష్ణావతారంలోనో చూసేడు. పుట్టువెరుగని ఆ పుణ్యపురుషునికి అమ్మలాలనా, తల్లిప్రేమ ఎలా ఉంటుందో చూద్దామనిపించి, ఆ వ్యామోహం కొద్దీ మన అమ్మగారిని తన దగ్గరకు పిలిపించుకున్నాడు. పరమపదంలో నిత్య కైంకర్యాన్ని అనుగ్రహించేడు.

ఆయన కోరికను కాదనలేం! మనం ఎవళ్ళం కాదనడానికి! అస్మదాదుల అదృష్టం ఇంతవరకే! గడచిన మధుర ఘట్టాలను నెమరువేసుకోవడమే మనకు మిగిలింది.

❖❖❖❖❖❖



జగన్నాథుడైనా... అమ్మప్రేమకు బద్ధుడే...



# అమ్మగారు - వాత్సల్య మూర్తి

శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు
విశాఖపట్టణం



ఈ లీలా విభూతిని పరమ పావనం చేసే నిమిత్తమై భగవత్సంకల్పంతో అవతరించిన మహానుభావులు మన శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ పెద్ద జీయరుస్వామి వారు. మన సంప్రదాయాన్ని నలుదిశలా విస్తరింపచేసిన మహాపురుషులు. నాటికి మేమంతా శ్రీకాకుళ ప్రాంత వాసులం. భగవత్ భాగవత ఆచార్య కృప నిర్హేతుకంగా లభిస్తుందనడానికి మా కుటుంబం ఒక పెద్ద ఉదాహరణ. 1957 ప్రాంతాలని గుర్తు. శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వారు మా తండ్రి గారు ఉద్యోగరీత్యా కాకినాడ చేరుకున్న రోజులవి. అదృష్టం వరించింది మమ్మల్ని. పెద్దజీయరుస్వామి వారికి పూర్వాశ్రమంలో అగ్రజులైన శ్రీమాన్ రంగాచార్యులవారింట మాకు వసతి లభించింది. వారి వల్లనే పెద్ద జీయరుస్వామివారి వైభవాన్ని సమగ్రంగా తెలియగలిగాం. రంగాచార్యుల వారి కుటుంబంతో అత్యంత సాన్నిహిత్యం ఏర్పడడం, వారి ద్వారా స్వామివారి దర్శనం పొందగలగడం, పెద్ద జీయర్ స్వామివారి వాత్సల్యానికి పాత్రులం కావడం చకచకా జరిగిపోయినాయి. "ఆ వాత్సల్యం నిరంతరమై కొనసాగడం మనం చేసుకున్న పుణ్యం, ఇంతటి అదృష్టానికి నోచుకున్నాం" అని నాన్నగారు తృప్తిగా తరచూ తలుస్తూ ఉండేవారు. అయితే అది అక్కడితో ఆగలేదు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయరుస్వామి వారి విశేష కటాక్షం కూడా మా కుటుంబంపై అదేవిధంగా ప్రసరించడం మా పురాకృత విశేషం. ధన్యులం.

2002 నాకొక మధుర స్మృతిగా ఏనాటికీ నిలిచిపోగల సంవత్సరం. విశాఖపట్టణం, షీలానగర్‌లో మా యింటిని తమ పవిత్ర పాదస్పర్శతో పునీతం చేసేందుకై శ్రీచిన్న జీయర్ స్వామివారు విచ్చేశారు. నాన్న గారితో ఇష్టాగోష్ఠి నడుస్తోంది. మధ్యలో నా వైపు ఒకసారి చూశారు స్వామి. "ఈ సంవత్సరం మన జెట్ దోమల్ గూడ హైదరాబాదులో ధనుర్మాస ప్రవచనం మీరు చేయరాదా" అన్నారు. ఆ రోజు నాకు కలిగిన ఆనందం వర్ణనాతీతం. వారి ఆజ్ఞమేరకు ధనుర్మాసం నాటికి హైదరాబాద్ చేరుకున్నాను. కారణం గుర్తులేదు కానీ మొదటి పదిహేను రోజులు నేనొక్కడినే అక్కడ ఉన్నాను. అయితేనేం అమ్మగారితో సన్నిహితంగా మెలిగే ఒక అవకాశం ఆనాడు లభించింది. తేజోవంతమైన ముఖం ఆ తల్లిది. వీడని చిరునవ్వు ఆమె సొంతం. భేషజం ఎరుగని మాట ఆమెది. ఒకరి మంచినే ఎల్లప్పుడూ కోరుకునే మంచి మనసున్న తల్లి. హైదరాబాద్ చేరిన తర్వాత నీటి మార్పువల్లనేమో గొంతు పట్టేస్తే ఆ తల్లి స్వయంగా వేడి నీళ్లు కాచి తెచ్చి "ఇది తాగండి, గొంతు విడుతుంది. సుఖంగా ఉంటుంది

**ఆచార్య విషయంలో ప్రతిపత్తి లేని జీవుని భగవంతుడు అనుగ్రహింపడు**

అంటూ ఆమె నాపై చూపిన ఆప్యాయత తలచుకొన్నప్పుడల్లా ఈ నాటికీ నా మనసు కృతజ్ఞతాపూర్ణం అవుతుంది. చిన్న జీయర్ స్వామి వారి తిరుప్పావై ప్రవచనం ఉదయం టీవీలో ప్రసారమయ్యే సమయానికి కబురు పంపేవారు. ఆమె సమీపంలో ఉంటూ, స్వామివారి ప్రవచనం వింటూ, ఆనందంగా గడిపిన భాగ్యవంతుడిని. ఆ నాలుగు నాళ్లే కాదు, ఆ తరువాత కూడా ఏ సందర్భంలో కలిసినా అదే ఆప్యాయత కనబరచేవారు. చిన్న జీయరు స్వామివారి షష్టిపూర్తి మహోత్సవాల సందర్భంలో చివరగా ఆమెను సేవించుకోగలిగాను.

"కౌసల్యా సుప్రజా రామ" రామచంద్ర ప్రభువును ధర్మరక్షణకై ఈ లోకానికి అందించిన తల్లి కౌసల్య అయితే ఆ రామచంద్రుని ఆరాధ్య దైవంగా భావిస్తూ ధర్మ రక్షణకై పాటుపడుతున్న అపర రామానుజులను ఈ లోకానికి అందించిన తల్లి మన అమ్మగారు.

సహస్ర చంద్ర దర్శనాన్ని చేసి, పరమాత్మ సంకల్పంతో ఆచార్య పాదసన్నిధికి చేరారు అమ్మగారు. ఈ వార్త వినగానే మనసు చాలా కలతపడింది. అయితే మనం స్వామి సంకల్పానికి అనుగుణంగా ప్రవర్తించవలసినవారమంతే.




ఆచార్యుని నుండి దూరమైన జీవుడు - జలం నుండి వీడిన పద్మంలా శుష్కిస్తాడు





# జాతస్య హి ధ్రువో మృత్యుః

**కందాడై రామానుజాచార్యులు**

**హైదరాబాద్**

శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య శ్రీమదుభయవేదాంత ప్రవర్తక శాన్త శమదమాది అనంత కళ్యాణ గుణ పరిపూర్ణులైన జగద్గురువులైన అస్మత్ ప్రాప్య ప్రాపకభూతులై వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి వారి దివ్య పాదపద్మముల సన్నిధిలో శ్రీమద్భాగవత ఆచార్య శ్రీపాదరేణు స్వరూపుడనగు డాక్టర్ కందాడై రామానుజాచార్య దాసుడు అనేక ప్రణామపూర్వకముగా చేయు విజ్ఞాపనము.

జగదాచార్యవర్యా !

11-9-2020 శుక్రవారం రాత్రి దేవరవారి మాతృమూర్తి గారు స్వాచార్య తిరువడిగళ్‌ను చేరుకున్నారు అని సమాచారం తెలుసుకొనిన దాసులము అనంత అగాధ విచార సముద్రంలో మునిగిపోయినాము.

**పరమ సౌమ్యమూర్తి, వాత్సల్యమూర్తి, నిరంతర స్మేర విరాజిత మూర్తి, పద్మ శోభితురాలు, సనాతన సంప్రదాయ నిష్ఠురాలు, ప్రముఖ జగద్గురువులకు కోడలు, మరొక జగద్గురువుల వారికి తల్లిగా విశిష్ట వ్యక్తిత్వము** కల తమ మాతృమూర్తి మనకు విశేషించి అస్మాదృశులకు దూరమైనందులకు విచారించుచున్నాము. తమ అనుభూతిని పంచుకుంటున్నాము. జాతస్య హి ధ్రువో మృత్యుః కదా. విధి విధానము దేహధారులకు అనుల్లంఘనీయము. వారు తిరునాడుకు వేంచేసి దేవదేవుని శేష వృత్తికి పాత్రులగుచున్నారని తలంచుచున్నాము. అనారోగ్య కారణము వలన ఇల్లు విడిచి బయటకు వెళ్లలేని స్థితిలో వెళ్ళరాదని వైద్యుల సూచన మేరకు ప్రత్యక్షముగా సేవించుకొని అనుతాపమును పంచుకోజాలక పోయినందులకు విచారిస్తున్నాను. ఇంటిలోనే ఉండి శ్రీభాష్య శృత ప్రకాశికానువాద సేవను కొనసాగించుచున్నాను. దేవరవారి మంగళాశాసనములను ఆకాంక్షిస్తూ...

**విత్తము కొద్దీ విభవము, విద్య కొద్దీ వినయము.**



# మహోన్నత మాతృమూర్తి




డా. ముడుంబై నరసింహరంగాచార్య

M.O.L., Ph.D.

గీతాభవనం, వరంగల్.


మానవ జీవనమార్గాన్ని నిర్దేశించేవి వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు. మానవ జీవన గమనానికి పథనిర్దేశం చేసింది తైత్తిరీయోపనిషత్తులోని "శీక్షావల్లి". అందు ప్రధానంగా తల్లి, తండ్రి, గురువు, అతిథులను దైవముగా భావింపుమని ప్రబోధింపబడింది. ఆ నలుగురిలోను మాతృమూర్తికి అగ్రతాంబూలాన్నిచ్చింది ఆ ఉపనిషత్తు. శ్రీరామాయణములోని "కౌసల్యా సుప్రజా రామ" అన్న శ్లోకము దీనిని దృఢీకరిస్తున్నది. ఇంతటి మహోన్నత మాతృమూర్తి ఆ.చి. అలిమేలుమంగమ్మ. భగవద్రామానుజులను ఆబాల్యము తీర్చిదిద్ది ఈ లోకానికి అందించిన తల్లి కాంతిమతీదేవివలె మన శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామియను స్వాతిముత్యాన్ని ప్రసాదించింది ఈ అలిమేలుమంగమ్మతల్లి.

శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామివారు పరమపదించిన సమయంలో చుక్కాని లేని నావవలె కునారిల్లుతున్న మనకు అమ్మ చుక్కానియై చిన్నజీయర్‌స్వామి రూపంలో మార్గదర్శనం చేసిన చల్లనితల్లి మహోన్నతమూర్తియైన అలిమేలుమంగమ్మ. ఇట్టి మహోన్నత మూర్తియైన అమ్మ ఈ నెల 11వ తేదీన పరమపదనాథుని సేవకై ఇక్కడినుండి వైకుంఠమునకు ప్రయాణమయింది.

ఆ తల్లి చూపులో ఎంత వాత్సల్యమో, పలకరింపులో ఎంత సౌజన్యమో, మార్దవమైన కరస్పర్శలో ఎంత ప్రేమయో వాక్కులకు అందదు అనుభవిస్తేనేగాని తెలియదు.

సాధారణంగా ఎవరైనా తండ్రివద్దకంటే కూడా తల్లిచెంతనే చనువుతోడి వాత్సల్యమునునుభవిస్తారు. తమ తండ్రిగారు వైద్యులైనందువల్ల రోగులకు చికిత్సలు, ఆయుర్వేదగ్రంథాల అధ్యయనాలతో ఎక్కువకాలం గడుపుతుండడంవల్ల మన జీయర్‌స్వామివారు తల్లిగారి చెంతనే మాతృవాత్సల్యాన్ని పరిపూర్ణంగా అనుభవించారు. **ఆబాల్యము ఆశ్రమస్వీకారము చేయువరకు మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని ప్రసాదించి, ఆధ్యాత్మిక తత్త్వాన్ని శ్రీమన్నారాయణ పరత్వాన్ని, సంప్రదాయ వైభవాన్ని ఉగ్గుపాలతో రంగరించి పోసి పోతపోసిన పరిపూర్ణమూర్తిగా తీర్చిదిద్దిన మాతృమూర్తి ఈ అమ్మ.**

**కోపం మనసులో కాదు మాటలో ఉండాలి, ప్రేమ మాటల్లో కాదు మనసులో ఉండాలి.**



అందుకే **శ్రీ చిన్నజీయర్‌స్వామివారు అమ్మగారు నా తొలి గురువు, తొలి నేస్తమని సంభావించేవారు.** యశోద చెంత బాలకృష్ణునివలె మన స్వామివారున్ను, ఎన్ని చిలిపిపనులు చేసినా, మారాం చేసినా తల్లి చెంతనే. ఇంటి బాధ్యతంతా తల్లిగారే ఎక్కువగా స్వీకరించడంవల్ల, ఎక్కువ సమయం అమ్మవద్దనే ఉండడంవల్ల, స్తోత్రాలు, పాశురాలు మొదలగు సంప్రదాయ పాఠాలను తల్లిగారి చెంతనే అభ్యసించినారు శ్రీ స్వామివారు. బాల్యంలో తమ గృహంలో ధనుర్మాసం రోజులలో పండుగశోభను సంభావించు కుంటూ బాలకృష్ణుడు వెన్నముద్దను ఆస్వాదించినట్లు తల్లిచేతి ధనుర్మాసం పొంగలి కమ్మదనాన్ని స్మరించుకునేవారు మన స్వామివారు.

అమ్మగారితో బాల్యంలో మన స్వామివారు అనుభవించిన మాతృవాత్సల్యాన్ని మా తండ్రిగారు శ్రీమాన్ ముడుంబై రామానుజాచార్యస్వామివారు ఆయా సందర్భాలలో మాకు చెబుతుంటే మధురంగా వీనులకింపుగా మేము అనుభవిస్తుండేవారం.

శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామివారి సమయంలోకంటే శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామివారి ఆశ్రమ స్వీకారానంతరమే నాకు అమ్మతో ఎక్కువగా పరిచయభాగ్యం కలిగింది. ఏ ఉత్సవాలలో కాని, శంషాబాద్ ఆశ్రమంలోగాని వారిని సేవించిన సమయాలలో మృదుమధుర మందహాసంతో అమ్మ మమ్ము పలుకరించిన తీరు ఆజన్మాంతము మరపునకు రాదు.

మన శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామివారి ఆజ్ఞననుసరించి దాసుడు హైదరాబాద్‌లోని జెట్‌లో ధనుర్మాస కాలక్షేపము చేయు రోజులలో వేంచేసి ఉపన్యాసమునాసాంతము విని ఆశీర్వాద సౌభాగ్యాన్ని అందించిన అమ్మ వాత్సల్యము నా జీవనంలో ఎన్నడూ మరపురానిది.

ఏవో కొన్ని సందర్భాలలోనైనా ఆ అమ్మ వాత్సల్యాన్ని చూరగొన్న నా జీవితము ధన్యమైనది.

**ఆధ్యాత్మిక దీప్తిని ప్రకాశింపజేసి, సమతాస్ఫూర్తిని వికసింపజేసిన భగవద్రామానుజులను ఈ లోకానికి అందించిన కాంతిమతీదేవివలె పెద్దస్వామివారు పరమపదించిన పిదప వారు కొనసాగించిన ఆధ్యాత్మిక పథమును రాజమార్గముగా తీర్చిదిద్ది ఖండఖండాంతర వ్యాప్తిగా రామానుజ కీర్తిపతాకను ఎగురవేయుచున్న స్వాతిముత్యం శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామివారిని ఈ లోకానికి అందించిన మాతృమూర్తి** ఆకులమన్నాడ చిలుకమఱ్ఱి అలిమేలు మంగమ్మగారు. నిత్యము కృతజ్ఞతగా వారిని స్మరించుకొనుటకన్న ఈ దాసునకు వేరు సౌభాగ్యము లేదు.

❖❖❖❖❖❖

చిరునగవుతో దయకురిసే చూపులతో చింతను దూరంచేయగలిగేది తల్లే!



# జగత్తునకంతటికి వెలుగునందించిన త్యాగమూర్తి



ముడుంబై శ్రీమన్నారాయణాచార్య
గీతాభవనం, వరంగల్.

మన భారతదేశములో అపరరామానుజులుగా కీర్తిని గడించిన శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారు అనేక విధములుగ జీవులను సముద్ధరిస్తున్న రోజులవి. 108 శ్రీరామ మహాక్రతువులు, శ్రీమదష్టాక్షరీ కోటిహవన క్రతువు, గాయత్రీ మహాక్రతువు, శ్రీ లక్ష్మీనారాయణ సహస్రహోమకుండ యజ్ఞము, 108 స్వాధ్యాయ జ్ఞానయజ్ఞములు మొదలగు యజ్ఞ యాగాది క్రతువుల ద్వారా, ఉభయవేదాన్త పండితోపన్యాసములు చర్చల ద్వారా, శ్రీమద్భగవద్గీతోపన్యాసములద్వారా భారతీయులనందరిని చైతన్యం చేస్తూ ఉజ్జీవింపజేస్తున్న శ్రీశ్రీశ్రీ జీయర్‌స్వామివారికి ఆలంబనగా వారి జీవితోద్దేశ్యములను నెరవేర్చే భవిష్యత్ ప్రతినిధిని శోధిస్తున్న రోజులవి.

శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామివారి మనోరథమును నెరవేర్చుటకు, ప్రస్తుతము మనమందరము సేవించి తరిస్తున్న శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామివారిని అందించిన మాతృమూర్తి శ్రీమతి ఆకులమన్నాడ చిలుకమఱ్ఱి అలిమేలుమంగతాయారమ్మగారు.

ఆ రోజులలో ఇంత అసమానమైన త్యాగాన్ని అమ్మగారు ప్రదర్శించనిచో మనము ఇప్పుడు ఏ విధముగా ఉండేవారమో తెలియదు.

ఒక దీపమునుండి మరొక దీపము ప్రకాశించినట్లుగా, పెద్దజీయర్‌స్వామివారి తరువాత యావత్ప్రపంచమున కంతటికి, అనేకమంది జీవకోటికి మార్గదర్శనము చేస్తూ భగవత్కృపా కటాక్షములనందరికి లభింపజేస్తున్న మన శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామివారిని ప్రసాదించిన మన తల్లి శ్రీమతి అలిమేలు మంగతాయారమ్మగారు.

శ్రీవైష్ణవలోకమంతా తాము ధైర్యముగా శ్రీమన్నారాయణుని నామాన్ని "జై శ్రీమన్నారాయణ" నామోచ్చారణతో నైతేనేమి, స్వరూపధారణతోనైతేనేమి, వేదాధ్యయన సంపన్నులుగా ఇంతమంది శ్రీవైష్ణవులను తీర్చిదిద్దుటలోనైతేనేమి, ఒకటా రెండా ఇట్లు అనేక విధములుగా తీర్చిదిద్ది తరింపజేస్తున్న శ్రీశ్రీశ్రీ స్వామివారిని మనకందించి మనకందరికి మహోపకారమొనరించి, త్యాగమొనరించి, ధన్యురాలై పరమపదనాథుని సేవించుటకై వెడలిన త్యాగజీవి అయిన శ్రీమతి అలిమేలు మంగతాయారమ్మగారిని మనము ఏమిచ్చి ఋణము తీర్చుకొనెదము?

కేవలము మనము శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామివారి మార్గదర్శనములో నడుస్తూ వారు చూపిన ఆదర్శములను పాటిస్తూ మనమందరమున్ను ఆ పరమపదనాథుడైన శ్రియఃపతియొక్క కటాక్షమునకు పాత్రులమై తరించినచో అమ్మగారు చేసిన త్యాగమునకు సార్థకమొనరించినవారమగుదుము. అలా మనమందరము శ్రీశ్రీశ్రీ స్వామివారి బాటలో నడుస్తూ తరించెదముగాకయని భావిస్తున్నాను.

❖❖❖❖❖❖

దేశంకోసం ధర్మంకోసం సంతానాన్ని ధారపోసే ధైర్యశాలి, త్యాగశీలి కాగలదు తల్లి



# మాతృదేవతకు శ్రద్ధాంజలి

**చలమచర్ల వేంకట శేషాచార్యులు**



తల్లి అంటే మూర్తీభవించిన వాత్సల్యం. అది ఆమెకు మరో పేరు.

గోమాత అప్పుడే పుట్టిన లేగపై కురిపించే ప్రేమను, తన జీవితకాలమంతా అందించేది అమ్మ. అప్రయత్నంగా, అలవోకగా తన సంతానంపై జీవించినంతకాలం ప్రసరింపజేసే మధురానురాగం ఆమెది.

పిలిస్తే దేవుడు పలుకవచ్చు. అడిగితే వరాలు కురిపించనూవచ్చు. అమ్మనయితే అడిగే పనిలేదు. పిలిస్తే చాలు పరవశించిపోతుంది. మనసెరిగినది కనుక అడగకుండానే అవసరాలన్నీ తీర్చి సంతోషపెడుతుంది. అందుకే "న మాతుః పరదైవతమ్" – తల్లిని మించిన దైవం లేదు అన్నారు.

సహనంలో భూమాతకు ఎవరూ సాటిరారు. ఆమెపై గౌరవంతో నిద్రలేస్తూనే నేలమీద కాలుమోపే ముందు, అమ్మా! శిరస్సుతో తాకవలసిన నిన్ను నా పాదాలతో స్పృశిస్తున్నాను. నా అపచారం క్షమించు పాదస్పర్శం క్షమస్వ మే అంటూ ప్రార్థించడం మన సంప్రదాయం. అయితే అంతకంటే సహనశీల, పూజ్యురాలు కన్నతల్లి. "మాతా గురుతరా భూమేః " అన్నది మహాభారతం. ఆమెనెలా స్మరించకుండా ఉండగలం?

ధర్మసంస్థాపనకై దివినుంచి దిగివచ్చిన రామ, కృష్ణాది అవతారపురుషులైనా, చక్రవర్తి అయినా, ఋషి అయినా, సన్న్యాసి అయినా, పండితుడైయినా, పామరుడైయినా ఒక తల్లి బిడ్డడే కదా! తనయుడు ఏడిస్తే తల్లి బుజ్జగిస్తుంది. ఏమీ తిననంటూ మారాం చేస్తే, ఒడిలో పొదువుకొని, ఇష్టమైన మాటలతో మరిపిస్తూ, మురిపిస్తూ తినిపిస్తుంది. ఆకాశములో వెలుగులీనే చందమామ కావాలని మంకుపట్టు పట్టి వెక్కివెక్కి ఏడుస్తుంటే, పాలుపోసిన పళ్లెంలో చంద్రుణ్ణి చూపి ముచ్చట తీరుస్తుంది.

"పుత్రులు కలగాలని తల్లిదండ్రులు ఎన్నో వ్రతాలు ఆచరిస్తారు. ఉపవాసాలు చేస్తారు. దేవతల్ని ఆరాధిస్తారు. కొడుకు పుట్టినది మొదలు తల్లి వానిని తన స్తన్యమిచ్చి, పెద్దవాడవుతూ ఉంటే తగిన ఆహారాదులు అందించి, బుజ్జగిస్తూ వాడిని కంటికి రెప్పలా కాపాడుతుంది. తల్లిదండ్రులు చేసిన ఉపకారానికి తనయుడు ఏమిచ్చినా అది వారికి ప్రత్యుపకారం కానేకాదు." ఇది శ్రీ రామాయణం అయోధ్యకాండలో శ్రీరామచంద్రుడు వశిష్ఠ మహర్షితో పలికిన మాటలు.

అలివేలు మంగతాయారమ్మ గారి మామగారు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయరు గారు. ఆయన సన్న్యాసాశ్రమం స్వీకరించి, ఆసేతు హిమాచలం వేద, శాస్త్ర, ఆగమ, దివ్యప్రబంధ సదస్సులు నిర్వహించారు. బదరీ క్షేత్రంలో ఆంధ్రాశ్రమ నిర్మాణం, నిరంతర తదీయారాధనలు ఏర్పాటు చేశారు. సత్య సంకల్పులు, 108 కి

**కాలదన్నినా పాలబువ్వ ప్రేమారా తినిపించే వాత్సల్యమూర్తి అమ్మ**



పైబడిన రామ క్రతువులు దేశమంతటా నెలకొల్పినవారు. తన కుమారుడు ఆ మహానుభావుని పర్యవేక్షణలో వివిధ శాస్త్ర పారంగతుడు కావడం ఆ తల్లికి ఎంత ఆనందం కలిగించిందో! ఎప్పటికైనా తన కుమారుడు పెండ్లి చేసుకొని, వంశోద్ధారకుడు కూడా కావాలని ఆమె మాత్రం ముచ్చటపడి ఉండదా?

కానీ విధివిలసితం మరోవిధంగా జరిగింది. పెద్ద జీయరువారు ఆకస్మికంగా పరమపదించటం, అనతి కాలంలోనే ఆమె కుమారుడు పెళ్లి చేసుకోవడం మాట అటుంచి, తాను సన్యాసాశ్రమం స్వీకరించటానికి తల్లి అనుమతి కోరటం జరిగింది. ఆమె ఎంత ఆవేదన సహించి అనుమతించి ఉంటారో కదా!

అయినా తనయుని ఆశయం తన ఆశయంకంటే మహోన్నతమని అని ఆమె భావించింది. తండ్రిమాట తలదాల్చి పద్నాలుగేళ్ళు వనవాసానికి సిద్ధపడిన తనయుడు రామచంద్ర స్వామి తన చెంతకు వచ్చి అందుకు అనుమతి కోరగా ఆ తల్లి తల్లడిల్లిపోయింది. చివరకు కుమారుని పితృవాక్యపాలన, సత్యనిరతీ కారణంగా ఆమెకు అనుమతించక తప్పలేదు. గడువు ముగియగానే అయోధ్యకు తిరిగివచ్చిన కొడుకును, కోడల్నీ చూసిన ఆమె కలత తీరింది. కానీ అలివేలు మంగతాయారమ్మకు కలిగే క్లేశం తీరేది కానే కాదు కదా!

వంశోద్ధారకుడు కావలసిన తనయుడు లోకోద్ధారకుడు కానున్నాడని ఆ తల్లి గుండె దిటవు చేసుకున్నది. "న కర్మణా, న ప్రజయా ధనేన, త్యాగేనైకే అమృతత్వ మానశు:" అనే మహానారాయణోపనిషత్తు వచనం సత్యం చేస్తూ తనయుడి సన్యాసాశ్రమ స్వీకారానికి ఆ తల్లి అనుమతించింది. ఇది ఏ మాతృమూర్తీ చేయలేని మహాత్యాగం!

తనయుడు తురీయాశ్రమం స్వీకరించి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరుగా, పెద్దస్వామి వారి మంగళాశాసన ప్రభావంచేత భారతదేశంలోనే కాక విశ్వమంతటా పర్యటించి, సకల ఆస్తిక లోకానికీ, విశేషించి విశిష్టాద్వైత పాలనలో జనానికి మార్గదర్శియై, అపర భగవద్రామానుజులుగా విఖ్యాతులు కావటం, భారతదేశంలో సమాజ శ్రేయస్సుకై ఆయన ఎన్నెన్నో శాశ్వత కార్యక్రమాలు చేపట్ట సంకల్పించటం, భగవద్రామానుజ సహస్రాబ్ది సందర్భంగా భగవద్రామానుజుల 216 అడుగుల కాంస్య విగ్రహాన్ని నెలకొల్ప పూనుకోవటం వంటి పరమాద్భుత సన్నివేశాలు చూసి ఆమె ఎంతగా పొంగిపోయి ఉంటారో. తనయుని షష్ట్యబ్దపూర్తి ఉత్సవాలలో పాల్గొని ఎంతగా పులకించిపోయారో.

ఆమె కారణజన్మురాలు. తనయుడు జగదాచార్యుడై ఆమె జీవితానికి సార్థకత కలిగించారు. పండిన వయస్సులో ఆ తల్లి జగదాచార్యుని వైభవాన్ని చూస్తూనే పరమపదించారు.

"జాతస్య హి ధ్రువో మృత్యుః" ఆమె మృత్యువును ప్రియాతిథిగానే మన్నించారు. ఆమె లేనిలోటు ఎన్నటికీ తీరదు. ఆమె సాత్వికజీవనం అందరికీ ఆదర్శప్రాయం.

అలివేలు మంగతాయారమ్మగారి వైభవాన్ని ఈ విధంగా స్మరించుకుంటూ ఆమెకు చేసే వాఙ్మయ కైంకర్యమిది.

ఆకాశంలో పగలంతా ఎగిరిన పక్షి సాయంకాలానికి గూటికి చేరిందంటే, తానింకా ఎగరవలసిన ఆకాశం ఏమీ మిగలలేదని కాదు. తనకు ఎగిరేశక్తి ఇక ఎంతమాత్రం లేకనే. అనంత కళ్యాణ గుణపూర్ణుడైయిన పరమాత్మను స్తోత్రం చేసే భక్తుడు నాటికి ఆ పని చాలించాడంటే అతడు భగవద్గుణాలన్నీ వర్ణించేసినట్లు కాదు. ఆపై వర్ణించే శక్తి క్షీణించినందువల్లనే. అలాగే అలివేలు మంగతాయారమ్మగారి గొప్పదనాన్ని ఇంతవరకే చెప్పడం వాత్సల్య నిధి అయిన ఆ తల్లిని సమగ్రంగా వినుతించామని కాదు. ఇంకా చెప్పటానికి మాటలు చాలకనే.





జగన్మాతకు జగదాచార్యుల దాసోహం













జగత్కుటుంబిని జగన్మాతతో వైదిక ధార్మిక సంతానం...



# మాతృమూర్తి

కొమాండూర్ ఇళైయవిల్లి స్థలశాయి
భద్రాచలమ్



1. శ్రీరఘురాము తల్లియును శ్రీయదునందను తల్లియున్ మరో
మారొక తల్లిగా మరల మాధవునే గనే, చిన్న జీయరై
వారు త్రిదండియౌ పరమ వైదిక ధర్మము వృద్ధిచేయగా
వీరగు భాష్యకారులని విజ్ఞులె యెంచగ పెంచె తీరుగన్ ।

2. అమ్మ యనే పదంబునకు నర్థము ఈయలమేలు మంగ మా
యమ్మ యదెందుకన్న తనయాత్మజు, వైష్ణవ ధర్మవృద్ధికై
సమ్మతి దెల్పి యాజ్ఞనిడ సర్వము వీడి యతీంద్రుడైనమా
జమ్మున విష్ణుభక్తి నడయాడగ జేసెను చిన్న జీయరుల్ ।

3. మన ఘన సంప్రదాయము సమాజమునందు ప్రసిద్ధియౌటకై
తనదగు పుత్ర రత్నమును త్యాగముజేసె, యతండు సన్యసిం
చిన చిన జీయరాయె పెద జీయరు వోలె జగంబు నంతటన్
ఘనమగు వైష్ణవంబు పరగన్ కృషిసల్పె పగళ్ళు రాత్రులున్ ।

4. ఆ మహనీయురాలి తపమంతయు వైష్ణవ తేజమై జగత్
క్షేమము గల్గజేసె యతిశేఖరుమూర్తిని సుప్రతిష్ఠితం
బై మనగల్గురీతి పరమాత్ముని దివ్య సుధామముల్ తపో
భూమిగ జేసె యాత్మజు తపోమయ మూర్తిని తీర్చి దిద్దుచున్ ।

5. మాధవ సేవగా సకల ప్రాణుల సేవయు సేయుచున్ సదా
సాధన చేయుచున్ తనదు సాత్వికమైన సుసంప్రదాయమున్
ఈధర నన్ని తీరులుగ నీశ్వరు గొల్చెడి వారలన్ మహా
సాధుత నాదరించె మనసా తనయాత్మజు మాట నిల్పుచున్ ।

❖❖❖❖❖❖

**తనయులను తీర్చిదిద్ది వర్ధిల్లచేయడమే తపస్సు తల్లికి**



# మాతృస్మృతి

**శ్రీమాన్ కరిపురుషోత్తమాచార్యులు**
**యజుర్వేద ఘనపాఠి, తిరుపతి**



**విశిష్టాద్వైతసిద్ధాన్తప్రచారైకవిహారిణే !**
**శ్రీమన్నారాయణాచార్య స్వామినే నిత్యమంగళమ్!!**

అస్మదాచార్యులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణరామానుజ జీయరుస్వామి వారి తల్లిగారైన శ్రీమదాకులమన్నాడ చిలకమర్రి అలవేలు మంగతాయారమ్మగారు ఆచార్య తిరువడిని అలంకరించిన సందర్భంగా "ఆచార్యమాతృస్మృతి" చేసుకోవడం మన విధేయత, విహితమూను !

లోకంలో మానవుని ఉనికి ప్రపంచానికి తెలియడంలో మాతాపితరులు ఇరువురిదీ ప్రధానపాత్రే ఐనా తల్లికి ఉండే ఔన్నత్యం మరింత విశిష్టమైనది. **"గర్భధారణపోషణాభ్యాం పితుః మాతా గరీయసీ"** అని శాస్త్రవచనం. పుట్టుకనూ, అటుపిదప ఎదుగుదలకూ తండ్రి కారణమే, కానీ ప్రసవాత్పూర్వమూ, తదనంతరమూ అతడు చేయలేని, వీలుకాని పని తల్లిమాత్రమే చేయగలదు. గర్భాన్ని ధరించుట, పోషించుట అను రెండు బాధ్యతలను ఆమెమాత్రమే నిర్వహించగలదు. అందుచేత అతడికంటే ఆమెయే గొప్పది అని ప్రశంసిస్తున్నది శాస్త్రం మాతృత్వమహత్వాన్ని.

వేదం మాతృస్థానానికి దైవత్వాన్ని ప్రతిపాదించింది తైతిరీయోపనిషత్తులో శీక్షావల్లిలో "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ" అను మంత్రం తల్లి, తండ్రి, గురువు, అతిథుల ప్రస్తావన చేస్తూ మొదట మాతృవర్ణన చేస్తుంది. ఆ తరువాతి మూడు స్థానాలకూ ఆధారం ఆమాతృస్థానమే అని తెలుస్తుంది.

ఇక్కడ కూడా మిగిలిన ఆ మూడు పాత్రలూ మాతృపాత్రను నిర్వర్తింపజాలవు. అదే ఆపాత్రకున్న విశేషణం !

శ్రీమద్భాగవతం తల్లులు ఏడువిధములని చెబుతుంది.

**శ్లో॥ ఆత్మమాతా, గురోఃపత్నీ, బ్రాహ్మణీ, రాజపత్నికా ।**
**ధేనుర్ధాత్రి తథా పృథ్వీ సప్తైతా మాతరస్స్మృతాః ॥**

కన్నతల్లి, గురుపత్ని, బ్రాహ్మణపత్ని, రాజపత్ని, గోవు, సేవించి ఆదరించు స్త్రీ, భూమి ఈ ఏడుగురూ తల్లులుగా వర్ణింపబడినారు.

పైన పేర్కొన్న సప్తవిధమాతృభేదములలో జన్మనిచ్చిన స్త్రీని "తల్లి" అనడం సహజమే. మిగిలిన స్త్రీమూర్తులకు మాతృత్వకల్పనం ఇక్కడ ఎన్నదగిన విషయం. మనిషి జీవనాన్ని ప్రారంభించే విషయంలో తల్లే ప్రథమ గురువు, ఐతే

**అంబేతి తాతేతి రమేతి తస్మిన్ ప్రసూతికాలే యదవోచదుచ్చైః ।**



జీవన సార్థక్యం కొరకై ఆమె సంతానమును సదాచార్యుని వద్దకు చేర్చుతుంది. అతని నుండి ఆ సంతతి జ్ఞానాన్ని పొందుతుంది, "గరీయాన్ బ్రహ్మదః పితా" అన్నారు కనుక కన్న తండ్రివంటి జ్ఞానదాతైన గురువు గొప్పతండ్రిగా చెప్పబడతాడు, ఆతని భార్య (గురుపత్ని) తల్లిసమానురాలు. వేదాది శాస్త్రములనెరిగి తదనుగుణంగా లోకక్షేమాన్ని కాంక్షిచేవాడు కనుక బ్రాహ్మణుడు పితృతుల్యుడు, ఆతడి పత్ని మాతృతుల్య. రాజ్యాన్నేలే రాజు ప్రజలకు తండ్రి వంటి వాడైతే రాజపత్ని తల్లివంటిది. "గవామంగేషు తిష్ఠన్తి భువనాని చతుర్దశ" అన్నట్లుగ పదునాలుగు భువనములకూ గోవు నివాసస్థానము, కావున గోవు తల్లి, తగిన సమయంలో సముచితసేవలను చేసి ఆదరించి అక్కున చేర్చుకునే స్త్రీమూర్తి తల్లియే. ఇక చివరిది, ఏడవది భూమి, అతిశయమైన క్షమాగుణంలో సర్వప్రాణులనూ భరిస్తున్నది, కాబట్టి భూమి తల్లి. ఈ విధంగా సప్తమాతలను, లోకంలో తల్లికి ఉన్న గొప్పతనాన్నీ తెలుసుకోవచ్చును.

ప్రకృత విషయమున అస్మదాచార్యజనని ఐన అలివేలుమంగమ్మగారు నిజంగా అలర్మేల్‌మంగతాయారే. ఆ తల్లి అంశ ఈతల్లియందు లేనట్లైతే లోకానికింత ఉపకారం జరిగేదా! ఇంతమంది జీవులు తరించేవారా? పైన మనం తల్లిని గురించి చెపుకున్న సకల విశిష్ట గుణాలూ ఈ తల్లియందులేవూ? ప్రతీలక్షణమూ ఈమెయందు చూడవచ్చు. తొలిగా చెప్పుకున్న "పితుర్మాతా గరీయసీ" అన్నమాట ఈమహాసాధ్వి విషయాన అక్షరసత్యం.

భర్త తోడుగా సంతానమును పోషించి పెద్దచేయడం సహజమే, సులభంకూడాను. ఈమె పరమాత్మ, ఆచార్యులనూ మాత్రమే దన్నుగా తన, మన జీవితాన్ని విజయం చేయలేదా... అట్లే ముందు చెప్పిన విధంగా ఏడువిధములుగా వర్ణించబడిన తల్లులందరూ మన అలివేలుమంగమ్మయందే ఉన్నారు. ఆ ఏడుగురు తల్లులూ చేయగల ఉపకారాన్ని తామొక్కరే అందించిన ఆచార్యులనుగన్న ఒక్కకారణమే చాలును ఆమెను "మహాతల్లి" అని సంబోధించుకోవడానికి.

1984/85 సం॥నుండీ మేమంతా ఆ తల్లిని ఎరుగుదుము. అప్పటికి మేమంతా పదికి అటూ ఇటూగా వయసుగలవారము. అస్మదాచార్యులైన శ్రీస్వామివారు చేసే వివిధ వైదికకార్యక్రమాలకు అమ్మగారు కూడా సేవించుకోవడానికి వస్తుండేవారు. సీతానగరంలో వేదాధ్యయనం చేసే మేమంతా వారికి నమస్కరించడానికి ఆతృతగా వెళ్ళేవారము. **కన్నతల్లిని మరపించే చిరునగవుతో వారు మమ్మల్ని అందరినీ ప్రేమగా పలకరించి ఆశీర్వదించేవారు, బాగా చదువుకుని పైకిరావాలనీ, సంస్థకు మంచిపేరు తేవాలనీ,** ఆ వయసులోనే మామనసులలో ఒకభావన, "తండ్రినీ తల్లినీ, ఆచార్యులనూ మనకు చూపించిన ఈ తల్లిది ఏమిభాగ్యమో గదా! ఆవిడ పలకరింపును పొందిన మనమెంత భాగ్యవంతులమో.... అని.

అతి మానుషలక్షణులైన పెద్దజీయరు స్వామివారిని దాసుడూ, మా సహాధ్యాయులమూ నేరుగా చూసి తరించే భాగ్యానికి నోచుకోలేకపోయాము, వారి దివ్యచరితమును వినడం తప్ప. ఎందుకో... ఆచార్యులైన శ్రీస్వామివారే చెంతనే ఉన్నా... అమ్మగారిని చూసినప్పుడే పెద్దజీయరుస్వామివారి సంబంధం ఊహకొచ్చేది. తరువాత తరువాత

**కృష్ణ! గోవింద! హరే! ముకుందేతి! అహో! జనన్యై రచితోయమంజలిః ॥**



అమ్మగారు శ్రీ. ఉ. వే. శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యస్వామివారు రాసిన "ఆచార్యమేఘమా... కరుణవానకురియుమా" అన్న పెదజీయరుస్వామినుద్దేశించిన పాటను మృదుమధురంగా సభక్తికంగా పాడుతూండగా అనిపించేది **"ఆచార్యులపై అమ్మగారికుండే భక్తే వారిని చూడగానే మనకు పెదజీయరుస్వామి భావన"**కు కారణం అని.

శ్రీస్వామివారి శిష్యులపట్లా, విద్యార్థులపట్లా అమ్మగారుచూపే వాత్సల్యం అబ్బురపరుస్తుంది. తిరునక్షత్రోత్సవాది సందర్భాలలో విద్యార్థులకు ఆమె నూనెలద్ది, అక్షతలు వేసి హారతివ్వడం వారికీ, చూపరులకూ నేత్రపర్వమైన సన్నివేశం. ఏమని వర్ణించగలం... ఎంతని కీర్తించగలం.. అంతటి ఉత్తమురాలి గురించి... ఇంతవరకూ మన ఆచార్యులనూ మననూ ఆనందిపజేశారు. ఇక తమ ఆచార్యతిరువడిని చేరి వారినానందింపజేయడానికి అక్కడికి వేంచేసారామె. ఆళ్వారాచార్యులు సాయించినట్టు స్వాచార్యసంబంధీకుల చరణారవిందములనూ, వదనారవిందములనూ నేరుగా సేవించి ఆనందించడం వేరు, సేవించిన జ్ఞాపనములను స్మరించడం వేరు. **"ఆత్మావై పుత్ర నామాసి" "రూపమేవాస్యై తన్మహిమానం వ్యాచష్టే"** అని వేదం చెప్పినట్లుగా అచ్చుగుద్దినట్టుండే ఆ మహాసాధ్వీప్రతిరూపును మన ఆచార్యులయందు సేవించుటే మనకిప్పుడు సాధ్యమైనది. ఆమె ఆచార్యతిరునాట్టును స్థిరంగా అలంకరించాలని ఆ సాకేతనాథుని శాస్త్రోక్తంగా ప్రార్థిద్దాము.

❖❖❖❖❖❖





# మహనీయమూర్తి

సందుగుల రాఘవాచార్యులు
ఋగ్వేద సలక్షణ ఘనపాఠి,
యాదాద్రి స్థానాచార్యులు
శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానము,



ఆచార్యుల పాదపద్మములకు సాష్టాంగ ప్రణామములు. అస్మదాచార్యుల మాతృమూర్తి అయిన అలివేలు మంగతాయారు గారు నిరంతరం స్వాచార్య స్మరణ మరియు భగవన్నామ సంకీర్తనలతో వారి జీవన ప్రయాణం ధన్యము చేసుకున్న మహనీయ మాతృమూర్తులు. ఈ భారతావనిని పునీతము చేయడానికి యామునాచార్యుల వారు మొదలుకొని జగదాచార్యుల వరకు అందరూ మాతృవాత్సల్యమును పొందిన వారే, కానీ అమ్మగారు ఈ లోకానికి భగవత్ స్వరూపమైన ఒక రత్నాన్ని అందించి వేదములు కొనియాడిన విధముగా "హిరణ్యగర్భిణి"గా వారు అస్మదాదులకు చిరస్మరణీయులు. నా బాల్యము నుండి వారిని ఆచార్య కృపాకటాక్షము వలన సేవించే అవకాశము కలిగింది. సీతానగరంలో అమ్మగారి ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వామివారి సన్నిధిలో స్తోత్రపాఠములు నేర్చుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ముఖ్యముగా హయగ్రీవ స్తోత్ర పారాయణం అనుసంధానం చేస్తున్నప్పుడు ఇప్పటికీ ఆనాటి సన్నివేశాలు స్మరణకు వస్తాయి. అమ్మగారు సర్వదా చిరుమందహాసముతో పలకరిస్తూ ఉంటే నాలో నూతనోత్సాహము ఆధ్యాత్మిక శక్తి మరియు భక్తి ఉత్పన్నమయ్యేది. నా జీవితంలో సౌభాగ్యమును, ఉన్నత స్థితిని పొందగలిగాను అంటే మా ఆచార్యులను అందించిన మహామహనీయురాలైన అమ్మగారి మంగళాశాసనమే.

మాకు నిత్యపూజనీయురాలు, సర్వదా వారి పాదపద్మములను సేవిస్తూ......



# ధన్యోఽ హమ్



## శ్రీమాన్ గుదిమెళ్ళ మురళీ కృష్ణమాచార్య
### కృష్ణ యజుర్వేద అధర్వ వేదపండితులు, భద్రాచలం

నేను "శ్రీమన్నారాయణ వేదవేదాంగ విద్యాలయం" లోని వేదవిద్యార్థిని. ఈనాడు లోకహితైషిణి అయిన శ్రీరామానుజార్య దివ్యాజ్ఞగ దిగన్త వ్యాపినిగా ప్రవృద్ధిని పొంది, అవ్యాహత పరాక్రమంతో ఆచరించబడుతోంది అంటే దానికి కారణం శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారు, వారిని ఆవిధంగా తీర్చిదిద్దిన జ్ఞానభూమి నడిగడ్డపాలెం శ్రీవాసుదాసాశ్రమం. ఆ ఆశ్రమానికి ఆ ఔన్నత్యాన్ని కల్గించిన జ్ఞాన నిలయం మా విద్యాలయం.

దాని కులపతులు, 'వాచామగోచర' మహాగుణదేశికాగ్ర్యులైన న్యాయవేదాంత విద్వాన్ తె.కం.గోపాలాచార్య స్వామివారు. శ్రీ చిన్న జీయర్‌స్వామివారిని జ్ఞాన సంతానంగా ప్రపన్న లోకానికి ప్రసాదించిన మహోన్నతులు.

శ్రీ కులపతుల సన్నిధిలో శ్రీ చిన్నస్వామివారు వేదాన్త విద్యను అభ్యసిస్తున్న తరుణంలోనే నేనూ ఆ ఆశ్రమంలో వేద విద్యను అధ్యయనం చేయగలిగే ధన్యత లభించింది. శ్రీస్వామివారు వేదాంత విద్యార్థి, నేను వేద విద్యార్థిని, ఒకే ఆశ్రమం, ఒకే విద్యాలయం, ఒకే కులపతుల అంతే వాసిత్వం. ఇవన్నీ పురాకృత సుకృత ఫలాలే నా జ్ఞాన జీవనంలో.

శ్రీవారితో ఆ విద్యాలయ సాహచర్య సౌభాగ్యం వలన లభించిన మరో మహద్భాగ్యం అమ్మగారితో అనుబంధం. 1978 గోదావరి పుష్కరాలలో రాజమండ్రిలో శ్రీ పెద్దజీయర్ స్వామివారు నిర్వహించిన బ్రహ్మయజ్ఞం అమ్మగారి వాత్సల్యాన్ని పొందించింది. వారి ద్వితీయపుత్రుడు కిషోర్ బాబుతో చక్కని స్నేహం. కలిసి సరదాగా సినిమాలకూ వెళ్ళేంత చనువు ఏర్పడ్డాయి. అమ్మగారి శ్రీకర ప్రసాదాన్ని పొందిన ఆ క్షణాలను ఎలా మరువగలను?

శ్రీ కులపతుల ఇంట ఏ శుభకార్యానికైనా బ్రహ్మత్వాన్ని మా తండ్రిగారే వహించేవారు. భద్రాచలరాముని సన్నిధిలో స్థానాచార్యులుగా 9 సంవత్సరాలపాటు సేవలనందించి, కేవలం శ్రీ పెద్దజీయర్ స్వామివారి పిలుపు మేరకు 'రాముని సేవకన్న రామానుజుని సేవ మిన్న' అనే భావనతో 'మా విద్యాలయం'లో వేదాధ్యాపకులుగా చేరారు.

క్షమించాలి. వారు అలా భద్రాచలం నుండి నడిగడ్డపాలెం రావడంవల్లనే నేను 'మా విద్యాలయం'లో చేరి వైదిక విద్యను అభ్యసించగలిగాను. లేదా ఏ గాలికో కొట్టుకుని పోయేవాడిని.

మా తండ్రిగారు 'వేదాచార్య' సలక్షణ వేదవిద్వాన్' శ్రీ.ఉ.వే. గుదిమెళ్ళ వెంకట నరసింహాచార్యులవారు వారివద్దనే కృష్ణయజుర్వేదం-పద పాఠాంతరమధ్యయనం. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామికూడ వీరివద్ద కొంత వేదమంత్ర భాగాన్ని అధ్యయనం చేసినారు. శ్రీ కులపతుల కుమారులు శ్రీరంగరామానుజాచార్యులవారి ఉపనయనం, తరువాత వివాహము, తరువాత వారి కుమారుని ఉపనయనము, వారి ముగ్గురు కుమార్తెల వివాహాలు అన్నింటికీ మా తండ్రిగారే యాజ్ఞిక బ్రహ్మలు. శ్రీ కులపతులకు మా తండ్రిగారంటే విశేషగౌరవం ఉండేది. శ్రీశ్రీశ్రీ పెద జీయర్ స్వామివారి పూర్వాశ్రమంలో శ్రీ విశిష్టాద్వైత ప్రచారక సంఘంలో ఆ మహనీయులిద్దరితో పాటు మా తండ్రిగారూ



చురుకుగ పాల్గొనేవారు. వీరంతా కలసి ఆర్తమూరులో చాలాకాలం నివసించారు. ఆ స్నేహము గౌరవము ఉండేది. ఆ సమయంలో మా తండ్రిగారు శ్రీ కులపతుల వద్ద సిద్ధాంత గ్రంథాలను తండ్రిగారి వద్ద శ్రీ కులపతులవారు వైదిక మంత్ర భాగాలను పరస్పరం అధ్యయనం చేసినారట.

ఆ స్నేహమే మా తండ్రిగారిని 'మా విద్యాలయంలో వేదాచార్యులుగా వ్యవహరింపచేసింది. ఆరోజులలోనే శ్రీ కులపతుల ఇంటి కుమారునికి, 'అమ్మగారి' రెండవ కుమార్తెకు వివాహం. ముహూర్తం నుండి అన్నీ మా తండ్రిగారే. అప్పటికి వారికి కనుచూపు తగ్గడం వల్ల నాచేతనే యాజ్ఞీక ప్రక్రియను జరిపించారు.

అంటే పాపక్క (మంగతాయారు) పెళ్ళికి నేనే పురోహితుడను.'అక్క పెళ్ళి చేసిన తమ్ముడు' అని అమ్మగారు నన్ను ప్రశంసించడం/పరిహసించడమో...నాకు బాగాగుర్తు. అప్పటకి నేను ఊనషోడశ వయస్కుడనే.

ఆ తరువాత అమ్మగారి కుటుంబ సభ్యులతో నా అనుబంధం సౌహార్దంగా సాగింది. నేను నా 18వ ఏట వ్రాసిన 'జీయర్ గీత మాధురి' (శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి వారి దివ్య చరిత్ర గీతమాల) క్యాసట్ అంటే అమ్మగారి కెంతో ఇష్టం. 'అదుముకోకే పాదుకా' అనే పాటను అమ్మగారి నోటి వెంట నేను వింటూ సర్వాతిశాయి ఆనందాన్ని పొందేవాడిని. ఆ క్యాసెట్‌కై నేను వ్రాసిన ఆ 8 పాటలలో ఈ పాట నాకు ఇష్టం. కానీ **అమ్మగారికి 'ఆచార్య మేఘమా! కరుణవాన కురుయుమా!!' అనే పాట చాలా ఇష్టం. గత ముప్పై ఏళ్ళగా అమ్మగారు ఆ పాటను 'నాపాటను' పాడుతూనే ఉన్నారంటే నేనెంత ధన్యోఽహం!!'**

నేను కలసినప్పుడల్లా 'నీ పాట నా కెంతిష్టమో!!' అనేవారు. సుమారు ఏడాదిక్రితం శంషాబాద్ ఆశ్రమంలో సకుటుంబంగా అమ్మగారిని సేవించాను. మా దంపతులం అమ్మగారిని సత్కరించుకోవడానికై వెళ్ళాం. స్వయంగా మా ఇద్దరికీ ఉష్ణోదకపానీయాన్నిచ్చి. మా జంటకు బట్టలు పెట్టి ఆశీర్వదించారు. నా శ్రీమతిని అక్కున చేర్చుకుని ఎన్ని సుద్దులను చెప్పారో. ఆ సంఘటనను మరచిపోలేను.

అమ్మగారు ఆచార్యతిరువడి చేరారనే వార్త ఒక ముహూర్తకాలం మనోవ్యధను కలిగించింది. 'న త్వం శోచితుమర్హసి' అనే గీతాచార్యోపదేశము స్ఫురించింది. అవును! నేనెందుకు చింతించాలి? ఎవరికైనా, ఎక్కడైనా, ఎప్పటికీ ఆచార్యతిరువడికి చేరడం ఆవశ్యకమే కదా! ఆనందదాయకమే కదా!! నేను కొంచెం స్వార్థ వేదాంతిని. నేను నా చిన్నతనంలో అస్మదాచార్యులైన శ్రీ పెద్ద జీయర్‌స్వామి వారి విషయమై వ్రాసిన 'ఆచార్యమేఘమా!' అనే గీతాన్ని మా ఆచార్యులకు పరమపదంలో గానం చేయడానికై అమ్మగారు పరమపదించారు. పరమపదానికి ఏతెంచారు. అని భావిస్తున్నాను.

ఆ పాట రూపంలో నేనూ అమ్మగారితోపాటు ఉన్నానని పరమానందిస్తున్నాను. ఇంతకంటే నన్ను నేను తమాయించు కోవడానికి మరో మార్గంలేదు. భౌతికమైన ఏ వేదననైనా ఆధ్యాత్మిక భావన మాత్రమే తీర్చగలదు.


అమ్మగారు మన మధ్యనే ఉన్నారు. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి వారి చిరునవ్వులలో.. చిరంజీవినిగా... వారి కనికరాల కనుదోయిలో వెలుగులను విరజిమ్మే.. సంజీవనిగా.

అమ్మగారితో ఈ అనుబంధం చాలు నేను తరించడానికి.

ధన్యోఽహం. దాసోహమ్.

అమ్మ ఋణం తీర్చుకోలేనిది.





# వందేమాతరమమ్మా

శ్రీమతి గుదిమెళ్ళ నీళాదేవి, భద్రాచలం

పల్లవి వందేమాతరమమ్మా
అభివందే అలమేల్ మంగమ్మా
జగదాచార్యులు చిన్నజీయరుల
అమ్మవు నీవమ్మా
మా అందరి జేజమ్మా

1. వామనుడై వసుధనునిలచి
త్రివిక్రమంతో జగతిని కొలచిన
కొమరుని కన్నావమ్మా
మా అదితివి నీవమ్మా
విష్ణుమాతవై విశ్వహేతువగు
మాస్వామిని కన్నావమ్మా
అలమేలు మంగమ్మా

2. దనుజులందరిని దండన చేసి
ధర్మమూర్తిగా ధరణిని వెలిగిన
రాముని కన్నావమ్మా
మా కౌసల్యవు నీవమ్మా
రామమాతవై రమణీహితవై
మా స్వామిని కన్నావమ్మా
అలమేలు మంగమ్మా

3. వేలుపులందరి విశ్వరూపమై
వేదాంతమ్ముల స్వస్వరూపమై
జగద్గురువుగా గీతను పాడిన
కన్నయ్యను కన్నావమ్మా
దేవకిదేవివి నీవమ్మా
కృష్ణమాతవై వీతతృష్ణవై(వేణుగీతమై)
మా స్వామిని కన్నావమ్మా
అలమేలుమంగమ్మా

4. జగతి సత్యతను శ్రీపతి పరతను
దాసభూతుడగు జీవుశేషతను
శ్రీభాష్యమ్మున తిరముగ చాటిన
యతిరాజును కన్నమ్మా
కాంతిమతివి నీవమ్మా
ఆ యతిమాతవు జగతి పునీతవు
మా స్వామిని కన్నావమ్మా
అలమేలు మంగమ్మా

5. మా చిన్నజీయరుల చిరునగవులలో
చిరంజీవివి నీవమ్మా
కనికరాల ఆ కనుగవ్వలలో
పరంజ్యోతివై వెలుగమ్మా
వందేమాతరమమ్మా
అభివందే అలమేల్ మంగమ్మా
జగదాచార్యులు చిన్నజీయరుల
అమ్మవు నీవమ్మా
మా అందరి జేజమ్మా

❖❖❖❖❖❖



# దివ్యమాత

భ.సు. ప్రహ్లాదాచార్య
అథర్వవేద పండితులు



వారి ఆచరణ, వారిమాటతీరుతోనే ఎన్నోపాఠాల నేర్పేటటువంటి అసమాన మాతృమూర్తి, మార్గదర్శి మనఅమ్మగారు.

శ్రీ శ్రీ శ్రీ పెద్దస్వామివారి ఆజ్ఞతో వేదాధ్యయనం కొరకు ఇల్లువదిలి ఆశ్రమానికి వెళ్ళిన నాకు మొదటి సారి అమ్మగారిని సేవించిన సందర్భంలో చిన్నవాడినైన నాకు ఏమిటో తెలియనిసంతోషం కలిగింది. ఇల్లుగుర్తు వచ్చి అమ్మనిచూసిన ఆనందంకలిగింది. నాకేకాదు అందరికీ అలానే అమ్మగా అనిపించే, కనిపించే దివ్యమైన మాతృమూర్తి మన అమ్మగారు.

అమృతతుల్యులైన అమ్మగారు హృదయపూర్వకంగా సంప్రదాయంకొరకు, సమాజశ్రేయస్సుకొరకు శ్రీచిన్నజీయర్ స్వామివారిని మనకు అందించిన త్యాగమూర్తి, లోకమాత మన అమ్మగారు.

శ్రీశ్రీశ్రీ పెద్దస్వామివారి చరమ కైంకర్య కార్యక్రమ సందర్భమున నేను తొలిసారిగా సేవించి నప్పటినుండీ ఇప్పటి వరకు ఒకటేతీరు వారిది. వారి వాత్సల్య పూర్ణమైన నవ్వు, అపురూపమైన పలకరింపు నామనసున ఇప్పటికీ పదిలంగా నిలిచింది.

అమ్మగారిని శ్రీ పెద్దజీయర్ స్వామివారి సన్నిధిలోనూ, పూర్వాశ్రమంలో శ్రీచిన్న జీయర్ స్వామివారి తల్లిగారిగానూ సేవించగలిగే భాగ్యాన్ని పొందినవారిలో నేనొకడినని ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను.

భౌతికంగా అమ్మగారు మనతో లేకపోయినా శాశ్వతమైన ఈసంప్రదాయంతోపాటు ప్రతిఒక్కరి హృదయంలోనూ చిరునవ్వులతో తమ వాత్సల్య పూర్వకమైన ఆశీస్సులను మనకు ఇస్తూ శాశ్వతంగా మనందరితో ఉంటారని విశ్వసిస్తున్నాను.

ఆచార్యకృపాభిలాషి



# న మాతుః పరదైవతమ్

కె. వరప్రసాదాచార్య, మైత్రాయణి,
కరీంనగర్, వేదభవనం

మనందరికి ఒక అద్భుతమైన ఆచార్యులను అనుగ్రహించిన మాతృమూర్తి ఆచార్య తిరువడిని చేరిన ఈ సందర్భమున అమ్మగారితో దాసునికి ఉన్న సంబంధాన్ని మీతో పంచుకుంటున్నాను.

అమిత తేజోవంతులైన ఆదర్శమూర్తులు, పరమకారుణికులు అస్మదాచార్యులను అమ్మగారు మనకు అందించి మనకు ఎనలేని ఉపకారాన్ని అందించారు. అమ్మగారు ఒక కౌసల్యవలె, యశోదవలె మనం భావించవచ్చు.

అమ్మగారు దాసునికి సుమారుగా 20సం.ల నుండి సుపరిచితురాలు. అలాంటి సమయంలో అమ్మగారిని కలిసినప్పుడల్లా ప్రేమతో హితాన్ని బోధించేవారు. అలా కలసినపుడు ముందుగా **ప్రేమతో తలపై చేయిని ఉంచి ఆచార్య కైంకర్యాన్ని వదలకుండా చేయాలి అది మీ విజయరహస్యం** అని చెప్పేవారు. అలాగే చక్కటి సున్నుండలను, జంతికలు, పల్లీపట్టీల్లాంటి మధుర పదార్థములు మడిగా చేసినటువంటివి ఇవి అని అందిస్తుండేవారు. అది ఒకటి శరీర పోషణకు, మరొకటి ఆత్మోజ్జీవనమునకు అని ఇప్పుడు అనిపిస్తుంది. అలాగే మేము చిన్నపిల్లలమే అయినా మీరు వేదపురుషులు అనేవారు. (వేదం అధ్యయనం చేసినవారమని) చాలా గౌరవించేవారు. అదేవిధంగా ఎక్కువ సమయం వారి దగ్గర గడిపినపుడు పెద జీయర్ స్వామివారి గురించి చెబుతుండేవారు. అదే విధంగా చిన్న జీయర్ స్వామివారుకూడా వైష్ణవ సంప్రదాయాన్ని పరిరక్షిస్తూ ఉన్నారు అని చెప్పేవారు ఇది వారి వసతి గృహంలో కలిసినపుడు చెప్పే మాటలు. ఎప్పుడైనా దేవాలయంలో కలిస్తే మన దివ్యసాకేత రాముణ్ణి చూసావా? అంటూ మమ్మల్ని తీసుకువెళ్ళి మరల పెరుమాళ్ళని మాతో సేవించి చూసి భగవత్ సౌందర్యాన్ని వర్ణించేవారు. మా ఆచార్యదైవం అంటూ ఉండేవారు కూడా.

మరొక మరపురాని విషయం ఏమిటంటే మా విద్యార్థులకు మా అధ్యాపకులకు అలాగే స్వామివారి శిష్యులందరకు పెద్దదైన పండుగ దీపావళి. స్వామివారి తిరునక్షత్రం. ఆరోజు ఉదయాన్నే అమ్మగారు తాము తలస్నానం చేసి మంగళకరమైన దీపాలతో మంగళమైన పాటలతో ఆచార్యులను (శ్రీస్వామివారిని) తిరునక్షత్ర సందర్భంగా తైలాభ్యంజనాన్ని చేసి వారితో పాటుగా మా అందరికీ మాడుపై నూనెను అంటించి, నుదుట శ్రీచూర్ణాన్ని పెట్టి, **మీకు ఆచార్యకైంకర్యం బాగా కలుగుగాక** అంటూ అనుగ్రహించేవారు. ఆ సమయంలో



శ్రీస్వామివారు అమ్మగారి ముందు చేతులు కట్టుకొని తలదించి చిరునవ్వుతో అమ్మపాటను వింటూ ఉండే సన్నివేశం మరపురానిది. మరువలేనిది.

ఇక అమ్మగారితో మరొక అద్భుతమైన సన్నివేశం అమెరికా ప్రయాణం. శ్రీస్వామివారి తిరునక్షత్రం సందర్భంగా విమానయానం అమ్మగారి ప్రక్కనే సీటు వారికి మరింత దగ్గరయ్యాను. ఆ సమయంలో చాలా విషయాలు ఆచార్యుల బాల్య విషయాలు అందించారు.

మన స్వామివారి నడక, నవ్వు, భాషణ, భక్తి అన్నీ పెద్దజీయర్ స్వామివారివలె ఉన్నాయి అని అంటుండేవారు. అలాగే ప్రతీ విషయంలో ఇది మన ఆచార్య అనుగ్రహం అంటూ పెద్దజీయర్ స్వామివారిని స్మరిస్తూ ఉండేవారు. చివరగా పెద్దజీయర్ స్వామివారియొక్క దివ్యతేజస్సే చిన్న జీయర్ స్వామివారని అనేవారు. ఇలా ఎన్నో అమూల్యమైన విషయాలను అందించిన అమ్మగారికి సర్వదా కృతజ్ఞుడను.

సదా అమ్మగారి అనుగ్రహం ఎల్లవేళలా మాపై ఉండాలని ఆచార్యుని ప్రార్థిస్తూ.



బిడ్డడికై అమ్మ పాడే పాటను మించిన అనురాగం ఉన్నదా!



# మాతృవందనం



**వేదాంతం వేంకట నరసింహాచార్యులు**
**కృష్ణయజుర్వేదం**

సీతానగరంలో విద్యార్థిగా1984 వ సంవత్సరములో చేరినప్పటినుండి ప్రతీ దీపావళి శ్రీ స్వామివారి తిరునక్షత్రం రోజున తెల్లవారు జామున స్వామివారికన్నా ముందే అమ్మ దర్శనం లభించేది మాకు. అమ్మగారు శ్రీస్వామివారికి తలపై నూనెపెట్టి మంగళహారతులనిచ్చి సుమధురగానామృతముతో ఆశీస్సులు అందజేసే వైనం ఎప్పటికీ మరచిపోలేని మధుర ఘట్టం వారు తీసుకువచ్చిన సున్నిపిండి, శీకాయితో శ్రీ స్వామివారికి వెంటనే స్నానం సమర్పించే భాగ్యం మాకు లభించేది. అమ్మగారు వచ్చినపుడు మాకు స్తోత్రపాఠాలు కూడా చెప్పేవారు. ఆచార్యమార్గానుసారముగ మీరు పెద్ద విద్వాంసులు కావాలని మా విద్యార్థులనందరినీ ఆశీర్వదించేవారు. 2008 తర్వాత కారణాంతరాల వల్ల ఉద్యోగధర్మాన్ని అనుసరిస్తూ ఆశ్రమం నుండి బయటకి వచ్చిన తర్వాత అమ్మగారిని సేవిస్తే, మీరందరూ ఇలా బయటకి వెళ్తే స్వామివారిని మీలా ఎవరు చూసుకుంటారయ్యా! అని బాధపడేవారు పరమపదించడానికి 10-15 రోజుల ముందు సేవించడానికి వెళ్ళినపుడు మీ అమ్మగారు ఎలా ఉన్నారని అడిగారు. 10 మాసాలక్రితమే పరమపదించినదని చెప్తే, మంచి వారందరూ వెళ్ళిపోతున్నారు అని బాధపడ్డారు. వారు అమ్మను చూసినది, 10 సం. క్రితము ఒకేసారి ఆశ్రమంలో మాత్రమే. ఇలా చెప్పుతూ వెళ్ళితే పుస్తకాలే సరిపోవు.

అమ్మగారు పరమపదంలో భగవత్ భాగవత ఆచార్య నిత్య కైంకర్యం చేయడానికి వెళ్ళినట్లుగా భావిస్తూ... సేవించుకుంటాము. మాతృదేవోభవ!.

❖❖❖❖❖❖



# మాతృత్వ పూర్ణురాలు



చక్రవర్తుల యాదగిరి స్వామి
యజుర్వేదపండితులు, హ్యూస్టన్

అస్మదాచార్యులకు సాష్టాంగప్రణామాలు సమర్పిస్తూ.... అమ్మగారు ఆచార్య తిరువడి చేరిన వేళ, మా ఆచార్యులకు హృదయం బరువెక్కినటువంటి వేళ, మన జీవితాలలో ఒక పెద్ద చీకటి కోణం. అమ్మగారు నాకు ఎన్నో స్మృతులను అందించారు. వారి పలుకులు, నవ్వు మరువలేనివి. ఎప్పుడూ కనపడినా ఆప్యాయంగా పలకరించేవారు. నాకు చిన్న వయసులోనే సుమారు 5 సంవత్సరాల వయసులో ఉన్నపుడే మా అమ్మగారు పరమపదించారు. కానీ ఆశ్రమంలో చేరాక కొంతకాలానికి అమ్మగారిని దర్శించుకోగలిగాను. వారిలో అమ్మను చూసుకుంటూ సేవిస్తూ ఉండేవాళ్ళం. సీతానగరం మరియు దోమలగూడ జెట్‌లో అమ్మగారినుండి మాతృవాత్సల్యాన్ని ఆనందానుభూతిని పొందగలిగాను. ఇక జీవా శంషాబాద్ వారు వేంచేశాక అనేకమార్లు సేవించుకునే అవకాశం లభించింది. అలాంటప్పుడు నేను, శ్రీకాంత్ (ఋగ్వేదం), మా ఆచార్యులైన శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామివారిపై పాడిన జగద్గురువుకు జయం జయం జీయర్ స్వామికి శుభం జయం పాటను అమ్మగారు మెచ్చుకుని సంతోషపడేవారు. అలానే మా శ్రీమతి సంధ్యను, పిల్లలను ఆప్యాయంగా పలకరించేవారు. వెళ్ళినప్పుడల్లా చక్కటి ప్రసాదాన్ని చేసి పెట్టేవారని ఆమె వాత్సల్యాన్ని తలుచుకుని మేమంతా ఇప్పుడు దుఃఖిస్తున్నాం.

అలానే అమెరికాలో మొదటిసారి శ్రీస్వామివారి తిరునక్షత్రం జరిగినపుడు అమ్మగారితో కలిసి మేమంతా ప్రయాణం చేయడం ఒక మధురజ్ఞాపకం. ఆసమయంలో శ్రీస్వామివారి బాల్యవిశేషాలని చెపుతూ...ఎప్పుడు మీరంతా పక్కనే ఉంటారు కదా! స్వామివారికి ... విశ్రాంతి ఉండేలా చూసుకోవాలి అని చెప్తూండేవారు. అలుపెరుగక సాధనలో సంప్రదాయం కోసం స్వామివారు నిరంతరం శ్రమిస్తున్నారు. శ్రీస్వామి వారు భగవద్గుణానుభవమే ప్రసాదం, భగవద్గుణ వైభవ ప్రకాశనమే విశ్రాంతిగా భావించే మహనీయులు. వారి సంరక్షణ బాధ్యత శిష్యులుగా మీరు వహిస్తే బాగుంటుంది అని జాగ్రత్తలు చెప్పేవారు.

అమ్మగారు కోరుకున్న దానికంటే ఎక్కువగానే ఆచార్యులు సంప్రదాయసంరక్షణ, సమాజసేవలు చేసారు, చేస్తూ ఉన్నారు. మన శ్రీమన్నారాయణుడి సన్నిధినుండి – ఆచార్య తిరువడిచేరిన అమ్మగారు మన ఆచార్యులకు మరింత వైభవాన్ని అందిస్తూనే ఉంటారు.

❖❖❖❖❖❖

**ఆచార్యుడు శిష్యుని ఆత్మపోషణ చూస్తాడు... శిష్యుడు ఆచార్యుల దేహపోషణ బాధ్యత వహించాలి!**

# ఔదార్యమూర్తి - అలర్మేల్ మంగమ్మ



వోలేటి వంశీకృష్ణమాచార్యులు
జీవా, ఋగ్వేద అధ్యాపకులు

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారితో దాసుడి అనుబంధానికి 21 సంవత్సరాలు! అమ్మమ్మ అలివేలుమంగతాయారమ్మతో అనుబంధమేమో 20 సంవత్సరాలు. లేతప్రాయంలో ఋగ్వేదవిద్యను అభ్యసించడానికై వచ్చిన క్రొంగొత్త సమయంలో ఆశ్రమంలో అందరూ కొత్తే దాసుడికి! ఎవరిని ఏరకంగా ఎలా సంబోధించాలో కూడా తెలియనంత కొత్తదనమది!

సీతానగరం వేదవిశ్వవిద్యాలయంలో మొదటిసారి అమ్మగారిని చూశా! స్వామివారి చుట్టూ ఎలా అయితే జనసమూహముందో అమ్మగారి చుట్టూ అలానే చేరి, సాష్టాంగనమస్కారం చేసుకొని అందరూ వెళ్తున్నారు. అందరితో నేనూ వెళ్ళి, సాష్టాంగం పెట్టి జైశ్రీమన్నారాయణ! అమ్మమ్మా! అన్నాను. ఏం పేరోయ్? అన్నారు. ఇంటిపేరుతో సహా మొత్తం చెప్పుకున్నాడు దాసుడు. ఏమి చదువుతున్నావు? అని అడిగారు. ఋగ్వేదమండీ! అన్నాను. ఏంటీ స్వశాఖ ఋగ్వేదివా? అనడిగారు. అవునండీ! అన్నాను. కానీ, స్వశాఖ అంటే నాకు అప్పటికి తెలియని వయసు నాది. తరువాతి సంవత్సరాలలో వేదం ఒక 2,3 సంవత్సరాలు చదివాక స్వశాఖ అని ఎందుకంటారో శ్రీజీయర్‌స్వామివారి ద్వారా చిన్నగా దాసుడు తెలుసుకున్నాడు.

అమ్మమ్మకు ఋగ్వేదులంటే బహు ప్రీతి! సీతానగరంలో అమ్మగారొచ్చినపుడు మా ఋగ్వేదం పిల్లలం అందరమూ వారి చుట్టూ చేరేవాళ్ళం! వారు ఓపికగా మా అందరి యోగక్షేమాలు తెలుసుకొని పండో ఫలమో సంభావనో ఎంతో కొంత ఇచ్చి పంపేవారు. దాసుడిమీద అమ్మగారికి విశేషమైన ఆదరముండేది.

జీవా ఆశ్రమానికి వచ్చి, ఇక్కడ స్థిరపడ్డాక సమయమున్నప్పుడల్లా వెళ్ళి వారితో కూర్చుని, ఎంతో కొంత స్తోత్రపాఠం చదివే అవకాశం దాసునికి చిక్కింది. గద్యత్రయంలో శరణాగతిగద్యం ఈ సంవత్సరం దాసుడికి అమ్మమ్మతో కలసి, చదివి, నేర్చుకునే స్థితి కలిగింది. ఆశ్చర్యమేమంటే, భగవంతుడి గుణగణాలు గద్యరూపకంగా ఉండే శరణాగతిగద్యను నేర్చుకోవడానికి నాకు చాలానే సమయం పట్టింది. కానీ, వారు గద్యనంతయూ అవలీలగా కంఠతః చెప్పుకుంటూ వెళ్ళేవారు. అది చూసి ఎంతో ఆశ్చర్యమేసేది. ప్రతినిత్యమూ అనుష్ఠానంలో వారి పారాయణంగా ఉండే గద్యత్రయం దాసుడికి అమ్మగారితో కలసి చదివానన్న ఆనందం మనస్సులో ఇక కలకాలం నిలచి ఉంటుంది. దాసుడు అదే చివరిసారి వారిని అప్పుడే సేవించుకున్నాడు. మళ్ళీ అవకాశం కుదరలేదు. అమ్మగారు



శ్రియఃపతి సాన్నిధ్యం చేరాక వారికి ఉడతారూపకంగా కైంకర్యసేవ చేసుకునేందుకు అవకాశం ఇచ్చిన శ్రీజీయర్‌స్వామివారి శ్రీ చరణాలకు అనేకానేక దాసోహప్రణతులను సమర్పిస్తూ... అమ్మగారి కైంకర్యంలో తరిస్తున్న పెద్దలకు, మాతృమూర్తులకు, పిన్నలకు అందరికీ శతథా నమస్సుమాంజలులను తెలుపుతూ దాసుణ్ణి, అమ్మగారి వాత్సల్యాన్ని నాలుగు మాటలలో వ్రాయమని కోరిన సాధ్వి ప్రపన్నవైశారదీగారికి నా హృదయావిష్కరణను గావిస్తున్నాను.

"కాంతులు విరజిమ్ము సాంప్రదాయవృక్షానికి ప్రధానవేరుయై నిలచిన
మహాతల్లి! జ్ఞానాన్ని – అనుష్ఠానాన్ని నలుగురికి పంచిన సేవామూర్తీ!
ఆచార్యులనే మేఘములను – మా మీద జ్ఞానధారలుగా కురిపించుటకు
మార్గగాములై వేంచేసియున్న మా మాతృమూర్తి!
ఆకులమన్నాడ చిలకమర్తి అలివేలుమంగతాయారమ్మకు
శతథా – సహస్రథా సాష్టాంగనమస్కారములు!

❖❖❖❖❖❖

## పిల్లలంటే ఎంతో ప్రేమ అమ్మగారికి...



**గట్టు శేషాచార్యులు**
**యజుర్వేద పండితులు**

నా పేరు గట్టు శేషాచార్యులు మేము మా చిన్నతనంలో సీతానగరంలో వేదం చదువుకునే సమయంలో వారితోటి మాకు ఉండేటటువంటి అనుబంధం ఎలాంటిదంటే! మేము చిన్నతనంలో విష్ణు సహస్రనామ పారాయణలువంటివి చేస్తూ ఉండగా కాస్త నిద్రపోవడం కానీ, కాస్త అలసటగా ఉండడంగానీ జరిగితే అక్కడ ఉండే పెద్దలు అక్కడ నుండి నేరుగా పాఠాలకి పంపేవారు. తద్వారా ఆ తర్వాత జరిగే తీర్థ ప్రసాద గోష్ఠిలో అప్పుడప్పుడు అన్వయించే అవకాశం ఉండేది కాదు. అలాంటప్పుడు గోష్ఠిలో ఇచ్చే కమ్మటి ప్రసాదాన్ని పొందలేకపోయేవాళ్ళం. అదంతా గమనించిన అమ్మగారు వారికి ఇచ్చినటువంటి ప్రసాదాన్ని జాగ్రత్తగా అట్టే పెట్టి ఎవరైతే ఈ ప్రసాదాన్ని స్వీకరించలేదో వాళ్ళ దగ్గరికి వచ్చి ఆ ప్రసాదాన్ని మాకు ఇస్తూ ఉండేవారు అది మాకు చాలా గుర్తు, ఆ సమయంలో మాకు తెలియదు గానీ, ఇప్పుడు మేము తలచుకుంటే ఒక బిడ్డకి అమ్మ పెట్టినటువంటి, ప్రేమతో కూడినటువంటి ప్రసాదం జ్ఞాపకం ఆవిధంగా స్మరించుకోవడం ఈ సందర్భంగా చాలా అదృష్టం. ఆ తల్లికి మనసారా కృతజ్ఞతతో ప్రణమిల్లుతూ...

❖❖❖❖❖❖

బిడ్డడి ఆకలిని చెప్పకనే గుర్తించేది అమ్మే!



# నమ ఉక్తిం విధేమ


రావూరి వెంకటసాయి వరప్రసాద్ వరదన్‌స్వామి, ఎం.ఎ.

శుక్ల, కృష్ణయజుర్వేద ద్వివేద పండిట్, మంగళగిరి


"మాతృదేవోభవ", "న మాతుః పరాదేవతా" ఇలాంటి శృతి వాక్యాలకు నిలువెత్తు నిదర్శనమే మన అమ్మగారు.

భారతీయ సంస్కృతి ఇంత అత్యుత్తమంగా ఉజ్జీవించటానికి ఈ అమృత స్వరూపాన్ని అందించిన అమృత మూర్తి మన అమ్మగారు.



మాలాంటి వర్షపు బిందువులు సముద్రంపాలు అవ్వకుండా చిన్న చిన్న ముత్యాలుగా తయారు చేయించే సంజీవన ముత్యాన్ని అందించిన సం"జీవన"మూర్తి మన అమ్మగారు.

మన అందరికి ఆ పరమపద త్రోవ చూపు మార్గదర్శిని అందించి, ఇప్పుడు పరమపదాన్ని చేరికూడా మరల ఆత్రోవను మరింత పదిలం చేస్తున్న సుప్రకాశమూర్తి మన అమ్మగారు.

ఎల్లప్పుడూ మాస్వామి చిరు నవ్వులతో పలకరించే చిరుదరహాసమూర్తి మన అమ్మగారు.

అమ్మా! ఎన్ని వర్ణించినా తనివి తీరదమ్మా ఆ దాహం కానీ ఓ చిన్ని ఆతృత ...

మన ఆచార్య తిరునక్షత్ర ఉత్సవంలో శ్రీస్వామివారు నాకు వేదం సర్టిఫికేట్ అనుగ్రహించారు. దాన్ని అమ్మకి చూపినప్పుడు – చాలా బాగుందయ్యా!

**నీ విద్యార్థులని కూడా నీకంటే గొప్పగా తయారు చేయాలయ్యా** అని అన్నారు. ఆ తరువాత ఘన సర్టిఫికేట్‌లను నా విద్యార్థులు చూపించగా "బాగుందయ్యా! అలానే నీసంతానాన్ని కూడా తీర్చిదిద్దాలయ్యా అప్పుడే దీనికి సార్థకత" అని అన్నారు.

ఆ తరువాత శ్రీస్వామివారి షష్టిపూర్తి మహోత్సవంలో మా చిరంజీవికి ఇచ్చిన అనుగ్రహాన్ని అమ్మగార్కి చూపించగా "ఈ పరంపర ఇలానే కొనసాగాలయ్యా!" అని ఆశీర్వదించారు.

**సత్య సంకల్పులను కన్న తల్లిగదా! అందుకే అమ్మగారి ఆశీర్వాద పరంపరకూడా సత్యమే,** ఆ శ్రీమన్నారాయణుని సారూప్యాదులని పొందిన మన అమ్మగారు లాంటి సత్యమైన గర్భశుక్తి ముక్తా ఫలాలని "సహస్రధా శ్రీరామానుజార్య దివ్యాజ్ఞ"ను వర్ణింపచేసే సహస్ర గర్భముక్తాఫలాలని అనుగ్రహించాలని ప్రార్థిస్తూ...

అమ్మా! ఇంతటి గొప్ప అనుగ్రహమూర్తిని అందించిన నీకు ఏమి ఇచ్చి ఋణం తీర్చుకోగలము

నీ బిడ్డడి బిడ్డలు నీకు సమర్పించే "నమస్సుమాంజలి" "నమ ఉక్తిం విధేమ" తప్ప...

❖❖❖❖❖❖

**ప్రతిఫలాపేక్ష లేకుండా ఈ లోకంలో మనల్ని ప్రేమించేది ఇద్దరే. ఒకటి అమ్మ. రెండు ఆచార్యులు.**



# తాయైచ్చిరంద కోవిలుమిల్లై

**గోవర్ధనం రంగనాథాచార్యులు, మైత్రాయణీ**

న మాతుః పరదైవతమ్ అన్నట్లుగా, తల్లి కంటే గొప్ప దైవము ఈ పృథ్వి మీద లేదు.



అందుకే, వేదం – 'మాతృదేవోభవ' అని మొదటిగా తల్లినే సన్మానించింది. ఈ జగత్తుకి జగదాచార్యులను అందించినటువంటి అమ్మగారు, మా అలివేలు మంగమ్మ.

అమ్మగారితో మాకున్న అనుబంధం – శ్రీతులసీ రామానుజకూటం మైత్రాయణీ శాఖ, వేదపాఠశాల, రాజమహేంద్రి .... అప్పటి విద్యార్థులు స్వయంగా అమ్మగారి యొక్క ప్రేమను ప్రత్యక్షంగా చూరగొన్నవారు. ఈ అదృష్టం అస్మదాచార్యులు చినజీయర్ స్వామి తరువాత మాకే లభించడం మా పూర్వజన్మ సుకృతం. రామానుజకూటంలో ఏ చిన్నపాటి కార్యక్రమం జరిగినా , అమ్మగారు మా అందరిని ఆశీర్వదించేవారు. మాకు తగు జాగ్రత్తలు, మెలకువలూ చెప్పేవారు. అలాంటి మాతృమూర్తి ఇక లేరు అనే వార్త జీర్ణించుకోలేనిది. "ఆచార్య మేఘమా కరుణ వాన కురియుమా"

❖❖❖❖❖❖

# స్ఫూర్తిప్రదాయిని



**కలకుంట్ల విష్ణువర్ధనాచార్యులు**

**శుక్ల యజుర్వేద ఘనపాఠి, జీవా ఆశ్రమం**

జగదాచార్యులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జీయరు స్వామివారిని మనకు అందించిన మాతృమూర్తికి దాసోహములు సమర్పిస్తూ... ఆకులమన్నాడ చిలకమర్రి అలివేలు మంగతాయారు అమ్మగారికి మనం అంతా ఎంతో ఋణపడి ఉన్నాము. సాక్షాత్తు భగవత్స్వరూపులను అందించినటువంటి ఈ తల్లిగారితో దాసుడికి గల ఓ చిన్న అనుబంధం.. ఆచార్య ఆజ్ఞతో నేను శ్రీరంగంలో అర్చకులకి పాఠం చెప్తున్నాను అని తెలిసి చాలా సంతోషించారు "ఇలానే సదా ఆచార్య కైంకర్యంలో ఉండాలి" అని ఎప్పుడు అనేవారు! నాకు వేదంలో ఘనాంతం పూర్తి అయినప్పుడు స్వామివారి తిరునక్షత్ర సందర్భంలో సన్మానం చేశారు అప్పుడు కూడా అమ్మగారు చాలా అనందించారు!" చాలా మంది ఇంకా ఇలా వేద పరంపరలోనే ఉండాలి" అని ఎప్పుడు దీవించే వారు, మనం నేర్చుకున్న విద్యను అందరికీ నేర్పాలి అని, చెప్పమని నిర్దేశించేవారు. వైదిక పరంపర ఆచార్య ఆజ్ఞాపాలన జీవితలక్ష్యం కావాలని చెప్పేవారు. ఎంతో గొప్పనైనటువంటి వేదం చదివే అవకాశం కల్పించిన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారికి అనేక అనేక దాసోహములు సమర్పించుకుంటూ...

❖❖❖❖❖❖



# ఆచార్యసన్నిధిలోనే ఆత్మీయదర్శనం



**శ్రీకాంతాచార్యులు ముడుంబై,**
**ఋగ్వేదం, వారిజ ఆశ్రమం**

ముఖ్యంగా అమ్మ గారి గురించి చెప్పాలి అంటే నాకు మొదటి పరిచయం అమ్మగారితో 1994 శ్రీమహావిష్ణువు యాగ కార్యక్రమంలో నాయినమ్మగారిని మొట్టమొదట ఆ వెంకటేశ్వరస్వామి వారి యొక్క సన్నిధిలో సేవించుకోవడం జరిగింది. దేహ సంబంధమున్నా, ఆచార్యసంబంధంతోనే వారిని సేవించుకోగలిగాను.

అప్పటి నుంచి కూడా వారు ఎప్పుడు కనిపిస్తే అప్పుడు వారితో కలిసి స్వామి వారి యొక్క విశేషాలను కూడా తెలుసుకోవడం, అలాగే అమ్మగారు మాకు ప్రతి సంవత్సరం కూడా స్వామివారి తిరునక్షత్రం సందర్భంగా ఏదో ఒక స్వీట్ గాని మామిడితాండ్ర గాని ఇలా ఏదో ఒకటి ఇస్తుండేవారు. దాని తర్వాత నా వివాహం అయ్యాక మా ఆవిడని తీసుకుని అమ్మ గారికి పరిచయం చేసినప్పుడు చక్కగా మంచి పని చేసావ్ అయ్యా! అతి చిన్న వయసులోనే వివాహం చేసుకుని **మంచి విద్యార్థులను తయారు చేయాలి** అని చెబుతూ ఉండేవారు.

మేము విశాఖపట్నం వారిజ ఆశ్రమంలో ఉండడంచేత సంవత్సరానికి ఒకటి రెండుసార్లు మాత్రమే సేవించడం జరుగుతూ ఉండేది. మా మీద ఎనలేని వాత్సల్యం చూపేవారు. దయా హృదయులు... సౌశీల్య మూర్తి. అంతటి అమ్మ గారు ఈరోజు పరమపదాన్ని పొందారు. వారికి హృదయపూర్వక నమస్కారాలు చేసుకుంటూ..

---

# అమోఘ దీవెన



**మోదేకుర్తి సంతోష్ కుమారాచార్యులు**
**శుక్లయజుర్వేద ఘనపాఠి వారిజ ఆశ్రమం**

మాతృమూర్తికి వందనాలు జగదాచార్యులైన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీ మన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారిని మనకు అందించిన మాతృమూర్తి ఆసూరి చిలకమర్రి అలివేలు మంగతాయారమ్మగారు ధన్యజీవి.ఎందుకంటే విశిష్టాద్వైత ప్రచారకులు ఉభయవేదాంతాచార్యప్రవర్తకులైన శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి వారి సంకల్పానుసారం మన స్వామివారు స్థాపించిన వేద విశ్వవిద్యాలయంలో 1995లో మార్చి 2వ తేదిన మా అమ్మమ్మ గారి ప్రోద్బలంతో విజయలక్ష్మి గారు చేర్పించారు. ప్రతి తిరునక్షత్ర సందర్భంలో యజ్ఞ యాగాదులలో అమ్మగారిని సేవిస్తూ ఉండేవాడిని. దీపావళి పండగకి తలకి నూనెరాసి మంగళహారతి ఇస్తూఉండేవారు. స్వయాన మా అమ్మే మాకు ఇస్తున్నంత ఆనందాన్ని అనుభవించే వాడిని.ఎప్పుడు రాజమండ్రి వెళ్ళిన అమ్మగారిని సేవించేవాడిని. ఖాళీగా ఏ రోజు కూడా పంపించేవారుకాదు మామిడితాండ్రగాని పండ్లుగాని ఇచ్చి పంపేవారు. సకుటుంబంగ అమ్మగారిని సేవించినప్పుడు **మా ఇద్దరి అబ్బాయిలను చూసి వీరిద్దరిని కూడ ఘనపాఠులగ తయారుచేయమని** ఆశీర్వదించారు. వేలకొద్ది వేదవిద్యార్థులకు మాతృ ప్రేమను అందించిన శ్రీ స్వామి వారిని, మనకు అందించినటువంటి ఆచార్యతిరువడిగళికి చేరినటువంటి మాతృమూర్తికి వందనాలు. అమ్మగారితో మాకు ఉన్న అనుబంధం అక్షరాలతో గాని మాటలతోగాని చెప్పలేనటువంటిది.

❖❖❖❖❖❖

ప్రేమకు అర్థం కావాలా? వెతకవల్సింది నిఘంటువు కాదు అమ్మ ముఖం.



# ఆచార్యకైంకర్యమే - అమ్మగారి నిర్దేశం

కె. సుదర్శనమాధవన్
శ్రీచిన్న జీయర్ స్వామి వారి ఏకాంగి,
యజుర్వేద పండితులు



నేను చిన్నవయస్సులోనే 1995 లో శ్రీ స్వామి వారి అనుగ్రహంతో వేదవిశ్వవిద్యాలయం సీతానగరానికి చేరాను. క్రమాంతం కృష్ణయజుర్వేదం అధ్యయనం చేశాను. సీతానగరం, జగ్గయ్యపేట, హృషీకేశం, శ్రీరంగం శ్రీ స్వామివారికి చెందిన ఆయా స్థానాలలో పాఠాలు జరిగాయి.అందువలన ఉత్సవాలలో మాత్రమే అమ్మగారిని సేవించుకునే అవకాశం కలిగేది. దూరం నుండి దర్శించి ప్రణమిల్లే వాడిని కానీ, అమ్మగారు జీవాకి వచ్చేవరకు అంత సన్నిహితంగ ఉండి మాట్లాడలేకపోయాను.

అమ్మగారు మంచి ప్రేమమూర్తి. ఎప్పుడూ నవ్వుతూ పలకరిస్తూ ఉంటారు. ఆచార్యులైన శ్రీస్వామివారికి జాగ్రత్తగ, మంచిగ సేవలు అందించాలని సూచించేవారు. వారిని సదా కనిపెట్టుకుని ఉండండి అనేవారు. ఏ విషయమైనా తేడా వస్తే ఎలా ఉండాలో ఏమి చేయాలో చక్కగా సూచన చేసేవారు. అప్పుడప్పుడు ప్రసాదాలు చేసి రుచి చూడమనేవారు. పెరుమాళ్ళకి శ్రద్ధగ అలా చేసి సమర్పించాలని చెప్పేవారు.9 సంవత్సరాలుగా శ్రీ స్వామివారి పెరుమాళ్ళదగ్గర సేవాభాగ్యం లభించింది.

ప్రచారానికి శ్రీస్వామివారు బయలుదేరుతున్నపుడు నన్ను పిలిచి శ్రీ స్వామివారి సేవలో శ్రద్ధగ ఉండండి వారిని జాగ్రత్తగ కనిపెట్టండి అని ప్రేమగ ప్రతిసారి నిర్దేశనం చేస్తూండేవారు. వారు మాటల కన్న తన భగవచ్చింతనలోనే ఎక్కువ సమయాన్ని గడిపే వారు. శ్రీ స్వామివారు బయటనుండి ఎంత ఆలస్యంగా వచ్చినా వారు మంగళనీరాజనం చేసేవారు.

అలాంటి తల్లి స్వామివారిని లోకానికి అందించి జగదాచార్యులు అనే కీర్తికి కారణమైన ఆ మహాతల్లి గురించి ఎంత చెప్పుకున్నా లోటే. వారు సహస్రాబ్దివరకు ఉండి ఆ కార్యక్రమాన్ని చూడాలని ఎంతో తపనపడేవారు ఈ లోపల భగవంతుడు అమ్మగారిని తన దగ్గరకు తీసుకుని వెళ్ళినందుకు చాలా ఆందోళన పడుతున్నాను.

వారి సదాచరణ ఆశీర్వాదము ఎప్పుడూ నాలాంటివాళ్ళని మంచిమార్గంలో నడిపిస్తూంటాయి.

❖❖❖❖❖❖



# ప్రసన్నవదని - ప్రపన్న ప్రది

గోపరాజు కృష్ణమోహన్,
మైత్రాయణీశాఖ, సీతానగరం

అన్నదాత భయత్రాతా విద్యాదాతా తథైవ చ ।
జనితా చోపనేతా చ పంచైతే పితరః స్మృతాః ॥



ప్రాణదాత మా తండ్రియైతే, ఇప్పటి వరకు అన్నం పెట్టినవారు, చదివించినవారు, చెడుదారులు తొక్కకుండా తీర్చిదిద్ది అభయమిచ్చేవారు, ఉపనయనం చేయించిన వారిని పితరులు అంటారు. అని చాణక్యనీతి గుర్తుచేస్తోంది. అవన్నీ తానై నిలచిన అస్మదాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు, మా తండ్రి అని సగర్వంగా చెప్పుకుంటాను. ఎందుకంటే ఇంట్లో ఉన్నది కేవలం 7సంవత్సరాలు మాత్రమే! 38సంవత్సరాల జీవితకాలమంతా స్వామి సన్నిధిలోనే కాబట్టి వారే మా తండ్రి.

అలానే తల్లివిషయానికి వస్తే... జగదాచార్యులైన మా స్వామివారిని కన్న తల్లిగా మాకందరికి కూడా మాతృ ప్రేమను అందించారు. మేము ఇక్కడ చేరినప్పటినుండి అమ్మగారు, వారి కుటుంబం అంతా తెలుసును. వారి మనుమలు మా తరువాత ఆశ్రమంలో వేదాధ్యయనం చేసినవారు కావడం వల్ల అమ్మగారి కూతుర్లతో కూడా మాకు మంచి అనుబంధం ఏర్పడింది. రెండవ కుమారుడు కిషోర్ బాబు ఇంటికి వెళ్ళడం, పిల్లలతో ఆడుకోవడం ఇలా చాలానే ఉన్నాయి.

అమ్మగారితో సుమారు 30 సం.లుగా మేము చూస్తూనే ఉన్నాము. ఎప్పుడు ఎవరినీ దూషించడం కానీ, కోపించుకోవడం కానీ ఎరుగము. అలాంటి మహనీయురాలు అందరినీ తరింపచేయాలనే ఆలోచనతో ఆనాడు స్వామికి ఆశ్రమస్వీకారానికి ఒప్పుకుని మనని ఉజ్జీవింపచేసారు. అందుకు అందరూ కృతజ్ఞులుగా ఉండాలి. మా అందరిలోనూ అదే భావం నిండి ఉంది...

అమ్మగారిని అనేక సార్లు దర్శించుకున్నాను. 2005 శంషాబాద్ ఆశ్రమం ఏర్పడ్డాక మరీ సాన్నిహిత్యం ఏర్పడింది. అప్పడప్పుడు ఇంటికి వెళ్ళి సేవించుకునేవారం కానీ ఇప్పుడు ఎప్పుడూ శంషాబాద్ లో దర్శనమిస్తూనే ఉండేవారు. అమ్మగారినుండి నేర్చుకునే గుణగణాలు చాలానే ఉన్నాయి. కానీ ముఖ్యమైనది ప్రసన్నవదనము, ఎదుటివారితో మాట్లాడే తీరు మరెవ్వరికీ రాదు. అవి నేర్చుకునే ప్రయత్నం చేయాలి.

మనుషులం కదా! కొన్ని దేహసంబంధమైన విషాదాలు ఎవరికైనా ఏర్పడక తప్పవు. ఇంత తొందరగా ఈరోజు వస్తుందని అసలు అనుకోలేదు. అమ్మగారు ఎక్కడ ఉంటే అక్కడే వైకుంఠం. ఇప్పుడు నిజమైన వైకుంఠాన్ని అలంకరించారు. అసలు పెద్దస్వామివారికి (తమ ఆచార్యులకు) సేవచేయాలన్న ఆలోచనతో కాబోలు శ్రీచిన్నజీయర్‌స్వామివారిని సేవించి, భద్రాద్రి రాముని తీర్థంతీసుకొని అనుజ్ఞతో వెళ్ళారు. వారు వైకుంఠంలో నిత్యసూరి గణాలతో కైంకర్యాలని చేస్తూ ఉంటారు. కానీ మనమే చాలా దుఃఖాన్ని దిగమింగుకోలేక పోతున్నాం. ఇది దుర్దినమా! లేక ఆచార్యసన్నిధికి చేరడం సుదినమా... తెలియదు. కానీ అమ్మని అనుకరిస్తూ, ఆచార్యుని అనుసరిస్తూ ఆచరించడమే మన బాధ్యత.

❖❖❖❖❖❖

ఈ సృష్టిలో అందమైన పువ్వు మా అమ్మ పెదవులపై విరిసే చిరునవ్వు...





జ్ఞాన భాస్కరునికే తల్లి! నిత్య భాస్కరోపాసనలో...!

# పరమపదభాగ్యం



పురాణం వెంకటాచార్యులు
శ్రీరామానుజవాణి

తూరుపు బాలభానుణ్ణి ప్రసవించి ప్రపంచానికి వెలుగులు నింపినట్లు శ్రీమతి అలివేలు మంగమ్మగారు శ్రీమన్నారాయణుని ప్రసవించి లోకాల చీకట్లు పోగొట్టిన తల్లి. ఆ బిడ్డడే యావత్ప్రపంచ సంపూజ్య చరణులైన మన శ్రీస్వామివారు. అంతటి మహానుభావునకు తల్లి మరి. ఆ తల్లి చూసిన చాలు జన్మ చరితార్థమౌతుంది కదా మనకు! మరి ఆమెగా పలకరించడం, మాట్లాడడం మనం పూర్వజన్మలో చేసిన తపఃఫలం. అలాంటి భాగ్యశాలుల జాబితాలో నేనూ చేరడం నా తపఃఫలం సుమా. ఎలానో విన్నవించుకుంటాను.

1980వ సంవత్సరంలో రాజమహేంద్రిలో ఉభయవేదాంతసభలు జరుగుతున్న సమయమది. అప్పుడే అమ్మగారిని మొదటిసారి సేవించుకున్నాను. ప్రతీరోజు రాత్రి సభలు పూర్తైన పిదప శ్రీగోపాలాచార్యస్వామివారు విశ్రాంతి తీసుకున్నాక శ్రీమన్నారాయణాచార్యస్వామితో (మన స్వామివారితో) కలసి సైకిలు మీద అమ్మగారి వద్దకు వెళ్ళేవారం మేమిద్దరం. సేవించుకొని మరల తులసీరామానుజకూటం చేరేవారం.

అక్కడ ఉన్నటువంటి పాత గృహాన్ని తొలగించి నూతన గృహనిర్మాణం చేసే మహద్భాగ్యాన్ని అమ్మగారు నాకందించడం, వారి ఆంతరంగిక పరివారంలో ఒకనిగా భావించి, వారికి అవసరమైన సేవ సంతోషంగా పూర్తిచేసే శక్తిని ఆచార్యానుగ్రహం అందించేది.

"యథా రాఘవ నిర్ముక్తః శరః తద్వత్"

ప్రతి పనిని త్వరగా పూర్తి చేసే అలవాటు అప్పటి నుండే నాకు అలవడింది.

అమ్మగారు నేను శంషాబాద్ వెళ్ళినప్పుడల్లా చిరునవ్వుతో వాత్సల్యంతో పలకరించేవారు. ఆతల్లి ముఖారవిందంలో ఎంతవాత్సల్యం, ఎంత ప్రశాంతత ఇంకా కళ్ళముందే కదలాడుతున్నాయి.

లక్షలాదిమంది ఆమెను 'అమ్మా' అనే అంటారు. ఆమె త్యాగమూర్తి. జననమరణాతీతమైన శ్రీవైకుంఠం ఎంతో గొప్పది. ఆ పరమపదంలో శ్రీమన్నారాయణునికి నిత్యకైంకర్యార్థం చేరడం ఇది పరమపదభాగ్యం. అమ్మగారికి హృదయపూర్వక ప్రణామాంజలి.

❖❖❖❖❖❖





# మాతృదేవోభవ

సముద్రాల శ్రీనివాసాచార్య
శ్రీపాంచరాత్రాగమ పండితులు, సీతానగరం

తల్లి మనిషికి మొదటి దైవం. క్షమా గుణానికి, ఓర్పుకి మారుపేరు తల్లి. తన దేహంలో నవమాసాలు మోసి, తన ప్రాణాన్ని పణంగా పెట్టి, తన శరీరాన్ని పంచి, మనలను తయారుచేస్తుంది. నిజానికి అమ్మ దయ లేనిదే మనమేమి చేయలేం. రకరకాల పద్ధతులతో మనకు ఆట మాట నేర్పి, పడుతూ లేస్తూ ఉండే వయసులో చక్కటి నడకతో పాటు ఉత్తమ సంస్కారాలను నింపుతుంది అమ్మ. దైవం తెలియని జీవులు ఉండొచ్చేమో కానీ అమ్మ నెరుగని ప్రాణి ఉండదు. ప్రపంచంలో చేసే ఉపకారాలు అన్నిటికంటే జన్మనివ్వడం అనే ఉపకారం దేనికీ సరికాదు. ఇది గుర్తించడం తెలియని బ్రతుకులు వ్యర్థమే. తల్లి చేసిన ఉపకారానికి ప్రత్యుపకారమే లేదు. మనము ఏది చేసినా అది తీరేది కాదు. అందుకే వేదం కూడా "మాతృదేవోభవ" అంటూ దైవం కంటే కూడా అగ్రపూజ మాతృమూర్తికే అని నిర్ణయించింది. తల్లిని మించిన దైవమే లేదు.

అమ్మ ప్రేమను చవి చూడాలి అనే కోరిక దేవునికి కూడా కలుగుతోంది కాబోలు. అందుకే రాముడిగా కౌసల్యకు జన్మించి మాతృప్రేమ అనే సౌఖ్యాన్ని పొందాడు. ఇక కృష్ణుడు అయితే ఇద్దర్ని తల్లులుగా చేసుకొని మరింత మాతృప్రేమలో మునిగిపోయాడు. వందమంది ఆచార్యుల కంటే ఒక తండ్రి, వెయ్యి మంది తండ్రుల కంటే తల్లి గౌరవనీయురాలు. పూజ్యురాలు. త్రేతాయుగంలో జీవులందరిని రక్షించడం కొరకు కౌసల్యాదేవి శ్రీరామచంద్రుని లోకానికి అందించింది. ఈ కలియుగంలో కాంతిమతీ దేవి జీవులందరినీ ఉద్ధరింపజేసి, భగవంతుని సాన్నిధ్యాన్ని అనుగ్రహించే జగదాచార్యులు భగవద్రామానుజుల వారిని మనకు అందించింది. భగవద్రామానుజుల వారి తరువాత వారి యొక్క పరంపరను సాగించడం కొరకు కౌసల్యాదేవి అంశగా అలివేలు మంగతాయారమ్మగారు శ్రీరామచంద్రుని అంశగా అపర రామానుజులుగా విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని వ్యాప్తి చేస్తూ, జీవులందరినీ తరింపజేసి, భగవంతుని యొక్క సాయుజ్యాన్ని అనుగ్రహించేటువంటి గొప్ప ఆచార్యులను శ్రీ చిన్న జీయరుస్వామి వారిని మనకు ఈ లోకానికి అందించినటువంటి వాత్సల్య మూర్తి ఆ మాతృమూర్తి.

ఇటువంటి ఆచార్యులను మనకు ఇచ్చినటువంటి అమ్మగారికి జన్మజన్మలా అందరము ఋణపడి ఉంటాము. ఆ అమ్మ యొక్క ఆశీస్సులు మన అందరి మీద ఎప్పుడూ ఉండాలని అందరము కోరుకుందాం.

ఎన్నటికీ తీర్చలేనిది తల్లి ఋణం



# నారీమణి



శ్రీమాన్ మధుసూదనాచార్య
శ్రీపాంచరాత్రాగమ పండితులు, సీతానగరం

"భూలోక మంగళ దీపరేఖ"

"పరార్థః సూర్యసదృశః స్వార్థస్తు గృహదీపవత్"

తన ఇంటి దీపాన్ని వెలిగించి లోకాలకు కాంతి అందించిన అమ్మగారు 'మన అమ్మగారు'. 'నమో నమః'

ఆచార్యనిష్ఠకు పరాకాష్ఠ మన అమ్మగారు, మూర్తీభవించిన త్యాగ మూర్తి. ఆచార్యాజ్ఞను శిరసావహించి తన కుటుంబం వరకే పరిమితమయ్యే స్థితి నుండి తమ పుత్రరత్నాన్ని లోకారాధ్యునిగా, జగదాచార్యులుగా తయారుచేసారు అమ్మగారు.

శ్రీరామచంద్రుని వృత్తాంతము ఇక్కడ గుర్తుకు వస్తుంది. శ్రీ రామచంద్రుడు చిన్న వయస్సులో అయోధ్యకే పరిమితం కాకుండ, లోకాభి రాముడు అవ్వడానికి అప్పుడు తీసుకున్న నిర్ణయం కఠినంగా అనిపించినప్పటికీ, కాలక్రమేణా ఆ నిర్ణయమే కాకపోతే, అయోధ్యకే పరిమితం అయ్యేదేమో 'శ్రీరామచంద్రుని కీర్తి'.

సదాచార సంపన్నురాలు మన అమ్మగారు. ఎటువంటి స్థితిలోనైనను ఆచార్య వ్యవహారాలను విడువక పాటిస్తూ, ఆచరిస్తూ అందరితో పాటింపచేసేవారు.

ఈ నాటి నారీమణులందరికి, మాతృమూర్తులందరికి మార్గదర్శి, మన అమ్మగారు. ప్రతి మాతృమూర్తి కూడా ఎలా నడుచుకోవాలో ఆచరించి చూపించారు. తమకు కలిగిన సంతానాన్ని ,కనీసం సంతానం లో ఒకరిని అయినా తమ దేశం కోసం, తన సంప్రదాయం కోసం ఇవ్వాలి అని తాము ఆచరించి చూపించారు. అమ్మగారే ఈ సంకల్పం చెయ్యక పోతే మనలాంటి వారందరి గతి ఏమిటి?

మనల్ని అందరిని ఉద్ధరించటానికి, స్వార్థం వీడి పరార్థం వైపు నడిచారు అమ్మగారు.

పురాణ ఇతిహాసాలలో, చరిత్రలలో మాతృమూర్తి వైభవం గురించి మనకి ఎన్నెన్నో ఘట్టాలను, కథలను తెలియచేస్తారు పెద్దలు. కానీ మనం ప్రత్యక్షంగా చూసి తరిస్తున్నాము. ఇది మన సౌభాగ్యం. అమ్మ! మీకు మంగళం.

శ్రీ కృష్ణుని గర్భాన ధరించిన దేవకీ దేవిని, శ్రీరామచంద్రుడిని గర్భాన ధరించిన కౌసల్యమ్మను, దేవతలు, ఋషులు, మహానుభావులు కొనియాడారు. ఎంత అదృష్టం అమ్మ నీది అని.

మన ఆ.చి. అలివేలు మంగతాయారమ్మ గారిని కూడా మన ఆళ్వారులు, పూర్వాచార్యులు అందరు మంగళాశాసనం చేసి ఉన్నారు అనడంలో ఎటువంటి సందేహము లేదు. ఎందుకంటె ఈ భారతావని లో ఆయా

పుత్రుని ధీరునిగా వీరునిగా పురుషోత్తమునిగా తీర్చిదిద్దేది తల్లి!



సమయాలలో అవతరించి, ఉదయించి తమ జ్ఞానముతో లోకములో ఉన్న అజ్ఞానపు చీకట్లను తరిమి కొట్టారు. కానీ వారు తమ పాద స్పర్శతో మిగిలిన భూభాగాలను అనుగ్రహించే అవకాశమే లేకపోయినది. ఆ మహత్కార్యం చేయగల సమర్థులను, భగవదాజ్ఞతో, ఆళ్వార్ ఆచార్య గోష్ఠి లోకంలో అవతరింప చేయాలనీ సంకల్పం చేసుకొని ఉంటారు. దాని అనువైన స్థానం, వంశం, ఆచారనిష్ఠా కలిగిన కుటుంబం కావాలి కదా మరి. అంతటి గొప్ప వైభవం కలిగినది మన అమ్మగారే అని సంకల్పం చేసి "స్వాతిముత్యాన్ని" మన అమ్మగారి గర్భాన నిక్షిప్తం చేశారు అనడంలో ఎటువంటి సందేహమే లేదు.

ఆ నాటి ఆళ్వారులు, ఆచార్యులు అందరు భగవత్ వైభవాన్ని నలుదిశలా వ్యాపింపచేయాలి అని సంకల్పించారు. ఆ సంకల్పాన్ని తమ దివ్య పాదస్పర్శచే పునీతం గావిస్తూ వారి ప్రవచనామృతంతో అజ్ఞానాన్ని తొలగిస్తూ నడిచే శ్రీమన్నారాయణునిగా, భగవద్ రామానుజ పునరావతారముగ పండితులు, పెద్దలు, పిన్నలు, గ్రామీణులు, ఇలా అందరు కొనియాడుతున్నారు అంటే దానికి మూలకారణం మన అమ్మగారే .వారే త్యాగం చేయకపోతే మనమందరం యెంత కోల్పోయే వాళ్ళమో కదా. మనలందరిని శ్రీ సంప్రదాయ సంపన్నులను చెయ్యడం కోసం తాము త్యాగం చేశారు. మనం ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేనిది. చరిత్రలో ఒక అద్భుతమైన ఘట్టం అమ్మగారి అవతారం. మనమందరం ధన్యులం.

అమ్మగారి దయార్ద్ర హృదయం! అమ్మగారిని ఎప్పుడు సేవించిన,ఆప్యాయతతో మంచి పలకరింపు తో ఎన్నో విషయాలను చెప్పే వారు. మా అమ్మగారి క్షేమ సమాచారాలను అడుగుతూ ఉండేవారు. నా విషయాలను అడిగి తెలుసుకునే వారు. అమ్మగారిని క్షేమ సమాచారాలు అడిగినపుడు, అంత పెరుమాళ్ళు అనుగ్రహం, ఆచార్య కృప అని అనేవారు. ఆచార్యుల విషయంలో ఎలా ఉండాలో వారి మాటలలో, వారి ఆచరణలో మార్గదర్శనం చేసే వారు. అమ్మగారిలో కోపాన్నీ ఎపుడు చూడనే లేదు. ఎపుడు చిరుమందహాసంతో పలకరించేవారు.

దీపావళి పండగ దాసునికి అందరికి పెద్ద పండగ. ఎందుకంటే, ఆచార్యులు అవతరించిన తిరునక్షత్రం. అమ్మగారే స్వయంగా మా (విద్యార్థులు) అందరికి మాడు పైన మూడు మార్లు నూనె అద్ది, ఊర్ధ్వ పుండ్రాన్ని పెట్టి మంగళ హారతులు ఇచ్చి ఆశీర్వదిస్తూ ఉండేవారు.

దీపావళి పండగలో టపాసులు పొందకపోయిన బాధ కలిగేది కాదు. కానీ ఈ మంగళ హారతుల సమయంలో లేకపోతె మాత్రం, అయ్యో! ఈ సంవత్సరం అమ్మగారి ఆశీర్వచనం పొందలేదు అనే బాధ ఆ సంవత్సరం మొత్తం ఉండేది. "అమ్మగారి ప్రేమానురాగాలు చాల గొప్పవి". మంచి మనిషిగ తయారు చేస్తాయి. వారున్న స్థానానికి విద్యార్థులందరిని పిలిచి మధుర పదార్థాలు అందించే వారు. ఏ ఒక్కరికి అందకపోయినను, అయ్యో నీకు అందలేదా అని మరిన్ని అందించేవారు.

చాతుర్మాస్య వ్రతానికి ముందున్న సమయంలో ఒక సాయంకాల సమయంలో ఇంటికి పిలిచి చాల సమయం మాట్లాడారు. ఎన్నెన్నో విషయాలను చెబుతూ ఆచార్యుల విషయంలో ఎలా ఉండాలో చెప్పారు. అమ్మగారి వైభవాన్ని

ఎంత చెప్పుకున్న చాల చాల తక్కువే. కానీ ఉండలేక కొన్నిటిని మాత్రమే ఇక్కడ ఉంచగలుగుతున్నాను. అన్నింటిని ఇచ్చిన అమ్మగారికి, ఏమి ఇచ్చి ఋణం తీర్చుకోగలం? మనము ఆ తల్లికి మంగళం పాడటం తప్ప!.

తమ దయార్ద్ర హృదయంతో మన అందరికి అందించిన ఆచార్యుల సేవలో వుంటూ, వారి మార్గంలో నడవటం మన కర్తవ్యం. మనం చేయవలసిన కైంకర్యం.

నిరాడంబరమైన జీవనం అమ్మగారిది. ఎలా జీవించాలో వారి ఆచరణలో చూపించారు. తమ ఆచార్యుల యందు ఉన్న భక్తి విశ్వాసాలు అమోఘం. పెద్ద స్వామి వారిని తలుచుకుంటూనే ఎన్నెన్నో కార్యక్రమాలను చేసే వారు.

ఈ కలియుగంలో భగవంతుని విలక్షణ రూపాలైనా విభవ అర్చామూర్తులు ఒకే అవతారంలో అందించినది శ్రీవేంకటేశ్వరస్వామి. అలానే పద్మావతి అలర్మేల్ మంగాదేవి మన అమ్మగారి రూపంలో మరల అవతరించి శ్రీమన్నారాయణుని, జగదాచార్యులను ఏకరూపంలో మనకి అనుగ్రహించింది.

❖❖❖❖❖❖



నడకనైనా, నడవడికనైనా నేర్పే తొలి గురువు తల్లి!



# అద్వితీయురాలు

**శ్రీమాన్ యుగంధరాచార్య**

**ఆగమపండిత, డాలస్**

సర్వ జగన్నివాసుడైన పరమాత్మకు నివాస భూతయైన దేవకీదేవి అద్వితీయమైన తల్లి అని తిరుప్పావై 25వ పాశురంలో ఆండాళ్ తల్లి కీర్తిస్తుంది. కానీ దేవకీదేవికి కృష్ణుడి బాల్య లీలలు చూసే అదృష్టం కలగలేదు.

ఆ లీలలను అనుభవించిన మరో అద్వితీయమైన తల్లి యశోదమ్మకు ఆయనను ప్రసవించే అదృష్టం లభించలేదు.

అంతట నిండిన పరమాత్మ తత్వాన్ని లోకానికి ఆవిష్కరించే ఆచార్యులను లోకానికి అందించడమే కాకుండా, ఆచార్యుల అతి మానుష వైభవాన్ని యావజ్జీవం దర్శించి మంగళాశాసనం అనుగ్రహించిన అమ్మగారు పై ఇద్దరు తల్లులను మించిన అద్వితీయరాలు.

సొంత లాభం కొంత మానుకొని సమాజ సేవకు పిల్లలను పంపించడానికి వెనుకంజ వేసే వ్యక్తిత్వాలు కల ప్రపంచం, తద్వారా తమకు ఏంలాభం అనుకునే సమాజం. పంపినా ఎన్ని గంటలు సేవ చేసారో చేస్తారో అని లెక్క వేసుకునే లోకం. ఇటువంటి ప్రపంచంలో ఉంటూ, "సృష్టస్త్వం వనవాసాయ" అని లక్ష్మణుని శ్రీరాముడితో 14 సంవత్సరాలు వనవాసానికి సంతోషంగా సాగనంపిన సుమిత్రాదేవి వలె, సత్సంప్రదాయ సంరక్షణార్థం యతివరులై చరించేలా తన కుమారుని యావజ్జీవ దీక్షకు సంతోషంగా సమ్మతించిన ఆ తల్లి అక్షరమైన వైభవాన్ని అక్షరాలలో రాయడం పలకడం ప్రజ్ఞావంతులకే అసాధ్యం. దాసుని ఈ ప్రయత్నం కేవలం మనసును నాలుకను పునీతం చేసుకోవడం కోసమే.




ఏ దేశ మేగినా..ఏ తీరం దాటినా మరువని మమకారం అమ్మ



అమ్మగారు పెద్దజీయర్ స్వామివారి శ్రీచరణాలను చేరడం విశేషమే అయినా శ్రీకృష్ణుని నోట లోకాలను చూసిన యశోదమ్మకు పరమాత్మ సంకల్పశక్తిచే అద్భుతం కనుమరుగైనట్టుగా అమ్మగారి పరలోక యాత్ర అస్మదాదులకు నమ్మశక్యం కాని నిజం.

"హరిం సుతం విలోక్య" అన్నట్లుగా కుమారుడైన పరమపురుషుని సేవిస్తున్న వసుదేవుని వలె, అమ్మగారు పరమాచార్యులను మన ఆచార్యుల యందు దర్శించుటచే, వాత్సల్య పూర్ణమై విప్పారిన నేత్ర సౌందర్యం, సత్వగుణ భూషణ మైన మందహాసం, కోయిలలకే కుతూహలాన్ని కలిగించేలా ఆచార్యులవిషయమై మంగళ గీతికలను ఆలపించే గళ మాధుర్యం, జగన్మోహనాకారమైన ఆచార్య తిరుమేనికి మంగళహారతులిస్తూ దృష్టి దోషాన్ని నివారించే ప్రేమ నిండిన హృదయం..మంగళాశాసన పరులలో అగ్రేసరయై, భాగవత గోష్ఠికి మంగళ దీపమైన అమ్మగారిని చరమదశలో సేవించుకోలేని మందభాగ్యం దాసునిది.

అమ్మగారు సహజ వాత్సల్యపు మూట. దాసుని పై ప్రత్యేక అభిమానాన్ని చూపేటువంటి వారు. తిరుపతి వెంకటేశ్వర స్వామిని సేవించుకునే ముందు వరాహస్వామి దర్శనం చేసుకున్నట్టుగా, స్వామివారి కుటీరానికి వెళ్లేముందు అమ్మగారిని సేవించుకోవడం దాసునికి అలవాటు. గత సంవత్సరం కూడా ఎన్నో గంటలు సకుటుంబంగా అమ్మవారి సన్నిధిలో కూర్చుని వారి డైరీలోని ఎన్నో కీర్తనలు పాడించుకుని విని తరించిన ధన్యజీవిని.

అప్పుడు అమ్మగారు ఒక కోరిక కోరారు. స్వామి వారిపై ఒక పాట రాయమని. అప్పుడే పుట్టిన పాలుగారే చెక్కిళ్ళతో ఉన్న పాపడిని లాలిస్తూ ఉన్నట్టుగా ఉండాలి అన్నారు. అలాగేనమ్మా ప్రయత్నిస్తాను అని సమాధానం చెప్పాను.

మళ్లీ నరకచతుర్దశి ముందు రోజు శారద గారు ఫోన్ చేశారు. అమ్మగారికి పాట రాసిస్తాను అన్నారట కదా అని.

అప్పుడు మెట్లెక్కుతూ ఉన్నాను. రెండడుగులు వేసి అక్కడే కూర్చున్నాను. ఆ తల్లి అనుగ్రహంతో అప్పటికప్పుడు ఒక పాట అక్షరబద్ధం అయింది, బాణి కూడా సిద్ధమైంది, అమ్మ గారికి ఫోన్ చేసి పాట వినిపించాను. అమ్మగారు చాలా సంతోషించారు. అప్పటికప్పుడే ఆ పాట అమ్మ గారు పాడారు.

**"పాలబుగ్గల పసిడి వన్నెల చిన్నారి నీవేనా?**

**పుడమిపైన పండువెన్నెల నింపగ వచ్చితివా నాన్న"...**

శంఖంలో పోసిన తీర్థం గంగాజలం అయినట్టు దాసుని రచన అమ్మగారి గళంలో పవిత్రమైంది. అదృష్టం కొద్దీ అది రికార్డ్ చేయడం జరిగింది. త్వరలో అది భాగవత గోష్ఠికి చేరుతోంది.

ఒకసారి ఫేస్ బుక్ లో ఒక చిత్రం చూశాను. దివ్య సాకేతధామం లోనికి వెళుతున్న స్వామివారిని వారి ప్రక్కనుంచి అమ్మగారు సేవిస్తున్నారు.

ఇంత ప్రయోజకుణ్ణి కన్నాను, ఏమి నా అదృష్టం అని మనసులో అనుకుంటూ, కుమారుని ప్రత్యక్షంగా

తన శరీరాన్ని ప్రాణాలని పంచి జన్మనిస్తుంది తల్లి



పొగడకూడదు కాబట్టి, ఆనందాన్ని ఆపుకోలేక ఆ దివ్యసాకేత రామునికి అమ్మగారు కృతజ్ఞతలు ఆవిష్కరించుకుంటూ ఉన్నట్టుగా ఒక గీతం దాసుని మనసులో మెదిలింది.

ఏమని పొగడేది రామ! ఇట్టి పుత్రునిచ్చావని,

ఏమని పొగడేది రామ! సాకేత ధామ!

ఈ పాట కూడా అమ్మగారి విని, ఇష్టపడి పాడారు. స్వామివారి సన్నిధిలో కూడా పాడాలని ప్రార్థిస్తే, అలాగే అన్నారు. తీర్థగోష్ఠి సమయంలో "స్వామి వారు ఏమనుకుంటారో.. నేను పాడను. నువ్వే పాడమన్నారు.

ఆ పాట దాసుడు పాడుతున్నంత సేపు అమ్మగారు ఎంత మురిసిపోయారో ( దాసుని ఎడమవైపు స్తంభం దగ్గర స్వామి వారు వేంచేసి ఉన్నారు. దాసుని ఎదురుగా ఉన్న స్తంభం వద్ద అమ్మగారు నిలుచుని ఉన్నారు)

నా కన్నులనే కెమెరాలతో బంధింపబడి మనోఫలకముయందు సుస్థిరమై ఉంది ఆ అపురూప దృశ్యం.

చివరగా..

అమావాస్య బ్రతుకులలో పున్నమి చంద్రుని వెలుగు మా జీవితాల్లో స్వామివారి యొక్క సాన్నిధ్యం. అది ఆ త్యాగమూర్తి వల్లనే సాధ్యం. దాసుడే కాదు, ఆస్తిక లోకమంతా వేవేల జన్మలెత్తినా ఆ తల్లి రుణం తీర్చుకోలేనిది. అమ్మగారి శ్రీ పాదపద్మముల యందు సభక్తిక అక్షర నీరాజనం సమర్పించుకుంటూ, ఆచార్యుల శ్రీ చరణములకు సాష్టాంగ నమస్కారం చేస్తూ.. అడియేన్, యుగంధర రామానుజ దాసన్.

అమ్మ అమ్మ అలమేలు మంగమ్మ !
అందరగాచే గురువును అందించిన జన్మ !!
ప్రేమమూర్తి! మీ త్యాగమునకు
సరికావు అంజలులు,
వైకుంఠవాసిని ! శ్రీపదయుగళికి
ఇవియే నీరాజనములు
పుండరీకాక్షుని చూచిన యశోద కన్నుల అందాలు,
మీ తిరుముఖమున పొడగాంచితి అపురూపపు భావాలు!
జగద్గురువును చూపే గురువుకు ఆలయమీవమ్మ,
దేవకీ యశోదమ్మలకు ప్రతిరూపము మాయమ్మ!!
కోయిలలకును శ్రవణపేయములు
(మీ) గానమధురిమలు,
భక్తబృందముకు ఆప్తతమములు
ఆత్మోజ్జీవములు!
పరమపదముననను పెద్దజీయరాచార్య సన్నిధిలో
హరిసంకీర్తనలాలపించగను వేంచేసితివమ్మ!!
మరి మమ్ము మరువకమ్మా..
ఎందరు తల్లులలో, ఎవరికి కలుగును? ఇంతగొప్ప జన్మ!
పరమపదమునకు సోపానములను నిర్మించితివమ్మ!
సాధులోకము ఎల్లకాలము రుణపడె మీకమ్మ!
సాధుశీల! మీ శ్రీపదయుగళికి సాష్టాంగములమ్మ!
సాధుశీల! మీ పదదాసులకు దాసుడనేనమ్మా ..

❖❖❖❖❖❖

బాధలని సహించి బ్రతుకుతెరువు చూపిస్తుంది అమ్మ

# ఆకటివేళ అన్నపూర్ణయై....

**ఆరవెల్లి పవనకుమారాచార్యులు**
**జెట్-సీతానగరం**



సమస్త జగత్తుకి మూలకారణం లక్ష్మీవిశిష్టుడైన ఆ భగవంతుడు. మనం అంతా ఈ చరాచర ప్రకృతి, జీవులు అందరూ ఆయన సొత్తే. మనల్ని రక్షించడమే ఆయన ప్రధాన లక్ష్యం. అందరికోసం ఆ స్వామి ఎన్నో అవతారములను స్వీకరించాడు. స్వీకరిస్తూనే ఉంటాడు. అలా స్వీకరించిన అవతారాలలో కొన్నింటిలో తనకి తల్లి తండ్రులుగా కొందరికి అదృష్టాన్ని కలిగిస్తాడు. ఆ తల్లి తండ్రులుగా అదృష్టాన్ని పొందిన ఎందరిలోనో కొందరికి తను లోబడి తన యొక్క అసాధారణ శక్తిని చూపించి అనుగ్రహిస్తాడు స్వామి. ఆ వరుసలో ప్రధానమైనవి రెండు అవతారాలు 1. శ్రీరామావతారము. 2. శ్రీకృష్ణావతారము.

శ్రీరాముడిగా అవతరించి తల్లి తండ్రులను సేవించాడు. వారి మాటను మీరకుండా ప్రవర్తించాడు. పెద్దల వద్ద, గురువుల వద్ద, వీరు వారని ఏమి అందరి దగ్గర "రాముడు మంచి బాలుడు" అన్న పేరు పొందాడు. రామున్ని కన్న తల్లి తండ్రులు ఎంతో అదృష్టవంతులు అని అందరూ కొనియాడారు. విశ్వామిత్ర మహర్షికూడా రామున్ని సంబోధిస్తూ "కౌసల్యా సుప్రజా రామ" అని తల్లి సంబంధంతో మేలుకొలుపుతాడు. రాముడికి కూడా అదే ఇష్టం. దశరథ కుమారుడిగనే తనని గుర్తించమంటాడు. దేవతలందరూ రావణవధ అనంతరం రామున్ని నువ్వు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడవు అని కీర్తిస్తే రాముడు మాత్రం "ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్" అని తనని దశరథ కుమారుడుగనే ప్రకటించుకుంటాడు. అందుకే మన సంప్రదాయంలో రాముణ్ణి "చక్రవర్తి తిరుమగన్" అని సంబోధిస్తూంటారు.

ఇక రెండవది శ్రీకృష్ణావతారం. తనకి జన్మను ఇచ్చింది "దేవకీ వసుదేవులు వారికి పుట్టడంతోనే శంఖ, చక్ర, గదాది ఆయుధాలతో, పట్టు పీతాంబరములతో చతుర్భుజాలతో దర్శన భాగ్యాన్ని కలిగించాడు. వారిని బంధ విముక్తులని చేసాడు. ఇక పెంచిన తల్లి తండ్రులు "యశోదా నందగోపులు". వారికి చిన్నప్పటి నుండి ఎన్నో లీలలని చూపించాడు. తల్లి తనకు చేసిన మర్యాదకి గుర్తుగా "దామోదరుడు" నామాన్ని పొందాడు. ఈ అవతారంలో కూడా భగవంతునికి తండ్రి సంబంధంగా "నందగోపన్ కుమరన్" అని కానీ, తల్లి సంబంధంగా' "యశోదై ఇళంశింగం" అని కానీ పిలిస్తేనే ఎంతోఇష్టం. భగవంతుడు ఆ అవతారాలలో తల్లి తండ్రులకు ఇచ్చిన ప్రాధాన్యం అటువంటిది.

**ఆకటివేళ అన్నపూర్ణావతారం అమ్మే!**



మరి ఆ భగవంతుడే ఈ కలియుగంలో వస్తే...

**శ్లో సాక్షాత్ నారాయణో దేవ: .................. శాస్త్ర పాణినా ॥**

అన్నట్టు సాక్షాత్తూ నారాయణుడే ఈ భువిపై మనల్ని అందర్ని ఉద్ధరించడానికి ఆచార్యుడై అవతరిస్తాడు. ఈ ఆచార్య అవతారంలో కూడా తన కన్న తల్లి తండ్రులుగా ఒకర్ని ఎంచుకుంటాడు. మరి అంత కౌసల్యా, యశోదా దేవిలతో సమానమైన భాగ్యం. ఎవరికుంది? అంటే మన "ఆ.చి. అలివేలు మంగ తాయారు" అమ్మకి మాత్రమే. అందుకు భగవంతుడు ఆచార్యుడై ఆమె గర్భాన అవతరించారు. అంతటి గొప్ప మాతృమూర్తి మరి ఎక్కడా ఉండరు అని అనడంలో "అతిశయోక్తిలేదు. ఇంటిలో ఎన్నో సమస్యలున్నా, ఎదిగి, బాధ్యత ఎరిగిన కొడుకుని సమాజానికి సేవచేయుటకు అర్పించిన మహనీయురాలు ఆ తల్లి. తల్లి నిర్దేశించిన మార్గాన్ని అనుసరించే తనయుడు మన ఆచార్యులు. వీరిద్దరిక కలయిక చూస్తే దీపావళి పండగ.

ప్రతీ దీపావళీ మాకు గొప్పవరం. ఆ తల్లి తన తనయుడైన మా ఆచార్యులతో పాటు మా అందరికీ తలకి నూనెరాసి, బొట్టు పెట్టి, మంగళ హారతులు ఇచ్చేవారు. వారితో దాసుడికి మర్చిపోలేని సందర్భాలు చాలా ఉన్నాయి. అందులో ఒకటి ఎప్పుడూ గుర్తొస్తుండేది. అందరితో పంచుకునే చిన్న ప్రయత్నం ఇది.

ఇది 2006లో జరిగిన సంఘటన. నాకు అప్పుడు 16 ఏండ్లు. మేము అందరం కలసి ఢిల్లీ నగరం దగ్గర ఉన్న "ఫరీదాబాద్"లో ఒక లక్ష్మీనారాయణ మందిరం ప్రతిష్ఠా కార్యక్రమానికి వెళ్ళివచ్చాము. అప్పుడు మన జట్ దొమలగూడలో ఆ రాత్రి ఉన్నాము. ప్రయాణ బడలికతో అలసిపోయి పడుకున్నాము. తెల్లవారు ఝామున లేచి చూసేసరికి ఎక్కడవారు అక్కడికి వెళ్ళిపోయారు. నేను, మరో ముగ్గురో, నల్గురో మాత్రం ఉన్నాము. మేము కూడా బయలు దేరడానికి సిద్ధం అయి, అమ్మగారు అక్కడే ఉన్నట్టు తెలిసి వెళ్ళి దాసోహం సమర్పించి బయలుదేరుతున్నాం అని చెప్పాం. వెంటనే "ఏమైనా తిన్నారా?" అని అడిగారు. మేము "లేదు" అని అన్నాము. "అయితే తిని వెళ్ళండి" అని అన్నారు. అక్కడ వంటశాలలో చేసుకోవడానికి అన్నీ ఉన్నా వంటచేయడం మాలో ఎవరికీ రాదు. ఒక 15 నిమిషాల తరువాత మేము ఏంచేస్తున్నామో చూడటానికి అమ్మగారు వచ్చారు. మమ్మల్ని చూసి "ఇంకా మొదలు పెట్టలేదే?" అని అన్నారు. మేము "మాకు ఎవ్వరికీ వంటరాదు" అని విషయం చెప్పాం. అమ్మగారు ఒక్కసారి నవ్వి. "నేను లేనూ" అంటూ మాకు అప్పటికప్పుడు ఉప్మా చేసి వడ్డించారు. మాకు ఉప్మా ఎలా చేయాలో నేర్పించారు. అమ్మ మాకు వడ్డించి, మా ఆకలి తీర్చిన ఆ క్షణం నేను ఎప్పటికీ మర్చిపోలేను. అమ్మగారు సాక్షాత్తూ అన్న పూర్ణమ్మే.

అటువంటి తల్లిగుణమే స్వామి వారిది కూడా. ఎప్పుడు వచ్చినా "ప్రసాదం తీసుకున్నారా? లేకపోతే తీసుకొని వెళ్ళండి" అని అంటారు. ఆ మాట విన్న ప్రతీసారీ నాకు ఆ సందర్భమే గుర్తుకు వస్తుంది.

ఈ తల్లి సంబంధమే, ఆశీర్వాద బలమే మన స్వామి వారిని లోకారాధ్యులుగా చేసింది. ఈ తల్లితో సమానంగా కౌసల్యా, యశోదలుకూడా తులతూగలేరనేది నాభావం. ఆ తల్లి ఋణం తీర్చుకోలేనిది.

అటువంటి గొప్ప మహానుభావురాలు మన మధ్య భౌతికంగా దూరమైనా, ఎల్లప్పుడూ ఆ శ్రియ:పతి సాన్నిధ్యంలో, ఆచార్య సేవలో నిత్యకైంకర్యాన్ని సేవిస్తూంటారు.

ఆగొప్ప మాతృమూర్తి దివ్య పద సన్నిధిలో సాష్టాంగం సమర్పిస్తూ...

**అందరికీ ఆ దేవుడే దిక్కు. ఆయనకీ దిక్కూచి కాగలదు అమ్మ**

# అమ్మగారితో నా అనుబంధం

మరింగంటి రాఘవాచార్యులు, ప్రధానార్చకులు,
శ్రీఅష్టలక్ష్మీదేవాలయం, హైదరాబాదు.



అర్తమూరు గ్రామవాసినే నమ: ఇది మన పరమాచార్యులైన శ్రీశ్రీశ్రీ పెదజీయర్ స్వామివారి అష్టోత్తర శతనామాలలో పదకొండవ నామము.

అశేష భక్త జనావళిచే నిత్యమూ తిరువారాధనలలో అనుసంధించబడే అదృష్టాల సెలయేరు. నేను ఘనంగా చెప్పుకునే మా సొంత ఊరు అర్తమూరు.

మన పెదజీయరుస్వామివారి (పూర్వాశ్రమంలో శ్రీమన్నారాయణాచార్య స్వామివారు) ధర్మకర్తృత్వములో వైభవోపేతంగా జరిగే శ్రీవేణుగోపాలస్వామి కోవెల కైంకర్యపరులలో మా కుటుంబమొకటి.

వారి ఊరిలోనే జీవనం, వారి కోవెలలోనే ఉజ్జీవనం ఇలా వారి కుటుంబానికి మా కుటుంబానికి తరతరాల బంధమున్నది. వారితో దైహికమైన బంధుత్వం ఉన్నప్పటికీ మా కుటుంబాల మధ్య దైవికమైన బంధుత్వమే బలీయంగా ఉండేది. ఆ బంధమే నన్ను శ్రీపెద జీయర్ స్వామివారి అనుగ్రహపాత్రుడిని చేసింది. వారి ఆశ్రమంలో ఛాత్రుడిని చేసింది.

1976 సం॥లో నడిగడ్డపాలెం శ్రీవాసుదాసాశ్రమంలో నెలకొల్పబడిన 'శ్రీమన్నారాయణ వేద వేదాంగ విద్యాలయం' లో నేను మొదటి విద్యార్థిని.

నా ఉద్ధారకాచార్యులైన శ్రీపెద్దజీయర్ స్వామివారి అనుగ్రహం. నా ఉపకారకాచార్యులైన 'కులపతి' శ్రీతె.కం.గోపాలాచార్యస్వామివారి కృపామయబోధనం నా జీవనవికాసానికి కారణాలు. అక్కడే నా అధ్యయనం మొదలైంది. నా తరువాత చిన్న శ్రీమన్నారాయణాచార్యులవారు ఆశ్రమంలో వేదాంత విద్యార్థిగా చేరారు. వారే ఇంతింతై వటుడింతై బ్రహ్మాండాంతస్సంవర్ధియై త్రివిక్రమమూర్తి అయిన మన శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారు.

సరదాగా ఒక్కమాట.. నేను శ్రీచిన్నజీయర్‌స్వామివారి కంటే సీనియర్ అన్నమాట. ఇలా మురిసిపోవడం కూడా... ఓ మధురానుభూతి కదా!

అమ్మగారు ఆశ్రమానికి వచ్చినప్పుడల్లా వారి ఊరివాడిని కావడంతో నన్ను వారి కుమారుడిగానే వాత్సల్యంతో చేరదీసేవారు. నేను మా అర్తమూరు వెళ్ళే ప్రతిసారీ రాజమండ్రి సీతంపేటలోని అమ్మగారింటికి వెళ్ళడం.. ఆప్యాయంతో నిండిన వారి ఆశీర్వాదాలను పొందడం... ఇలా అమ్మగారితో నా అనుబంధం నిర్విశేషంగా సాగింది.

రాఘవా! రాఘవా!! అని ఆప్యాయంగా వారు పిలిచే పిలుపు ఇంకా నాలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అమ్మగారి ద్వితీయ పుత్రుడు కిషోర్‌బాబు, నేను చిన్నప్పటి నుండి మిత్రులం. వారి అక్కా చెల్లెళ్ళంతా నన్ను ఓ సోదరుని గానే



అభిమానించేరు, ఆదరించారు.

వ్రేపల్లెలో శ్రీకృష్ణపరమాత్మతో గోపబాలకుల ఆశ్రమంలో మా చిన్నస్వామివారితో వారి మా బాల్యము, చాపల్యము ఎన్నటికీ మరువలేనిది, మరపురానిది.

శ్రీచిన్నజీయర్‌స్వామివారి 'ఆత్మీయత'ను పొందిన నేను రాజమండ్రి తులసీరామానుజస్వామితో వేదవేద్యుని అర్చనా కైంకర్యానికి వికాసతరంగిణి నిర్వాహకత్వానికి నియమించబడ్డాను.

1991సం॥లో 'వికాస తరంగిణి' ఆవిర్భవించింది. మా రాజమండ్రిలోనే ఆ 'ఆవిర్భావం'లో నా ఉడుత పాత్రకూడా ఉంది. తులసీరామానుజ కూటం కేంద్రంగా వికాసతరంగిణి తరుపున రాజమండ్రి పరిసర ప్రాంతాలలో ఎన్నో ప్రయోజవంతములైన ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించాము.

'వికాస తరంగిణి' ఒక ప్రత్యేకమైన సేవాసంస్థగా ప్రజలందరి మన్ననలను అందుకున్నది. మేము నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భక్తలోకాన్ని మంత్రముగ్ధలను చేసే గొప్ప ఉత్సవం శ్రీకృష్ణాష్టమి వేడుక. మా వేదవేద్యుడు కృష్ణుడే కదా! కాబట్టి ఆ ఉత్సవాన్ని చాలా శ్రద్ధగా, వివిధ కళాంశాల సాంస్కృతిక కార్యక్రమాల సమాహారంగా చేసేవాళ్ళం.

అన్నింటా మాకు చేదోడు వాదోడుగా మా సీతారాం (మరింగంటి సీతారామాచార్యులు)
ఉండే వాడు. నా ఆలోచన-సీతారాం ఆచరణ ఈ రెండూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేటట్లు ఉండేవి.

శ్రీకృష్ణాష్టమి ఉత్సవంలో అన్నీ ఒక ఎత్తు 108 రకాల ప్రసాదాలు ఒక ఎత్తు. అందరం కలిసి చేయి చేయి వేసి శుచిగా - రుచిగా ప్రసాదాలను, పిండి వంటలను సిద్ధం చేసేవాళ్ళం.

విశేషమేమిటంటే ఎంత అర్ధరాత్రి అయినా సరే అమ్మగారు కూడా తమ ఔన్నత్యాన్ని పట్టించుకోకుండా తళియశాలలో వంటలూ, వార్పులూ, సర్దుబాట్లు, శుభ్రం చేయడం వంటి పనులన్నీ అయ్యేంతవరకు అవిశ్రాంతంగా మాతో పాటే ఉండేవారు. వారి ఔన్నత్యాన్ని ఎలా మరువగలము. రాజమండ్రి తులసీరామానుజ కూటంలో మేము నిర్వహించే అన్ని కార్యక్రమములలోను అమ్మగారి యొక్క సూచనలు కూడా తీసుకునేవారము.

ఆ సమయంలోనే నాకు వివాహమైంది. మా స్వామివారి మంగళాశాసనములతో కృష్ణకుమారి నా జీవిత భాగస్వామిగా అడుగిడింది. మా అమ్మతో పాటు అమ్మగారు కూడా ఒక పెద్దమ్మలా ఎంతో ఆప్యాయంతో, అనురాగంతో మా 'కృష్ణ'ను కంటికి రెప్పలా చూసుకునేవారు. కృష్ణ కూడా అమ్మగారిని అలాగే సేవించేది. అమ్మగారంటే మా ఇద్దరికీ మాతృభావంతో పాటు దైవభావమూ ఉంది.

**మహతః మన్దైస్సహ నీరంధ్రేణ సంశ్లేషః** అన్నట్లు జగదాచార్యులైన స్వామివారికి జనని అయిన అమ్మగారు మాతోపాటు మామూలు అమ్మగా కలిసిమెలసి ఉండడం.. వారి ఉత్తమ సౌశీల్యం. మా అందరి భాగ్య విశేషం.

అలాంటి అమ్మగారితో మా దంపతులం, పరివారము గడిపిన మధుర క్షణాలను, సన్నివేశాలను మరిచిపోలేము. అమ్మగారితో ఇలాంటి "అనుబంధం" కలగడానికి ముఖ్య హేతుభూతులైన మా స్వామివారి శ్రీపాదసన్నిధిలో కృతజ్ఞతాంజలిని ఘటిస్తూ..... ఆచార్య సేవలో.....

❖❖❖❖❖❖



# మాతృమూర్తి ఉత్సాహదీపిక

మరంగంటి సీతారామాచార్య

రామానుజకూటం, రాజమహేంద్రి.



జ్ఞాన జన్మనిచ్చిన మా అస్మదాచార్యులు శ్రీమత్పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారి మాతృమూర్తి అమ్మగారు (అలివేలుమంగమ్మగారు).

అవునండీ... ఈ దాసలోకానికి కంతకూ మార్గదర్శకులు మా ఆచార్యులు. ఆ ఆచార్యుల మాతృమూర్తిని దాసులందరూ ఆర్తితో పిలిచే పిలుపే అమ్మగారు. శ్రీరామనగరం ఎప్పుడు వచ్చినా ఆచార్యుల సన్నిధికి దగ్గరలో ఉన్న నివాసస్థలంలో ఒక్కసారి అమ్మగార్ని సేవించగానే చక్కని చిరునవ్వుతో "ఎలాఉన్నారయ్యా అందరూ?"...అంటూ పలకరించే ఆప్యాయత మాకు లభించిన అదృష్టం.

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రి అనగానే ఏదో కొంత ఆప్యాతానురాగాలకలయిక అనిపిస్తూంటుంది. ఈ ప్రాంతంవారు ఎక్కడున్నా వారి పలకరింపులో గోదావరి చల్లదనం తెలుస్తూనే ఉంటుంది.

1979లో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామివారు 7 స్వాధ్యాయజ్ఞాన యజ్ఞాలను రాజమండ్రి మరియు చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో నిర్వహించారు. ఆ కార్యక్రమాలలో పిల్లలమంతా రామసేవలో ఉడతల్లా తిరుగుతూండేవాళ్ళం. శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి వారితో ఉండే అస్మదాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారి పూర్వాశ్రమ రూపాన్ని దర్శించే భాగ్యం అప్పుడే లభించింది మాకు. అస్మదాచార్యుల మాతృమూర్తి స్థానికంగ సీతంపేటలో ఉండేవారు. అమ్మగారి మేనమామగారైన శ్రీ.ఉ.వే. శ్రీమాన్ టి.కె. కుమార రామానుజాచార్యస్వామి (వీరిని చిన్న పెద్ద బుల్లాడుగారు అని అనేవారు) వారిని చూడ్డానికి అప్పుడప్పుడు శ్రీ తులసీ రామానుజకూటానికి వస్తూండేవారు. అమ్మగార్ని వారి పిల్లలను సేవించడం అదే ప్రథమం.

1979 ధనుర్మాసంలో శ్రీశ్రీశ్రీ పెద్ద స్వామివారి అవతార సమాప్తి తరువాత అస్మదాచార్యుల ఆశ్రమ స్వీకార నిర్ణయానంతరం రాజమహేంద్రి, మరంగంటివారి వీధిలో ఉన్న శ్రీమాన్ చిలకమర్తి నరసింహాచార్యులుగారి (వీరిని కన్నయ్య గారు అంటారు. వీరుకూడా అమ్మగార్కి మేనమామగారవుతారు) గృహానికి శ్రీశ్రీశ్రీస్వామివారు అమ్మగారిని తీసుకొని వచ్చారు (శ్వేతాంబరులై ఉన్నారు). ప్రక్కనిల్లే అవడంతో మా నాయనమ్మగారు మరియు మోహినీగారు (శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామివారు ప్రారంభించిన 'యతిరాజ సేవా మహిళామండలి-రాజమండ్రి'కి నాయనమ్మ మరంగంటి వెంకట రంగనాయకమ్మగారు మరియు వీరి తోటికోడలైన మోహిని (లక్ష్మీనరసమ్మ) గార్లు నిర్వాహకులుగా

భగవత్కృప లభించడానికి ముఖ్యంగా కావలసింది భగవత్సంకల్పమే.



ఉండేవారు) మరియు కుటుంబ సభ్యులం అందరూ చేరాం. ఆ సందర్భంలో మాట్లాడుతూ స్వామివారు "అమ్మగార్ని జాగ్రత్తగా చూస్తూండండి" అని సూచించారు. ఆతరువాత రోజు సీతంపేటలో అమ్మగారి గృహంలో శ్రీశ్రీశ్రీ స్వామివారు సామూహిక లక్ష్మీపూజ కార్యక్రమ విధానాన్ని వివరిస్తూ ఉపన్యసించారు. నేను కూడా మా వాళ్ళతో ఆ కార్యక్రమానికి వెళ్ళిన జ్ఞాపకం ఉంది.

అస్మదాచార్యులు శ్రీశ్రీశ్రీ స్వామివారు 1991లో శ్రీమాన్ మరంగంటి రాఘవాచార్యస్వామిని రాజమండ్రిలో శ్రీతులసీ రామానుజకూటం నిర్వాహకునిగ ఏర్పరచి, "అందరూ కలిసి వికాసతరంగిణి కార్యక్రమాలు జాగ్రత్తగా చేస్తూండండి" అని సూచించారు. అది మొదలుగా ఎన్నోకార్యక్రమాలు చేసేవారము. అందులో భాగంగా అప్పుడప్పుడు అమ్మగార్ని సేవించే అదృష్టం కలుగుతుండేది.

ఆ తరువాత శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారి జీవిత చరిత్రని చిత్రాల రూపంలో ప్రదర్శిస్తే బావుంటుందని నేను, శ్రీమాన్ రాఘవాచార్య ఇద్దరం సిద్ధపడ్డాము. శ్రీశ్రీశ్రీ పెద్దస్వామివారి వివరాలు తెలుసుకుందామని అమ్మగారిని కలిశాము. నాకు తెలిసినవి చెప్తాను అంటూ కొన్ని వివరాలను అందించారు. ఆ తర్వాత శ్రీమాన్ తె.కం. గోపాలాచార్యస్వామివార్ని మరియు ఇతర పెద్దలను సంప్రదించి అప్పటికి వ్రాసుకొని, చెక్కబోర్డులపై బొమ్మలు వేసి, కట్‌చేసి ఆయా సందర్భాలకు అనుగుణంగా సిద్ధంచేసాము. 1998 వ సంవత్సరము, గుంటూరులో జరిగిన విరాట్ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమంలో "శ్రీసుదర్శనం" అనే చిత్ర ప్రదర్శనశాలలో ప్రదర్శించగా, శ్రీశ్రీశ్రీ స్వామివారు మంగళాశాసనములు అనుగ్రహించారు. అమ్మగారి సూచనలే ఆనాటి కార్యక్రమానికి ప్రేరణ. ఇలాంటి మరెన్నో సందర్భాలున్నాయి.

అమ్మగారికి ఏదైనా ఒక విషయం అవసరమై అడగాలంటే, చాలా మొహమాటంగా "కొంచెం ఆ సహాయం చేసిపెట్టాలయ్యా...వీలవుతుందా..?" అనేవారు.

అయ్యో అదేంటండి అమ్మగారూ శాసించాలిగాని అలా అడుగుతారేంటండి అంటే...

మీకు ఏవో పనులుంటాయికదా! ఇబ్బంది అవుతుందేమో అని... అనేవారు..

వారు చెప్పిన పని చేసినతరువాత కూడా అయ్యో ఇలా అడిగించుకున్నామే... అని కలతమాత్రం పోయేదికాదు.

అమ్మగారితో కుటుంబ బంధుత్వమున్నా అది చెప్పుకోనవసరములేనిది. కానీ ఆత్మ బంధుత్వము మాత్రము ఎన్నటికీ దూరముకాదు అన్నది పెద్దల సందేశము. మా ఆత్మోజ్జీవనకు ఉపకారక, ఉత్తారక ఆచార్యులైన అస్మదాచార్యుల మాతృమూర్తి, సహృదయురాలైన అమ్మగారి సమక్షంలో ప్రత్యక్షంగా కొంతకాలమైనా మెలగడం, మా తల్లిదండ్రులు, ఆచార్యులు, పెద్దలు అందించిన అనుగ్రహమే...

శ్రీతులసీ రామానుజకూటంలో జరిగే కార్యక్రమాలని తెలియజేయగానే అమ్మగారు రాజమండ్రిలో ఉంటే తప్పకుండా వచ్చి అన్వయించేవారు. ఒకనాటి కృష్ణాష్టమి వేడుకలలో దాసుడు చేసిన అలంకరణచూసి అమ్మగారు మంగళాశాసనాలు అనుగ్రహించారు. ఆ సంవత్సరం రాజమహేంద్రవర వేదపరీక్షలలో పాల్గొనటానికి సీతానగరం నుండి వచ్చిన వేద విద్యార్థి బృందం ఆ కృష్ణాష్టమి అలంకరణ ముందు అమ్మగారితో ఫోటో తీసుకుని జ్ఞాపకంగా పదిలపరుచుకున్నారు.

❖❖❖❖❖❖



కృష్ణాష్టమి మహోత్సవంలో వైదిక సంతానంతో –
రామానుజకూటం, రాజమహేంద్రి



# అద్వితీయురాలు



**గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ్**
**(నడిగడ్డపాలెం శ్రీకవిగారి కుమారులు)**

గోదాదేవి తమ పాశురవిన్నపములో అద్వితీయులైన తల్లులను ప్రశంసించినది దేవకీదేవి ఒకరైతే మరొకరు యశోదమ్మ. కన్నది ఒకరు. పెంచిపోషించిన అమ్మ మరొకరు. వీరిరువురు భూమండలములో అద్వితీయులు అన్నది. సాక్షాత్తు వైకుంఠంలో వేంచేసియున్న స్వామిని తన గర్భానమోసి ఈలోకానికి అందించిన ఘనత దేవకీదేవిది అయితే, పెంచి పోషించి ఆనందాన్ని అనుభవించింది యశోదమ్మ. ధర్మసంస్థాపన చేసి గీతాచార్యుడై లోకానికి అనంతమైన జ్ఞానాన్ని అనుగ్రహించిన ఆచార్యుడు శ్రీకృష్ణ పరమాత్మ.ఆ తల్లియొక్క గర్భాన్ని ప్రకాశింపజేసినవాడైనాడు. మరొకరు కౌసల్య, శుశుభే తేన పుత్రేణామిత తేజసా. రాముని కన్నతల్లిగా కౌసల్య అమితప్రభావవంతురాలైనది. ఉత్తమ ఆచరణ ద్వారా లోకానికి ధర్మము యొక్క స్వరూపముగా ఆ తల్లి యొక్క కీర్తిని ప్రకాశింపచేసినవాడు శ్రీరామచంద్రుడు.

నిత్య, లీలావిభూతిద్వయ ఆధిపత్యంతో ఈ లోకంలోని బద్ధజనులను తరింపచేయటానికి కాంతిమతి గర్భాన అవతరించిన దివాకరుడు రామానుజుడు. తన అవతారవిశేషంచే తల్లియొక్క గర్భాన్ని ప్రకాశింపచేసిన ఉత్తమ ఆచార్యుడు.

చిలకమర్రి వంశంలో చూడాంబా గర్భంలో ఆవిర్భవించి తమ అతిమానుష శీలవృత్త విశేషముతో యావద్భారతాన రామానుజ సంప్రదాయవైభవాన్ని ప్రచారం గావించి లోకోత్తరమైన యజ్ఞయాగాది క్రతువులను నిర్వహించిన మహనీయులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్దజీయరు స్వామివారు.

ఆ పరంపరలోనే పెద్దజీయరుస్వామివారి సంకల్పాలను రామానుజకీర్తికౌముదిని, సమాజసేవా తత్పరత ద్వారా సర్వమానవాళికి స్వీయ ఆరాధన సర్వఆదరణ మార్గాన్ని ఆచరింపచేయుటకై శ్రీమతి అలివేలుమంగతాయారుగర్భ శుక్తిముక్తాఫలముగా స్వాతి ముత్యముగా అవతరించిన స్వామి మన శ్రీశ్రీశ్రీ చినజీయరుస్వామివారు.

అలాంటి అద్వితీయమైన యతిరాజును అందించిన మహనీయురాలు ఆ తల్లి అలివేలుమంగమ్మ. ఆతల్లియొక్క మంగళాశాసనములతోనే సంప్రదాయ జైత్రయాత్రను కొనసాగిస్తూ అందరివారై, అందరి ప్రేమను పొందినవారై, అందరికి ఆరాధ్యులై, ఆతల్లి అలివేలుమంగమ్మ గర్భాన్ని ప్రకాశింపచేసినారు శ్రీస్వామివారు. తల్లిని మించిన దైవం మరిలేదు కదా! తల్లిదీవెనలు పొందినవారు జీవితంలో సౌభాగ్యవంతులు.



ఆతల్లిగారితో మాకు మాకుటుంబానికిఉన్నసాన్నిహిత్యం విలక్షణమైనది. పెద్దజీయరుస్వామి వారితో ప్రచారంలో ప్రముఖ స్థానంలో నిలచిన వారు కవిగారు.

80 సంవత్సరాలుగా శ్రీస్వామివారితో విడదీయరాని వీడిపోని కుటుంబం మాది. 1979 వ సంవత్సరపు చివరి రోజులలో పెద్దజీయరుస్వామివారు తిరునాడు వేంచేసిన సందర్భంలో సంప్రదాయ వైభవానికి ఎవరు సారధ్యం వహిస్తారు తిరిగి మనస్వామిని ఎలాసేవించుకోగలము అన్నఆవేదనలో ఉన్నవారికి మన చినజీయరుస్వామి ఆనాడు అందరి దృష్టిలో నిలచినారు కారణం రూపము – మాట – చేతివ్రాత అంతా స్వామివారు ముమ్మూర్తులా సాకారమై నిలిచి ఉండుటచేత సమర్థులు తగినవారని అందరు ఆనందించారు.

కానీ ఆ సమయంలో 23 సంవత్సరాల ప్రాయంలో వేదాంతవిద్యను గోపాలాచార్యస్వామి వద్ద నడిగడ్డపాలెంలో అధ్యయనం చేస్తున్నారు. ఇంకా పూర్తి కాలేదు దానికి తోడుగా కుటుంబ సంబంధమైన బాధ్యతలు మరి ముఖ్యంగా తల్లిగారి అనుమతి ఇవన్నీవారిముందున్న ప్రశ్నలు. ఆ సన్నివేశంలో అలివేలుమంగమ్మగారు అందరి ఆర్తిని గుర్తించి తమ కుటుంబ సమస్య కన్నా సంప్రదాయసేవయే ప్రధానమని భావించి తాము శ్రీశ్రీశ్రీ స్వామివారిని సంప్రదాయ సేవకు కానుకగా అనుగ్రహించిన మహనీయురాలు. ఈ సందర్భంలో మేము ప్రత్యక్షముగా ఆనాటి సన్నివేశములో భాగస్వాములం. అప్పటి నుండి ఇప్పటి వరకు ఎప్పటికిని ఆస్వామి సన్నిధి పరమావధిగా మా కులధనముగా సంభావిస్తాము.

ఈ నేపథ్యములో తిరుమలలో జరిగిన 1008 స్వాధ్యాయ జ్ఞానయజ్ఞంలో తల్లి పక్కనే ఉండివారితో యజ్ఞవైభవాన్ని సేవించుకున్నాము అంతేకాకుండా వారి రెండవ కుమార్తె చి.ల. సౌ.తాయారు – సత్యాగ్రాహి వివాహాన్ని నడిగడ్డపాలెం ఆశ్రమంలో వైభవంగా జరిపినాము. మాగృహంలోనే విడిదిని ఏర్పాటుచేసి గోపాలాచార్యస్వామి వారి సమక్షంలో కన్యాదానం విశేషంగా జరిగింది. ఈ సన్నివేశం మాకు వారికీ ఎంతో సాన్నిహితాన్ని కలిగించింది. అంతేకాకుండావారి కుమారుడు వివాహమాడిన వధువు మాకు చాలదగ్గరి బంధువులే ఈవిధంగా అలివేలుమంగమ్మగారి కుటుంబంలో జరిగిన శుభకార్యములలో మావంతుగా సేవలు అందించినాము. వారు చివరిసారిగా ఆశ్రమానికి విచ్చేసిన సందర్భంలో మాగృహానికి విచ్చేసి మా ఆతిథ్యాన్ని స్వీకరించి ఆశీస్సులు అందచేశారు.

అంతేకాక జగమును ఏలేయతిరాజులు శ్రీశ్రీశ్రీ చినజీయరుస్వామి వారికి మాతృమూర్తిగా నిత్యము నీరాజనములు ఇచ్చి రక్షకట్టెడివారు అదేశ్రీస్వామివారికి శ్రీరామరక్ష అయినది. వారు నిర్వహిస్తున్న అతిమానుషలోక కల్యాణకార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగాలన్న వారి ఆకాంక్ష. కౌసల్య రామచంద్రునికి మంగళము పాడినట్టు యశోదమ్మ శ్రీకృష్ణునికి రక్ష పెట్టినట్లుగా అలివేలు మంగమ్మగారు వారి దివ్యమైన గాత్రముతో స్వామికి మంగళము పాడినారు అదిస్వామికి నిత్యశ్రీని అనుగ్రహించింది.

అలాంటి అద్వితీయురాలైన తల్లి నిన్నటిదాక మనమధ్యన ఉండి పరమ పదానికి వేంచేసి నిత్యకైంకర్య ప్రాప్తిని పొందినారు వారితో మాకున్న అనుబంధాన్ని ఈ సమయాన మీతో పంచుకునే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ...

❖❖❖❖❖❖



# కరుణ జూచిన మాయమ్మ కల్పవల్లి

డా. అద్దంకి శ్రీనివాస్
సంపాదకులు, భక్తినివేదన

శ్రీవైష్ణవశ్రీకి శ్రీమంతమై నిల్చు అమల వంశమునందు అవతరించి
సత్సంప్రదాయమ్ము సర్వకాలములందు అత్యంత నిష్ఠగా ఆచరించి
హరిదాసు లెవరైన పరమాత్మ లేయంచు భక్తిప్రపత్తుల వారి గొల్చి
విష్ణుతేజముతోడ వెలుగొందు పుత్రుని యతిజేసి జగతికి హితము గూర్చి



మాకు తలిదండ్రి తామెయై సాకునట్టి
మంచి ఆచార్యు నిచ్చిన మాతవమ్మ
బ్రతికినన్నాళ్ళు భక్తిని పరిఢవిల్లి
మంచి మనసున్న తల్లిగా మమత పంచి
కరుణ జూచిన మాయమ్మ కల్పవల్లి
అమ్మ అలవేలు మంగ తాయారుతల్లి

ఏమివ్వగలమమ్మ అలివేలు మంగమ్మ
త్యాగమే నీ రూపమమ్మా
అనురాగమే నీ హృదయమమ్మా
ఏమివ్వగలమమ్మ అలివేలు మంగమ్మ

చాలునా మాకు ఈ జన్మ
ఇంక ఆరునా కన్నీటి చెమ్మ

కోదండ రాముడు అడవి కేగిన వేళ
కౌసల్య బాధ  ఎన్నాళ్ళు?
పట్టుమని గట్టిగా పదునాలుగేళ్ళు!
ఆ బాలకృష్ణుడు యమున దాటిన వేళ
దేవకీ బాధ ఎన్నాళ్ళు?
మధురకు కృష్ణుడు రానన్నినాళ్ళు!
సుతుని యతిగా మార్చి – లోకాని కిడు వేళ
తల్లి! నీ బాధ ఎన్నాళ్ళు
ఎటుల ఆగెనో నీకు కన్నీళ్ళు?

**కన్నబిడ్డపాలిట కల్పవల్లి! మమతల పాలవెల్లి అమ్మ!**



తిరుమంత్రమును తెచ్చి గుడిగోపురము నెక్కి
అందరిని పిలిచి ఆనాడు
యతిరాజు మంత్రమే తానిచ్చినాడు
నిష్ఠగా పెంచిన చిన్నజీయరు అనే
తిరుమంత్రమును ఇచ్చి నేడు
తల్లి ధన్యురాలై నిలిచినావు
అమ్మలను గన్నట్టి అమ్మ అలవేలు

మంగమ్మవై మము గావు మమ్మా
మా కంటి వెలుగువై నడిపింపుమమ్మా

పరమపదోత్సవ మిదె మా యమ్మకు
పరమాచార్యుల నిచ్చిన కొమ్మకు
ఆకులమన్నాడ చిలకమ్రి
అలివేలు మంగ తాయారు అమ్మకు

మాతృసవన మిదె అమృతవల్లీ

భక్తి ప్రపత్తుల సేతుము తల్లీ
పరమపదమున నిలిచి తిరముగా
మాపై కరుణను కురిపించుమా
కమలాపతి యా కమలాసతి నిను
అమితాదరముగ చూచుచుండగా
నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు
భాగవతోత్తములందరు ఆదరించగా

నీ చరితం అమలం స్మరణీయం
అసిధారావ్రత మనితరసాధ్యం
ఆమనివై మా బతుకు తోటలో
నిత్యవసంతం విరియజేయుమా
అన్నీ తామై మము నడిపించే
అపర రామానుజాచార్యుల దయ
మాపై నిత్యం జల్లై చల్లగ
చూడమ్మా మా కడుపుచల్లగా

❖❖❖❖❖❖❖

## నలభీమపాకం నేర్పిన గురువు



**కరూర్ చంద్రశేఖర భాస్కర భూపతి, హైదరాబాద్**

అమ్మగారితో ఉన్న అనుబంధం మాటల్లో చెప్పడం కష్టమే! నా చిన్ని ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నాను. నేను బెంగుళూరులో ఉన్నప్పుడు అమ్మగారు కిషోర్ బాబుగారి ఇంట్లో ఉండేవారు. ప్రతినిత్యం అమ్మగారిని వాళ్ళింట్లో కలిసేవాణ్ణి. అమ్మగారు ప్రసాదంగా నాకు ఏదో ఒకటి తప్పకుండా పెట్టేవారు. ఆ సమయంలో నాకు వివాహం అవ్వడంచేత మా శ్రీమతిని అమ్మగారికి పరిచయం చేసాను. చాలా రకాల వంట మెళుకువలు అమ్మగారు మా శ్రీమతికి నేర్పారు . నాకు వంట మీద ఉన్న ఆసక్తితో అమ్మ గారి దగ్గర చాలా రకాల రోటి పచ్చళ్ళు, వంటకాలు నేర్చుకున్నాను. ఈ రోజు నేను ఇంత బాగా నలభీమపాకాన్ని నా స్నేహితులకు గానీ ఇంట్లో వాళ్ళకి గానీ అందించగలుగుతున్నాను అంటే, అంతా అమ్మగారు నేర్పిన మెలకువలే. అమ్మగారు ప్రతి సంవత్సరం ఆవకాయ, బెల్లం ఆవకాయ పెట్టేవారు. తప్పకుండా నా వాటాగా ఒక భాగాన్ని తీసి పిలిచి నాకు ఇచ్చేవారు. అమ్మగారిని హైదరాబాద్ శంషాబాద్ ఆశ్రమం నుంచి భద్రాచలం పుష్కరాలకి తీసుకెళ్లే భాగ్యం నాకు దక్కింది. మార్గమధ్యంలో డ్రైవర్ గోపాలకృష్ణ వారి కుమారుడు వివాహానికి వెళ్లి ఆశీర్వచనం చేసి అక్కడి నుంచి మేము భద్రాచలం చేరుకున్నాం. నాకు అమ్మగారితో 35 సంవత్సరాల అనుబంధం ఉంది. నేను సీతానగరంలో ఉన్నప్పుడు అక్కడ స్వామీజీ ఆజ్ఞ మేరకు నేను కృష్ణగారు మల్టీ మీడియావర్క్స్ కలిసి చేసే వాళ్ళం. మేము ఇద్దరం తరచుగా హైదరాబాద్ ద్విచక్రవాహనంలో ప్రయాణం చేసే వాళ్ళము. అప్పుడు అమ్మగారు హైదరాబాద్ జెట్లో ఉండే వారు. ఆ సమయంలో కూడా ప్రసాదంగా అమ్మ చేతి వంట స్వీకరించే భాగ్యం నాకు దక్కింది. ఆవాత్సల్యమూర్తికి మనసారా దాసోహములు సమర్పిస్తూ....



# జగన్మాత
# అలర్మేల్ మంగతాయార్

**తిరుక్కోష్టియూర్ మాధవన్**, చెన్నై



జగదాచార్యరాన స్వామి ఎంబెరుమానారిన్ పునరవతారమాగ అవతరిత్తవర్ స్వామి మణవాళ మామునిగళ్. తిరువరంగం తిరుపతి శ్రీరంగనాథ పెరుమాళ్ తిరువాక్కాల్

శ్రీశైలేశదయాపాత్రం ధీభక్త్యాది గుణార్ణవం ।
యతీంద్ర ప్రవణం వందే రమ్యజామాతరం మునిమ్ ॥

ఎన్ఱు తనియన్ సమర్పిక్కపట్టు పెరియపెరుమాళ్ తమక్కే ఆచార్యరాక తిరువుళ్ళం ఉగందు ఎన్ఱుమిగ ఉయర్న్ద స్థలత్తిల్ కొణ్డాడపట్టు వరుగిరివర్ స్వామి మణవాళ మామునిగళ్.

ఇన్ఱలవుమ్ సకలదివ్యక్షేత్రంగళిళుం, సకలవైష్ణవర్గళ్ తిరుమాళిగళిలుమ్, సన్నిధిగళిలుమ్ పెరియపెరుమాళ్ అరుళిచ్చెయ్‌ద శ్రీశైలేశదయాపాత్రం ఎన్ఱు తనియనై సేవిత్తు అరుళ్‌శెయ్‌ద తొడంగి, శాత్తుముఱై ఆగి పూర్తిపణ్ణుంపోదు అడియార్గళ్ వాళ్ అరంగనగర్‌వాళ్, శడగోపన్ తన్ తమిళ్ నూల్ వాళ కడల్ మణ్ణులగుం వాళ, మణవాళమామునియే, ఎన్ఱు మణవాళమామునిగళై ప్రార్థిత్తు కొళ్వదు నం శ్రీవైష్ణవ సంప్రదాయ మరపు ఉలగెంగిలుం ఉళ్ళ శ్రీవైష్ణవర్గళ్ ఎన్ఱుం ఎప్పోదుం ఎన్గెల్లాం అరుళిచ్చెయల్ సేవిత్తాలుం, పూర్తిపణ్ణుం పొళుదు మణవాళ మామునియే ఇన్ఱుమొరు నూత్తాండు ఇరుం ఎన్ఱు ప్రార్థిక్కిఱై వార్తదయైకేట్టు మగిళిన్ద ఎమ్బెరుమాన్ స్వామి, మణవాళమామునిగళ్ మీణ్డుమ్ ఇంద భూ ఉలగత్తిల్ అవతరిక్కుం పడి అరుళినాన్ వైయంతగళియా ..ఎన్ఱుం అన్బేదగళియా... ఎన్ఱుం ఇరు పాశు రంగళాల్, ఆన దీపంగళై ఎత్తి ఉపకారం పణ్ణినార్గళ్ పొయ్‌గైయాళ్వార్, పూదత్తాళ్వార్ ఇన్ద జ్ఞాన దీపంగళిల్ మిళిర్ంద ప్రకాశత్తిల్ తిరుక్కండేన్ ఎన్ఱు తాముం కండు నమక్కుం కాట్టి కొడుత్తార్ మూన్ఱామవర్.

ఆన పేయాళ్వార్ ఇవర్గళ్ మూవరుం మత్తుం స్వామి మనవాళ మామునిగళ్ వెళ్ళై ఉలగుం అవతరిత్త శరదృతుమాసత్తిలే వేత్తిరుక్కుం పెరియతిరువడి నయినార్ ఆగియ గరుడనుక్కుం పెరియాళ్వారుక్కు అవతార నక్షత్రమాగ విలంగక్కూడియ స్వాతి యాగ అవతరుత్తు కడల్‌శూళ్ంద మన్నులగిల్. అంగు ఇంగు ఎనాదపడి ఇంద పుణ్ణియ భూమియిల్ అనైత్తు దేశంగళుక్కుం శెన్ఱు ఎల్లారుక్కుం ఎంబెరుమానారుడైయవరాయ్ సంబంధత్తై కాటకొడుత్తదు ఉలగై ఉయ్‌విక్క వంద ఉడైయవరాయ్ తిగళ్‌కిరార్ ఇత్తగైయ నన్ మగనై మహానై పెత్తెడుత్తు భాగ్యవతి శ్రీమతి అలర్మేల్ మంగై తాయార్ తిరుమగళ్ కేళ్వనై పోత్తన్ఱ తిరువేంగడాచార్యర్ స్వామిక్కు వాళ్‌గైపట్టు ఉలగం పోత్తుం ఉత్తమరాయ్, ఉలగైవాళ్‌విక్క అవతరిత్త తత్త్వజ్ఞానియాన చిన్నజీయర్ స్వామియై, ఈన్ఱెడుత్తు ఎమ్బెరుమానారై దర్శనత్తై

**పుట్టుకలేనివాడైనా పరమాత్మ తల్లిప్రేమకై తనయుడై దిగివచ్చె!**



రక్షిపడఙ్ఙాగవే అల్లికొడుత్త త్యాగమే వడివానవర్ పెరియాళ్వార్ తిరువాక్కి కిన్గ ఎన్నై నోమ్బు నోత్తాలకొలో ఇవనై పెత్త వయిత్తు ఉడైయాల్ ఎన్ను భూఉలగం మూ ఉలగుం కొండాడుంబడి తిగళ్న్దవర్ శ్రీమతి అలర్మేల్ మంగై తాయార్. తమదు ఎరిమైయాన స్వభావత్తాలుం ఇనిమైయాన కుఱలాలుం కనివాన పేచ్చాలుం కుళిర్న్ద పాశత్తోడు కూడియ పార్వయాలుం ఎల్లోరైయుం రక్షిత్తవర్ నం స్వామియిన్ తిరుత్తాయార్ అలర్మేల్ మంగై అమ్మంగార్.

స్వామి ఎంబెరుమానార్ ఇరుక్క వాయ్త్త నల్ల తిరుతాయార్, కాంతి అమ్మావై పోన్నుం, పరాశర భట్టర్క్కు వాయ్త్త నల్ల తిరుత్తాయార్ ఆండాళ్ అమ్మావై పోన్నుమ్, నం ఆచార్యరై బాల ప్రాయం ముదలే సంప్రదాయం ఊట్టి వళర్తు నమ్మై కాట్టికొడుత్తదు ఎంబెరుమానుక్కు పల్లాండు పాడువర్గళ్ ఆగియ శ్రీవైష్ణవ భాగవతగోష్ఠి ఆగియ శెల్వంగళై ఊట్టి కొడుత్తవర్ నమ్ ఆచారియర్ తిరుత్తాయార్ శిఱుక్కుడందై ఆనాలుం, అవన్ శ్రీవైష్ణవ స్వరూప ఇలక్కణత్తోడు తికజ్వానే ఆనాల్ తమ్ముడైయ వయదయుమ్ పారామల్ మిగ ఉయ్రంద గౌరవం కొడుత్తు కొండాడ క్కూడియ వర్ నం తాయార్. 85 తిరునక్షత్రమ్ ఎఱుందరుళి ఇరుందు, యశోదై తన్ సింగమ్ కణ్ణన్ ఎంబెరుమానై తన్ తిరుక్కంగళాల్ రసిత్తదైపోన్నుం నమ్ తాయార్ తన్ తిరుక్కంగళాలే నమ్ స్వామియై ఇరక్షిత్తాం. మిగ ఇనిమైయాన కురళిల్ పలపల గీతంగళై పాడి నాదగానామృతత్తాలే, ఎల్లోరైయుమ్ వశపడుత్త కూడియవర్ నమ్ తాయార్.

అడియేన్, శ్రీరామనగరమ్ వరుంబోదు ఎల్లామ్ దివ్యదేశ విషయంబుగళైకేట్టు ఆనందం అడైవార్. అడియేనైయుమ్ మంగళాశాసనమ్ పణ్ణి తన్ తిరు కంగళాలుమ్ తిరువుళ్ళం కాప్పిట్టు రక్షిత్తు అరుళినార్. స్వామియున్ తిరువారాధన పెరుమానాకియ చక్రవర్తి తిరుమగన్ అవదరిత్త నవమీ తిథియిల్ ఆచార్యన్ తిరువడి అడైందార్ నమ్ స్వామియిన్ ఆచార్యరాన శ్రీశ్రీశ్రీ పెరియ జీయర్స్వామి ఆచార్యర్ శ్రీమత్ పరమహంస కడలైక్కాయ జీయర్ స్వామి ఇంద స్వామిక్కు అవతార క్షేత్రం తిరుక్కోష్ఠియూర్. ఇంద దివ్యదేశత్తు ఎంబెరుమాన్ శ్రీసౌమ్య నారాయణన్. తిరువడి కళిలే మిక్క ఎంబెరుమానారై పోలే పెరియ జీయర్ స్వామియుం, నమ్ చిన్న జీయర్స్వామియుమ్ మిక్క ఈడుప్పాడు ఉడయవర్గళ్ తిరుక్కోష్ఠియూర్ ఎంబెరుమానుక్కు బ్రహ్మోత్సవమ్ తొడంగియ నన్నాళిల్, నమ్ స్వామియిన్ తిరుత్తాయార్ రాజావిన్ తిరువడి అడైందార్. తిరుక్కోష్ఠియూర్ ఎంబెరుమానుం సెప్టెంబర్ 11 ఆమ్ తేది తొడంగి 12 దినంగళ్ మహోత్సవమ్ కణ్డరుళి ఆచార్యన్ తిరుత్తాయర్క్కు, రాజావిన్ తిరువడిగళై అడయవైత్తు, తన్ ఇన్ ఉలగు ఆన శ్రీవైకుంతత్తిల్ తానే అఙైత్తు శెన్రు నిత్యసూరిగళ్ గోష్ఠియిల్ ఎఱుందరుళ పణ్ణి, ఉత్తమ ఆచార్యనై కొడుత్త పెరుమైక్కాక, తన్నయై కొడుత్తు ఉళ్ళాన్ ఎన్రే తోన్నుగిరదు.

ప్రత్యక్ష ఎంబెరుమానార్ ఆన నమ్ స్వామియిన్ తిరువడి బలత్తాల్ అడియేన్ ఉళ్ళత్తిల్ తోన్రియ సత్య విషయంగళై విన్నప్పిత్తు జగదాచార్యరై నమక్కు జగన్మాతావాన శ్రీమతి అలర్మేల్ మంగైతాయార్ తిరువడిగళై సేవిత్తు పణిగిఱేన్.

❖❖❖❖❖❖

పరమాత్ముని కూడా పరవసింపచేసే పవిత్ర ప్రేమ మాతృప్రేమ!



# జగన్మాత
# అలర్మేల్ మంగతాయార్

**(అనువాదము)**

**తిరుకోష్ఠియూర్ మాధవన్**, చెన్నై,

జగదాచార్యులైన ఎంబెరుమానార్ల పునరవతారముగా అవతరించినవారు మణవాళమామునిగళ్. తిరువరంగం, తిరుపతి, శ్రీరంగనాధపెరుమాళ్ తిరువాక్కాళ్ శ్రీశైలేశదయాపాత్రమ్ ...... మునిమ్॥ భగవద్రామానుజులకు కాంతిమతివలె. పరాశరభట్టరులకు ఆండాళ్ వలె మన ఆచార్యులకు బాల్యమునుండే సంప్రదాయాన్ని బోధిస్తూ పెంచిన సుగుణసాధ్వి మన అలవేలు మంగమ్మ !

ఎంబెరుమానార్లకు పల్లాండు పాడే శ్రీవైష్ణవగోష్ఠికి అందమైన సంపదను అందించే సుందరమైన స్వాచార్యులను అందించిన తల్లి. శ్రీవైష్ణవ భాగవతోత్తములను స్వరూపంతో ఉన్న వారిని చిన్నవారైన ఆదరభావంతో గౌరవించే గొప్ప గుణం కలిగిన భాగవతోత్తమురాలు.

85 సం॥ వేంచేసియుండి యశోద కన్నప్పిరానును తన నేత్రములచేత రక్షించినట్లు మన తల్లి (అమ్మగారు) కూడా మన స్వామిని రక్షించారు. ఇక సుందరమైన తమ గాత్రముచేత సంప్రదాయ మరియు ఆచార్య వైభవాన్ని పాడి అందరిని పరవశింప చేసేవారు. మన అమ్మగారు. అడియేన్ ( తిరుకోష్ఠియూర్ మాధవన్) శ్రీరామనగరం దివ్యసాకేతం వచ్చినప్పుడల్లా దివ్యదేశ వైభవాన్ని తెలుసుకొని ఆనందించేవారు దాసునికి మంగళాశాసనములు అందించేవారుకూడా.

అలాగే స్వామి వారి కులధనమైన చక్రవర్తి తిరుమగనార్ అవతరించిన నవమి తిథిలో ఆచార్య తిరువడిచేరినారు.

మన స్వామివారి ఆచార్యదైవమైన పెద జీయర్స్వామివారికి కూడా ఆచార్యులైన శ్రీమత్ పరమహంస కడలైక్కాయ జీయర్ స్వామివారు. ఈ జీయర్ స్వామివారి అవతారక్షేత్రమ్ తిరికోష్ఠియూర్ ఈ దివ్యదేశంలోని పెరుమాళ్ళు శ్రీసౌమ్యనారాయణన్ వీరి శ్రీపాదపద్మములయందు ఎంబెరుమానులకు అమితమైన భక్తి. అలాగే మన పెద్ద జీయర్ స్వామివారికి వారి పరంపరలో వేంచేసి ఉన్న మన ఆచార్యులకు శ్రీచినజీయర్ స్వామి వారికి కూడా. మరొక విశేషం తిరుకోష్ఠియూర్ శ్రీసౌమ్యనారాయణ పెరుమాళ్ బ్రహ్మోత్సవమ్ ప్రారంభమయిన రోజే మన అమ్మగారు ఆచార్య తిరువడి చేరినారు. తిరుకోష్ఠియూర్ పెరుమాళ్ళ ఉత్సవం, 12 రోజులు మహోత్సవాన్ని చేస్తారు. అద్భుతంగా అదే సమయంలో అమ్మగారిని ఎంబెరుమానారే ఆచార్యతిరువడి చేర్చి, తన త్రిపాద్విభూతి అయిన శ్రీవైకుంఠంలో నిత్యసూరులతో అలంకరింపచేసి ఉత్తమమైన ఆచార్యుణ్ణి లోకానికి అందించినందుకు భగవంతుడే స్వయంగా తనను తానుసమర్పించుకున్నట్లు ఉంది. అలాగే మన ప్రత్యక్ష ఎంబెరుమానారులైన మన చిన్న జీయర్ స్వామివారి శ్రీపాద పద్మ మహిమచే అడియేన్కు మనస్సులో తోచిన సత్య విషయములను విన్నవించి జగదాచార్యులను అనుగ్రహించిన జగన్మాత అలర్మేల్మంగతాయార్ అమ్మగారి శ్రీపాదపద్మములకు శతకోటి దాసోహములు సమర్పిస్తూ ..

❖❖❖❖❖❖

ఆకాశం చిన్నబోయింది అమ్మ మనస్సు వైశాల్యం చూసి!



# ఆదర్శ మాతృమూర్తి



తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాన్తి
దైవజ్ఞ శిఖామణి, జ్యోతిషరత్న

దైవం తెలియని జీవులు ఉండొచ్చును కాని తల్లి నెరుగని ప్రాణి ఉండదు. ప్రాణం పోసి జీవమునిచ్చిన తల్లుల కుండే ప్రేమ సముద్రం కంటె గొప్పది. మనిషికి మొదటి దైవము అమ్మ. క్షమా గుణానికి, ఓరిమికి మారుపేరు తల్లి. నవమాసాలు మోసి తన ప్రాణాన్ని పణంగా పెట్టి జన్మని ఇస్తుంది. అమ్మ లేకపోతే మనం లేనేలేము. మనం గొప్పగా ఉండాలని సంస్కారాలను మనలో నింపుతుంది. తల్లి కనుసన్నలలో ఉన్నంత వరకూ ఏ వ్యక్తైనా జీవితంలో ఉన్నత స్థానాన్ని పొందుతారు. అందుకే మాతృదేవో భవ అంటుంది వేదం. మాతృపూజయే ప్రధానం. సాక్షాత్తూ ఆ భగవంతుడు కూడా శ్రీరామచంద్రుడు కూడా కౌసల్యను తల్లిగా పొంది మాతృప్రేమ అనే సుఖాన్ని అనుభవించాడు. అలాగే శ్రీకృష్ణపరమాత్మ కూడా ఇద్దరిని తల్లులుగా చేసుకొని మరింత ప్రేమ పొందాడు. ద్రావిడ అర్చిరాదిలో కంసవధ అనంతరం కృష్ణనై కణ్ణ దేవకియార్రై ప్పోలే....... అన్నట్లు దేవకీ దేవి శ్రీకృష్ణ పరమాత్మను చూచి ఉప్పొంగినట్లు శ్రీదేవి ముక్తుని జూచి వక్షోజముల నుండి పాలుధారగా వచ్చుచుండగా జీవుని దేహము నంతటిని తడపుచు గాఢాలింగనం చేసికొనును, తల్లి ఒడిని మించిన రక్షణ ఇంకేముంటుంది.

పిల్లల విషయంలో తల్లి పడేవేదన ఇంత అని చెప్పటానికి వీలుకానిది. ప్రతీ తల్లి పిల్లల భవిష్యత్తు కోసం మదన పడుతూ ఉంటుంది. పిల్లలు మంచివారై, చక్కటి సంస్కారవంతులై , ఆతల్లి యందు ప్రేమ-గౌరవాలతో మెలగుతూ ఉంటే ఆతల్లి ఆనందం ముందు సముద్రం కూడా చాలా చిన్నదయిపోతుంది.

తిరుక్కావేరీ సమానురాలయిన శ్రీమతి ఆ.చి. అలివేలుమంగతాయారమ్మ గారు(మన అమ్మగారు) ఇద్దరు కొడుకులను కని ఒకరిని ధర్మ సేవకులుగా మరొకరిని దేశసేవకులుగా తీర్చిదిద్దిన మహోదారచరిత అలివేలు మంగతాయారమ్మగారు స్త్రీ జాతికే ఉత్తమ ఆదర్శాన్ని నేర్పిన మహోన్నతమూర్తి. పెద్ద కుమారులయిన శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామి వారిని శ్రీరామ సేవలో దీక్షితుడిగాచేసి రాముడే తండ్రి. సీతయే తల్లి. రాముని సేవయే నీకు శ్రీరామ రక్ష అంటూ అద్భుతమైన ఉపదేశంచేసి లోకానికి అందించిన ఆదర్శమూర్తి. వారికి పరమపదనాథుడు సాలోక్యము, సారూప్యం, సామీప్యం, సాయుజ్యం అనుగ్రహించాలని ఆ శ్రియఃపతిని ప్రార్థిస్తూ......

కన్నయ్య కూడా ఇద్దరు తల్లుల ముద్దుబిడ్డడైనది తనివితీర తల్లిప్రేమకై!



# మంగళాచరణలో ఆళ్వార్ల అంశ



శ్రీమాన్ గోవిందస్వామి
జీవా, శ్రీరామనగరం

**అమ్మ**గారిగ సుప్రసిద్ధి గాంచిన వారు శ్రీమతి అలివేలు మంగతాయారుగారు. వారి జీవితమంతా పరిశీలిస్తే **మంగళాశాసనము** చేయటమే ప్రధానముగా కనిపిస్తుంది. ఎలా? ఏమిటి ఆ విశేషాలు? నా అనుభవాలని మీఅందరితో పంచుకొనే ప్రయత్నము చేస్తాను.

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామివారు శ్రీ పెద్ద జీయరుస్వామివారిగ లోక ప్రసిద్ధులైన మహనీయులు. వారు పూర్వాశ్రమములో శ్రీమాన్ ఆకులమన్నాడ చిలకమట్టి శ్రీమన్నారాయణాచార్యులుగ గృహస్థాశ్రమ ధర్మములను సంపూర్ణముగా నిర్వర్తించినవారు. వారికి ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు. ముగ్గురు కుమారులలో రెండవ కుమారుని భార్య- సుగుణాలరాశి శ్రీమతి అలివేలు మంగతాయారుగారు. వారే అందరికీ **అమ్మ**గారిగ సుప్రసిద్ధి గాంచిన వారు. తూపురాణి వంశములో జన్మించి 13 సం.ల వయస్సులోనే వివాహమై ఆకులమన్నాడ చిలకమట్టి వంశానికి వెలుగులు నింపిన మహోన్నత ఆత్మగుణ సౌందర్యరాశి శ్రీమతి అలివేలు మంగతాయారుగారు. వారికి 5గురు సంతానము. వారి సంతానానికి అదే సౌందర్యము సంక్రమించింది. ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు.

**ఆచార్య** వంశ కుటుంబాలలో - వారి జ్ఞాతులందరిలోను వయస్సులో, జ్ఞానములో ఎవరు పెద్దలో వారినే **ఆచార్యులు**గా స్వీకరించి, వారిని ప్రార్థించి **సమాశ్రయణములు** (చక్రాంకణములు, మంత్రోపదేశము) చేయించుకొని, వారు ఉపదేశించిన విధముగా ప్రతీరోజు అనుష్ఠానము చేసుకోవడము, రాత్రి పరుండే సమయము వరకు శుచిగా ఉండటము చేసేవారు. అప్పటి వరకు ఎవరిని, వేటిని తాకకుండా ఉండేవారు. ఒకవేళ తాకవలసివస్తే స్నానము చేసేవారు. దానినే **మడి** అనేవారు. వస్త్రాలు కట్టుకోవటములోనూ ఒక వైలక్షణ్యము కనిపిస్తుంది. చిన్నతనము నుండే **మడి**కట్టుకోవటము, తమ పిల్లలు కూడా అలా ఉండేట్లు వారిని పెంచటము చేసేవారు. శ్రీమతి అలివేలు మంగతాయారుగారు - **అమ్మ**గారు చిన్నతనమునుండే ఆచార వ్యవహారాలన్నీ పుణికిపుచ్చుకున్న పుణ్యమూర్తి.

ఆకులమన్నాడ చిలకమట్టి వంశానికి వయస్సులో, జ్ఞానములో శ్రీమన్నారాయణ ఆచార్యులవారే అన్నివిధాల పెద్దలు అవటముతో తమ మగ పిల్లలకి, కోడళ్ళకి, తమని ఆశ్రయించిన వారికి తామే **సమాశ్రయణములు** కృపచేసారు. ఆ విధముగా **అమ్మ**గారికీ మామగారే ఆచార్యులైనారు.

తదనంతరము ఆకులమన్నాడ చిలకమట్టి శ్రీమన్నారాయణాచార్యుల వారు తమ కుటుంబ బాధ్యతలని సంపూర్ణముగా పూర్తిగావించి తురీయాశ్రమ(సన్యాసం) స్వీకారము చేసారు. యావత్ సంపూజ్య చరణులైనారు.

**ఆచారము ఆచరణ అమ్మ నుండే సంక్రమిస్తాయి.**



**ఆచార్యులు** ఏ ఆశ్రమ ధర్మములో, ఎక్కడున్నా వారే మనకి **ఆచార్యులు**. ఆ విశ్వాసముతోనే నాకు సర్వము ఆచార్యులే అని **అమ్మ**గారు తమ జీవనమును సాగించారు. జీవితములో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా చెక్కుచెదరక మొక్కవోని విశ్వాసముతో ఆచార్య స్మరణతోనే జీవించారు.

కాలక్రమములో ఆచార్యానుగ్రహము పరిపూర్ణమై పరమాత్మ కృపా విశేషముతో ఆచార్యులు చూపిన మార్గములోనే జీవిస్తూ, తమ పిల్లలని ఆ బాటలోనే పయనింప చేసారు **అమ్మ**గారు. ఎన్ని కష్టాలు ఎదురైనా నిరాశ, నిస్పృహలకి లోనుకాకుండా తమసంతానాన్ని ఆచార్యులు చూపిన మార్గములోనే నడిచేట్లు తీర్చిదిద్దిన తేజోరాశి **అమ్మ**గారు. ఆచార్యులకి సదా **మంగళాశాసనము** చేయటములోనే తమ పూర్ణ జీవితాన్ని సాఫల్యము చేసుకున్నారు **అమ్మ**గారు. మాట్లాడినా, నవ్వినా, పాడినా, ఏ అపశృతి లేని కంఠం. లయబద్ధమైన గానము. **అమ్మ**గారిని పోలిన మాధుర్యమైన కంఠం లేదంటే అతిశయోక్తి కాదేమో!!

ఇలా ఉండగా **అమ్మ**గారు, 1975సం.లో తాము రాజమండ్రిలో ఉండే సమయములో తమ ఆచార్యులు కాకినాడలో వేంచేసి ఉన్నారు. ఒక కార్యము నిమిత్తము వారి వద్దకు తన పెద్ద కుమారుడు చి. శ్రీమన్నారాయణని పంపారు. 19 సం. వయస్సుగల చి. శ్రీమన్నారాయణ కూడా శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామి వారిని, వారి అవతార స్థలమైన కాకినాడలోనే మొదటిసారి దర్శించటము జరిగింది. చూపులు కలసిన శుభవేళ – శ్రీశ్రీశ్రీ జీయరుస్వామివారి పరిపూర్ణ కృపాకటాక్షములకు సంపూర్ణముగా పాత్రులైనారు. ఆనాటి నుండి చి. శ్రీమన్నారాయణ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామివారు సూచించిన సేవలో నిమగ్నమైనారు. శ్రీ జీయరుస్వామివారే చి. శ్రీమన్నారాయణకు ఉపనయనము, సమాశ్రయణము చేసి సంప్రదాయ విద్యనూ కృప చేసారు. **అమ్మ**గారికి **ఆనందమే ఆనందము**. తన కుమారుడు ఆచార్య కృపకు పాత్రుడవ్వాలనే తపన కార్యరూపము దాల్చింది. తన తపస్సు సఫలమైందని భావించారు **అమ్మ**గారు. ఆచార్య కైంకర్యములో మంచిగా ఎదగాలని **మంగళాశాసనములు** చేసారు.

తమ ఆచార్యులు చూపిన మార్గములో శ్రీరామనామస్మరణ, శ్రీరామాయణ పారాయణము, స్తోత్ర పారాయణలు, దివ్య సంకీర్తనలు గానం చేసేవారు **అమ్మ**గారు. కుటుంబ బాధ్యతలు చూడవలసిన కుమారుడు ఆచార్యసేవలో తనకు దూరముగా ఉండడము వలన ఇబ్బందులు కలిగినా, అదీ ఆచార్యులకే విన్నవించుకొని ఓర్పుతో, సహనముతో ఆచార్య స్మరణతోనే జీవనము సాగించారు **అమ్మ**గారు.

1979 డిసెంబర్ 31 ముక్కోటి ఏకాదశి నాడు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామి వారు తిరునాడు (పరమపదము) చేరారు. **అమ్మ**గారు, చి. శ్రీమన్నారాయణ మరెందరో శిష్యులు ఆచార్యుల విశ్లేషాన్ని తట్టుకోలేకపోయారు. **నడిగడ్డపాలెం**లో జరుపవలసిన వైదిక కార్యక్రమాలను జరిపి, పరమపదోత్సవ కార్యక్రమాలు జరిపారు. పెద్దల అనుగ్రహము, కృపాకటాక్ష వీక్షణాలు చి. శ్రీమన్నారాయణ పై విశేషముగా ప్రసరించాయి.

24 సం. గల చి. శ్రీమన్నారాయణ **అమ్మ**గారి అనుమతితో తురీయాశ్రమం (సన్న్యాసం) స్వీకరించారు. **అమ్మ**గారు అనుమతిస్తూ చరమసంస్కారము తప్పక చేయవలసినదిగా కోరారట! ఒక **అమ్మ**గా తన కుమారుడు తానుండగానే సన్న్యసించటము ఎంత బాధో కదా! అయినా, ఆచార్య కైంకర్య నిష్ఠాగరిష్ఠ, ఆచార్యులు చూపిన

**భూదేవిలోని సహనం మూర్తీభవించింది అమ్మ!**



మార్గములోనే పయనించే **అమ్మ**గారు శారీరక స్థితిని, మానసిక స్థితిని దాటి ఆత్మోజ్జీవనానికి పరమాత్మ కైంకర్యమే! ప్రధానము అనే నిశ్చయస్థితి గలిగినవారు. తన కుమారుణ్ణి ఆచార్యుల, పరమాత్మ కైంకర్యానికి త్యాగము చేసిన **త్యాగమూర్తి.**

ఎందుకంటే, తన కుమారుడైనా, సన్యసించిన తరువాత తన కుమారుడిగా భావించటానికి కూడా అవకాశము లేదు. తమ ఆచార్యుల స్థానములో తనకుమారుణ్ణి శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు(చిన్నజీయరు)స్వామి వారిని చూడవలసి వచ్చింది. తన కుమారుణ్ణి కూడా తమ ఆచార్యులు గానే భావించి ఆరాధించాలి. అది ఊహించటానికి కూడా సాధ్యము కాదు. నాకు తెలిసి **అమ్మ**గారికే ఇలాంటి స్థితి కలిగింది.

**అమ్మ**గారూ, స్వామివారిని తన కుమారుడిగా కాక, తమ ఆచార్య స్వరూపముగానే సేవించి ఆరాధించారు. మిగిలిన పిల్లల ఆలనాపాలనా,విద్యాభివృద్ధి, వారి వివాహాలు,వారికి కలిగిన సంతానము మనుమలు,మనువరాళ్ళు ఇలా సాగుతున్నా నిరంతరము **ఆచార్య** స్మరణతోనే జీవనము సాగించారు **అమ్మ**గారు. శ్రీస్వామివారు నిర్వహించే విశేష కార్యక్రమాలలో తానూ ఒక సాధారణ భక్తురాలిగా పాల్గొని **మంగళాశాసనములు** చేసేవారు. యతులైనా తల్లిని చూసినప్పుడు దాసోహము (నమస్కరించటము) చేయాలి అనే నియమాన్ని పాలించి శ్రీస్వామివారు దాసోహము చేసినా, అది తమ ఆచార్యులకే అనే పరిపూర్ణభావము కలిగిన మాతృమూర్తి **అమ్మ**గారు.

పైన చెప్పిన సన్నివేశాన్ని 1992 సం.లో. అనుకుంటాను, నేను మొదటిగా రాజమండ్రి రామానుజ కూటములో, తరువాత అనేక స్థలాలలో చూసినప్పుడు అమ్మగారి నిర్మల హృదయాన్ని, వారి వాత్సల్యాన్ని చవిచూసాను. హైదరాబాద్ జెట్‌లో కొంతకాలం ఉన్నారు. ఎవరిని చూసినా **అమ్మ**గారు చిరునవ్వుతో పలకరించటము, వారి బాగోగులు తెలుసుకోవటము, పెద్దలైతే నమస్కరించటము, చిన్నలకి పూర్ణముగా ఆశీస్సులందించటము చేసేవారు. **అమ్మ**గారిది చాలా విలక్షణమైన జీవనశైలి. చక్కని ఊర్ధ్వ పుండ్రంతో ఒక మాతృదేవతలా దర్శనం ఇచ్చేవారు. నా తల్లి గారు 2005 సం.లో పరంపదించినప్పటి నుండి నేను నా తల్లిని **అమ్మ**గారిలోనే చూసుకునేవాణ్ణి.

2005 సం.లో **జీవా ప్రాంగణము**, శ్రీరామనగరము, దివ్యసాకేత క్షేత్రము ఏర్పడటము మన భాగ్యం. ఎందరికో ఇక్కడే ఉండి ఆచార్యులని, పెరుమాళ్‌ని దర్శించుకుంటూ ఆచార్యులు చూపిన మార్గములో సేవ చేసుకునే భాగ్యము లభించింది. వృద్ధాప్య దశలో ఉన్నా **అమ్మ**గారు అప్పుడప్పుడు వచ్చి శ్రీస్వామివారికి **మంగళాశాసనములు** అందించి వెళ్ళిపోతూ ఉండేవారు. గత కొంత కాలము క్రితం **అమ్మ**గారు శ్రీస్వామివారిని అడిగి ఇక్కడ ఉండే సాధారణ నివాస గృహములో ఉంటూ ప్రతీరోజు శ్రీస్వామివారికి హారతిస్తూ **మంగళాశాసనములు** చేసేవారు అమ్మగారు.

**అమ్మ**గారు తమ ఆరాధన చేసుకుని, ఎవరైనా తమకోసము వస్తే ఎంతో ఆప్యాయముగా పలుకరించేవారు. ఓపికగా నడుచుకుంటూ **దివ్యసాకేత** క్షేత్రానికి విచ్చేసి పెరుమాళ్ళకి **మంగళాశాసనములు** చేసేవారు. మధురంగా గానం చేసేవారు. తగిన సమయము, సందర్భాలలో తప్ప ఎవరు ఏమిచ్చినా పుచ్చుకొనే వారు కాదు. దాసుడు అమ్మగారి పూర్ణ ప్రేమాభిమానాలకి పాత్రుడైనాడు. వారి వంటగదిలోనే వారి పెరుమాళ్ళ ఆరాధన చేసుకొనేవారు. **అమ్మ**గారు అని పిలవగానే రమ్మనే వారు. వెళ్ళి సేవించుకునేవాణ్ణి. అమ్మగారికి ప్రసాదము తీసుకునివెళ్ళి ఇచ్చే

**అమ్మ మహిమ నెరిగిన అద్భుతాలు సాధించును శ్రీరాముడు మరియు మన ఆచార్యులవలె.**



భాగ్యము కలిగింది. గత కొన్ని రోజుల క్రితం వృద్ధాప్య కారణంగా **అమ్మ**గారికి నడవటము కూడా ఇబ్బంది అయింది. తమ కుమార్తె కోరికపై వారింట్లో ఉండి శ్రీస్వామివారిని స్మరిస్తూ **మంగళాశాసనము** చేస్తూ ఉండేవారు.

**అమ్మ**గారు లోక సామాన్య రీతిలో అందరిలాగే జీవనము సాగించినట్లు కంటికి కనిపిస్తున్నా, ఏదో ఒక ప్రత్యేకత ఉందనిపిస్తుండేది. వారి నడువడితో అందరికీ అమ్మగారైనారు. మూర్తీభవించిన మాతృదేవత అమ్మగారు. “**అమ్మ**” పదానికి రూపము **అమ్మ**గారే! నేను, శ్రీ దేవనాథ జీయరు స్వామివారు అమ్మగారిని 25-8-2020 న సేవించి మాట్లాడాము. ఓపిక లేకపోయినా, అమ్మాయిల సహాయముతో లేచి కూర్చుని చిరునవ్వుతో పలుకరించారు. నేను అన్న మాటలకి బాగా నవ్వారు. మర్చిపోలేని మధుర స్మృతులని నాకు అందించిన **అమ్మ** గారు సింహమాసము లో వచ్చే రోహిణి నక్షత్రము - కణ్ణన్ తిరునక్షత్రము (శ్రీకృష్ణాష్టమి) తరువాత వచ్చిన నవమినాడు 11-9-2020 తమ ఆరాధ్య దైవమైన సీతారామ పదసన్నిధి చేరారు.

ఈ వ్యాసం అంతా **అమ్మ**గారు, **మంగళాశాసనము** పదములే ఎక్కువగా ఉంది కదా! అదే చాలా ముఖ్యం అని భావిస్తున్నాను. అమ్మగారి **మంగళాశాసన** బలమే శ్రీస్వామివారికి ఎంతో **ప్రోత్సాహము, ప్రేరణ.** వారు జరిపే కార్యక్రమాలకి ఏ ఆటంకాలు కలగనివ్వని **దివ్యౌషధము.**

సమకాలీన సమాజములో బహుశా శ్రీస్వామివారు చాలా విలక్షణముగా, శాస్త్రము చెప్పిన విధి విధానముగా జరిపినన్ని ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు ఎవరూ చేయలేదనేది పెద్దల శ్రీసూక్తి. దానిని శ్రీరామనుజ సహస్రాబ్ది కార్యక్రమాలే నిరూపిస్తున్నాయి. శ్రీస్వామివారు **బదరిలో**, ఇంకా అనేక ప్రదేశాలలో **శ్రీరామనుజ** విగ్రహాలని ప్రతిష్ఠించి, లోకార్పణ గావించారు. ఇంకా **సీతానగరములో**, మరియు అనేక ప్రాంతాలలో చేయిస్తున్నారు. వాటన్నింటికీ ప్రతీరోజు తామున్న స్థలమునుండే **మంగళాశాసనము** చేస్తూ ఉండేవారు **అమ్మ**గారు.


**జీవా ప్రాంగణములో,** 216 అడుగుల **శ్రీరామానుజుల** మూర్తిని ప్రతీరోజు సేవించేవారు అమ్మగారు. 120 కిలోల బంగారముతో తయారైన ఆరాధనామూర్తి **శ్రీరామానుజల** వారిని దర్శించారు. శ్రీ రామానుజ సహస్రాబ్ది ప్రాజెక్ట్‌లో తయారవుతున్న వాటర్ ఫౌంటెన్ నుండి వెలికి వచ్చి దర్శనమిచ్చే రామానుజలవారిని, నిర్మాణ దశలోనున్న 108 దివ్య దేశాల ఆలయాలను దర్శించారు. అన్నీ త్వరగా పూర్తయి ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని శ్రీస్వామివారికి **మంగళాశాసనములు** చేస్తూండేవారు **అమ్మ**గారు.

ఇక, ఆలస్యము కాకుండా వెంటనే దేవేరులతో, పరివారముతో విచ్చేయమని **పరమపదనాథుడు, వైకుంఠనాథుడు** అని పిలవబడే ఆ దేవదేవుని వద్దకు ఆహ్వానించటానికి **అమ్మ**గారే వెళ్లారు. వారందరికీ ఆహ్వానము పలికి **మంగాళాశాసనము** చేయటానికే **అమ్మ**గారు వెళ్లారు. వారందరినీ తీసుకుని వస్తారు. మన శాస్త్రకారులందరి పరమ విశ్వాసము ఇదే. ఎల్లప్పుడూ **మంగళాశాసనము** చేసే ఆ **మంగళ** దేవతకి అనేక **మంగళాశాసనాలు** చేసుకోవటమే మన జీవనము కావాలి అనే భావనతో అందరినీ స్వాగతిస్తున్నాను.


❖❖❖❖❖❖

**తన ప్రాణాన్నే క్షీరంగా తనయుల పోషించే అమృతమూర్తి అమ్మ!**





భర్తే ప్రత్యక్షదైవమనే శాస్త్రవిశ్వాసశాలి భారత నారీరత్నం



కట్నములు  భక్తినివేదన జనవరి 1950

తూర్పు గోదావరి జిల్లా అత్తిమూరు కాపురస్థులగు శ్రీమాన్ ఆ. సి. శ్రీమన్నారాయణాచార్యులుగారు తా 1-12-49 తేదీ తమ రెండవ కుమారుడగు చి॥ వెంకటాచార్యులు కు చి॥ సౌ॥ అలివేలు మంగతాయారు నిచ్చి జరిగించిన వివాహ మహోత్సవ సందర్భమున శ్రీ విశిష్టాద్వైత ప్రచారక సంఘమునకు రూ 116-0-0 లు కట్నము సమర్పించి శ్రీ యతిపతి కటాక్షమునకు పాత్రులైరి.

శ్రీమాన్ వేంకటాచార్య అలువేలు మంగ నూతన దంపతులకు ఆచార్యుల ఆశీర్వాదపు కానుక



ఆశ్రమ స్వీకారానికి ముందు అమ్మగారు కుటుంబసభ్యులతో శ్రీమన్నారాయణాచార్యుల వారు


రజః తమో గుణమయమైన మనస్సు ఆచార్యులకి ఉండదు. కేవలం శుద్ధ సత్వము మాత్రమే!





సర్వ ఆధారులైన
శ్రీస్వామివారికి

సర్వధారి ఉగాది
ఆశీస్సులతో




అమ్మ

ప్రతి మనిషి గుండె పలికే మాట అమ్మ.

















ఆత్మీయ కుటుంబసభ్యులతో...



# అమ్మ జ్ఞాపకాలు

**టి.కె. తాయారు (కుమార్తె)**

**నారాయణగూడ**

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అనడానికి అమ్మే ఉదాహరణ. మేము తార్నాకలో ఉండగా ఒకసారి మా పెద్దమ్మ (మా అమ్మకి రెండవ అక్క పేరు పిరాట్టి) మా ఇంటికి చుట్టపుచూపుగా వచ్చింది. మీకొక రహస్యం చెప్తానర్రా అంది. అందరం చుట్టూ చేరి ఏంటి? అని అడిగాము. "మీ అమ్మ చిన్నప్పుడు రెండు, మూడేళ్ళప్పటినుండి కూడా ఒక రాతిపలకను తీసుకుని దానికి బొట్టు పెట్టి అలంకరించేది. ఒక చెట్టుక్రింద ముగ్గుపెట్టి ఈ రాతిపలకను అక్కడ పెట్టి అదే వేంకటేశ్వరుడు అంటూ అక్కడే కూర్చుండి పోయేది. ఎంతసేపు అక్కడ కూర్చునేదో తెలియదు. కూర్చుని కూర్చుని అక్కడే అలా పడిపోయేది. ఏమైందో అని ఇంట్లో అందరూ కంగారు పడిపోయేవారు. అసలు ఈవిడ బ్రతికి ఉందా లేదా అని అందరికీ అనుమానం వచ్చేది. అలా పడిపోయి రెండు, మూడు రోజులవరకు లేచేది కాదు. అలా ఎన్ని సార్లో కింద పెట్టా, మీద పెట్టా అన్నట్లుగానే ఉండేది. అందరినీ ఇలా హడలుగొట్టేస్తూ ఉండేది." అని చెప్పింది. అంటే అలా భగవద్ధ్యానంలో మునిగిపోయి ఉండేదట. అలా పెద్ద స్వామివారి ఇంటి కోడలై, లోకాన్ని తరింపచేయడానికి మరొక జీయరు స్వామిని అందించారు.

"మా ఆచార్యుల ఆశయాలన్నీ స్వామివారు తప్పకుండా నెరవేరుస్తారు. వీరి కీర్తి ఆచంద్రార్కం నిలుస్తుంది. అలా మా ఆచార్యులైన పెద్దస్వామివారు తప్పకుండా ఆశీర్వదిస్తారు" అని గట్టి నమ్మకం, విశ్వాసం కలిగి ఉండేవారు. అన్నిటికీ మా ఆచార్యులే ఉన్నారు అని అనేవారు. చివరి రోజు వరకు ఆచార్య అనుష్ఠానం, సూర్యునికి అర్ఘ్యం సమర్పించుకున్నారు. రామానుజ సహస్రాబ్ది జరిగే వరకు ఉండాలనే ఆవిడ తపన మాత్రం అలాగే మిగిలి పోయింది. కాని ఆ కార్యక్రమం ఎలా జరగాలి అనే పూర్తి చిత్రణ మాత్రం ఆవిడ మనస్సులో చాలా స్పష్టంగా ఉంది. ఈ విషయమే మాకు కొంత అసంతృప్తిని కలిగిస్తోంది.

లోకాన్ని తీర్చిదిద్దుతూ, తరింపచేసే జగదాచార్యులను కన్నందుకు చెప్పలేని సంతోషం, మరో ప్రక్క బాధ. తీయనిబాధ అంటే ఏమిటో అమ్మ పరిస్థితి చూస్తే అర్థమయ్యేది. యశోద, కౌసల్యాదేవీ కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారని అనిపిస్తూ ఉంటుంది.

ఆత్మ విశ్వాసంతో అనుకున్నది సాధించాలనే పట్టుదల, స్వాభిమానం కలిగి మాకందరికి ఎంతో ఆదర్శంగా నిలిచారు అమ్మగారు. ఎలాంటి పరిస్థితిలో కూడా జీవితంలో కష్టపడిపోతున్నామనే భావన మాకెవరికీ కలగనివ్వలేదు. మనిషికి ఇది సహజం అనే భావనే కలిగించేవారు. ఎలాంటి ఒడిదుడుకులైనా ఓర్పుగా ఎదుర్కొని ధైర్యంగా నిలబడగలిగేలా మమ్మల్ని తీర్చిదిద్దారు. ప్రతీ పనిలో ఒక క్రమశిక్షణతో చెయ్యాలనేవారు. తెల్లారి స్తోత్ర పాఠాలనుండి అన్ని పనులూ కూడా బట్టలు ఆరేసినా కూడా బాగా పిండి, దులిపి అంచులు నలగకుండా ఆరవెయ్యాలనేవారు.



లేదంటే ఒప్పుకునేవారు కాదు. ఇంక అమ్మ గొంతు కోకిల కంఠం. ఒకటి రెండుసార్లు వింటే పాటలు వచ్చేసేవి. అమ్మ పాటలు పాడుతుంటే ఆ తియ్యదనం ఎలా వచ్చిందా అని ఎన్నో సార్లు అనిపించేది. అమ్మ నవ్వు స్వచ్ఛమైన మల్లెపువ్వులా ఉంటుంది అని చాలా సార్లు అనిపించేది. అమ్మ ఎప్పుడూ నాకు చిన్న పిల్లలా కనిపిస్తూండేది. అసలు అమ్మ అనే పదాన్ని ఎన్ని సార్లు అన్నా అనిపించుకున్నా ఎప్పుడూ తనివి తీరదు అనిపిస్తుంది. ఒక రోజు హఠాత్తుగా "నాకు మా అమ్మలా అనిపిస్తున్నావే" అని అన్నారు. ఎందుకమ్మా అని అడిగితే "నాకు అన్నీ చేస్తున్నావు కదా!" అని అన్నారు. నా జీవితం ధన్యమైందనిపించింది. ఇన్నేళ్ళూ ఏ ప్రయోజనం లేకుండానే బ్రతికేస్తున్నామనుకున్నాను. అమ్మ అలా అనేసరికి జీవితంలో నిజమైన తృప్తి అంటే ఇదేనేమో అని అనిపించింది. అమ్మతో అనుబంధం ఎంత చెప్పినా తరగనిది.



**అమ్మకే అమ్మకాగలగడాన్ని మించిన అమ్మతనమున్నదా! అదృష్టం ఉందా!**



# అమ్మమ్మతో నా అనుభవాలు

టి.కె.వి. శేషు మనవడు (బాబీ)

అమ్మమ్మ ఎప్పుడూ ఒక మాట అంటూ ఉండేది. తనని, స్వామివారినీ కూడా చూసుకునేది పెద్దస్వామివారేనని, ఎన్ని కష్టాలు వచ్చినా విద్యార్థులనీ, ఆశ్రమాన్ని కూడా స్వామివారే కాపాడుకుంటారని. జీవితం అనే పరీక్షలో ఇదే జవాబుతో ఆచార్యుల మీద గట్టి నమ్మకంతో జీవితాన్ని గడిపింది. పదవ తరగతి చదివేటప్పుడుఅమ్మమ్మ దగ్గర గడిపే అవకాశం లభించింది. ఆ సమయంలో ప్రొద్దున్నే లేవడం మడికట్టుకుని నీళ్ళు పట్టడం, వంట చెయ్యడం అమ్మమ్మ దగ్గర నేర్చుకున్నాను. అక్కడే ఉన్న తత్వశాస్త్ర విద్యార్థిని కమలకి, వాచ్‌మన్ రామయ్యకి కూడా అన్నం పెట్టమనేది. అంటే తన చుట్టుపక్కల వాళ్ళందరూ కూడా తిన్నారా లేదా అని పట్టించుకుంటూ ఉండేది.

స్వామివారు వచ్చినప్పుడు అమ్మమ్మ వెంటే తీర్థగోష్ఠికి వెళ్ళేవాడిని. అక్కడ తిరుప్పావై అందరూ చదవడం చూసి నేనుకూడా అమ్మమ్మ దగ్గర పుస్తకం చూసి విష్ణుసహస్రనామం, తిరుప్పావు చదవడం నేర్చుకున్నాను. స్వామివారి ప్రోగ్రాములకు అమ్మమ్మ వెళుతుంటే నేనుకూడా, స్కూలుకూడా మానేసి అమ్మమ్మ వెనకాలే వెడుతుండేవాడిని. అమ్మమ్మ ప్రోత్సాహంతో పూర్వాశ్రమంలో దేవనాథజియ్యరుస్వామివారితో 108 సార్లు విష్ణుసహస్రనామ పారాయణం చేసే అవకాశం లభించింది.

అమ్మమ్మతో బాగా గడిపిన, నాకిష్టమైన సమయం రాజమండ్రి ఇంటిలో బయట ఉన్న చిన్న నూతిలో నీళ్ళు తోడుకుని ప్రొద్దున్న, సాయంత్రం స్నానంచెయ్యడం. అవకాశం ఉన్నప్పుడు గోదావరి గట్టుకు అమ్మమ్మతో వెళ్ళి గడపడం. నాకు ఒంట్లో బాగా లేకపోతే దిష్టి తీసేది. అమ్మమ్మ దిష్టి తీస్తే నాకు చాలా తొందరగా తగ్గిపోయేది. దోమలగూడ జెట్టు దగ్గర ఉన్నప్పుడుపక్క సందులో ఉన్న అమ్మమ్మ స్నేహితరాలైన పద్మావతిగారి ఇంటికి అని వంకతోనన్నుకూడా నడిపించి (వాకింగుకి) తీసుకుని వెళ్ళేది. అమ్మమ్మకి జరిగిన కంటి చికిత్సను ఆపరేషన్ థియేటర్లో డాక్టరుగారి పరిమిషన్ తో అక్కడే ఉండి చూసే అవకాశం లభించింది.

ఒకసారి సెలవులలో అమ్మమ్మతో తిరుపతికి వెళ్ళాను. అక్కడ ప్రతీ మఠానికీ పెరుమాళ్ళకి హారతి తీసుకుని వెళ్ళే అవకాశం ఉండేది. జీయరు మఠం నుంచి అమ్మమ్మ కూడా వెళ్ళేది. అలా ఒకే ఒక్కసారి నన్ను కూడా (నాకు భయం వేస్తున్నా సరే) తీసుకుని వెళ్ళింది. దాని వల్ల నాకు పెరుమాళ్ళని దగ్గరగా చూసే అవకాశం లభించింది.ఆ సమయంలో పూర్వాశ్రమంలో సుందరరాజన్ స్వామి వారు తిరుపతి ఆశ్రమంలో మేనేజరుగా ఉండేవారు. వారు శ్రద్ధగా అమ్మమ్మకి ఆ చుట్టుప్రక్కల గల దివ్యదేశాలు కారులో తీసుకువెళ్ళి చూపించారు. అలా అమ్మమ్మతో నేనుకూడా అన్నీ చూడగలిగాను. మునిమనవలను కూడా చూస్తావమ్మమ్మా అంటూ ఉండేవాడిని. అలాగే నాకు ఇద్దరు పిల్లలు పుట్టినప్పుడు కూడా సరదాపడి తనే వెళ్ళి స్వామివారికి చెప్పి పేర్లు అడిగి మాకు తెలియజెయ్యడం నా అదృష్టం.వాళ్ళిద్దరికీ కూడా నూనెరాసి, నలుగు పెట్టి స్నానం చేయించేది. అమ్మ రోజూ సాయంత్రం విష్ణుసహస్రనామం చదువుతూ

అమృతం లాంటి ప్రేమను పంచేది, ఆప్యాయత అనురాగం చూపించేది అమ్మ.



అమ్మమ్మకి నూనే రాసేది. నా పిల్లలు తుషిత, భార్గవ్ కూడా తాతమ్మకి మేమూ రాస్తామని వాళ్ళుకూడా రాస్తూవుండేవాళ్ళు. అమ్మమ్మ కొంచెం దగ్గగానే మంచి తీర్థం తీసుకొచ్చి ఇచ్చేవారు. అలా వాళ్ళు అమ్మమ్మకి ఓ చిన్ని సేవ చేసుకుంటూ అమ్మమ్మ దగ్గర విష్ణు సహస్రనామం కొంతవరకు నేర్చుకున్నారు. ఇప్పటికీ వాళ్ళు 'తాతమ్మగారు పెరుమాళ్ళదగ్గరకి వెళ్ళి పోయారా, మాతోనే ఉంటారా నాయనమ్మా' అని అమ్మని అడుగుతున్నారు. నాన్నగారు కూడా రోజూ సాయంత్రాలు భాగవతం చదివి అమ్మమ్మకి వినిపించేవారు.

చివరి సమయంలో అమ్మమ్మకి నేను ఏమీ ఉపయోగ పడే అవకాశం లభించలేదు. ఎక్కువగా అమ్మ, పిన్ని మాత్రమే చూసుకునేవారు. నా భార్యకి కూడా అమ్మమ్మ చేతి కై ప్రసాదం తినే అదృష్టం, వండిపెట్టే అవకాశం కూడా లభించింది. నేను ఉడతా ప్రయత్నంగా బీ.పీ., షుగరు, పల్సు చూడడం మందులు తీసుకు రావడం ఇలాంటివి మాత్రం చెయ్యగలిగాను.రామానుజుల విగ్రహం ఎప్పుడు అవుతుందా అని అంటూ ఉండేది. విగ్రహం పూర్తి అయ్యింది దానిని దర్శించుకుని నెమ్మదిగా వైకుంఠం చేరుకుంది.

జైశ్రీమన్నారాయణ



మనుమని వివాహమహోత్సవంలో....



# అమ్మమ్మ జ్ఞాపకాలు

టి.కె.వి.ధన్వంతరి (కన్న)
ప్రియమైన మనుమడు

మా అమ్మమ్మతో ఉండే అనుబంధం చాలా వినూత్నమైనది. కాని ఎప్పుడూ నాకు చిన్నపిల్లో, అమ్మమ్మో అర్థం కాదు.

తను ఎప్పుడూ చిన్నపిల్లల్లాగే ఇంటినిండా కృష్ణుడి ఫొటోలు పెట్టుకుంటూ ఉండేది. అలాగే చిన్నపిల్లలాగే చాలా బొమ్మలు కావాలి అని అంటూ ఉండేది. పెట్టుకుంటూ కూడా ఉండేది. ఎన్ని పెట్టినా తనకి ఆశ తీరేది కాదు. కాని ఇవన్నీ చిన్నపిల్లల చేష్టలా అంటే కాదు.

మానవ జీవితంలో ఎప్పుడూ ఏదో ఒక కష్టం వస్తూనే ఉంటుంది. ఎక్కడ ఉన్నా తన పనులు తానే చేసుకునేది. మడిగా ఉండి వంటలు చేస్తూ అందరికీ చేసి పెట్టేది. తన ఆరాధన తానే చేసుకునేది. ఎన్ని కష్టాలు వచ్చినా మా ఆచార్యులే నన్ను చూసుకుంటారు అనే బలమైన నమ్మకం, చేసే పనుల్లో ఉండే దృఢత్వం ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

ఒకసారి ఎవరో భక్తులు వచ్చి అమ్మమ్మ పాదాలకు దండం పెట్టుకుని వెళ్ళారు. వాళ్ళ నగలు తగిలి అమ్మమ్మ పాదాలకు దెబ్బ తగిలింది. నాకు చాలా కోపం వచ్చింది. కాని అమ్మమ్మకి, పాపం వాళ్ళు ఎక్కడినుండి వచ్చారో, ఎంత దూరం నుండి వచ్చారో అనే తలంపు, దయ వారికి. చూస్తున్నా మాకు ఎనలేని ఆశ్చర్యం.

నేను ఆశ్రమానికి వెళ్ళినప్పుడు విద్యార్థులకు స్వీట్లు పంచడం, అందరికీ పళ్ళు ఇవ్వడం, అందరికీ మంగళా శాసనాలు చెయ్యడం ఒక విశేషమైన ఆనందాన్ని కలిగించేవి. అందరికీ ఏదైనా చెయ్యడంలో కలిగే వాత్సల్యం. ఇంట్లో అందరు పిల్లలు కలిసినపుడు చేతిలో పట్టనంత పెద్ద, పెద్ద ఆవకాయ అన్నం ముద్దలు పెడుతూ ఆనందపడేది. పుట్టిన రోజుల్లో అందరికీ తలంటేటప్పుడు కలిగే వాత్సల్యం. గొప్ప ఆశ్చర్యం.

నేను 7వ తరగతి నుండి స్కూల్‌కి సైకిల్‌మీద వెళ్ళే వాడిని. 10వ తరగతికి వచ్చాక " నువ్వు మంచి మార్కులు తెచ్చుకుంటే నువ్వేమడిగితే అది ఇస్తాను" అని ప్రోత్సహించింది. ఆ ఉత్సాహంతో మంచిగా చదివి ఉత్తీర్ణుడనయ్యాను. పిల్లవాడిగా నేను కొత్త సైకిలు కొనిపెట్టు అని అడిగితే పాపం అమ్మమ్మ సంపాదించక పోయినా తను జాగ్రత్తగా దాచుకున్న డబ్బులు ఖర్చు పెడుతూంటే ఆనందం. ఆశ్చర్యం. ఎప్పుడూ కలుగుతూ ఉండేది.

అమ్మమ్మకి పాటలంటే ప్రాణం. అప్పుడప్పుడు పనులు పూర్తయ్యాక నేనుకూడా ఆ సమయాల్లో ఇంట్లో ఉంటే అమ్మమ్మతో పాటలందుకోవడం విశేషమైన సందర్భం. ఎంత పాడినా మనమా మాధుర్యాన్ని అందుకోలేము.

నాకు అమ్మమ్మే అయినా మా ఆచార్యులకు తల్లి. అందరికీ "అమ్మగారి"య్యారు. నాపైనే ఇంత వాత్సల్యమనుకుంటే నా కంటే మరింత వాత్సల్యాన్ని అనుభవించినవారి మాటలు వింటుంటే సంభ్రమాశ్చర్యాలకు లోనవుతూ ఉంటాను.



అమ్మమ్మ చివరి కొన్ని నెలల్లో ఆరోగ్యం బాగా లేక తిరగలేక పోయేది. "అందరినీ బాధ పెట్టేస్తున్నాను" ఏం చెయ్యాలో! అని బాధపడిపోతూ ఉండేది. అప్పటికీ ఎంత వీలైతే అంత ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా ఉండడం అది ఆవిడకే సొంతం. అంతట్లోనే ముని మనవళ్ళను చూస్తూ ఆనందించడం, వారికి కూడా శిక్షణ ఇవ్వడం. అల్లరిచేస్తూ, కొట్టించుకుంటూ, తగిలీ తగలని దెబ్బలు ఆ ఆనందమే వేరు. మాకు తెలిసీ తెలియని వయస్సులోనే మంచిని నేర్పించేయడం వారి ముందు చూపుకి ప్రతీక. తను కన్నా అని పిలుస్తూ అందరి నోటా కన్నా, కన్నా అనిపించేలా చేయడం మరచిపోలేను.

శారదక్క ఎంత అడిగినా ఈ అనుభవాలను చెప్పమంటే ఏదీ గుర్తు రావటంలేదు. కాని అన్నీ జ్ఞాపకం వస్తూనే ఉన్నాయి. అమ్మగారి – (అమ్మమ్మ) పాదపద్మములకు దాసోహములు తెలుపుకుంటూ మీ కన్నా!

❖❖❖❖❖❖





# అమ్మమ్మ జ్ఞాపకాలు

టి.కె.వి.రామానుజ హేమంతాచార్యులు (మనమడు)
అథర్వ వేద పండితుడు, యాదాద్రి.



అమ్మమ్మ అంటే ముందుగా జ్ఞాపకం వచ్చేది కై ముద్ద. అంటే చేతిలో పెద్ద పెద్ద మాగాయ అన్నం ముద్దలు. అవి చేతితో చేసిన పట్టుకోలేనంత పెద్ద ముద్దలు. అమ్మమ్మ చేసే పచ్చళ్ళు చాలా రుచిగా ఉంటాయి. ముఖ్యంగా వంకాయ కాల్చి చేసే పచ్చడి చాలా అద్భుతంగా ఉంటుంది. తరువాత గుర్తుకు వచ్చేది గులాబ్‌జామ్ కాయలు. రాజమండ్రి ఇంట్లో పెంకులపై ఎక్కి కోసుకునే వాళ్ళము. అమ్మమ్మకి అవి చాలా ఇష్టంగా ఉండేవి. అమ్మమ్మతో ఉండేటప్పుడు రాత్రి పడుకునేటప్పుడు శ్లోకాలు నేర్పించేది. అవి పూర్తి అయ్యేలోగా నిద్రపోయే వాళ్ళము. అప్పుడప్పుడు కృష్ణుడి కథలు చెప్పేది. ముఖ్యంగా ఇంట్లో ఏదీ ముట్టుకోనిచ్చేది కాదు. చాలా మడిగా ఉండేవారు. నిష్ఠగా ఉండేవారు. ఉదాహరణకి, నాకు చిన్నప్పుడు దాహం చాలా ఎక్కువగా ఉండేది. చప్పున వంట ఇంట్లోకి పరిగెడితే ఏయ్! అని అదిలించి లోపలికి రానివ్వక తానేతీసి ఇచ్చేది. అప్పట్లో అర్థం కాలేదు. ఇప్పుడు అనిపిస్తోంది అప్పటినుండే ఎంత గొప్ప క్రమశిక్షణగా ఉండేవారో అని. మాకు చిన్నప్పుడు జ్వరంగాని, ఇంకా ఏమైనా అనారోగ్యం కలిగితే అమ్మమ్మ పంచాయుధ స్తోత్రం మాకు వినిపించేటట్లు చదివేవారు. అప్పుడు అమ్మమ్మ ఏదో మంత్రం వేసేదని అనిపించేది. ఇలా ఎన్నెన్నో మేము చేసే అల్లర్లు, అమ్మమ్మ మాకు ప్రేమతో అదిలించి చెప్పే ఎన్నో మంచి బుద్ధులు. ముఖ్యంగా నేను అమ్మమ్మను చూసి నేర్చుకున్నది ఏమిటంటే ఆవిడ చివరి రోజువరకు కూడా మానకుండా ఆచార్య అనుష్ఠానం ఆచరించారు. ఇవన్నీ మాకు మార్గదర్శకాలుగా, తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

అమ్మమ్మచేతిలో అమృతం దాగి ఉంటుంది



# అమ్మమ్మ - ప్రేరణ

గిరి– దీప దంపతులు, బెంగళూరు
పెద్దకుమార్తె రెండవ కుమారుడు (మనుమడు)

చిన్నప్పుడు అమ్మమ్మ అంటే నాకు వేసవి సెలవలు, రాజమండ్రి, గోదావరి – అంతే. అమ్మమ్మ ఇంట్లో గడిపిన రోజులు మరువ లేనివి, తిరిగి రానివి. నాకు మొదటగా అ,ఆ లు దిద్దించింది అమ్మమ్మే! సీతంపేట లోని ఆ పాత ఇల్లు ఇంకా జ్ఞాపకమే! వేసవిలో పగలు అంతా ఆడుకుని రాత్రి డాబా మీద హాయిగా పడుకునే వాళ్ళం. పక్కనే ఒక రామాలయం. అప్పుడప్పుడు అక్కడికి వెళ్తూ ఉండేవాళ్ళం. సాయంత్రం గోదావరిలో పిన్నులు, మావయ్య తో కలిసి స్నానాలు, తరువాత అమ్మమ్మ చేతి వంట. అదొక మరపురాని రుచి! పండగలు వస్తే కొత్త బట్టలు,బోల్డు వంటలు, ఆరాధనలు. అప్పుడప్పుడు చుట్టాలు! పెద్ద స్వామివారిని, చిన్న జీయర్ స్వామివారిని తులసి రామానుజ కూటం లో చూసిన గుర్తు ఇంకా ఉంది. దాదాపు 1980 వరకు, రైల్వే స్టేషన్ నుంచి 1వ నెంబర్ బస్సు ఎక్కి సీతంపేట రావడం,ఆ తరువాత విజయవాడ వెళ్ళిపోయాక, ఏ హౌరా మెయిలో పట్టుకుని రాజమండ్రి రావడం జరిగేది. అమ్మమ్మ ఒక జగద్గురువుకి పూర్వాశ్రమంలో కోడలు అని, మరొక జగద్గురువుకి మాతృమూర్తి అనే స్పృహే లేదు! రక్తాక్షి నామ సంవత్సరంలో (1984) అమ్మ పరమపదించాక, అమ్మమ్మ తో అంత తరచుగా కలిసే అవకాశం కలగలేదు. కొన్ని సంవత్సరాలు అసలు కలవనే లేదు. ఎప్పుడో ఒక సారి సీతానగరం ఆశ్రమానికి వచ్చినప్పుడు కలిసేవాళ్ళం.

చదువులు పూర్తి చేసుకొని, ఉద్యోగాలు చేసే సమయానికి అమ్మమ్మతో అనుబంధం మరికొంచెం పెరిగింది. అంతే కాదు, ఆవిడ మహోన్నత వ్యక్తిత్వం కొద్ది కొద్దిగా అర్థమవ్వసాగింది. ఎంత ఆచార్య నిష్ఠ? ఏమి ఆచరణ? అది దగ్గరగా చూసినవాళ్ళకి తప్ప అర్థం అవ్వడం కష్టం. ఆవిడ మాటల్లో, ఆలోచనల్లో అంతా ఆచార్యులే! చేతలు అన్ని ఆచార్యుల కొరకే! రామానుజ వైభవం, మన ఆచార్యుల వైభవం అన్ని దిక్కులా వ్యాపింపచేసి అందరినీ తరింప చెయ్యాలనే తపన! స్వామివారికి నిత్యం మంగళం పాడుతూ ఏ కుదృష్టి సోకకుండా ఉండాలి అని ప్రార్థన – ఇదే ఆమె జీవితం. ఎన్ని కష్టాలు వచ్చినా ఎంత బాధ కలిగినా, ఆచార్యులు చూసుకుంటారు అనే నమ్మకం. ఈ ఆచరణ చాలా మందికి ఒక ప్రేరణగా నిలిచింది. మార్గదర్శకమయ్యింది.

ఒక చిన్న సంఘటన – అది ఒక ఆంగ్ల నూతన సంవత్సర దినం. అందరూ స్వామివారికి హ్యాపీన్యూ ఇయర్ అని శుభాకాంక్షలు చెప్తున్న సందర్భం. అమ్మమ్మ మాత్రం స్వామివారి దగ్గరకు వచ్చి – 'నాయగనాయ్' శుభాకాంక్షలు తెలిపింది. అవి తిరుప్పావై వ్రతం రోజులు కదా! స్వామివారు అది విని చాలా సంతోషించారు. అదీ అమ్మమ్మ సంప్రదాయ నిష్ఠ.

ఒక నాలుగు నెలల క్రిందటి వరకూ స్వయంగా తానే వండి పెరుమాళ్ళకు ఆరాధనలో నివేదించి, తరువాత మాత్రమే ప్రసాదం తీసుకునేవారు. ఉదయం గురుపరంపర చదువుకొని, శ్రీపాద తీర్థం తీసుకుని గాని ఆవిడ ఏమి తీసుకునేవారు కాదు. ఆఖరి రోజు కూడా అంతే. చిన్న జీయరు స్వామి వారిలో తమ ఆచార్యులను చూసుకునేవారు. పెద్ద స్వామివారి శ్రీపాదకణిక ఇంకా ఉంది ఆవిడ దగ్గర. అది గత 40 ఏళ్లుగా కొనసాగించుకుంటూ వచ్చారు. మేము ఎప్పుడైనా స్వామివారి శ్రీపాద సేవ చేసే భాగ్యం లభించిన తరువాత ఆవిడ దగ్గరకి వెళ్తే, మా చేతులను తన శిరస్సు మీద పెట్టుకుని ధన్యురాలుగా భావించేవారు. ఎప్పుడు మంగళాశాసనం చేసినా, ఆచార్య కైంకర్యం బాగా చేసుకోండి అని మాత్రమే చెప్పేవారు. అమ్మమ్మ మాటలలో ఆప్యాయత, ప్రేమ చవిచూడాల్సిందే, చెప్పడానికి సాధ్యం కాదు.

ఊహ తెలిశాక అమ్మమ్మ తో సుమారు 44 సంవత్సరాల జ్ఞాపకాలు అనుభవాలు! ఎంత చెప్పినా చాలదు!



# మాతృదేవోభవ!


మంగయాచార్యులు (కిషోర్ బాబు)
ద్వితీయ పుత్రుడు, బెంగుళూరు




అమ్మ అంటే ఒక తీయని అనుబంధం

**అమ్మ అంటే ఒక అనురాగం**

అమ్మతో అనుభవాలు అంటే ఒకటా.......రెండా....?
నడిచే ప్రతి అడుగు అమ్మదే అయితే...
పలికే ప్రతి మాటా అమ్మదే అయితే......
ఈ జీవితమే తనదైతే...... !
జ్ఞాపకాలు -- అనుభవాలు అనంతాలు!
మమ్మల్ని తీర్చిదిద్దిన జీవిత పాఠాలు !!

**అమ్మ అంటే ఒక క్రమశిక్షణ**

ఉదయం 6 గం.లకు ప్రాతర్నిత్యాను సంధానం ,
సాయంత్రం ఎక్కడ ఉన్నా .., ఆడుకోవడానికి వెళ్ళినా 6గం. ఇల్లు చేరాల్సిందే స్తోత్ర పారాయణం చేయాల్సిందే.
చదువు నేర్పే గురువు కూడా అమ్మనే
"చదువుతున్నావా" అన్న అమ్మ మాట వినగానే "Ghandhiji is the father of our nation" అని గట్టిగా చదివిన పాఠాన్నే మళ్ళీ మళ్ళీ చదవడం తలచుకుంటే నవ్వు వస్తుంది.

**అమ్మ అంటే ఒక ఆదరణ! ఒక ఆత్మీయత.**

ఆవకాయ అన్నం కలిపి కథలు చెప్తూ ముద్దలు పెట్టేది.
తాను తినక పోయినా మా కడుపు నిండితే చాలనుకుని సంతోషపడేది.

**అమ్మ అంటే ఒక ధైర్యం.**

మద్రాసులో ఉద్యోగం చేస్తున్నప్పుడు రోజూ సాయంత్రం బీచ్ కి వెళ్ళేవాళ్ళం.
అమ్మకి జామపళ్ళు , మొక్కజొన్న పొత్తులు అంటే చాలా ఇష్టం. అవి తింటూ నడుస్తుంటే.....
తీరాన్ని చేరటానికి ఆరాట పడే అలలను చూపిస్తూ... లక్ష్యం చేరుకోవాలంటే కష్టాలను ఎదుర్కొని ముందుకు సాగాలని ధైర్యం చెప్పే జ్ఞాపకాలు ఎంతో మధురమైన పాఠాలు.
అమ్మతో నేపాల్ యాత్ర మరపురానిది. మైళ్ళకొద్దీ నడుస్తూ ముక్తినారాయణుని సేవించుకోవటం మహాభాగ్యం.
అమ్మ ఎక్కడికి వెళ్ళినా నేను వెంట ఉండాలనేది. అమ్మ వెంట గడిపిన ఆ రోజులు ...
నేర్చుకున్న విషయాలు మధురస్మృతులు ఎప్పటికీ మదిలో నిలిచి ఉంటాయి.

**అమ్మ అంటే నిష్ఠ! అమ్మ అంటే ఆచారం! అమ్మ అంటే మన సంప్రదాయం.**

అనుష్ఠానం అయ్యే వరకు మంచినీళ్ళైనా తీసుకోని అమ్మ నిష్ఠ మాకు ఆశ్చర్యాన్ని కలిగించేది.
మాతృదేవో భవ! -ఆచార్యదేవోభవ! అన్నట్లు అమ్మగా - గురువుగా మా వెంటే ఉండి మమ్మల్ని ఈ స్థాయికి తీసుకు వచ్చిన మహనీయమైన మాతృమూర్తి గురించి చెప్పడానికి అక్షరాలు చాలవు. మాటలు సరిపోవు.
అమ్మ శ్రీమన్నారాయణుని దివ్య సన్నిధి నుండి మాకు సదా ఆశీస్సులు అందిస్తూనే ఉంటుంది.

❖❖❖❖❖❖



# 'అమ్మ' లోని తియ్యదనం

**గోదాదేవి (కుమార్తె)**



గోదాదీ..... అమ్మ ప్రేమతో ముద్దుగా పిలిచే ఆ కమ్మనైన పిలుపు....ఎక్కడున్నా సరే హా..... అంటూనే మళ్ళీ పిలిపించుకోవాలనే ఆశతో మెల్లిగా రావటం... ఇకమీదట అమ్మ నోట ఆ పిలుపు వినలేనే అనిపిస్తుంటే ..మనకు కావలసినది మనతో ఎప్పటికీ ఉంచుకోలేమే అనే స్పష్టత..

ఊహ తెలియని వయస్సు... రాజమండ్రి రామానుజకూటంలో ఉండే సమయం..పెద్ద తుఫాను.. కరెంటు లేదు.. నన్ను ఉయ్యాలలో ఊపుతూ విష్ణుసహస్ర నామం చదివేది...అప్పుడే అలా భగవన్నామం వింటూ మనసులో నాటుకుపోయిన చిన్ని అస్పష్టమైన జ్ఞాపకం...

ధనుర్మాసం వస్తే ఆ ఆనందమే వేరు.. తెలతెల వారుతుండగానే లేచి పనులు చేసుకుంటూ అమ్మ పాడే ఆ మధురమైన పాట ...'కృష్ణా...తెలవార వచ్చెను లేరా' అంటూ పాడుతుంటే .. నిద్రలోనే ఆ పాటలోని తియ్యదనం అమ్మ నోట వింటూ .. మెల్లిగా కళ్ళు తెరవటం.. ఆ..హా ధనుర్మాసం వచ్చింది అనిపించేది.....పొరపాటున నేను నిద్రలో ఉండి వినలేకపోతే ఆ పాట పాడించుకుని మరీ లేచేదాన్ని అలా అమ్మ నోట ఆ పాట వింటూ లేవడం ఒక మధురమైన అనుభూతి...ఇప్పటికీ ధనుర్మాసం వస్తే అమ్మ నోట ఆపాట వినకుండా లేవాలనిపించదు..ధనుర్మాసంలో తప్ప మళ్ళీ ఎప్పుడూ పాడేవారూ కాదు ఆ పాట....ఇంక అమ్మ చేతి పొంగలి ఎప్పుడు తింటామా అని...ఎంత కమ్మగా ఉండేదనీ అసలు..

ఎక్కడో ఉండే నేను అమ్మా నిన్ను సేవించుకోవాలని ఉంది అంటే నాదగ్గరికి రావడానికి ఆంక్షలు ఏంటి ... అంటూ నేను ఉన్నాను అనే ధైర్యాన్ని ఎప్పుడూ నాకు ఇచ్చిన మాతృమూర్తి....ఎంత బాధలో ఉన్నా అమ్మ దగ్గరికి వచ్చి కూర్చుంటే చాలు. ఏమీ మాట్లాడుకోకపోయినా, ఏదీ చెప్పుకోక పోయినా పరవాలేదు, అలా అమ్మని చూసి వెళ్తేచాలు అనిపించేది...



ఎన్ని బాధావీచికలు....

ఎన్ని మధురస్మృతులు......

ఎన్ని తీపిగుర్తులు.....

నేను ఎంతో దూరంలో ఉంటూ దగ్గరగా ఉండి ఏమీ సేవచేసుకోలేకపోతున్నానే అని బాధపడుతూ ఉంటే ..నా బాధను అర్థం చేసుకున్నట్టు ఆవిడ చివరిక్షణాలు మాకు అంకితం చేసిందనే అనిపించింది.. చిన్నతనం అమ్మ చేతిలో ఎలా గడిచిందో గుర్తులేదు...కాని "ఆవిడకి తల్లిగా ఆవిడ పసితనం అంతా మేము అనుభవించే అదృష్టం" మాకు కల్పించింది ఆ మహాతల్లి...

చక్కగా తల దువ్వించుకుని, స్నానంచేయించుకుని, డ్రస్ చేయించుకుని, క్రమం తప్పక జపం చేసుకుని, బుద్దిగా గోరుముద్దలు పెడుతుంటే కొంచెం ఎక్కువైనా వద్దని మారాం చేస్తే ఎలాగో బుజ్జగించి తినిపించి పడుకోపెట్టడం.. అలా అన్నీ అయ్యాక, కాసేపు వాకింగ్ అంటూ లేవదీస్తే బుడి బుడి నడకలతో నడవలేక మా చేతులు పట్టుకుని అడుగులో అడుగు వేస్తూ నడిచి అలిసి సొలసి కూర్చోవటం.. ఇక రాత్రి తప్పక తినాలి కదా అన్నట్టు సాపాటు చేశాక ..అలిసిన ఆ పాదాలు నొక్కుతుంటే ఎప్పటికో మెల్లిగా నిద్రలోకి జారుకోటం ..ఏ పసివారు అంత బుద్ధిగా ఉంటారు...

ఆఖరి క్షణాల్లో ఒక్క క్షణం అటూఇటూ వెళ్తే నన్ను వదిలి వెళ్ళిపోకు అంటూ.. చిన్నపిల్లలా చెయ్యి గట్టిగా పట్టుకునే అమ్మ ... నా చేతిని వదిలి ఒంటరిని చేసిందే...

చివరిగా 85 వ పుట్టినరోజు కూడా ఏ ఆర్భాటమూ లేకుండా సంతోషంతో జరిపించుకుంది. ఓపికలేని ఆ శరీరంతోనే కూర్చుని మా సంతోషం కోసం బోసినవ్వులు చిందిస్తూ "ఎవరినీ నొప్పించక తానొవ్వక" అన్నట్టు బంతితో ఆడుతూ , ఎవ్వరు ఏమి చేసినా నిజంగా పసిపిల్లే అన్న రీతిలో అమాయకంగా అన్నీ చేయించుకుంది .

ఆ పసితనపు అనుభవాన్ని మాకు ఇచ్చినట్టే ఇచ్చి మేము ఆనందించి అనుభవించేలోపే ..నాకు ఆచార్య తిరువడి చేరుకునే సమయం ఆసన్నమైంది అన్నట్టు మా చేతులు వదిలి వడివడిగా అడుగులు వేసుకుంటూ ఎప్పటికీ కనిపించని ఆ (వైకుంఠనాధుని)తీరానికి వెళ్ళిపోయింది....

అమ్మా ...నీ చివరి సంతానంగా నా ఈ జన్మ ధన్యమైంది ....
నీ గోదాదీ...



# నాయనమ్మ - చిరస్మరణీయం


దేవిక, వేదవ్యాస్ (మనుమలు)

దేవికా మాల్యద, మనుమరాలు, బెంగుళూర్




నీవు మాతోనే ఉన్నావు. మాలోనే ఉన్నావు. మా జ్ఞాపకాలలో నీవు ఎప్పటికీ ఉంటావు.
బుడిబుడి అడుగులు నేర్పావు. కబుర్లుచెప్పుకుంటూ చేయి చేయి పట్టుకుని నడిచిన రోజులు మరిచిపోలేము.
కథలు – పాటలతో నిద్రపుచ్చిన రోజులు మా మదిలో నిలిచి ఉంటాయి.
ఆచారం – సంస్కారం, సంప్రదాయం నీవు నేర్పినవే.
మళ్ళీ మళ్ళీ తినాలనిపించే రోటిపచ్చళ్ళు, మధురమైన నీ వంటలూ మరుపురానివి.
చిన్నిచిన్ని నీ చిట్కాలతో మమ్మల్ని బాధించే రోగాలను చటుక్కున మాయం చేసే నీ వైద్యం మాకు శ్రీరామరక్ష.
అమ్మనాన్న మందలిస్తే అక్కున చేర్చుకుని తప్పులు సరిదిద్దావు. అలసి వస్తే ఆదరించి ఒడి చేర్చుకున్నావు.
కథలు చెప్తూ నీవు నిద్రలోకి జారిపోతే నానమ్మా కథ పూర్తిగా చెప్పు అని నిన్ను తట్టి లేపాము.
ఈనాటి నీ నిద్ర శాశ్వతమైనదనీ నీవు తిరిగిరాని లోకాలకి వెళ్ళావన్న నిజం కలలాగ అనిపిస్తున్నది.
నీవు మా జ్ఞాపకాల్లో సదా నిలిచి ఉంటావు.
నీ మాటలను, నీ పాటలను గుర్తుచేసుకుంటూ, స్ఫూర్తిగా భావించి నీ పేరు నిలిచిపోయేలా నడుచుకుంటాం.
నీవు ఆ స్వామి సన్నిధానంలో సంతోషంగా ఉండాలని శ్రీమన్నారాయణుని మనసారా కోరుకుంటున్నాం.

❖❖❖❖❖❖

ఆత్మ సంస్కారాలను అందుకోవడానికే కదా వంశ పరంపర!



# ఏమి నోము నోచినదో ..



**తూపురాణి ఉదయవర్లు**

పెరియాళ్వార్ తిరుమొళిలో "ఎన్ననోన్బు నోత్తాళ్ కొలో ఇవనై పెత్త వయిఱుడైయాళ్" అంటూ కృష్ణుని కన్న యశోదమ్మను "ఏమి నోము నోచినదో ఏమో ఈ కృష్ణుని కనే భాగ్యాన్ని పొందింది" అని లోకమంతా పొగిడిందట.

అటులనే మన చిన్న జీయర్ స్వామిని కనీ లోకానికి అందించే భాగ్యాన్ని పొందిన శ్రీమతి అలివేలు మంగతాయారమ్మగారు ధన్య జీవి.

**జ్ఞానానుష్ఠాన సంపన్నులయి, సకలజనమనోహరమైన మృదుమధుర వాగ్వైభవముతో ఆధ్యాత్మికంగానే కాక , లౌకికంగా కూడా విలువలతో కూడిన జీవనాన్ని ప్రతి ఒక్కరూ అలవరుచుకునే విధంగా అలరిస్తున్న చిన్న జీయర్ స్వామికి తల్లి అయినందున ఆమె సకల లోక వంద్య అయినది.**


"జనకానాం కులే కీర్తిం, ఆహరిష్యతి మే సుతా" అని జనకకులానికి కీర్తి ప్రతిష్ఠలు సీతమ్మవారి వలన కలిగినట్లే మా తూపురాణి వంశ (దాసునకు అలివేలమ్మగారు పెద తండ్రి కుమార్తె) కీర్తి ప్రతిష్ఠలు కూడా ఆమె వలన గొప్ప గౌరవాన్ని పొందాయి అని ఆనందించడంలో తప్పు లేదని భావిస్తున్నాను.

❖❖❖❖❖❖





# మార్గదర్శిని - పెద్దమ్మ




ముడుంబై నరసింహాచార్యులు

మల్లాపూర్, హైదరాబాద్ (అమ్మగారి చెల్లెలి పుత్రుడు)


పెరుమాళ్ళ సన్నిధికి చేరిన పెద్దమ్మ ... మా అమ్మకి అక్క అవ్వడం వల్లనో స్వతాహాగా ఆవిడతో ఉన్న అనుబంధం వల్లనో... ఆవిడ సాన్నిధ్యం ఎప్పుడూ మా అమ్మతో ఉన్నట్లే ఉంటుంది... మా అమ్మగారు మూడు సంవత్సరాలక్రితం పరమపదించినప్పటి నుండి ఆ భావన ఇంకా పెరిగింది... ప్రత్యేకంగా నా పూర్వ రంగంలో నేను మెడికల్ లైన్‌లో ఉండటంతో ... తరచూ... ఆరోగ్యం గురించి... మందులగురించి అడిగి తెలుసుకొనేవారు... అది ఆవిడకి ఉన్న విషయ జిజ్ఞాసకి ఉదాహరణ.. ప్రతీ విషయం కూలంకషంగా తెలుసుకొనేవారు.. కలిసినప్పుడల్లా హిందీ పాటలు ఆ గానకోకిలచేత పాడించుకోవడం ఒక గొప్ప ఆనందం...

మా నాన్న గారి మాటల్లో ఎప్పుడూ పెద్దమ్మని ఒక మాతృమూర్తిగా భావించేవారు... ఆవిడ వల్లే మా అమ్మని వివాహమాడటం జరిగిందని చెప్తుంటారు. మంచి వ్యక్తిత్వానికి నడవడికకు, ఆవిడ ఇచ్చిన సూచనలు ఎప్పటికీ మాకు మార్గదర్శకాలు.. శ్రీ స్వామివారు సన్న్యాసాశ్రమం తీసుకొనే ఒక వారం ముందు ఏలూరు పెద్దమ్మతో వచ్చారు. మా కుటుంబంలో అందరికీ ఇప్పటికీ ఆనాటి మధుర స్మృతులు.. గుర్తుంటాయి. స్వామివారిని మన సాంప్రదాయ ఉద్ధరణకు త్యాగం చేయడం... తల్లిగా ఆవిడ ఆత్మస్థైర్యానికి నిదర్శనం...

పరమపదవాసి అయిన మాతృమూర్తికి సంప్రదాయపరంగా చరమక్రియలు నిర్వహించిన మన జగదాచార్యులు, మహాయతీశ్వరులు శ్రీజీయర్ స్వామివారు మనందరికీ గొప్ప ఆదర్శనీయ జీవన్మార్గదర్శకులు... నిత్యసూరివర్గంలో చేరిన ఆ మహాతల్లి మనందరిపై పెరుమాళ్ళ కృపను సదా వర్ధిల్లచేయుగాక...!

మనల్ని ఉద్ధరించడానికి రామానుజులవారు ఎన్ని అద్భుతాలు చేశారో, వారి అపర అవతార స్వరూపులైన మనజీయర్ స్వామివారు కూడా అనన్య సాధ్యమైన ఎన్నో మహత్తరమైన కార్యాలను సాకారం చేస్తున్నారు... ఇంతటి గొప్ప ఆచార్యులను మనకు ప్రసాదించినవారి మాతృమూర్తికి వినమ్రంగా అంజలి ఘటిస్తూ...

---



# అమ్మను మించిన వాత్సల్యమూర్తి


కృష్ణమోహన్ నల్లాన్ చక్రవర్తుల


మా అమ్మ ఉన్నప్పుడు అమ్మ గారు ఒకరోజు మా ఇంట్లో సుమారు 20 సంవత్సరాలక్రితం నా పెళ్ళి అయిన రెండు, మూడు సంవత్సరాలకు అనుకుంటా, దాసుని గృహం పావనం చేశారు.

నేను ఎప్పుడు వారిని దర్శించినా అమ్మ కన్నా ఎక్కువ వాత్సల్యం చూపేవారు.

నేను ఆవిడతోగల సంబంధం ఎవ్వరికీ చెప్పను కారణం స్వామీజీకి బంధువునని చెప్పుకోవటం నాకు ఏదో తప్పు చేసినట్లుగా, చాలా దోషంగా భావిస్తాను. దాసుడు సంప్రదాయ బద్ధంగా జీవించలేకపోవటమే కారణం క్షమ్యతాం. అమ్మగారి పాదపద్మములకు దాసోహములు.



# ఆడపడుచుకి - అశ్రునివాళి


**తూపురాణి లక్ష్మీతాయారు (మరదలు)**
**మెహిదీపట్నం, హైదరాబాదు.**


తాటిపర్రులో పుట్టి, ఆర్తమూరులో మెట్టి,
అటుతూపురాణి వంశానికి - ఇటు చిలకమర్రి వంశానికి
ఆణిముత్యమై ప్రకాశించిన
మా ఇంటి పడుచు
అలమేలు మంగతాయారు
మా బంధం చిన్ననాటి అనుబంధం -
మరపురానిది - మరువలేనిది.
ఒడిదుడుకులని తట్టుకొనే మనోనిబ్బరం -
కష్టాలకు చలించని ఆత్మవిశ్వాసం -
సహనం - ఔదార్యం నిండిన ఆమె
జీవితం - మాకు ఆదర్శం.
అందరి హితం కోరే ఔన్నత్యం -
సమాజ శ్రేయస్సును కాంక్షించే మాతృత్వం -
మా అలమేలు మంగతాయారు జీవితమే
ఒక సందేశం.
మాలో ఒకరై - మా కష్ట సుఖాల్లో మమేకమై -
మాలో స్ఫూర్తి నింపిన ఆమె
మా తూపురాణి వంశానికే గర్వకారణం.
వైకుంఠనాధుని దివ్య సన్నిధిని చేరిన
మా అలమేలు మంగతాయారు తిరునాడు అలంకరించాలని
శ్రీమన్నారాయణుని ప్రార్థిస్తూ
నమస్సుమాంజలి అర్పిస్తున్నాం.



ఆత్మీయులకు సైతం స్ఫూర్తి ప్రదాయిని...








కుమార్తెలు, మనుమలు, మునిమనుమలతో...

## బహుముఖ ప్రజ్ఞాశాలి - పిన్నిగారు

అ॥చి॥ తిరువెంగళాచార్యులు
పెద్ద బావ గారి ప్రథమ పుత్రుడు



అమ్మగారిని మేము పిన్నిగారని సంబోధించే వాళ్ళం. వారు మాకు మాతృసమానులు, స్వయానా బాబాయిగారి భార్య. వారి వివాహం అయి కాపురానికి వచ్చేసమయానికి నేను నెలల పిల్లవాడినట. వారు నన్ను ఉయ్యాలఊపి ఆడించే వారట. నాకు మూడు ఏళ్ళ వయస్సులో, మేము రాజమండ్రి మకాం మార్చడం జరిగింది. అలా మేము మా పిన్నిగారికి, బాబాయి గారికి దూరం అయినాము.

**మా పిన్నిగారు మాతృవాత్సల్యానికి ప్రతీక.** మాకు అర్తమూరు పేరు వింటేనే అదో మనస్సులో ఒక అందమైనపులకింత. ఒక్కసారి వెళ్ళి ఆ ఊరిని, పిన్నిగారిని, బాబాయిగారిని సేవించుకోవాలనే ఆకాంక్ష. నాకు ఎనిమిది ఏళ్ళ వయస్సులో అనుకుంటా ఆకోరిక తీరింది. మా నాన్నగారితోబాటు మా అక్క, నేను పిన్నిగారింటికి వెళ్ళాము. అక్కడ మొదటి సారిగా పిన్నిగారిని, బాబాయి గారిని చూడడం జరిగింది. మాపిన్నిగారు నన్ను, మా అక్కని దగ్గరకు తీసుకుని మాపై చూపిన ప్రేమానురాగాలు, ఆదరాభిమానాలు, ఇంకా ఇప్పటికి నా మదిలో చెరగని మధుర స్మృతులు. జ్ఞానం తెలిసిన తరువాత మాపిన్నిగారిని చూసిన ఆనందం. వారియెడల అది నా మొదటి అనుభూతి.

తరువాత కొంత కాలానికి మా బాబాయిగారు, పిన్నిగారు కూడా రాజమండ్రికి వచ్చేశారు. ఆ సమయంలో నేను హైస్కూలులో చదివేవాడిని. మా బాబాయిగారి వద్దకు ఇంగ్లీషుగ్రామరు నేర్చుకోవడానికి అప్పుడప్పుడు వెళ్ళేవాడిని. నా క్లాసు అయ్యాక, మా పిన్నిగారు వంటగదిలోంచి, ఎంతపనివున్నా వచ్చిపలుకరించి, మా అందరి కుశలసమాచారములు అడిగి, ఎంతో ఆప్యాయతగా ఏదోఒకటి తినడానికి ఇచ్చి, త్రాగటానికి పాలని ఇచ్చి బాగా చదువుకోమని ఆశీర్వదిస్తూండేవారు. ఇదే పద్ధతిని వారు చివరివరకు కొనసాగించారు. వారు పరమపదించడానికి కొన్ని రోజుల ముందు, నారాయణగూడాలో, నేను వారిని చూడడానికి వెళ్ళినప్పుడు, అంత తీవ్ర అస్వస్థతలో, మంచంమీద బాధలో ఉండి కూడా నన్ను దగ్గరగాపిలిచి, నాచేతిని ఆప్యాయతగా స్పృశించి, పాలు త్రాగి వెళ్ళమని చెప్పిన వారి వాత్సల్యానికి, ఇంటికివచ్చినవారిని ఆదరించే సహృదయతకు, అనంతకోటి దాసోహములు సమర్పించుకుంటున్నాను.

**మాపిన్నిగారు ఒక నిస్వార్ధ ధన్యజీవి, మృదుల భాషిణి.** వారిమాట గట్టిగా వినబడేది కాదు. వారు ఒక ఆదర్శ గృహిణి మరియు ఎంతో కష్టజీవి. ఆడంబరాలులేని సామాన్య జీవితం వారికి ఇష్టం. భూదేవితో సమానమైన క్షమాగుణం, సహనం కలిగిన ఇల్లాలు. ఎంతటి ఒడిదుడుకులొచ్చినా, ధైర్యంగా నిలబడి, క్రమశిక్షణతో పిల్లల్ని చక్కగా పెంచి పెద్ద చేశారు. “ఏ తల్లి కన్నదోరా నిన్ను” అన్న నానుడి అనుసరించి వారి పెంపకం ఎలాంటిదో, కర్తవ్య నిష్ఠ ఎలాంటిదో, వారి బాలుడు మన స్వామివారే ప్రత్యక్ష నిదర్శనం. మనందరికి శ్రేయోమార్గాన్ని ఉపదేశించేందుకు మణిదీపంలాంటి శ్రీ స్వామివారిని, నిస్వార్థంగా ఈ లోకానికి, మనందరికీ ప్రసాదించిన ధన్యజీవి.

అజ్ఞానం అనే చీకటిని పోగొట్టి మన హృదయాలలో జ్ఞాన ప్రకాశం కల్గించే వారే గురువు.



**మాపిన్నిగారు చక్కటి కార్యనిర్వహకురాలు.** తమ పెద్దమ్మాయి చిట్టెమ్మ వివాహం సందర్భంలో, సంబంధం కుదర్చడానికి బెజవాడ మా నాన్నగారు ఒక్కరే వెళుతున్న సందర్భంలో, (మా బాబాయి గారు ఆ సమయంలో స్వల్ప అనారోగ్యం కారణంగా వెళ్ళలేదట) మాపిన్ని గారే ధైర్యంగా కూడా వెళ్ళి సంబంధం కుదుర్చడం మొదలు వివాహం సుసంపన్నం అయ్యేవరకు అన్ని శుభకార్యాలు దగ్గర ఉండి చక్కగా జరిపించిన ఘనత వారిదే. ఇదివారి కర్తవ్యనిష్ఠకు, కార్య నిర్వాహక శక్తికి ఒక ఉదాహరణ.

**మాపిన్ని గారు ఒక గొప్ప సోషలిస్టు భావాలు కలిగిన వ్యక్తి.** అందరినీ సమానదృష్టితో చూసేవారు. అందరినీ తనపిల్లల్లాగే భావించేవారు. శ్రీస్వామి వారి తిరునక్షత్ర శుభ సందర్భములో, పిన్నిగారు శ్రీస్వామివారి శిరస్సుపై పెరుమాళ్ళ అభిషేకతైలం ఉంచి వారికి మంగళహారతులివ్వడం జరుగుతూ ఉండేది. ఆ తరువాత, మా అందరికీ కూడా శిరస్సుపై తైలం ఉంచి ఎంతో ప్రేమతో ఆశీర్వదించేవారు. ఆ ప్రేమమూర్తి దృష్టిలో మనందరం వారిపిల్లలమే. వారు ఒక సమతామాత. ప్రతి దీపావళికి (శ్రీస్వామివారి తిరునక్షత్రం సందర్భంగా) పిన్నిగారు మాకు స్పెషల్ మిఠాయిలు, పటాసులు బాబాయిగారి ద్వారా పంపిస్తూ ఉండేవారు. తమ కుమారుని పుట్టినరోజును అలా అందరితో సమానంగా, సంతోషంగా పంచుకునేవారు.

**మాపిన్నిగారు ఒక ఆదర్శరైతు.** పచ్చనిచేలన్నా, పూల, పండ్ల తోటలన్నా వారికి చాలా ఇష్టం. మాబాబాయి గారికి టమోటాలంటే బాగా ఇష్టం అని తమ ఇంట్లో, టమోటా మొక్కలు, వంగ మొక్కలు, చిక్కుడు, గుమ్మడి లాంటి పాదులు పెంచేవారట. తను వంటచేస్తున్నప్పుడు తమ కిచెన్ గార్డెన్ నుంచి కొన్ని టమోటాలు కోసుకు వచ్చి పప్పులో, చారులో వేస్తూ ఉండేవారని వారు చెపుతుండేవారు. ఇక్కడ ఆశ్రమంలో కూడా ఎప్పుడు మొక్కలకి నీళ్ళుపోస్తూ, సంరక్షణ చేస్తూ ఉండేవారు. మేము ముచ్చింతలలో చిన్న టమోటా తోట వేశామని చెపితే, ఎంతో ఆసక్తిగా వచ్చి చూసి పూర్తిగా పండ్లతో ఉన్న తోటను తిలకించి ఆనందించి మమల్ని ఆశీర్వదించారు.

**మాపిన్ని గారు ఒక మంచి వెల్ఫేర్ ఆఫీసర్.** నేను గత ఏడు సంవత్సరాలుగా ఆశ్రమంలో ఉంటూ వారిని తరచుగా సేవించుకునేవాడిని. నేను వెళ్ళినప్పుడల్లా నాకు ప్రేమగా ఒక గ్లాసు పాలు ఇవ్వడం, కుశల ప్రశ్నలతో కుటుంబ సభ్యుల అందరి క్షేమసమాచారాలు పేరుపేరున అడిగి తెలుసుకోవడం, నాకు చక్కని సలహాలు ఇస్తూండడం జరిగేది.వారు అందరి శుభాన్ని ఆకాంక్షించేవారు. ఆశ్రమంలో కూడా అందరిని పలకరించి వారి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకునేవారు. "సర్వేభవంతు సుఖినః" అని కోరుకునే వీరు మనందరికీ ఆదర్శప్రాయులు.

ఇలా వ్రాసుకుంటూపోతే వారిని గురించిన మధురస్మృతులు ఎన్నెన్నో. వారి శ్రీపాదములకు శతకోటి దాసోహములు సమర్పించి మంగళాశాసనాలు కోరడంతప్ప మనము వారికి ఏమి ఇయ్యగలవారము?

ఆ మహామనీషి పరమపదంలో భగవత్ కైంకర్యం చేసుకుంటూ పెరుమాళ్ళ సన్నిధిలో నిత్యంగా ఉండిపోవాలని ఆచార్య శ్రీముఖేన మన అందరి తరపున ప్రార్థిస్తూ వారి పాదపద్మములకు నమస్సుమాంజలి ఘటిస్తున్నా.....



# సంప్రదాయపు కల్పవృక్షం



రామసీత, న.చ. శ్రీమన్నారాయణాచార్యులు
ఆడపడచు ఆండాళమ్మగారి పుత్రులు, రాజమహేంద్రి

శ్రీమద్ ఉభయవేదాంత మార్గ ప్రతిష్ఠాపనాచార్య ఉభయవేదాంత ప్రవర్తకాచార్య విశిష్టాద్వైత ప్రచారకులు, సత్యసంకల్పులు శ్రీపెద్ద జీయరుస్వామివారి చరణకమలముల నాశ్రయించిన మన అలివేలు మంగమ్మగారు మన జన్మసుకృతముగ లభించారు. దేవకీవసుదేవులకు పుట్టి యశోదానందుల దగ్గర పెరిగినట్లుగా అలివేలు మంగమ్మగారు ఆ బిడ్డను పెదజీయరు స్వామికి అప్పగించి చాలా త్యాగం చేసారు. ఆవిడ మహా సాధ్వి. ఆ వంశాంకురము రాబోవు శ్రీమద్ భగవద్రామానుజ సహస్రాబ్దికి అందించిన అలివేలు మంగమ్మ శ్రీపాదములకు ప్రణామములు. కల్పవృక్షము. ఆముష్మకము అయిన చింతామణి. ఎన్నో ఈతిబాధలు దాటుకుంటూ ఇక్కట్లను జయించి శ్రీచిన్నజీయరుస్వామిని ఈ ప్రపంచానికే అందించిన ఆ మాతృమూర్తికి ఏమిచ్చినా మనందరం ఆ ఋణం తీర్చుకోలేము. ఆవిడ అందరికీ అమ్మే. మా అత్తగారు న.చ. ఆండాళమ్మగారు పరమపదించినపుడు మేము ఎక్కడో రాజమండ్రిలో వున్నాము. వెతుక్కుని వెతుక్కుని వచ్చి మమ్ములనందరినీ పలకరించి 2,3 గంటలు మాదగ్గర కూర్చునివెళ్ళారు. మేము శంషాబాద్ వచ్చినపుడు అమ్మగారిని సేవించుకుని వెళ్ళేవాళ్ళం. ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. మళ్ళీ మనిషి జన్మ తరువాత జన్మ ఉండదంటారు. ఉంటే అలాంటి వంశంలో పుట్టించాలని ఆ పుణ్యాత్ములనీడలో మనందరం ఉండాలని కోరుకుంటున్నాము.

# అమ్మగారు ఎక్కడున్నా వైకుంఠమే



ముదుంబై శారదాదేవి, అనపర్తి
ఆడపడుచు ఆండాళమ్మగారి చతుర్థ పుత్రిక

పూజనీయురాలైన శ్రీమతి ఆకులమన్నాడ చిలకమర్రి అలివేలుమంగ తాయారు గారితో మాకు దేహ సంబంధం కలిగి ఉండడం ఆ పెరుమాళ్ ప్రసాదించిన వరం. మా కుటుంబసభ్యులెవరైనా ఆవిడని కలిసినపుడు చాలా ప్రేమతో, ఆప్యాయతతో మమల్ని ఎంతో ఆదరంతో చూసేవారు. శంషాబాద్ లో నేను వారిని కలిసినపుడు ఆమె గదిలోనే నాకు వసతి కల్పించారు. ఆ రాత్రి నాతో చాలా సరదాగా మా అమ్మగారితో అనుబంధాలన్నీ పంచుకొని మాట్లాడారు. శ్రీ పెద్దజీయరు స్వామి విశేషాలు, ఆయనపడిన శ్రమ, ఆయన గొప్పదనం ఈ విషయాలగురించి ఎక్కువగా మాట్లాడుకున్నాము. ఆవిడ దగ్గర నేను గడిపిన కాలం చాలా తక్కువకానీ నేను మరచిపోలేని ఆ సమయం చాలా అపురూపంగా మనస్సులో నిలుపుకోవలసిన సమయం. ఆ తల్లికి అంజలి ఘటిస్తూ....

**అమ్మ తన సంతానాన్ని దేశం కోసం ధర్మం కోసం వదులుకునే అంత ధైర్యం కలిగి ఉంటుంది.**



# ఇలకు దిగిన భగవత్పరికరం!

ముదుంబై శ్రీమతి చూడామణి (చిలకమ్మ)
ఆడపడుచు ఆండాళమ్మగారి  ప్రథమ పుత్రిక, రాజమహేంద్రి

సంసార చక్రమును దాటించునావగా – పుట్టిన – మన పెరుమాళ్ ఎంబెరు మానార్ – శ్రీరంగనాథులకు పరిచర్యలు చేసే (ఒక అపచారం కలిగింది) పరికరమునకు ఒక అపచారం జరిగింది. పరివారములోని వారికి కలిగి, శాపం కలిగించినది. ఆ పరికరం. నువ్వు భూలోకములో మానవ కాంతవై సంసారంలో ఎన్నో అగచాట్లను అనుభవించాలి – అనగా – ఆ పరిచారిక శాప విమోచమును  కోరగా – భూలోకంలోని ఒక మహాపురుషులకు కోడలుగా అడుగుపెట్టి – ఈతి భాధలను ఓర్చి, సహనం, ఓర్పుతో ఉండాలని ఒక దివ్య పురుషుడు నీ కడుపున పుట్టి, ఆ బిడ్డ నీ ఆవేదనను, సేదదీర్చి, మహా వేద విద్వత్తు కలిగి, వేదమార్గ ప్రతిష్ఠాపన, 108 శ్రీరామక్రతువులు, 108 స్వాధ్యాయ, యజ్ఞాలు, భగవద్రామానుజుల – ప్రతిష్ఠాపన బదరీక్షేత్రాలతో, 108 క్షేత్రాల చేయించిన పెద్ద జీయరు స్వామికి శిష్యుడై, వారి సత్యసంకల్పాలకు అనుగుణంగా నడిచి – ఇంకా– గోవర్ధనమంత ఎత్తు, ఆదిశేషుని పడగలు పదునాలుగు లోకాలకు వ్యాపించిన, జగద్రక్షకులైన పెద్ద జీయరు సంకల్పాలు (యామునులకు – రామానుజులవలె) గోపాలాచార్యస్వామి ద్వారా, "అమ్మ" పరమాత్మ పరిచర్యలు చేసే పరికరమా! నీకు మహోన్నతుడు, మహత్ముడు, నీ సంకెళ్ళు విడివడె, శాప విమోచనం చేసి, జీయర్‌గా మన సుకృతంచే తరింపచేసి – ప్రతీవారికి నీవు కనువిందు చేస్తూ – నీ కోకిల గానం, ఆచార్య మేఘమా అంటూ, మాధుర్యం, నీ పగడపు మేలిమి, కెంపుల దివ్య శరీరం ఎన్నడూ మారనిది – నీ మాధుర్య కంఠం, నిన్నే చూడాలని, నీపాదాలను స్పృశించాలని, నీ మంగళ ఆశీస్సులను తీసుకోవాలని ప్రతివారు, ప్రీతితో నిన్ను ఆరాధిస్తారు. నీ వంటి – జన్మ పొందిన, చిన్న జీయరుకు లభించిన – ఆనందమే – మాకు – నీపాదములే – రక్ష – రక్ష.

ఒక పసిబాలుడుగా అలివేలమ్మకి – పుట్టినాడు. పూర్వజన్మలో ఈ అలివేలు మంగతాయారు చేసిన నోము ఫలమే. మన చిన్న జీయరుస్వామిగ అవతరించారు. ఆనాడు దేవకి – వసుదేవులకు, పుట్టి – శంఖ, చక్ర, గదా చతుర్భుజాలతో కనిపించి, నన్ను, యమునను దాటించి – నంద వ్రజం చేర్చమనగా నంద – యశోదలను చేరి – అక్కడ, అనేకానేక మంది అసుర, కంస సంహారిగా, బృందావనముగా, రాసలీలగా, ఎన్నోలీలలతో – మురిపించుటకు – పృశ్ని, గర్భుడిగా, అదితి కశ్యపులకు, దేవకి, వసుదేవులకు, నంద యశోదలకు,

దశరథునికి, కౌసల్యకు, ఆనందమిచ్చిన పుత్రులైనట్టు కాంతిమతి కేశవార్య కుమారులకు ఆదిశేషావతారంతో – జగత్ ప్రసిద్ధులుగా, జగత్‌రక్షకులుగా, అలివేలమ్మ పూర్వ జన్మలో పొందిన కొంత కర్మ, ఫలంచే, శాప విమోచనంచే – రెండూదశలూ ఒక్కచోటే అనుభవించేట్టు, మొదట – పూర్వాశ్రమంలోని – పెద్దజీయరు – సన్న్యసించక ముందు – వారికి కోడలై – సంసారచక్రంలోని ఎన్నో, (ఇబ్బందులు) అనేకమైన సునామీ, తుఫానులు, అమితమైన అడ్డంకులు, తొలగించుకోలేని – చిక్కులు – వీటినన్నింటినీ – అలివేలమ్మ – తన సహనంతో జయించింది. త్యాగ నిరతితో – తనపుత్రుని – పెద్ద జీయరుస్వామి వారి వేద పాఠశాలలో గోపాలాచార్య స్వామి వారి ద్వారా చేర్పించుటకు అనుమతినిచ్చిన భాగ్యశాలి అలివేలమ్మ! మన చిన్న జీయరు, తల్లికి, సంసార సంకెల అనే సంకెళ్ళు – వీరి ద్వారా భవబంధ – విమోచనం – ఆచార్య – తిరువడి చేరుటకు – దారిచూపిన మన పెద్ద జీయరుస్వామి వారి శరణాగతియే

ఆచార్యులకి మరియు తల్లికి ఎప్పటికీ మనం ఋణపడి ఉంటాం.

(వారికి ) అలివేలు మంగమ్మ గారికి - ఆచార్య పాద తిరువడి చేర్చు చరమదశ ముక్తిని - ఇచ్చి - దివ్యసాకేతము నందే - తమ పుత్రులు - ద్వారా - శ్రీమన్నారాయణాచార్యులుగా, త్రిదండిగా, శ్రీశ్రీశ్రీ త్రిదండి పరమహంస పరివ్రాజకాచార్య చిన్న శ్రీమన్నారాయణ రామానుజులుగా అవతరింప చేసిన వారి మాతృమూర్తికి - మనందరికి వారి పాదములే - శరణాగతినిచ్చుగాక!.

# ప్రేమమయి

**బదరీ లక్ష్మి**
**ఆడపడుచు ఆండాళమ్మగారి తృతీయ పుత్రిక**



మాతృ సమానురాలైన పూజ్యులైన అలివేలు మంగతాయారు అమ్మగారికి పాదాభివందనాలు. మేము చిన్నప్పటినుండి అమ్మ, అత్తలు ఒకటే, సమానం అనే భావనతో పెరిగాము. అమ్మ గారితో చిన్నప్పుడు చాలా అనుబంధం ఉండేది. పెద్దయ్యాక, ఒక సారి రాజమండ్రి పుష్కరాల్లో సేవించుకునే భాగ్యం కలిగింది. అప్పుడు చిన్నప్పుడు ఎంత ప్రేమగా చూసుకున్నారో, అదే ప్రేమని, అంతే అభిమానాన్ని చూపించి దగ్గర కూర్చోపెట్టుకుని మాట్లాడారు.

2,3, సార్లు శంషాబాద్ ఆశ్రమంలో కూడా అమ్మగారిని సేవించుకునే అదృష్టం కలిగింది. ఒక సారి ఆశ్రమంలో అమ్మగారి దగ్గర ఒకరాత్రి ఉండే అవకాశం ఈ దాసురాలికి కలిగింది. అప్పుడు అమ్మగారు మాచిన్ననాటి విషయాలు చెబుతూ వారి అమ్మాయి మంగతాయారు గురించి చెప్పారు. మేము ఆమెను 'పాప' అని పిలుచుకుంటాము. అమ్మగారు చెప్పిన విషయం ఏమంటే పాపని వాళ్ళ నాన్నగారు ప్రత్యేకంగా చూసుకునే వారు, తనని ఒక్క మాట కూడా అననిచ్చే వారు కాదు. చాలా అపురూపంగా గారాబంగా చూసుకునేవారు. పాపకి వాళ్ళ అమ్మగారి పేరు అందుకేనేమో అంత అపురూపం. ఆ రాత్రంతా ఎన్నో తీపి గుర్తులను తలచుకొంటూ గడిపాము. అక్కడ ఉన్నవారికి ఇది మా ఆడపడచు కూతురు అని చెబుతుంటె చాలా ఆశ్చర్యపోయాను. ఎందుకంటే అలాచెప్పవలసి అవసరం అమ్మగారికి లేదు. వారి సంస్కారం గురించి పదే పదే తలచు కుంటూ ఉంటాను. వారితో మాకూ జన్మతః సంబంధం కల్గి ఉండడం మా పూర్వజన్మ సుకృతం. మా అమ్మగారిని వారు ఎంతగా అభిమానించారో అంతటి ప్రేమని మాపై కూడా చూపించారు. పరిస్థితులు అనుకూలించనందువల్ల ఆఖరి చూపు నోచుకోలేక పోయిన దురదృష్టవంతురాలిని. వారి అంతిమ యాత్ర, పరమపదోత్సవ కార్యక్రమాలను ప్రసారమాధ్యమాల ద్వారా మాత్రమే సేవించుకోగలిగాను.

ఆ పుణ్యమూర్తికి శతకోటి పాదాభివందనములు.

❖❖❖❖❖❖

**నిశ్చలమైన మనస్సు ఉండాలి మానవునికి అది మననం వల్ల కలుగుతుంది.**



# మూర్తీభవించిన స్థైర్యం - పెద్దమ్మ

**శ్రీమతి రమాదేవి**

**అమ్మగారి చెల్లెలు ఆండాళమ్మగారి పుత్రిక**

అలివేలు పెద్దమ్మ ఆవిడ ముఖవర్చస్సు ఆ లక్ష్మీ దేవిని పోలి ఉంటుంది. ఆత్మవిశ్వాసం, ధైర్యం, పట్టుదల, తీయని స్వరం. మాట్లాడుతున్నా... పాడుతున్నప్పుడు ఉన్న రిథమ్ ఉంటుంది. మేము కలిసిన సందర్భాలు తక్కువే అయినా కలిసినప్పుడు చాలా సంతోషంగా హాయిగా మాట్లాడుకుంటూ ఉంటాం. మా అమ్మ ఆవిడకు చెల్లెలుగా అదే పోలికలతో ఉంటుంది.

అమ్మ మేనరిజమ్స్‌లో కొన్ని పెద్దమ్మని పోలి ఉంటాయి. మా అమ్మ హిందీ సాంగ్స్ పాడుతుంటే, "నీకు ఎలా వచ్చు?" అని అడిగితే "మా బావగారు, అక్క వినే వారు, వారి దగ్గర కొంతకాలం ఉన్నాను అప్పుడు నేర్చుకున్నా" అని అమ్మ అనేది. పెద్దమ్మ ఎక్కువగా పాడే పాట "చరణాలు చరణాలు ముక్తి సోపానాలు" చాలా బాగా పాడేది. నేను నా బాల్యంలో మా నాన్నగారు... అమ్మని, నన్ను, పెద్ద తమ్ముణ్ణి సెలవులకు రాజమండ్రి పంపారు. అక్కడ మేమందరం ఎంతో సంతోషంగా గడిపాము. అక్కడ.. అప్పుడు, అదే ఓర్పు ,చిరునవ్వు...

నేను డిగ్రీ చేస్తున్న టైంలో కొన్ని రోజులు మరలరాజమండ్రి వెళ్ళాను. స్వామివారు సన్యాసాశ్రమం స్వీకరించిన తరువాత అప్పుడే పెద్దమ్మని చూడటం. అదే ధైర్యం స్థితప్రజ్ఞత. అప్పుడు ఎన్నో చక్కటి విషయాలను తెలియజేసింది. ఆ నిబ్బరతను నేను మరువలేను.

నా వివాహం అయిన తరువాత, నాకు ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత నాకు కలిగిన క్లిష్ట పరిస్థితి, నా భర్తను పోగొట్టుకోవడం. అప్పుడు నేను ఉద్యోగం వెంటనే చేయాల్సి వచ్చింది. నన్ను కలిసినప్పుడు నాకు ఎంతో మనోధైర్యాన్ని కలిగించిన మాటలు చెప్పింది. పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోమని చెప్పింది. అప్పటి నా ఆత్మస్థైర్యాన్ని మరింత పెంచింది.

మా నాన్నగారికి బంధుప్రీతి ఎక్కువగా ఉండేది. పెద్దమ్మనీ, వారి పిల్లల్ని ఎప్పుడూ తలుచుకుంటూ ఉండేవారు. మీరూ కలుస్తూ ఉండండి అని చెప్పేవారు.

ఈ మధ్యకాలంలో, 2017లో మా నాన్నగారు అమ్మ పది రోజులతేడాలో మమ్మల్ని వదిలి భగవంతుని వద్దకు చేరారు. నాన్నగారు పరమపదించిన ఐదవ రోజున పెద్దమ్మ వచ్చి అమ్మని కలిసింది. భగవన్నామస్మరణ చేయమని ధైర్యం చెప్పింది. అనారోగ్య కారణాలతో మాట సరిగ్గా అనలేక పోతుంటే జైశ్రీమన్నారాయణ అనిపించింది. మా అందరికీ ధైర్యం చెప్పింది.

ఆ తర్వాత పెద్దమ్మ మనవడి వివాహంలో కలిసాం. అదే చిరునవ్వు... అదే నా చిన్నప్పుడు చూసిన పెద్దమ్మ. 2019 డిసెంబర్లో మా చివరి కలయిక. ఆమెను చూడటం ఆ మాతృమూర్తి ఆశీస్సులు తీసుకోవడం ఎప్పటికీ మరువలేము...

❖❖❖❖❖❖

స్థైర్యం, ధైర్యం ఆచార్య శ్రీసూక్తి శ్రవణ మనన ఆచరణల వల్ల సాధ్యం!



# స్తోత్రజ్ఞ - అక్కయ్య

**టి. కృష్ణమాచార్యులు, అమ్మగారికి తమ్ముడు**

అలివేలు అక్కయ్య మాతృమూర్తి! నా బాల్యంలో మా పిల్లలందరికీ ఎంతో ఆప్యాయంగా అన్నం కలిపి ముద్దలు తినిపిస్తూ మంచిమాటలు చెప్పడం - ప్రతిరోజూ సాయంత్రం మా పిల్లలందరినీ కూర్చోబెట్టి స్తోత్రములు చెప్పి వల్లెవేయించడం నేను మరిచిపోలేని సంఘటనలు!

అలివేలు అక్కయ్య చక్కని గాయని. మంచి గళ మాధుర్యంతో ఆకర్షించేవిధంగా అక్కయ్య పాట ఉంటుంది! భక్తిగీతమైనా, లలితగీతమైనా చాలా చక్కగా పాడేది! అర్తమూరులో నేను ఉన్నప్పుడు బావగారు, అక్కయ్య, నేను కలిసి ఆకాశవాణి సిలోన్ కేంద్రం పాటలు వింటూ ఉండేవాళ్ళం. ప్రత్యేకంగా హిందీ పాటలు విని ఆనందంగా గడిపేవాళ్ళం! బినాకా గీత్‌మాలా వింటూ పాటలని అభ్యాసం చేస్తుండేవాళ్ళం! అవి మంచి జ్ఞాపకాలుగా మనసులో ఉండిపోయాయి!

రాజమండ్రి కంబాల చెరువు దగ్గర గృహంలో అక్కయ్య బావగార్ల దగ్గర నేను ఉన్నప్పుడు - బావగారితో కలిసి వారానికి ఒకసారి ఇంగ్లీష్ సినిమా కుమారీటాకీస్‌లో చూడడం నాకిప్పటికీ జ్ఞాపకమే! ఆ తరువాత విద్యార్థినై - విశాఖపట్నం రావడం - విశ్వవిద్యాలయంలో చదువుకోవడం - హైదరాబాదులో ఉద్యోగంచేస్తూ అవకాశం లభించి ఉద్యోగపర్వమునకు హస్తినాపురికి (ఢిల్లీకి) చేరుకోవడం, కాలక్రమేణా సంభవించి మేము కలుసుకోవడం అపురూపమే అయింది! అయితే కలుసుకోవడం జరిగితే... పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ... కబుర్లు చెప్పుకుంటూ... పాటలు పాడుకుని ఆనందిస్తూ... గడిపేయడం... అదొక మంచి జ్ఞాపకం!

అలివేలు అక్కయ్య... నా వివాహ సందర్భంగా... ఆరోజులలో ప్రఖ్యాతిగా ముచ్చటగా చెప్పుకునే... "ఫోల్డింగ్ చెయిర్"ను నాకు బహుమతిగా ఇస్తూ - దానిని సరదాగా నా తలపై ఉంచి... నన్ను అభినందించి... ఆశీస్సులు అందజేయడం మరిచిపోలేను. ఆకుర్చీ... ఇప్పటికీ పదిలంగా నాదగ్గర ఉన్నది!

అక్కయ్య ఒకే ఒక్కసారి ఢిల్లీలో మా గృహానికివచ్చి మా దంపతులతో మా చిన్నారి దీప్తితో కలిసి ఒకరోజు ఉండడం జరిగింది! మాటలు-పాటలతో కబుర్లు చెప్పుకుంటూ మంచి జ్ఞాపకంగా ఆరోజు మా మనసుల్లో ఉండిపోయింది! మేనగోడలికి "కరారవిందేన" శ్లోకం నేర్పించింది! ఆ పద్యం చదువుతున్నపుడు అలివేలు అక్కయ్యే గుర్తుకు వచ్చేది మాకు! అలివేలు అక్కయ్యతో గడిపిన క్షణాలు.. అన్నీ అనుబంధం... ఆత్మీయతలతో జతపడి ఉన్నవే అనిపిస్తుంది!

దైవేచ్ఛ చాలా విశేషమైనది! మా అమ్మగారు పరమపదించినపుడు - అలివేలు అక్కయ్యే దగ్గర ఉండడం తటస్థించింది! మేమెవ్వరమూ లేము! ఆ సందర్భంలో... శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామివారు (పూర్వాశ్రమంలో) వారి ద్వారా మా అమ్మగారు సంస్కరింపబడి ధన్యులయ్యారు! మా అలివేలు అక్కయ్య కూడా - స్వామివారి చేతులమీదుగా సంస్కరింపబడడం టీ.వీ. మాధ్యమం ద్వారాచూసి - దాసోహములు సమర్పించుకున్నాము గానీ - హైదరాబాద్‌వచ్చి... దర్శించుకునే అవకాశం లభించక... విచారం కలిగింది! కరోనా-హడావిడి వలన సాధ్యం కాలేదు. ఆ మాతృమూర్తి... పెరుమాళ్ళ సాన్నిధ్యానికి చేరుకోవడం జరిగినా అదృశ్యంగా... బిడ్డలం... మనమధ్యే ఉంటూ... ఆశీస్సులు అందచేస్తూనే ఉంటుంది! అలివేలు అక్కయ్యకు మా దంపతుల శ్రద్ధాంజలులు!

❖❖❖❖❖❖





తమ్ముడు కుటుంబంతో.... అమ్మగారు



# అమ్మకు గీతాంజలి

డా టి.కె. చూడామణి

పినతండ్రిగారి పుత్రిక, సికిందరాబాదు



శ్రీమతి అలర్ మేల్ మంగ తాయారమ్మగారు నాకు స్వయంగా పెదతండ్రి కూతురు, అక్క. ఐదు సంవత్సరాలు వేం కలిసి ఉండడంతో ఆత్మీయతానుబంధాలు పెనవేసుకున్నాయి. అక్క అన్న పిలుపే ఆనందంగా నిలిచింది.

అమ్మగారి ఆచార్యనిష్ఠ అద్వితీయం. అనుష్ఠానానికి ఆవిడ పెట్టింది పేరు. తిరువారాధన ఎంత ఆలస్యమైనా నియమ నిష్ఠలకే ప్రాధాన్యమిచ్చి, తరువాతే మంచి తీర్థమైనా తీసుకొనేవారు.

ఆత్మీయమైన పలకరింపు ఆవిడ సొంతం. ఆదరాభిమానాలు ఆవిడ నేస్తాలు. స్వాతిముత్యాన్ని లోకానికి అందించిన ఆ దివ్య మాతృమూర్తికి ఇవే నీరాజనాలు.

అమ్మ అను పిలుపులో అమృతత్వమంతా నీ
పేరులోనే దాచుకున్న ప్రేమ మూరితీ !!

"అ" అనే అక్షరాన అలివేలు దాగియుండె
"మ" అన్నంతనే మంగతాయారు తోచె
అలర్ మేల్ మంగ తాయారువై నీవు
మమతలే పంచినావు జోహారులమ్మ !!

ఆచార్య మేఘమా కరుణవాన కురియుమా
అన్న నీ ప్రార్థన విని ఆచార్యులె కరిగిపోయి స్వామి సన్నిధికి నిన్నే స్వయముగా పంపిరమ్మ
ధన్యురాలివమ్మా ! అలర్ మేల్ మంగమ్మా !!

బంధాలన్నీ విడచి భాగవతోత్తముల కొలిచి
భవ సాగర మీదగా ఆచార్యుల నమ్మినావు
నీ నమ్మిక నిజమాయె కాలమున్నంతవరకు
అందరి కాదర్శమై వెలుగొందునమ్మా
అలర్ మేల్ మంగా !!

❖❖❖❖❖❖

ఆవగింజంత ఆచార్యులపై నమ్మిక చేర్చును పరమాకాశపు ఆవలి తీరం దాకా!





బెంగళూరులో రెండవ కుమారుని ఇంటిలో








## అమ్మలోని దీప్తిని, స్ఫూర్తిని అందుకున్న 3తరాలవారు

**అమ్మగారి కుమార్తెలు, మనుమల భార్యలు, మునిమనుమలు**




రెండవ కుమార్తె కుటుంబసభ్యులతో....





ఆచార్యనిష్ఠకి వారసులు, మనుమలు, మునిమనుమలు

# ఆకారత్రయ సంపన్న

కె.వి. జానకి, విజయనగరం



తల్లికి మించిన దైవం లేదు. "న మాతు: పరదేవతా" అందరికీ తల్లే ప్రథమ దైవము, పరదైవము. ఆకులమన్నాడ చిలకమర్రి అలివేలు మంగతాయారమ్మగారు ఎవరో మాకు తెలియదు అని అనిపిస్తుంది కదా! పేరంతా విడిచిపెట్టి అమ్మగారు అనే పదమును అనుకుందాము. దానికి ముందు "మన" అని చేర్చుకుందాము. మన అమ్మగారు. ఔను మనందరికీ అమ్మగారు. "సమస్త జనని" అమ్మలగన్నయమ్మ కాదు, ఆచార్యులైను చిన జీయరుస్వామి వారిని కన్న అమ్మ ప్రపంచమునంతటినీ ప్రకాశవంతము కావించే ఆచార్య భానుని తన గర్భమున మోసి, కని, పెంచిన కాంతిమతి. తన కుమారుని లోక కళ్యాణ చికీర్షను ఆమోదించి, సన్యాసదీక్షకు అనుమతించిన మహోదారమతి, భగవత్సంకల్పముతో ఆచార్య తిరువడిని అలంకరించినారు.

జాగ్రత్తగ రక్షిస్తే మట్టికుండ అయినా చాలారోజులుంటుంది. కాని ఎంత జాగ్రత్తగ కాపాడినా ఈ శరీరము మాత్రము భగ్నమయిపోతుంది. "చిరం హి తిష్ఠే ద్విధివద్ధృతో ఘట:' సముచ్ఛ్రయోయం సుధృతోఽపి భిద్యతే" "అహో భాగ్యమ్, అహో భాగ్యమ్" అని అందరికీ అనిపించేటట్టుగ అమ్మగారి అంత్యేష్టి జరిగినది. వారి పరమ పదోత్సవ సందర్భమున ఆమెతో నాకుగల అనుబంధమును ఈ విధముగ తెలియజేసుకొనగలిగే అవకాశము మహద్భాగ్యము. అది లభించినది. "కార్యం లఘు ప్రయోజనం గురు" ఈ కాలములో ఇంతకన్న కావలసినది ఏమున్నది.

"ఆకారత్రయ సంపన్నాం అరవింద నివాసినీం" అంటూ శ్రీదేవికి (లక్ష్మీ అమ్మవారికి) వందనము సమర్పిస్తాము. ఆకారత్రయము అంటే ఏమిటో పెద్దలు సంప్రదాయమును అనుసరించి చక్కగ వివరిస్తారు. ఇప్పుడు మనము చెప్పుకొనే ఆకారత్రయము అదికాదు. "అరవింద నివాసిని" అంటే అలర్‌మేల్ మంగై మన అమ్మగారికి వారి తల్లిదండ్రులు ఆ తల్లి పేరే అలివేలు మంగతాయారు అని పెట్టేరు. ఈమె కూడ ఆకారత్రయ సంపన్న వర్ణమాలలోని అక్షరములను అ కారము, ఆకారము, ఇ కారము, ఈ కారము ఇలా వ్యవహరిస్తాము. మన అమ్మగారికి "ఆదరము, "ఆలాపనము, "ఆనందము" అనే "ఆ" కార త్రయము నిండుగ మెండుగ ఉన్నాయి.

అమ్మంటే ఆదరణ, తీయని ఆలాపన, ఆనందము



**ఆదరము:–** అంటే మన్నన. సాధరణముగ అందరూ తమతో సమానులయిన వారిని, తమకన్న పెద్దవారిని, గొప్పవారిని ఆదరిస్తారు. కాని మన అమ్మగారు అసాధారణ అంటే అందరివంటి వ్యక్తికాదు. ఆమెది విలక్షణమయిన తత్త్వము. అన్ని విధముల తమకన్నా తక్కువ వారిని కూడ ఆదరముతో అక్కున చేర్చుకుంటారు. నాకు అటువంటి అనుభవము కలిగినది. శంషాబాద్ ఆశ్రమ నిర్మాణ ప్రారంభ సమయము. సంవత్సరము నాకు సరిగ గుర్తు రావడము లేదు. మన చిన్న జీయరుస్వామివారు అక్కడ చాతుర్మాస్యదీక్ష చేసారు. నివాస యోగ్యమయిన స్థితికాని, రాకపోకలకు తగిన సులభమగు సదుపాయములు కాని అప్పటికి లేవు. ఆసందర్భమున అక్కడ ఉభయవేదాంత పండిత సభలు జరిగినవి. వాటిలో పాల్గొనే అవకాశము నాకు లభించింది. శంషాబాద్‌లో వసతి సౌకర్యము లేదు కనుక దోమలగూడ JETలో ఉండవలసి వచ్చినది. అప్పుడు మన అమ్మగారు ఆమెకుమార్తె తాయారమ్మగారు వారి కుమారులు అక్కడే ఒక భాగములో నివాసముంటున్నారు. వారికి జెట్‌కి వచ్చిపోయేవారితో ఏమీ సంబంధములేదు. అయినా అమ్మగారు కన్నకూతురికన్న మిన్నగ నన్ను ఆదరించడము చాలా ఆశ్చర్యమని అనిపించింది.

మొదటిరోజు అమ్మగారు గమనించారు. పలకరించారు. ఇద్దరము ఒకే కారులో శంషాబాద్ వెళ్ళి రాత్రి తిరిగి వచ్చేము. ఆరోజు నా గదికి వచ్చి "రామ్మా! ఫలహారము చేద్దాము" అని పిలిచారు. నేను ఊహించలేదు మొహమాట పడినాను. చేయిపట్టుకొని తమ వసతికి తీసుకొని వెళ్ళేరు. ఆప్యాయముగ ప్రసాదము పెట్టేరు. సరదాగా అందరము కబురులు చెప్పుకున్నాము. "రేపు మీతో సాపాటు చేయాలని ఉంది నాకు. ఇక్కడికే వచ్చేయండి" అన్నారు. "అదేమిటమ్మా!" అన్నాను "ఏం!మీరు నాతో కలిసి సాపాటుచేయరా?" అన్నారు. మాటలో, చూపులో ఆదరము, ఆప్యాయత తొణికిసలాడు తున్నాయి. చిన్న చిరునవ్వు మరొక మాట మాట్లాడన్వీలేదు. ఆ మరునాడు మేమిద్దరమే కూర్చొని ప్రసాదము తీసుకుంటున్నాము. ఆ సమయములో ఆమె మాటలు మరువలేనివి. "అమ్మా! మనిద్దరి పరిస్థితి ఇంచుమించుగ ఒక్కటే! మీరు చిన్నవారు, నేను పెద్దదానిని మనము పొందుతున్నది ఆవేదనా? ఆనందమా? మనకే తెలియదు. ఆవేదన అనిపిస్తే వ్యక్తము చేయవద్దు (కూడదు). ఆనందము అనిపిస్తే అందరితో పంచుకుందాము" అన్నారు. ఆమె గాంభీర్యమునకు జోహారు అనిపించినది. ఆరోజు రాత్రి తిరుగు ప్రయాణము. ఆశ్రమము నుండి రావడము ఆలస్యమయినది ముందుగానే సామానులు కారులో పెట్టుకున్నాను. అమ్మగారు కారుదిగి "రండిలోపలకు" అన్నారు. "లేదమ్మా, సమయము లేదు వెళ్తాను" అని అన్నాను. 'ఒక్క నిమిషం' అంటూ తొందరగా మేడపైకి వెళ్ళి కొత్తచీర పసుపు కుంకుమ పళ్ళుపూలు తెచ్చేరు. "ఒక్కమారు  ఇలారండి" అంటూ ఆ మెట్టుమీద కూర్చోమని కుంకుమ పెట్టి చీరతో పాటుగ ఆశీస్సులను అందిస్తూ ఉంటే ఆమెకు పాదాలకు అభివందనము చేసాను. వెంటనే ఆమె భుజాలు పట్టి లేపి అక్కున చేర్చుకున్నారు. ''జాగ్రత్త సుమా! ఒక్కరూ వెళ్ళుతున్నారు. రాత్రి ప్రయాణం" అని అంటే ఆమె ప్రేమకు హృదయము ద్రవించి కన్నీరై కారింది. అమ్మగారు ఆదరమునకు మహోన్నతమయిన పర్వతము దానిని పొందే అర్హతకు నేను పరమాణువును. అయినా అది ఒక దివ్య స్మృతిగ చిరస్థాయి అయినది.



**ఆలాపనము:-** అంటే రాగాలాపన , నిందైనమాట అనికూడా అర్థము ఉన్నది. ఈ రెండూ మన అమ్మగారి సొత్తు. "ఆచార్య మేఘమా!" అంటూ ఆమె ఆలాపిస్తే "ఆజిమజైక్కణ్ణా" అంటూ ఆండాళ్ళమ్మ వారు పిలుస్తున్నా పట్టించుకోకుండా మేఘము మన అమ్మగారి వద్దకే చేరుకొని ఆదేశము కొరకు ఎదురు చూస్తుంది. అలా అమ్మగారు పిలిస్తే మనమంతా కూడా చూసి తరించేమా! లేదా! ఇంకా ఆ ఆలాపన మన చెవులలో ప్రతిధ్వనిస్తూనే ఉంది కదా! మన ఆచార్యుల తిరునక్షత్రము నాడు ఆ స్వాతిముత్యమును చూస్తూ మురిసిపోతూ ఆమె ఆలపించిన గీతములు ఆమె హృదయ నాదములు మనకు వేదనాదములు. "అతిలాభః పుత్రలాభః" అని అనుకోవలసిన అమ్మగారు ఔదార్యముతో మనందరము "అతిలాభః ఆచార్య లాభః" అని అనందముగ నినదించేటట్టు చేసేరు. అపురూప రాగమాలికాలాపన అలవోకగ చేయగల అదృష్టవంతురాలు మన అమ్మగారు. మన స్వామివారిని రాగడోలికలలో ఊయలూపుతూ వారి తిరునక్షత్ర వేడుకలకు శ్రీకారము చుట్టే శ్రీమంతురాలు.

**ఆనందము:-** భగవంతుని అవతారములలో శ్రీకృష్ణావతారము పరిపూర్ణావతారమని అంటారు. ఆస్వామిని కన్నతల్లి దేవకీ దేవి. పెంచిన తల్లి యశోదాదేవి. ఇద్దరూ అద్వితీయులే కనుక మన గోదామ్మవారు "ఒరుత్తి" అని సంభావిస్తారు.

ఈ కలియుగమున వారిద్దరూ మన అమ్మగారిగ ఒకే రూపమున అవతరించేరు. కడుపున పుట్టిన బిడ్డని కంసభీతితో దూరము చేసుకున్నది దేవకీదేవి. సంతాన సంరక్షణకొరకు తాను సంతాపమును పొందినది. అలాగే సంసారమనే కంసునికి చిక్కనివ్వక సన్యాస దీక్షకు అనుమతించి తమ కుమారుని లౌకికమయిన సంబంధమునకు దూరమయినారు. మన అమ్మగారు. తమ ఆచార్యులైన పెద్ద జీయరుస్వామివారి సంకల్పమును గుర్తించి ఆచార్య సేవకు తమ కుమారుని అంకితమిచ్చి ఆనందించేరు. వారి ఆశయములను నిజం కావిస్తూ వేయింతలుగ లోకకల్యాణ దీక్షతో ఎదుగుతున్న మన చిన జీయరుస్వామివారిని యశోదగ దగ్గర ఉండి చూసి ఆనందించేరు.

ప్రతిరోజు రాత్రి ఆమె స్వామివారికి తీసే దిష్టి (దృష్టిదోషము) వారికి శ్రీరామరక్షగ నిలిచినది. యావత్ప్రపంచ సంపూజ్య చరణులుగ నీరాజనములు అందుకొనేటట్టు చేసినది. వారి వైభవమును కనులారా చూసి తరించిన "ఏరారన్ద కణ్ణి యశోదై" మన అమ్మగారు. కులశేఖరులు తమ పెరుమాళ్ తిరుమొళి దివ్య ప్రబంధమున 7వ దశకములో దేవకిగ దు:ఖమును పొందుతూ యశోద పొందిన ఆనందమును వర్ణిస్తారు.

"ఇలైకణ్ణ అశోతై తొల్లై యన్బత్తి అరుతి కణ్ణాళే" శ్రీకృష్ణ బాల్య లీలా రసానుభవమును పొందిన యశోద ఆనంద పరమావధిని దర్శించినది అని అంటారు. ఈ రెండు అనుభవములను ఒకే రూపముతో పొందిన మన అమ్మగారు ఆనందమయుడగు పరమాత్మ సన్నిధిని చేరి నిత్య కైంకర్య భాగ్యమును పొంది ఆనందపరమావధిని చేరినారు.

ఆదరము, ఆలాపనము, ఆనందము అనే ఆకారత్రయ సంపన్న అలివేలుమంగ తాయారమ్మ "మన అమ్మగారి" ఆశీస్సులు సదా, సర్వదా మనందరికీ ఉన్నాయని భావిస్తూ అంజలిస్తున్నాను.

❖❖❖❖❖❖



# జగదాచార్యుల జననికి అక్షర నివాళి



డా. చక్రవర్తుల లక్ష్మీ నరసమ్మ
అభినవ మొల్ల, భద్రాచలం

1. శ్రీరఘూత్తమ గన్నట్టి ప్రేమమూర్తి
అమ్మ కౌసల్య మంగతాయారుతల్లి
చిన్నస్వామిని కడుపార గన్నతల్లి
కడుపు చల్లని తల్లి బంగారు తల్లి

2. దేవకీ దేవి గర్భాన తేజరిల్లె
ఆ జగద్గురు హరి జగదాననుండు
అమ్మ అలమేలు మంగమ్మ అమృత గర్భ
దీప్తి, యీ జగద్గురు దీనబంధు

3. జగతి ప్రణమిల్లి స్వాముల చరణములను
ఆశ్రయించిన ప్రేమతో నభయమిచ్చు
పట్టుగలయట్టి స్వామి, మీ పట్టియగుట
వట్టు మీపాదమెంతటి భాగ్యమమ్మ

4. దిగ్దిగంతాలు తమపాద దివ్యధూళి
పావనము సేయు స్వాములు, బాల్యమందు
ఆటలాడుచు ధూళితో నలరుమేను
అంచితమ్ముగ స్నానమాడించు తల్లి
తొలుత నేరికి తెలియదా ధూళిమహిమా
గొల్లవారికి తెలిసెనే నల్లనయ్య

5. రామ లాలి యనుచు నాడు లాలి పాడి
బుజ్జగించగ నిద్దురబోవు స్వామి
నరులయజ్ఞాన తిమిరమ్ముదరును నేడు
రేబవళ్ళును నిద్దురలేదు తల్లి

6. సాధ్వి తాయారు పూర్వాత్రిసంధ్యనుండి
కాంతిమతి గర్భశుక్తి ముక్తాఫలంబు
అవతరించె నభినవ రామానుజులుగ
స్నిగ్ధ సమతాభిరాముడు చిన్నస్వామి

7. ఆశ్రయించిన వారల యార్తిబాపు
పురుషకారస్వరూపుని పుడమికొసగట
నెలలు తొమ్మిదిమోసి కనిన జననికి
పడతికబ్బదె శాశ్వత పరమపదము
అమ్మకు నివాళి
అలర్మేల్ మంగమ్మకు అశ్రునివాళి
జగదాచార్యులజననికి అక్షర నివాళి

❖❖❖❖❖❖

జగదాచార్యుల కన్నతల్లికి పలుకుతోంది జగత్తంతా నివాళి



స్నుషా పెద్దజీయర్‌స్వామిపాదానాం, మాతా చిన్న జీయర్ ఆర్యాణాం



సుతా నరసింహాచార్య సీతా దంపతీనాం- పుట్టింటివారితో అమ్మగారు



# అమృతభాండాగారం

**జూపల్లి రామేశ్వరరావుగారు**

మై హోమ్ గ్రూప్ ఛైర్మన్

ప్రతిమనిషి జీవితంలో అమ్మయొక్క ప్రాధాన్యం ఎంతగానో ఉంటుంది. అమ్మ అంటేనే అమృతభాండాగారం. నా జీవితం అంతా అమ్మతోనే ముడిపడి ఉంది. ఎందుకంటే, నా చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన తర్వాత నాతల్లి ఎంతో కష్టపడి ఏ లోటూ లేకుండా కృషి, పట్టుదలతో పెంచింది. అమ్మ చెప్పిన మాటలు నాకు ఎంతో చైతన్యాన్ని, జీవితంలో ఏదైనా సాధించాలి అనే దీక్షను కలిగించాయి. నేను ఆర్థికంగా బలపడే సమయంలో మా అమ్మ పరమపదించటం నాకు పిడుగుపాటుగా పరిణమించింది. కొన్ని సంవత్సరాల సమయంలోనే ఆ మాతృమూర్తియొక్క ఉపదేశ అనుగ్రహం ఫలించి 30 సం.రాలక్రితం ఆచార్యుల సన్నిధిని చేరాను.

ఆనాటినుండి మన ఆచార్యులే నాకు కొండంతబలం. వారే నాకు రాముడు, వారే నాకు గురువు. సర్వమూ వారే. అటువంటి స్వామివారిని లోకానికి అందించిన ఆ తల్లినీ శ్రీస్వామివారి సన్నిధిలోనే దర్శించాను. అలా వారిని చూసిన వెంటనే తల్లిలేని లోటు నాకు తీరిందనిపించింది.

అమ్మలకే అమ్మ.... ప్రేమానురాగాలసాగరం...ఆ అలివేలుమంగతాయారమ్మ. ఆ మాతృమూర్తియొక్క స్వరూపం తలచుకుంటే, ప్రశాంతత చేకూరుతుంది. వారి తిరుముఖమండలంలో చెరగని చిరునవ్వు ఎంతో ఆనందాన్ని పంచుతుంది. 30 సంవత్సరాలుగ ఆ తల్లిని సేవించే అదృష్టం పొందాం. ఆగర్భశ్రీమంతుడు, పేదవాడు అనే వ్యత్యాసం లేని సమదృష్టి కలిగిన పూర్ణురాలు.

ఆమె విలక్షణ వ్యక్తిత్వానికి ప్రణమిల్లాము. ఆ తల్లి భౌతిక సుఖాలకు దూరంగా ఉండేవారు. శ్రీవైష్ణవ సంప్రదాయమే తన కుటుంబంగా భావించేవారు. వారియొక్క జీవిత అనుభవం ఎంతోమంది తల్లులకు స్ఫూర్తిదాయకం. ఆదర్శప్రాయం. ఎటువంటి సమస్యఎదురైనా స్వామి వారిని దర్శించిన పిదప ఆ మాతృమూర్తిని కూడా దర్శించేవాడిని ఆ తల్లి పెద్దజీయర్ స్వామివారి మంగళాశాసనాలు మీకు ఎప్పుడూ ఉంటాయి అని మంగళాశాసనం చేసేవారు. దానితో సమస్యలన్నీ పరిష్కారమయ్యేవి.

**శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారి శిష్యురాలైన ఆ అమ్మకు ఎనలేని గురుభక్తి. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఆచార్య సేవ మాత్రం మరువకూడదు, మానకూడదు అని చెబుతూ ఉండేవారు.** సైక్లోన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా, కర్మసంబంధమైన ఆరోగ్యసమస్యలు ఎదుర్కోవలసి వచ్చినా ఆచార్యులపై విశ్వాసంతో భారముంచి, ధైర్యంతో ముందుకు సాగాలని సూచించేవారు. వెయ్యికాళ్ళమండప నిర్మూలన సమయంలో దైవికమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు, శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారి జీవితంలో ఎదురైన ఇబ్బందులని వారెంత సమర్థవంతంగ ఎదుర్కొన్నారో తెలియజేసి అమ్మగారు మాకు మనోధైర్యాన్ని నింపేవారు. ఇది మాకు చెప్పడానికే కాదు ఆమె స్వయంగా ఆచరించేవారు.

శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారి శిష్యురాలిగ, వారడగగానే గురువాజ్ఞగ మన శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారిని లోకానికి అందించటం వారిలోని ఆచార్యనిష్ఠకీ, త్యాగగుణానికి నిదర్శనం. శ్రీశ్రీశ్రీ పెద్దస్వామివారి సంకల్పానుగుణంగా ఈ ప్రపంచమంతా శ్రీ వైష్ణవం కావాలని, 1000 సంవత్సరాల తర్వాత కూడా శ్రీభగవద్రామానుజులు ఏర్పరచిన వ్యవస్థ బాగుపడాలని, ఆత్మబంధువులను పెంచుకుంటూ భగవత్కుటుంబం పెరగాలన్నదే ఆమె తపన. అందరిలా శారీరక బంధుప్రీతి కాదు ఆమెది.

ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అనే నానుడి మనం వింటూ ఉంటాం. అది లోకసహజం కూడా. కానీ, శ్రీ వైష్ణవకోటి హృదయ పీఠాధిపతులైనప్పటికీ మన శ్రీస్వామివారిని ఏనాడూ నా కొడుకు అని భావించలేదు. నాకూ మా ఆచార్యులు తిరిగి ఈ రూపంలో దొరికారని సంబరపడి అందరిలా నమస్కరించేది. వారి శిష్యులమైన మనలందరినీ వాత్సల్యంతో దీవించేవారు. మా కుటుంబశ్రేయస్సును కోరి ఎప్పుడూ మాకు పల్లాండు అని మంగళాశాసనం చేసేవారు.

పరమపదంలో వేంచేసియున్న ఆ తల్లి అనుగ్రహంతో రామానుజ సహస్రాబ్ది ప్రాజక్ట్ నిర్మాణము వంటి అనేక గొప్ప సంకల్పాలు నెరవేరి, శ్రీస్వామివారి ద్వారా రామానుజ సందేశం విశ్వమంతా వ్యాప్తి చెందాలని ఆ తల్లిని మనస్ఫూర్తిగ ప్రార్థిస్తూ....



తల్లి దీవెన సకలాభీష్ట ప్రదాయిని



# త్యాగమూర్తి

**జూపల్లి శ్రీకుమారి**



అమ్మగారు, ఒక త్యాగమూర్తి. లోకానికి ఒక యతిరాజును అందించిన మాతృమూర్తి.

పురాణాలలో విన్నాము కానీ, ఈ ప్రకృతిలో ధరణి మీద మానవజన్మలో జన్మించిన ఇంతటి త్యాగమూర్తిని ప్రత్యక్షంగా చూసిన భాగ్యము మాకు కలిగింది. ఎందుకంటే, ఆనాడు త్రేతాయుగంలో యుక్తవయస్కుడైన రాముడిని విశ్వామిత్రునితో పంపమని అడిగితే దశరథమహారాజు ఎంతగానో సంకోచించాడు. కానీ, ఈ కలియుగంలో ప్రత్యక్షంగ ఈ మాతృమూర్తి తన కన్నబిడ్డను లోకాన్ని, శ్రీవైష్ణవ సంప్రదాయాన్నీ ఉద్ధరించటానికి, తన పెద్దకొడుకుని చిన్నవయస్సులోనే పంపించడానికి ఒప్పుకున్న ఘనత ఈ మాతృమూర్తిదే. ఆమె త్యాగమే మనందరికి ఈ జగద్గురువుగా అందారు.

**ఈనాడు ప్రపంచమంతటా, కోట్లాది జనులు, అనేక కుటుంబాలు శ్రీవైష్ణవ సంప్రదాయంలో నిలిచి, దాన్ని అనుసరిస్తూ వైదికధర్మాన్ని పాటిస్తూ ఉన్నారంటే కారణం ఆ మాతృమూర్తి త్యాగఫలమే.** మన జగదాచార్యుని కృపావిశేషమే.

ఆ తల్లిని దర్శించినప్పుడల్లా మనసుకు ఎంతో ఆహ్లాదమనిపిస్తూండేది. నిర్మలమైన మనస్సుతోవారు పలకరిస్తే నాకు ఎంతో మనోధైర్యం కలిగేది. మనసెప్పుడూ అబ్బురపడుతూండెడిది. జగదాచార్యునికి తల్లియైనా, అమితమైన వాత్సల్యంతో అందరినీ ఆప్యాయంగా కలుపుకొనే ఆమె నిరాడంబరత్వం అనితరసాధ్యం.

ఆ తల్లి, శ్రీస్వామివారిలోనే దైవాన్ని దర్శిస్తూ, ప్రేమగా ఆచార్య మేఘమా! అని పాడే పాట మా మనస్సుని ఎంతగానో కదిలించేది.

వారిని ఆశ్రమంలో ఎప్పుడు దర్శించినా మా కుటుంబసంక్షేమాన్ని తెలుసుకొని, ఆచార్య అనుగ్రహంతో అందరూ బాగుండాలి అని పల్లాండు, పల్లాండు అని చెప్పి చక్కని మంగళాశాసనం చేసేవారు.

అటువంటి మాతృమూర్తికి, శతకోటి దాసోహములు సమర్పిస్తూ , అమ్మ ఆశీస్సులు పరిపూర్ణంగ ఉంటాయని విశ్వసిస్తూ "మాతృదేవోభవ".

❖❖❖❖❖❖



# అరమరికలు లేనిది అమ్మ హృదయం

వనజా భాస్కరరావు
సహస్రాబ్ది వైస్ ప్రెసిడెంట్, హైదరాబాద్



1. మాతృమూర్తి అమ్మగారి గురించి చెప్పాలంటే నాకు సాధ్యం కాదు. కానీ నేను చెప్పలేకపోతే నా భావాలు నాలోనే నిక్షిప్తం అవుతాయి, అందుకోసం నాకు తెలిసిన భాషలో నా భావనలు వ్యక్తం చేస్తున్నాను.

2. దేవకి యశోద ముద్దుబిడ్డ కణ్ణన్, మన అమ్మగారు దేవకీ యశోద ఇద్దరి ప్రేమను ఉగ్గుపాలలో రంగరించి, కన్నయ్య రామానుజులను కలిపి మన చిన్న జీయంగార్లను అందించిన విశిష్ట మాతృమూర్తి.

3. కల్లాకపటము లేని చిన్న పాపాయిలాంటి మనస్తత్వం. మనస్సు ట్రాన్స్పరెంట్. లోపల ఏమి జరుగుతుందో చూడగలిగేంత స్పష్టత. రాముని లాంటి ఋజుత్వం. ఏమి అనుకుంటారో అదే చెబుతారు. ఏమి చెప్తురో అదే చేస్తారు. మనసా వాచా కర్మణా త్రికరణ శుద్ధిగా వారి ప్రవర్తన ఉండేది.

4. వారు ఏ రంగు వస్త్రము ధరించినా మిరుమిట్లుగొలిపే కాంతితో వెలిగేవారు. వస్త్రము కాంతి ముఖమండలముపై ప్రసరించి వెలుగుతుందా? లేక ముఖమండల కాంతులు వస్త్రముపై ప్రకాశిస్తున్నాయో అర్థము చేసుకోలేక ద్విగుణీకృతమైన ఆ అందాలు రెప్పవాల్చకుండా సేవించుకునే వాళ్ళము. వెంటనే కొంటె మనస్సు ప్రశ్నించేది. ఇప్పుడే ఇంత అందంగా ఉంటే యవ్వనంలో ఎంత అందంగా ఉండేవారో అంటే చిరునవ్వే సమాధానము. ఎలాంటి అరమరికలు లేకుండా కలసి ఆనందించే వాళ్ళము.



5. లీటర్ల కొద్ది శ్రీ పాదతీర్థం సేవించుకున్నా, అహం మమకారాలు వీడవు మనకు. కానీ అమ్మగారు గోటితో తీసివేసినంత సులువుగా అహం మమకారాలను జయించిన వీరవనిత.

6. ప్రకృతిలోకి దేహం వచ్చినంక ప్రకృతి మాయకు అందరూ దాసులు కావాల్సిందే. మహామహులు కూడా తప్పించుకోలేక పోయారు.

7. అమ్మ గారు వారి సుఖసంతోషాలను, మనస్సు క్లేశాలను మా తోటి పాలుపంచుకునే వారు. మేము తెల్సి తెలియని అజ్ఞానపు మాటలతో వారి దృష్టి మళ్లిచ్చి నవ్వించేవారము.

8. ఎప్పుడూ ఒక్కొక్కసారి స్వామి వారితో వాదిస్తుండే దానిని, కానీ వారు ఏమీ జవాబు ఇవ్వలేదు. అలా ఒక్కసారి చూసేవారు. అందులో ఎన్నో గూడార్థాలు. నాకు ఏమి అర్థము అవుతవి. తల వూపి వచ్చేదానిని.

9. మొట్టమొదటి సారి నేను అమ్మగారిని సేవించుకున్నప్పుడు వారి దృష్టి నాపై ప్రసరించి, కృపా కటాక్షము, ప్రేమ అనురాగాలు దయా కరుణ కుంభవృష్టి మాదిరిగా నాపై వర్షించాయి. ఆ ప్రేమ మమకారాలు ఆఖరి రోజుల వరకు అలాగే ఉన్నవి. ఆ మధుర స్మృతులను నా మదిలో పదిలముగా నిక్షిప్తము చేసుకున్నాను.

10. నాకు ఒకసారి వారి శ్రీ హస్తములతో వస్త్రధారణ చేసి నుదుట శ్రీ చూర్ణము దిద్ది మంగళాశాసనము చేశారు. అది ఈ జీవి తరించటాన్కి నాంది అయ్యింది.

11. అమృతతుల్యమైన ప్రసాదములు స్వయంగా వారేచేసి అనుగ్రహించేవారు. మేము ఆస్వాదించే వాళ్ళము. షోడశ రుచులు ఇంకా మదిలో మెదులుతున్నవి.

12. ఏ చిన్న ఫంక్షన్ చేసుకున్నా.. అమ్మా! రండి అని విన్నపము చేయగానే వేంచేసి వారి ఆశీస్సులు అందించేవారు. నేను కూడా వారి కుటుంబములో సభ్యురాలినే.

13. అమ్మగారు స్వామిగారు ఇద్దరు సేవిస్తుంటే మనకు అక్కడ ఆచార్య శిష్య సంబంధం స్పష్టంగా కనపడేది. ఏ కోణాన చూసినా తల్లి తనయుల బంధం కనపడక పోయేది. జీవునికి పరమపదాన్కి ఉన్నంత దూరం కనబడేది.

14. అమ్మగారిని స్వామివారిలో సేవించుకుంటున్నాను. సేవించుకుంటాను. అమ్మగారు మా స్వామివార్కి నిండా ఆయుష్షు, ఆరోగ్యాన్ని అక్కడి నుండే ఆశీస్సుల ద్వారా వర్షించాలని ప్రార్థిస్తున్నాను.

❖❖❖❖❖❖



# వితరణశీలి....

**శ్రీమతి రాజేశ్వరి, సూర్యనారాయణ**

అమ్మగారు లేరు అని మేము అనుకోలేకపోతున్నాము. నిత్యం వారి మాటలు, వారి పాటలు మా చెవిలో ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి, వారు అమరులు

గతం లో మేము విజయవాడ లో ఉంటున్నప్పుడు శ్రీ శ్రీ స్వామి వారికి కారు ప్రమాదం జరిగి, పిన్నమనేని పోలి క్లినిక్ లో ఉన్నప్పుడు అమ్మగారు మా గృహం లో ఉండటం జరిగినది. అప్పుడు అమ్మగారిని సేవించటానికి ఒక భక్తురాలు వచ్చి అమ్మగారికి వస్త్రాలు సమర్పించారు. శ్రీ స్వామివారిని కలిసి వచ్చాక అమ్మగారు హైద్రాబాదు వెళ్తూ ఆ వస్త్రాలు మాకు ఇచ్చారు.

" అమ్మగారు ఈ వస్త్రాలు మీకు ఇచ్చినవి కదా? మాకు ఇస్తున్నారు అని అడగగా వారు ఇలా అన్నారు."

"వారు మాకు ఇచ్చిన తరువాత అవి మావి కదా! మాకు నచ్చిన వారికి మేము ఇవ్వవచ్చు." అన్న మాటలు

ఇంకా మేము మర్చిపోలేము ఆ వస్త్రాలు ఇంకా మా దగ్గర పదిలంగా ఉన్నాయి వారి గుర్తుగా.

అప్పుడు మాకు అనిపించింది పూజ్య శ్రీ స్వామివారికి కూడా ఈ అలవాటే ఉంది, అంటే వారికి పత్రం అయినా ఫలమైనా మరి ఇంకేమైనా ఇస్తే క్షణకాలం ఆలోచించకుండా తిరిగి ఇతరులకు ఇచ్చే ఆ అలవాటు అమ్మగారి నుంచి వారికి వచ్చింది అని మేము బలంగా విశ్వసిస్తున్నాము. మేము 2014 నుంచి ఆశ్రమంలో ఉంటున్నాము, అమ్మగారు మమ్మల్ని చాలా ప్రేమగా ఆదరించారు. వారి ప్రేమని వాస్తవంగా పొందగలిగినందుకు, వారికి మా హృదయ పూర్వక ప్రణామాలు.

❖❖❖❖❖❖



అమ్మకి పిల్లలమనసెరిగి పంచడమే తెలుసు



# అమృతమూర్తి....


ఎర్నేని రామారావు

జీవా మెంబర్,

కేంద్ర వికాసతరంగిణి పూర్వ అధ్యక్షులు




మనందరి ప్రియతమ ఆచార్యులు, కౌసల్యా, సుప్రజారామ అని కీర్తించతగ్గ అపరరామానుజులుఅయిన శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన జీయరు స్వామివారి జీవితానికి అర్థం, పరమార్థం ప్రసాదించిన అమృతమూర్తి, మంగళ స్వరూపిణి, తిరుక్కావేరి సమానురాలైన శ్రీమతి ఆకులమన్నాడ చిలకమర్తి అలివేలు మంగతాయరమ్మ అమ్మగారు మనందరికీ, ఆశ్రమానికి ఎనలేని ఆనందశక్తిని ప్రసాదించేవారు. ఆ తల్లి దివికేగితే, వారి దివ్యస్మృతిని నెమరు వేసుకుంటూ అనేకానేక అశ్రుతర్పణాలతో గడపటమంటే అసాధ్యమే!

ఎంతోమంది భాగవతోత్తములు, తెలిసీతెలియక, మొరటు, స్వార్థ, అమాయక సేవల్ని, ఎంతో చిరునవ్వుతో, ఓపికగా స్వీకరించి, భరించి, మనందరి హృదయాలని మురిపించారు మన అమ్మగారు అనటంలో ఎట్టి సందేహంలేదు.

ఎన్ని జన్మల ఫలమో, ఎన్ని నోములు నోచో, ఎన్ని తపస్సులు చేసో, అపర రామానుజరూపాన్ని పురుడు పోసుకొని ఒక జగదాచార్యుని "అమ్మా" అని పిలిపించుకున్న మీ జన్మ ధన్యమమ్మా!

ఈ జన్మలో మిమ్మల్ని సేవించుకున్న మేమందరం ధన్యులమయ్యామని గర్వపడతామమ్మగారు! మీరూపం, మీ తేజం, మీతపఃఫలం, ఈ లోకానికి త్యాగంచేసిన కారుణ్యమూర్తి ఋణం తీర్చుకోవడం కష్టమే!

మీత్యాగఫలం లేకుంటే ఈనాడు మా జ్ఞానమార్గానికి శృతి, గతి లేదు.

మీరాశించినట్లుగా శ్రీనివాసుని వెయ్యి కాళ్ళ మండప పునర్వైభవం సమతా మూర్తి స్ఫూర్తి కేంద్ర లోకావిష్కరణం త్వరలో మీ ఆశీస్సులతో జరుపుకోవాలని పెరుమాళ్ళను ప్రార్థిస్తున్నాను.

మనందరి హృదయాలకెంతో దగ్గరైన మన అమ్మగారు పరమపదంలో ఉన్నా వారి మనసులో మనందరికీచోటు ఉంచుతారని నమ్మకంతో మిమ్మల్ని తల్చుకుంటూ, మీకు శతకోటి వందనాలు సమర్పించుకుంటూ, ఈ జన్మలో మిమ్మల్ని సేవించుకున్న మేమందరం ధన్యులమయ్యామని వినమ్రంగా, శిరసువంచి విజ్ఞాపించుకుంటున్నాం!

అమ్మా! మీకు అనేకానేక సహస్రశతకోటి ప్రణామాలు.

❖❖❖❖❖❖



# మా పుణ్యాల పంట



కుందూరు మహేందర్ రెడ్డి- మంజుల
కేంద్ర వికాసతరంగిణి పూర్వ అధ్యక్షులు
వరంగల్

"అమ్మ" అనే పదాన్ని వినగానే సాధారణంగా ఎవరి అమ్మ వారికి స్ఫురిస్తుంది. కాని అందరం అమ్మ అనగానే స్ఫురించేది " అలివేలు మంగతాయారమ్మ గారే" మా పుణ్యరాశి.

'ఎన్ని జన్మల పుణ్యఫలమో' ఇది అని, " మముగన్న మాయమ్మ అలివేలు మంగమ్మ" అని "అన్నమాచార్యులు ఆ తల్లిని కీర్తిస్తే, మాకు స్ఫురించే అమ్మ, మన ఆచార్యులను కన్న ఈ అలివేలు మంగతాయారమ్మ" గారే. మేము చేసుకున్న పుణ్యఫలం మా ఆచార్యులను అందించిన "అమ్మ" ను కలిగి ఉండటమే.

గత ముప్పై సంవత్సరాలుగా అమ్మగారిని ఎన్నో సార్లు దర్శించుకున్నాము. 26 సంవత్సరాల నుండి వారితో పరిచయ భాగ్యమే కాక కొంత సాన్నిహిత్యం ఏర్పడింది. వరంగల్ వికాసతరంగిణి చేస్తున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకొని సంతోషించే వారు. నిరంతరం స్వామి వారి సేవలోనే ఉండండి అని మంగళాశాసనం చేసేవారు. కేంద్ర వికాసతరంగిణికి గతంలో అధ్యక్షునిగా దాదాపు ఐదు సంవత్సరాలు శ్రీ స్వామి వారు దాసుని నియమించటం వల్ల ఎన్నోసార్లు అమ్మగారిని సేవించుకునే గొప్ప అదృష్టం కలిగింది. వారి పలకరింపులో అనిర్వచనీయమైన ఆనందం అనుభవించే అవకాశం కూడ కలిగేది.

ఎప్పుడూ నవ్వుతూ పలుకరించటమే కాక ప్రసాదం తీసుకున్నారా అని స్వయంగా అడిగేవారు. మంజులతో పిల్లల గురించి అడిగేవారు. ఆమాట, ఆ ప్రశ్నలతీరు తలుచుకున్న కొద్ది మనస్సులో కొత్త ఆనందం ఉరకలు వేసేది. చిన్నప్పుడు అమ్మ అడిగిన పద్ధతిని కూడ మరపించగల దివ్యశక్తి అమ్మ గారిలో చూశాము అలాంటి అమ్మ గారి గురించి ఎంత చెప్పిన తక్కువే అవుతుంది. ఏ కార్యక్రమంలోనైనా అమ్మగారు ఉంటేనే నిండుదనంగా అనిపించేది. ఇప్పుడు ఆ వెలితిని తలుచుకుంటే మనసంతా కలత చెందుతుంది.

గోపికలను కృష్ణుడు " మీరు చేసుకున్న పుణ్యమేమి" అని అడిగినపుడు ఆ గోపికలు " పుణ్ణియం యాముడయోం" అంటారు. మీరు పుట్టడమే మేము చేసుకున్న పుణ్యం అని గోపికలు అన్నట్లుగా మా ఆచార్యులను అందించి లోకాన్ని పవిత్రం చేసి మమ్ములను పుణ్యవంతులుగా చేసిన "మా పుణ్యాల పంట అలివేలు మంగతాయారమ్మ గారు". శ్రీమన్నారాయణుని సన్నిధిలో ఉన్న వారికి అనేకానేక దాసోహాలు సమర్పించుకుంటూ....



# ఆణిముత్యాల మూట - అమ్మమాట

ప్రొ.పురుషోత్తమరావు - శ్యామలా
జీవా సెక్రటరీ



మన భాగ్యనగరంలో దోమలగూడ-జెట్‌లో ఆశ్రమ కార్యక్రమాలు 90ల్లో అద్భుతంగా జరుగుతుండేవి. ఆ సమయంలో నేను హైదరాబాద్ జెట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. మేమంతా స్వామివారి శిష్యులం ఆ కార్యక్రమాల్లో యథావిధిగా పాల్గొనేవాళ్ళం. ధనుర్మాసాది మహోత్సవాల్లో - ఆచార్యులు వేంచేసిన సమయాల్లో అన్వయిస్తూ సేవలు చేస్తుండేవారం. అమ్మగారూ కార్యక్రమాల్లో ఉండి కైంకర్యశ్రీకి ప్రతిరూపంగా నిలిచెడివారు. ఆ సమయంలో అప్పుడప్పుడూ వారిని, వారి తార్నాక గృహానికి తోడ్కొని వెళ్ళే కైంకర్యం నాకూ లభించింది.

అమ్మగారి కుమార్తె శ్రీతాయారమ్మగారి పిల్లలు ఆనాడు 1990 దశకంలో మా పాఠశాల 'లిటిల్‌స్కాలర్స్ స్కూల్' బేగంపేటలో ఉండి విద్యాబుద్ధులు నేరుస్తుండెడివారు. అప్పుడు వారు, భాగ్యనగరం-తార్నాకలో వేంచేసియున్నారు. దాసునికి సమయమున్నపుడల్లా అమ్మగారి దగ్గరికి వెళ్ళిన సమయాల్లో, మనుమళ్ళ చదువుల గూర్చి వారి దగ్గర ప్రస్తావిస్తుండెడివాడిని! వారూ పిల్లల సమాచారాన్ని తెలుసుకుంటుండేవారు. అదే సమయంలో అమ్మగారితో దాసుడికి ఒక మంచి చనువు ఏర్పడింది. ఈ నా సంప్రదాయప్రయాణానికి అదే తొలి మెట్టయింది కూడా.

ఆ సమయంలో వారితో సాంప్రదాయిక విషయానుబంధం నాకు సదా ఆచరణీయం. మహాతల్లి! ఎంత గొప్పగా సెలవిచ్చేవారో... ఏ ప్రశ్న అడిగినా, చిరునవ్వుతో విసుగులేకుండా చెప్పెడివారు. వారు చెప్పిన ప్రతీవిషయం ఒక్కో ఆణిముత్యమే. మదిలో కలకాలం పదిలపరుచుకొనే మాటలాడుటలో ఉన్న ఆనందం దాసుడు ఏమని చెప్పగలడు? వారి సేవలు దాసుడికి అలా ప్రారంభమయ్యాయి.

జీవా ప్రాంగణానికి వచ్చాక అమ్మగారితో సన్నిహితం మరింత పెరిగింది. మా అమ్మను ఎప్పుడూ అమ్మగారిలో చూసుకొనే భాగ్యం దాసుడికి ఈ రకంగా కలిగిందేమో! జీవా సెక్రటరీగా కొంతకాలం ఆశ్రమంలో సేవచేసుకున్న సమయంలో, వారిలో ఉన్న మాతృమూర్తిని నాకు దగ్గరగా చూపెట్టింది. జీవాలో జరిగే అన్ని కార్యక్రమాల్లో తప్పక అన్వయించెడివారు, సూచనలు-సలహాలు మాకు ఇచ్చేవారు, విద్యావిషయాదుల్లో శ్రీస్వామివారితో ఎలాగైతే



మమేకమయి ఉండేవాడినో, అమ్మగారితో కూడా అదే రకమైన వాత్సల్యం పొంది వారు చెప్పిన సలహాలను పాటించాను. వారి వెన్నుతట్టి ప్రోత్సహించే ఉత్సాహమే ఈ నాటికీ నాకు శ్రీరామరక్ష. వారి అవ్యాజప్రీతి నాకు వరమై నిలిచింది.

"ఎప్పుడూ ప్రేమగా పలకరించేవారు, ఇంటికివస్తే ఎదోటి ఇవ్వక పంపెడివారు కాదు. ఫలమో-ప్రసాదమో తీసుకొనే వెళ్ళమని చెప్పేవారు. రాత్రుళ్ళు శ్రీస్వామివారితో బాగా ఆలస్యమయిన సందర్భాలు అనేకం. ఆచార్యుల మీద వారి నిష్ఠ ఎంత గొప్పదో అప్పుడు చూస్తుంటే చాలా ఆశ్చర్యమేస్తుండేది. ఎంతరాత్రయినా శ్రీస్వామివారికై నిరీక్షించి, మంగళాశాసనం చేసిగానీ విశ్రాన్తికి వెళ్ళేవారుకాదు. ఆ సమయంలో దాసుణ్ణి చూచి "రాత్రి సాపాటు చేసి, ఇక్కడే ఉండి, తెల్లారి వెళ్ళండీ!" అని చెప్పిన సందర్భాలూ మరిచిపోలేని తీపిగుర్తులు.".

నాకేకాదు, మా కుటుంబానికి అందరికీ వారి అనుగ్రహం ఎల్లవేళలా కలిగింది. అమ్మగారు బాధ్యతలు, నియమాలు పాటించడంలో వారికివారే సాటి. మా కుమారుడు సిద్ధార్థ్ – కోడలు మోనీషాల వివాహమయ్యాక మంగళాశాసనాలకోసం అమ్మగారి దగ్గరికి తీసుకొని వెళ్ళా! అప్పటికప్పుడు పిల్లలిద్దరికీ పెళ్ళికట్నాలు పెట్టి పంపించారు. పెరుమాళ్ళ అనుగ్రహంతో మా మనుమడు దేవాన్ష్ వరకు వారి అపారమైన దయ ఈ రకంగా మా మీద కురిసింది. వారు నియమాలు పాటించడంలో – మాకు నేర్పించడంలోనూ ముందువరుసలో ఉండి జీవితమంతా మరిచిపోలేని తీపిగుర్తులు దాసుడికి కలిగించారు.

ఇలా వారి నిర్హేతుక కృపను మాటల్లో చెప్పలేం.. శిరస్సు వంచి అంజలులు ఘటించడం తప్ప దాసునికి మరింక మార్గమేముందీ...!

అంత గొప్ప ఆచార్యులను సంప్రదాయానికి ధారాదత్తం చేసిన మహాసాధ్వి. ఎన్నడూ వీసమెత్తు అహమూ వారిలో దాసుడు చూడలేదు. నిగర్వియై, అందరిలో ఒకరిగా కలిసి, శిష్యకోటికి ఒక చక్కటి మార్గగామియై వారి జీవితం ఎంతో ఆదర్శప్రాయంగా సాగింది. దాసుడికి సంప్రదాయోన్నతికి అమ్మగారు నేర్పిన తొలిపలుకులే ఈనాడు ఈ మాటలు రాయడానికి ఉపక్రమించాయి అనడంలో సందేహమేమీలేదు. సమతామూర్తి జాతికి అంకితం చేసే ఘట్టాన్ని అమ్మగారు కూడా కనులారా దర్శిస్తే ఆనందంగా ఉండేదని దాసుని భావన.

ఆనాడు శ్రీస్వామివారికి అమ్మగారు చూపెట్టిన మార్గమేకదా మాకు, ఈనాడు ఈ మహోన్నతమైన శ్రీవైష్ణవసంప్రదాయంలో ఆచార్యసమాశ్రయణంద్వారా ఉజ్జీవించడానికి ఉత్ప్రేరకమై నిలిచింది. వారి కైంకర్యనిష్ఠకు, వారి జ్ఞానానికి-అనుష్ఠానానికి దాసోహములు తెలుపుతూ, పల్లాణ్డు పల్లాణ్డు పలుకుతూ ఆ శ్రీమన్నారాయణుడి పదసన్నిధిలో ప్రణమిల్లుతూ... మా ఆచార్యులు శ్రీచిన్నజీయర్‌స్వామివారికి దాసోహ సహస్రములను సమర్పించుకుంటూ...

❖❖❖❖❖❖

**A Mother is she who can take place of all others but whose place can no one else take.**



# ప్రేమామృతం

టి. రమేష్ గుప్తా
వికాస తరంగిణి ప్రెసిడెంట్

ఆనాటి కౌసల్యమ్మ నిన్నటి దేవకి యశోదమ్మ ప్రతిరూపమే నేటి మన స్వామివారి అమ్మగారు. కాదు మా అమ్మ. కాదు కాదు మన అందరి అమ్మ అలివేలు మంగమ్మ.



ఎంతటి పుణ్యమో సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే ఈ తల్లి కడుపున అవతరించితే లోకకల్యాణార్థమై మనందరిని ఉద్ధరింప తన ముద్దుల బిడ్డడిని యతీశ్వరునిగా త్యాగమొనర్చిన మహితాత్మురాలు అమ్మ.

అమ్మగారు ప్రేమకు ప్రతిరూపం. ఎప్పుడు చూసినా చిరు దరహాసంతో ప్రతి ఒక్కరినీ ఎంతో ప్రేమగా పలకరించేది. సౌమ్యతకు ప్రతిరూపం అమ్మ.

యేనాడు తాను జగదాచార్యుని తల్లిని అనే గర్వము ఇసుమంతైనా లేని ప్రేమమయి. భూమాత అంత ఓర్పు అమ్మది. లోకానికి స్వామివారిని ఇచ్చినా ఎల్లవేళలా స్వామి వారి బాగోగులు చింతనే అమ్మది. స్వామి వారు భక్తుల బాధలను బాప యెక్కడెక్కడికో వెళ్లి ఏ రాత్రో కుటీరము చేరినా వారికి యెంత దృష్టిదోషము కలిగిందో అని కళ్లు కాయలు కాచేలా, శరీరము వృద్ధాప్యము వలన సహకరించకపోయినా వేచి వేచి స్వామివారు రాగానే వారికి ద్రిష్టి తీసే అమృతమయి అమ్మ.

అమ్మా !

ప్రేమ ఓర్పు నీ రూపం, నీవు స్వామికే కాదు, మా అందరి తల్లివే. మేమంతా నీ ప్రేమ ఒడిలో సేదతీరిన వారమే. అమ్మగారు! మిమ్మల్ని ఏకవచనంతో అమ్మా అని అంటున్నందుకు నా దోషములను మన్నించు తల్లి.

అమ్మా!

ఈ లోకములోని బిడ్డలందరికీ మంగళాశాసనములు చేయ వైకుంఠానికి చేరావా తల్లి. నీ చల్లని కృపకు పాత్రులైన మేమంతా అదృష్టవంతులము.

అమ్మా !

నీ పాద కమలములకు అనంతకోటి దాసోహములతో ప్రణామములతో

❖❖❖❖❖❖

బిడ్డలకై ఎదురుచూపులో అలసిపోనిది అమ్మ!



# రత్నగర్భ



ప్రొఫెసర్ పాకనాటి జ్యోతి
వికాసతరంగిణి అధ్యక్షులు, వరంగల్

పరిపూర్ణ మానవత్వంతో అవతరించిన శ్రీరాముని గుణగణాలు శ్రీమద్రామాయణంలో

రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా ।
రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా ॥

అని వర్ణించబడినాయి. "జీవలోకాన్ని రక్షించేవాడు, ధర్మాన్ని రక్షించేవాడు, తన ధర్మాన్ని రక్షించుకునేవాడు, స్వజనాన్ని రక్షించేవాడని పేర్కొన్న లక్షణాలు పుణికి పుచ్చుకున్న వారు ఈ కాలంలో మన శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారే. తమ వారు, పైవారనే భేదం లేక జీవకోటిని రక్షిస్తూ తాము భగవత్పరతంత్రులై తమ ధర్మాన్ని రక్షించుకుంటూ, తమ వారిగా చేరిన శిష్యుల రక్షణ బాధ్యత స్వీకరించి, ఆశ్రయించిన వారికి ఏడుగడగా నిలిచిన సద్గుణాల రాశి మన స్వామివారు. ఇటువంటి మహోన్నత మూర్తికి జన్మనిచ్చిన మహనీయురాలే శ్రీమతి ఆకులమన్నాడ చిలకమర్తి అలివేలు మంగతాయారమ్మగారు.

పరమాత్మనే కుమారునిగా పొందిన కౌసల్య, దేవకి, యశోదమ్మల కన్నా కూడా భాగ్యవంతురాలు. భగవత్తత్త్వాన్ని నారాయణుని సర్వవ్యాపకత్వాన్ని ప్రకాశింపచేసే తిరుమంత్రమే రూపుదాల్చినదా అన్నట్లు భాసించే తల్లి మన అలివేలు మంగతాయారమ్మగారు. వారి పెంపకమే శ్రీశ్రీశ్రీ స్వామివారిని జగదాచార్యులను చేసింది. జ్ఞానంవైపు ప్రసరించే మార్గాన్ని వారికి నిర్దేశించి, మార్గదర్శిని చేసి, మనకు ప్రసాదించిన పుణ్యశీలి. శ్రుతి సాగరంలో మునిగి వర్షించే ఉదారులైన ఆచార్య మేఘాన్ని లోకానికి అర్పించి, తరింపచేసిన సత్త్వ సంపన్నురాలు.

శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామివారు యత్యాశ్రమం స్వీకరించక పూర్వం, శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామివారు వీరి తల్లిగారితో కుమారుని భవిష్యత్ మార్గం గురించి అడిగినప్పుడు వారు తమకు ఏది సమ్మతమైతే, ఏది మంచిదనుకుంటారో ఆ మార్గాన్నే నిర్ణయించమని చెప్పారట. "బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి" అన్నట్లు పరమాత్మ నెరిగిన వారు పరమాత్మ స్వరూపాన్నే పొందుతారని అంటారు. కనుక భగవత్ సదృశులైన పెద్ద జీయర్‌స్వామివారు వీరిని గుర్తించి తేజోమూర్తి, భగవత్స్వరూపులైన స్వామివారిని మన కందించారు. ఆ అమ్మ త్యాగం, పెద్ద జీయర్‌స్వామి వారి అనుగ్రహం ఏనాటికీ మరచిపోలేనిది, ఆత్మ ఉన్నంతకాలం శాశ్వతంగా ఉండేది.



గత ఇరవై ఆరు సంవత్సరాలుగా పూర్వజన్మ సుకృతం వల్ల అమ్మగారితో మా కందరికీ అనుబంధం ఉన్నది. ఆయా సందర్భాల్లో అమ్మగారిని దర్శించుకున్నప్పుడు వారు చూపించిన ఆప్యాయత మాటల్లో చెప్పలేనిది. ఎప్పుడు కలసినా వరంగల్‌లో మీరు స్వామివారి కార్యక్రమాలు బాగా చేస్తారట, స్వామివారు అంటూంటారు. అనేవారు. అదంతా ఆచార్య అనుగ్రహమే కాని మేము చేసిందేమీ లేదమ్మా అని చెపితే, నాకు తెలుసు, మేము వచ్చాంగా వరంగల్‌కి అని నవ్వేవారు. శ్రీస్వామివారి బాల్య విశేషాలు ఎన్నో చెప్పేవారు. శ్రీ స్వామివారిది ఉంగరాల జుట్టు కనుక, చిన్నప్పుడు తాము దువ్వుతుంటే, అమ్మా ఉంగరాలు పోతాయి, మెల్లిగా దువ్వు అనేవారట. ఊళ్ళోకి మాయాబజార్ సినిమా వస్తే ఇంటిల్లిపాదిని తయారుచేసి సినిమాకు తీసుకువేళ్ళేవారట.

ఆ రోజుల్లో స్వామివారికి ఏదైనా చక్కటి పిండి వంటలు చేసి పెట్టాలనుకునే దాన్నని, కాని కుటుంబ పోషణే కష్టంగా ఉండేదని, ఆ తరువాత ఆర్థికంగా వెసులుబాటు కలిగినపుడు స్వామివారు యత్యాశ్రమం స్వీకరించడం వల్ల తాము అప్పుడు కూడా ఏమీ చేయలేక పోయామని బాధపడేవారు. ఆ తల్లిప్రేమకు, విలక్షణమైన గుణ పరిపూర్తికి దాసోహాలు సమర్పించడం తప్ప మనమేమి చేయగలం. అటువంటి తల్లి గర్భాన్ని జ్వాజ్వల్యమానం చేసిన శ్రీ స్వామివారిలో కర్తవ్య పరాయణతను జాగృతం చేసి ఆ తల్లి వారిని ధర్మ ప్రతిష్ఠాపనాచార్యులుగా తీర్చి దిద్దింది. అందుకే వారు తమ కళ్యాణ గుణాలతో అందరిని ఆకట్టుకున్నారు.

అయోధ్యలో ప్రజలు శ్రీరాముని చూడని, శ్రీరాముడు చూడని బ్రతుకు వృధా అని అనుకున్నట్లుగానే శ్రీ స్వామివారి కోసం లక్షల మంది వారి దర్శనం కోసం, వారి దివ్య సూక్తులు శ్రవణం చేయటం కోసం పరి తపిస్తుంటారు. "ఆచార్యవాన్ పురుషో  వేద" అంటారు. కనుక ఆచార్య సమాశ్రయణమే ఉత్తమ గతిని అందిస్తుందని అందరి భావన. అందుకే అందరూ వారి చిరునవ్వు చూడగానే బాధలన్నీ మరచిపోతారు. సర్వప్రాణులపై వారు కురిపిస్తున్న కరుణామృత వర్షపు జల్లు అందరికీ అనుభవైక వేద్యమే.

ఒకానొక సందర్భంలో మహాభారతంలో నూరుగురు ఆచార్యులకంటే తండ్రి గొప్పవాడు. తండ్రి కంటే నూరురెట్లు తల్లి గొప్పది అని పేర్కొనబడింది. (శ్రీకృష్ణతత్త్వ మధురిమ పుట 619) నిజంగా తల్లిలేని లోటు ఎవరు తీర్చలేనిది. శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామివారి వద్ద సమాశ్రయణం పొంది, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారిని లోకానికి అందించి, పరమపదంలో శాశ్వత స్థానాన్ని అలంకరించి, తమ జన్మను సార్థకం చేసుకొని కృతకృత్యులైనారు శ్రీమతి అలివేలు మంగ తాయారమ్మగారు. అమ్మగారి శ్రీచరణాలకు దాసోహం అర్పిస్తూ...

"న రత్నమన్విష్యతి మృగ్యతే తత్"

❖❖❖❖❖❖

# మాతృదేవత!

డా॥ ఆనందరావు మేచినేని – మరియు కుటుంబ సభ్యులు,
హైదరాబాద్



'మాతృదేవోభవ' అన్న వాక్యం అంతకు ముందు వినడం మాత్రమే జరిగింది కానీ! 'స్వామి వారి' ఆశ్రమంలో మొదటిసారిగా అమ్మను కీ.శే. అలమేలు మంగతాయారు గారిని చూసి, పలకరించినప్పుడు 'మాతృదేవత' అంటే ఇలాగే ఉంటుంది అనిపించింది.

'అమ్మ' గారి ఆధ్యాత్మిక తత్త్వం, పరిపూర్ణమైన సౌజన్యం, మృదుమధుర భాషణం, అనితర సాధ్యం. అందుకే ప్రతిసారి అమ్మతో మాట్లాడినప్పుడు అనిపించేది... సాక్షాత్తూ ఆ... అమ్మ అలమేలు మంగమ్మతో మాట్లాడి, ఆశీస్సులు పొందినామని!!

అపర రామానుజులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయరుస్వామి వారితో మాకున్న అనుబంధం 'భక్తునికి భగవంతునికి వున్న బంధం లాంటిదే' ... అయితే ఈ బంధం కనిపించే భగవంతుని 'సంబంధం' కావడం విశేషం.

వేయి సంవత్సరాల నాడు జన్మించి విశిష్టాద్వైతాన్ని విశ్వవ్యాప్తం చేసిన గురువర్యులు రామానుజులు. ఆ పరంపరలో ఈనాడు విశిష్టాద్వైత స్ఫూర్తిని ఈనాటి తరానికి పంచుతున్న అపర రామానుజులు శ్రీశ్రీశ్రీ చిన్నజీయరు స్వామి వారిని కన్న తల్లి, అందరికీ అమ్మగారు వైకుంఠప్రాప్తి నొంది నారన్న వార్త నన్ను, మా కుటుంబాన్ని, చింతాక్రాంతుల్ని చేసింది. ఎందుకంటే అమ్మతో ఉన్న అనుబంధం, స్మృతులు, అలాంటివి మరి!!

ఆచార్య చక్రవర్తుల గారితో కలిసి నేను "విశ్వాచార్యుడు" టైటిల్‌తో భగవద్రామానుజుల స్ఫూర్తిని, సమదృష్టిని, అష్టాక్షరీ మంత్ర ప్రదీప్తిని ఈ తరానికి కొంత వరకు తెలియజేయాలనే సంకల్పంతో చిత్రం నిర్మించడం జరిగింది.

ఈ నేపథ్యంలో 2019 అక్టోబర్‌లో 'అమ్మ' గారి దర్శనానికి వెళ్లినప్పుడు 'విశ్వాచార్యుడు' చూడాలని వుంది నాయనా...! ఆ ఏర్పాట్లు చేయుమని సెలవిచ్చారు. వారి ఆజ్ఞ మేరకు 2019 నవంబర్ 21వ తేదీన బాలానగర్‌లోని 'ఎ టు ఎ సెంట్రల్‌మాల్' ప్రారంభోత్సవానికి విచ్చేసిన చిన్న జీయరుస్వామి వారు మరియు వారి మాతృమూర్తి గారితో సహా విచ్చేసిన భగవద్ భక్తులందరికీ బిగ్ స్క్రీన్ పై 'విశ్వాచార్యుడు' ప్రదర్శించి చూపడం జరిగింది. ఈ సందర్భంగా చిన్న జీయరుస్వామి వారి ఆశీస్సులు మరియు 'అమ్మ' గారి ఆశీస్సులు పొందడం జరిగింది. చిత్రం చూసిన భగవద్ భక్తులందరూ ప్రశంసించడం జరిగింది. ఈ సన్నివేశం మా జీవితంలో మధుర స్మృతిగా నిలిచిపోతుంది!!

'విశ్వాచార్యుడు' భగవద్రామానుజుల ఆత్మ వేయి ఏళ్ళ తర్వాత మళ్లీ ఆకృతి దాల్చి ... అలివేలు మంగతాయారు గారికి జన్మించిన అపర రామానుజులే శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయరు స్వామి అని లోకమంతా విశ్వసిస్తున్నది.

ఇంతటి గొప్ప తాత్వికవేత్తను కని, పెంచి, సన్యాసాశ్రమానికి అంగీకరించి, విశిష్టాద్వైత ప్రచారమూర్తిగా, సమ సమాజ సేవా తత్పరునిగా, చిన్న జీయరుస్వామి గారు అందిస్తున్న సేవలకు మూలమైన 'అమ్మ'కు శతకోటి వందనాలు. 'అమ్మ' పరమాత్మని చేరి మనని దీవిస్తున్నారని విశ్వసిస్తున్నాను.... 'అమ్మ'ల ఆశీస్సులతో సర్వజనులు సుజనులు కావాలని, లోకమంతా ఆనందమయం కావాలని ఆకాంక్షిస్తూ – శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న రామానుజ జీయరు స్వామి వారి దాసానుదాసుడు



# Ammagaru's Unspoken Words......

**Ninananda**
**JIVA**



Did I ever tell you, my dearest, eldest son?
You were the best, the most joyful thing,
That ever happened to me, under this sun,
I saw a bundle of divinity lying on my lap.

You gazed at me, with tiny, adorable little eyes,
In them I beheld Srimannarayana, so very clear,
Infant eyes, so innocent, so pure, yet so wise,
My heart knew, you were on a mission divine.

As I helped you learn, in prayer to fold your hands,
Your young, defiant eyes asked a myriad questions,
Little did I know, one day, in distant foreign lands,
You would spread answers to those very doubts.

Did I ever tell you, it was very difficult to let you go,
To become an ascetic, my permission you sought,
My calm acceptance, hid the tears I could not show,
I needed you, but I knew, the world needed you more.

**There is nothing as powerful as a mother's love, and nothing as healing as a child's soul.**



I sent you forth, to serve at Acharya's divine feet,
Sealed my lips, not a word about how bereft I felt,
Motherhood wept, as you went, your destiny to meet,
But my blessings became the wind beneath your wings.

Oh my child! How far .... how high you did soar!
Did I ever tell you how proud I felt to be your mother?
My heart experienced divine bliss in its very core,
As I watched you initiate thousands in the Sampradaya.

But the pride was tinged with a little bit of worry,
How busy my child is! How tired he must be!
Did he find time to eat? To rest? Always in a hurry!
Always accessible, always ready to help, to guide!

Then late at night, in spite of your embarrassed sigh,
I'd come to the kuteeram, with deepak and flowers,
A worried mother protecting her son from an evil eye,
While showering her blessings, *mangala ha:rathi*.

Now, before you rest your weary body each night,
Feel my presence pulsating in your thoughts,
May a gentle moonbeam do *ha:rathi* with its light,
May a creeper shower floral blessings on my son!

Did I ever tell you how much I love you? That I care?
My heartbeat will remain alive in every devotee's heart,
Among them, you'll find my love's fragrance in the air,
My Mangala:sa:sanams are there with you forever more.

The debt you owe me? Your mother demands you pay,
By serving all beings, my dear son, as service to God!
You've always paid heed, continue to do what I say,
Spread Ramanujacharya's word. Your debt will be repaid!

❖❖❖❖❖❖

**There nothing like your mother's sympathetic voice to make you want to be in tears.**



# చెరగని చిరునవ్వే ప్రేరణగా...



**యం. విజయలక్ష్మి**

**(జీవా, ఆక్యుపంక్చర్ వైద్యము/శ్రీరామస్థూప జీర్ణోద్ధరణ)**

అమ్మ నాలుగు దశాబ్దాలుగా మన అందరిమధ్య .... ఏ దాంబీకములు తెలియని అమ్మ, తన చిరునవ్వులతోనే అందరినీ ఆశీర్వదిస్తూ ..... తన ప్రేమని అందరిపైనా చూపారు. 'అమ్మ' తోటి నాకు గత 35 సంవత్సరములు పైగా స్నేహము. ఆనాటి నుంచి ఇప్పటివరకు ఎప్పుడూ..... ఆ చక్కని మోముపై చిరునవ్వే చూసాను.

శ్రీరామునితల్లి కౌసల్య , కృష్ణుని తల్లులు దేవకీ,యశోదలు ఎంతగా ఆయా సందర్భాలలో తమ ఎదల్లో బాధను అనుభవించారో ..... అలాగే 'మన అమ్మ' కూడా తన ఎదలో ఎన్ని బాధలున్నా ..... ఏనాడూ మోముపై ఆ చిరునవ్వు వీడలేదు.

మహా చక్రవర్తి కొండంత గురుదేవులు శ్రీశ్రీశ్రీ చిన్నజీయరు స్వామికి జన్మ ఇచ్చిన తల్లి అయినప్పటికీ .. అతి సామాన్యురాలిగా పిల్లా , పెద్దా అందరితోనూ స్నేహమే. పెద్దలపట్ల భక్తి ప్రపత్తులే. వాడుక భాషలో చెప్పాలంటే అమ్మ తన ఉన్నతమైన గొప్ప పదవిని ఏనాడూ దుర్వినియోగము చేయలేదు.

"దేవుని తన గానములతో కీర్తించడము, ఆచార్యుల వైభవము కోసం ప్రార్థించడము" అంతే.... అమ్మ ఇంకేమీ ఆశించలేదు. శ్రీశ్రీ అమ్మగారి మాటలో మరియు వారి దీవెనలో ఎంత శక్తిఉందో ఒక విషయం పంచుకుంటాను.

1994 సంవత్సరములో తిరుమలలో శ్రీమహావిష్ణు యాగము జరిగిన తరువాత అదే సంవత్సరములో శ్రీశ్రీశ్రీ స్వామివారు బదరీనాథ్ అష్టాక్షరీ క్షేత్రములో "చాతుర్మాస్య దీక్ష"లో వేంచేసి ఉన్నారు. అపుడు శ్రీ అమ్మగారు అచ్చటనే వేంచేసియున్నారు. నేను మా అమ్మగారితో కలిసి అపుడు మొదటిసారి బదరీక్షేత్రానికి వెళ్ళాను. అక్కడికి వెళ్ళగానే మా అమ్మగారు నాతో మన ఆశ్రమములోఉన్న శ్రీరామస్థూపాన్ని చూపిస్తూ ... "ఇది మా పెద్ద జీయరుస్వామి వారు కటాక్షించారు, రంగులువేయి!!" అన్నారు. ఆ తరువాత శ్రీస్వామివారికి విన్నవించి వారి ఆజ్ఞతో స్థూపానికి రంగులువేసి అలంకరించుట పూర్తి అయినది.

శ్రీశ్రీ అమ్మగారు ఈ స్థూపం పని పూర్తి అయ్యాక చూసి వెంటనే, " అమ్మాయి !! నైమిశారణ్యం ... మిశ్రిత్ ప్రాంతాల్లో స్థూపాల పరిసరాలు అశుభ్రంగా ఉన్నాయి, అక్కడివారు పట్టించుకోకపోవడం మూలాన కావచ్చు, యాత్రికుల సందడివలన కావచ్చు." – అని చాలా బాధ వ్యక్తపరచారు. అమ్మగారి నోటివెంట ఆ మాటలు వినగానే .... నా మనస్సుకి ఒక్కసారిగా "ఆ పరిసరాలు వెంటనే శుభ్రం చేయకపోతే నేను తప్పుచేసినదానిని

సహనానికి వాత్సల్యానికి మరో రూపు అమ్మ!



అవుతాను. వెంటనే వెళ్ళిచేయాలి. ఇది నా బాధ్యత" . అలాంటి ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. నాకు నేను చేస్తున్న ఉద్యోగం గురించి ఎలా అనేది కూడా పట్టించుకోలేదు . అప్పటికి ఇంకా నాకు శ్రీరామస్థూపాలు గురించి చరిత్ర ఏమీ తెలియదు. వెంటనే నేను శ్రీశ్రీ అమ్మగారితో "అమ్మా నేను చేస్తాను". అని అన్నాను. వెంటనే అమ్మగారు శ్రీశ్రీశ్రీ స్వామివారితో విషయం విన్నవించారు. ఇక ఆపై ఒక్కటి కాదు 108 - శ్రీరామ స్థూపాలు ప్రాజెక్టు చేసే వైభవోపేతమైన పనిని కేవలం శ్రీశ్రీ చిన్నజీయరు స్వామివారి కృపాకటాక్షములతో చేయడం జరిగింది. అలా శ్రీశ్రీ అమ్మగారి నోటినుండి వచ్చిన ఒక మాటతో ఎంతో వైభవోపేతమైన కార్యాన్ని భారతదేశం నలుమూలలా తిరిగి చేసే భాగ్యం అతి సామాన్యురాలినైన నాకు దక్కినది.

శ్రీశ్రీ అమ్మగారు నా కొసగిన మహాగొప్ప దీవెన :

నాలుగు సంవత్సరాల క్రితం అమ్మగారితో ఒకరోజు .... అమ్మా స్వామివారికి అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెజర్ వంటి ప్రకృతివైద్యాలు ఇష్టం కదా హైదరాబాద్ సిటీలో ట్రీట్ మెంట్ మరియు ట్రైనింగ్ సెంటర్ స్థాపించి దాన్ని తీర్చిదిద్ది ఆచార్యుల శ్రీచరణాల వద్ద చిరుకానుకగా సమర్పించాలి అన్నాను. "అసలు నా వల్ల అవుతుందా" అన్నాను. "నీవు తప్పక చేయగలవు" అని అన్నారు అమ్మ. అలా నాలుగు సంవత్సరాలు తరువాత మొన్న జూన్ 30 వ తారీఖున ఆ దీవెన ఫలించి రూపుదాల్చింది. ఇది అమ్మగారి దీవెనలోని శక్తి. ఇక్కడ ఒక మాట గుర్తుకు వస్తుంది.

The loveliest master piece of the heart of god is the heart of a mother

అవును ఈ అమ్మ జగదాచార్యులని కన్న అమ్మమనస్సు అలాంటిదే. తనువు మనస్సు నడవడి అన్నీ సుందరమైన అమ్మ. ఈ అమ్మ ఎంతో శక్తిని నింపే ఆ చిరునవ్వు ఇంక ఎలా? పొందుతాము ?? భౌతికంగా అమ్మ దూరమయ్యారు!

లేదు.. లేదు.. దూరం కాలేదు.

ఆచార్యుడు ఆనందపడేలా పనులు మనం చేస్తూఉంటే .... అమ్మ చిరునవ్వులు సూర్యచంద్ర కిరణాలతో మిళితమై మనల్ని తాకుతూనే ఉంటాయి.

అమ్మ ఎంత దూరాన ఉన్నా ... ఏ లోకంలో ఉన్నా అవే మనకి ఎల్లవేళలా దీవెనలు. అవును ఈ లోకంలో అమ్మదీవెనని మించినది లేదుకదా!

ఈ అమ్మకి అతి సామాన్యురాలినైన నాపై ఎంత కరుణ అమ్మ విష్ణు సాయుజ్యాన్ని పొందే ఘడియలలో అక్కడే తన పాదాలవద్ద ఉన్న నాపై చిరునవ్వు కురిపించారు. నీ పనులు సరిగ్గా నిర్వర్తించు. అన్నట్లుగా ఆ చూపులలో దీవెనలు.

అమ్మా నీ దీవెనలు నన్ను రక్షించాలని ప్రార్థించుకుంటూ అంజలి ఘటిస్తున్నాను. స్వీకరించమ్మా....



# ఆయుర్వేదంలోనూ ప్రవీణే



డా॥ కోటి నాగార్జున,

జిమ్స్, ఆయుర్వేదం

ఆయుర్వేద వైద్యశాలకి,అమ్మగారికి విడదీయరాని అనుబంధం ఉంది. మేము వేసే ప్రతి అడుగులో మా వెనక ఉండి నడిపిస్తూ ఉండేవారు. స్వామి వారి మంగళాశాసనములతో ప్రారంభించిన స్వర్ణ ప్రాశన అనే ఆయుర్వేదాలయం ఈ రోజు కొన్ని లక్షల మందికి చేరడమే కాక, అనేక మంది చిన్నారులు దీర్ఘకాలిక రోగాల నుంచి విముక్తులు అయ్యారు.

ఆయుర్వేద వైద్యులమందరము అమ్మ గారిని కలిసినప్పుడల్లా వారు ఆయుర్వేదం గురించి మరియు దానిలో వాడే ఔషధ ప్రాశస్త్యం గురించి సవివరంగా వివరించడమే కాకుండా పూర్వకాలంలో తయారుచేసే కుప్పె ఔషధముల ప్రాశస్త్యం అలానే అవి తయారు చేసే విధానము కూడా తెలియజేస్తూ ఉండేవారు. దానిలో భాగంగానే మంచి ఔషధ నిర్మాణం చేయాలనే సంకల్పంతో మన జీవా ఆశ్రమ ప్రాంగణంలో దీర్ఘాయువు అనే ఆయుర్వేద ఫార్మసీ శ్రీ స్వామి వారు ఏర్పాటు చేసి మంచి ఔషధాలు తయారు చేయమని ఆజ్ఞాపించారు.

అమ్మగారికి ఆయుర్వేదం మీద ఎంతో మక్కువ, వీలైనంత వరకు మన శాస్త్రీయ ఔషధాల ద్వారానే రోగులంతా రోగ విముక్తులై ఆయువుని కాపాడుకోవాలని మాకు సదా సూచిస్తూ ఉండేవారు. కఫ చింతామణి అనే దివ్యౌషధమును తయారుచేసే విధానం సవివరంగా చెప్పి మాచేత తయారు చేయించారు కూడా!

ఆ ఔషధము వాడి ఎంతోమంది శ్లేష్మ సంబంధ వ్యాధులనుండి ఉపశమనం పొందారు. ఈ జిమ్స్ ఆయుర్వేద ఆలయం యొక్క అభ్యున్నతిలో, మరియు దీర్ఘాయువు ఆయుర్వేద ఫార్మసీ స్థాపనలో అనుక్షణం మా వెన్నుండి సరైన సమయంలో సరైన సూచనలు ఇస్తూ ఆయుర్వేదంతో విడదీయరాని అనుబంధం ఏర్పరిచారు.

❖❖❖❖❖❖



## అమ్మగారు

యశోదమ్మ, దేవకమ్మ కలగలసిన అవతార రూపం అమ్మగారు. అందుకే భగవంతుడే యతి రూపంలో అవతరించారు. అమ్మగారు ఆవకాయకు అన్నం ముద్దలుగా చుట్టి చేతిలో పెట్టేవారు, అమృతంలా ఉండేది, అంతటి వాత్సల్యం అమ్మగారిది.

భగవంతుడు నాకిచ్చిన చిత్రకళకు ప్రాణంపోసిన యతీశ్వరుని అందించిన అమ్మగారికి దాసుని దాసోహములు.

సిద్ధాంతం శ్రీనివాస్ (ఆర్టిస్ట్)

**వంటింటినే వైద్యాలయంగా మార్చే సహజ వైద్యురాలు అమ్మ!**



unvishat karya ltd

Registered Office: No.12, 2nd floor, Rosie Towers, No:7, Nungambakam High Road, Chennai

Sri Sri Sri Tridandi Chinna Srimannarayana Ramanuja Jeeyar Swamiji

JIVA, Sriramnagaram, Muchintal Road,
Palmakol P.O. Samshabad,
HYDERABAD 509325

Adiyen,

Dasohamulu!

नास्ति मातृसमा छाया नास्ति मातृसमा गतिः
नास्ति मातृसमं त्राणं नास्ति मातृसमा प्रपा ।

We all at Mahan Bharat Abhiyan want to reach out to you in this moment of separation, from the mother whom we want to thank for having given birth to such a divine being as you to motivate teach, support and guide us on our path of karma and moksha.

While we all have had our experiences of a mother's love, care and her never dying presence, we are praying to make her final journey eternal to vaikuntha sannidhanam.

We continue to seek your blessings and draw the inspiration from your words and teachings to be in service to the humanity and be on the path of God forever.

With bowed head and folded hands.

All members of
Mahan Bharat Abhiyan



# అమ్మమనస్సు



అరుణా రాఘవరెడ్డి, హైదరాబాద్

నా మనస్సులో ఉన్న అమ్మగారి విషయాలను అక్షర రూపంలో ఉంచాలని ఈ చిన్ని ప్రయత్నం

ఈ దేహజన్మను ఇచ్చిన నా తల్లిదండ్రులు కౌసల్యాదేవి, రఘుపతిరెడ్డి దంపతులు. జ్ఞానజన్మను ఇచ్చిన మా గురుదేవులు శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారు. నన్ను, నా లాంటి ఎందరినో అల్పజీవులనుద్ధరించడానికి ఇంతటి జగదాచార్యులకు జన్మనిచ్చినది మా అమ్మ అలివేలు మంగతాయారమ్మగారు.

అమ్మగారిని చూసినప్పుడల్లా నా కనిపించేది ఎప్పుడెప్పుడు అధర్మము పెరుగుతుందో ధర్మాచరణము అవసరమో, అపుడు నేను ఈ భూమ్మీద అవతరిస్తాను అని ఆ భగవంతుడు అనుకున్నట్లు రామునిగా ఈ మనుష్యులు ఎలా ఈ భూమ్మీద మెలగాలో రామావతారంలో చూపించాడు. కృష్ణునిగా అర్జునునికి భగవద్గీతనుపదేశించి ప్రయత్నించాడు. చివరికి ఈ జీవులనుద్ధరించటానికి రామానుజులుగా వేయి సంవత్సరముల క్రితం అవతరించి జీవులంతా తరింపబడాలని గోపురమెక్కి అష్టాక్షరీ మంత్రాన్ని వెదజల్లి ఈ మానవులందరికి ముక్తిమార్గాన్ని చూపారు. అలాంటి మహోన్నతమైన మార్గానికి ఈ తరం వారికి పెద్దజీయరుస్వామివారు అవతరించి ఒక భారతదేశంలోనే కాక భరతఖండం నలుమూలలా మన విశిష్టాద్వైత సత్సంప్రదాయాన్ని కులమత భేదములు లేక స్త్రీ పురుషులందరూ సన్మార్గమున నడిచేటట్టు రాచబాటను ఏర్పరచారు.

ఆ సమయంలో ఆకులమన్నాడ చిలకమర్రి ఇంట వెంకటాచార్యులుగారు అలివేలుమంగ తాయారుగారిని పాణిగ్రహణం చేసి ఆ ఇంట కోడలిగా గృహప్రవేశం చేసారు. ఆ అమ్మ గృహిణిగా చక్కటి బాధ్యతలు నిర్వహిస్తూ ఆ భగవంతుడిని ఇలా కోరిందేమో అనిపిస్తుంది. ఆ రాముడిలాంటి కొడుకుని, పెద్దల బాటలో నడిచే తనయుడిని, దేవకీ యశోదమ్మలా ఆ చిన్నికృష్ణుని అల్లరి చేష్టలతో మురిసేలాగా పిల్లవాన్ని పెంచాలని కోరినట్లు.

ఇంకా ఇలా కూడా అనిపిస్తుంది నా ఈ చిన్ని బుర్రకు దేశరక్షణ కొరకు ఒక వీరుణ్ణి కనాలని(తయారుచేయాలని) వీరమాత కోరుకున్నట్లు, ధర్మ పరిరక్షణకు, సంప్రదాయ రక్షణకు తన తొలి సంతానాన్ని (చిన్నజీయరు స్వామివారిని) పెద్దస్వామివారివద్దకు పంపించారని , యుద్ధంలో పాల్గొనే ఒక సైనికుడు ముందుగా యుద్ధనైపుణ్యాన్ని తెలుసుకొని శిక్షణపొంది దేశరక్షణ కొరకు ఆ రంగంలో దిగుతాడు. అక్కడ గెలుపుఓటములు ఉండవచ్చు కాని మన అమ్మ దీవెనలతో , పెరియజీయరుస్వామి వారి శిక్షణతో అడుగువేసిన ఆ నారాయణుని పాదానికి గెలుపే కాని ఓటమి లేదు.

ఆ అమ్మ వారి సంతానం చిన్నగా ఉన్నప్పుడే వారి భర్త పరమపదించినను తన ఐదుగురి సంతానాన్ని ఎన్నో కష్టాలకు ఓర్చి పెంచి పెద్దచేసారు. తొలి సంతానం 25 సంవత్సరములున్నపుడే ధర్మ పరిరక్షణకొరకు సన్యాస స్వీకారం తీసుకుంటామన్నా మనస్ఫూర్తిగా అంగీకరించారు. వారే మన ఆచార్యులు శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామివారు.

అమ్మగారు ముందు రాజమండ్రిలో ఉన్నా, వసుమతిభాస్కరరావుగారు, శ్రీలతా భూపాల్ రెడ్డి గారు మొదలగు పెద్దలు దోమలగూడా జెట్‌లో అమ్మగారు వుండాలని స్వామివారిని ప్రార్థించారు. అమ్మగారు కూడా అతికష్టంమీద ఒప్పుకొని హైదరాబాద్ కి వచ్చి కొద్ది రోజులు జెట్‌లో వున్నారు. అక్కడ రామానుజం అనే మేనేజర్ గారు, వసుమతమ్మగారు బాగా శ్రద్ధతో అమ్మగారికి ఏమైనా అవవసరమున్నా, ఆరోగ్యవిషయమైనా చూసుకునేవారు. అమ్మగారు ఎప్పుడు ఎవరినీ ఇబ్బందిపెట్టేవారుకారు. ఏమైనా తీసుకువస్తామన్నా వద్దు అనేవారు. వారికి కంటి ఆపరేషన్ అయినపుడు కూడా వసుమతమ్మగారు ప్రక్కనే ఉండి

కల్తీలేనిది తల్లిపాలు.... కపటం లేనిది తల్లి ప్రేమ....



తీసుకొనివెళ్ళారు. స్వామివారు శ్రీరామనగర్ ఆశ్రమానికి వేంచేసినపుడు అక్కడికి వచ్చేవారు. ఎక్కడ ఉన్నా ఆరాధన, తళియ, పారాయణాదులు ముగించుకుని పెరుమాళ్ళ ఆరగింపు అయిన తరువాతనే అందరికీ ప్రసాదాలు పెట్టిన తరువాతనే వారు తీసుకొనెడివారు. ఆశ్రమంలో స్వామివారు ఏ సమయంలో వేంచేసినా వారికి దిష్టితీసి మంగళాశాసనాలు చేసేవారు.

ఈనాడు ఈ ప్రపంచం మొత్తం గొంతువిప్పి, జైశ్రీమన్నారాయణ అనే పలకరింపుతో విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ పూలబాటలో ఈ జీవులంతా ఆ పరమపద సోపానాన్ని అధిరోహించడానికి ఎక్సలేటర్ మీద ప్రయాణించేంత సులభంగా మనలను మన ధర్మాన్ని శాస్త్రాలను అర్థం చేసుకొనేటట్లు తీర్చిదిద్దుతున్న జగదాచార్యులను అందించిన అమ్మకు ఏమిచ్చిన ఈ ఋణం తీరుతుంది? అమ్మగారి చివరి 2 నెలలు ఈ దాసురాలు సేవించుకోలేదనే బాధ , ఏమీ ఎప్పుడూ చేయలేకపోయాననే పశ్చాత్తాపంతోఅశ్రునయనాలతో అంజలి ఘటించి పాదాభివందనం చేస్తూ........

❖❖❖❖❖❖

# సాక్షాత్తు నారాయణుని కన్న తల్లి

**శిరీష, దివ్యసాకేతం**

అమ్మతో 2012 నుండి పరిచయము. ప్రతిరోజూ సేవించుకోవడం అద్భుతంగా అనిపించేది. అమ్మగారు చాలా విషయాలు చెప్పడం, మాట్లాడటమూ మరచిపోలేను. పచ్చళ్ళుపెట్టడం , సంప్రదాయ విషయాలు ఎన్నో చెప్పేవారు. అమ్మగారు బదరికాశ్రమము చాతుర్మాస్య సమయములో ఉన్నపుడు అమ్మ చెప్పిన విషయం ఒకటి బాగా ఇష్టమైనది. బదరీనాథ్‌లో మంచుపడే సమయంలో కూడా అక్కడే ఉండే ఒక యోగినీ మాత, (బారహ్ మాస్ మాయి) మన అమ్మగారితో మాట్లాడిన సందర్భములో ఇలా అన్నారట "శ్రీచిన్న జీయర్‌స్వామివారిని నా కొడుకు అనుకుంటున్నావు కానీ, వారు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే" ఇలా చాలా అనుభూతులను మా గోష్ఠిలో చెప్పేవారు.

ఆగస్టు 21 ,2020 రోజున చివరిసారిగా అమ్మగారిని చూడడం, మాట్లాడడం. ఆగస్టు 15 న స్వామివారిని సేవించుకుని, మా పాప వివాహము నిశ్చయించుకుని, లగ్నపత్రికను నడిగడ్డపాలెంలో శ్రీస్వామివారికి చూపించి మంగళాశాసనములు చేపించుకుని వచ్చాము. తిరుగు ప్రయాణంలో ఆయుర్వేదపు మందు ఆశ్రమానికి తీసుకువెళ్ళమని అన్నారు. ఆ సమయమున శారదగారు కొన్ని అమ్మగారికి అందజేయమని ఇవ్వడం వలన పెళ్ళివిషయం తెలిపి మందు అందజేయడం కోసం అమ్మగారిని 21 న సేవించుకోవడానికి వెళ్ళాను. అమ్మగారు పండుకొని ఉన్నారు. కొద్దిసేపు వేచి ఉన్నాను. అంతలో కల్పనగారు, కృష్ణకుమారిగారు వచ్చారు.

అమ్మగారిని నవ్వించడానికి నేనే అన్నాను 'అమ్మా నేనే ముందు వచ్చి మీ పాదాల చెంత నిలిచి ఉన్నాను. నన్నే మొదట అనుగ్రహించాలి అని' అందరమూ నవ్వుకున్నాము. కల్పనగారు నన్ను అన్నారు మీరే మొదలువచ్చారు కదా మీరే మొదట పాదాలకు దాసోహములు చేసుకోమని వెంటనే అమ్మగారి పాదాలకు నా శిరస్సును ఆనించి మొక్కాను. తెలియని ఒక అద్భుతమైన అనుభూతి, ఆనందం కలిగింది. అమ్మగారితో స్వామివారు బాగున్నారని, నడిగడ్డపాలెం అంతా అందంగా మార్చారని, మా పాపకు వివాహం నిశ్చయమయినదని తెలిపాను. చాలా సంతోషించారు. నేను అన్నాను అమ్మగారితో మీరు నేను మాత్రమే లేము ఆశ్రమములో. కల్పనగారు మిగతావారంతా ఆశ్రమములోనే ఉన్నారు. మనం స్వామివారు రాగానే వెంటనే వెళ్ళి అక్కడే ఉందాము. తాయారుగారిని, గోదమ్మగారితో పాటుగా వెళ్దాం అని. కాని అదే చివరిసారి చూడడం అని అనుకోలేదు. అమ్మ ఎప్పటికీ ఆచార్యతిరువడి చేరువలోనే ఉంటారు. అమ్మ అందరినీ ఎప్పుడూ అనుగ్రహిస్తూనే ఉంటారు. ఇంతటి అద్భుతమైన అమ్మ అంతటి అద్భుతమైన స్వామిని కలిగిన మన జన్మ ధన్యం.

❖❖❖❖❖❖







జీవా మరియు దివ్యసాకేత కుటుంబసభ్యులతో...!



శ్రీ చిన్న జీయరు స్వామివారి షష్ట్యబ్ది మహోత్సవములో  మాతృవరివస్య సందర్భముగా  అమ్మ గారికి పాదపూజ



# స్మితపూర్వాభిభాషి

### విజయలక్ష్మి దిట్టకవి, గోపీ స్వామి తల్లిగారు



స్వామి వారి పాద పద్మములకు నమస్కరిస్తూ..

స్వామి వారి మాతృ మూర్తి గారితో ఉన్న సాన్నిహిత్యం గురించి వ్రాయటం మహద్భాగ్యంగా భావిస్తూ......

ఆశ్రమములో కనపడినపుడల్ల పిల్లలు బాగున్నారా అంటూ చిరునవ్వుతో ఉన్న పలకరింపు, ప్రవచనాలకు రావటంలేదే అని కళ్ళతో చెప్పే మందలింపు ఎప్పుడు మరువలేనివి.

**ఓపిక వున్నంత వరకు మన పని మనమే చేసుకోవాలి అనే ఆవిడ నిబద్ధత మరియు సంప్రదాయం మీద వారికి ఉన్న శ్రద్ధ మాలాంటివారికి ఎప్పుడూ ఆదర్శ ప్రాయము.** ఎక్కడ ఎదురుపడినా "పూర్వ భాషీ చ రాఘవః" అన్నట్టు అమ్మగారే ముందుగా పలకరించేవారు.

అలాంటి అమ్మ గారు పరమపదించారు అనే వార్త వినగానే చాలా విచారం కలిగింది. కోటానుకోట్ల నక్షత్రాల కన్నా ఒక చంద్రుడు చాలు అన్న చందాన జగదోద్ధరణకు మనందరికీ స్వామిని అందించిన వారి త్యాగం కడు శ్లాఘనీయం.

స్వామి వారి సేవా భాగ్యాన్ని ఎల్లపుడూ మాకు కూడా కలగచేయాలని ఆ మాతృమూర్తి పాదపద్మములకు నమస్కరిస్తూ... ఆచార్య దివ్య తిరువడిగళే శరణం.

# వర్ధతాం అభివర్ధతాం



### ముదుంబై సీతా పిరాట్టి, చిన్నమధుస్వామి తల్లిగారు

మన ఆచార్యులకు భగవద్బంధువులకు దాసోహాలు సమర్పిస్తూ దాసురాలు అయిన నేను నా జ్ఞాపకాన్ని మీ అందరిముందు ఉంచుతున్నాను. మాతృమూర్తి అయిన మన అలివేలుమంగ తాయారు గారు పరమపదం చేరడం చాలా కలతగావుంది. వారితో నా అనుభవం చాలా దగ్గరగా ఉండేది. ఆచార్యులవద్ద జరిగే సాంస్కృతిక కార్యక్రమాల గురించి ఆ కార్యక్రమాలలో మన భావన ఎలా ఉండాలి మనం చేయగలిగినది ఏమిటి అనే విషయాలను మాతో పంచుకునేవారు.

**ప్రతివారిని మన అని అనుకుంటే అంతా మనమే ఉంటాం ఏదైనా అందరమూ కలిసి చేద్దాం అని చెపుతూవుండేవారు.** అయితే స్వామివారు రామానుజ సహస్రాబ్ది గురించి మాట్లాడుతూ ఈ కార్యక్రమం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది అని చెప్పారు. దానికి అమ్మగారు రాబోయే తరాలకే కాదు యావచ్చంద్ర దివాకరౌ సూర్యచంద్రాదులు ఉన్నంత వరకూ రామానుజ సంప్రదాయం దేదీప్యమానం అవుతుంది. వర్ధతాం అభివర్ధతాం అని వారి మంగళాశాసనము.

**అరమరికలు లేక అందరినీ అక్కున చేర్చుకునేది అమ్మ ప్రేమ!**



# త్వం మాతా సర్వలోకానాం...

రుక్మాబాయి, ఉష(శ్రీ మాతృమూర్తి



***అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ చాలబె***
***ద్దమ్మ సురారులమ్మ కడుపారడి బుచ్చినయమ్మ దన్నులో***
***నమ్మినవేల్పుటమ్మల మనమ్ములనుండెడియమ్మ దుర్గ మా***
***యమ్మ కృపాబ్ధియిచ్చుత మహత్వకవిత్వపటుత్వసంపదల్.***

అమ్మగారితో అనుభవంకంటే అనుభూతియే ఎక్కువ. ఒకే (రాజమహేంద్రి) గ్రామవాసులమైనప్పటికీ అమ్మగారితో వారి కుటుంబసభ్యులలో చాలమందితో ముఖపరిచయమేగాని వారితో సన్నిహిత సంబంధము చాల తక్కువ. అయినా ప్రసన్నాక్షి అయిన అమ్మగారిలో నేను లోకమాతలైన సరస్వతి లక్ష్మి పార్వతి ముగ్గురమ్మల దివ్యత్వమును దర్శించుకున్నాను. ఆమె జ్ఞానసరస్వతి. రాజమహేంద్రిలోని వారింటికి వెళ్ళినపుడు వారిదగ్గరవున్న ఎన్నో వైష్ణవ గ్రంథములను నాకు చూపించారు. వాటిని సర్దిపెట్టుకోవడం పెద్ద వయసు కావడం వలన కొంచెము కష్టముగా, ఇబ్బందిగ ఉండేది. అయినా ఇంకా కొన్ని గ్రంథాలు చదువుకోవడానికి తీసుకు వెళ్ళినవారు తిరిగి ఇవ్వలేదని బాధపడ్డారు. ఆమె స్వహస్తాలతో వ్రాసుకున్న పాటల పుస్తకం ఎప్పుడూ వారి దగ్గరనే ఉంచుకుని తీరిక వేళలో పాడుకుంటూ ఉండేవారు. మధురమైన సన్నని కంఠముతో ఆమె పాడే భక్తిరసవత్తరమైన పాటలు శ్రోతలను ముగ్ధులను చేసేవి. అమ్మగారు పాడుతూ ఉంటే భక్తులు ఒళ్ళంతా చెవులు చేసుకుని వినేవారు. ఆచార్యమేఘుమా! కరుణవాన కురియుమా! అని వారు పాడే పాట ఇప్పటికీ అందరి చెవులలో మారుమ్రోగడమే కాక అందరినోటా నానుతూనే ఉంటుంది.

శ్రీ పరాశర భట్టరువారు శ్రీగుణరత్నకోశమునందు ఉటంకించినట్లు **ఆమె లక్ష్మీ స్వరూపిణి, మంజుభాషిణి, శ్రీదేవియొక్క సహనము, దయ, ఆశ్రితవాత్సల్యము, కరుణ మృదుహృదయము, ఔదార్యము మొదలగు గుణరత్నములు ఆమెలో మెండుగా ఉన్నాయి.** లక్ష్మీదేవి వలె అందరకు ఆశ్రయించదగినవారు. క్షీరసాగరమును, పరమపదమును వదిలి భక్తులను రక్షించుటకు శ్రీరంగమున ఉన్న రంగనాయకి మాతవలె స్వగ్రామమైన రాజమహేంద్రవరమును, అత్తవారి ఊరైన ఆర్తమూరును వదిలి ఏ అర్హత లేని మా వంటివారిపై వారి అనుగ్రహమును కురిపిస్తూ శంషాబాద్ శ్రీ దివ్యసాకేత ఆశ్రమమందు వారి వానప్రస్థాశ్రమ జీవితమును గడపడం, ఆ సమయమును వారికి సన్నిహితముగ కొంతసమయం గడపడం, సంభాషించడం, ప్రతిదినమువారి పాదపద్మములకు నమస్కరించగలగడం నిజంగా నా అదృష్టము, భాగ్యము.

ఇక అమ్మగారిలోని మూడవ లోకమాత పార్వతీదేవి. సముద్రమథనసమయంలో ఉద్భవించిన గరళమును పానముచేయడానికి తన అంగీకారమును ఒసగిన ఆలోకమాత మాంగళ్యగౌరివలె జగదానందహేతువైన శ్రీస్వామివారిని కుటుంబబాధ్యతలను స్వీకరించవలసిన తన పెద్దకుమారుణ్ణి, లోకసహజమైన ధోరణిలో కాక భగవత్, భాగవత, ఆచార్యులసేవలో మార్గనిర్దేశం చేయడమే కాక శ్రీస్వామివారిని సన్యసించడానికి అనుమతించడంలో ఆ తల్లి హృదయంలోని భగవంతునిపై దృఢవిశ్వాసము, లోకహితకాంక్ష ప్రశంసించదగినవి. నమస్కరించదగినవి. భగవంతునిపట్ల, ఆచార్యులపట్ల వారి విశ్వాసము సదా మాకు ఆచరణీయము.

మాబోటివారిపట్ల వారి ఔదార్యము, ప్రేమ, వాత్సల్యము ఎన్నటికీ మరువరానివి. శ్రీశ్రీశ్రీ స్వామివారివంటి ఆచార్యులను గురువులను మాకందించిన ఆ తల్లి కృపకు మా శతకోటిధన్యవాదములు. ఆ మాతృమూర్తి శుభాశీస్సులు మాపై ఎల్లవేళలా ప్రసరిస్తూ ఉండాలని ఆకాంక్షతో...

**బిడ్డ పలికే కొత్త కొత్త మాటలకు అర్థాలు కూర్చే నిఘంటువు అమ్మ**



# స్నేహశీలి

సముద్రాల సూర్యకుమారి
శ్రీరంగరామానుజాచార్యస్వామి, ధర్మపత్ని



జీవ వైదిక సంశోధన ప్రకాశన విభాగానికి అన్నీ తానై వ్యవహరిస్తున్న ఉభయ వేదాంత ప్రవర్తకులు సముద్రాల రంగ రామానుజ ఆచార్య స్వామి వారి సతీమణి శ్రీమతి సముద్రాల సూర్యకుమారి గారి మాటలలో అమ్మగారితో అనుభవాలు వ్యాసం.....

మా వారు పదవీ విరమణ చేశాక రాజమహేంద్రవరం నుండి మేము నేరుగా జీవా ఆశ్రమానికి వచ్చాము. ఇక్కడికి వచ్చాక మాకు ఇచ్చిన గృహ సముదాయములోనే శ్రీ శ్రీ శ్రీ జీయర్ స్వామి వారి అమ్మగారు వేంచేసి ఉన్నారు. మేము ఇక్కడికి వచ్చాక అమ్మగారితో కలిసి మెలిసి ఉండటం, ప్రతినిత్యం కలిసి దేవాలయానికి వెళ్ళడం, అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తున్నది. శ్రావణ మాస ఉత్సవాల్లో ఆళ్వారాచార్య ఉత్సవాల్లో అమ్మ గారితో కలిసి మేమూ స్తోత్రాలు పారాయణాదులు చేస్తూ ఉండేవారం.

శ్రీ జీయర్ స్వామి వారు కల్పన చేసిన సమతా మూర్తి విగ్రహం ప్రతిష్ఠాపన మహోత్సవానికి పెద్దలంతా వేంచేసి కార్యక్రమాన్ని వైభవం గావించాలనీ, రామానుజ వైభవం నలుదిశలా వ్యాప్తి చెందాలని అమ్మగారితో మాట్లాడుతున్నప్పుడు చెప్తూ ఉండేవారు. వారి కనులతో సేవించాలని చాలా ఉబలాట పడేవారు.

పెరుమాళ్ళ దగ్గర తీర్థగోష్ఠి అయ్యాక అమ్మగారు జోల పాటలు ఆచార్యులను స్మరిస్తూ హృద్యంగా పాటలు పాడుతూ ఉండేవారు. అమ్మవారి పాటలు చాలా సుతిమెత్తగా మనసును తాకేవి. వారికి మాత్రమే అంకితమైన ఆ గొంతుక అపురూపమైనది. ఒక సారి వింటే మరి ఇక మరిచిపోలేము అంటే అతిశయోక్తి కాదు.

ఉదయము సాయంకాలం వారు ఎప్పుడూ వారి గృహంలో పారాయణాదుల్లోనే ఉంటూ ఉండేవారు ఇక మాకు మాట్లాడుకోవడానికి దొరికే సమయం మధ్యాహ్నం మాత్రమే.

ఆ సమయంలో కలిసి కూర్చొని లౌకిక విషయాలను సరదాగా నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ ఆహ్లాదంగా గడిపే వారం. లాక్ డౌన్ ప్రారంభానికి మునుపు వారు హైదరాబాద్ వెళ్లారు సుమారు 4 నెలల క్రితం అప్పుడే వారితో నేను మాట్లాడడం జరిగింది.

ఇక మళ్లీ వారితో ఫోన్ లో మాట్లాడటం కూడా కుదరలేదు. ఆఖరి సారి మాట్లాడలేకపోయాను అనే బాధ చాలా మిగిలిపోయి ఉంది. వారికి ఆ పరమపదంలో శాశ్వత కైంకర్యం లభించాలని లక్ష్మీపతిని ప్రార్థిస్తున్నాము.

❖❖❖❖❖❖

ప్రేమకు అర్థం కావాలా? వెతకవల్సింది నిఘంటువు కాదు అమ్మ ముఖం.



# స్నేహశీలికి కన్నీటి వీడ్కోలు

**పద్మ, అమ్మగారి స్నేహితురాలు, దోమలగూడ**



ఆచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి వారి తల్లి గారు, పూజ్యురాలు, శ్రీమతి అలమేలుమంగ గారు పరమపదించిన వార్త విన్న నాకు దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. ఆవిడతో నాకు గల స్నేహం ఈనాటిది కాదు. 35 సంవత్సరాల క్రితం శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి గారి తిరునక్షత్ర మహోత్సవంలో మొదటి సారి కలిసాము. ఆనాటి నుంచి ఈనాటి వరకు మా స్నేహం గట్టిగా బలపడుతూ వచ్చింది. తరుచుగా కలుసుకోవడం, మాట్లాడడం జరుగుతూ ఉండేది. **ఆవిడ చాలా నెమ్మదిగా, మృదువుగా మాట్లాడే వ్యక్తి. ఏ సేవా కార్యక్రమాలు చేయాలి అన్నా ముందు ఉండేవారు. ఆవిడ స్వభావం స్వతసిద్ధమైనది, కోమలమైనది. శ్రావ్యమైన గొంతుతో ప్రతి సభలో భక్తి పాటలు,భజనలు పాడి అందరిని అలరించేవారు.**

మాతృమూర్తిగా అమ్మగారు చేసిన త్యాగం లోకానికి ఎంతో ఉపకారమైనది. సనాతన ధర్మాన్ని ముందుకి నడిపించడానికి పూజ్యులు శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి అడుగు జాడలలో సన్యాసాశ్రమం స్వీకరించడానికి తన కన్న కొడుకుని త్యాగం చేయడానికి ఏ మాత్రం వెనకాడలేదు. ఈ ధర్మము జాతి కులాలకు అతీతమైనది.

అమ్మ గారి మరణం వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. ఆవిడ శ్రీమన్నారాయణుని వైకుంఠానికి చేరి, పైనుండి అందరినీ ఆశీర్వదించాలని మనస్పూర్తిగా ప్రార్థిస్తున్నాను.



# మృదు మధుర భాషి

**కె.వి.యస్. సుబ్బలక్ష్మి, శ్రీపాద సుబ్రహ్మణ్యం, ప్రపన్నవైశారదీ తల్లిదండ్రులు**

శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి మాతృమూర్తి తిరుక్కావేరి సమానురాలైన అలివేలు మంగతాయారుగారు పరమపదించారనే వార్త వినగానే మనస్సంతా శోకసంతప్తమయినది. ఆమెను దర్శించినప్పుడల్లా చిరునగవుతో పలకరించేవారు. మృదుమధురముగా ఆత్మీయంగా మాట్లాడేవారు. ఒకసారి ఆర్తమూరులో జరిగిన కార్యక్రమానికి మేము వెళ్ళినప్పుడు శ్రీశ్రీశ్రీ స్వామివారు జన్మించిన ప్రదేశాన్ని చూపించి ఆనాటి విషయాలు వివరించారు. పిట్టలవానిపాలెంలో శ్రీరామునికి సహస్రకలశాభిషేకం జరిగినప్పుడు ఆమెతో కలసి ప్రయాణించే సమయంలో ఎన్నో మంచి విషయాలు తెలియజేశారు. శ్రీశ్రీశ్రీ స్వామివారికి జన్మనిచ్చిన ఆతల్లి జన్మ ధన్యం. **ఆ దరహాస సుందరరూపము, మధుర కంఠస్వరము మా హృదయాలలో సదా నిలచియుంటుంది.**

ఈ ప్రపంచం మనల్ని చూడకముందే ప్రేమించే ఒకే ఒక స్త్రీఅమ్మ.



# సుగుణాలరాశి - సాధ్వీమణి

**రామానుజమ్మ**



అమెరికాలో ఉన్న నాకు ఆనాడు 11వ తేది మధ్యాహ్నం తాయారు గారి వద్దనుండి మెసేజ్ వచ్చింది. అమ్మగారు ఆచార్య తిరువడి చేరారని. పిడుగులాంటి వార్త. కాసేపు పట్టింది యధార్థం మనస్సుకి పట్టటానికి. ఒక నాలుగు దినాలు మనస్సు పిండివేసేబాధ, అర్థంకాని వేదన. ఊహించలేదేమో తట్టుకోవటం చాలా కష్టం అయిపోయింది. కారణం-మనస్సులోని ఒక గాఢనమ్మకం. అమ్మగారికి ప్రీతిపాత్రమైన రామానుజుల ప్రతిష్ఠ తను ప్రక్కనుండి చేయిస్తారని. మన దురదృష్టం మన అందరి అమ్మగారు, అలివేలు మంగతాయారుగారు. యామునమునుల సమానులు అయిన మన పెద్ద జీయ్యరు స్వామివారికి (పూర్వాశ్రమంలో) కోడలుగా, సేవా నిరతియే ధర్మంగా గల ఒక వైద్యుని ఇల్లాలుగా, అపర రామానుజులైన మన చిన్న జీయరుస్వామివారిని నవమాసములు మోసి జన్మనిచ్చిన మాతృమూర్తిగా మహోన్నతురాలుగా, మన అమ్మగారు సుపరిచితులు. వారి భాగ్యమే భాగ్యము. **కాంతిమతివలె ఈ పుడమిపై జన్మనెత్తిన మహాసాధ్వి.**

పిల్లపాపలతో సజావుగా గడిచి పోతున్న వారి జీవితం, వారి భర్త అకాల మరణంతో అంధకార బంధురమైంది. అయిదుగురు పిల్లలకు తల్లిగ అమ్మగారు ఒంటరి అయిపోయారు. చిన్న వయస్సు, కన్ను చెదిరే అందం, ఆస్తులన్నీ సమాజసేవలో కరిగిపోయిన వేళ, పక్వతలేని సమాజం. ఆ పరిస్థితులలో **ఒంటరిగా సంసారనౌకని సజావుగా నడిపిన ప్రేమమూర్తి, ధైర్యశాలి** అమ్మ. ఎటువంటి దారుణ పరిస్థితులలో గూడా ధైర్యాన్ని కోల్పోలేదు. స్థైర్యం సడలనీయలేదు. **అంతులేని ఆత్మవిశ్వాసం. అత్యంత ఆత్మాభిమానం ఎవ్వరి వద్ద చెయ్యిచాచని స్వభావం.** ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారో వారికే ఎరుక. **నిరుత్సాహాన్ని, నీరసాన్ని దరిచేరనీయలేదు.** ఒక్కటే ధ్యేయం. పిల్లలని జాగ్రత్తగా పెంచి పెద్దచేయాలి. మంచి వ్యక్తిత్వముతో తీర్చిదిద్దాలి. **క్లిష్టమైన బాధ్యత వారి కనుల ముందు. మనస్సులో ఓర్పు సాహసాలు ఆచార్యుల మీద అంతులేని నమ్మకం, భగవత్స్మరణే వారి బలం, స్ఫూర్తి. అకుంఠిత దీక్షతో** ముందుకు నడిచారు. ఆసమయంలో పెద్ద జీయర్‌స్వామివారు పరమపదం చేరారు. ఆశ్రమం స్వీకరించి, మహోన్నతమైన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించగల సమర్థులు చిన్న స్వామివారిగా పెద్దల నిర్ణయం అయింది. అమ్మ అనుమతి ఒక్కటే తక్కువ. **తమ పరిస్థితిని ఏ మాత్రం ఆలోచించకుండా, స్థిరచిత్తంతో చేతికి అంది వచ్చిన కుమారుణ్ణి తురీయాశ్రమానికి అప్పగించారు. అదీ మార్గనిర్దేశం చేస్తూ, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ, ఆచార్యుని బాటలో నడుస్తూ, వారి ఆశయాలు నెరవేరుస్తూ, రామానుజ వైభవాన్ని ప్రపంచమంతా చాటాలని, ఆశీర్వదిస్తూ, ఆశిస్తూ, సూచిస్తూ...**

ఆనాటి సుమిత్రాదేవి లక్ష్మణస్వామిని రామునిసేవకి సమర్పించి, కర్తవ్యాన్ని బోధించి, ఆనందంగా పంపినట్టు! **ఏతల్లి చేయగలదు అంతటి సాహసం? అంత నిస్స్వార్థ నిర్ణయం.** ఒకప్రక్క తమకుమారుని సామర్థ్యం మీద, తమ పెంపకం



మీద నమ్మకం, మరొక ప్రక్క రామానుజ సంప్రదాయం మీద తమ ఆచార్యుల మీద అచంచల విశ్వాసం, నిష్ఠ–ఇవి మనకి మన ఆచార్యులని ప్రసాదించాయి.

ఆసమయంలో ఆశ్రమంద్వారా పిల్లల చదువులకై కొంత ఆర్థిక సహాయం అందించగా అమ్మగారు చాలా సున్నితంగా తిరస్కరించి వెనుపంపారు. ఎవరు ఎంత నచ్చ చెప్పినా, ఒక్కరూపాయి కూడా ముట్టలేదు. అదివారి **ఆత్మాభిమానం, ఆత్మనిర్భరత,** ఎవరి వద్దనుండి ఏమీ ఆశించగూడదని, అదీ కుమారుని సమర్పించిన ఆశ్రమం నుండి స్వీకరించడం వారికి భరింపరాని విషయమైంది. **ఆచార్యులపట్ల వారి నమ్మకం, భక్తి** అన్నీ సజావుగా నడిచిపోయేలా చేసింది.

వారితో ఎన్నో సంవత్సరాల అనుబంధం నాకు. భగవదనుగ్రహమూ, నా అదృష్టమూ. చాలాకాలం ఆశ్రమంలో వారితో కలిసి జీవించే భాగ్యం కలిగింది శంషాబాద్‌లో. అప్పుడు అమ్మగారితో ఇంకా చనువు పెరిగింది. ఆశ్రమంలో లేనప్పుడు వారి ఇంటిలో కూడా కలుస్తూ ఉండేదాన్ని. కలిసి కార్యక్రమాలలో పాల్గొనటం, దేవాలయాలకి వెళ్ళటం. కలిసి సాపాటు చేయటం, సత్కాలక్షేపం, వారి కీర్తనలు వినటం ఇలా దివ్యంగా జరిగేది దినచర్య, **వారి సమక్షంలో మనస్సుకి ఒక శాంతి, ఒక ధైర్యం, ఒక అలౌకిక ఆనందం** కలిగేవి. ఏకాంతముగా నున్నప్పుడు 'అమ్మా' అని పిలుచుకునేదాన్ని. అలా పిలవటంలో ఒక దగ్గరతనం తృప్తి కలిగేది.

**అమ్మగారిది దివ్యమంగళవిగ్రహం. మేలిమి బంగారు ఛాయతో వైష్ణవ కట్టు పట్టుచీరలో నిండుగా నడుస్తుంటే చూపరులు తలవంచి నమోవాకాలు అర్పించవలసిందే!** వారు చల్లని చూపులతో, చిరునవ్వుతో అందర్ని పలుకరిస్తూ మనస్సులు అలరించేలా దేవాలయమునకు వెళ్తూంటే అందరి మనస్సుల్లో పన్నీటి జల్లులు కురిసేవి.

**ఎంత దయో అమ్మగారికి!** గుడిలోంచి వస్తూ, వారికి ఇచ్చిన పెరుమాళ్ళ ప్రసాదం దొప్పను తోవలో నుంచుని ఉన్న వాచ్‌మెన్ చేతిలో పెట్టి తినమనేవాళ్ళు. మాతో 'పాపం ఎండలో నుంచుని డ్యూటీ చేస్తున్నాడు' అనేవారు. అమ్మ హృదయం.

తమ పని తామే చేసుకొనేవారు. తమ వస్త్రాలు ఆరవేసుకోవటం, పెరుమాళ్ళకి ప్రసాదం, పాత్రల శుభ్రం, ఇంటిముందు ముగ్గు– **మన పనికి ఎవరిమీద ఆధారపడకూడదు అనేవారు.** వారి అలవాటు, నిరాడంబర జీవితం వారికి ఇష్టం.

చాలా **నియమబద్ధమైన దినచర్య.** ఉదయమే లేచి ఇల్లు శుభ్రం చేసికొని, స్నానంచేసి, చక్కగ బొట్టుపెట్టుకొని పూజలోకి వెళ్ళేవారు. **పూజ, పారాయణలు అయ్యేవరకు మంచితీర్థం కూడా స్వీకరించేవారుకాదు.** ఎంత నీరసంగా ఉన్నా, ఏ పారాయణలు తగ్గించేవారుకాదు. పెరుమాళ్ళ తీర్థం తీసుకొనే వరకు ఏమీ ముట్టుకోకూడదని వారిమతం. చివరి వరకు అలానే గడిపారు.

ఎప్పుడు వెళ్ళినా ప్రసాదం తీసుకొని వెళ్ళండి అనేవారు. **చల్లని చూపుతో, ఆదరంతో ఏదో పెడితే గాని తృప్తిచెందని మనస్సు అమ్మగారిది.**

ఒకసారి, మావారు దివంగతులయ్యాక, అమ్మగారితో మాట్లాడుతూ... "అమ్మగారూ! మా అమ్మగారు ఎప్పుడు ఖర్చులు జాగ్రత్తగా చూసుకో! డబ్బులేకపోతే ముందు జీవితం గడవాలికదా! ఇంకా చిన్న వయస్సు అని అంటారు, ఏమిటో" అని చెప్పేను. వెంటనే **అమ్మగారు "నన్ను నా ఆచార్యులే చూసుకొంటారని చెప్పండి. ఈ మానవ మాత్రులమీద ఏం ఆధారపడక్కరలేదు" అని గట్టిగా నొక్కిచెప్పారు. "నేను అదే నమ్ముతాను. ఎవరూ ఏం చేయాలి?" అన్నారు. ఆవిడ చెప్పిన తీరు, ఆ నమ్మకం నిండిన ఆ మనస్సు నించి వచ్చిన ఆ మాటలు నాలో చాలా ధైర్యం నింపాయి. అంతలా ఆమాటలు ప్రభావితం చేసాయంటే కారణం త్రికరణ శుద్ధిగా నమ్మి ఆచరించే వ్యక్తి గనుక.** ఇప్పటికీ చెవులలో ఆ మాటలు వినిపిస్తున్నట్లే ఉంటుంది.



వారి **మాటలు తేనెల మూటలు.** వారి సమక్షంలో ఒక ప్రశాంతత, ఒక నెమ్మది, ఒక స్థైర్యం కలిగేవి. వారిచేతి ప్రసాదం చాలాసార్లు తినే భాగ్యం కల్గింది. కొసరి కొసరి వడ్డించటంలో అమ్మగారు అమ్మలగన్న అమ్మ. వారి శరీరంలో అస్వస్థతగా ఉంటే ఒకసారి వారి పెరుమాళ్ళకి తిరుమంజన సేవచేసే అదృష్టానికి నోచుకున్నాను.

**మృదుమధురమైన గాత్రం, స్వరం అమ్మగారిది.** వారు ఆచార్యుల మీద, గోదమ్మమీద, ఆళ్వార్లమీద, పెరుమాళ్ళ మీద పాడే పాటలు తియ్యగా అలౌకిక లోకాల్లో నివాళులు అర్పిస్తున్నట్టు భావన కల్గేది. అంత భక్తిమయంగా ఉండేవి. 80 సం॥లకి కూడా ఏమార్పు లేని గాత్రం.

**వారి జీవిత పుస్తకంలో నేర్చుకోవలసిన పాఠాలు ఎన్నో! నీతులు ఎన్నో!**

వారికి **దేనిమీద ఆశలేదు.** అంత **లోకవిఖ్యాతి గాంచిన స్వామి వారి తల్లి అయి ఉండి కూడా, అంత నిరాడంబర జీవితం గడిపేవారు.** ఆశ్చర్యం! నియమిస్తే ఏమి కావాలంటే అవి ఏర్పాటు అయి వుండేది. కాని వారు తమ నియమములను ఎప్పుడూ సడలించుకోలేదు.

ఏకార్యక్రమంలో అయినా వారుంటే నిండు. యజ్ఞయాగాల్లో వారుంటే అందరికీ తృప్తి, వారి ఆశీర్వచనములు అచ్చటి వారందరిపైనా ప్రసరింపచేసేవారు.

వారు మనమధ్య శారీరకంగా కరువైపోవటం మన దురదృష్టం. భగవదాజ్ఞకి తలవంచి, అమ్మగారి ఆశీస్సులు మనందరిపై వర్షిస్తూ మనని మరింత స్ఫూర్తితో ఆచార్య సేవలో పాల్గొని రామానుజ స్వామి దివ్యకీర్తిని వ్యాపింపచేసేలా చేయాలని ప్రార్థిస్తూ..

దాసోహములు అమ్మా!..

# రసరమ్యం - అమ్మగానం

**శ్రీమతి వంగీపురం వేంకట రాజ్యలక్ష్మి**



అమ్మగారి గాన మాధుర్యంలో ఓలలాడని భక్తులు లేరు. వారి గళం సుమధురం. వీణ మీటుతున్నట్లున్న మధురాతిమధుర ధ్వని భగవద్దత్తం. రసరమ్యం ఆ గానం ఆధ్యాత్మిక ప్రవాహం. భక్తి పారవశ్యంతో హృదయం పులకించేటట్లు ఆచార్యమేఘమా అనే ఆచార్యస్తుతిని ఆలపిస్తూంటే ఆబాలగోపాలం పాటకు పరవశమవ్వవలసిందే. కోయిల కూజితంతో సాటివచ్చే అమ్మగారి గానం కర్ణపేయం.

**శ్రుతి, లయ, ఆలాపనలతో పాటు భావాన్ని, భక్తిని సమపాళ్ళలో వ్యక్తీకరించేటట్లు పాడేవారు. మొక్కుబడిగా పాడకుండా దైవచింతనలో లీనమవుతూ వీనుల విందుగా ఆలపించేవారు. మన మనస్సులను పరవశింపచేస్తూ ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తుతూ వారి గళం ఎప్పటికి మారుమ్రోగుతూనే ఉంటుంది.**

ప్రేమ స్వరూపులు, కరుణా స్వభావులు, ఆదర్శ మాతృమూర్తులు మన అమ్మగారు. సర్వదా సర్వథా ప్రాతఃస్మరణీయులు. ఆచార్యసేవలో ప్రొద్దుపుచ్చిన అమ్మగారు ఈనాడు మనమధ్య లేకపోయినా వారి జ్ఞాపకాల అనుభవాలు మనను ఎప్పటికి విడిపోవు. అదే వారి పరిపూర్ణ వ్యక్తిత్వం.

ఆచార్య కృపతో మేఘాలు లేని నీలాకాశంలో ఎగిరే పక్షిలా ఆనందంగా భగవతత్వాన్ని గానం చేస్తూ నిత్య కైంకర్యం చేశారు. చేస్తూ....... ఉన్నారు పరమపదంలో. ధన్యజీవులయ్యారు అమ్మగారు.

**అమితమైన ప్రేమ అమ్మ... అంతులేని అనురాగం అమ్మ**



# విద్వన్మణి

శ్రీమతి కరుణ రామానుజదాసి, విజయవాడ.

యోగినామేవ కులే భవతి ధీమతామ్ ।
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥     (భగవద్గీత 6-42)

''యోగి తానాచరించిన యోగ మహిమచే స్వయముగ యోగము నాచరించునట్టియు పరులకు యోగమునుపదేశింపజాలి నట్టియు బుద్ధిమంతుల యింట బుట్టుచున్నాడు. ఇట్టి జన్మ  ఇతర సామాన్య ప్రజలకు దుర్లభము''.

మన ఆచార్యుల విషయంలో ఇది ప్రత్యక్షము. వారికి జన్మనిచ్చిన మాతృమూర్తిని భగవంతుడు ఎంత నేర్పుగ ఎంపిక చేసి వుంటాడో గద! అమ్మగారు గొప్ప సదాచారవంతులు. విద్వన్మణి. వారికి బాహ్య సౌందర్యమే కాదు అంతః సౌందర్యము ఇంకా అధికము. ఏ పని చేసిన నిర్వ్యాజముగ, నిరంజనముగ చేసేవారు. అయినా నిగర్వి. ఎవ్వరితోనైనా యిట్టే కలిసిపోయి మాట్లాడేవారు. వారితో మాకున్న అనుభవాలు ఎన్నో అవన్నీ మాకు మధురమైన జ్ఞాపకాలు. వారితో కలసి, వారి ఆలోచనలు కొన్నైనా పంచుకో గలిగిన మేము అదృష్టవంతులము. వారు నిష్కపటి. వారు ఎన్నో విషయాలలో నాకు, హరి, విష్ణు, నీళలకు దిశానిర్దేశం చేశారు. శ్రీశ్రీశ్రీస్వామి వారిపై వారి ప్రేమ అపురూపము. వారిని చూచి లోలోన అమితంగా సంతోషించినా ఎన్నడూ పొగడేవారు కాదు. మా వద్ద కూడ.

వారికి ఏ దోషము అంటకూడదనేమో!

వారు తిరుమంత్రార్థము కొద్దికాలం శ్రీశ్రీశ్రీ స్వామి వారి వద్ద సేవించారు. ఆ దృశ్యము కమనీయము. ఆచార్యులు ప్రశ్నిస్తే ఆ ప్రశ్న పూర్తవుతూనే వారు జవాబు చెప్పేవారు. ప్రశ్నలు ఎంత త్వరితంగా అడిగితే జవాబులు యింకా త్వరితంగా చెప్పేసి నవ్వేవారు. ఆ దృశ్యం మాకు ఆనందకరంగ ఉండేది.

శ్రీపరాశరభట్టరు వారి మాతృమూర్తి ఆండాళమ్మ గారు తీర్థ గోష్ఠికి వచ్చినప్పుడు వారికి నమస్కరించి తీర్థం తీసుకునేవారట. అక్కడున్నవారు "వారు మీ పుత్రులు మీరు నమస్కరించతగునా?" అని అడిగారట! అందుకు ఆండాళమ్మ గారు ''నా కుమారునికన్నా ముందు వారు జగద్గురువులు కద! అందుకే వారికి నమస్కరించి తీసుకుంటున్నా''ని బదులిచ్చారట. అమ్మ గారు కూడ ఇందుకు భిన్నంకాదు. వారు సర్వదా శ్రీశ్రీశ్రీ స్వామివారిలో తమ పుత్రునికన్నా జగద్గురువునే వీక్షించారు. అదే వారికి ఆశీర్వచనమై జగద్గురువులైనారు.

సర్వోత్కృష్టులైన ఆచార్యులను మాకు లభింపజేసిన అమ్మగారికి మేము సర్వదా కృతజ్ఞులము.



# ఏక స్వాదు న భుంజీథ

బూరుగడ్డ మంజుల
అహోబిలస్వామి పూర్వాశ్రమంలో సోదరి



అమ్మగారిని ఎప్పుడూ సామాజిక మాధ్యమాల ద్వారా వీక్షించడమేకాని 2010 వరకూ దాసురాలు ఎప్పుడూ ప్రత్యక్షంగా చూడలేదు 2011 లో సూర్యనారాయణగారి ఇంట్లో ఒక కార్యక్రమములో అమ్మగారిని సేవించుకోగలిగాము. చూడగానే చెప్పలేని ఆనందంతో అమ్మగారి దగ్గరకువెళ్ళి మా కుటుంబాన్ని పరిచయం చేసుకున్నాము. అమ్మగారు మా కుటుంబాన్ని ఎంతో ఆప్యాయంగా ఆదరించారు. అప్పటినుండి ఇప్పటివరకూ అమ్మగారితో అనుబంధం కొనసాగుతూనే ఉంది. ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది. 2011 ధనుర్మాసంలో దాసురాలి ఇంట్లో తొలిసారి శ్రీవిష్ణుసహస్రనామగోష్ఠి ఆచార్య అనుగ్రహంతో సంకల్పించడంతో అమ్మగారిని ఆహ్వానించాలని ఆచార్యకృపవల్ల దాసురాలికి తోచినది. అడిగిన వెంటనే అమ్మగారు అనుగ్రహించి దాసురాలి ఇంటికి వేంచేశారు. పెరుమాళ్ళకు మంగళాశాసనం కృపచేశారు. అప్పటినుండి దాసురాలి ఇంట్లో అవిచ్ఛిన్నంగా ప్రతిసంవత్సరం గోష్ఠి జరుగుచూనే యున్నది. ఆచార్య అనుగ్రహం, అమ్మగారి మంగళాశాసనాలు పరిపూర్ణంగా ఉన్నాయి. ఈ దాసురాలి కుటుంబంమీద 2018 లో దాసురాలి ఇంట్లో శ్రీవిష్ణుసహస్రనామ పారాయణ గోష్ఠి జరిగినపుడు గోష్ఠి అంతా ముగిశాక కూడా అమ్మగారు వేంచేసి ఉన్నారు. అమ్మగారితో ఆరోజు ఎక్కువ సమయము గడపడం జరిగింది. దాసురాలు ఎంతో ఆర్తిగా అడిగిన ఆచార్య మేఘమా అనే పాటను దాసురాలే స్వయంగా చిత్రీకరించడం జరిగింది. దాసురాలి జీవితంలో అది ఒక మరచిపోలేని మధురానుభూతి.

ఆచార్యులు చెప్పినట్లు ఏక స్వాదు న భుంజీథాః మధురమును ఎప్పుడునూ మనమొక్కరమే అనుభవించరాదు అన్నట్లు ఆ మధురానుభూతిని దేశ విదేశాలలోనున్న భగవద్బంధువులందరితో కలిసి అనుభవించగలిగాము. 2019వ సంవత్సరంలో మా అబ్బాయి ఉపనయనం సందర్భముగా అమ్మగారిని ఆహ్వానించుకోడానికి వెళ్ళినపుడు నడిగడ్డపాలెం రాలేముకాని ఆచార్యుల మంగళాశాసనములతో కార్యక్రమం పరిపూర్ణం కావాలని మనస్ఫూర్తిగా మంగళాశాసనము చేశారు. అమ్మగారి మంగళాశాసనములు ఆచార్యుల కృపతో ఎంతో వైభవంగా ఉపనయనం జరిగింది. అమ్మగారు ఆచార్యుల తిరువడిని అలంకరించడానికి వారం రోజుల ముందు అమ్మగారి ఇంటికివెళ్ళి సేవించుకోవడం జరిగింది. అపుడు కూడా అమ్మగారు వారి చల్లని చూపులతో మాకు మంగళాశాసనాలు చేశారు. వారి అమ్మాయి తాయారుగారితో కూడా మంచి సాన్నిహిత్యము మాకు ఉంది. పెద్దల సంబంధం చాలు మనం తరించడానికి. వారికుటుంబంతో మాకు ఎప్పటికీ ఈ అనుబంధం ఇలాగే ఉండాలని........

❖❖❖❖❖❖



# ఒక సోదరి నివాళి

**శ్రీమతి ముదుంబై సత్యభామ(చిరంజీవిగారి సతీమణి),**
**రాజమహేంద్రి**



ఒక అపురూపమైన బంధానికి తెరపడింది. అందరిలాగా మాటలు చెప్పే శక్తీ నాకు లేదు.అటు పెద్దస్వామివారి తరానికి చిన్నజీయర్ స్వామి వారి తరానికి మధ్య తరం మాది. పెద్దస్వామివారి తరంలో చిన్నవాళ్ళం చిన్న స్వామివారి తరంలో పెద్దవాళ్ళం. మా నాన్నగారు వంగల శ్రీమన్నారాయణాచార్యులుగారు శ్రీమాన్ గోపాలాచార్య వారి రఘుదేవపురం లోని వేదకళాశాలలలో శ్రీమాన్ కోణప్పలాచార్య స్వామి వారితో చదువుకున్నారు అయితే తరువాత పాలకొల్లులో హిందీటీచరుగా స్థిరపడ్డారు. నాకు 1958 లో రాజమహేంద్రి శ్రీమాన్ చిరంజీవిగారితో వివాహం జరిగింది. మా వారు శ్రీమాన్ సింహగిరిస్వామివారికి మనుమడు. శ్రీమాన్ గోపాలాచార్య స్వామి వారికి చిన్నాన్నగారు సింహగిరిస్వామివారు వారికి ఆచార్యులు కూడా. వారి తనయలో సేవించే సింహగిరిస్వామి వారు వీరే. అది నా భాగ్యం. గోపాలాచార్యస్వామి వారు మా ఇంటిలో ఒక సభ్యునిగా తిరిగేవారు. లౌకికమైన విషయాలకి కూడా వారి సలహాలే. నాకు చిన్నవయస్సు స్వతహాగా భయం అందువల్ల ఆచార్యుల వద్ద గ్రంథాలు సేవించలేదు కాని నిత్యాచరణ మాత్రం అలవడింది. అలివేలు అమ్మగారు పెద్దస్వామివారి పూర్వాశ్రమంలో కోడలు అని మాత్రమే తెలుసు కాని వారి అమ్మాయిని గోపాలాచార్య స్వామి వారి అన్నగారి మనుమడికి నిశ్చయం చేసినప్పుడు మమ్మల్ని పెద్దలని చేసారు. గౌతంగారు అంటే అమ్మగారికి వియ్యంకుడు ఆయన మా వారికి అన్నగారి వరస కాని సొంత అన్నగారిలాగే ఉండేవారు. అందువల్ల వారికి వీరికి మధ్య సమన్వయము చేసారు మా వారు.. నాకు ఆ సమయంలో అమ్మగారితో మంచి పరిచయం కలిగింది. ఎప్పుడూ ఎదో కొత్త వారిలాగా అనిపించేవారు కాదు. సొంత మనిషిలాగా చాలా దగ్గర సంబంధీకులలాగ అనిపించేవారు . ఆవిడ రూపం చాలా ఆకర్షకంగా ఉండేది. ఆ రూపానికి తగ్గ మాటా, చాలా ఆనందాన్నిఇచ్చాయి. స్వామివారి కార్యక్రమాల్లో చాలా సార్లు కలిసేవాళ్ళం. దగ్గర కూర్చుంటే ఎన్నోవిషయాలు మాట్లాడుకునేవాళ్ళం. రాజమండ్రి విషయాలు బంధువుల విషయాలు అయితే మా ఇద్దరికీ ఇష్టమైన విషయం ఒకటి ఉండేది. మా మనుమలు ఆవిడ మనుమలు ఒకే వయస్సు కలిసినప్పుడు వాళ్ళ అల్లర్లు వాళ్ళతో అమ్మాయిలూ పడుతున్న తంటాలు గురించి మాట్లాడుకునేవాళ్ళం. అందరూ ఒకటే అనేవారు.

కాని నాకు జీవితంలో ఊహించని కష్టాలు వచ్చినప్పుడు ఆవిడ ఒక పెద్ద అక్కయ్యలాగా నాకు ఒక అండగా ధైర్యంగా నిలబడి నడిపారు. మా అమ్మగారు స్వామివారి చాతుర్మాస్యం చివరి రోజులలో మా ఇంటిలో పరమపదించారు ఆ రోజు వచ్చి ధైర్యం చెప్పారు. కాని నా జీవితంలో మా చిన్నామ్మాయిని పోగొట్టుకొని అసలు జీవితం పైన ఒక విరక్తి వచ్చింది. అది చాలా దుర్భరమైన బాధ. 35 సంవత్సరాల కూతురుని చిన్న జ్వరం వచ్చి పోగొట్టుకున్న నాకు అంతా శూన్యం లాగ అనిపించి అంతా నిరాసక్తంగా ఉండేది. ఇల్లు వదలి బయటకు వెళ్ళేదాన్ని కాదు. ఒక 2 సంవత్సరాల తరవాత మా ఇంటికి ఆవిడ వచ్చారు. ఆ రోజులలో రామానుజకూటంలో స్వామివారివి కార్యక్రమాలు జరుగుతున్నాయి. వచ్చి చాలా సేపు ఉన్నారు. ఇలా ఉండకూడదు జీవితం అంటే అన్నీ భరించాలి అని తనకు వచ్చిన ఇటువంటి కష్టాన్ని తను ఎలా తట్టుకున్నారో చెప్పి నువ్వు వస్తే గాని నేను వెళ్ళను అని కూర్చుని నన్ను తీసుకునే వెళ్ళారు. మళ్ళీ తెప్పరిల్లుకునేటట్లు

**కష్టాలలో స్థైర్యాన్ని ఇచ్చేది అమ్మ పలుకే!**



చేసారు. ఇప్పుడు అనిపిస్తుంది ఎందుకు అంత ప్రేమ చూపించారు నాకు ఒక సొంత అక్కగారు ఉంటే అలానే ఉండేవారేమో అనిపిస్తుంది. నాకు 20 సంవత్సరాల తరువాత మళ్ళీ అటువంటి కష్టమే మా పెద్దమ్మాయికూడా పరమపదించింది కాని, ఈ సంవత్సరం అమ్మగారిని కలవలేకపోయాను ఆ రోజు ఆమె చెప్పిన మాటలనే గుర్తుతెచ్చుకొని కాలం గడుపుతున్నాను.

వారి ఇంటి గృహప్రవేశానికి మా ఇద్దరికి బట్టలు పెట్టారు ఎందుకండి అంటే మీరు మాకు వియ్యంకులు లెక్క అనేవారు. అది మాటలకి అందని బంధుత్వం. మా ఇంటి గృహప్రవేశానికి మా పెద్దమనుమడు పుట్టినరోజుకి అలా ఆవిడ రాజమండ్రిలో ఉంటే తప్పకుండా వచ్చేవారు. మా వారు పరమపదించినపుడు కూడా వచ్చి చాలా ధైర్యం చెప్పారు. ఆశ్రమానికి వెళ్ళినప్పుడు తప్పకుండా కలిసేవారం. స్వామివారి అమ్మగారుగా గౌరవం ఒక తోబుట్టువులాంటి ఆప్యాయతని చూపే అక్కగారు. జెట్ వరల్డ్ కార్యక్రమాలు చూస్తున్నప్పుడు నా కళ్ళు ఆవిడనే వెతికేవి. ఆవిడ ఉంటె అదో ధైర్యం. ఈ రోజు ఆ ధైర్యాన్ని కోల్పోయాము. ఒక పెద్దదిక్కు. ఒక ఆలంబన. కాని ఆవిడ ధన్యజీవి. ఆ పరమపదయాత్ర ఒక ఉత్సవంలాగా సాగింది. తన గమ్యాన్ని చేరిన ధన్యజీవి మా అక్కయ్యగారు. ఆవిడతో అనుభందం ఆ జ్ఞాపకాలే నాకు పదిలం. పల్లాండు పల్లాండు పల్లాండు.

❖❖❖❖❖❖

## నా జన్మ ధన్యం



డా॥ రాజారామ్, శ్రీరంగధామం శ్రీకార్యం, జెట్ సెంట్రల్ కమిటీ మెంబర్, రాజమహేంద్రి

నాకు మన అమ్మ గారితో పరిచయం సుమారు 1988-89 సం. లో అయినది వారు అప్పుడు రాజమండ్రిలో నివసిస్తూ ఉండేవారు. మన శ్రీ స్వామి వారు. ఎక్కువగా ఈ ప్రాంతంలోనే ప్రచారము నిర్వహిస్తూ ఉండేవారు. ఆ కార్యక్రమాల్లో నాకు కూడ ముఖ్య పాత్ర ఉండేది. మన అమ్మగారికి వైద్యపరమైన సహాయం చేసే భాగ్యం నాకు కలిగింది.

ఒకసారి శ్రీ స్వామి వారు జగ్గయ్యపేటలో చాతుర్మాస్య దీక్షలో ఉన్నప్పుడు మన అమ్మ గారిని నాతో పాటు తీసుకుని వెళ్ళే భాగ్యం కలిగింది. అమ్మగారు నాతో ఎప్పుడు మాట్లాడినా శ్రీస్వామివారి ఆరోగ్యం గురించేను. నేను చెప్పితే శ్రీస్వామివారు వింటారు అని అమ్మగారికి అభిప్రాయము ఉండేది కామోసు. శ్రీస్వామి వారిని విశ్రాంతి తగినంత తీసుకొమని చెప్పమనేవారు. కానీ నాకు అంత సాహసము ఎక్కడ?

అమ్మగారిని శ్రీ స్వామి వారి ప్రతి చాతుర్మాస్య దీక్షలోనే సేవించుకునే వాడిని. ఆప్యాయముగా నా పేరు పెట్టి చాలా మృదులంగా నవ్వుతూ పలకరించే వారు. వీలు కుదిరినప్పుడల్లా ప్రసాదం ఇచ్చేవారు. ఆఖరి సారిగ నా మనవలికి కూడా ఒక సంవత్సరం క్రితం మంగళశాసనం చేసారు

ఎప్పుడు చిరునవ్వుతో ఆదరముగా పలకరించే వారు. ఎప్పుడు అమ్మగారు ఉన్నారని తెలిసినా తప్పకుండా ఆశీర్వచనము పొందేవాడిని. వారు నన్ను ఒక కుటుంబ సభ్యుడిగ భావించేవారు

అమ్మగారు భౌతికముగ మన మధ్య లేకపోయిన మనస్సులో చిరస్థాయిగ మెదులుతూ ఉంటారు. నేనుకూడా శ్రీస్వామివారితోపాటు అమ్మని అపుడప్పుడైనా సేవించుకునే భాగ్యం కలిగినందుకు జన్మ ధన్యమైంది.

❖❖❖❖❖❖



# నమస్సుమాంజలి...

మైథిలి ప్రసాద్ చౌదరి, రాజమహేంద్రి



యాదేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితాః
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః

అందరికీ అమ్మ అలివేలు మంగ తాయారు అమ్మగారు. చిరునవ్వుతోనే సిరులు విరులు కురిపించే మాతృమూర్తి. విష్ణుసహస్రనామం ఇంత మధురంగా పాడవచ్చా అని విస్తుబోయిన ఒక పత్రికలోని వ్యాఖ్యను చదివి ప్రేరణతో ఒకసారి వినాలని, అనాలని , చూడాలని వెళ్ళిన గృహిణికి ఆ రోజు ఎంతో మేలు కలిగించింది. ముప్పైరెండు సంవత్సరాల పూర్వం ఆనాటి మేటి రోజు చిన్నబాబు సంరక్షణ కొద్దిసేపు ఆయాకిచ్చి నచ్చిన చోటుకు వచ్చిన తనకు సహస్రనామ పారాయణ చేస్తున్న వారిని చూసి ఈ సంస్కృతపదాలు పలక గలమా అనుకుంటూంటే స్వామివారు వేంచేశారు. అందరం స్వాగతించాము.

శ్రీరాములవారు నడచివస్తున్నారా, శ్రీమన్నారాయణ చిన్నజీయరు స్వామివారు వస్తున్నారా చేతిలో ఏమిటి కోదండమా త్రిదండమా ఆశ్చర్యం భగవద్దర్శనమా ఆచార్య దర్శనమా స్వామివారి మధురవాక్కుల ప్రవచనం శ్రవణం చేస్తూ అప్పుడే పూర్తిఅయ్యిందా అనే భావనతో లేచి నిలబడింది. మరల రేపుకూడా రావాలని సంకల్పం చేసేసింది.

హాలునుండి వచ్చేసరికి భక్తులంతా వెళ్ళిపోయారు. స్వామివారు కూడా ఆశ్రమానికి వెళ్ళారు. కార్యక్రమ వివరాలు చూస్తూ నెమ్మదిగా వస్తున్నాను. అమ్మగారు నిలబడి ఉన్నారు. పెద్దవారిని చూడగానే నమస్కరించి ఎక్కడకు వెళ్ళాలమ్మా రండి వెళదామని అంటున్నాను. ఇంతలో మరొక ఆమెవచ్చి మీరు కొత్తగా వచ్చారా వీరేనమ్మా స్వామీజీ అమ్మగారు అనగానే మనస్సు కుసుమంలా వికసించింది. వంగి అమ్మగారి పాదనమస్కారాలు చేశాను. వారి చిరునగవు ఎప్పటికీ వన్నెతగ్గని ఆహ్లాదపు హరివిల్లులా హృదయంలో నిలిచింది. అమ్మగారు అంటున్నారు రామానుజకూటం వెళ్ళాలని. ఆ పేరు వినలేదు. ఎక్కడో తెలియదు వారే మార్గం చూపారు. ముగ్గురం రామానుజ కూటం వద్ద దిగాము. కారు టర్న్ చేసుకొని వస్తానని డ్రైవర్ వెళ్ళాడు. అమ్మగారు లోపలికి వెళ్ళి మరలా నా దగ్గరకు వచ్చి రా అమ్మాయి అన్నారు. గురువులను, పెద్దలను దర్శించటానికి వెళితే పువ్వులు, పండ్లు తీసుకొని వెళ్ళాలని తెలుసు. కనుక మరల రేపు వస్తానని అంటున్నాను చిన్నగా. ఏమి ఇపుడురా అమ్మాయి అన్నారు. అమ్మగారి వెనుకే వెళ్ళాను. అమ్మగారు స్వామివారికి చెప్తున్నారు. స్వామివారికి పాదనమస్కారం చేసుకున్నాను. స్వామివారు దివ్యఫలాన్నిచ్చి మీలో ఉన్న భగవద్విశ్వాసం మరింత పెరగాలని ఆశీర్వదించారు. ఆనందభాష్పాలతో మరల మరల నమస్కరించాను. ఈ యాంత్రిక జీవనంలో విచక్షణా జ్ఞానం మేలుకొంది ఎటువైపు ప్రయాణించాలో మార్గదర్శకమయ్యింది.

**అమ్మ చిరునవ్వు ఆహ్లాదపు హరివిల్లు**



ఒక కథ గుర్తుకొస్తోంది. ఒక బాలుడు కారడవిలో దిక్కుతోచని స్థితిలో చెట్టుక్రింద కూర్చొండి పోయాడు. భయం, ఒటరితనం ఆవహించాయి. దుఃఖ భారం పెరిగింది. ఇంతలో పెద్దాయన అటుగా వచ్చారు. ఎందుకేడుస్తున్నా వనగా నేను చాలా దూరం వెళ్ళాలి ముందంతా చీకటిగా ఉంది నేను ఎలా చేరాలి అని వాపోతాడు. అప్పుడు ఆ పెద్దాయన నీ సమస్యకు పరిష్కారం నీ దగ్గరే ఉంది. ముందు నీవు లేచి నిలబడు నీ ప్రక్కన ఉన్న దీపాన్ని చేతిలోకి తీసుకో. అడుగులు వెయ్యి వెలుగులు నీ వెంటనే ఉంటాయి. ఆ బాలుడు ఆశ్చర్యంగా చూశాడు. చీకటిగా ఉంది ఎలా అనుకున్నాను. దీపాన్ని చేతపట్టాలని తెలియలేదు అనుకున్నాడా బాలుడు.

మనం అందరం అలాంటి అజ్ఞానమనే బాల్యావస్థలోనే ఉంటాము. ఎక్కడో ఆనందం ఉందని ఆరాటపడతాము. గురువుల మార్గదర్శనం లోనే శాంతి ఉషస్సులను గుర్తించగలము. చిన్న సాధనలే సార్థకమై పరమార్థాన్ని పంచుతాయి. గురువులను గౌరవించడం, పెద్దల సాంప్రదాయాలను అనుసరించడం. అర్చనలు సాగించటం, అందరినీ ఆదరించడం, కీర్తనలు, నామస్మరణముతో కర్తవ్యనిష్ఠను కొనసాగించడం. గురువుల ఆశ్రయంలో అభయం ఉంటుంది అనేవారు అమ్మగారు. వారు చెప్పినవి ఆచరిస్తే జీవితాలు అర్థవంతమై, యోగ్యవంతమై సాఫల్యం పొందుతాయి.

తులసీరామానుజకూటంలో ఒకసారి ధనుర్మాసపు రోజులలో గోదాదేవి అలంకరణ పోటీలు జరిగాయి. అమ్మగారిని జడ్జిగా ఉండమన్నారు. ఒకరే కాదని అమ్మగారు నన్ను పిలిచి ప్రక్కన కూర్చోమన్నారు. నాకు ఇంకా ఓనమాలు కూడా రావని సంశయించినప్పటికీ కాదని కూర్చోమన్నారు. ఎనిమిది తొమ్మిది సంవత్సరాల బాలికలు గోదాదేవి వేషధారణతో ఒక్కొక్కరూ వస్తున్నారు. ఒక గోదాదేవి వేషధారణి మంచి పట్టుచీర ధరించి, ఆభరణాలతో, పైన ముడికి ముత్యాల జాలర్లు అలంకరించుకొని వచ్చింది. ఈ అమ్మాయికి ప్రథమస్థానం వస్తుందని అనుకున్నాము. మరికొంతమంది చక్కని గోదా వేషధారణతో వచ్చారు. అమ్మగారు, నేను వారి పేర్లు వ్రాసుకుని చూస్తున్నాము. అమ్మగారు ఏ మార్కులు వేస్తే అవే మార్కులు వేస్తున్నాను. అందంగా తయారై వచ్చిన అమ్మాయికి మార్కులు వేశాము. కాని నేను అనుకున్న అమ్మాయికి మార్కు ఒకటి తగ్గింది. అమ్మగారిని చూశాను. మెల్లగా చెప్పారు గోదాదేవికి వైరముడి ఎడమవైపు ఉంటుంది ఈ అమ్మాయికి కుడివైపు వేశారు. అన్నీ పరిశీలించాలిగ మరి అన్నారు. ఇలా ఎన్నో విషయాలు వారినుండి నేర్చుకున్నాను.

శుభ సంకల్పమైనా, శుభ వార్తయినా స్వామివారికి విన్నవించడం వారి మంగళాశాసనాలు తీసుకోవడం మా భాగ్యంగా భావిస్తాము. ఆ మధ్య దివ్యసాకేతం వచ్చి స్వామివారి దర్శనమయ్యాక వస్తుంటే గుమ్మంలో అమ్మగారి దర్శనమయ్యింది. ఎవరినో పంపించడానికి బయటకు వచ్చారు. అటువైపు వెళ్ళి ఇద్దరం నమస్కరించాము. బాగున్నారా అమ్మాయి డాక్టరు గారూ అన్నారు. కృతజ్ఞతలు తెలుపుకున్నాము.

ఆకాశ సదృశ వైభవ నారాయణి
మలయ సమీరపు గాన కళా సుభాషిణి
నిశ్చల జ్యోతిర్మయ స్వరూపిణి
అనంత దయామృత తరంగిణి
ఓర్పునేర్పుల సమన్వయ ధరణి

# మా ఊరికే మహాలక్ష్మి

కర్రి పాపారాయుడు
అర్తమూరు.

పురాణ చరిత్ర ప్రసిద్ధి చెందినది మా అర్తమూరు. అటువంటి చారిత్రక గ్రామానికి మరింత ప్రాచుర్యం కల్పించిన దైవ స్వరూపులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ పెద్ద జీయరు స్వామివారు. ఆ ఉన్నత కుటుంబంలోనికి శ్రీమహాలక్ష్మిలా ఇంటి కోడలిగా అడుగుపెట్టిన సాధ్వీమతల్లి శ్రీమతి చిలకమర్తి అలివేలు మంగతాయారు గారు. వైద్య వృత్తిలో ఉన్న వారి భర్త గారు గ్రామ ప్రజలకు నిస్వార్థ సేవలు అందించేవారు.

ప్రపంచానికి ఒక దైవాంశ సంభూతుని కని ఇచ్చిన మాతృమూర్తి శ్రీమతి అలివేలు మంగతాయారమ్మ. తాతగారి ఆధ్యాత్మిక మార్గంలో అతి పిన్న వయస్సులో సన్న్యసించి ఆశ్రమ స్వీకారం చేసి ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని భక్తి మార్గంలో తరింపచేస్తూన్న పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయరు స్వామి వారిని యీ స్థాయికి తీర్చిదిద్దిన ఘనత ఆ పవిత్ర గృహలక్ష్మిదే.

1989 సం॥ నుండి అమ్మతో నా పరిచయం. నాపట్ల ఆమె చూపిన వాత్సల్యం కన్న తల్లిని మరిపించేది. ఎప్పుడు స్వామి వారి వద్దకు వెళ్ళినా గ్రామప్రజల యోగక్షేమాలు అడుగుతూ వారు చూపే ఆప్యాయత నా గుండెనిండా పదిలమై ఉన్నది. అట్టి మా మాతృమూర్తి పరమపదించడం మాగ్రామం యావత్తు మా శోక సముద్రంలో ముంచివేసింది. అమ్మ మధుర స్మృతులను క్షణ క్షణం గుర్తు చేసుకోవడం కోసం వారి కాంస్య విగ్రహాన్ని గ్రామంలో నెలకొల్పే ప్రయత్నంలో సదా స్వామి వారి సేవలో .......





# అమృతమూర్తికి - వందనం



**డి. కోటేశ్వరరావు, S.P.**
**Crime Branch, Vijayawada City**

11వ తేది శుక్రవారం రాత్రి సమయాన – ఆశ్రమం నుండి రఘు స్వామి, వెంకటాచార్య స్వామి వారు నాకు ఫోన్ చేసి అమ్మగారి పరమపదవార్త తెలియజేశారు. నా మనస్సును కలచివేసింది. దుఃఖం ఆపుకోలేకపోయినాను. ఎపుడు తెల్లవారుతుందా అని ఆ రాత్రి జాగరణలో అమ్మ గారితో మాకున్న అనుభవాలను స్మరించుకున్నాను. ఎప్పుడు తెల్లవారుతుందా! అమ్మగారిని కడచూపు చూద్దామని శ్రీస్వామి వారిని దర్శించాలి అని తపన. తెల్లవారి దివ్యసాకేతం ప్రక్కనే ఉన్న జిమ్స్ ప్రాంగణంలో అమ్మ గారిని చూశాను. ప్రసన్నమైన రూపంతో దివ్యతేజస్సుతో – దివ్యలోకంలో శ్రీమన్నారాయణ పద సన్నిధిలో సేవ చేయడానికి వెళ్ళి ఉంటారని భావించాను. హృదయ పూర్వకంగా అంజలి ఘటించినాను. తరువాత శ్రీస్వామి వారిని దర్శించాను. కన్నీళ్ళు ఆగలేదు. ఎందరికో తల్లి – తండ్రి గురు స్థానంలో ఉన్న స్వామిని అప్పటిదాక – తల్లి చాటు బిడ్డగా ఉన్న స్వామిని చూచి తీవ్ర ఉద్వేగానికి లోనైనాను – భగవంతుణ్ణి ప్రార్థించాను. మీరే మా స్వామికి రక్షకులుగా తల్లి స్థానంలో ఆశీస్సులు ఎల్లవేళల ఉండాలని – అంతిమ సంస్కార కార్యక్రమం దాకా ఉన్నాను.. నామనస్సులో ఏదో బాధ.... తెలియని అనుబంధం .... "నేను పోలీసు శాఖలో విధి నిర్వహణలో ఉన్న సమయములో స్వామి వారి ఆరాధ్యదైవం శ్రీ సీతారామచంద్ర మహా ప్రభువులను తిరిగి వారి సన్నిధికి చేర్చే ప్రయత్నం నాకు భగవంతుడు అవకాశమిచ్చాడు. అప్పటి నుండి 26 సంవత్సరాలుగా – శ్రీ స్వామివారు ప్రత్యక్షంగా నిర్వహించే సహస్ర కళశాభిషేక మహోత్సవ కార్యక్రమం నా చేతుల మీదుగా – జరిపించే భాగ్యం కలగజేశారు. ఇది "పెరుమాళ్ళ" వారు నా జీవితానికి ఇచ్చిన గొప్పసేవగా భావించాను.

నేను ఎపుడూ ఆశ్రమానికి వెళ్ళినా శ్రీస్వామివారితోపాటు – అమ్మ అలివేలు మంగతాయారమ్మ గారిని దర్శించుకొనేవాడిని. ఆమె పాదాలకు నమస్కరిస్తూంటే హృదయపూర్వకంగా ఆనందంతో ఆశీర్వదించేవారు. **వారి మనస్సులో నాకొక ప్రత్యేక స్థానము ఉన్నది. నిజంగా వారు తమ కుమారుని సంప్రదాయ సేవకు సమాజసేవకు అర్పణ చేసి ఉత్తమ ఆచార్యులను ఈ లోకానికి అందించిన తల్లి.** దేశ విదేశాలలో సైతం స్వామి ఆరాధ్యులైనారు. అలా ఎందరికో ఆరాధ్యులైన స్వాతి ముత్యాన్ని అందించిన భాగ్యశాలి. నేను విన్నాను. కొన్ని సందర్భాలలో చూచాను. వారు ప్రతిరోజు స్వామి వారు నిద్రించే సమయంలో – కొబ్బరికాయ కర్పూరంతో హారతి పట్టి మంగళం పాడేవారు.

ప్రతి తిరునక్షత్ర మహోత్సవంలో కూడా – వారే మొదటి ఆశీస్సును అందించేవారు. అలాంటి కన్న తల్లి వల్లనే శ్రీ స్వామి వారు సత్యసంకల్పులుగా లోకంలో మంచి కార్యాలను నిర్వహిస్తున్నారు. ఆ తల్లి భౌతికంగా మనమధ్య లేకున్నా వారు మన మధ్యలోనే ఉండి శ్రీ స్వామి వారిని మనలను ఆశీర్వదిస్తారని భావిస్తూ అనేక నమస్కారములతో జైశ్రీమన్నారాయణ.

❖❖❖❖❖❖❖



# సదాచార నిష్ఠ



**డా. జగన్నాథరెడ్డిగారు**
**కరీంనగర్**

అస్మదాచార్యులైన చిన్నజీయర్‌స్వామివారి మాతృమూర్తి ఆచార్య తిరువడి చేరారన్న విషయం నన్ను ఎంతో బాధించింది. నేను ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాను ఆ విషయాన్ని.

అమ్మగారి గురించి నాకు తెలిసిన 2 విషయాలు భాగవతోత్తములతో పంచుకుందామని ఈ ప్రయత్నం.

నేను అమ్మగారిని 25సంవత్సరాలుగా చూస్తూ ఉన్నాను శ్రీ స్వామివారి కార్యక్రమాలలో వారిని సేవిస్తూ ఉన్నాను.

కొన్ని సంవత్సరాల క్రితం శ్రీ స్వామివారు కరీంనగర్ లో భాగవత సప్తాహాన్ని నిర్వహించారు. అందులో పాల్గొనడానికి అమ్మగారు కూడా అప్పుడు మా ఊరు వేంచేసారు. ఆసమయంలో వారు బి.పి., సుగర్ వంటివాటితో కొంచెం ఇబ్బంది పడుతుండేవారు, ఆచార్యకృపతో వైద్యునిగ ఉన్న నాకు అమ్మగారికి ఆరోగ్య విషయంలో సేవచేసుకొనే అవకాశం లభించింది. భాగవతసప్తాహంలో నేను, నా శ్రీమతి నిర్మల భాగవత శ్రవణం తో పాటు ఆచార్యమాతృమూర్తిని కూడా సేవించుకోగలిగాం.

ఆ తర్వాత కూడా నారాయణగూడలోని అమ్మగారి నివాసానికి మా అమ్మాయి లక్ష్మి వెళ్ళి అమ్మగారి ఆరోగ్యంపై శ్రద్ధవహించేది. ఇలా మా కుటుంబం అమ్మగారిని సేవిస్తున్న సమయంలో అమ్మగారు ఎన్నో ఆధ్యాత్మిక విషయాలను ముఖ్యంగ శ్రీ శ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారి వైభవాన్ని వివరిస్తూండేవారు.

అమ్మగారిని సేవించినది అతి కొద్దిసమయమే అయినప్పటికీ ఆమెలోని ఆచార్యనిష్ఠ మరియు సదాచారపరాయణత్వం దాసుడిని ఎంతో ఆశ్చర్యపరచేవి. ఆమెలోని వాత్సల్యస్వభావం, వచ్చిన వారిని ఆదరించే ప్రేమ, ఆమె అందించే ఆధ్యాత్మిక జ్ఞానం వల్ల నాకు మరియు ఆమెపట్ల, మా ఆచార్యులపట్ల మరింత భక్తి విశ్వాసం పెరిగాయి.

వృత్తిరీత్యా వైద్యుడినైన నేను, అమ్మగారికి మూడు వేళలా ప్రసాదంతో పాటు తీసుకోవలసిన మందులను వివరించి అందించినా, ఆమె తమ దైనందిక ఆరాధన అనుష్ఠానం అయ్యేవరకు మంచి తీర్థము కూడా సేవించకపోవడం, అనుష్ఠాన బలంవల్లనే స్థైర్యంతో ఉండడం... ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించేవి. ఆనాడే కాదు ఈనాటికీ ఎనిమిది పదులు దాటిన వయసులో కూడా అదే సదాచారనిష్ఠని పాటిస్తూ ఉండడం విశేషం. **ఆమెలోని ఆ ఆచారనిష్ఠయే వైద్యులమందించే మందుకన్నా బలాన్ని కలిగించి, రక్షణకలిగించి ఆరోగ్యాన్ని కాపాడాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.** కాలాంతరంలో కర్మప్రభావం చేత ఏర్పడిన తీవ్ర దైహిక అనారోగ్యలక్షణాలతో ఉన్నా ఆమె జీవనశైలి ఏమాత్రం మారలేదు. అలాంటి ఆదర్శప్రాయమైన మాతృమూర్తిని కోల్పోవడం తీరని వేదనే అయినా **ఆమెకి ఉన్న రోగ లక్షణాలకి ఏమాత్రం లొంగక, విపరీతపరిణామాలకి లోను కాక, సునాయాసంగా దేహాన్ని విడువడం అన్నది ఆమెలోని ఆధ్యాత్మిక శక్తికి నిదర్శనం.** ఆ తల్లి దీవెనలు మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తూ.....

ఆమె అనుగ్రహించిన ఆచార్యులని వారు నేర్పిన నిష్ఠతో సేవించుకోగలగాలని ఆశిస్తూ.....

ఆచార్యుల శ్రీచరణాలకు ప్రణమిల్లుతూ....

❖❖❖❖❖❖

ఆత్మస్థైర్యమే ఆయుర్దాయానికి అసలు రక్ష



# మాతృవందనం

**పద్మభూషణ్ డా. కె.ఐ. వరప్రసాద్**
చైర్మన్, శాంతాబయోటెక్స్

పుణ్యవతి, పరమపావని, శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయరు స్వామి పూర్వాశ్రమ మాతృమూర్తి... సకల సన్మతులకూ మాతృమూర్తి, శ్రీమతి అలివేలు మంగతాయారు గారు శ్రీరంగ నాథునితో ఏకమయ్యారు.

వారి ప్రసన్న వదనం, వాత్సల్య వచనం, కరుణాంతరంగం, శీతల కటాక్షవీక్షణం, అభయాశీర్వచనం, వారిని దర్శించిన ప్రతిసారీ నాకు, నా శ్రీమతికీ లభించిన గొప్ప విభూతులు.

మాయింట ప్రతి సంవత్సరం నిర్వహించే 'మాతృవందనం' కార్యక్రమంలో భాగంగా, 2015 వ సంవత్సరంలో వారిని 'విశిష్ట మాతృమూర్తి' గా సంభావించి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి ఆధ్వర్యంలో సన్మానించుకోగల గొప్పఅదృష్టం వారు నాకు ప్రసాదించి... ఆ'మాతృవందనం' కార్యక్రమానికి ఒక పవిత్రతనూ,పూజ్యతనూ సంప్రాప్తింపచేశారు.

ఆ తల్లి పరమపదోత్సవ సందర్భంగా, ఆ పవిత్రాత్మకు ప్రణమిల్లుతూ...

❖❖❖❖❖❖



**Nobody knows of the work make to keep the home together. Nobody knows of the steps it takes; nobody knows but mother.**



# త్యాగమూర్తి

**డా॥ కర్రి రామారెడ్డి**
**మానసిక వైద్యులు రాజమహేంద్రి**



కౌసల్య.. దేవకి.. ఆపరంపరలోనే అలివేలు మంగతాయారు మాత.. మాతృ వందనం

ఎంతటి త్యాగమూర్తి! ఈ సామాన్య ప్రజలకి మరో భగవద్రామానుజులవారిని అందించడానికి తన మాతృప్రేమను త్యాగం చేయడం సామాన్యమైన విషయం కాదు.

గోరుముద్దలు తినిపించి, అల్లారు ముద్దుగా పెంచి మురిపాలు ముచ్చట్లు తీర్చుకోవలసిన తల్లి కుమారునికి సంశయము లేకుండా సన్న్యాసదీక్షకు అనుమతినివ్వడం అనూహ్యం.

పండితులు, పామరులు కోట్ల భక్తజనం తరిస్తూ తనబిడ్డకు నీరాజనాలు పడుతుంటే, ఆనందంతో పొంగుతున్న మనసును, బిడ్డను అక్కున చేర్చుకుని ఆప్యాయతను పంచాలన్న కోరికను అదుపులో పెట్టుకోవడం సామాన్య విషయం కాదుకదా!

**బిడ్డలో ఆచార్యుణ్ణేచూసి 'ఆచార్యమేఘమా...' అని ఆలపించారు. జనసామాన్యంలో ఒకరిగా నిలిచారుతప్ప గురుమాతగా ఎప్పుడూ అహంకారం, అతిశయం ప్రదర్శించలేదు.**

పరమపదంలో ఆచార్య సన్నిధికి ముముక్షువులు ఎప్పటికైనా చేరవలసిందే! కాని ఆ సమయంలో ఆ వ్యధను తట్టుకునే శక్తి మనకు ఆచార్యుల ద్వారా భగవంతుడు ప్రసాదించవలసిందే!

❖❖❖❖❖❖

**హరిచందన**

అమ్మగారితో ఉన్న పరిచయం చిన్నదైనా నేను ఎల్లపుడూ గుర్తుంచుకోదగినది. మా కుటుంబం పరిస్థితులు తెలుసుకుని ఎవరు బంధువులో, స్నేహితులో ఎలా తెలుసుకోవాలో, ఎవరితో ఎలా మెలగాలో చెప్పేవారు. **ఒక స్త్రీ దృఢంగా, గుంభనగా ఎలా ఉండాలో ఎంతో చతురంగా చెప్పేవారు. వారు మాట్లాడనవసరంలేదు కనుసైగతో మాట్లాడగలరు.**

అమ్మా! అందరి బాష తెలిసి, అందరి మనస్సులు తెలిసినవాని దగ్గరకి చేరుకున్నారు కదా!

మీకు, స్వామికి మా వందనాలు.

❖❖❖❖❖❖

**A mothers happiness is like a beacon, lighting up the future but reflects on the past in the guise of fond memories.**



# దివికేగిన దీపదారి

**VIJAYA BHASKAR**
**Executive Editor, Wanaparthy Dist**



వేద గురువుగా, ఉపదేశకుడిగా ఈ లోకంలో వినుతికెక్కిన శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామి వారికి అన్ని వేళల్లో..అన్ని సందర్భాలలో నీడలా వెన్నంటి ఉంటూ వచ్చిన అమ్మ అలివేలు మంగ తాయారు ఇక సెలవంటూ వెళ్లి పోయారు. లెక్కకు మించి భక్తులు ఆరాధించే స్వామి వారిని వీడడం బాధాకరం. పూడ్చలేని అగాధం కూడా. ఈ మట్టి మీద దేనినైనా కోల్పోయినా తిరిగి తెచ్చుకోగలం. కానీ అన్నీ తానై ..తోడై ..గుండె నిండా ప్రేమను పంచుతూ తన ప్రస్థానాన్ని సాగిస్తూ వచ్చిన అమ్మ లేక పోవడం ఒకింత కన్నీళ్లు పెట్టుకునేలా చేసింది.

కొంతకాలం క్రితమే అనుకోకుండా చిన్నజీయర్ స్వామి వారిని కలుసునే మహత్ భాగ్యం కలిగింది. ఈ సమయంలో ఎన్నో సార్లు ముచ్చింతల్‌లో కొలువుతీరిన ఆశ్రమాన్ని సందర్శించడం జరిగింది. ఈ క్రమంలో ఎంతో ప్రసిద్ధి చెందిన **శ్రీచిన్నజీయర్ స్వామి ఎలా ఉపదేశకుడిగా ..మార్గదర్శకుడిగా మారారు అనే దానిపై కొన్ని నెలల తరబడి ఆలోచించా. ఆయన సంకల్పం వెనుక.. ఆ అసాధారణమైన, అద్భుతమైన ప్రతిభా పాటవాలు కలిగి ఉండడం వెనుక అమ్మ ఉందన్నది బోధపడింది.** ఆశ్రమంలో కలియ తిరుగుతూ అమ్మ వారిని దర్శించు కోవడం.. ఆమెతో ఒక్కసారి మాట్లాడటం మరిచి పోలేని జ్ఞాపకంగా మిగిలింది.

ఎవరూ చేరుకోలేని..ఇంకెవ్వరూ అందుకోలేని ..ఉన్నత స్థాయిలో కొలువుతీరిన చిన్న జీయర్ స్వామి గంటల తరబడి అనర్గళంగా ప్రసంగించడం, ఉపదేశించడం ఆశ్చర్యానికి లోనుచేసింది. దీని వెనుక కఠోర శ్రమ ఉన్నది. అంతకంటే ఎన్నో ఇబ్బందులను అతిక్రమిస్తూ వచ్చారు శ్రీ స్వామి వారు. తల్లిదండ్రులు ప్రాణాన్ని ప్రసాదిస్తారు. తండ్రి అష్టకష్టాలకోర్చి కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడం మామూలే. కానీ అటు కుటుంబాన్ని ఇటు బాధ్యతలను సమానంగా భరిస్తూ నెట్టుకు రావడం తల్లులదే బాధ్యత. చిన్న జీయర్ స్వామి వారు చిన్న తనంలో కన్న తండ్రిని కోల్పోయారు. కన్నీళ్లను లోపటే దిగమింగుకుని అమ్మ అలివేలు మంగ తాయారు బిడ్డలను ఏ లోటూ రాకుండా పెంచింది. ప్రపంచంలో విజేతలుగా నిలిచిన వారు. **లోకాన్ని ప్రభావితం చేసిన వారి గెలుపు వెనుక కచ్చితంగా అమ్మ ఉంటుందన్నది నగ్న సత్యం.**

తండ్రి ధైర్యాన్ని ఇస్తే..గురువు ఏది మంచి ఏది చెడు అన్నది నేర్పితే..దారి తప్పకుండా ..ఎలా నడుచు కోవాలి..ఎలా మసలు కోవాలి..ఎలా మెలగాలి..ఎలా మాట్లాడాలి..ఇతరులతో ఎలా ప్రవర్తించాలి..ఎలా సమస్యల నుంచి గట్టెక్కాలి..ఎలా పెద్దలను గౌరవించాలో..ఎలా కుటుంబంలో ఒకరిగా మెలగాలో ..విద్యా బుద్ధులతో పాటు వ్యక్తిత్వాన్ని పెంపొందింప చేస్తూనే..సంస్కారాన్ని నేర్పే మొదటి గురువు అమ్మే. ఇది కాదనలేని సత్యం. ఈ భువి మీద తల్లులంతా ఒకేలా ఆలోచిస్తారు. ఎలాగంటే తమ పిల్లలంతా బాగుండాలని, వారంతా ప్రయోజకులు కావాలని..సమాజాన్ని ప్రభావితం చేసేలా..అందరికి ఆదర్శ ప్రాయంగా..స్ఫూర్తి దాయకంగా ఉండాలని కోరుకుంటారు. కానీ అమ్మ అలివేలు మంగ తాయారు మాత్రం ఎంతో ఉన్నతంగా తన బిడ్డలను తీర్చిదిద్దింది. ఈ ప్రపంచానికి దివ్య తేజోమూర్తిని ప్రసాదించింది. ప్రతి ఒక్క తల్లి కోరుకునేది ఒక్కటే తన బిడ్డ పైకి రావాలని..ఉన్నత స్థానంలో ఉండాలని . కానీ అమ్మ మాత్రం శ్రీ చిన్నజీయర్ స్వామి వారిని చిన్న

**Successful mothers are not the ones that have never STRUGGLED. they are the ones who never give up, despite the Struggles.**



తనంలోనే అత్యంత కఠినాత్మకంగా ఉండే ఆశ్రమ జీవితానికి అనుమతి ఇచ్చింది. ఇక్కడే ఆమె అందరు తల్లులకంటే ఉన్నతంగా నిలిచారు. ఎందరికో ఆదర్శంగా నిలిచారు.

అమ్మ ఆలోచన సరైనదే. ఆమె అందరికంటే ముందు చూపుతో ఆలోచించింది. లక్షలాది ప్రజల మనసులలో భక్తి తత్త్వాన్ని, భావాన్ని , ఆధ్యాత్మికతను పెంపొందించేలా చిన్న జీయర్ స్వామిని చేసిన ఘనత అమ్మదే. స్వాంతన, ప్రశాంతత, స్థితప్రజ్ఞత మూర్తీ భవించిన అమృత రూపం. ఆశ్చర్య పోయేలా చేసే ప్రతిభా సంపన్నత, ఉన్నపళంగా ప్రభావితం చేసే వ్యక్తిత్వం, అసాధారణమైన నైపుణ్యం..పది కాలాలపాటు దాచుకోవాల్సిన రూపం ఇవన్నీ అమ్మ నుంచే స్వామి వారికి సంక్రమించాయి. స్వామి వారు ప్రతి నిత్యం ఉదయం వేళ ఇచ్చే తీర్థం కోసం భక్తులు తండోపతండాలుగా తరలి రావడం ఆనవాయితీ. చిన్నారులు, పెద్దలు, వృద్ధులు ఎంత సేపైనా సరే వేచి ఉంటారు. ఇదే క్రమంలో అత్యున్నత స్థానంలో ఉన్న చిన్నజీయర్ స్వామిని చూసి అమ్మ వారు ఎంతో సంతోషించడం దగ్గరుండి చూసే భాగ్యం కలిగింది.

నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది ఒక్కటే..భక్తులందరితో పాటు అమ్మ వారు సైతం క్యూలో నిల్చుని స్వామి వారి నుంచి తీర్థం తీసుకోవడం ఎంతో ఎత్తుకు ఎదిగిన నిండైన వ్యక్తిత్వానికి నిదర్శనం. ఉషోదయ వేళలో తన గాత్ర మాధుర్యంతో దిగంతాలను నింపుతూ ఆ దేవ దేవుడిని మేల్కొలిపే ఎం.ఎస్. సుబ్బలక్ష్మిని అలివేలు మంగతాయారు గుర్తుకు తెచ్చేలా చేశారు. కాల గమనంలో ఎందరో వస్తుంటారు..వెళుతుంటారు..కానీ అమ్మ మాత్రం అరుదైన ముద్రతో స్వామి వారితో పాటు వేలాది మంది భక్తులను ప్రభావితం చేశారు. తల్లిగా, మార్గదర్శకురాలిగా..అరుదైన వ్యక్తిత్వపు మూర్తిత్వం కలిగిన ఆమె లేక పోవడం బాధాకరం. లోకాన్ని వీడి భువి నుంచి దివికేగిన ఆ మాతృమూర్తి చల్లగా ఉండాలని..ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ..కన్నీళ్ళతో విరమిస్తున్నాను..!

❖❖❖❖❖❖

## మంగళరూపిణి



**Dr. పసుమర్తి రామలక్ష్మి**

శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానెల్, హైదరాబాద్

సనాతన ధర్మంలో భారతీయ స్త్రీ మూర్తి ఎలా ఉంటారో అచ్చం అలానే సాకారంగా కనిపించే దివ్య మంగళ మాతృ స్వరూపం మన అమ్మగారు. తొలిసారి చూసినప్పటి ఆ అపురూప సౌజన్య స్వరూపం నా మనసులో ఇప్పటికీ పదిలంగా నిలిచిపోయి ఉంది. శ్రీ పెద్ద జీయర్ స్వామివారి కోడలిగా, శ్రీ చిన్నజీయర్ స్వామివారి తల్లిగా అసాధారణ మైన విలక్షణ వ్యక్తిత్వం తో విరాజిల్లారు. అభం శుభం తెలియని వయసులో నాకు ఎన్నో సంప్రదాయపు విలువలు ఓపికగా వివరించి,తాను ఆచరించినవి మనసులో నాటుకునేట్లు చేశారు. 40 ఏళ్లుగా ఆ మాటలే నాకు మార్గదర్శనం చేసి,నడిపిస్తున్నాయి. సదా ప్రాతస్మరణీయురాలు. అమృత హృదయకు అనేక దాసోహములు సమర్పించుకుంటూ..

**తనయుల ఉజ్జ్వల భావి జీవితానికై తపన పడేది తల్లి**




# "KAUSALYA OF OUR TIMES"

**Dr. Chilakapati Vijayaraghavacharyulu**
**Nellore**

*kuasalya supraja ra:ma! pu:rva sandhya: pravarthathe: |*
*utthishta! narasa:rdu:la! karthavyam daivama:hnikam ||* **- Sri: Ramayana 1-23-2.**

In the parlance of world literature, the first morning wish "GOOD MORNING" was perhaps the benediction wake-up greeting done by the sage Viswamitra to his junior most "care-taker"or disciple Sree Rama, as I understand.



Tears rolled down on hearing the sad news of our most revered mother, beloved mother of our Chinna Jeeyar Swamiji- Alivelu Mangatayaramma garu. My son Kulasekhar Alwar called around 3:30 AM. Much loved and respected by near, dear and around the galaxy of our acharya's disciples across the world, and equally well versed in theory and practice of 'sath samprada:ya', the divine mother left behind a massive vacuum, enormous legacy and message for the posterity. Amma Garu, it so happened, was closer to our son Kulasekhar as he used to assist her in certain matters. She used to often correct him and quote the "samprada:yam' and 'sada:cha:ram'.

Sage Viswamitra gave a wake-up call to Sree Rama praising Rama's mother Kausalya as she gifted such a wonderful son Rama to the world, more than extolling Rama as a 'Tiger among men'! Viswamitra was, it is said, stunned having closely witnessed the grand glamour of Rama, who was asleep then in the pre-dawn time. His jubilation knew no bounds on seeing Rama who was great blend of dynastic values and valour. He could not resist the temptation of expressing admiration in the form of Rama's morning alarm. Perhaps he meant, it appears, Rama's valour and glamour, owed a lot to his mother Kausalya!

Sri Rama's greatness was enhanced due to his mother, who gave birth to him. So, Viswamitra wake-up call extolling Kausalya, was only for the timely performance Rama's divine tasks.

With this backdrop, I tend to think that 'Alivelu Mangatayaramma garu is Kausalyamma garu', envisaged a Universal Teacher 'Jagada:cha:rya' in her son. Hence, she moulded and motivated our Swamiji as a role model.

The charismatic appeal and the acme of flow of preachings of our Chinna Jeeyar Swamiji always leave an indelible impression on viewers that he is an embodiment of Lord Sri Rama Chandra, if the latter had chosen to be an ascetic with Tridandam!. Except for the bow, kodandam, our Acharya appears like Rama in qualities and conduct. Therefore, our Ammagaru is Kausalya for us.

On various occasions, I have found close resemblance between Sree Rama and our Acharya in many contexts. Sri: Rama was described as,

*"Buddimaan, Madhurabhashee, Poorvabhashee, Priyamvadah…*
*Samyag vidya vrata snatah… Kalyaanabhi Janassadhuh…*
*Dharmagnyah, Satya sandah, seelavaan anasuyakah…"*

Keeping pace with the supreme personality of Lord Sreemannarayana, Sri Rama exhibited in Himself an ocean of all virtues. Similarly, our Acharya endears Himself, with His qualities, to all those who come into contact with Him. He is our gift from Ammagaru and we are eternally grateful to her.

She was always smiling, cheerful and prayerful. By her affectionate pleasantaries and the mode of addressing, she rose even beyond her unique and distinct status as 'Gurumata'. She endeared herself to all,irrespective of status. We cherish her memory and kindness forever, with tearful tributes.

*"kausalya susubhe: the:na puthre:na amithathe:jasa: |*
*yattha:vare:**n**a de:va:na:m adithir vajrapa:**n**ina: ||"* **(2-1-8)**

A Mother has her heart ever and forever with her children no matter how old they grow.

# మహాసాధ్వి

భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వామి,
గాలిపాలెం

**ఓం నారాయణ ఆది నారాయణ జై శ్రీమన్నారాయణ**

ఆకులమన్నాడ చిలకమఱ్ఱి అలివేలు మంగతాయారుగారు

గోత్రం : కాశ్యపస

ఈ అమ్మగారు మహాలక్ష్మి, సీత, సుమతి, సావిత్రి, అనసూయ, సత్యవతి అంశమునకు సంబంధించిన మహాసాధ్వి తల్లి! ఈ అమ్మగారికి మహావిశాలమైన హృదయం, ఈమె మనస్సు తేనె కన్నా తీయదనం, వెన్నెలకన్న చల్లదనం, సహృదయం ఈమె జన్మ కారణజన్మ, లోకకళ్యాణార్థం కొరకు వచ్చిన తల్లి!

శ్రీమన్నారాయణ, రామానుజ త్రిదండి పరివ్రాజక పరమహంస

పరమపూజ్యులు శ్రీ శ్రీ శ్రీ జీయర్ స్వామివారికి అనేకానేక ప్రణామములు.



# కృతజ్ఞతా నివేదన

అజిత్ మరియు తల్లి

నా మొట్టమొదటి అనుభవం, నేను JET లో సేవ చేసేటప్పుడు, 9గజాల మడిశారునిచక్కగా ఎట్లా కట్టుకోవాలి, అని నేర్పించారు అమ్మగారు. తదీయారాధన కార్యక్రమం లో మమ్మల్ని ఎంతో ఉత్సాహ పరుస్తూ ఎన్నో సలహాలు ఇస్తూ, అవసరం అనిపిస్తే వారు కూడా సేవ చేసేవారు.

ఒక్కోసారి, ఎంత సేపైనాఆహారం తీసుకోకుండానే పారాయణలు చేస్తూ వుండే వారు. అదేమిటని అడిగితే, స్వామివారు క్షేమంగా ఉండటమే మాకు కావాల్సింది అనేవారు. ఆచార్యుల గురించి ఎన్నో విషయాలు చెబుతూ, ఆచార్యసేవ నిష్ఠగా చేసుకోవాలని మంగళశాసనములు చేసేవారు.

అప్పుడప్పుడు మా పిల్లల విషయాలలో ఎన్నో మంచి సలహాలు ఇచ్చేవారు. ఇటువంటి ఎన్నో అనుభవాలు, అమ్మ గారితో మేము పంచుకున్నాము.

❖❖❖❖❖❖



# Ammagaru's Blessings... a part of my very being.



**Dr. Devaki, Mysore**

**Most parents look out for the welfare of their immediate family. But Ammagaru was a mother who looked out for the whole world.**

My brother and I always looked up to her as a grandmother with wonderful stories. Her charitable nature, her ability to mingle with people of all ages and backgrounds, and her compassion was an inspiration. There was always a smile on her face, a sparkle in her eye.... treat for all the children who would come and visit her.

I had the fortune of spending a few months in JIVA in Fall 2018. I was blessed to spend a few minutes at the end of each day with Ammagaru. She always used to ask me how I was studying, made sure I was eating and sleeping well, enquiring about how I was feeling, and always providing words of support and encouragement. She used to say, "If you do work hard now, you can help everyone you meet." I used to whine, "Ammagaru! I'm having trouble remembering what I studied!" She used to say, "Just read with a calm, clear head! The important points will stick to you." One day, she thumbed through my notes and said with a laugh, "I can tell where you are focusing, and where you are getting frustrated by the quality of your notes." I didn't show her my notes after that!

Each evening was filled with delightful anecdotes and songs. I never felt out of place or unwelcome; Ammagaru had a wonderful quality of making you feel at home. Those few months that I was away from my family, I never felt that I was missing them.

One day, she asked me, "Did you apply gorintaku this year?" I said, "No Ammagaru! There's no one here who will do it for me!" She said, "I am here! When I am there, who else do you need?" Gleefully, I spent a sunny afternoon picking the leaves from the henna tree, and helped her grind it up. She wrote the word 'Sri' on my right hand. Her blessings seeped into my skin that day, and I will carry those treasured memories with me forever.

Her devotion, her humor, her charm, her wit, her grace, and her charitable nature are qualities that I will strive to emulate. Her gentle presence will be greatly missed, even as we know that she has attained ultimate happiness at the Lotus Feet of Lord Srimannarayana.



For when a child is born the mother also is born again.





# వైకుంఠయాత్ర

జొన్నవిత్తుల రామలింగేశ్వర శాస్త్రి
కవి, సినీ వాగ్గేయకారుడు

1. సీ. వాయువీధులవెంట వార్తపోవుచునుండ
కనులనీరునుగార్చె కపిలగోవు
రామరామ యనుచు రామానుజునితోడ
కుమిలి చూచెను గుడి గోపురమ్ము
వెళ్ళిచూడగ తాను వీలుకాదని మదిన్
దళములిచ్చుచునేడ్చె తులసి కోట
మాతపై చల్లంగ మాపూలు గొనుడనె
పోలేకపోయిన పూలచెట్లు

తే.గీ. అమిత వాత్సల్యమూర్తి యా అమ్మలేక
శూన్యమేర్పడెననుచును శోక మొంది
పట్టు తప్పినదీ జీవ ప్రాంగణమ్ము
మసకబారె నందరి మానసమ్ము

2. సీ. ఆమాతృ మూర్తికిన్ రామానుజునిపైన
భక్తియే జీయరు స్వామి రూపు
ఆ పుణ్యమూర్తిలో అమృతమధురప్రేమ
సద్గురు జీయరు స్వామి బోధ
ఆయమ్మ పూజలో హారతి కాంతులే
సౌందర్య పూర్ణమౌ స్వామి కనులు
ఆ యమ్మ పుణ్యమే అపురూపమైనట్టి
బంగారు జీయరు స్వామి దీప్తి

తే.గీ. అట్టి భక్తి రూపిణి జీయరమ్మగారు
అయ్యో నీనాడు గుడిలోని అమ్మవారు
అమ్మనిక చూడ వలయు సీతమ్మలోనె
పూజలను సల్పి నిత్యమ్ము పుణ్యులార

3. సీ. ఆ తల్లి పుత్రుడే అంతెత్తులో నిల్పె
వినువీధిలో గురువిగ్రహమ్ము
ఆ తల్లి పుత్రుడే ఆదరమ్మును చూప
వర్ధిల్లెను వేదవాఙ్మయమ్ము
ఆ తల్లి పుత్రుడే అడుగు పెట్టిన చోటు
పావనమ్మయిన బృందావనమ్ము
ఆ యమ్మ కొమరుడే జీయరు స్వామియై
ప్రియబోధతో పంచు ప్రేమధనము

తె.గీ చెట్లు పక్షులు రాళ్ళట్లు చెప్పుకొనెను
కళ్ళు చెమరించి గోశాల ఘొల్లుమనెను
పయనమౌ చూడ నాయమ్మ బాటవెంట
అంతిమమ్మున వైకుంఠ యాత్ర వేళ.

4. తె.గీ స్వామి కర్తవ్య బోధతో సంగమించి
రంగనాథ సన్నుతుల తరంగితమయి
తట్టి గుడిగంట యోదార్చ తత్వమతిగ
భక్తి భావము నొంద నీ ప్రకృతి యెల్ల

5. ఉ. శ్రీ యమృత ప్రభావ మృదుశీతల భాషిణి
గేయ విశేషగాయని సుకేతన జీయరు భక్త శిష్య ధీ
నాయక సంతతాశిష సనాతన వైష్ణవ పుణ్యరాశియౌ
జీయరు మాతృమూర్తి, హరి శ్రీపదవాసిని కంజలించెదన్.

బిడ్డ పలికే కొత్త కొత్త మాటలకు అర్థాలు కూర్చే నిఘంటువు అమ్మ






**2011 శ్రీ స్వామి వారి తిరునక్షత్ర హారతికై ఖండాతరాలు దాటిన అనురాగ మూర్తి....**

# Icon of Sacrifice .... Ammagaru

**Smt. Aparna Kamatam**
**JET USA**

**Humble salutations to Pu:jya Sri Swamiji,**



First of all, my humble gratitude and salutations to my parents, Sri:mathi Vasumathi and Srima:n Ramakrishna Reddy garu for raising me with values and showing me the path of Acharya Seva. It was on June 5th 1976, my parents, my sister (Sapna) and I got initiated(sama:srayanam) by Sri Pedda Jeeyar Swamiji. That day was indeed the turning point in our lives as we were all blessed to start our journey on the path of Acharya Seva! Even to this day, Acharya's Krupa continues to shower on us in our pursuit of Acharya Seva!

It was Sri Pedda Jeeyar Swamiji's grace on me that started the journey during my childhood. After Sri Pedda Jeeyar Swamiji reaching paramapadam in 1979, my journey in the path of Acharya Seva was given even more impetus under our Priya Pu:jya Sri Chinna Jeeyar Swamiji. Humble gratitude for Ammagaru for having the courage, vision, and conviction in Acharya nishta and selflessly allowing her eldest son to continue the Acharya parampara and become a Sanya:si for the benefit of one and all.

Those days are still fresh in my mind. Whenever I see Ammagaru or Tha:ya:ru akkayya – all I remember is the golden days of my life from 1976 – 1991. After that, I came to the USA.

We all used to go together to Nampally sathram or Lakshminarayana kovila in Secunderabad to seek Sri Pedda Jeeyar Swamiji's blessings. When an opportunity to volunteer came, Tha:ya:ru Akkayya, Goda, and Mangaya Swamy (Ammagari daughters and son) and I were the first among the rest of the volunteers to volunteer at the bookstall or with setting up and distributing puja material for samu:hika pujas. We used to volunteer but were also very mischievous. Ammagaru was very soft-spoken and a woman of few words, but every word she spoke or her eyes used to speak were very effective.

Sri Pedda Jeeyar Swamiji envisioned to perform 108 Swa:dhya:ya Jna:na Yajnams, but could complete only 102 yagnams. In June of 1979, Sri Pedda Jeeyar Swamiji envisioned the 103rd Swa:dhya:ya

There's no way to be a perfect mother and million ways to be a good one.



Jna:na Yajnam with 1008 yajna kundas to be performed on Thirumala Hills in 1980 and had entrusted a volunteer activity for Amma and Nanna. However, after Sri Pedda Jeeyar Swamiji's reaching paramapadam in December 1979, Sri Chinna Jeeyar Swamiji took it upon himself and completed the remaining 5 yajnas. The 103rd yajnam in Thirumala Hills was completed successfully beyond everyone's expectations. Ammagaru, Tha:ya:ruakkayya, Goda, and I along with many other volunteers spent nineteen beautiful days in Acharya Seva on Thirumala Hills.

Ammagaru, as a single parent (due to the early demise of her husband) raised her five children to be responsible citizens. Irrespective of the hardships faced by the family, there was never a glimpse of dejection or frustration, instead there was always undeterred belief in Acharya.

After hearing about Ammagaru's Acharya Thiruvadi yathra:, my sister Sapna and I were reminiscing what a great woman Ammagaru was. We were also thinking about our parents and their words at that time. "Aa thalli ki yenni dandalu pettina thakkuve. Aa maathru murthi chesina thyagam for the greater good is inconceivable to many". It is not only Ammagaru, the siblings had to sacrifice their brother too. That is the great sacrifice they have done to shape our lives.

Decades ago, Ammagaru was the one who brought the realization of Acharya nishta and Acharya seva in my parents. Since then, they were in Acharya Seva with unflinching devotion until their last breath and guided me to travel in the same path.

Ammagaru with Acharya krupa has sculpted our Swamiji impeccably because Swamiji was always humble, ready to learn, and mold. My father always used to quote this and encouraged us to emulate.

Ammagaru always engaged herself in divine thoughts and Acharya seva which helped her become content with her life.

My most recent and the last interaction with Ammagaru was on July 10, 2019. It was a visit to see Sri Ramanujacharya Swami's Swarna Murthi. Srimathi Sri Gowri and Sriman Mohanchand Koduri along with their children, Purushottam and Gopal, and I returned to JIVA after a two-day visit from spending a wonderful time with the children at the JeeyarGurukulam, Allampally. Sri Chinna Jeeyar Swamiji suggested Suryanarayanagaru (Vikasatarangini Treasurer) to make proper arrangements for us to see the Swarna Murthi. We were all excited and walking to the high-security area where Swarna Murthi was kept. Ammagaru and Tha:ya:ruakkayya joined us as well. Ammagaru was thanking us for the opportunity she had for the darsanam of Swarna Murthi. In fact, we were all overjoyed and felt blessed to see Sri Ramanujacharya Swami's Swarna Murthi along with Ammagaru. If at all Ammagaru wanted to see the Swarna Murthi, do you think that would not have been possible earlier? This behavior exemplifies the simplicity and humility Ammagaru had in not taking advantage of the situation and surroundings for her own personal gratification.

We should all learn from this and imbibe true humility in ourselves.

Always in Acharya Seva.

He didn't realise that love as powerful as your mothers for you leaves its own mark.



# AMMA

**Smt. Chithra Madhavan**
**Chicago**

**First face and first smile a baby sees**

**First word baby utters : AMMA**

From time immemorial Amma, mother has played the most important role in ones' life, may it be in scriptures like Yashodha or Kausalya or in life like our Ammagaru.

If I have to give a form to kindness, gentleness and patience that will be Ammagaru.

We all know that mothers make a lot of sacrifices in their life and do without sleep, food or new clothes so that the family can thrive. But Ammagaru took sacrifice a step beyond, she gave up her firstborn for betterment of humanity. What can one expect from the daughter-in-law of a great Acharya!

She was a sterling example of mother and humanity with her welcoming smile, hospitality and humility. These are only very few examples of her virtues. She never exhibited any pride about her status in JET family, always staying in the background. But for the crowd around her, or Jeeyar Swamiji paying obeisance to her, people won't even know who she was. That's how humble she was.

I had been blessed to know her for 25 years, and I had learnt courage, tolerance and patience from her. When I was nervous about meeting her for the first time she put aside my fears with her serene smile and warm welcoming ways. When she had a fall and injured her ankle, she was still determined to participate in the program in Badrinath. She wasn't one to waste time when there are things to do. She was always offering Prasadams to tired travelers and devotees, in-spite of her own tiredness. She was putting others ahead of her.

She had brought up her children and grand children with great values by setting up an example of her own life. She would be a tough act to follow.

She had lots of companionship, but she didn't while away her time wastefully, instead doing very worth while activities like reading scriptures and singing to God or about God. She motivated others by leading an exemplary life and guiding them in Acharya Seva and Charitable endeavors.

She had set a very high standard in life which will be a tough act to follow.

Her loss will not only impact her immediate family, but hundreds of thousands of others.

Not only was she an Amma for her children, but for the whole JET family.

A Mother is she who can take place of all others but whose place can no one else take.



**A: Amma personified**
**M: Memorable**
**M: Motivator**
**A: Artistic**
**G: Graceful and giving**
**A: Affectionate**
**R: Revered and Remarkable**
**U: Unique and Unpretentious**

These only a few her sterling qualities.
I am a richer person knowing her.
The young people should learn about her and learn from her.
The elders should follow her.

**BUT NONE SHOULD FORGET HER OR HER GIFT TO THE WORLD.**

**SHE IS MY "WOW".**

❖❖❖❖❖❖

# Gratitude



**Srinivas Pallavi Shakelly**
**Sidhanth, Purvi**
**Volunteers from New Jersey, USA.**

We are very fortunate to have had a few opportunities to visit, spend time, and serve Amma garu in her home while we were staying at Divya Sa:ketham during Dhanurmasam in December 2017. Her presence was like a sweet mother, and we were very grateful to hear Her sing a couple of songs for us. Her soul was so calming to be around, Her blissful personality had a moving impact on all of us. She graced us by allowing us to take care of Her hands and feet with some massaging and take Her blessings. She smiled without reservation, sneaking Her way into our hearts without us realizing. She was completely unaware of the gift She gave the world. She told us stories of Swamiji's childhood and demeanor and gave us another angle to look at someone we all see as an icon.

Sri Swamiji is so much like His mother in His features, talking style, and expressions, we could see Swamiji's face while talking to Amma garu. When we went to say goodbye, while leaving the asramam, She blessed us and invited us to come over next time we visited Bharat. Her sweet innocent contagious smile made a permanent impression in our hearts.

**With lots of love, gratitude, and respect.**

*A mother is the only one who can understand what the child could not say.*

# Random Memories



We are forever indebted to the great soul our "Ammagaru"! We always had a chance to meet and greet her at Divyasaketam . Her presence was serene and she always carried a divine aura. We will miss you. We will continue our selfless service in spreading Swamiji's mission and inspire others.Thank you for being there for us ammagaru. Jaisrimannarayana

**Jamuna**

**New Jersey**



Mother of all mothers is how I would describe Ammagaru - Amma as she allowed me to call her, out of sheer affection for her. I was very fortunate to meet her for the very first time and be introduced to her at the most auspicious place Badarinath for an even more auspicious celebration of Pedda Jeeyar Swamiji's 100 year celebrations. Ever since, I have been blessed to interact with her everytime I went for our Swamiji's thirunakshathram.

Ammagaru was extremely caring, considerate and always kept a low profile which is a very commendable quality for one who is the mother of our Swamiji. She loved distributing sweets to the little Vedic students. She seemed always to find great pleasure and happiness in simple acts like this.

She was a very strong person who never complained about any thing and always had a positive response. Last month, even though she was in pain, her response to my enquiry about her health was 'bagunnanu'.

Our mothers loved their own children but, ammagaru loved everyone has her own child.

**Krishna Naidu**

**New Jersey**



I am very blessed to receive Ammavari A:si:sulu in Houston, TX in 2011 during Swamiji's Tirunakshathram celebrations. She does not know me personally. But when requested, she my mother, whole heartedly blessed me along with other devotees. This is Avyaja Karuna of mother.

**Vuduta Srinivas**

**New Jersey**

*The world's greatest miracle created by God is a MOTHER who can't be replaced by anyone.*



# Our Yasodamma

**Neelima Kasukanti**
**New Jersey**



Three years ago, it was my first trip to JIVA ashram in Shamshabad. I had a dream prior to that night in which Amma garu was requesting Pujya Swamiji with tears in her eyes, “Please take me along with you”. I had never met Amma garu before that, only saw her once in a video. Next morning, I had a chance to meet Amma garu. My friend told Amma garu that I had a dream about her. Amma garu jokingly said, “since you have never met me before, how did I look in the dream?”. Of course, I didn’t dare to share the dream with her.

The whole time I was with her, I couldn’t stop admiring her. She looked like a freshly bloomed lotus flower. The smile and the way she speaks are exactly like Sri Swamiji’s. The photos and videos we see do not do one bit of justice to her actual rupam/swarupam. Her kattu/bottu are impeccable. Many people used to ask Amma garu to teach them how to wear sari. Personally, for me, every time I put thilakam shapelessly, it reminds me of Amma garu, she always has this perfectly shaped urdhva pundram.

Till recently Amma garu cooked her own food. With Acharya’s grace, I was fortunate enough to experience Amma gari chethi vanta (cooked by her). As she lovingly served each dish, I was feeling terribly guilty that I was troubling Amma garu. She gently scolded me saying, “thinaali amma:yi! vaddu, vaddu anakudadu”. I offered to clean the dishes and she lovingly accepted. It was humbling to see Amma garu, who gave birth to such a great Acharya, living in such a small room and doing most of the chores herself.

Even at 85, Amma garu never liked to depend on anyone. Whatever little money she had, she used to contribute it to Sahasra:bdi. She encouraged everyone not to bring gifts, but instead contribute to the many service programs undertaken by our Acharya.

It has been a tradition that Amma garu adorns Sri Swamiji with a garland and gives ha:rathi on the day of Acharya Thirunakshathram. This past Thirunakshathram, devotees wanted Amma garu to offer our Acharya a unique garland made of dry fruits (cardamoms etc.). As mother’s heart knows best, Amma garu was hesitant at first. She might have thought it wouldn’t be as soft and delicate as a flower garland. But eventually she was convinced by the others. When Amma garu offered the garland, Sri Swamiji like an obedient child asked, “Is this the one?”. Amma garu said yes and Sri Swamiji obliged. We could witness Sri Swamiji’s saulabhyam as He kept the garland for many hours while offering theertham for thousands of devotees. It reminded us of how Lord Krushna goes to any level for His devotees’ happiness and willingly gets tied up by Yashodamma.

The first thing that comes to mind when we think about Amma garu is Her heartful managala:sa:sanams to Acharya. Her pure heart is full of blessings.

Amma garu, we pray to you to strengthen our minds and purify our hearts to be always in Acharya Seva. Jai Srimannarayana!

***Life begins with waking up and loving my mothers face.***



# Random Memories



Amma Garu stayed at our house in Chennai a few times along with His Holiness during His sojourns to Chennai. (I am the grandson of Late Sri Pathalam Chandriah Garu and son of Late Sri Pathalam Niranjan Garu).

I am indeed privileged to have received Amma Garu's blessings last year – 2019 on my Birthday at JIVA. I was even more surprised and speechless when she sent me a box full of sweet - Mysorepak that night. It was a great and unforgettable Birthday for m having received Mangalasa:sanams from Sri Swamiji, blessings from Amma Garu and spending the entire day at JIVA with the members of JET Chennai.

**-P. Viswambhar**
**Chennai**

It was HH's Thirunakshatram celebrations at Nizamabad.

It's a tradition that Amma garu applies oil on HH's head on every birthday , and people lineup to get the Sesha Tailam (left over oil) from Amma garu. That year, Amma garu, while handing me the shesha tailam blessed me saying (in her own words ) "swamivariki eppudu tho:duga undandi"

Whenever I come across Amma garu, that divine blessing rings in my heart.

This reflects how Amma garu wants everyone to take part in HH's divine endeavours.

**Hari Voruganti**
**Hyderabad**

# Tribute to Divine Mother

**Solange**
**Brazil**

To Honor Amma Garu I will borrow this beautiful verse from a Brazilian poet Cecilia Meireles...

*"Those who know you,*
*are forever touched in their hearts,*
*O patient India,*
*for they know the vast boundaries of your dramas,*
*and admire the path you follow*
*in search of a wise happiness:*
*-that happiness,*
*O India,*
*one attains with discipline of soul,*
*which is steep for it is lofty, and which, to overcome time,*
*stands vigorous and soft, alert, firm and diligent. "*



*We are born of love; Love is our mother.*



# Ma:thru De:vo: Bhava

**Prasanth Nallan Chakravartula**
**JET Australia Foundation**

Every weekend we remember you with gratitude and teach our Prajnites the values of unflinching Acharya Seva, Universal love, Service to society.



We have seen this embodiment of love, compassion and ultimate sacrifice from *Mother Sumitra Devi* from Srimad Ramayanam. The good fortune of being in constant service of Acharya Seva is not something everyone can aspire for, and it is with this priceless treasure that our Swamiji was endowed, in bountiful measure with your blessings. Unflinching faith in Acharya Seva by following Pedda Jeeyar Swamiji's footsteps and taking the messages globally was possible with your blessings.

Human bodies will come and go but the values remain and the path shown by elders like you will be a beacon for generations to come.

We all are very fortunate to be born in this generation and to know a person who is an embodiment of Love, Compassion, Humility and Inspiration to all in the form of you AMMAGARU.

**MANY MANY DASOHAMS.**



# Mother

**Vishnu & Aruna, USA**

Jai Srimannarayana!!

We are blessed to know Amma garu. She is the person who inspired the inspirer (Chinna Jeeyar Swamiji)

We were fortunate to have her blissing. She used to tell some of the stories of Smamiji's childhood, How he was particular about his hair style and prominence given to appearance to mastering the spiritual world.

We had the opportunity to witness how meticulously she is to handle and celebrate Swamiji Birth-Day


The smile, the kindness, the forgiveness of Swamiji must have come from his mother

Once again we are blessed to associate ourself with Amma garu.

*When you look into your mother's eyes, it is the purest love you can find on this earth.*



# An Unforgettable Saga......
# With Ammagaru



**Smt. Radhard**

"Come girls, let's all play Bommala:ta" said one of my friends. We went jumping and running to the backyard. We took a huge chunk of clay and moulded it to make some models of vessels, serving spoons, a fire place, a mortar with a pestle and serving plates. Others collected some leaves and wild flowers to use them as ingredients for cooking.

I was watching them but didn't feel like participating in that game. I looked around and found a flat stone somewhat rectangular in shape. I created an altar and a lamp and placed the stone on the altar. Imagining that stone to be Lord Krishna, I pretended to do puja using flowers. Whenever, I had time, I would do the same. I used to love that game very much, each time thinking of a different form of God. My parents and aunts would always appreciate how beautifully I arranged the altar and decorated the Lord (the stone) with flowers of different colors. That was how I spent my childhood days......"

Well, this is one of the many anecdotes Ammagaru shared with me in our evenings. Her youthful devotion to the Lord must have matured. This devotion is what she must have passed on to her children.... this is what we are imbibing from our Acharya !

In 1981, my father took me for a discourse of HH Chinna Jeeyar Swamiji. That was the first time I had the darsan of Sri Swamiji. My young mind couldn't understand much of what he said. But what mesmerising eyes He had! What captivating voice He had! There seemed to be some magnetism around him. I kept getting drawn to Him.

After a few years, my father was transferred to Bhuvaneswar. And Guess What... HH visited Bhubaneswar in 1988-89 during the padayathra program for Universal peace. My father was one of the organizers. HH Swamiji along with Vedic students reached Bhubaneswar from Puri. Before leaving, HH gave 3 Puri Jagannath mementos and asked him to parcel them to three different places. Out of curiosity, when asked about one of the recipients, HH replied "*maa ammagariki*" in a soft, sweet voice filled with reverence when uttering the word "amma garu".

The parcel was sent and after a few days we received a letter. It was from Ammagaru. It seemed Subhadra devi in the memento was tilting a bit. She enquired who we were and mentioned that she never got a chance to visit Puri. We were so excited to receive a letter directly from HH Sri Swamiji's mother

***A mother is not a person to lean on, but a person to make leaning unnecessary.***



and read it many times. Our father replied to Ammagaru introducing ourselves and invited her to Puri and Bhubaneswar. That was my first interaction with Ammagaru.

Few years passed. After getting transferred to Hyderabad, we saw ammagaru for the first time. We, as kids were awestruck at her simplicity and loving nature. The very idea of meeting her in person, a lady who gave birth to such a great Jeeyar Swamiji made us feel as if we met the President of the country. In 1999, my husband who went to America for better prospects had sent money from his first salary. It was Dhanurmasam time. I went to JET Domulguda and met Ammagaru and expressed a wish. I asked ammagaru if we can do a mass prayer wherein each devotee would light 8 ghee lamps signifying Ashtakshari manthra to Lord Venkateswara and pray for the well-being of Acharya on *'anri ivvulagam'* pasuram day. Ammagaru felt very happy and blessed the program. Lamps and tins of ghee were ordered.

That day devotees thronged the JET asramam. All devotees along with ammagaru prayed fervently to the Lord lighting all the 8 lamps. Lights were switched off.... In the darkness, hundreds of lamps added a divine aura to the atmosphere....Each and every devotee's heart seemed to pulsate with joy. After the program, ammagaru called me onto the stage, garlanded me and blessed me wholeheartedly to do many kainkaryams to Acharya. *I am sure Ammagaru's blessings will be actualized and I will become a perfect instrument in the hands of our beloved Acharya Sri Chinna Jeeyar Swamiji.*

From 2012-13, my association with Ammagaru increased even more. I was lucky to observe Ammagaru from very close quarters. She shared many life experiences, a few of them happy ones but many challenging and heart wrenching too.

I was amazed at the mental strength and will power she displayed while undergoing such difficult times. Hardships spread over many years but still she always felt contended. She never questioned herself or the Lord as to why she was undergoing such sufferings.

Her unshakable faith in Pedda Jeeyar Swamiji, her Acharya and the Supreme Lord while going through such adversities was a real eye opener for me. Ammagaru's progressive thoughts that women should always be self-reliant made me realize her broadmindedness.

The efficacy with which Ammagaru carried out a conversation with people of all ages and status would put even the best communication experts in today's world to shame. Her skill in getting tasks done is no less than that of a PMI certified professional.The beauty and grace with which she carried herself was astonishing. Her kind and sharing attitude for one and all is unparalleled.

Non-stop chanting of Lord's names even while sleeping showed her strong faith and practice. Her love for Ramanujacharya and her passion and enthusiasm to propagate sampradayam were highly inspiring.

**Above all, ammagaru was so pure at heart that every word she uttered became 'sathyam'.**

I often wonder, would I find these qualities in the so called 'highly educated' people. Do degrees give us such abilities? I don't think so. After all Ammagaru's formal education was only upto Class 6.

A fully bloomed, fragrant tree tells us that the cause, the seed was of high quality. Hence, there is no doubt that Lord chose Ammagaru's womb to nurture and give birth to HH Sri Swamiji. In fact, we should show our gratitude to Ammagaru's mother too for giving birth to such a wonderful being. She

A mother's arms are more comforting than anyone else's.

must have been equally qualified to become a mother to Ammagaru. Hence, I feel, HH Sri Swamiji performed the last rites to Ammagaru's mother too before taking the ascetic order.

Every night when I used to touch her feet she used to bless us to do Acharya kainkaryam well. Even today, Ammagaru calling me "Radha", "oye Radha", "ammayi" with her sweet voice echoes in my ears.

Oh heart! Reminisce and cherish the few moments spent with Ammagaru. Ammagaru! Bless our Acharya and us to fulfil the mission of Pedda Jeeyar Swamiji! Oh Divine Mother! Bless Swamiji with strength and good health to be successful in relieving us jivas from this mundane world and bring a smile on the face of the lotus eyed Lord Narayana who is pining for us. Dear Mother! Bless mother Bharath, so that in every generation, there are Mothers like you and worthy sons like Chinna Jeeyar Swamiji to guide Bharatvasis as well as the rest of the world. Let the beacon of light, lit by Bhagavad Ramanuja, spread its effulgence for eons to come!

# Lonely Without You....

**Renu and Sreenivasachary Tamirisa**
**Houston**



We are all very much saddened by the news that Mataji reached Paramapadam to rest in peace at the lotus feet Sreemannarayana.

We knew her from childhood in Rajahmundry and met her with HH Sri Peddajeeyar Swamiji a couple of times when we were very young. She always treated us very kindly and affectionately.

She always identified me as son of Dr. Krishnamachary from Tanuku. When she visited Houston, she stayed at our house and blessed us all. During her stay, she fell at the steps. We were very upset that she was hurt but she was very calm and collected and assured us that everything was fine. It was a scary experience, but she was only smiling even in that pain. We were very surprised at her calmness which is really Divine.

She was like Yasodamaa and HH was like Chinni Krishna for us we enjoyed her compay and felt divinely blessed. She was kind, simple and never showed off as the mother of HH. She was most unassuming lady. She gave us our Acharya to guide us towards the divine path to Moksha.

**We miss her a lot and it is lonely without the MOTHER.**

*To describe my mother would be to write about a hurricane in it's the perfect place.*



# మార్గదర్శి

శ్రీమాన్ కృష్ణకాంత్, డాలస్
VT SEVA



"ఏతీరుగనను దయజూచెదవో" అనేకీర్తనతో భక్తరామదాసు భద్రాచల రామనారాయణుడిని ప్రార్థిస్తూ "నిను కన్నది కాన్పురామా" అని కౌసల్యాదేవి గొప్పతనాన్ని ప్రకటించారు. నిత్యము శ్రీరామచంద్రుని కొలుస్తూ, శ్రీరాముని సుగుణాలని ఆచరిస్తూ, మాలాంటి వానరమూకలని చైతన్య పరుస్తూ సేవామార్గంలో నడిపిస్తున్న మా ప్రాణ సమానులైన చినజీయరు స్వామిని మాకు ప్రసాదించిన అమ్మగారు కౌసల్యా దేవిలాగా గొప్పవారే!

అమ్మగారితో ప్రత్యక్ష అనుబంధం నాకు తక్కువే. రెండు సంఘటనలు మాత్రము నాకు ఎప్పటికీ గుర్తుంటాయి.

2015 వ సంవత్సరంలో శ్రీస్వామివారి తిరునక్షత్రము సందర్భంగా అమ్మగారు స్వామివారిని తెలవారక ముందు ఆశీర్వదించిన ఘట్టం దగ్గర నుండి వీక్షించడము నా అదృష్టం. స్వామివారు అమ్మ గారిని గౌరవించిన విధానం నాకు స్ఫూర్తిదాయకం. సుమారు మూడు గంటల తర్వాత స్వామివారి ఆజ్ఞతో నాకు తిరునక్షత్ర మహోత్సవంలో స్టేజీపై నుండి అమెరికాలో ఆచార్య స్ఫూర్తితో జరుగుతున్న **విటి సేవా** కార్యక్రమాలగురించి అందరితో పంచుకునే అవకాశం లభించింది. స్వామిగారి పాదాలకు నమస్కరించి, వారిని మాకు ఆచార్యులగానందించిన వారి ఆచార్యులు శ్రీపెద్దజీయరు స్వామివారికి మరియు మాతృమూర్తి అమ్మగారికి మొదటగా నా నమస్సుమాంజలులు అర్పించాను. స్వామివారు 2012లో మాకు తల్లి గొప్పతనాన్ని తెలియపరుస్తూ అందించినపద్యాన్ని, అమ్మగారిని చూస్తూ భక్తి పూర్వకంగా కృతజ్ఞతా భావముతో పలికాను. అలా నాకు వారికి కృతజ్ఞతలు తెలిపే సన్నివేశాన్ని స్వామివారు కల్పించడము నా అదృష్టం.

తండ్రికంటేకొలుచుదైవమ్ముకంటెను
గురులకంటేసర్వసురులకంటే
తల్లిపాదములకుతలవంచిమ్రొక్కిన
కరతలామలకములరయసిరులు ॥




రెండవ సంఘటన నేను స్వామివారితోపాటు నేత్ర విద్యాలయ క్లాసుకి వెళ్ళివచ్చిన తరువాత జరిగింది. స్వామివారు నేను కలిసి **విటి సేవా** గురించి చర్చిస్తూ రాత్రి పదకొండువరకు కూర్చున్నాము. ఆసమయములో అక్కడికి అమ్మగారు వచ్చారు. నేను నించొని వెళ్ళిపోదామనుకుంటే, స్వామివారు నన్ను వెళ్లనివ్వలేదు. మాచర్చ ఇంకో అరగంట అలాగే సాగింది. స్వామివారు నన్నే తదేకంగా చూస్తూ **విటి సేవా** మార్గ నిర్దేశ్యం చేశారు. ఇది జరుగుతున్నంతసేపూ అమ్మగారు ఒక పదడుగల దూరములో అలాగే ప్రశాంతముగా నించొని ఉన్నారు. ఆతరువాత అమ్మగారు స్వామిగారికి మంగళాశాసనం చేసి సెలవు తీసుకున్నారు. నేను కూడా స్వామివారికి దాసోహములు సమర్పించి బయటకువచ్చాను. అప్పుడు కృష్ణకుమారిగారు నాకు అప్పటి వరకు జరిగిన సన్నివేశాన్ని విశదీకరించారు. అమ్మగారేమో స్వామివారు విశ్రమించేవరకు ఆగి మంగళాశాసనము చేసిన తరువాతే



నిద్రపోయేవారట. స్వామి వారేమో అమ్మగారు అలా కష్టపడకూడదని మాకు ఇంతరాత్రి మంగళాశాసనం చేయద్దు అని చెప్పారట. నిత్యము సేవా మరియు భక్తి కార్యక్రమాలతో స్వామివారు ఎంతోమందికి రాత్రీపగలూ నిర్దేశం చేసేవారు గనక కృష్ణుడు ఎలాగయితే యశోదమ్మను ఆట పట్టించాడో, స్వామి వారు కూడా తమ ఆచార్యసేవా కైంకర్యకర్తవ్యములో ఉండి అమ్మగారిని కావాలని నించోపెట్టారట. కానీ చివరకు అమ్మగారి ప్రేమదే విజయము. యశోదాకృష్ణులు ఎలాగయితే పట్టుదలతో ఉలూఖలబంధనవృత్తాంతాన్ని మనభక్తులందరికీ అందించారో, అలాగే అమ్మగారు, స్వామిగారు అదే దృశ్యాన్ని ఆనాడు ఈభక్తునికి దర్శింపచేసారు. సుశీలవతి అయిన అమ్మగారికి ఆశ్రీరాముని సౌశీల్య గుణమే మన చిన్నజీయరు స్వామిలాగా అవతరించింది.

అమ్మగారు నడిచి, స్వామివారిని కూడా ఆచార్య సేవలో నడిపించినజీవన విధానము మనందరికీ సేవా రూపంలో అందించిన చక్కని రహదారి. ఆదారిలో నడుస్తూ ఆచార్య సేవలో సమాజానికి, పెరుమాళ్ళకి దాసులమవుదాము.

## అమ్మ ఎవరికైనా అమ్మే



**మాధవీరవీంద్ర, వి.టి. సేవా మహిళా ఆరోగ్య వికాస్**

దివి నుండి భువికేగిన మన అలివేలు మంగతాయారమ్మగారి దివ్య శ్రీచరణ సన్నిధికి మహిళా ఆరోగ్య వికాస్ సమర్పిస్తున్న అక్షరమాల, సమాజానికి ఆయువు పట్టు అయిన మహిళల ఆరోగ్యాన్ని కాపాడుచున్న మానవతామూర్తి శ్రీ స్వామివారిని మనకు అందించిన మహోన్నతురాలు మన అలివేలు మంగతాయారమ్మ గారితో మహిళా ఆరోగ్య వికాస్‌కి ఉన్న అనుబంధం అపూర్వమైనది మరపురానిది, 2007వ సంవత్సరంలో మన ఆచార్యులు శ్రీ చిన్న జీయర్ స్వామి వారు మహిళా ఆరోగ్య వికాస్‌ను ప్రారంభించిన సందర్భంలో మన అలివేలమ్మ స్పందిస్తూ సమాజంలో ఎవరూ చేయలేని కార్యక్రమాన్ని ఆచార్యులు అందిస్తున్నారని, తల్లి బయటకు చెప్పుకోలేని ఆరోగ్య సమస్యలపై పరీక్షలు జరుపుచున్న ఉచిత వైద్యం అందరికి అందాలని ఎప్పటికప్పుడు ఆశీర్వచనాలు అందించేవారు అందులో భాగంగా ప్రతి సంవత్సరం మహిళా ఆరోగ్య వికాస్ నిర్వహించే (ఫిబ్రవరి -04) ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై చక్కటి ప్రోత్సాహాన్ని కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపుతూ ఆశీర్వచనం ఇచ్చేవారు. శ్రీస్వామి వారు ప్రారంభించిన ఆరోగ్య వికాస్ కు సంబంధించిన మొబైల్ స్క్రీనింగ్ వాహనం ద్వారా ప్రప్రథమంగా అర్తమూరు హరిజనవాడలో శిబిరం చేయవలసిందిగా సూచన చేశారు, మహిళా ఆరోగ్య వికాస్1100 శిబిరాలు (ఫిబ్రవరి -08 -2020) పూర్తిచేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆచార్యుల తో కలిసి ప్రారంభించి మంగళాశాసనం అందించారు, అమ్మగారిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించినప్పుడు నేను కూడా ఆరోగ్య వికాస్ కార్యకర్తలందరూ ధరించే ఆకుపచ్చ చీరనే ధరిస్తాను అని వారు కూడా దాన్ని అనుసరించి (చివరి) మంగళాశాసనం అందించారు. మహిళలకు ఆరోగ్యప్రదం అలివేలు మంగమ్మ దీవెన, వేరెవరికీ దొరకని అదృష్టాన్ని ఆరోగ్య వికాస్ కు అందించిన అమ్మ అలివేలమ్మ, ఏ తనయుడు చేయలేని త్యాగాన్ని మానవత్వాన్ని రంగరించి తన తనయుడికి అందించి మహిళా లోకానికి రక్ష పెట్టింది మా అమ్మ అలివేలు మంగమ్మ, దిన దినాభివృద్ధి చెందుతున్న మహిళా ఆరోగ్య వికాస్ సేవలకు తిరుగులేదు అని అన్న మా అమ్మ అలివేలు మంగమ్మ, "అమ్మ అందరికీ అమ్మ అనే నానుడి మన తాయారమ్మకు వ్యక్తీకరించడం అతిశయోక్తి కాదు".

**తల్లి ఆయుష్షే కుటుంబ శ్రేయస్సు**



# A Great Sculptor ....



**Kiran Vangala**
**VT Seva, Seattle**

The quality of a sculpture outlines the skill and adroitness of a sculptor, similarly the quality of human states the direction and guidance of their parents especially their mothers. Women have always played a strong role in the history of Bharat, we have seen many exemplary heroes being shaped by their mothers. Bharat matha has taken the form of these mothers whenever Bharat needed a protagonist at the need of hour. Mother Kausalya shaping Srirama to be the maryada purshottam, Jija bai coxswaining Chatrapathi Shivaji to lead the concept of Swarajya, Heeraben carving the current prime minister Narendra Modi to be the exemplary leader to lead Bharat in current times.

In the same lines, Amma garu has raised her son Srimannarayana to become HH Tridandi Chinna Srimannarayana Ramanuja Jeeyar Swamiji, an unparalleled spiritual leader, an erudite scholar and philosopher, an emissary of peace, an ever helping inspirational trailblazer, above all, our beloved Acharya who has a mission of ‘Serving all beings as service to God’.

Amma garu was motivated and enthused by the archetypal of PeddaJeeyar Swamiji’s works on spiritual, patriotic and social welfare. Amma garu has guided her son Srimannarayana to contemplate in the lines of sanatanadharam to samajikaseva. She instilled the qualities of leadership, persistence, compassion, love and slowly molded and shaped enough for PeddaJeeyar Swamiji to accept him as his shishya and later to be considered as trailblazer to continue his works. If not for Ammagaru’s decision to let go for her beloved son for the service of nation, for the service of santana dharma, for the service of the downtrodden, we would not have our Acharya, his vision to establish such great non profit institutions to serve one and all. We all would not have had this opportunity to be part of this wonderful journey to serve, to volunteer, to give back, to reflect, to love. We all owe it to our beloved Acharya’s mother, Ammagaru, our Ammagaru.

❖❖❖❖❖❖



# అమ్మ మహిమ

పవిత్ర, వాషింగ్టన్ డి.సి.



వికాసతరంగిణి రాజమండ్రిలో ప్రారంభమైన నాటినుండి సేవ చేసుకొనే భాగ్యం దాసురాలికి కలిగింది. రాజమండ్రి పుష్కరాల సమయంలో పుష్కరాల రేవుకి స్నానానికి వెళ్ళాము. అప్పుడే అమ్మగారు స్నానం చేసి ఇంటికి వెళ్ళాలని బయటకు వచ్చి నిలబడ్డారు. అమ్మగారికి దాసోహం చేసుకొని "అమ్మా! మీ ఇంటివైపే కారు వెళ్తోంది, రండమ్మా తీసుకువెళ్తాను" అని అమ్మగారిని కారులో వాళ్ళింటికి తీసుకువెళ్ళాను.

అమ్మాగారు వారింట్లోకి నన్ను రమ్మన్నారు. "ఫరవాలేదు వెళ్తానమ్మా" అని ఎంత చెప్పినా నా చెయ్యి పట్టుకొని వారింట్లోకి తీసుకొని వెళ్ళి ఆడపిల్లకిచ్చినట్లు పసుపుకుంకుమ, ప్రసాదం పెట్టి ఎంతో ఆప్యాయంగా మాట్లాడి పంపించారు.

స్నానం చేసి మడిబట్టలతో ఉన్న అమ్మగారు మాలాంటి వారిపై చూపించిన ప్రేమ నేను ఎప్పటికీ మరువలేను. చిన్న ఉపకారం చేసినా జీవింతాతం గుర్తు పెట్టుకోవడం శ్రీరామ చంద్రుని గుణం. శ్రీరాముణ్ణి ఆరాధించే అమ్మగారు కూడా అంతే. ఎక్కడ కనిపించినా ఆ విషయం గుర్తు చేసేవారు. భాగవతోత్తముల సేవ భగవంతునికి ఎంత ఆనందాన్ని కలిగిస్తోందో బదరికాశ్రమంలో మేము అమ్మగారి విషయంలో చూసాము.

ఒకరోజు బదరీనారాయణుని అభిషేక కార్యక్రమానికి మా స్నేహితులమంతా బయలుదేరాము. ఎవరికైనా ఉంటుందని ఒక టిక్కెట్టు "చిన జీయరు స్వామివారి పేరు మీద కొన్నాను. ఎవరైనా వస్తారా అని చూస్తున్నాను" అన్న మా మాటలు అమ్మగారు విన్నారు. "మీతో నేను కూడా ఆలయానికి రానా?" అని అడిగారు. మాకు చాలా సంతోషంగా అనిపించింది. "అంతకంటేనా అమ్మా! మా అదృష్టం" అంటూ అమ్మగారిని తీసుకొని వెళ్ళాం.

ఆలయపరివారం పుష్పమాలతో బయట నిలబడ్డారు. పేర్లు పిలుస్తారు కదా! అని మేము ఎదురు చూస్తున్నాము. అలయ కమిటీ మెంబర్ ఒకరు నేరుగా అమ్మగారి దగ్గరకు వచ్చి "మిమ్మల్ని చూస్తే చిన్నజీయరు స్వామివారిని చూసినట్లే ఉంది. మా దగ్గర చిన్నజీయరు స్వామివారి పేరుమీద టిక్కెట్ నమోదు అయింది. వారు వేంచేస్తున్నారేమో అని ఎదురు చూస్తున్నాము" అన్నారు. "మేమే ఆ విధంగా టిక్కెట్ తీసుకున్నాం" అని చెప్పాము. అమ్మగారిని ఎంతో గౌరవమర్యాదలతో ఆలయంలోకి తీసుకొని వెళ్ళారు. అమ్మగారు చాలా ఆనందంతో అభిషేకం సేవించుకున్నాక ఆశ్రమానికి చేర్చి నేను, మా స్నేహితురాలు మా వసతికి బయలుదేరాం. మా వెనుక ఎవరో పెద్ద గొంతుతో నారాయణ మంత్రం జపిస్తూ వస్తున్నట్లు అనిపించింది. ఇద్దరం వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ లేరు. చుట్టూ చూస్తున్నాం ఆశ్చర్యం!! నరనారాయణ పర్వత సమీపంలో పర్వతమంత ఎత్తులో కమలంలో ధ్యానం చేస్తూ నారాయణమంత్రం జపిస్తూ దర్శనమిచ్చారు. మా కళ్ళను మేమే నమ్మలేకపోయాము.

***అష్టాక్షరీ యాగం*** ఆ రోజుతో పూర్తి అయింది. నారాయణుని దర్శనం లభించింది. ఇదంతా అమ్మగారిని తీసుకొనివెళ్ళి బదరీనారాయణుని సేవించుకున్నందువలనే" అని అనిపించింది. భాగవతులసేవ భగవంతుని కి కూడా ఆనందమే కదా! ఇది మేము ఎప్పటికీ మరచిపోలేము.

శ్రీరామానుజ సహస్రాబ్దికి రామానుజ వైభవాన్ని అందరికీ తెలియజేయడంలో అమ్మగారుకూడా తమ వంతు సేవలందించారు. "ఆచార్యసేవ"లో ఎలా తరించవచ్చో ఆశ్రమానికి వచ్చినప్పుడల్లా అమ్మగారు మాకు చెప్పేవారు. అమ్మగారి మంగళాశాసనములు ప్రత్యక్షంగా పొందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రతి వ్యక్తిని ఎలా గౌరవించాలో, ఆచార్యులకు ఎలా సేవలందించాలో అమ్మగారిని చూసి తెలుసుకున్నాము.

❖❖❖❖❖❖

**అ అంటే అమ్మ, అకార వాచ్యుడు! ఆ అంటే ఆవు, ఆచార్యులతో విద్య నేర్వేది మన మాతృభాష!**



# WE MISS YOU AMMA

**Praveen and Swetha Sirivolu**, ALT, Houston, USA

We are very fortunate to spend some valuable time with Pujya Amma garu during her visit to Houston for Acharya Tirunakshatram celebrations in 2011.Those celebrations days, October 27 2011 were like in Vaikunta, the Shashra Kalashabhishekam , Homams, Acharya pada puja, cultural programs, Spiritual discourses and with many more traditional rituals.

Pujya Amma garu blessed everyone during Oct 26th Mangalaharathulu, which is a unique and special tradition before the Deepavali festival, and this ceremony was a life time moment for all of us with Amma garu. Acharya Tirunakshatram celebrations went on so divinely and was spectacular for all of us to behold.

The same year we were blessed with Amma guru's visit to our place. It was a divine experience, Amma garu is a personification of simplicity with astonishing smile. Amma garu always use to sing only glory songs of Acharya and Perumal with her every soothing sweet voice, those who heard the songs know what am talking about, that soothing mesmerizing voice. Amma garu used to carry a diary as her companion at all times and used to note beautiful songs in it. Amma garu used to write such beautiful and in-depth songs which would bring tears to us. When ever we meet her, she welcomed with a beautiful smile and always use to ask about our welfare and offered us food just like a mother.

She always blessed us to do Acharya Seva. And she stands real world example for all of us to do Acharya Seva with all commitment. we will all miss her deeply.

Amma garu reaches Paramapadam , divine abode. Our heartfelt Pranamams to Amma garu's lotus feet.



*Amma is the best role model for her child*



## MOTHER - GUIDE



**Abhijna**- JIVA

It was such a wonderful day that i met Ammagaru also my first experience to meet directly in person.I still remember it was chaturmasyam , in midst of others i got the oppurtunity to serve lord with possible kainkaryams but in a due course i made a mistake in kainkaryam that ammagaru addressed to me very politely saying that what ever you offer to God/Acharya should be pure and it indirectly effects everyone, you should be always alert while doing kainkaryam to God/Acharya,always need to be follow the cultural rules and regulations which God likes. She addressed to me that i should be the one to protect God and helped me to inculcate culture in kainkaryam which i still keep in best practices. Ammagaru often smiled at me whenever i remeber these words spoken by her.

## ENNA THAPAM SEYDANAI YASODA...



**Meenakshisundara murthy**

Ex Jet commitee member

Kodanna kodi Sashtang , kodi Sastang Pranams at the lotus feet of Amma garu and our Swamiji

I want to firstly write a note to ammagaru herself Amma , there is a very old and popular tamizh song that comes to my mind whichever I think about you maaa...... The song starts like this...... Enna thavam seithanai yasoda engum nirai parabhamam ammavem azhaikka Irezu bhuvanangal paidaithavanaik kaiyil endi hirahithi paluti talattani....

The meaning of these lines being, Yashoda (ammagaru) , what tapas (prayer, sacrifice ) did you do, that the almighty ( our swami ) himself calls you dearly as “AMMA”

To take Krishna (our swami), the one who created the 14 worlds, to left him into your arms, to lock him to sleep, to feed him milk. What great tapas did you do yashoda (ammagaru)?. It indeed is a huge blessing bestowed upon me by swami to able to get to spend few memorable and unforgettable years in being close to amma ( as I always call her) so many wonderful

Hours, days, weeks, years of talking , chilling travelling and visiting so many places. Able to share so many of our emotions, happy joking , sad, feeling low and down.......... oh god so so many !

I may humbly say so it was a mother and daughter relationship between us . Her ever smiling and bright face . I much much treasured major part of my life like I always tell her...

Velosthanu amma ! jai srimannarayana iam sure she along with perumal will always be with our swami and all of us too, blessing and be our guardian angel always!!!!!!!!

**The art of mothering is to teach the art of living to children.**





ఎన్ని యుగాలు తరాలు మారినా మారని మాధుర్యం అమ్మ ప్రేమ!



# స్వాభిమాన సదాచార నిష్ఠ

కొమాండూరి యాదగిరి స్వామి



శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామివారు జగమెరిగిన జగద్గురువులు. శ్రీస్వామివారితో చాలా సంవత్సరాలు క్రితం నుండి చిరుపరిచయం కలిగిఉండడం నాలాంటి సాధారణ వ్యక్తికి ఎంతో భాగ్యం. వారికి కలిగిన మాతృవియోగం గురించి తెలిసి అపరిమిత దుఃఖానికి లోనైనాను. ఆ మహాసాధ్వికి మనసులోనే నివాళులర్పించాను. ఆ తల్లి సుగుణాలను స్మరిస్తూ ఒకటి రెండు విషయాలు తెలుపుతాను.

అవి స్వామి వారి పూర్వాశ్రమపు రోజులు. చిన్నతనంలోనే ఏర్పడిన పితృవియోగంతో శ్రీ స్వామివారి కుటుంబం 1969–70 లో హైదరాబాదుకు వచ్చి కార్వన్ ప్రాంతంలో అద్దెగృహంలో నివసించేవారు. నేను కూడా అక్కడే ఎదురింట్లో నివసిస్తూండేవాడిని. అలా వారితో మొదటిసారి పరిచయం ఏర్పడింది. అప్పట్లో వారంతా అమ్మగారు ఒక సాధారణ సామాన్య జీవితం గడిపేవారు. ఆ రోజులలో ఇంటికి మగసంతానంలో పెద్దవారైన స్వామీజీ పైన కుటుంబసభ్యుల పోషణ భారం ఉండేది. అప్పటికి వారి వయసు ఊనషోడశ వర్షో మే రామః అని దశరథులవారన్నట్లు 13, 14 సంవత్సరాల మధ్య ఉండేది. అప్పటికే వారు Type writing Higher pass అవ్వడమే కాకుండా, కష్టసాధ్యమైన Shorthand Higher కూడా పూర్తిచేసేసారు. కానీ చిన్నవయసు కావడం చేత ప్రభుత్వ ఉద్యోగాలలో చేరడానికి అవకాశం లేదు.

అయినా కుటుంబ పోషణకోసం వారి సంబంధీకుల నుండి ఎటువంటి ద్రవ్య సహాయం ఆశించలేదు.ద్రవ్యలేమి కారణాన స్వామీజీ మెహదీపట్నంలో గల ఫార్మసీ సంస్థలో ఉద్యోగం చేసేవారు. వారికి చేదోడుగా వారి మాతృమూర్తి కూడా అదే సంస్థలో ఉద్యోగం చేశారు. అతి సాధారణ గృహిణిగా అతి తక్కువ ఆదాయంతో కుటుంబ బాధ్యతను నిర్వహించడం మామూలు విషయం కాదు. 10 పైసలు బస్సు కిరాయికి వెచ్చించడం కూడా ఇబ్బందిగా ఉండేది. అందుచేత వారు కార్వాన్ నుండి జాంసింగ్ దేవల్ మీదుగా మెహదీపట్నం వరకు దాదాపు ఐదు కిలోమీటర్లుకాలినడకన ప్రయాణించేవారు. ఇప్పుడంటే ఆప్రాంతం మహానగరమై కూర్చుంది కాని, ఆరోజులలో అది అంతా దట్టమైన అడవిలా ఉండేది.

ఎంత కష్టమైనా, స్వార్జితముపైననే కుటుంబ పోషణ నిర్వహించడం వారి స్వాత్మాభిమానానికి నిదర్శనం. అమ్మగారు చాలా మృదుస్వభావి. వారి పలకరింపులో ఆప్యాయత ఆర్ద్రత ఉండేవి. అతి సాధారణ జీవితం గడుపుతూ కూడా తమ సంతానానికి క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మికత భావాలను కలిగించేవారు. అతి పిన్నవయసులో భర్తను కోల్పోయినా మొక్కవోని ధైర్యంతో ఆమె పిల్లలని పెంచేవారు. వారితోడిదే లోకంగ ఇతరసుఖాలు ఏనాడు ఆశించక

**ఆత్మవిశ్వాసంతో పురుషప్రయత్నంతో దైన్యాన్ని వీడినవారికి దైవం అండగా ఉంటాడు**



జీవనం సాగించారు. అది ఆనాటి పరిచయం.

మళ్లీ వారిని 2006లో జెట్ దోమలగూడ లో సేవించుకోవడం జరిగింది. 35 సంవత్సరాల తర్వాత కూడా అదే సాధారణ జీవన శైలి. ఏమాత్రం మార్పు లేదు. వారు సౌకర్యాలను ఎన్నడూ కోరుకోలేదు. సామాన్య సాధారణ జీవితంలోనే ఆనందం పొందారు. ఎప్పుడూ నిండుగా తృప్తి వారి వదనంలో తాండవించేది. అందుకే వారు గొప్ప మాతృమూర్తి కాగలిగారు. పొదుపు, ఉన్న దానిలో సర్దుకుపోవడం, ఇతరులను ఆప్యాయతతో పలకరించడం, ఎన్నడూ కోప స్వభావాన్ని కలుగకుండడం వారిలో నేను ఆ రోజుల్లో గమనించిన గొప్ప గుణాలు. ఈనాటికీ కూడాఏ మాత్రం మార్పులేని వారి స్వభావం, నిరాడంబర జీవనశైలి చెప్పుకోదగ్గవి. ఆమె లోని సహనం, సంయమనం నేటి గృహిణులు ఎందరో వారి నుండి నేర్చుకోవలసిన సుగుణాలు.

అమ్మగారు ఎటువంటి పటాటోపం లేకుండా ఉన్న దానిలో తృప్తి మరియు ఆధ్యాత్మికతతో గడిపిన జీవితం మనకందరకు ఆదర్శం.

# అన్నపూర్ణ

**శ్రీమతి బేబి**

**నేత్ర విద్యాలయ, వారిజ ఆశ్రమం, విశాఖపట్నం**



శ్రీ శ్రీ శ్రీ స్వామి వారి పాద పద్మములకు అనేక దాసోహములు. అమ్మగారితో మాకు పరిచయం 25 సంవత్సరముల నుండి. అమ్మగారితో మా అనుభవం ఒకటి.

ఒకసారి నేను నేత్ర విద్యాలయ పని మీద హైదరాబాద్ కమిషనర్ ఆఫీస్ కి వెళ్ళాను. అప్పుడు అమ్మగారు జెట్ దోమలగూడ లో ఉన్నారు. ట్రైన్ దిగిన వెంటనే ఆఫీస్ కి వెళ్ళిపోయాను. వచ్చేసరికి లేట్ అయింది. ఉదయం నుంచి ఏమీ తినలేదు. నేను జెట్ దోమలగూడకి రాగానే అమ్మ నా వంక చూసి ఏమిటి అంత నీరసంగా ఉన్నావు? ఏమి తినలేదులా ఉంది. చేతులు కాళ్ళు కడుక్కుని రా పెడతాను అని నాకు సాపాటు పెట్టారు. అసలు నేను ఊహించలేదు. కడుపునిండా కొసరి కొసరి సాపాటు పెట్టారు. అమ్మ అంటే అదే కదా!

నేత్ర విద్యాలయ పిల్లలందరిని చూచి ఎంత మంచి కార్యక్రమం చేస్తున్నారు స్వామి వారు, ఇలాంటి పిల్లలు ఎంతమంది బాగుపడుతున్నారో అని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇంకా ఇంకా చేయాలి అని మంగళాశాసనములు చేస్తున్నాం అని మంగళాశాసనములు చేశారు.

అమ్మగారు మనకి జగదాచార్యులనిచ్చారు. ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం దాసోహము తప్ప.

**అడగకున్నా బిడ్డ ఆకలివేళని గుర్తించగలిగే నేర్పు అమ్మకే సొంతం**



# అమ్మగారి స్మృతులు



కృష్ణకుమారి
శ్రీరామనగరము

ఒక జనని తన పిల్లలకి మాత్రమే జనని. జగదాచార్యులని అందించిన జనని మన అమ్మగారు జగజ్జనని. ఆ తల్లి మనకి చేసిన ఉపకారం విశ్వకళ్యాణానికై తన ప్రీతి పాత్రుడైన చిన్ని శిశువు ని లోకానికర్పించిన త్యాగమూర్తి. అటువంటి అమ్మగారి గురించి మదిలో ఎన్నో స్మృతులు. అందులో మచ్చు తునకగా ఒక స్మృతిని పంచుకుంటున్నాను.

అమ్మగారి స్మృతులు జీవించటానికి వెలుగులు. చెరగని చిరునవ్వుతో, చల్లని దీవెనలనిచ్చే ఆ తల్లి గురించి ఎంత చెప్పినా తక్కువే. వారితో అనుబంధం చాలా పవిత్రమైనది. వారి స్మృతులు ఎన్నో ఎన్నెన్నో. అందులో ఒక సంఘటన

సంప్రదాయం పట్ల, ఆచార్యుల పట్ల ఆచార వ్యవహారాలపట్ల వారికున్న నిష్ఠ అద్వితీయం. ఆరోగ్యపరంగా కొంచెం ఇబ్బందిరాగా 2015 లో అపోలో హాస్పటల్ కి వెళ్ళవలసి వచ్చింది. ఏమీ తినకుండా రమ్మన్నారు అమ్మగారిని శ్రీపాదతీర్థం మాత్రం తీసుకున్నారు. హాస్పటల్ కి ఆశ్రమంనుండి బయలుదేరేటప్పుడు "కృష్ణకుమారి ఒక చీర-జాకెట్టు పెట్టుకో" అన్నారు. నేను కొంచెం పాలు, ఒక ఆపిల్ పండు కూడా పెట్టుకున్నాను. వెళ్ళాక చిన్న చిన్న పరీక్షలు చేస్తూ ఉండగా "కళ్ళు తిరుగుతున్నాయి గట్టిగా పట్టుకో అన్నారు". మత్తు ఇచ్చి గుండెకి angiogram పరీక్ష చేయడానికి థియేటర్కి తీసుకువెళ్ళేదాకా నా గుండెలపై తలవాల్చి చేయివదలలేదు. థియేటర్ నుండి వచ్చాక ఏమైనా తినిపించండి అని నాతో డాక్టరుగారు అన్నారు. డాక్టరుగారు వెళ్ళాక అమ్మగారు నావైపు చూసి నవ్వారు. నాకర్థమయ్యింది. వారిని wash room లోకి తీసుకొని వెళ్ళి కాళ్ళుకడుగుకున్నాక వస్త్రాలు మార్చాను. అపుడు పండు తిని పాలు త్రాగారు. నీరసంగా ఉన్నందువలన నేనే త్రాగించాను. నావైపు తన చల్లని చూపులను ప్రసరింపచేస్తూ దీవెనలను అందిస్తూ ఆ పాలను తీసుకున్నారు. పరుపుపై పండుకోలేదు కుర్చీలోనే కూర్చున్నారు. మన పూర్వీకులు మనకందించిన ఆస్తి మన ఆచారవ్యవహారాలు, సంప్రదాయ పరిమళాలు. వాటి రక్షణకై ఆ తల్లి అంతటి పెద్ద పరీక్ష చేయించుకుని నీరసంగా ఉన్నా, మత్తు తన ప్రభావాన్ని చూపిస్తున్నా, నిద్రతో కళ్ళుకూరుకుపోతున్నా చెరగని చిరునవ్వుతో నియమాన్ని నిష్ఠగా పాటించడం ఈ దాసురాలి మదిలో చెరగని ముద్ర వేసిందంటే అతిశయోక్తి కాదేమో.

శ్రీస్వామివారికి హారతి ఇవ్వకుండా ఏరోజూ నిద్రకుపక్రమించేవారు కాదు. హారతి ఇవ్వడానికి ముందు "వెళ్ళి కనపడిరా పో కృష్ణకుమారి, ముందేవెళ్ళి కూర్చోవడమెందుకు వారు వస్తున్నామని అనగానే తీసుకుని వెళ్ళు అనేవారు" శ్రీస్వామివారు మెట్లుదిగి వస్తుంటే సాక్షాత్తు నారాయణుని చూస్తున్నట్లుగా వారి కనులు వెలుగుతో నిండేవి. పుష్పాలను అందించగా వారి పాదాలపై సమర్పించి హారతినిచ్చి వారినుండి పండుని తీసుకున్నాక తృప్తిగా నిదురించేవారు. వరదలు రానీ, పిడుగులు పడనీ, అర్థరాత్రి అయినా స్వామివారికి హారతినివ్వకుండా ఏ రోజూ నిదురించేవారు కారు.

ఈ అందమైన అనుబంధం, అంతులేని వారి అనురాగం, వారి చూపులో చంద్రుని చల్లదనం, పలుకులలో తియ్యని తేనెవాక పొర్లడం, వెన్నవంటి ఆ జనని హృది ఎన్నటికీ మరువలేము. ఎన్నటికీ మరువలేము.

**విద్యనేర్పని గురువు - విద్య నేర్పించే గురువు అమ్మ!**



# అమ్మతనానికే వన్నె తెచ్చిన తల్లి...

అమృతవల్లి
నేత్ర విద్యాలయ



జగదాచార్యులకు జన్మనిచ్చిన మాతృమూర్తిగానే అమ్మగారి యందు ఆరాధనా భావం వుండేది. కానీ కాలక్రమేణా అదృష్టవశాత్తు వారితో కాస్త సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ క్రమంలో వారిలోని అసాధారణ సుగుణాలను తెలుసుకున్నప్పుడు ఆచార్యుల మాతృమూర్తిగానే కాక ఆమె ఒక అసాధారణ స్త్రీ మూర్తి అనిపించింది. శాంతి, సహనం, ప్రేమ, ఆప్యాయత, అవ్యాజమైన మాతృవాత్సల్యం ఆమె సొంతం. పెద్ద-చిన్న, పేద-గొప్ప, ఎక్కువ-తక్కువ అనే భేదం లేకుండా ప్రతీ ఒక్కరికీ మాతృప్రేమను పంచే అటు పెద్దవారితోను, మధ్యవయస్కులతోను, ఇటు చిన్నపిల్లలతోను అరమరికలు లేక కలిసిపోయే ఆమె మనస్తత్వం అందరికీ అత్యంత ప్రీతి పాత్రమైనది. ఈ సుగుణాలన్నీ ఆమె నుంచే స్వామివారు పుణికి పుచ్చుకున్నారనే భావన కలిగింది.

నాకు వారితో గల అనుబంధం రెండు సంవత్సరాలు మాత్రమే అయినా ఎప్పటికీ గుర్తుండిపోయే అనుభూతులను వారు నాకు ప్రసాదించటం కేవలం నా అదృష్టం. ప్రతీ ఏటా నరకచతుర్దశికి ప్రతీ ఒక్కరికీ ఓపికగా ప్రేమగా తలకి నూనె పెట్టి ఆశీర్వదిచటం ఒక మధుర స్మృతి.

క్షీరాబ్దిద్వాదశి నాడు మా అందరిలో ఆధ్యాత్మిక ప్రేరణ కలిగించి తాను ముందుండి తులసి పూజ చేసి మా అందరి చేత కూడ చేయించేవారు. తన అద్భుతమైన అమృత గానంతో మమ్మల్నందరినీ అలరింపజేసి మమ్ముల్ని కూడా పాడమని ప్రోత్సహించే వారు. ఆమె ప్రేమపూర్వక నాయకత్వాన్ని మనందరం కోల్పోవటం చాలా బాధాకరం

సహజంగా ఈ లోకంలో స్త్రీలను సాటిస్త్రీలే కొన్నిసందర్భాలలో చిన్నచూపు చూడటం కనిపిస్తుంది. కానీ ఆమె సాటిస్త్రీలపై చూపే ప్రత్యేకమైన అభిమానం అన్ని విషయాలలోనూ వెన్ను తట్టి ప్రోత్సహించి నైతికబలాన్నందిచటం చూస్తే ఎంతో మనోధైర్యం కలిగేది. ఆమె స్త్రీ లోకానికే ఆదర్శప్రాయంగా నిలిచారు.

గత సంవత్సరం నా పుట్టిన రోజు నాడు నాకు స్వీట్ ఇచ్చి ఆశీర్వదించిన మధురానుభూతి మాటలలో చెప్పలేనిది. మా అమ్మ నా దగ్గర లేని లోటు తీర్చారు. గత సంవత్సరం స్వామి వారి తిరునక్షత్ర వేడుకలలో భాగంగా వేయి కాంతులతో వెలుగొందుచున్న ఆశ్రమవైభవాన్ని బ్యాటరీ ఆటోలో ఆమెతో కలిసి సందర్శించే భాగ్యం నాకు కలిగింది. నాడు ఆమె పొందిన ఆనందం వర్ణనాతీతం. ఆమెతో కలసి ఆ ఆనందాన్ని పంచుకునే మహద్భాగ్యం నాకు కలిగింది. ఇన్ని మధురానుభూతులు పంచిన అమ్మ ఇక లేరు అనే కఠినమైన నిజం జీర్ణించుకోవటం చాలా కష్టం.

ఆ అమృత మూర్తి నిస్సందేహంగా పరమపద నాథుని సన్నిధికి చేరారు. మన జీవితాలను సన్మార్గంలో నడపటానికి కావలసిన స్ఫూర్తిని మన ఆచార్యులు, అమ్మగారూ మనకు ప్రసాదించాలని ఆ పరమాత్మను ప్రార్థిస్తున్నాను.

**మనం జీవించే ప్రతీ క్షణం అమ్మ ఆశీర్వాదమే!**



క్షీరాబ్ధి ద్వాదశి తులసీ పూజా మహోత్సవంలో....



# ప్రాతః స్మరణీయురాలు



వీరబాబు

జీవా గోశాల

జగదాచార్యులను కన్న మాతృమూర్తి భరణి నక్షత్రంలో ధరణిపై అవతరించిన పుణ్యమూర్తి మన అమ్మగారు.

“ కారుణ్యాలయా భక్తవరద నిను కన్నది కానుపురామ” అని అన్నట్టుగా కౌసల్యమ్మ కానుపు లోక కళ్యాణము ఎలా అయినదో అదే విధంగా ఈత్రిదండి రాముని లోకకళ్యాణం కొరకు కన్న అమ్మగారి భాగ్యం కుడా అట్టిదే .

అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడేటువంటి జీవులను ఉద్ధరించడానికి రామానుజ దివాకరులను ఉదయింపచేసిన కాంతిమతిదేవితో సమానురాలుకదా మన అమ్మగారు.

ప్రతివ్యక్తికి తల్లి మొదటిగురువు చిన్నతనం నుండి తల్లి ఎలాంటి సంస్కారాలు నేర్పుతుందో అలాంటి సంస్కారాలనే పిల్లలు అవలంబిస్తారు. అన్నింటికి మించి మనిషికి ఉండవలసినది వ్యక్తిత్వం అలాంటి వ్యక్తిత్వాన్ని వారు ఆచరించటమే కాక తమ సంతానానికి కూడ అలవాటు చేసిన మహోన్నత వ్యక్తి మన అమ్మగారు.

లోకంలో మేము బావుండాలి మా కుటుంబం బావుండాలి అని కోరుకునే ఈ కలికాలంలో లోకక్షేమాన్ని కాంక్షించి తన కుమారుణ్ణి యతిగా లోకానికి అందించిన అమ్మగారికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం. ఉత్తములైన వైష్ణవులు ఎల్లప్పుడు కూడా భగవత్, భాగవత ఆచార్యనిష్ఠ కలిగి ఉండాలి అంటారు. ఈ మూడింటిని ఆచరించి చూపారు మన అమ్మగారు.

దాసుడికి అమ్మగారితో ఎలా మాట్లాడాలో తెలిసేది కాదు. స్వామివారి తీర్థగోష్ఠి చాలా ఆలస్యం అయినప్పటికీ మధ్యాహ్నం వరకు ప్రసాదం ఏమి తీసుకోకుండా ఎదురుచూసేవారు. దాసుడు మాత్రం ప్రసాదం తీసుకుని వచ్చి అమ్మగారు ఎందుకు అలా తినకుండా ఉంటారు. మీరు కూడా ప్రసాదం తీసుకుని తీర్థం తీసుకోచ్చుకదా అనే వాడిని. అమ్మగారు చిరునవ్వు నవ్వి ఊరుకునేవారు. తరువాత అర్థమైంది దాసుడికి ఈ జీవాత్మకు ధారకము పోషకము అన్ని కణ్ణనేనని “ఉణ్ణుం శోరుం” పాశురంలో నమ్మాళ్వార్లు సాయించిన విధంగా మన అమ్మగారు పెరుమాళ్ళ తీర్థమును స్వీకరించడానికి ఆలస్యం అయినప్పటికి ఆ తీర్థం పుచ్చుకున్న తరువాతనే ప్రసాదం తీసుకోవాలి అనే నియమాన్ని పెద్ద వయస్సు వచ్చినప్పటికీ పాటిస్తూ ఆ పరమాత్మ యొక్క నామమే ధారక పోషకాలుగా స్వీకరిస్తూ ఆ పరమాత్మనే ఆశ్రయించి భగవంతునిపట్ల జీవునికి ఉండవలసిన నిష్ఠను ఆచరించి చూపేవారు మన అమ్మగారు.

అమ్మగారి ఆచార్యనిష్ఠ చాలా గొప్పది. పెద్దస్వామివారి మీద వారికి ఉన్న విశ్వాసం అనన్యమైనది. సందర్భాన్ని బట్టి పెద్దస్వామివారి వైభవాన్ని వివరించేవారు. వారు ఎప్పుడు పాడే పాటలో “నీ శ్రీపాదపు బిందు తప్ప అన్యమేమి వలదని” అన్నట్టుగానే వారి ఆచార్యులపై అంత విశ్వాసం కలిగి ఉండేవారు. మన స్వామి వారిని కూడ వారి ఆచార్యులైన పెద్దస్వామివారిలానే సేవించుకునేవారు. స్వామివారి శ్రీపాద తీర్థాన్ని సేవించటమే అందుకు ఉదాహరణ ఎప్పుడో చరిత్రలో విన్నాం. కూరేశుల ధర్మపత్ని ఆండాళమ్మగారు వారి కుమారులైన పరాశరభట్టరు వారి శ్రీపాదతీర్థాన్ని శిష్యులతో పాటుగా



స్వీకరించేవారని, భట్టర్లని ఒక కుమారులుగా కాక వారి ఆచార్యులుగా సేవించుకునేవారని విన్నాం. అలానే అమ్మగారు కూడా శ్రీస్వామివారి శ్రీపాద తీర్థాన్ని స్వీకరించి వారికి ఆచార్యుల పట్ల ఉన్న విశ్వాసాన్ని తెలియజేసారు.

అమ్మగారు భాగవతనిష్ఠ కలిగి ఉండేవారు. భాగవతోత్తములు ఏ సమయంలో వచ్చినా పాత వారైనా కొత్తవారైనా ఎప్పుడు చెరగని చిరునవ్వుతో అందరిని ఆదరించి భాగవతనిష్ఠని తెలియజేసేవారు.

దాసుడు జ్ఞానం లేకుండా సామాన్యంగా మాట్లాడినా ఎంతో ఓర్పుతో నవ్వుతూ సమాధానం చెప్పేవారు. ఒకసారి అమ్మగారిని అడిగాను. గోశాలలో ఉండటం వల్ల స్వామివారిని ఎక్కువ సమయం సేవించుకునే అదృష్టం నాకు ఉండటం లేదు. చక్కగా స్వామివారి దగ్గర ఏఫొటోగ్రాఫర్ గానో ఉంటే ఎంత బాగుంటుంది అన్నాను. అప్పుడు అమ్మగారు ఒక నవ్వునవ్వి, గోసేవ గొప్పదనాన్ని నాకు చక్కగా వివరించారు. దానితోపాటు ఆచార్యుల మనస్సులో ఉన్నావు చాలదా! అనేవారు. దీపావళినాడు స్వామివారితోపాటుగా విద్యార్థులకు కూడా అమ్మగారు స్వయంగా తలపై తైలం రాసి మంగళా శాసనాలు చేసేవారు. వారితోపాటు దాసునికి కూడా తైలం రాసి మంగళాశాసనం చేసారు. ఎప్పుడూ ఆచార్య సన్నిధిలో ఉండి గోసేవ చేసుకోవాలి అనేవారు. ఆ తల్లి ఆశీస్సులే నాకు గోసేవ చేసుకునే భాగ్యాన్ని, ఆచార్య అభిమానాన్ని పొందే భాగ్యాన్ని కలిగించాయి.

ప్రతీసంవత్సరం గోసేవకి వారి పవిత్ర ద్రవ్యాన్ని వినియోగించేవారు. ప్రతీరోజు గోవులు ఎలా ఉన్నాయి?, మీ సంతానమంతా బాగుందా? అని నవ్వుతూ అడిగే ఆ చల్లని మాటలు ఎప్పటికీ మరువలేనివి.

సాయంత్రం పూట పాలు తీసుకొని వెళితే ఏమోయ్ సాపాటు చేసావా అనేవారు. ఇంకా లేదమ్మ అని చెప్పగానే వారు స్వయంగా తయారుచేసుకున్న ప్రసాదాన్ని చేతికి ఇచ్చి త్వరగా తినేసెయ్ అనేవారు. వారి దగ్గర ఏది ఉంటే అది పెట్టకుండా ఒట్టి చేతులతో ఎప్పుడూ పంపించేవారే కాదు. అంతటి దయామూర్తి.

స్వామివారు పర్యటనలకు వెళితే స్వామి వారిని చూడాలి అనిపిస్తే అమ్మగారిని సేవించుకునేవాడిని. అమ్మగారిని చూస్తే ఆచార్యులని చూసిన ఆనందం కలిగేది. స్వామివారు ఎప్పుడువస్తారని అమ్మగారిని అడిగితే వస్తారు, మనలాగే అందరు సేవించుకోవాలి కదా! అని ఒక నవ్వు నవ్వేవారు.

స్వామివారు ఎప్పుడు చిరునవ్వు నవ్వుతూ ఓర్పుతో అందరికి ఎలా సమాధానం చెబుతారో అనుకునేవాడు ఈదాసుడు. కాని అమ్మగారి నుండి ఆ ఓర్పు చిరునవ్వు సంక్రమించి ఉంటుందేమో అనిపించేది.

చివరి సమయంలో కూడా నమ్మాళ్వార్లు అనుగ్రహించిన విధంగా “మరణ మానాల్ వైగున్దం కొడుమ్బిరాన్” అన్నట్టుగా వెంటనే పరమపదాన్ని చేరుకున్నారా అనే విధంగా జరిగింది చరమయాత్ర! దివ్యప్రబంధ గోష్ఠితో భగవన్నామస్మరణలతో “పిరాట్టి తిరువీధి ఉత్సవం”లా సాగింది.

కౌసల్యమ్మ దగ్గరనుండి కాంతిమతిదేవి వరకు యుగపురుషులను అందించిన తల్లులు ఎలా ప్రాతఃస్మరణీయులో జగదాచార్యులు అపరరామానుజులను అందించిన ఈ అలివేలు మంగమ్మ కూడా అంతటి ప్రాతః స్మరణీయురాలే.

ఆ తల్లి జగదాచార్యులను మనందరికి అందించకపోతే మనమందరం ఏమయిపోయే వాళ్ళమో కదా! ఆ తల్లి ఋణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. ఆ తల్లి లోకానికి చేసిన ఉపకారాన్ని స్మరించుకోవటం తప్ప ఏమి చేయలేని వాళ్ళం అలాంటి అమ్మగారికి శతసహస్రకోటి దాసోహములు సమర్పిస్తూ........

❖❖❖❖❖❖



# అమ్మే మధురం

భరతలక్ష్మి

జీవా, శ్రీరామనగరము



మధురం మధురం అమ్మా మీ ప్రేమ ఎంతో మధురం
చెప్పలేని మధురం ఎన్నో అనుభూతుల మధురం
సేవా నిరతిని ప్రోత్సహించే తమమనస్సెంతో మధురం
ఎన్నో అనుభవాల కలల మధురం
ఎన్నో మంగళాశాసనాల మధురం
ఎన్ని జన్మల పుణ్యఫలమో  మీఅనుబంధ మాధుర్యం
ఎన్ని జన్మల పుణ్యఫలమో మా కందించిన గురువు మాధుర్యం
ఎన్ని చెప్పినా తనివి తీరదు మా మాధుర్యం
ఇదే నా జీవితానికి చెప్పలేని మధురం
ఇన్ని మధురాల కలయికతో నా జీవితం మాధుర్యం
అమ్మగారి పాదపద్మములకు అనేకానేక నీరాజనములతో......

# పాకశాస్త్ర ప్రవీణురాలు

శ్రీమతి లక్ష్మి  జీవా, తదియారాధన విభాగం

గత నాలుగు సం.లుగా మన అమ్మగారితో నాకు పరిచయం. వారి నివాసానికి తరచు వెళ్ళి మాట్లాడుతుండేదానిని. అలా వెళ్ళినప్పుడు ఓసారి మామిడికాయ ముక్కలు కోసి ఇచ్చే అవకాశం లభించింది. ఆ సందర్భంలో మామిడికాయలతో ఎన్ని రకాల పచ్చళ్ళు పెట్టవచ్చో చెప్పేవారు. రకరకాల పచ్చళ్ళు పెట్టి రుచులు చూపించేవారు. ఏరకం పచ్చళ్ళు ఎలా కలపాలో తెలిపేవారు. అమ్మ గారి వలన కొన్ని రకాల పచ్చళ్ళు (మెంతి, పెసర, తీపి, ఆవకాయలు) పెట్టడంలో మెలకువలు నేర్చుకోగలిగాను. గుత్తి మామిడికాయ పచ్చడి నాకు రాలేదు. నేత్రకళాశాల, తదియారాధన కోసం ఆవకాయ పచ్చళ్ళు పెట్టే సందర్భంలో అమ్మగారు సమాచారం తెలుసుకొని ప్రోత్సహించేవారు. ఎప్పుడు అమ్మగారిని కలిసినా, పచ్చళ్ళు గురించే అడిగి తెలుసుకొనేవాళ్ళం నిలువ పచ్చళ్ళు సౌరశక్తిని నింపుకుంటాయని వివరించారు. ఆ రకంగా పాకశాస్త్రంలో నాకు పాఠాలు చెప్పిన గురువుగా అమ్మగారు నా మనస్సులో నిలిచిపోతారు. అమ్మగారి వల్ల పచ్చళ్ళు పెట్టడంలో నాకు అభిరుచి ఏర్పడింది. తదియారాధనశాలలో పచ్చళ్ళు పెట్టే సందర్భంలలో అమ్మగారిని తలచుకొని ఆ సేవలు చేస్తూ ఉంటాను. నా పేరుని అమ్మ గారు లక్ష్మి అంటే చాలామంది ఉంటారు అని లక్ష్మిపచ్చళ్ళు అని పుస్తకంలో ఫోను నెం. రాసుకున్నారు. పచ్చళ్ళు అంటే అమ్మగారే గుర్తుకు వస్తారు. అమ్మ మీరు ఆచార్య అనుగ్రహంతో ఆ శ్రియ:పతి సేవలుచేస్తూ ఆనందంగా ఉండాలి అని కోరుకుంటూ, మీ అందరితో పంచుకొనే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.





# అపురూప మాతృమూర్తి



**నాగలక్ష్మి**

**గోశాల (జీవా)**

ఈ కాలంలో మనకోసం, ఈ సమాజం కోసం ఎంత క్లిష్టమైన పరిస్థితులలో ఉన్నప్పటికినీ తన కుమారుని ఆచార్య సేవకోసం అంకితం చేసిన గొప్ప మూర్తి మన అమ్మగారు.

ప్రతి తల్లి తన సంతానాన్ని ఎటువంటి విలువలతో తీర్చి దిద్దాలో తెలియజేసిన ఆదర్శమూర్తి మన అమ్మగారు. అంతటి ఆ తల్లి ఋణం మనం ఎలా తీర్చుకోగలం.

అమ్మగారు అపురూపమైన మాతృమూర్తి. ఎవరికి దక్కుతుంది ఇంతటి భాగ్యం. ఆ తల్లి మన మధ్య ఉండి మనకు జగదాచార్యులను ఇచ్చారు. ప్రపంచానికి వెలుగు నిచ్చే జ్యోతిని ప్రసాదించారు. సంప్రదాయ పరిరక్షకుని అనుగ్రహించారు. ఆ తల్లికి అనేకానేక దాసోహాలు తప్ప ఏమి ఇవ్వగలము.

అమ్మగారితో నాకు 13 సం. పరిచయం. 2008లో అమ్మగారు ఆశ్రమానికి వచ్చినప్పుడు మేము వారితో కలిసే ఉండేవాళ్ళం. వారే ప్రసాదం చేసి పెట్టేవారు. రాత్రి అందరం కలిసి వరుసగా పడుకునేవాళ్ళం. ఆ సమయంలో ఎన్నో విషయాలు చెప్పేవారు. చాలా పాటలు నేర్పారు.

రాత్రి పూట పాలు ఇవ్వటానికి వెళ్ళి పిలిస్తే ఓ...య్ అని పలికే అమ్మగారి పలుకు ఒక కోకిల కూజితంలా ఇప్పటికీ చెవులలో మారుమ్రోగుతోంది. ఆ తీయని కంఠం మరువలేనిది. ఏంటమ్మా! ఎలా వున్నారు? నీవు, మీ సంతానం (ఆవులు) అని ఆప్యాయంగా అడిగేవారు. ఈ అపురూపమైన ప్రేమ మూర్తికి గోపాలకుల నీరాజనం.

ఎంత చూసినా తనివి తీరని రూపం
మంచి తనంలో చల్లని మమతలకోవెల
ఆచార్యుల పట్ల సాటిలేని విశ్వాసం
సంప్రదాయం పట్ల నిష్ఠ మూర్తీభవించిన మా యమ్మ
మా హృదయాలలో దేవతలా కలకాలం నిలచిపోవాలని ఆశిస్తూ........

**గోదా, అశోక్**

పరమపూజనీయులైన అమ్మగారి పాదపద్మములకు అనేక ప్రణామములు. దాసురాలు అమ్మగారిని, వివాహము అయిన తరువాత సేవించుకోగలిగినది. అప్పుడు అమ్మగారితో మావారు కూడా సమాశ్రయణాలు కావాలని విన్నవించాను. అమ్మగారు దాసురాలితో మీవారిని మంత్రోపదేశం చేసుకోమని బలవంతం చేయకు. వారి అంతగా వారు వచ్చి ఆచార్యులను ఆశ్రయించాలి. అందుకు కొద్దిరోజులు వేచి ఉండు. అన్నిటికి పెరుమాళ్ళు ఉన్నారు. ఎప్పుడు ఎలా జరగాలో వారే నిర్ణయిస్తారు. ఇంకొక విషయం వారు పడుకొనే తలగడ క్రింద తిరువడిగళ్ళు పెట్టు. వారిలో మార్పు వస్తుంది అన్నారు. దాసురాలు అలాగే చేసినది. అమ్మగారి వాక్ ఫలించినది. వారు ఎంతో శ్రద్ధతో వెళ్ళి ఆచార్యులను ఆశ్రయించారు. వారు ఆచార్యులను ఆశ్రయించేటట్లు అమ్మ దాసురాలిని అనుగ్రహించారు.

**ఆకాశం చిన్నబోయింది అమ్మ మనస్సు వైశాల్యం చూసి!**



# మా అమ్మ గోదమ్మే!

**శ్రీమతి మంగ, శ్రీలక్ష్మి, సుమాలా**
**దివ్యసాకేతం**



మన గోదమ్మ కష్టమైన సకలవేదశాస్త్రాల సారము అందరికి సులువుగా అర్థం కావాలని కదా! "తిరుప్పావై"గ హాయిగా పాడుకునే విధంగా అందిచింది. అలానే మన అమ్మగారు "ఆచార్య మేఘమా" అని, "నారాయణ అని నోరారా యనరే" అని, "గురువును మించిన దైవం లేదు" అని, "నీ దయకు కొరతే లేదు..స్వామీ.." అని ఎంత పామరులకైనా అవలీలగా అర్థమయ్యేట్లు కమ్మని స్వరంతో పాడటం చూస్తే ఆ గోదమ్మలా అనిపిస్తారు.

దోమలగుడా జెట్ లో అమ్మని సేవించుకున్నాము. తర్వాత దివ్యసాకేత క్షేత్రంలో సేవ చేసుకునే భాగ్యం కలిగింది. రాత్రులు కొద్ది సేపు చిన్న సత్సంగం జరిగేది. దానిలో ఎన్నో మంచి విషయాలు చెప్పేవారు. ఒకసారి భగవద్రామానుజుల గురించి చెప్తూ సూర్య చంద్రులు ఉన్నంత కాలం మన రామానుజుల వైభవం దినదినాభివృద్ధి పొందాలి అన్నారు. ఒకసారి అమ్మగారితో "అమ్మా! మీరు స్వామివారి లాగానే ఉంటారు" అన్నాను. అందరూ నవ్వేసారు. "స్వామి అమ్మలాగా ఉన్నారా అమ్మ స్వామిలాగ ఉన్నారా" అన్నారు.

అమ్మగారు దాసురాలిని ఒకసారి అమ్మా మంచి సంతానం కలగాలంటే ఏ వ్రతాలు, పూజలు, నోములు నోచాలి అని అడిగాను. ఏమి అక్కరలేదు, మంచిగా సాపాటు చేయాలి అన్నారు. ఇద్దరం నవ్వేసాము. అమ్మగారు అమ్మాయి నీ కండ్లలో ఏదో వెలుగు ఉంది అన్నారు. నాలో నరసింహ స్వామి ఉన్నారు అన్నాను. అంటే ఒక్కసారి చూసి నవ్వారు. మా మధ్య మాటలు చమత్కారంగా ఉండేవి. ఎప్పుడైనా స్వామివారి గురించి చెప్పమంటే పెద్దస్వామివారి గురించి చెప్పేవారు. మా ఆచార్యుల గురించి చెప్పండమ్మ అంటే మీ స్వామి వారు అలా ఉన్నారంటే మా స్వామివారి అనుగ్రహమేనమ్మాయ్ అనేవారు.

అమ్మగారు పరమపదానికి వెళ్లేటప్పుడు ఇక్కడ ఉండి సేవించుకునే భాగ్యం కలిగింది. ఇది అమ్మగారు మాకు ఇచ్చిన అనుగ్రహం.



# దయ గల తల్లి

## గోపాలకృష్ణ, స్వామివారి సారథి



నేను స్వామివారి దగ్గర పనిలోచేరి 25 సంవత్సరాలు అయ్యింది. అమ్మగారికి అందరూ సమానమే. నేను చేరిన ఈ 25 సంవత్సరాల కాలములో వారు మాతో చాలా తక్కువగా మాట్లాడేవారు. నాతోనే కాదు ఎవరితోనైనా తక్కువగా మాట్లాడతారని నేను గ్రహించాను. వారు మితభాషి. ఎప్పుడైనా కుటీరం ముందు బండిపెడితే, 'ఎక్కడికి వెళుతున్నారు?, ఎప్పుడొస్తారు స్వామివారు?' అని అడిగేవారు. ఎప్పుడైనా నా భార్య పువ్వులు లేదా పండ్లు తీసుకెళ్ళి ఇచ్చినా ఎటువంటి భేదాలు లేకుండా నవ్వుతూ స్వీకరించేవారు. వారు అందరినీ సమానముగా చూసేవారు. దానికి ఒక నిదర్శనం నేనొక సామాన్యమైన డ్రైవరిని అయినా నాకూతురి పెళ్ళికి వారు భద్రాచలంనుండి వస్తూ మధ్యరాత్రి 12 గంటలకు మా ఇంటికి వచ్చారు. అమ్మగారు నా కూతురిని, అల్లుడిని ఆశీర్వదించారు. ఆ సంఘటన ఇప్పటికీ నా మదిలో మెదులుతూనే ఉంటుంది. అది నా జీవితంలో ఆనందకరమైన, ఆశ్చర్యకరమైన సంఘటన. వారు దయార్ద్ర హృదయంతో ఈ ప్రపంచమంతా పూజించే ఆచార్యులను మనకందించిన గొప్ప మాతృమూర్తి.

---

## టి. రూపా గోపాలకృష్ణ



అమ్మ కన్నా మిన్న అమ్మ అందాల ముద్దులఅమ్మ. లోకాలన్నిటికీ జ్ఞాన జ్యోతిని... వెలిగించమని చెప్పి పంపిన దివ్య జ్యోతిని వెలుగులోకి పంపిన మా దివ్యరత్నము. ఈ దివ్య రత్నముని వెతకండి అని మాయమాయెను. అయినా మా హృదయాలలోవున్న రత్నము ఎలా మాయమౌతుంది. మంచిని నేర్పించారు, మంచిని చూపించారు, చెడుని వదలమన్నారు

మా గుండెల్లో జ్ఞానజ్యోతిని వెలిగించారు. అదే బాటలో నడుస్తాం. అమ్మ!మీరు ఎక్కడ వున్నా మీ దీవెనలు మాకు చాలు.మీరు మా లోనే వున్నారు. మీ మాటలు, మీ పాటలు, మీ విష్ణుసహస్రనామము, ఆ చిరునవ్వు, ఆ కంటి చూపు, మమ్మల్ని మేలుకొలుపుతాయమ్మా!బంగారు మా అమ్మగారు.అయినా నాకు తెలియక అడుగుతానమ్మా , మాకుతెలియకుండా ఎక్కడ దాగున్నారు. కొలనులో కలువపుష్పములో దాగివున్నారా అమ్మగారు. మమ్మల్ని అలా వెళ్ళేటప్పుడు, ఇలా వెళ్ళేటప్పుడు చూస్తూ వుంటారా అమ్మా ! సరే మీ కోరికే మాకు ఇష్టం. అమ్మగారు! ఒక్కటిచెప్పాలి అని వుంది. మీది యెంత పెద్ద మనసు. మంచి మనసు ఉన్న మా అమ్మగారు. అదే మనస్సు మన స్వామివారికి నేర్పించారు .అదేంటంటే , వీరు గొప్పవారు, ధనికులు, పేదవారూ అనే భేద భావములు లేకుండా పెంచారు. అదే భావముతో అంత ఓపిక లేకపోయినా తోడుగా శారదమ్మని తీసుకుని, ఎక్కడ హైదరాబాద్ ..... ఎక్కడ కోదాడ ... అంత ప్రేమతో మా అమ్మాయి కళ్యాణానికి వచ్చి ఆశీర్వదించారు. ఎంత గొప్ప మనస్సమ్మా ! మేము యెంత చెప్పినా మా హృదయాలకు అందని మీ ప్రేమ సముద్రమంత.! ఇంతా అని చెప్పలేముకదా అమ్మ! మీ ప్రేమకు అంతు లేదు .........







దేశభక్తితో భారత మాతకు వందనం



# అద్వితీయమైన తల్లి

**పద్మావతి రామానుజం,**
**రాజమహేంద్రి**



ఒక తరం తీరం దాటింది, పెద్దజీయర్ స్వామి వారి తర్వాత తరంలోని ఆఖరి సంబంధి తన జీవన యానాన్ని ముగించారు. వాసాంసి జీర్ణాని యథా విహాయ అని తెలియని వారము కాము కాని మనకి తెలిసిన రూపంలో మన మధ్యన ఉన్న అమ్మగారు చిరునవ్వుతో తన అంతిమ గమ్యాన్ని చేరుకున్నారు. ఎన్ని వేదాంతాలు తెలిసినా ఇది మనకి విషాదమే. అందమైన రూపం అంతకు మించిన మృదువైన మాట బంగారానికి తావి లాగ కనిపించేవారు. స్వామి వారు 1989 రాజమహేంద్రవరంలో చాతుర్మాస్యం.... అదే దాసురాలికి ఆచార్యులని అందించింది. అదే సందర్భంలో అమ్మగారిని దర్శించుకోవడం జరిగింది. ఆనాటి బంధం గోదావరిలో ఆమె చేరేంతవరకు సాగింది, అమ్మగారి పరమపద వార్త ఆ రోజు ఉదయం చూసి అది తప్పుడు సమాచారం అనుకున్న మాకు అది నిజమని తెలిసి నిర్ఘాంత పోయాము. కృష్ణాష్టమి అయిన తరువాత అంటే కృష్ణ సాయుజ్యమే. ఎంతో నిష్ఠతో ధనుర్మాసాన్ని చేసే వారికి పరమపురుషార్థాన్ని కృప చెయ్యడా ఏమి?

పటిష్ఠమైన ఆధ్యాత్మిక పునాదులపై నిలచిన గొప్ప భవనం ఆమె జీవితం. పెద్దస్వామివారి (పూర్వాశ్రమం) కోడలుగా జీవితం ఆనందంగా ఆరంభమైనా చిన్నతనంలోనే భర్తను కోల్పోయారు. చిన్న పిల్లలు ఎన్నో బాధ్యతలు. ఈ సమయంలో పెద్దస్వామివారు పరమపదించారు మరి ఆ సాంప్రదాయ బాధ్యతకు ఆమెను తన పెద్దకుమారుని త్యాగం చెయ్యమని అడిగారు అందరు. ఎంత కష్టమైన నిర్ణయం. కుటుంబ బాధ్యతలను తను స్వీకరించి తన తనయుని సాంప్రదాయ రక్షణకు త్యాగం చేసిన ఒరుత్తి మగనాయ్ అద్వితీయమైన తల్లి. శ్రీకృష్ణుని మనకి అందించిన దేవకీ ఆమె, నిను కన్నది కానుపు రామ అంటాడు భక్త రామదాసు అటువంటి కౌసల్య ఆమె. ఎదో చిన్న త్యాగాలు చేసి ఆర్భాటాలు చేసే వారిని చూసే మనం ఇటువంటి త్యాగాన్ని కనీ వినీ ఎరుగము. ఆరోజు ఆమె ఆ త్యాగం చేసిఉండకపోతే మనందరి పరిస్థితి గురించి ఆలోచించడానికే భయం వేస్తుంది. ఆ రోజు ఆమె చేసిన త్యాగం మనకోసం అని తలుచుకుంటేనే మనసు కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది.

ఇవన్ని అంతర్భావాలు కాని, ఎప్పుడు అమ్మగారిని కలిసినా చాల సాధారణంగానే అనిపించేది. మా శ్రీవారికి ఒక చక్కటి జ్ఞాపకం అని చెప్తారు. అమ్మగారి పెద్దమ్మాయి పెళ్ళిచూపులకి పెళ్ళికొడుకుకి సాయంగా ఈయన వెళ్లారట ఏమీ తెలియని చిన్న వయస్సుట కాఫీ తాగను అంటే ప్రత్యేకంగా పాలు కలిపి ఇచ్చారట. ఇప్పటికి అది ఒక గొప్ప జ్ఞాపకంగా తలచుకుంటారు. తరవాత ఇంటికి ఏవో మరమ్మత్తులు చేసినప్పుడు చాలాసార్లు కలిసే అదృష్టం దక్కింది వారికి. ఎప్పుడు నన్ను ఆప్యాయంగా పేరు పెట్టి పిలిచేవారు పిల్లల గురించి అడిగేవారు. స్వామి వారిని నేను దగ్గిర నుండి చూడలేకపోతున్నాను అనేవారు సామాన్యంగా. ఆశ్రమంలో కలసినప్పుడు మీకు స్వామివారు వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు కనిపిస్తారు అంటే కనిపించేవారు.... ఇప్పుడు మొక్కలు పెరిగి అడ్డు వచ్చాయి అన్నారు . ఆశ్రమంలో ఆ గది బోసిపోతుంది. కేవలం స్వామివారికి ద్రిష్టి తీసేటప్పుడు మాత్రమే ముందుకు వచ్చేవారు. అద్భుతమైన సన్నివేశం ఎన్నిసార్లు సేవించుకున్నా బాగుండేది. అది మరల చూడలేము అంటేనే బెంగగా ఉంది. అప్పుడప్పుడు మా వాహనంలో ఇంటిదగ్గర దింపే భాగ్యం కలిగేది. అన్నింటికన్నా మా పెద్దబ్బాయి మొదటి పుట్టినరోజున మా ఇంటికి వచ్చి పాట పాడి వాడిని ఆశీర్వదించారు. ఆ వీడియో ఒక మధుర

**అవ్యాజ ప్రేమతో పరమాత్మ తనని తాను అమ్మగా, ఆచార్యులుగా అందించుకుంటాడు**



జ్ఞాపకం మాకు. భాగవతులతో శారీరక బంధుత్వం ఉండడం ఒక సుకృతం అది నాకు వివాహం అయినతర్వాత లభించిన ఒక సుకృతం.

జీవితంలో చిన్న చిన్న పరీక్షలకే భయపడి సతమతమైపోతున్న యువత అందరికి ఆవిడ జీవితం ఒక ఆదర్శం. ఎన్నో అడ్డంకుల్ని దాటుకొని తన కర్తవ్యాన్ని తన ధర్మాన్ని పాటించిన ధన్యజీవి అమ్మగారు. తన పెద్ద కుమారుని ధర్మరక్షణ కోసం రామానుజ సిద్ధాంత ప్రచారంకోసం త్యాగం చేసిన మహితాత్మురాలు. ఒకరి పట్ల కృతజ్ఞత వారు చేసిన ఉపకారాన్నిబట్టి ఉంటుంది. సాక్షాత్తు అచార్యులనే మనకు అందించిన తల్లికి ఏమిచ్చి కృతజ్ఞతలు తీర్చుకోగలం తనువుచే వందనం సమర్పించడం తప్ప.

❖❖❖❖❖❖❖

# మరువలేని మధురక్షణాలు

**జయలక్ష్మి, చెన్నై**



అమ్మ అంటే ప్రేమ, ఆత్మీయత, అనురాగం, అనుబంధం ప్రతి సం॥ స్వామీజీ పుట్టిన రోజున శుభోదయ వేళలో అమ్మ కోకిల కంఠంతో తియ్యతియ్యగా వీనుల విందుగా ఆశీర్వాద రూపంగా సాగే అమ్మపాట, తైలంపెట్టడం, హారతినివ్వడం, స్వామీజీ స్పందన అన్నీ మధురమే. అమ్మగారు మరలా ఆతైలం దాసులందరికీ అనుగ్రహించడం అంతా ప్రేమమయం. చాతుర్మాసం శుభోదయవేళలో పుష్పాలు సేకరిస్తూ అమ్మ దర్శనం అయ్యేది. దాసోహాలు చేసుకుంటూ నవ్వుతూ తియ్యగా పలుకరించేవారు. ఇక ఆరోజంతా చక్కగా పెరుమాళ్ళు తనసేవలో అన్వయింపచేసుకునేవారు అమ్మ ఆశీర్వాదంతో. ఒకసారి అమ్మగారు దాసురాలికి ప్రసాదం చిన్న పిల్లలకు పెట్టేలా కొసరి కొసరి వడ్డించారు. అదొక అందమైన అనుభూతి.

అమ్మ అంటే ప్రేమ. అమ్మగారు స్వామివారికి మంగళాశాసనాలు చేస్తుంటే అనిపించేది. అమ్మగారు రోజంతా ఆ మధుర క్షణాల కోసమే ఎదురుచూస్తున్నట్లు ఎంతో ప్రేమతో చేస్తునట్లు అనిపించేది.

అమ్మగారిని చూసినప్పుడల్లా ఈ తల్లిఒడిలో స్వామి ఆడుకున్నారు కదా! ఈ చేతి గోరుముద్దలు తిన్నారు కదా! అమ్మదగ్గర గారాలుపోయింటారు కదా! అనిపించేది. ఇలా ఏవేవో తీపిగురుతులు మచ్చుకు కొన్ని ఇంకా ఎన్నెన్నో ...

అమ్మ మిమ్మల్ని 'మిస్' అవుతున్నా మమ్ము ఏదో వెలితి పూడ్చలేని వెలితి.

ఆ పుణ్యమూర్తికి భగవంతుని సన్నిధిలో నిత్యకైంకర్య ప్రాప్తిని ఆకాంక్షిస్తూ.

భగవంతుని, ఆచార్యులను ప్రార్థిస్తూ...

అనేకానేక దాసోహములతో.



# అంతిమ క్షణాలు



## శ్రీమతి అనురాధామూర్తి (నవ్వుల అనూరాధ)

నా పేరు అనూరాధ. అమ్మని సేవించుకున్న భాగ్యవంతులలో నేనూ ఉన్నాను. అమ్మగారిని దర్శించిన క్షణం నుంచి ఆమెలో నా తల్లిని చూసుకుంటుండేదాన్ని. ఇంటిలోగాని, వంట్లోగాని కలత ఏర్పడినప్పుడు అమ్మగారు ఎంతో ధైర్యం చెప్తూ ఉండేవారు. చిరునవ్వును ఎప్పుడూ కోల్పోవద్దని నాకు నవ్వుల అనురాధ అనే టైటిల్‌ని అనుగ్రహించారు. అమ్మ అనుగ్రహంతో ఈరోజు అదే నా యింటి పేరై కూర్చుంది.

అమ్మగారితో పరిచయం అయిన మొదలు శ్రీస్వామివారిని సేవించేందుకు వారిని దగ్గరుండి తీసుకునివెళ్ళే అదృష్టం లభించేది. ఒక సారి స్వామివారు కార్యక్రమం పూర్తయిన తరువాత తిరిగి ఎలా వెళతారు అని అడిగినపుడు దాసురాలిని చూపించారు. శ్రీ స్వామివారు అమ్మ గారిని జాగ్రత్తగా తీసుకెళతావా? జాగ్రత్తగా తీసుకునివెళ్ళు అని చిరునవ్వుతో మంగళాశాసనం చేశారు. ఆనాటి నుండి దాసురాలు అమ్మకి ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాలన్నా కూడా ఉండి సేవచేసుకునే అదృష్టాన్ని పొందింది ఆమె సేవలో కన్నతల్లిలేని లోటును మరచిపోగలిగింది. జీవితానికి ఒక దిక్సూచి లభించినట్లుగా అనిపించింది. అలాంటి ప్రేమమూర్తి అయిన అమ్మగారిని కోల్పోయిన ఆ క్షణాలు నానవ్వును హరించివేశాయి.

అది సెప్టెంబర్ నెల 11వ తేది శుక్రవారం సాయంత్రం 4.00గం. అమ్మగారి దగ్గరికి వెళ్ళాను. అమ్మగారు పడుకొని ఉన్నారు. 4.30గం. లేచారు. నన్ను చూసి నవ్వారు. దాసోహం సమర్పించుకున్నాను. ఆశ్రమంలో కృష్ణాష్టమి చాలాబాగా జరిగింది అమ్మగారు. శ్రీస్వామివారు వేద విద్యార్థులకు చక్కగా స్కేటింగ్ నేర్పిస్తున్నారు. చాల అద్భుతంగా చేసారు. అన్ని రంగాలలో మన విద్యార్థులు నిష్ణాతులవుతున్నారమ్మా అన్నాను. మంచిది అన్నారు. కూర్చున్నారు. అమ్మగారు చక్కగా మాట్లాడుతున్నారు. మళ్ళీ పడుకొన్నారు. సాయంత్రం 7.00గం. అవుతోంది. మన ఆక్యుప్రెషర్ విజయలక్ష్మిగారు వచ్చారు. దాసోహం చేసుకున్నారు. అమ్మ నా చేయి పట్టుకుని తను ఏమిచేస్తునారు అని అడిగారు. అమ్మ మీకు ఆక్యుప్రెషర్ చేయడానికి మన ఆశ్రమం నుండి వచ్చారు అన్నాను. అమ్మగారు మెల్లమెల్లగా అనారోగ్యంలోకి జారుకుంటున్నారు. కన్నులు మూసుకుంటున్నారు. తెరుస్తున్నారు.

విజయలక్ష్మిగారు అవి మంచి సింప్టమ్స్ కావని అంటున్నారు. ఇంతలో చెమటలు పడుతున్నాయి. తాయారుగారి అబ్బాయి బి.పి., షుగర్ , పల్స్ చెక్ చేస్తున్నారు. శ్రీశ్రీశ్రీ స్వామివారికి కాల్ చేసి విషయం తెలియజేసారు విజయలక్ష్మిగారు. చక్కెర కలిపి నీరు త్రాగించమన్నారు. పాదాలు రుద్దుతున్నాము. అమ్మగారు ఇంకా నీరసంగా అవుతున్నారు. ఒళ్ళు చల్లబడుతోంది. నీరు వామిట్ చేసుకున్నారు. ఆశ్రమం నుండి కృష్ణ స్వామి వచ్చారు. యశోదా హాస్పటల్

**అమ్మ మహిమ నెరిగినవారు అద్భుతాలు సాధిస్తారు! ఆనాటి కోదండ రాముడు ఈనాటి మన త్రిదండ రాముని లాగ!**



నుండి డాక్టర్స్ వచ్చారు. పల్స్ అందటం లేదు. శ్రీస్వామివారు ప్రసార మాధ్యమంలో అంతా వీక్షిస్తున్నారు. అమ్మగారిని మెల్లగా పరమపద సోపానాలు ఎక్కిస్తున్నారా! అన్నారు. అంతా నిశ్శబ్దం.

నా ముందు అంతవరకూ మాట్లాడుతూ, నవ్వుతూ, చూస్తూ-చూస్తూ ఉండగానే ఊహించని విధంగా కళ్ళ ముందే వెళ్ళి పోవడం నాజీవితంలో ప్రత్యక్షంగా చూసాను.

అమ్మగారు మనకి ఆచార్యులను ఇవ్వడానికి వచ్చిన మహాతల్లి. మన మధ్య, మనలో ఒకరై ఉన్నారు. భౌతికంగా మనం వారిని చూడలేకపోయినా వారు ఎప్పుడూ మన మధ్య ఉంటారు. వారి ఆచారము, మడి , సంప్రదాయ నిష్ఠ, ఆచార్యులపై వారికి గల విశ్వాసం మరువలేనివి.

అమ్మ అనుగ్రహం మన అందరిపై ఎప్పుడూ ఉండాలని ఆశిస్తూ, భగవంతుని ప్రార్థిస్తూ.........

❖❖❖❖❖❖

# ఆదర్శమూర్తి

**శ్రీమతి బృంద**

**నాయుడుపేట, నెల్లూరు జిల్లా**



ప్రపంచాన్ని భక్తితత్వపు బాటలో నడిపించేందుకు ఆచార్యులు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అనే మహనీయుడుని మనకందించిన మాతృమూర్తి శ్రీ అలివేలు మంగతాయారు అమ్మగారితో ఏన్నో అనుభవాలు ఏంతో ఆత్మీయత. ప్రతి సంవత్సరం స్వామి వారి తిరునక్షత్ర వేడుకల్లో పాల్గొని ప్రాతఃకాల సమయంలో స్వామివారికి అమ్మగారు మంగళాశాసనాలు అందించి అనంతరం మాకు తైలము అందజేసేవారు. కాని శ్రీ స్వామివారి షష్ట్యబ్ది వేడుకల కోసం ఎంతో దూరం నుంచి దివ్యసాకేతం చేరుకున్న మేము షష్ట్యబ్ది కార్యక్రమాల్లో శ్రీవైష్ణవ సంప్రదాయ పద్ధతిని అనుసరించి వేడుకల్లో పాల్గొని స్వామివారి మంగళాశాసనాలు అందుకోవాలని పరితపించిన మాకు మా సభ్యులకు... శ్రీవైష్ణవ సంప్రదాయ కట్టు గురించి తెలుసుకునేందుకు అమ్మగారి కుటీరానికి ఎంతో ఆత్రుతగా చేరుకున్నాము. అప్పటికే అమ్మగారు స్నానమాచరించి మడిలో ఉన్నారు. ఇలాంటి సమయంలో మనకి సంప్రదాయం గురించి వివరిస్తారా అనే ఆలోచన మాలో కలిగింది. అయినప్పటికీ మా బృందం లోని సభ్యులమంతా ధైర్యం చేసి అమ్మగారిని చీరకట్టు సంప్రదాయాన్ని తెలియజేయాలని వేడుకోగా అమ్మగారు ఎంతో ఆప్యాయంగా మడిలో ఉన్నప్పటికీ ఎంతో ఓర్పుగా,క్షుణ్ణంగా మాకు వివరించి చెప్పడం జరిగింది. చెప్పడమే కాకుండా చేసి చూపించి మాకు నేర్పించారు.. అలాంటి అమృతమూర్తికి అశ్రునయనాలతో కన్నీటి బాష్పాంజలి...

**అమ్మ నేర్పును సంప్రదాయపు పడికట్టు**



## మాతృప్రేమకు సోదాహరణం



**సుభాషిణీ, హైదరాబాద్**

తిరుప్పావైలో గోదమ్మ, ఏరారన్ద కణ్ణి యశోదై ఇలం శింగం అన్నట్లుగా అమ్మగారు, స్వామివారి పూర్వాశ్రమంలో నయనానందాన్ని, బ్రహ్మానందాన్ని అనుభవించిన మాతృమూర్తి. పరిపూర్ణమైన మాతృప్రేమకి చక్కని ఉదాహరణ. తత్తే భవతు మంగళం. వాత్సల్యంతో చేసే లాలనగా, స్వామివారి ప్రయాణసమయాలలో పదే పదే మంగళాశాసనాలు చేసి రక్షపెట్టి ఆనందపడేవారు. శ్రీరామునికన్న, కౌసల్యాదేవిలా, కన్నయ్యను పెంచిన యశోదమ్మలా, స్వామివారిని కని, పెంచి విశేష సుకృతం చేసుకున్నారు.

దాసురాలికి అమ్మగారు చాలా విషయాలు చెప్పేవారు. రామానుజసిద్ధాంతాన్ని, సందేశాన్ని పదిమందికి అందించడం మనందరి బాధ్యత అని, అనువుగానిచోట అధికులమనరాదు అన్నట్లుగా ఉండాలని, సహనం, వినయం ప్రధానమని చెప్పేవారు. భక్తితో నిజాయితీగా, చిత్తశుద్ధితో ఉండాలనేవారు. ఎంతో వాత్సల్యం చూపించేవారు. అలాంటి మన అమ్మగారికి సవినయంగా కృతజ్ఞత అంజలి సమర్పిస్తూ.....



## సంప్రదాయ నిష్ఠాపరులు

**పెరుందేవి**

**జీవా, శ్రీరామనగరం**

అమ్మగారు గొప్ప సంప్రదాయనిష్ఠురాలు. కన్నతల్లి అయినా, స్వామివారిని ఒక ఆచార్యులలాగా, తమను వారికి శిష్యురాలలాగానే వ్యవహరించేవారు. ప్రతీరోజూ హారతి ఇచ్చి, శ్రీపాదాలకు పుష్పాలు సమర్పించేవారు. పాదపూజ జరిగినపుడు శ్రీపాదతీర్థం స్వీకరించేవారు. చాలా వినయంగా ఉండేవారు.

దాసురాలు అమ్మగారితో కలిసి ఉన్నది కొద్ది సంవత్సరాలే అయినా, మనసుకి వారు చాలా దగ్గరయ్యారు. వారికి ఆంతరంగిక సేవలు చేసే భాగ్యం కల్పించారు. ( వారి చెయ్యి పట్టుకుని కోవెలకి తీసుకువెళ్ళడం, మంచితీర్థం అందిచడం, వంటగదిలో వారికి సహాయం చేయడం, అపుడపుడూ వారి చేతి వంట రుచిచూడడం, వారితో కలిసి రాత్రుళ్ళు తోడుగా ఉండడం దాసురాలికి వారు మిగిల్చిన మధురస్మృతులు.

అమ్మగారు పాటలు చాలా చక్కగా పాడేవారు. స్వామివారి పూర్వాశ్రమ విషయాలు, చెప్పేవారు. కుటుంబభారాన్ని ధైర్యంగా పైన వేసుకుని ముందుకు నడిపించారట. వారిలో దాసురాలికి నచ్చిన గుణాలు చాలా ఉన్నాయి. ధైర్యం, సహనం, శాంతి, ప్రేమ, పెదవులనిండా చిరునవ్వు, సౌమ్యత, నిరాడంబరత, వినయం మొదలైనవి.

వారిని ఆదర్శంగా తీసుకుని వారిలోని గుణాలను అలవరచుకొని సంప్రదాయాన్ని ముందుతరాలకి అందించవలసిన బాధ్యత మనందరిది.



# అమ్మగారితో మా అనుబంధం



**శ్రీమతి కొండమ్మ**
విజయనగరం

అస్మదాచార్యులు శ్రీచిన్నజీయర్ స్వామివారికి దాసోహములు సమర్పిస్తూ...

బంగారుతల్లి అలివేలు మంగమ్మగారితో దాసురాలికున్న అనుబంధం మీతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను.

అప్పుడు మేము రాజమండ్రిలో ఉండేవాళ్ళము. తులసీ రామానుజ కూటముకు వెళ్తూండేవారము. అమ్మగారు ఆ పక్కనే ఉన్న వీరభద్రపురములో ఉంటూండేవారు. అప్పుడప్పుడూ మేము వెళ్ళి సేవించుకునేవారము. వారిని కలిసినప్పుడల్లా ఎన్నో విషయాలను మాకు చెబుతుండేవారు ఒకసారి ఈ సందర్భం గురించి చెప్పారు.

పెద్ద జీయర్ స్వామివారు అమ్మగారిని అడిగారట మీ పెద్దబ్బాయి "మాకు శ్రీమన్నారాయణుని ఇస్తారా?" అని, అడిగితే... అమ్మగారు "దేవరవారు ఆజ్ఞాపించాలి" అన్నారట. ఉణ్ణుం శోరుం పరుకునీర్ అన్నట్లుగా "అన్నీ దేవరవారే.. ఎలా ఆజ్ఞాపిస్తే అలా నడుచుకుంటాము" అన్నారట అమ్మగారు. అది విన్నమాకు ఎంతో ఆశ్చర్యం కలిగింది ఎంతటి ఆచార్య నిష్ఠవారిది అని!

అలా మేము వారిని ఎప్పుడు సేవించుకున్నా అమ్మగారితో ఎన్నో విషయములు, మా కష్టములు, సుఖములు చెప్పుకునేవారము. వారుకూడా మాతో ఎన్నెన్నో జ్ఞాపకాలు పంచుకునేవారు.

**అమ్మగారు ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడేవారు. వారి మాటల్లో గాని కళ్ళల్లోగాని ఏ బాధ ఎప్పుడూ కనిపించేది కాదు.** పాటలు అద్భుతంగా పాడేవారు. కొంతకాలం జెట్ దోమలగూడలో కూడా ఉన్నారు. దాసురాలు అమ్మగారి దగ్గరకు వెళ్ళినప్పుడల్లా చాలా విషయాలు మాట్లాడుకునే వారము, ప్రసాదము పెట్టకుండ అస్సలు వెళ్ళనిచ్చేవారుకారు. ఎప్పుడూ ఆప్యాయముగా పలకరించేవారు, మేము మాట్లాడుకున్నప్పుడు ఎవరైనా వస్తే విజయనగరము రాజుగారి అమ్మాయి అని చెప్పేవారు. మా అమ్మగారు, నాన్నగారు, పెద్దజీయరుస్వామి వారికి ప్రియ శిష్యులు.

ఒకసారి అమ్మగారు, నేను శ్రీరంగ క్షేత్ర వైభవం మాట్లాడుకుంటున్నాము. "ఎన్నాళ్ళు అయిందో శ్రీరంగము వెళ్ళి" అన్నారు. వెంటనే నేను మనం కలసి "శ్రీరంగం వెళదాము" అన్నాను. "నేను నడవగలనా?" అన్నారు అమ్మగారు. "కోవెల దగ్గరనే గది ఉందమ్మ, ఏమీ ఇబ్బంది ఉండదు, దగ్గరుండి మిమ్మల్ని తీసుకు వెళతాము అంటే నవ్వేశారు. ఎప్పుడు అడిగినా నవ్వేవారు, భూలోక వైకుంఠమైన శ్రీరంగము అమ్మగారిని తీసుకుని వెళ్ళలేదు అనే బాధ ఎప్పుడూ ఉండేది నాలో. ఇప్పుడు వారు సాక్షాత్తు వైకుంఠంలో స్వామి కైంకర్యంలో ఉంటూ మమ్ములను ఆశీర్వదిస్తారని ఆశిస్తూ.

**అమ్మ హృదయం అర్థమైన వానికి శాస్త్ర హృదయం అతి సులభంగా అర్థమవుతుంది.**



అమ్మగారి ఆశీస్సులు పొందడం విదేశీగాయకుని అదృష్టం



# గొప్ప సౌమ్యురాలు!



ఎం.శ్రీలక్ష్మి

అమ్మగారితో అనుబంధం అనేది స్వామి మాకిచ్చిన మహా అదృష్టంగా భావిస్తాము. 2000 సంవత్సరంలో వెండి పండుగ సందర్భంగా మొదటిసారి దగ్గరగా చూడటం జరిగింది. ఆమె పాడే పాటలు విని, మాకు కూడా ఉన్న కొద్దిపాటి సంగీత పరిజ్ఞానాన్ని ఆమె ముందు ప్రదర్శించుకొని, ఆమె పాదాలమీద పడగా, ఆమె ఎంతో ఆప్యాయంగా చేరదీసి, ఆశీర్వదించి, ఆనాటినుండి ఈనాటివరకు ఎంతో ప్రేమగా సొంత పిల్లలుగా చూసుకున్నారు. ఆమెను కలవడానికి ఎప్పుడు వెళ్ళినా నవ్వుతూ పలకరించి, మంచి విషయాలేమైనా చెప్పి, ఒక పాట పాడించుకుని, పండో ప్రసాదమో ఇచ్చి పంపించేవారు. అమ్మగారితో పాటు శ్రీకూర్మము, అరసవెల్లి, సింహాచల క్షేత్రాలను సందర్శించిన మధురానుభూతులు మరువలేము. ఈ స్వరూపమే మన చిన్న జీయర్ స్వామి వారిది కూడా! తిరుమల శ్రీ స్వామి సందర్శనానికి వెళుతున్నాము అని చెప్పినప్పుడు, ఆ స్వామిని, రామానుజులవారిని మన శంషాబాద్ రామానుజ సహస్రాబ్ది త్వరలో పూర్తి కావాలని కోరుకోమని చెప్పేవారు. అదే ఆమెకు ఉన్న ఏకైక కోరిక. అది త్వరలోనే జరిగేటట్లు ఆ స్వామి అనుగ్రహించాలని కోరుకుంటూ, ఆమె ఆశీర్వచనాలు మాపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ...

# అమ్మప్రేమ



శ్రీమతి కృష్ణజ్యోతి

2005 సంవత్సరంలో ఈ అభాగ్యురాలు కన్నతల్లిని కోల్పోయి విలవిల్లాడిపోతుంటే సాక్షాత్ భగవత్ స్వరూపులు అస్మద్గురుదేవులవారు అమ్మగారిని చూపించి స్వాంతన పొందమని మంగళాశాసనములు చేయడంతో అమ్మగారి దరిచేరిన నాకు మనసులోని వేదనంతా ఆవిరైపోయింది. ప్రపంచానికి యతిని ప్రసాదించిన ఆ కరుణామూర్తి నన్ను ఆప్యాయతానురాగాలతో అక్కున చేర్చుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తూ వారి చల్లని చూపులో ఎంతగానో సేద తీరాను. నన్ను కూతురులాగా ఎన్నో సందర్భాల్లో మందలిస్తూ, వెన్ను నిమిరి ధైర్యం నూరిపోస్తూ, ఇన్నేళ్లుగా నాకు అమ్మలేని లోటు తీర్చారు. అమ్మలాగా భావించి అమ్మగారిని పట్టుకొని ఎన్నోసార్లు ఊరడిల్లాను. నాలోని అన్ని బాధలనూ, సంతోషాలనూ ఆ తల్లితో పంచుకొని మనసు నిండుగా ఆప్యాయత నింపుకున్న సందర్భాలెన్నో. అమ్మగారి సన్నిధిలో మనుష్యులతో ప్రేమ పంచుకోవడం నేర్చుకున్నాను. ఎదుటి వారి బాధలు తీర్చగలమని నేర్చుకున్నాను. ఆ తల్లితో నా అనుభవాలు కేవలం జ్ఞాపకాలుగా మిగిలిపోలేదు. ఎప్పటికీ సజీవమైన సందర్భాలుగా నాతోనే వుంటాయి. అమ్మ ఎప్పటికీ నా ప్రక్కనే, నాతోనే ఉంటూ నన్ను కోప్పడుతూ, నవ్విస్తూ, హెచ్చరిస్తూ చూపుల్లో ప్రేమ కురిపిస్తూ నాతోనే ఉంటారు అమ్మ.

**గుడి లేని దైవం అమ్మ, కల్మషం లేని ప్రేమ అమ్మ**



# స్ఫూర్తి ప్రదాత

**చక్రవర్తుల రామానుజాచార్యులు**

**పూర్వ జెట్ మేనేజర్, కల్లూరు ఖమ్మం జిల్లా**



1985లో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారిని తిరువూరులో ఒక కార్యక్రమంలో పాల్గొనుటకు విచ్చేసినప్పుడు మొట్టమొదటి సారిగా దాసుడు సేవించుకోవడం జరిగింది.

జీయర్ స్వామి వారి అనుగ్రహ ప్రభావం వల్ల 1996 సంవత్సరంలో కాకతీయ సిమెంట్ MD గారు అయిన శ్రీ వెంకటేశ్వర్లు గారి పురుష కారము వలన జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ లో మేనేజర్ గా చేరినాను.

ఆ సమయంలో అమ్మగారు రాజమహేంద్రవరము లోని వారి స్వగృహంలో ఒంటరిగా నివాసము ఉంటున్నారు ఆ సమయంలో మన JET కమిటీ వారు శ్రీ జీయర్ స్వామి వారి ముందు ఒక ఒక ప్రతిపాదన తెచ్చారు స్వామి అమ్మగారి సంతానం వివాహాలు అయ్యి ఉద్యోగ వ్యాపారాల నిమిత్తమై బెంగుళూరు చెన్నైలో నివసిస్తున్నారు అమ్మగారు ఒంటరిగా రాజమహేంద్రవరంలో నివసిస్తున్నారు వారిని మన దోమలగూడ JET నందు నివాసం ఏర్పరిచి వారి బాగోగులు చూసు కొనుటకు అనుమతించమని వేడుకోగా శ్రీ స్వామివారు ససేమిరా వద్దన్నారు.

ప్రపంచానికి జ్ఞానభిక్ష, మోక్షప్రాప్తిని ప్రసాదించే అపర రామానుజులను అందించిన మాతృమూర్తి, మా అందరి అమ్మ గారు. వారిని సేవించుకునే భాగ్యం కృప చేయవలసినదిగా మరల JET కమిటీ వారు ప్రార్థించగా, సరే మీ ఇష్టం అన్నారు. నాటినుండి JET మేనేజరుగా అమ్మగారికి కావలసిన వసతులు సమకూరుస్తూ వారి శ్రీ సూక్తులు శ్రవణం చేస్తూ ఉండే వాణ్ణి.

**నా జీవితాన్ని మార్చిన అమ్మగారు –** అమ్మగారు ఎల్లప్పుడూ సమాజంలో ఏవిధంగా జీవించాలో ఎలా నడుచుకోవాలో లౌకిక ఆధ్యాత్మిక పారమార్థిక విషయాలు తెలియపరుస్తూ ఉండేవారు. వారి అనుగ్రహ భాషణం సున్నితంగా మృదు మధురమైన పలుకుల ద్వారా నన్ను అనేక విషయాలలో జాగృత పరిచాయి. వారు నాకు చక్కటి స్ఫూర్తిని అందించారు.

1996 నుండి 2000 సంవత్సరం వరకు JET మేనేజర్ గా పనిచేసిన సమయంలో అమ్మ వారిని నిత్యము సేవించుకొనే భాగ్యం కలుగుట నా పూర్వజన్మ సుకృతం.

**నిరంతరం భగవద్భక్తి చింతన –** అమ్మగారు ప్రతిరోజు పెరుమాళ్ళ ఆరాధన అయిన తర్వాతే కాలాతీతం అయినా సరే ప్రసాదం స్వీకరించే వారు అది కూడా భక్తులు ఎవరైనా ఆ సమయంలో ఉంటే వారికి పెట్టిన తరువాతే వారు స్వీకరించేవారు. ప్రాణాయామాది ఆరోగ్య సూత్రాలు పాటించేవారు. భక్తులందరినీ సమదృష్టితో చూసేవారు.

**తిరుమలలో కళ్యాణాలు –** ప్రపంచ నలుమూలలా అవిశ్రాంతంగా రామానుజ సిద్ధాంతాన్ని భక్తులందరికీ ఉపదేశిస్తున్న శ్రీ స్వామివారు వారిపై తిరుమల వెంకన్న శీతల వీక్షణాలు అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని శ్రీ అహల్య జగపాల్ రావు గారి దంపతులు అమ్మగారి ఆజ్ఞ తీసుకొని ప్రతి సంవత్సరం పెద్ద కళ్యాణాలు జరిపించేవారు. ఉడతా భక్తిగా దాసుడు కూడా అమ్మ వారి వెంట ఉండి సేవించడం మహద్భాగ్యం.

అమ్మగారు భౌతికంగా మనకు దూరమైనా పరమపదంలో పెరుమాళ్ళను సేవిస్తూ, పెరుమాళ్ళ అనుగ్రహ వీక్షణలు మనపై ప్రసరించే విధంగా పురుషకారం చేస్తూ ఉంటారనే దృఢచిత్తంతో సదా అమ్మవారికి దాసోహం.

❖❖❖❖❖❖

ప్రతి మనిషి గుండె పలికే మాట అమ్మ.



# "మాతృమూర్తికి అశ్రు నివాళి"

**ద్వారకా రమణ మరియు కుటుంబ సభ్యులు**

**హైదరాబాద్**



కోదండము పట్టుకొని రాముడు మన మధ్య నడిచి నట్లు ఉంటుంది , శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారు త్రిదండముతో నడయాడుతుంటే. భగవద్ రామానుజులు ఎలా వుంటారో మనకి తెలియదు. కానీ, అపర రామానుజులైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారిని చూస్తే మటుకు వారి మాతృశ్రీ ఎంతటి ధన్యురాలో మనకి అర్థము అవుతుంది.

ఒకనాడు కౌసల్య రాముణ్ణి సమాజానికి ఇస్తే, 1000 సంవత్సరాల పూర్వము కాంతిమతి గారు మనకు భగవద్రామానుజులను అందించారు. తరువాత మనకి అపర రామానుజావతారులు ఐన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారిని శ్రీమతి మంగతాయారమ్మ గారు మనకు అందించారు. మృదు స్వభావి, చెదరని చిరునవ్వు, ఆప్యాయత , ఆర్భాటము లేని జీవితమూ, అందరి క్షేమము కోరటము, ప్రతివారు బాగుండాలి అనుకోవటము, నిస్వార్థమైన సేవ, ఏపని చేసిన పరమాత్మకే చెందాలి అనుకోవటము ఆవిడకి మాత్రమే సొంతము. మన ఆచార్యులు అందరివారు, ప్రతివారికి కన్నయ్య లాగ సులభులు అవ్వాలని ఆకాంక్షించిన వారిలో "మన అమ్మగారు" ప్రప్రథములు. వారు ఆచార్య తిరువడి చేరారు అని తెలిసి చాల బాధ పడ్డాము. ఎందుకో తెలియదు కానీ అంతకు ముందు రెండు రోజులు ఏదో తెలియని, చెప్పలేని ఆందోళన మనస్సులో మెదిలేది. ఆచార్యులు ఎప్పుడు చెప్తుండేవారు – ఒకరి ఆనందంలో మనము పాల్గొనక పోయిన ఫరవాలేదు, కానీ కష్టములో, మనకి ఎవరు చెప్పనవసరము లేదు. వెంటనే వెళ్ళి పక్కన ఉండాలి అని. ఈ కష్ట కాలములో ఆచార్యుల పక్కన ఉండలేకపోయినందుకు చాల సిగ్గు పడుతున్నాము. "అమ్మగారికి" పరమాత్మ తప్పక పరమపదప్రాప్తిని ప్రసాదించాడు అని విశ్వసిస్తున్నాము.



# జ్ఞానదీప ప్రదాయిని

**హరిప్రియ, విజయవాడ**

అజ్ఞానపు చీకటితో అంధకారములో మగ్గుతున్న నేటి నవ సమాజానికి , యువతరానికి కోటి సూర్య తేజోవిరాజితమైన 'జ్ఞానదీపాన్ని' 'అపరరామానుజుల'ను ఆచార్యులుగా ప్రసాదించిన 'శ్రీ అలివేలు మంగతాయారు' . అమ్మగారి శ్రీచరణ కమలములకు సవినమ్ర నమస్సులతో దాసోహములు.

'శ్రీకృష్ణస్పర్శ' చేత వెదురు వేణువుగా మారి అమృత రసమయమైన సంగీతాన్ని జాలు వార్చినట్లు, శ్రీ అమ్మగారు యొక్క చల్లని చూపులు, అపారమైన కరుణ వల్ల దాసురాలికి అత్యంత దుర్లభమైన ఆచార్య సన్నిధిలో కొన్ని క్షణాలైన గడప గలిగే అదృష్టం లభించింది.వారి కటాక్ష వీక్షణాలే మాకు శ్రీరామరక్ష . అమృతముకంటే కమ్మనైన 'అమ్మప్రేమ' కు నిలువెత్తు రూపం మా అమ్మగారు.

శ్రీ స్వామివారి ప్రతి తిరునక్షత్రమునకు అమ్మగారు ఎంతో ప్రేమగా, నిండు మనస్సు తో 'ఈ ప్రపంచాన్నంతా ఒకే తాటి మీద నడప గలిగే శక్తి స్వామివారికి కలగాలని, వారికి ఆ శక్తిని, ఆరోగ్యాన్ని, ఆ తిరువేంగడముడయాన్, మా పెద్ద స్వామివారే అందిస్తారు అని మంగళాశాసనం చేసేవారు. వారి మాతృప్రేమకు ఇది ఒక మచ్చు తునక మాత్రమే.

అమ్మగారి సంకల్పం, పట్టుదల, అద్వితీయమైనది. మీరందించిన ఆప్యాయం, ప్రేమా సంప్రదాయ పరిరక్షణ తృష్ణ ఎల్లరకు శిరోధార్యం. సాక్షాత్తూ శ్రీ స్వామివారి మాతృమూర్తి అయివుండి కూడా సామాన్యుల వలె మెలిగే మీ నిబద్ధత, నిరాడంబరత చిరస్మరణీయం. ఎంతో మందికి ఆదర్శం అమ్మగారు. నిరంతర శ్రీమన్నారాయణ పాద పద్మముల సేవకై మీరు ఆ పరమపదాన్ని చేరి ఉంటారని భావిస్తూ ........

**శోభ, మియాపూర్, హైదరాబాద్**



అమ్మగారు, మా అమ్మగారు, శ్రీ పెద్దస్వామివారి తిరువడి సంబంధము, దాసురాలికి కూడా పెద్దస్వామివారి సంబంధము, మా అమ్మ, అమ్మగారు ఇద్దరు పెద్ద స్వామివారి విషయములు మాట్లాడేవారు. అమ్మగారితో, వారి కుమార్తెలతో 40 సంవత్సరాల అనుభవం ... 1983 సంవత్సరములో జూన్ లో మా వివాహ శుభపత్రిక మొదట అమ్మగారికే పంపినాను. మంగయ్యస్వామి మా వివాహమునకు వచ్చినారు . మా వారితో మంగయ్య స్వామి రాజమండ్రి సీతంపేట తప్పక రావాలి అని అన్నారు. మా వారు నన్ను తీసుకుని రాజమండ్రికి జులైలో వెళ్ళినాము.

అమ్మగారు మాకు టిఫిన్ పెట్టి మా వారితో 'మా అమ్మాయిని జాగ్రత్తగా చూసుకోండి'– అని చెప్పి ,విజయవాడ వెళ్లి శ్రీస్వామివారి మంగళశాసనములు తీసుకోమని చెప్పినారు. అమ్మగారు నన్ను తమ స్వంత కుమార్తె వలే చూసేవారు. ప్రతీ నెలకు ఒక్కసారైనా దివ్య సాకేతం వెళ్లి అమ్మగారిని సేవించుకునేదాన్ని ....వారు లేని లోటు తీరనిది .......

**అమ్మ చల్లని ఒడిలో మొదలైంది మనజన్మ.**



# అమ్మవారితో అనుభవములు



**పూసపాటి విశాలాక్షి, విశాఖపట్నం**

శ్రీశ్రీశ్రీస్వామివారు 1996 సం॥ చాతుర్మాస్యదీక్ష 2 నెలలు బదరీ అష్టాక్షరీ క్షేత్రంలో చేశారు. ఆసమయంలో అమ్మవారిని సేవించే భాగ్యం దాసురాలికి కలిగింది.

ఆ సందర్భములో ఒకనాడు శ్రీశ్రీశ్రీస్వామివారి ఆజ్ఞమేర అమ్మవారు, తత్త్వ కళాశాల విద్యార్థులతో కలసి జోషీమఠ్ నరసింహస్వామివారిని సేవించి ,అక్కడేఉన్న రోప్‌వేని సందర్శించే భాగ్యం కలిగింది. అక్కడి పర్వతశ్రేణులను అమ్మవారితో కలసి సందర్శించటం మంచి అనుభూతిని కలిగించింది.

ఆ చాతుర్మాస్యములోనే శ్రీశ్రీశ్రీస్వామివారు అమ్మగారితో భక్తులందరితో అక్కడి సైనికాధికారుల అభ్యర్థనమేరకు హనుమాన్ చెట్టి కొండలలో మొక్కలునాటే కార్యక్రమములో అమ్మగారితో కలసి పాల్గొనే భాగ్యము కూడా ఈ దాసురాలికి కలిగినది.

బదరీ అష్టాక్షరీక్షేత్రంలో ఆ చాతుర్మాస్యం రెండు నెలలూ శ్రీశ్రీశ్రీస్వామి వారిని అమ్మవారితో సేవించుకోవటం దాసురాలికి అమిత ఆనందం కలిగించింది.

# సాక్షాత్తు పద్మావతి నాచ్చియార్ !!!

**తదీయారాధన లక్ష్మి**

ఎప్పుడు దివ్య సాకేతం వెళ్లినా,అమ్మగారు పెరుమాళ్ళ ప్రసాదం పెట్టకుండా పంపేవారు కాదు.



ఎప్పుడు, తిరుమల గురించి తెలుసుకునేవారు .. ఒకసారి అమ్మగారితో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్నప్పుడు, పదోచ్చారణ లో సవరింపులు తెలియ చేసేవారు. 84 వసంతాలు అయినప్పటికీ, వారు మాతో ప్రతి యొక్క చిన్న పదాన్ని చదివి వినిపించారు.

ప్రతి ఒక్కరిని కూడా ఆప్యాయంగా, సమాన భావంతో చూసేవారు. ప్రేమ, త్యాగం, క్రమశిక్షణకి ప్రతి రూపం మా అలర్మేల్ మంగమ్మ తల్లి ఏం చెప్పగలం ఆ అమ్మగారి గురించి. మనల్ని నడిపించడానికి వైకుంఠం నుంచి దిగి వచ్చిన తాయారు ఆమె.

**అమృతం లాంటి ప్రేమను పంచేది, ఆప్యాయత అనురాగం చూపించేది అమ్మ.**

# ఊర్ధ్వపుండ్రం వెనుక భావన

డి.పద్మలత
చెన్నై



అమ్మగారితో అనురాగపూరితమైన, విలువైన సంతోషపూరిత అనుభూతులు.

2000 సంవత్సరంలో మన స్వామివారు చెన్నైలో ధనుర్మాసము ఆచరింప చేస్తున్నారు. ముందు వెనుక వారిగురించి తెలియదు. మా అమ్మగారు హైదరాబాదులో వుండేవారు. స్వామివారిని సేవించిన అనుభవం పంచేవారు.

ధనుర్మాస వేడుకలకు అమ్మగారు చెన్నై వేంచేసారు. శ్రీవైష్ణవ సంప్రదాయం అంటే ఏమీ తెలియదు నాకు. గుండ్రటి బొట్టు పెట్టుకునేదాన్ని. అమ్మగారితో అప్పుడప్పుడూ మాట్లాడే అవకాశం దొరికేది. ఒకసారి అమ్మగారు అన్నారు "ఇలా గుండ్రంగా బొట్టు పెట్టుకుంటే సంసారం అనే జీవన వలయంలో మునుగుతూ తిరుగుతూ ఉండాలి. ఇలా నిలువుగా పెట్టాలి" అన్నారు. "పెరుమాళ్ళని చేరడానికి మార్గం" అన్నారు. అంతే ఈ క్షణం దాకా! దాదాపు 20 సం॥ల నుంచీ స్వామివారి బాటలో పయనిస్తున్నాం. అమ్మగారితో ఆ పరిచయం భగవదనుగ్రహం ఏమో! దాదాపు 12 నుంచి 15 సార్లు వారిని సేవించుకునే భాగ్యం కలిగింది. వారి మనసు మాతృ ప్రేమను అందించేలా వుండేది. ఆ క్షణాలు మరువలేనివి. ఎన్నో లక్షల మంది జీవితాలకు భగవదనుగ్రహం కలిగించే మన స్వామిని మనకు ప్రసాదించినందుకు శిరసా ఎన్నిసార్లు ప్రణమిల్లినా చాలదు.

క్రిందటి సంవత్సరం కాంచీపురములో అత్తి వరదుడిని సేవించుకునే సందర్భంగా అమ్మగారు చెన్నై వేంచేసిన తరుణంలో ఆరోజంతా వారు సాన్నిధ్యంలో గడిపే అదృష్టాన్ని పొందాము. ఎంతో నిష్ఠతో వారు పెరుమాళ్ళను సేవించిన తీరు అద్భుతం. ఆ రద్దీలో అమ్మగారితో దర్శనభాగ్యం కలిగింది.

"అమ్మ శ్రీ హస్తాలే కదా మన స్వామి చేయిపట్టి నడక నేర్పిన శ్రీహస్తాలు, ఆ శ్రీహస్తాల స్పర్శ తగిలి నాకెంత భాగ్యం అనుకుని మురిసి పోయాను'.

భగవద్రామానుజులకు, పెద్ద స్వామివారికి, "అమ్మగారికి దాసురాలి దాసోహములు".

❖❖❖❖❖❖



# శ్రద్ధాంజలి



### ఈ.వి. విజయలక్ష్మి, హైదరాబాద్

అమ్మగారు అంటే జీయర్ స్వామి గారితో పాటు వారి సంబంధం ఉన్న అందరికీ అమ్మగారే. మాతృమూర్తి ప్రేమకి మరోపేరు. ఒక కౌసల్యాదేవి, ఒక యశోదమ్మ ఎంత గొప్పవారో వీరు అంతటి వారే. పెద్దస్వామివారికి, చిన్న స్వామివారికి కూడ పూర్వాశ్రమంలో బాంధవ్యం. అది అందరికీ దక్కే అదృష్టంకాదు. వారికి వారే సాటి. సాంప్రదాయంలో విలువలు సంపూర్ణంగా తెలిసినవారు కాబట్టే స్వామివారి ఆశ్రమ స్వీకారానికి అంగీకరించి, ఇంత మందికి మార్గదర్శకులయ్యే విధంగా వారిని తీర్చిదిద్దిన ఘనత వారిది.

అంతటి వారితో 35 సంవత్సరాలుగా వీడని బంధం మాది. వారికి ఆత్మ బంధువులుగా ఉండటం మా పూర్వజన్మ సుకృతం. ఏనాడూ చిరునవ్వుతో, ఆప్యాయంగా, స్నేహశీలిగా ఉండే మనస్తత్వం వారిది. ఎప్పుడు కలిసినా, మాట్లాడినా అది ఆశీర్వాదంలాగే ఉంటుంది. వారు చేయి పట్టుకుని మాట్లాడితే ఏదో లోకంలో ఉన్నట్లు భావన కలుగుతుంది. వదిలి వెళ్ళాలి అనిపించదు. ముద్దులొలికే ఆ మోము, ఆ చిరునవ్వు నాకళ్ళలో అలాగే ఉంటుంది. మాది ఒకే కుటుంబం అన్న భావన ఎంతో సంతోషం కలిగిస్తుంది.

అటువంటి వారిని ఇక మళ్ళీ చూడలేమనే బాధ తట్టుకోవడం కష్టమే. వారు పరమపదం నుంచి ఎప్పుడూ మనల్ని ఆశీర్వదిస్తూ ఉండాలి. ఉంటారుకూడా. ఎప్పటికీ వారి ఋణం మనం తీర్చుకోలేము. అమ్మగారిలాగే మనము ఉండటానికి ప్రయత్నించాలి. చిన్నవారిని కూడా మీరు అని సంబోధిస్తూ మాట్లాడే మర్యాద, ఆ నెమ్మదితనం, ఆ మంచితనం, ఆ శక్తి ఉండాలని, స్వామివారి మంగళాశాసనములు ఎల్లప్పుడూ ఉండాలని మాత్రమే కోరుకుంటూ...



# మణిహారం బహుమానం

### వేమారెడ్డి శ్యామసుందర రెడ్డి, సుజాత

1963, 64 సంవత్సరములలో శ్రీశ్రీశ్రీ త్రిదండి (పెద్ద జీయరు స్వామి) శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామివారితో కీ. శే. వేమా రెడ్డి శ్రీనివాసులురెడ్డి గారి ద్వారా స్వామివారి తిరువడితో సంబంధం కలిగినది. అప్పటి నుండి మా కుటుంబ సభ్యులు అందరూ స్వామివారి దగ్గర మంత్రోపదేశం తీసుకొని స్వామిని ఆశ్రయించినాము. పెద్ద స్వామివారికి శ్రీ మంగతాయారమ్మగారు కోడలుగా వచ్చి ప్రపంచానికి మణిహారంగా ఆధ్యాత్మిక ఆచార్యులను బహుమతిగా అందించినారు. అటువంటి మాతృమూర్తి పాదపద్మములకు ప్రణామములు తెలియజేసుకుంటూ, ఎప్పుడూ నిగర్విగా నిరాడంబరంగా మన స్వామివారి దగ్గర ఎందరో భక్తులలో తాను ఒక సామాన్య భక్తురాలిగా ఉండేవారు. ఆ మాతృమూర్తి ఎల్లవేళలా చిరు మందహాసంతో అందరిని పలుకరించేవారు. వారి పాదపద్మములకు నమస్కారములు.



# తరతరాల పెన్నిధి

**కోవూరు గోదాదేవి ,వనస్థలిపురం**



అమ్మగారితో నాకు 50 ఏళ్ళ అపూర్వ అనుబంధం. నాడు జీయర్ స్వామి వారు, అనంతరం చిన్నజీయర్ స్వామి వారి కార్యక్రమాల్లో పాల్గొనగా తిరుపతిలో జరిగిన మహాయజ్ఞంలో అమ్మగారితో పరిచయభాగ్యం కలిగింది. ఆ పరిచయం ఇంతితై ఎంతో ఆత్మీయంగా మారింది. అమ్మగారు వనస్థలిపురంలోని మా తిరుమాళిగకు పలుమార్లు వేంచేసినారు. 1984 తరువాయి కాలంలో చిన్నస్వామి వారు వేంచేయగా మా దంపతులం పాద పూజ చేసే భాగ్యం కలిగింది. అమ్మగారి ఆత్మీయత మా కుటుంబంపై బాగా ఉంది. ఆమె ప్రేరణతో అందరం జీయర్ సంప్రదాయంలో ఉన్నాము. ఈ సాంప్రదాయ ఫలితంగా "ప్రపన్నామృతం" పుస్తకం ఒక భాగం ముద్రణలో కైంకర్యం చేసి తరించాము. దాదాపు 40 ఏళ్ళ క్రితం అమ్మగారు ఇష్టంగా పాడిన ఓం నమో నారాయణ అనవే మనసా పాట, ఇతర గీతాలను తరిస్తూ వినగా మా వారు కోవూరు లక్ష్మణ రావు గారు భక్తితో టేప్ రికార్డు చేసారు. ఇప్పటికీ స్మృతిపథంలో అమ్మగారి పాటలు మెదులుతున్నాయి.

❖❖❖❖❖❖

**కోవూరు హనుమంతరావు, సీనియర్ జర్నలిస్ట్**

చిన్న పిల్లల నుంచి పెద్ద వారి దాకా అందరిని చిరునవ్వుతో పలకరించేవారు అమ్మగారు. మా అమ్మగారు శ్రీమతి గోదాదేవి కి అమ్మగారితో ఉండిన చాలా పాత స్నేహం, అనుబంధం వల్ల శ్రీ స్వామివార్ల సంప్రదాయకార్యక్రమంలో పాల్గొనే భాగ్యం లభించింది. 1970 లో జీయర్ స్వామి వారు హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జరిపిన మహా యాగంలో నాకు పాల్గొనే అవకాశం దక్కింది. అనంతరం చిన్నజీయర్ స్వామి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఆ సమయాల్లోనే వీలున్నప్పుడల్లా అమ్మగారు వారి పూర్వ సంప్రదాయ సంగతులు చెప్పేవారు. అమ్మగారి నుంచి అనేకమార్లు అందుకున్న ఫలాలు మాకు ఎప్పటికీ ప్రేరణలు. అతి సున్నితమైన గొంతుకతో అమ్మగారు పాడిన పాటలు మాకు సంప్రదాయ బాటలు. అమ్మగారి శ్రీరూపాన్ని, చల్లని మనస్సుని ఎన్నటికి మరువలేము.

❖❖❖❖❖❖

**కోవూరు లక్ష్మి**

శ్రీమతి గోదాదేవి, కీ.శే. కోవూరు లక్ష్మణ రావు దంపతుల జ్యేష్ట కుమారుడు, సీనియర్ జర్నలిస్ట్ కోవూరు హనుమంత రావు ధర్మపత్నిగా ఆ కుటుంబానికి అమ్మగారితో ఉన్న సాన్నిహిత్యం నాపై కూడా పడింది. ఈ అనుబంధమే రాజమండ్రిలో అమ్మగారి కుటుంబసభ్యుల ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి తీసుకువెళ్ళింది. అమ్మగారు అక్కడ మా పై చూపిన ఆదరణ ఎప్పటికి మరువలేను. గది గది కి పూజ జరుపగా అమ్మగారి కుటుంబసభ్యులు కొబ్బరి కాయలు కొట్టారు. ఒక చోట మా దంపతులు కూడా ఈ వైదిక కార్యక్రమంలో స్వయంగా పాల్గొనేలా అమ్మగారు చొరవతీసుకున్నారు. ఇది ఆమె అమ్మ మనసుకు నిదర్శనం. మా జీవితంలో మరపురాని విషయం. చివరిసారిగా 2020 ఫిబ్రవరి 28 న ఆశ్రమంలో అమ్మగారితో చాలాసేపు మాట్లాడి తరించాము.

❖❖❖❖❖❖

**మననం అనేది ఆచార్య శ్రీ సూక్తులు వినడం వల్లనే సాధ్యపడుతుంది.**





# ఎలా మరువగలము

### ప్రసన్న రాఘవాచార్యులు, వరంగల్

జగదాచార్యులను మన అందరి ఉద్ధరణకు అందించిన మహామనిషి అమ్మగారు. 85సం. వయస్సులో కూడా ఎంతో ఆచార్యనిష్ఠ మూర్తీభవించిన సంప్రదాయపరురాలు. ప్రపంచంలో అందరూ తన ప్రయత్నంతోనే భగవంతుని చేరాలనుకుంటారు. ఇది ప్రస్తుత కలియుగంలో పొందడం హాస్యాస్పదం. శరణాగతియే తరుణోపాయం. ఆ శరణాగతి లోతులు సంప్రదాయ గ్రంధాలలో మాత్రమే లభిస్తాయి.

ఆ గ్రంథాలే లేకుంటే మన పరిస్థితి అగమ్యగోచరమే. ఆ గ్రంథాలు, వాటి రహస్యాలు, సూక్ష్మాలు ఇంత జనబాహుళ్యం పొందాయంటే "అమ్మగారు ఇంత గొప్ప ఆచార్యులను ఇవ్వడమే". లేకుంటే, స్వప్రయత్నంతో సముద్రంలో తెరచాప లేని పడవలా కొట్టుకుపోయేవాళ్ళం. అమ్మగారి ఋణం ఏం చేసినా తీర్చుకోలేము.

కౌసల్యా సుప్రజారామ! అని విశ్వామిత్రుడు కౌసల్యమ్మను ఎలా తలచుకున్నాడో అలా ఇంత గొప్ప

ఆచార్యులను అందించిన అమ్మగారిని తలుచుకోకుండా ఎలా ఉండగలం. స్వామివారి నాన్నగారు ఆచార్య తిరువడి చేరిన తరువాత" ఇంటికి తన పెద్ద కుమారుని అవసరం ఎంతో ఉన్న సమయంలో కూడా తన కుటుంబం కంటే సంప్రదాయం ముఖ్యమని "దాని రక్షణకు తన కుమారుని అందించిన మహా మనీషి అమ్మగారు. తన ముక్కుపచ్చలారని చిన్నారిని, కుమారుని సన్యసించడానికి ఏ తల్లి అంగీకరిస్తుంది?

"మనం ఏమిచ్చి ఆ తల్లి ఋణం తీర్చుకోగలం"? ఎలా మరువగలం మనం ఎలా మరువగలం......

❖❖❖❖❖❖



శ్రీవిద్య

# మా అమ్మమ్మగారిలానే....!

అమ్మమ్మ గారు నాతో సొంత మనిషిలా మా అమ్మమ్మ గారిలానే మాట్లాడే వారు.

కల్మషం లేని మనిషి. ఎప్పుడు నేను శ్రీ స్వామి వారి అమ్మగారిని అని ఏమాత్రం గర్వం చూపించేవారు కాదు. వారి ఇంటికి వెళితే ఒకసారి మాకు స్వయంగ అన్నం ముద్దలు కలిపి పెట్టేవారు. ఎంత రుచిగా ఉండేదో! ఇప్పటికీ మరువ లేము .

స్వామి వారి దగ్గర తదీయారాధనలో మాకు ఎన్నో మంచి సలహాలు ఇచ్చేవారు.

నా కల్యాణానికి విచ్చేసారు. మా పాప బారసాలకు వారే స్వయంగా పాపనుఊయలలో పడుకో పెట్టారు. అంతా ఆవిడ దగ్గర ఉండి చేయించారు. ఏ విషయం అయినా సంకోచం లేకుండా చెప్పేవారు. అందరిని తమ వారనే భావంతో, తారతమ్యం లేకుండా ఎంతో ప్రేమగా పలుకరించేవారు. పాటలుపాడుతున్నపుడేమి, చదువుల్లో అయితే నేమి, ఎన్నో మంచి సలహాలు ఇచ్చేవారు. తప్పులని సవరించేవారు. నాకు MBA చదువుకునేప్పుడు ,చదువుతో పాటు ఆచార్య సేవ కూడా చక్కగా చేసుకోమని మంగళాశాసనం చేసారు. వారితో ఎన్నో క్షేత్రాలకి వెళ్లే భాగ్యం కలిగింది. ఆ మధురమైన క్షణాలు నేనెన్నటికి మరువలేను ........



# అమ్మకు ప్రేమతో...!

'ధీ' శ్రీనివాస్...

తన ప్రాణాన్ని పణంగా పెట్టి, మరో ప్రాణాన్ని ప్రపంచంలోకి తెచ్చే గర్భగుడి 'అమ్మ ఒడి'.
పాఠాలు నేర్పలేని సంస్కారాలని ఉగ్గుపాలలో రంగరించే పసిడి బడి 'అమ్మ ఒడి'.
ప్రతిఫలం కోరని ప్రేమకున్న ఒకే ఒక్క సవ్వడి 'అమ్మ ఒడి'.
ఈ అక్షరాలకు అక్షరాలా అర్హురాలు అమ్మ 'అలర్మేల్ మంగతాయారు!'
ఆ అమ్మ 'సంకల్పం', ఓ కారణ జన్ముడిని ధరిత్రికి పరిచయం చేసింది.
ఆ అమ్మ 'తపన', నిద్రాణమైన ఓ నిజ నారాయణ తేజాన్ని పైకి తెచ్చింది.
ఆ అమ్మ 'ప్రచోదన', ఓ జాతిరత్నాన్ని జగద్గురువు దరికి చేర్చింది.
రూపురేఖల్లో ఆ దేవుణ్ణి, శీలసంపదలో ఆ రాముణ్ణి తలపించే తనయుణ్ణి, ధర్మ నిర్మాణ దీక్షకు ధారపోసిన ఆగర్భ శ్రీమంతురాలు ఆ అమ్మ 'అలర్మేల్ మంగతాయారు!'
ఆమె చేసిన 'త్యాగం' భారతీయ సనాతన ధర్మానికి పట్టిన యోగం!
ఆమె చేసిన 'దానం' ఆధునిక ప్రపంచానికి రామానుజ సందేశాన్ని ధ్వనించిన పూర్ణాయుష ప్రయోగం!
గురువు గారు అడిగారని కల్పతరువులాంటి కొడుకుని రామసేవకు అంకితమిచ్చిన అపర సుమిత్ర...
అనవరతం ఆచార్య భావనలో అలరిన అభినవ శబరి పాత్ర... ఆ అమ్మ 'అలర్మేల్ మంగతాయారమ్మ' ధన్య అనన్య అగణ్య పుణ్య సదా సదా సహృదమాన్య...

ప్రేమతో...





# పరిపూర్ణ ఆచార్య అనుగ్రహ ప్రాప్తి

దామిడి రేణుక
హైదరాబాద్

మన అందరికీ ఆచార్యులను ప్రసాదించిన ఆ మాతృమూర్తితో తొలిపరిచయము కరీంనగర్‌లో స్వామివారి తిరుప్పావై ప్రవచనములో జరిగింది. అక్కడే అమ్మగారిని మొదటిసారిగా చూడడము, మైక్‌లో పాట వినడము జరిగింది. ఆ తరువాత ఎన్నో అనుభవాలు, మరెన్నో జ్ఞాపకాలు అందులో .....



ఒక రోజు అమ్మగారు, దాసురాలు అనుకోకుండా శ్రీరాంనగర్ వెళ్ళాము. ఆరోజు యతులకు తదీయారాధన జరిగింది. శ్రీస్వామివారు అమ్మగారిని అతిథులకు వడ్డించండి అన్నారట. అమ్మగారు ఆ కైంకర్యం చేసుకుని వచ్చి దాసురాలిని కలవగానే ఎంతో సంతోషం వ్యక్తం చేసారు. ఆనాటి అమ్మగారి వికసిత ముఖారవిందము మరువలేము.

కంప్యూటర్ కృష్ణస్వామి తండ్రిగారు పరమపదోత్సవానికి దాసురాలు రాలేకపోయినది. రెండు రోజుల తరువాత అమ్మగారిని కలిసాను. ఏంటి ఇయల్‌గోష్ఠికి రాలేదు అని అడిగారు అమ్మగారు. నాకు అవకాశం లభించలేదు అమ్మగారు అని అన్నాను. ఎంత బాగా జరిపించారో శ్రీస్వామివారు తెలుసా అని అన్నారు. ఆనాటి సంభాషణలో అమ్మగారు, తమకు పెరుమాళ్ళ పిలుపు వచ్చినప్పుడు కూడా శ్రీస్వామివారే దగ్గరుండి పరమపదోత్సవం జరిపించాలని, ఆ సమయానికి శ్రీస్వామివారు చాతుర్మాస్య దీక్షలో బయట దేశంలో ఉండకుంటే చాలు అని అన్నారు. ఇలా ఎన్నోసార్లు మా ఆచార్యులనే వేడుకుంటాను అని చెప్పారు. ఆమె ప్రార్థనను విని వారి ఆచార్యులు, మన ఆచార్యులతో చేయించినందుకు అనేక, అనేక దాసోహములు సమర్పిస్తూ ....





# స్మితవదనం

కె. గీతాంజలి, హైదరాబాద్

నిండైన రూపం, మోముపై వైష్ణవ సాంప్రదాయ చిహ్నమైన ఊర్ధ్వపుండ్రం, చీరకట్టు ముఖంపై చెరగని చిరు దరహాసం చూడగానే అప్రయత్నంగా చేతులు జోడించి నమస్కరించాలని అనిపించే రూపం అమ్మగారిది. ఇరవై సంవత్సరాల నుంచి అమ్మగారిని చూస్తున్నాం అదే రూపం మార్పులేదు. జైశ్రీమన్నారాయణ అని పలకరిస్తే చిరునవ్వుతో బదులు ఇచ్చేవారు. మా ఇద్దరు అబ్బాయిల పెళ్ళిళ్ళ తర్వాత ఇద్దరిని అమ్మగారి మంగళాశాసనాల కోసం తీసుకెళ్తే వారు సంతోషంగా పండ్లు ఇచ్చి ఎక్కడ ఉంటావు, ఏమి చేస్తావు అని మాట్లాడి మంగళాశాసనం చేశారు. అమ్మ, నాన్నలు లేని లోటు అమ్మగారితో తీరిపోయింది. జగత్ గురువును ప్రపంచానికి అందించిన అమ్మ గారికి ఏమి ఇచ్చి ఋణం తీర్చుకోగలం, సాష్టాంగ ప్రణామం తప్ప. ఆచార్య తిరువడిగళ్ చేరిన వారు అక్కడి నుండే మనను ఆశీర్వదిస్తారు.

# మరువలేని ఆదరణ



రమ్య, కరీంనగర్

మొట్టమొదటిసారి 2009 జీయర్ శతాబ్దిలో అమ్మగారిని సేవించుకున్నాను. అప్పటి నుండి ఎప్పుడూ జీవా ఆశ్రమం వెళ్ళిన అమ్మ గారిని సేవించుకునే వాళ్ళము. ఎప్పుడూ వారి దగ్గరికి వెళ్ళిన చాలా ప్రేమగా, అప్యాయంగా, ఎప్పుడు వచ్చారు, ఎలా వచ్చారు, స్వామివారిని సేవించుకున్నారా, ప్రసాదం తీసుకున్నారా అని అడిగేవారు.

మొన్న ఫిబ్రవరి మాసంలో మా గృహంలో జరుగబోయే వివాహ శుభకార్యం గూర్చి శ్రీస్వామి వారి మంగళాశాసనాలు తీసుకోవటానికి వెళ్ళాము. అప్పుడే అమ్మ గారిని సేవించుకోవటానికి వెళ్ళాము. వారికి ఇంట్లో జరుగబోయే శుభకార్యం గూర్చి విన్నవించాము. దానికి వారు చాలా సంతోషించి ప్రేమతో ఇంటికి వచ్చిన ఆడపడుచుని ఎలా అయితే పసుపుకుంకాలు గాజులు ఇచ్చి ఆనందపరుస్తారో అలా ఇచ్చి, ఆ రోజు రథసప్తమి స్వయంగా వారే పెరుమాళ్ళ ఆరగింపు చేసిన ప్రసాదం పెట్టారు. శ్రీస్వామివారి షష్ట్యబ్ది మహోత్సవంలో అమ్మగారికి శ్రీస్వామివారు ఇచ్చిన ఆదర్శదినచర్య పుస్తకాన్ని ఇచ్చి ప్రతిరోజు శ్రీవిష్ణుసహస్రనామ పారాయణ చేసుకుంటూ చేసే ప్రతి పని భగవంతుడి సేవగా చేస్తూ వీరి దినచర్యను ఆదర్శంగా ఉంచుకోండి. అలాగే రామానుజ వైభవాన్ని తెలుసుకొని వారి మార్గంలో జీవితాన్ని సాగించండి అని మంగళాశాసనం చేసారు. వారు ఇచ్చిన ఆ ఆదర్శదినచర్య పుస్తకాన్ని చూసినప్పుడల్లా ఏదో తెలియని ఆనందం, సంతోషం కలుగుతాయి. అమ్మగారి సౌలభ్యగుణంవల్లనే దాసురాలికి గొప్ప అనుభవం ఏర్పడింది.

పద్మాన్ని చూస్తే ఎలా అయితే ఆనందం, ప్రశాంతత కలుగుతాయో, ఆచార్యులను మనకందించిన అమ్మగారిని సేవించుకుంటే అలానే అనిపించేది. అలాంటి పవిత్రమైన గొప్పవారైన అమ్మగారు ఆచార్యతిరువడిని చేరి మనమధ్యలో లేకపోవడం చాలా బాధను కల్గిస్తుంది. వారు పరమపదం నుండే మనందరికి మంగళాశాసనాలు అనుగ్రహించాలి అని ప్రార్థన చేస్తూ...

మంచుకన్నా చల్లనైనది, మల్లెకన్న తెల్లనైనది అమ్మ ప్రేమ.



# విలక్షణ తేజోమూర్తి



ఉషశ్రీ రామానుజదాసి
వి.టి. కన్వీనర్ శ్రీకాకుళం

కొందరు వ్యక్తులను చూడగానే పూజ్యభావం కలిగి తెలియకుండా దాసోహము చేయాలన్పిస్తుంది. అమ్మగారి మూర్తిమత్వం, ముఖవర్చస్సు అట్లాంటిది.

ఆచార్యులను సేవించుకోవడానికి వచ్చిన ప్రతిసారీ దాసురాలు అమ్మగారికి జై శ్రీమన్నారాయణ అని చెప్పి దాసోహాలు చేసి మంగళాశాసనాలు తీసుకునేవాళ్ళం. అలా ఒకసారి దాసురాలు ఇద్దరు పిల్లలు (ఇంటరు, డిగ్రీ చదువుతున్న) ని తీసుకుని శ్రీరామనగర్ ఆశ్రమంలో అమ్మగారి వద్దకు మంగళాశాసనాలు కోసం తీసుకువెళ్ళాం అమ్మగారు అప్పుడు పనిలో ఉన్నా లోపలికి రమ్మని పిలిచారు. పిల్లలు, దాసురాలు దాసోహం చేయగా ఆచార్య అనుగ్రహం ఎల్లప్పుడూ మీకు ఉంటుంది. చక్కని సమాజసేవ చేయండి అని ఆశీర్వదించి దాసురాలి వైపు ఇట్లాంటి పిల్లలే గదా రేపటి మన సంప్రదాయసేవను కొనసాగింపజేసి తరువాత తరాలకు అందజేస్తారు. చక్కగా చేయండి అని చాలా ప్రేమతో భుజం మీద చేతులు వేసి మంగళాశాసనం చేశారు. సాధారణంగా మాములు వ్యక్తులైతే చక్కగా చదువుకోండి ఆరోగ్యంగా ఉండండి అంటారు. అమ్మగారు ఆచార్య అనుగ్రహంలో సంప్రదాయంలో ఉంటూ చక్కని సమాజసేవ చేయండి అంటారు. ఎప్పుడు చూసినా ఆ ఆశీర్వచనంతో ఉత్తమమైనది. అన్నింటినీ అందించేది. చక్కని సమాజసేవ చేయడమంటే మంచి విద్యాబుద్ధులు, ఆయురారోగ్యాలు ఉంటేనే కదా చేస్తారు. వారి ఆచార్యుల ఆశ్రయంలో అందరూ ఒకభాగం కావాలని అందరూ మంచి సేవలందించి చల్లగా ఉండాలనే ఎప్పుడు చూసినా అమ్మగారిలో అదే ప్రస్ఫుటంగా కన్పించేది. దాసురాలి పిల్లల విషయంలో మంగళాశాసనం చేసిన మధురస్మృతి తలచిన ప్రతిసారి ఒక ధైర్యం, ఆనందం, మంచి స్ఫూర్తి కలుగుతూ ఉంటుంది.

ఆ రోజు నరకచతుర్దశి, స్వామివారి తిరునక్షత్రం అని ముందురోజే వచ్చి ఆలయంలో అభిషేక కార్యక్రమం అయ్యాక బయటకు వస్తే అక్కడ అమ్మగారి గదిముందు చాలా పెద్ద క్యూ సుమారు 7,8 వందల పై చిలుకే భక్తులు ఏమిటి అంటే శేషతైలం అమ్మగారు భక్తుల శిరసుపై ఉంచుతున్నారు. అప్పటికే



వేద విద్యార్థులకు చాలా మంది భక్తులకు ఇవ్వడం జరిగింది. అక్కడ ఉన్న మనస్వాములు అమ్మగారు అలసిపోతారని ఆపమని ఎంత వారించినా వినలేదు. నేను తీసుకోనా వద్దా? అమ్మగారికి శ్రమ అవుతుందేమో అని తటాపటాయిస్తూ క్యూ చివర్లో నిల్చున్నాను. మొట్టమొదట వచ్చినవారి దగ్గర్నుండీ చిట్టచివర దాసురాలి వరకు కూడా దైవనామ స్మరణచేస్తూ అందరి శిరసు పైనా శేషతైలం అద్దడం, చివరన దాసురాలు దాసోహం చేస్తే ప్రేమగా చూసిన చూపు ఇప్పటికీ మరచిపోలేని అనుభూతి వారి దయ అమోఘం.

చెట్లలో ఆకులు, పూవులు, పండ్లు బయటికి కన్పించినా వాటన్నింటికీ కారణమైన బీజంలోనే సూక్ష్మదశలో పైవన్నీ కన్పించకుండా ఉన్నట్లే ఎందరు ఆచార్యులున్నా జ్ఞానం, అనుష్ఠానం, కల్గినటువంటి జగదాచార్యులైన మన స్వామి వారిలో వచ్చిన ఉదాత్త గుణ సమూహం అంతా అమ్మగారి నుంచి, అమ్మగారు చిన్నప్పట్నుంచీ నేర్పిన సంస్కారం నుండి వచ్చినవి కదా అని అన్పించకమానదు దాసురాలికి.

❖❖❖❖❖❖

# ఆనందానికి నిర్వచనం

శ్రీమతి అనురాధ

ప్రతి మనిషి ఆనందానికి ఒక నిర్వచనం చెప్పుకుంటూ ఉంటాడు. నాకున్న నిర్వచనం నవ్వుతూ కోరినవి తిని ఆనందముతో నిద్ర పోవడం. ఇలా బ్రతుకుతూ దేవుడు అవసరం లేదు అని బ్రతికే రోజులు అవి. నా చిన్నప్పుడు కోఠిలో ఉండేవాళ్ళం అప్పుడు అమ్మగారు అక్కడ ఉండేవారు. మా ఇంటికి తరచు వస్తు ఉండేవాళ్ళు. నేను చాల చిన్నపిల్లని అంతగా గుర్తులేదు.

కొంతకాలం గడిచిన తరువాత ఆచార్య కృప వల్ల అమ్మగారి దగ్గర, సుదీర్ఘకాలం సేవ చేసే భాగ్యాన్ని పొందాను. అమ్మ గారు చిన్నపిల్లలతో, పెద్దవారితో ఎలా ఉండాలో అలా ఉండేవారు. ఒక క్రమశిక్షణని, ప్రతి పనిలో అందరికి నేర్పించారు. ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా విశ్వాసము కోల్పోరాదు అని చెప్పేవారు. ఆచార్యకృప అమ్మ దీవెన నా జీవితాన్ని మార్చింది. నా జీవితములో ఉదయం లేచిన మొదలు రాత్రి పడుకునే వరకు ప్రతి పనిలో అమ్మగారు గుర్తుకువస్తూనే ఉంటారు. సుదీర్ఘకాలంగా అందరము ఆచార్యుని సేవాకార్యక్రమంలో పాల్గొంటూ ఎంతో ఆనందాన్ని పొందడానికి, కారణం ఆ తల్లి గర్భమే కదా దానికి ప్రతిరోజు దాసోహాలు సమర్పించుకుంటు అమ్మ గారి ఆచార్యులైన పెద్దజీయరు స్వామి వారి దగ్గర ప్రతిరోజు ఆచార్యుని "సర్వకాల సర్వ అవస్థల యందు ఒక రక్షాకవచంగా ఉండి కాపాడమని ప్రార్థన చేద్దాము.



# ఆర్తి తీర్చిన అర్తమూరి సంబంధం

**ఎ. మహాలక్ష్మీ, అర్తమూరు / రాజమహేంద్రి**



నా పూర్వజన్మ సుకృతం ఏమో నా అనుబంధం అమ్మతో నా చిన్న తనములోనే మొదలు అయింది. అమ్మ అత్త వారి ఇల్లు నా పుట్టిన ఇల్లు అర్తమూరు కావడం వలన, నా కన్నతల్లి (సత్యవతి)కి అనారోగ్యం చేయడం, మేము ఆశలు వదలుకున్న వేళ చిన్న జీయర్ స్వామి పూర్వాశ్రమంలో తండ్రిగారు శ్రీమాన్ వెంకటాచార్యులు గారు వైద్యం అందించి మా తల్లి గారిని మృత్యుగండం నుండి కాపాడినారు. అప్పుడి నుంచి ఆ కుటుంబంతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది. కాలక్రమంలో అమ్మగారి కుటుంబం రాజమహేంద్రవరం రావడంతో కొంతకాలం దూరం పెరిగినా తరువాత నా అదృష్టం నా పెళ్ళి రాజమహేంద్రవరవాసితో జరగటం నేను మళ్ళీ ఆ కుటుంబానికి దగ్గర అయ్యాను.

అమ్మ నాకు దైవం ఇచ్చిన తల్లితో సమానము. ఆమె మాతృహృదయం చూపిన ప్రేమ, అనుబంధం, మరవలేనిది. నా జీవితంలోని ప్రతి కష్టంలోనూ ఆమె నాకు మార్గదర్శిగా ఉన్నారు. నా బిడ్డల పెంపకంలో అనేక సూచనలు ఇచ్చి మంచి మార్గం చూపేవారు. మన సంస్కృతీ సంప్రదాయాలు, విలువలు, ఆ తరం నుండి మా తరం వారికి నేర్పిన ఘనత ఆమెకే చెందుతుంది. పూజా విధానము, నియమనిష్ఠలు అమ్మ వద్దనే నేర్చుకున్నాము.

మంచి మాటలు మాట్లాడటం అందరిని మంచి మనస్సుతో ఆశీర్వదించటం ఆమె ఔన్నత్యానికి నిదర్శనం.

ఎప్పుడూ ప్రశాంతంగా నిస్వార్థంగా నిరాడంబరంగా ఉండటం అమ్మ ప్రత్యేకత.

అమ్మ మా ఇంట ఉన్న రోజులు నా జీవితంలో మరవలేని రోజులు. ప్రతి నిమిషం అమ్మ భక్తి భావనతో దైవ చింతనలో ఉండడం వలన, ఆమె ఉన్న ఇల్లు పోజిటివ్ శక్తితో నిండిపోయేది, లోలోపాల ఎన్ని బాధలు ఉన్న అమ్మ మాటలకు బాధలు పోయి మనస్సు తేలికగా అవుతుంది.

స్వామి వారితో కలిసి అమ్మ నేను చేసిన నేపాల్, బదరీ కాశీ, ముక్తినాథ్‌యాత్ర అనిర్వచనీయమైనవి. యాత్ర అంతయు భక్తితో నిండిపోయినది. దైవదర్శనములు ఎంతో అద్భుతంగా జరిగింది.

కరోనాకి భయపడి నన్ను రాజమహేంద్రవరం నుండి హైదరాబాద్‌కి మా అమ్మాయి తీసుకొనివచ్చారు. తర్వాత అమ్మగారు అనారోగ్యంతో ఉన్నారని తెలిసింది. వెంటనే అమ్మని చూడడానికి 6.09.2020 వెళ్ళాను. మేము వేళ్ళేసరికి అమ్మ ప్రశాంతంగా నిద్రపోతున్నారు. మేలుకొనగానే వారి కుమార్తె అమ్మా! మహాలక్ష్మి వచ్చింది అని చెప్పగానే కళ్ళు తెరచి చూసి నా చేతిని పట్టుకున్నారు. నెమ్మదిగా మరల నిద్రలోకి జారుకున్నారు. కొంత సమయం తర్వాత నేను వెళ్ళుతున్నాను అమ్మ అని చెప్పితే చేయి పట్టుకొని కూర్చోమన్నారు. నెమ్మదిగా మరల నిద్రలోకి జారుకున్నారు. అదే అమ్మను కలసిన చివరిసారి. ఆమెతో అనుబంధం ఆత్మ ఉన్నంతవరకూ....

❖❖❖❖❖❖



# పురాసుకృతం - అమ్మతో అనుబంధం

వద్దిరాజు సువర్ణకుమారి
హైదరాబాద్



దాసురాలి పూర్వ జన్మసుకృతం నాకు అమ్మగారితో అత్యంత వాత్సల్య పూరితమైన అనుబంధం ఏర్పడింది.

1976 సం॥ నుండి నేను మా అమ్మగారు కోవూరు గోదాదేవితో జెట్ కార్యక్రమంలో పాల్గొనే దాన్ని హైదరాబాదులో.

1979 సం॥ తిరుపతిలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయరుస్వామి వారిచే 108వ యజ్ఞం జరుగుతున్న సమయంలో నా స్నేహితులు సీత, శోభ అపర్ణలతో పాటు 200 మంది వాలంటీర్స్‌గా వెళ్ళాము.

ఆ యజ్ఞంలో మన చిన్న జీయరుస్వామి ( అప్పటికింకా పూర్వాశ్రమంలో ఉన్నారు)అమ్మగారిని చేతులను పట్టుకుని వెళుతున్నారు. అలా అమ్మ చేయి నేను పట్టుకుని వెళితే ఎంత బాగుంటుందో అనుకున్న తడవే అమ్మ పరిచయం కావడం అమ్మ చేతిని పట్టుకుని తీసుకుని వెళ్ళే అవకాశం లభించింది. అదే సమయంలో శ్రీచిన్నజీయరుస్వామి వారి ( తమ్ముడు మంగయ్యస్వామి, చెల్లెండ్లు తాయారు గోదా పరిచయం అయ్యారు. ఆ పరిచయం నేటికీ ఎంతో ఆత్మీయంగా కొనసాగుతుంధి.

తిరుపతిలో అమ్మగారితో ఆ పరిచయం ఒక దివ్యానుభూతి. అమ్మ స్నేహశీలి. నన్ను ఎంతో వాత్సల్యంతో చూసేవారు. ఎన్నో ధార్మిక విషయాలు నాకు చెప్పుండేవారు. తిరుమల కొండ శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యదర్శనం చేసుకున్నాను అమ్మతో పాటు ఎన్నోసార్లు. అదియిప్పటికి నాకు కళ్ళకు కనబడుతుంది.

హైదరాబాద్‌కు వచ్చాక నేను 1980లో శ్రీ చిన్న జీయరు స్వామివారు సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన కొత్తలో దాసురాలికి మంత్రోపదేశం అనుగ్రహించారు.

వనస్థలి పురంలో మా ఇంటికి అమ్మగారు వేంచేసి 3 రోజుల పాటు మా కుటుంబసభ్యులతో ఉండి, మధురమైన భక్తి గీతాలను ఆలపిస్తూ ఉంటే, మా నాన్నగారు లేటు శ్రీలక్ష్మణరావు పాటలను రికార్డు చేసేవారు.

మా పెరటితోటలో పూల చెట్లు, పండ్లచెట్ల మధ్య మేము కబుర్లు చెప్పుకునేవాళ్ళం.

తర్వాత, నేను అమ్మ ఎన్నో ఉత్తరాలు వ్రాసుకునే వాళ్ళం. హైదరాబాద్‌లో జరిగే జెట్ కార్యక్రమాల గురించి, అమ్మకు ఉత్తరం వ్రాస్తే ఎంత బాగా కళ్ళకు కట్టినట్లుగా, వ్రాసావు అని ఎంతో ఆనందించేవారు.

మా ఇంట్లో అన్ని శుభకార్యములు జరిగినపుడు అమ్మ మాకు తోడుగా ఉండి అనేక మంగళాశాసనములు చేసేవారు.

ఇలా అమ్మ గారు లేని లోటు ఎంతో బాధాకరం. వారు మా హృదయాలలో ఎప్పుడు ఉంటారు. మంగళాశాసనాలు చేస్తూ ఉంటారు.

**ప్రేమను పంచడమే అమ్మకు తెలుసు ఏదీ ఆశించదు!**





అమ్మ దీవెనలతో ఆరంభమయ్యే తిరునక్షత్ర హేల

# వాత్సల్యాంబుధి

నల్లాన్ చక్రవర్తుల విష్ణుప్రియా
అయ్యంగార్



"మౌనద్రుహో ముఖరయంతి గుణాస్త్వదీయాః" అంటారు వేదాంతదేశికులు గోదాస్తుతిలో. అమ్మను గురించి మాట్లాడాలి అమ్మ వైభవం చెప్పమంటే మూగవాడు కూడా అమ్మను గురించి చెప్పడం ఆరంభిస్తాడు. అంటే అమ్మ అనే పదం యొక్క మహిమ వర్ణనాతీతం.

అలాంటిది సాధారణంగా, సౌమ్యంగా, ఉల్లాసంగా, ప్రేమగా, ఆర్తిగా, ఆర్ద్రంగా, పిలిచే పిలుపు ఏదైనా ఉందంటే అది "అమ్మ" అనే పదమే.

మామూలుగా మనిషికి రెండు జన్మలు ఉంటాయి. ఒకటి పుట్టుకతో వచ్చిన జన్మ. రెండవది పంచసంస్కారాలు పొందిన జన్మ.

ఏది గొప్పది అంటే "ఉత్తరోత్తరం బలీయసి" అనే న్యాయం ప్రకారం పంచసంస్కారాలు పొంది ఆచార్యులు చెప్పిన రీతిలో నడుచుకోవడం ఉత్తమ జన్మ.

అలాంటి పంచసంస్కారాలను కృప చేసే ఆచార్యులనే మనకు అందించిన మా అమ్మ అలిమేలు మంగమ్మ. ఉత్తమోత్తమమై ఈ లోకం లో విరాజిల్లుతూ మనందరిని అనుగ్రహించిన తన వాత్సల్యాన్ని మరువలేము.... మరువబోము.

ఎందుకంటే, అనుభవించి ఆచరణలో చూపటం చాలా కష్టం.

*"లోకోత్తరం హి కిమపి ఉన్మీలయన్తో జగతి !*
*రాజ్యేప భోగేభ్యోపి బీభత్సంతే మహానుభావః !!"*

లోకోత్తరమైన పనిని ప్రకాశింపచేస్తూ మహానుభావులు రాజ్యభోగాలను కూడ తృణప్రాయంగా త్యజిస్తారు అని "అనర్ఘరాఘవం" అనే గ్రంథంలో "మురారి" అనే కవి యొక్క సూక్తి అలమేలుమంగమ్మ అయిన మన అమ్మ



విషయమే దానికి నిదర్శనం. అమ్మ హాయిగా ఇంట్లో ఉండి సమయానికి గృహ కార్యములను నిర్వర్తిస్తూ అందరిలానే ఉండొచ్చు. కానీ మన ఆచార్యులు ఏ రకంగా అయితే శ్రమిస్తున్నారో, ఈ లోకం కోసం అదేవిధంగా పెద్ద వయస్సులో కూడ "అమ్మ" ఆశ్రమంలో శంషాబాద్‌లో ఉంటూ తానూ స్వామి కి పరోక్షంగా సహకరిస్తూ ఉత్సాహంగా కనపడుతూ తన దగ్గరకు వచ్చిన వారికి వాత్సల్యాన్ని వెదజల్లుతూ ఉంది. ఏ తల్లి తన బిడ్డ కష్టాన్ని చూడాలనుకుంటుంది ?

*"వహంతి శోక శంకుం చ కుర్వంతి చ యథోచితమ్!*

*కోప్యేష మహతాం హంత గాంభీర్యాను గుణో గుణః !!"*

అని బాలరామాయణంలో రాజశేఖర కవి అన్న మాట మన అమ్మ విషయంలో యదార్థమైంది. తాను శోకాన్ని అనుభవిస్తూ కూడా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ గాంభీర్యాన్ని కలిగి దరహాసంతో ప్రవర్తించే తీరు ప్రశంసనీయం కదూ!!

*"యస్మిన్ జీవతి జీవంతి బహవః స హి జీవతి"*

అంటారు పెద్దలు.

తమ ఆదర్శవంతమైన జీవనంతో అనేక మంది జీవితాలను సంతోషింప చేసినవారే నిజంగా జీవించ తగిన వారట ! అలాగే అమ్మ మన మధ్య ఎప్పుడు అందరి మానసాలలో స్థిరంగా నిలచిన ధన్యజీవి . మనందరికి ధర్మస్వరూపులైన ఆచార్యులను అందించిన మాతృమూర్తి అలమేలు మంగమ్మ గారు .

*"వరమేకో గుణీపుత్రో న చ మూర్ఖ శతాన్యపి !*

*ఏకశ్చంద్ర స్తమోహన్తి న చ తారా గణైరపి !!"*

వంద మంది సంతానం కంటే శ్రేష్ఠుడైన ఒక్క కుమారుడు మేలట!

ఎన్ని నక్షత్రాలున్నా ఒక్క చంద్రుడు మాత్రమే అంధకారాన్ని దూరం చేయగలడు. అలాంటి చంద్రుడిని 'శ్రీరామ చంద్ర హృదయార్పిత' మానసులైన ఆచార్యులు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామిని లోకానికి అందించిన సార్థక ధన్యజీవి, "వాత్సల్యాంబుధి" అలమేలు మంగమ్మ మాయమ్మకు శతధా సహస్రధా కృతజ్ఞతాపూర్వక పాదాభివందనములు సమర్పించుకుంటూ

*"ధన్యోస్మి కృత కృత్యోస్మి తవపాదాబ్జ దర్శనాత్ !*

*సంసారభయ భీతోఽస్మి పాహిమాం సర్వశర్మదే !!"*

మీ పాదపరాగం ..

❖❖❖❖❖❖

**శోకాన్ని దాచుకొని ఆనందాన్ని మాత్రమే పంచగలదు అమ్మ**

# అమ్మ తత్త్వం అమృతత్త్వం



డా. శ్రీమతి గుదిమెళ్ళ మంజులానరసింహన్
తత్త్వశాస్త్ర విద్యార్థిని

చెరగని చిరునవ్వు, దేదీప్యమాన ముఖవర్చస్సు. ఆచార్య మేఘమా కరుణ వాన కురుయుమా అంటూ ఆలపిస్తూ.... జై శ్రీమన్నారాయణ అంటూ చేసే ప్రతి పనిని భగవదర్పణ గావించే మమతామయ రూపం... నడిచే అమ్మ మరెవరో కాదు.... వారే ఆకులమన్నాడ చిలకమర్తి అలివేలుమంగతాయారమ్మ. మనందరికీ కూడా అమ్మ.

శ్రీ వైష్ణవ సంప్రదాయాన్ని అపర రామానుజులవలే విశ్వవ్యాప్తం చేస్తున్న ఉదయార్కతేజులు... శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారిని తొలి మగసంతానంగా కన్నతల్లి... ఆచార్యులైన పెద్దజీయర్‌స్వామివారి ఆశయసాధనకోసం, శ్రీవైష్ణవ సంప్రదాయ సముద్ధరణ కోసం, బిడ్డలో ఆత్మ స్థైర్యాన్ని నింపి... ధర్మసంస్థాపన కోసం పరితపించిన భారతీమ తల్లి. సదా నారాయణుని సేవలో సంలీనయై జీవితాన్ని తరింప చేసుకున్న పరమసాధ్వి అమ్మ. శ్రియఃపతి శ్రీచరణసన్నిధియే జీవన తరుణోపాయమని నమ్మి తత్ సన్నిధినే పెన్నిధిగా తలచిన నిత్యసూరి మా అమ్మ. ఆచార్యులవారి అనుగ్రహంతో తత్త్వకళాశాలలో చేరిన రోజులలో బదరికాశ్రమం పర్యటనలో అమ్మతో కలిసి ఉండే అవకాశం నాకు, ఆగమాచార్యులైన మధుసూదనాచార్యులవారి తల్లిగారైన శ్రీమతి సీతాపిరాట్టి గారికి లభించింది.

అక్కడ ఏ సేవకు వెళ్ళిన ముగ్గురం కలిసి వెళ్తుండేవాళ్ళం. అది ఒక మరువలేని మధురానుభూతి .

*గుణవత్ వస్తు సంసర్గాత్ యాతి స్వల్పోపి గౌరవం ।*
*పుష్పమాలానుషంగేణ సూత్రం శిరసి ధార్యతే ॥*

తొణకని నిండుకుండ అయిన అమ్మ వాత్సల్యామృత సాంగత్యం దాసురాలి జీవన గమనాన్ని పరిపుష్టం చేసినది. తిరిగి చాలా కాలం తర్వాత శ్రీపెరుంబూదూర్ లో భగవద్రామానుజుల వారి సన్నిధానంలో అమ్మని సేవించటం అంతులేని ఆనందం. అవధులు లేని అదృష్టం.

చిన్న మంజూ........ అని ఎంతో వాత్సల్యంతో పిలిచే ఆ పిలుపు లోని ఆర్ద్రత అనుభవించి తీరాల్సిందే.



నిరాడంబరతకు, సహనశీలతకు, దేశభక్తికి, శ్రీమన్నారాయణుని యందు అనురక్తికి ఆచార్యుల యందు మొక్కవోని విశ్వాసానికి నిలువుటద్దమై మమతల కోవెలయై, పరోక్షంగా ఎందరో అన్నార్తుల ఆకలి బాధలను తీర్చే నారాయణియై, ఆళ్వార్లు అనుగ్రహించిన దివ్య ప్రబంధాన్ని సభక్తికంగా అనునిత్యం పెరుమాళ్ళకు విన్నవించే నిత్య సూరి అమ్మ.

**అమ్మ సంభాషణలు ఆత్మీయాలు.**
**అమ్మ ఆచరణలు సర్వజన మార్గదర్శకాలు.**
**అమ్మ ఆలోచనలు విష్ణు ప్రియాలు.**
**అమ్మ మాటలు జ్ఞాన సుధా రస భరితాలు.**
**అమ్మ చేతలు శాశ్వత ఆనంద చరితాలు.**
**అమ్మతో నాకు గల ఆ కొద్దిపాటి స్నేహ భరిత పయనం,**
**నా హృదయానికి మహోదయం.**
**జీవన పరిపుష్టి.**
**అవధులు లేని అనురాగ ఝరి అమ్మ.**
**ఆ మాతృ మూర్తికి అక్షరనివాళి అందిస్తూ...**

ఆచార్య శ్రీచరణ రేణువు.

# అమ్మ ప్రేమ

**పీతాంబరం రఘునాధాచార్యస్వామి (తత్త్వశాస్త్రం)**



జగద్గురువులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామివారిని మనందరికీ అనుగ్రహించిన శ్రీ అలివేలు మంగ తాయారుగారు పరమపదంలో పెరుమాళ్ళకి మంగళాశాసనాలు చేస్తూ ఉండాలని ప్రార్థిస్తూ... అలివేలుమంగ తాయారుగారు, ఈ పేరు మాకు తెలియదు. మా అందరికీ తెలిసిన పేరు అమ్మగారు. 25 సంవత్సరాల క్రిందట జగ్గయ్యపేట, కాకతీయ సిమెంట్స్ ప్రాంగణంలో మన చిన్నజీయరు స్వామివారి సంకల్పం నుండి జాలువారిన భారతీయ తత్త్వ శాస్త్ర కళాశాలలో మేమందరం చదువుకుంటున్న రోజులలో



**దివ్యమైన తేజస్సుతో**
**చల్లని చూపులతో**
**స్వచ్ఛమైన మనస్సుతో**
**తియ్యని మాటలతో**

కష్టాన్నికూడా తొలగించే చక్కని చిరునవ్వుతో ప్రేమపూర్వకంగా పలకరించే అమృత రూపాన్ని సేవించుకున్నాం ఆమే మన అమ్మగారు.

ఎవ్వరినైనా ఎంతమంది భక్తులు వచ్చినా అందరినీ ఆప్యాయంగా పలకరించే అమ్మగారంటే అందరికీ ఇష్టం.

ఆనాటి కోదండ రాముడే మన త్రిదండ రాముడైతే

**ఆనాటి కౌసల్య తల్లే మన అమ్మగారు.**

**అమ్మగారు మా గురించి అందమైన మాట ఒకటి చెప్పారు. మన స్వామివారు పెంచుతున్న అందమైన పూలతోట భారతీయతత్త్వశాస్త్ర కళాశాల. ఈ పూలతోటలో వికసించే పుష్పాలు మీరందరూ చక్కని నడవడిక అనే పరిమళంతో మీరు అందరినీ ఆకర్షించి ఆచార్యులు చూపిన మార్గంలో మీరు నడుస్తూ, అందరినీ నడిపించాలి** అని అమ్మ చెప్పేవారు.

ఎన్నో వేల తల్లిదండ్రుల ప్రేమ కలిపితే మన ఆచార్యుల ప్రేమ అవుతుంది. అటువంటి ఆచార్యుల్ని ఈ ప్రపంచానికి అందించిన అమ్మప్రేమకు ఈ జగత్తంతా నిత్యం నీరాజనాలు సమర్పించాలి. ప్రతి ఒక్కరం మన అమ్మగారిని ప్రేమతో స్మరించుకోవాలి. ప్రతి ఇంటికి ఒక మంచి భక్తుడు తయారుకావాలి. పెరుమాళ్ళకి మంగళాశాసనం చెయ్యాలని, అంతకన్నా ముఖ్యంగా మన ఆచార్యులని రక్షించుకోవాలి, మనం కాపాడుకోవాలి. మన స్వామివారికి పల్లాండు పల్లాండు పాడుతూ ఉండాలి.

మన స్వామివారు మన గురించి పదిమందికి గొప్పగా చెప్పే స్థాయికి మనం ఎదగాలి అనే అమ్మగారు చెబుతూ ఉండేవారు. ఢిల్లీకి రాజే అయినా తల్లికి బిడ్డే అంటారు కదా పెద్దలు.

జగత్తుకు ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన మన చిన్నజీయరుస్వామివారు మన అమ్మగారికి పసిపిల్లవాడే. మన స్వామివారు అధ్యాత్మిక , సామాజిక కార్యక్రమాలతో ఎంతో బిజీగా ఉన్నా స్వామివారికి మంగళాశాసనం చేస్తేనే అమ్మగారికి ఆనందం.

మన జీవితానికి రెండే రెండు లక్ష్యాలు

1. **మన ఆచార్యులు చూపించిన మార్గంలో నడవడం.**
2. **పెరుమాళ్ళ కైంకర్యం.**

మన అమ్మగారు మన స్వామివారికి మంగళాశాసనం చేసినట్లుగా వైకుంఠంలో పెరుమాళ్ళకి, అమ్మవార్లకి మన అమ్మగారు మంగళాశాసనం చేస్తూ ఉండాలని, తియ్యని పాటలు వినిపించాలని మన ఆచార్యులైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామివారి ద్వారా అమ్మగారు మనల్ని అనుగ్రహిస్తూ ఉండాలని పెరుమాళ్ళని ప్రార్థిస్తూ.....

❖❖❖❖❖❖

**తండ్రి కన్న, గురువు కన్న ఉన్నత స్థానం తల్లిదే!**



# రసవేత్త

**ఉషశ్రీ**

**తత్త్వశాస్త్రవిద్యార్థిని, జీవా**



అమ్మగారితో అనుభవాలు అంటే మాటలకి అందనివి. మనస్సుకి మరపురానివి. 1992లో శ్రీ స్వామివారు సన్నిధానానికి వచ్చాను. ఒకటి, రెండు సంవత్సరాలు ఏమైనా కార్యాక్రమాలకి అమ్మగారు వస్తే, శ్రీస్వామివారి తల్లిగారు వచ్చారని దూరం నుంచి నమస్కరించుకునేదాన్ని.

ఎప్పుడైనా ఏమైనా కార్యక్రమాలకోసం విజయవాడ నుండో, రాజమహేంద్రి నుండో బస్సులోనో/రైల్లోనో హైదరాబాద్ వస్తే తెల్లవారగట్ల 4,5 గం.లకి చేరేవాళ్ళం. దోమలగూడ, మన JET కి వెళ్ళేదాన్ని. ఆ మధ్యలో సన్నగా ఉండే మెట్లు ఎక్కుతుంటే మధురమైన సన్నని స్వరంతో ప్రాతఃస్మరణీయం వినిపించేది. అక్కడ ఒక చెక్కబల్లమీద అమ్మగారు కూర్చుని ప్రాతఃస్మరణీయం చేసుకుంటూ దర్శనం ఇచ్చేవారు. దాసోహం చేసుకోగానే, ఎక్కడనుండి వచ్చావమ్మాయ్ ప్రయాణం చేసి అలసిపోయావేమో, ఈ చాపతీసుకుని కొద్దిసేపు అలా పడుకో అనేవారు వాత్సల్యంతో.

తల్లి కడుపు చూస్తుంది, భార్య జేబు చూస్తుంది అని నానుడి. భార్య విషయం ఏమో కాని, అమ్మ విషయంలో ఇది అక్షరాల నిజం. మధ్యాహ్నం ఎవరు కనిపించినా మొదట వేసే ప్రశ్న భోజనం చేసావా? పెడతాను రా అని ఆప్యాయంగా పిలిచేవారు. అమ్మచేతివంట తిన్నవారిదే అదృష్టమంటే. ఆవిషయంలో నేను చాలా అదృష్టవంతురాలిని. ఒకసారి JET కి మధ్యాహ్నం 3.00 గం. సమయంలో వెళ్ళాను. అమ్మాయి భోంచేసావా? అని అడిగారు. లేదమ్మగారు ఇప్పుడే వస్తున్నా అన్నాను. తిండి తినకుండా ఏమిటమ్మాయి కొద్దిగా కై **ప్రసాదం** పెడతాను అని అమ్మగారు ఆవకాయ నెయ్యి కలిపి పెద్దపెద్ద ఉండలు చేసి చేతిలో పెడితే, ప్రేమతో కలిపిన ఆ ప్రసాదం చాలా రుచిగా ఉంది. అప్పుడు కలిగిన ఆనందం ఎప్పటికి మరువరానిది. అమ్మగారిని చూస్తే అలనాటి డొక్కా సీతమ్మగారు గుర్తుకు వస్తారు.

శంషాబాద్ ఆశ్రమంలో అమ్మగారి గదికి ఎదురుగానే నాగది. ఏమి చేసినా ముందుగా నాకు తప్పకుండా ఇచ్చేవారు. అమ్మగారు ఆవపెట్టిన పొట్లకాయ పెరుగుపచ్చడి, యాపిల్ పండ్ల, అవిసె పువ్వుల, జామకాయ, అరటిపువ్వు, కమలాపండు తొక్కలతో, అరటిపండు తొక్కలతో, దానిమ్మ తొక్కలతో, ఇదివరకెన్నడు రుచిచూడని పచ్చళ్ళు, గొల్లప్రోలు మిరపకాయలకారంతో (పచ్చకారంతో) గుత్తి మామిడి కాయల పచ్చడి, అరటి దూట కూర, కంచుగిన్నెలో కుంపటిపైన పెట్టిన రసం, కొండపిండి ఆకుతో చేసిన పప్పు ఇలా ఎన్నో కేవలం రుచులకోసమేకాదు కిడ్నీలో రాళ్ళను తొలగించే,

**అమ్మ చేతి స్పర్శతో ఆవకాయైనా అమృతమే అవుతుంది**



జీర్ణాశయాన్ని శుభ్రపరిచి ఆరోగ్యప్రదాయనులైన వంటలను ఆయుర్వేద పరిజ్ఞానం కలిగిన అమ్మగారు మాకు పరిచయం చేసారు. ఇది ఏమిటమ్మగారు అని అడిగితే, రుచి చూసి నువ్వే చెప్పు, అని నవ్వేసేవారు.

ఎవరికైనా అనారోగ్యం చేస్తే ప్రకృతి సహజమైన తిప్పతీగ, నల్లేరు ఇంకా ఎన్నో పెరటి మొక్కలతోనే వైద్యాన్ని సూచించేవారు. ప్రత్యేకవంటలు చేయడమే కాదు అందరికీ పంచే అమృతహస్తము అమ్మది. ఆశ్రమంలో ఉండే విద్యార్థులందరికీ రేగివడియాలు, మినపసున్నుండలు లాంటివికూడా చేసి పెట్టేవారు. 'ఏకః స్వాధు న భుంజీథ' అని శాస్త్రంచెప్పిన దానిని అమ్మ ఆచరించి చూపారు. ప్రతీ ఏడాదీ వేసవి వస్తే విద్యార్థులందరికీ సరిపడేలా ఆవకాయ పెట్టేవారు. ఎందుకమ్మగారు అంత శ్రమ అంటే పోనీలే అమ్మాయ్ ప్రతీరోజు చేస్తామా ఏంటి అనేవారు. క్రిందటి దీపావళి వరకు నరకాసురవధ తర్వాత విద్యార్థులకి, ఆశ్రమ వాసులకి తలకి చమురు వ్రాసి దీవించి స్నానం చేయమనేవారు.

ఎవ్వరిని కష్టపెట్టకుండా వారి పని వారే చేసుకునే వారు. కేవలం మనష్యులనే కాదు మొక్కలు, చెట్లను కూడా వారు ప్రేమించేవారు. వారు నాటిన మామిడి, జామ, వాటర్ యాపిల్ మన జీవా ఆశ్రమంలో పండ్లనిస్తూ అమ్మగారిని గుర్తుచేస్తున్నాయి. మొన్నటి జూలైలో శ్రీ స్వామివారి చాతుర్మాస్య దీక్ష ప్రారంభానికి ముందు వరకు ప్రతి రోజూ ఉదయం స్నానానంతరం తులసికి నీరుపోసి ప్రదక్షిణ చేసి, సూర్యనమస్కారం చేసుకుని ఆరాధన అయిన తర్వాతనే మిగిలిన కార్యక్రమాలు ప్రారంభించేవారు. ఇలా పూర్వులు ఆచరించిన విధానాన్ని చివరివరకు కొనసాగిస్తూ మాకు ఆదర్శంగా నిలిచారు.

84 సం. వయసులో కూడా నిత్యానుష్ఠానం వదలక, నీరసమనుకోక పదిమందికి ఏమైనా మంచి చేయాలనే తపన వారిది. అమ్మగారిలో ఉండే సహనం, చిరు దరహాసం చెరగని ముఖం, ఆచార్యనిష్ఠ, సాంప్రదాయం పట్ల గౌరవం, ఆచరణ నేటి సమాజంలో అందరూ నేర్చుకోవలసినవి.

విత్తనం ఒకటైతే మొక్కవేరొకటి కాదుకదా ! అమ్మగారిలో ఉండే ఈ గుణాలన్నీ, మన స్వామిలో అద్దం పడతాయి.

ఏమైనా ఒక మహామనీషిని మనమందరం కోల్పోయాం.

నేను ఒకరకంగా చాలా అదృష్టవంతురాలిని. ఎందుకంటే అమ్మగారి ఇంటికెదురుగానే నా ఇల్లుకావడం. వారిని దగ్గరనుండి చూసి సేవించే, వారి చేతి ప్రసాదాలని తినే భాగ్యాన్ని పొందాను.

ఆ తల్లి ఆశీస్సులు ఎన్నటికి మనపై వర్షించాలని ఆశిస్తూ....

❖❖❖❖❖❖



# మంగళప్రదాయిని



**అరుణ**

**తత్త్వశాస్త్ర విద్యార్థిని, విజయనగరం**

సుందరమైన రూపం, చిరుమందహాసం, మృదుస్వభావం. అందరినీ ప్రేమతో ఆదరించే మంచిమనసు, చందనమంత చల్లనిచూపు కలిగిన అమ్మగారు జగదాచార్యుని లోకానికందించిన త్యాగమూర్తి; మన ఆచార్యులు శ్రీశ్రీశ్రీ చిన్నజీయరు స్వామివారి మాతృమూర్తి, మనందరికీ ఆప్యాయతను పంచిన అమ్మగారు ఈ లోకాన్ని విడిచి పరమపదానికి వేంచేసి వారి జ్ఞాపకాలను మనకు మిగిల్చారు.

ఈ దాసురాలికి 1991లో రాజమహేంద్రవరంలో అమ్మగారిని సేవించే భాగ్యం కలిగింది.

విజయవాడ విరాట్ విష్ణుసహస్రనామ పారాయణ సమయంలో ఈ దాసురాలికాలికి దెబ్బతగిలింది. అప్పుడు అమ్మగారు చూపించిన ప్రేమ మరువలేనిది.

కన్నతల్లి బిడ్డలను ప్రేమించడం సహజం. కానీ లోకాన్నే నిస్వార్థంగా ప్రేమించే అరుదైన అనుబంధం అమ్మగారిలో కనిపిస్తుంది.

ఆశ్రమంలో అందరూ అమ్మగారి ప్రేమకు పాత్రులైనవారే.

ఒకసారి శంషాబాద్ శ్రీరామనగరంలో వికాసతరంగిణి సభ్యులశిక్షణశిబిరం జరిగింది. చాలారోజుల తరువాత అమ్మను సేవించుకోగలిగాను "మీ విజయనగరంలో ఏంచేస్తుంటావు" అని అమ్మ అడిగారు. ఆచార్యులు అనుగ్రహించిన అన్ని కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తామో చెప్పాను. అన్నింటికంటే అమ్మగారికి గ్రామాలలో జరిగే ప్రచారం కార్యక్రమాలు చాలా ఆనందాన్ని కలిగించాయి ప్రతీసారీ క్రొత్త కార్యక్రమాలు నిర్వహిస్తామని అమ్మే ఫోన్ చేసి "అమ్మాయ్! ఈ సారి కార్యక్రమం ఏంచేస్తున్నావ్" అని అడిగేవారు 108 హరిజనవాడలలో రామకళ్యాణాలు, పూజాకార్యక్రమాలే కాకుండా ఏ ఆధారం లేని వృద్ధులకు నిత్యావసరవస్తువులు అందించడం" అని చెప్పగానే అమ్మ మనసు తల్లడిల్లింది. మా ఆచార్యసేవగా నేనుకూడా ఒక గ్రామానికి పంపిస్తాను. కాని ఈ విషయం ఎవ్వరికీ చెప్పకూడదమ్మాయ్! అని సున్నితంగా మందలించారు. కీర్తి కోరుకోని కరుణామూర్తి మన అమ్మగారు.

శ్రీస్వామివారితో పాటు భద్రాచలం వెళ్ళినప్పుడు అమ్మగారే తీసుకెళ్ళి భద్రాద్రి రాముని సేవించే భాగ్యం కలిగించారు. దాసురాలిజీవితంలో అమ్మగారు ప్రతిసారి చెప్పేమాటలు మరువలేనివి. **"భగవంతుని వైభవాన్ని అందరికీ తెలియజేయాలి. ఆచార్యుని సేవలో అందరూ తరించాలి"** "అమ్మాయ్! అరుణా! మీ ఆచార్యవైభవాన్ని మాత్రమేకాదు



మా ఆచార్యుల (శ్రీశ్రీశ్రీ పెద్దజీయరు స్వామివారు) వైభవాన్ని కూడా అందరికీ చెప్పు. శ్రీస్వామివారు నిర్వహించిన కార్యక్రమాలు కూడా అందరికీ తెలియజేయి" "ఆచార్యులమంగళాశాసనములతో నువ్వు చేస్తున్న కార్యక్రమాలు నువ్వు అనుకున్నదానికంటే చాలా బాగా జరుగుతాయి. పెరుమాళ్ళ అనుగ్రహం నీకెప్పుడూ ఉంటుంది" అని ప్రతిసారీ ప్రోత్సహించే అమ్మ మాటలే గుర్తుకు వస్తున్నాయి.

నేత్ర విద్యాలయ, మహిళా ఆరోగ్య వికాస్, అమెరికా వికాస్, అమెరికా వికేసేవా, రామానుజ సహస్రాబ్ది – అన్ని కార్యక్రమాలు మనమంతా బాగా నిర్వహించి కొత్తవారికి కూడా ఆచార్యులు చేసే కార్యక్రమాలని తెలియచేయాలి. ఈ మాటలే అమ్మగారు పదే పదే చెప్పేవారు.

ఆశ్రమానికి ఎప్పుడు వెళ్ళినా ప్రసాదాన్ని కలిపి అమ్మచేతితో ఆమే స్వయంగా పెట్టేవారు. ఎనిమిది పదులు వయస్సుదాటిన తరువాత కూడా ఎవరు సాపాటువేళ దాటివచ్చినా, చెయ్యలేదని తెలిసినా అమ్మే వండి వడ్డించేవారు ఇలాంటి సందర్భాలు ఎన్నోసార్లు చూసాము. స్వామి షష్ఠ్యబ్ది మహోత్సవ కార్యక్రమంలో ఒక రోజు మేము ఆశ్రమం చేరేవరకు రాత్రి తదీయారాధన వేళ దాటిపోయింది. మేము ఎనిమిది మంది ప్రసాదాలు తీసుకోలేదని అమ్మగారు అప్పటికప్పుడు ప్రసాదం తయారుచేసి పెట్టారు. అదీకూడా వెంటనే తయారయిపోయేదికాదు. ఎంతో శ్రమపడి చేయవలసిన చపాతి, కరిఅముదు తయారుచేసి ఆ 8 పదులు వయసు దాటిన అమృతమూర్తి మాకు ప్రేమతో పెట్టారు.

ఎప్పుడైనా ఆశ్రమంలో ఏదో సమావేశంలో ఉండి ప్రసాదం తీసుకోకపోతే వెంటనే సాదంకలిపి చేతులలో ముద్దలు చేసిపెట్టి 'ఎప్పుడూ తినకుండా పనులుచేయకండమ్మాయ్' అని ప్రేమతో మందలించే వాత్సల్యమూర్తి అమ్మగారు.

రోజూ శ్రీశ్రీశ్రీ స్వామివారికి మంగళాశాసనము చేసిన తరువాతే రాత్రి అమ్మగారు విశ్రాంతి తీసుకొనేవారు. శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామివారు ఒకరోజు "ఎందుకు రోజూ కొబ్బరికాయ వృధా చేస్తారు. తదీయారాధనశాలలో ఇస్తే భక్తులకు పచ్చడి చేసి పెడతారు" అన్నారుట. మంగళాశాసనం చేసివచ్చిన అమ్మగారు "లోకకళ్యాణం కోసం కార్యక్రమాలు చేసే స్వామివారికి ఎందుకు మంగళాశాసనం చేయాలి. చెయ్యకపోతే ఒకసారి పెద్ద జీయరు స్వామివారి విషయంలో ఏంజరిగిందో చెప్పారు. భక్తులంతా మహనీయులకి, భాగవతోత్తములకు మంగళాశాసనం చేయటమే మన శ్రీవైష్ణవ సంప్రదాయం. అందుకనే ప్రతి ఒక్కరూ ఎక్కడున్నవారక్కడే ఆచార్యులకు పెరుమాళ్ళకు తప్పని సరిగా మంగళాశాసనం చేయాలని చెప్పారు.

త్యాగం, ప్రేమ, దయ, వాత్సల్యం, ఓర్పు, ఆప్యాయత, అనురాగం, భక్తి, శరణాగతి ఈ పదాల నిర్వచనం అమ్మగారి ఆచరణలో చూసి నేర్చుకోవలసినవే. ఈ విధంగా ప్రోత్సహించే అమ్మ ఈ లోకాన్ని విడిచి వెళ్ళారని బాధపడుతున్నా, పరమపదంలో ఆచార్య అనుగ్రహంతో శ్రీమన్నారాయణుని నిత్యకైంకర్యాలతో ఆనందాన్ని పొందుతున్నారని మనసుని సమాధానపరుచుకుంటున్నాము.

❖❖❖❖❖❖



# అమ్మకు అక్షర నీరాజనం

కల్పన

తత్త్వశాస్త్ర విద్యార్థిని, జీవా

అమ్మగారి గురించి వ్రాయమంటే ఏమని వ్రాయను? ఎంతని వ్రాయను? ఎలా వ్రాయను? అక్షరానికి అందనిది అమ్మగారి వైభవం. మాటకు అందనిది అమ్మగారి మనోధైర్యాది గుణాలు. మనస్సుకందనిది అమ్మగారి సంకల్పం. కృపామాత్ర ప్రసన్నాచార్యులను ప్రసాదించిన కృపామృతవర్షిణి అమ్మగారు.



**అమ్మ అంటే అమృతము కంటె ఆనందాన్నిచ్చేది**

**అమ్మ ఉంటే అమరపురి అయినా అతి తక్కువే**

**అమ్మ పెడితే అది ఏదైనా ఎంతైనా ఆరోగ్యప్రదమే**

**అమ్మ చెప్పితే  అది వేద ప్రామాణ్యమే**

**అమ్మ చూపే  దిక్సూచి**

**అమ్మ నడకే నాలుగు దార్లు కలిపే చోటు**

**అమ్మ నడతే నవజీవనోజ్వల ప్రకాశిని**

**అమ్మ కోరిక సంతానంగా భావించే అందరి శ్రేయస్సే**

**అమ్మ గుణం త్రిగుణాలతో ఉన్న మనం గుణించలేనిది**

**అమ్మ  ఋణం - తానే తీర్చించుకునే ఋణం**

**అమ్మగారి సన్నిధి నా హృదయ ఆనంద నిలయం**

**అమ్మగారి మాటల శాసనం నాకాత్మోజ్జీవనం**

**అమ్మగారు చూపిన ప్రేమ మరపురాని మధురానుభూతి**

**అమ్మగారి స్నేహం కలకాలం నిలబెట్టుకునే అపురూపపు వజ్రనిధి**

**అమ్మగారిలోని ఓర్పు  మనందరికీ ఓదార్పు**

**అమ్మగారి నేత్ర సౌందర్యం అచంచలమైన ఆత్మవిశ్వాసానికి మారురూపు**

**అమ్మ సన్నిధే మనస్సుకాధారం**

**ఆ ఆధారమే లేకపోతే...... మనస్సు ఎటుపోతుందో ఎలా ఉంటుందోనని బెంగపడేది అమ్మే.**





అమ్మ గారితో నాకున్న అనుబంధం మాటలతో చెప్పలేనిది. నాపై ఎంతో కృపని, వాత్సల్యాన్ని చూపడమేకాక ధైర్యాన్ని, మార్గనిర్దేశాలను కూడా ఇచ్చేవారు. వారివలననే ఇన్నేళ్ళు ఆధ్యాత్మికమార్గంలో (ఆశ్రమంలో)ఉండగలిగానంటే అతిశయోక్తి కాదు. అమ్మగారు వచ్చారంటే నాకూ ఆనందం. నేను ఆశ్రమంలో ఉన్నానంటే అమ్మగారికీ ఆనందమే. స్వామివారి దయ ఉన్నప్పటికినీ, నాకు తల్లిగా, తోడుగా, నీడగా ఉన్నది అమ్మగారే. ఆ అనుబంధం గుర్తుకు వచ్చినా ఒక్క అక్షరం రాయలేను. ఒక్కమాటకూడా పలుకలేను. అటువంటి అమ్మ నాకే కాదు ఈ లోకానికే చేసిన ఉపకారం మరువగలమా, స్మరించకుండా ఉండగలమా?

అమ్మా తమరు చేసిన త్యాగం లోకానికది ...... తేజోపుంజమై విరాజిల్లుతూ ఉంటుంది.

అమ్మా తమ స్వాతిముత్యం లోకమంతా చిరునవ్వులతో చిరుజల్లులను చిలకరిస్తుంటే ... ... తమరి నాటి తీర్చిదిద్దిన బాల శ్రీమన్నారాయణుడు ఎదిగి నేటి యతిసార్వభౌములుగా ప్రపంచ ఖ్యాతి నొందినారు. నీ స్వాతి ముత్యాన్ని నాలుగు పదాలతో కీర్తిస్తే నీకు నిజమైన ఆనందాన్నిచ్చినదాననవుతాను అమ్మగారు...

నీ బాలశ్రీమన్నారాయణుడు నేడు సప్తసముద్ర పర్యంత వైష్ణవ ప్రభాకరుడై, కాశ్యప గోత్ర యశః ప్రతిష్ఠాకరుడై, నాస్తిక జనగుణ నిరవశేషకుడై, క్షత్రియ మానదర్పమర్దనుడై, ఆగమ నిలయుడై, త్రిదండధారియై, మాతృదేశ భక్తి పరాయణుడై, స్ఫురద్రూపియై, ఆధ్యాత్మిక– సామాజిక సేవా పరతంత్రుడై, కోట్ల భక్తజన హృదయ వికాస మార్గదర్శకుడై, మహిళా లోక – దీన జన ఆరోగ్య శిక్షణ శిబిర పోషకుడై, సాత్విక భక్తజన ప్రియుడై, అమృత రస వాహినీ ప్రవాహ కంఠ మాధుర్యము గలవాడై, శాస్త్ర జ్ఞాన విశారదుడై, శాస్త్ర సార రసగంగా ప్రవాహరూప ప్రవచనశీలియై, శిష్యవత్సలుడై, పండిత మాన్య జన రక్షా బద్ధుడై, శ్రీమన్నారాయణ గుణ గణ లీలా విశేష లోలుడై, శ్రీసీతారామచంద్ర ప్రభు హృదయ విహారియై ఇలా ఎన్నో ఎన్నెన్నో కళ్యాణ గుణములు గల నీ చిన్నికన్నయ్య– ముగ్ధమనోహర రూపధారియై, చిరునగవుల సిరిమోము గల స్వామి మీ సంకల్పాని కనుగుణంగా విశ్వశ్రేయస్సు కై దీక్షా దక్షతలతో, తమ మంగళాశాసనములతో ముందుకు సాగుతున్నారు **తల్లీ ... బంగారు తల్లీ... పాలవల్లీ .... మా అమృతవల్లీ...**

అమ్మగారూ...... మా అమ్మగారూ...... ఎక్కడున్నా నాకు తోడు మీరుండాలమ్మగారూ...

ఈ శరీరం ఉన్నంతకాలం నేను చేసే మంచి పనులన్నీ మీకే అంకితం.

❖❖❖❖❖❖

**అమ్మ తన సంతానాన్ని దేశం కోసం ధర్మం కోసం వదులుకునేంత ధైర్యశాలి**



# ఆప్యాయత ఆత్మీయతల కలబోత



శాంతారాం

తత్త్వశాస్త్ర విద్యార్థి, జీవా

ఆప్యాయత, ఆత్మీయత, వాత్సల్యము, సౌశీల్యము, మూర్తీభవించిన మాతృమూర్తి అమ్మగారు. లోకమంతా దాసోహమనే ఒక మహానుభావుణ్ణి ప్రసాదించిన త్యాగమూర్తి అమ్మగారు.

**ఎవరు వ్రాయగలరు అమ్మా అను మాటకన్న కమ్మని కావ్యం**
**ఎవరు పాడగలరు అమ్మా అను రాగం కన్న తీయని రాగం ..**

అంటూ ఒక కవి చాలా బాగా చెప్పారు. అమ్మ యొక్క గొప్పతనాన్ని, అమృతం ఎలా ఉంటుందో తెలియదు కానీ అమ్మ ప్రేమ ముందు అది దిగదుడుపే. అమ్మ ప్రేమ ఈ ప్రపంచాన్నే మురిపింప చేస్తుంది? దేవుడికి ప్రతిరూపమే అమ్మ అంటే ఎవరైనా కాదనగలరా.

మాతృదేవో భవ! పితృదేవో భవ! ఆచార్య దేవో భవ! అతిథి దేవో భవ! అంటూ వేదము కూడా "అమ్మ" కే అగ్రతాంబూలం ప్రసాదించింది. మనకు ఏ చిన్న బాధ కల్గినా అమ్మనే తల్చుకుంటాం. మన సంప్రదాయములలో కూడా అమ్మకే పెద్దపీట వేశారు. శ్రూయతి, శ్రావయతి ఇతి శ్రీః మన అనుభవాలను శ్రద్ధగా విని, సందర్భం చూసి జగత్పతికి చెప్పి మన పంట పండేలా చేస్తుంది జగన్మాత. తన సంతానాన్ని తీర్చిదిద్దటానికి, పోషించటానికి ఎన్ని కష్టాలు అయినా భరిస్తుంది.

ఇక మన ఆచార్యులను కన్న అమ్మగారి గూర్చి ఎంత చెప్పినా తక్కువే. ఏమిచ్చి ఆ మాతృమూర్తి ఋణం తీర్చుకోగలం చెప్పండి. త్రేతా యుగంలో శ్రీరామచంద్రుణ్ణి, ద్వాపరం లో శ్రీకృష్ణచంద్రుణ్ణి ముద్దు ముద్దు మాటలతో బలి చక్రవర్తి దగ్గర మూడు అడుగులు అడిగిన వామనుణ్ణి ఆ వెంటనే లోకాలన్నీ తన పాదంతో కొలిచిన త్రివిక్రముణ్ణి చూసామో లేదో కానీ వీరందరిని రంగరించి ఒక అద్భుతమైన అవతారాన్ని ఆచార్యుల రూపంలో మనం చూడగలుగుతున్నాము. దర్శించగలుగుతున్నాం. సంభాషించగలుగుతున్నాం. వారి కాలంలో మనం ఉండటం, వారి శిష్యపరమాణువులుగా ఉండటం ఎన్నో జన్మల అదృష్ట విశేషం అని సగర్వంగా చెప్పుకుంటున్నాం. వారే మన శ్రీ స్వామివారు.

అలాంటి అపురూపమైన, అద్భుతమైన ఆచార్యులను లోకానికి ప్రసాదించిన మాతృమూర్తి, త్యాగమూర్తి "అమ్మగారు". అమ్మగారు, శ్రీ స్వామివారు ఇద్దరు ఎదురుపడినప్పుడు పరస్పరం దాసోహం సమర్పించుకునే ఆ సన్నివేశాన్ని దర్శించిన వారి భాగ్యమే భాగ్యం. రెండు కళ్ళు సరిపోవు కదా! ఆ అద్భుతమైన సన్నివేశాన్ని దర్శించడానికి.

అలాగే అమ్మగారు ప్రతిరోజూ శ్రీ స్వామివారికి మంగళశాసనం చేసే సన్నివేశం కూడా దాసుడికి సేవించుకునే

**శ్రీరామ కృష్ణ వామన త్రివిక్రమ అవతారాల కలబోతను కన్నతల్లికివే జోహార్లు**



అదృష్టం చాలా సార్లు లభించింది.

అమ్మగారి ఆశయాలను, శ్రీ పెద్ద జీయర్ స్వామివారు సంకల్పించిన అనితరసాధ్యమైన కార్యక్రమాలను అలవోకగా, సమర్థవంతంగా చేసి చూపించిన అఘటితఘటనా సమర్థులు శ్రీస్వామివారు. ఇది అంతా కూడా "అమ్మగారి" యొక్క దివ్య మంగళాశాసనబలమే అని శ్రీ స్వామివారి, మన అందరి యొక్క ప్రగాఢ విశ్వాసం.

ప్రతి సంవత్సరం శ్రీ స్వామివారి తిరునక్షత్రానికి అమ్మగారు శ్రీ స్వామివారిని చిన్న శిశువుగా భావించి చేసే కైంకర్యాలు మన అందరికీ కూడా నయనానంద కరం. ఆ సందర్భములో శ్రీ స్వామివారికి మంగళశాసనం చేస్తూ వారి మృదుమధురమైన కంఠంతో హృద్యంగా ఆలపించే ఆ గీతాలు, కీర్తనలు, నిరంతరం మన చెవులలలో మారుమ్రోగుతూనే ఉంటాయి. ఇది ఒక అనిర్వచనీయమైన సన్నివేశం.

అమ్మగారి యొక్క గొప్పతనం గూర్చి గాని, వారి ప్రేమ, ఆత్మీయత కానీ, వాత్సల్యం మొదలైన కళ్యాణ గుణాల గూర్చి కానీ, వివరించే యోగ్యత, శక్తి దాసుడికి లేవు. కానీ వాటిని ప్రత్యక్షంగా అనుభవించిన వారిలో దాసుడు కూడా ఒకడు అని సగర్వంగా చెప్పుకుంటున్నాను.

దాసుడు ఎప్పుడూ నేను ఎంత అదృష్టవంతుడినో కదా అని అనుకుంటూ ఉంటాడు.

1. ఈ జన్మలో ఒక అద్భుతమైన, సకలకళ్యాణ గుణాలకు ఆలవాలమైన మాతృమూర్తి ని దర్శించగలిగాను అని.
2. అమ్మగారు సంప్రదాయ సేవ కోసం, సమాజసేవ కోసం, మరియు లోకాకళ్యాణం కోసం వారి పుత్రుణ్ణి లోకార్పణం కావించి, ఏ తల్లి కూడా చేయని ఒక గొప్ప త్యాగాన్ని, సాహసాన్ని చేసిన అద్వితీయమయిన ఆదర్శ మాతృమూర్తిని దర్శించగలిగాను అని.
3. వారు ప్రసాదించిన ఒక గొప్ప సదాచార్యుల సేవలో తరించే భాగ్యం కలిగిందని.

ఈ సందర్భంలో పదకవిత పితామహుడు అన్నమాచార్యులు ఆలపించిన ఒక కీర్తన గుర్తుకువస్తుంది.

**"ఇది గాక సౌభాగ్యం అది గాక తపము మరి ఇది గాక వైభవంబింకొకటి కలదా."**

ఇంత అద్భుతమైన ఆచార్యులను అందించిన మాతృమూర్తి ఋణం ఏమి ఇచ్చి తీర్చుకోగలం. అమ్మగారు ప్రసాదించిన శ్రీ స్వామివారి ముఖవికాసం కలిగేలా సేవ చేయడం ఒక్కటే మనం అమ్మగారికి సమర్పించే నిజమైన నివాళి, శ్రద్ధాంజలి. అమ్మగారు దైహికంగా మన మధ్యలో లేకపోయినా, వారి దివ్య గుణాలతో మన అందరి హృదయాల్లో ఎప్పుడూ వేంచేసి ఉంటారు.

అమ్మగారు మన పరమాచార్యులతో కలిసి శ్రీ వైకుంఠములో పెరుమాళ్ళ నిత్య కైంకర్యం చేస్తూ, అక్కడినుండే మనందరికి నిరంతరం వారి మంగళాశాసనాలు అందిస్తూనే ఉంటారు.

అమ్మగారి పాదపద్మములకు అనేకానేక దాసోహములతో.

❖❖❖❖❖❖



# కాంతి పుంజం

నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాస్ అయ్యంగార్
తత్త్వశాస్త్ర విద్యార్థి, నెల్లూరు.



క్షణే క్షణే యన్నవతాముపైతి
తదేవరూపం రమణీయతాయాః !!

అంటారు మాఘ కావ్యంలో మాఘుడు.

ప్రతిక్షణం చూచినకొద్దీ చూడాలని పించటం రమణీయత అంటే. అలాంటి కాంతిని ఆనాడు శ్రీరామచంద్రునిలో దర్శిస్తే, ఈనాడు మన ఆచార్యులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామిలో దర్శిస్తున్నాము.

దానికి కారణం స్వాచార్యులను అందించి లోకానికి కాంతిని ప్రసరింప చేసిన "కాంతిపుంజం" అమ్మగారు అలిమేలు మంగ తాయారమ్మగారు. ఆ కాంతి కోటి సూర్య ప్రభలతో లోకాన్ని ప్రకాశింపచేస్తూ, మనందరినీ పునీతులను కావిస్తోంది. ఇది మన అందరి భాగ్యం. సత్పురుషులైన వారిని, విశిష్ట వ్యక్తులను కలవటం పూర్వజన్మలోనో, లేదా ఈ జన్మలోనో చేసిన పుణ్యం వల్లనే సాధ్యం. అందుకే భవభూతి మహాకవి ఉత్తరరామచరితలో "సతాం సద్భిః సంగః......పుణ్యేన భవతి" అంటారు.

సూర్యకాంతి ప్రసరిస్తూనే ఉంటుంది. ఆ కాంతిని అందుకునే శక్తి సామర్థ్యం మనలో ఉండాలి. అలాంటి కాంతిని కలిగి ప్రసన్న వదనంతో మన ఆచార్యులను సేవించుకోవటానికి మీరు వచ్చారా....? అని అంటున్న అమ్మ ముఖ కాంతి చూస్తుంటే అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుంది. అందరినీ ఆనందంగా పలకరిస్తూ సదా ఏక రూప వదనారవిందంతో ... చల్లని చూపులతో కరుణిస్తూ...కాంతిని పంచి ఇచ్చిన కాంతిపుంజం అమ్మ.

శ్రీ రాముడికి విశ్వామిత్రుడు "కౌసల్యా సుప్రజా రామ!' అని సుప్రభాతం పాడినట్లు "ఆచార్య మేఘమా..!! కరుణవాన కురియుమా...."!! అని మనందరినీ కరుణించేలా ప్రార్థిస్తున్న అమ్మ ఋణం తీర్చుకోవటం అసాధ్యం. పునః పునః ప్రణామాలు సమర్పించుకుంటూ...

❖❖❖❖❖❖

# అమృతత్త్వసిద్ధికైనా... అమృతపు రుచికైనా....



ఓమ్ అస్మత్ గురుభ్యో నమః

అమ్మగారితో అనుబంధం ఆచార్యానుగృహీత ఫలాలలో మొదటిది. శ్రీ స్వామివారే ఆదేశించి దాసురాలిని అమ్మగారితో పాటు 1996 చెన్నై విరాట్ పారాయణని సేవించుకునే అవకాశం కల్పించారు. అక్కడి నుండి అమ్మగారితో బెంగుళూర్ వెళ్ళి 10 రోజులపాటు ఆ తల్లి ప్రేమానురాగాలని పరిపూర్ణంగా పొందేలా కటాక్షించారు. 1989 రాజమహేంద్రిలో జరిగిన శ్రీ స్వామి వారి చాతుర్మాస్య దీక్షా సమయం నుండి అమ్మగారిని సేవిస్తున్నా, ఆచార్యుల మాతృమూర్తిగ భక్తి ప్రపత్తులతో దూరం నుండి దాసోహం అర్పించడం వరకే పరిమితం.

కానీ, 1996 బెంగుళూరు ప్రయాణంతో ఆ తల్లిలోని వాత్సల్యసాగరంలో మునిగి తేలేట్లు చేసిందీ, ఆచార్యుల కటాక్షమే. నాటి నుండీ ఆ బంధం ఎంతగా పెనవేసుకున్నది ఒక ప్రత్యేక గ్రంథంగా వ్రాయాల్సిందేనేమో..

అమ్మ ఎవరికైనా అమ్మ ప్రేమను పంచగలదు కానీ, అమ్మగారు అంతమాత్రమే కాదు.... ఒక స్నేహితురాలిలాగ హితాన్ని కాంక్షించారు, మార్గదర్శకురాలిగా... సున్నితమైన సూచనలతో మార్గ నిర్దేశం చేసారు. గురువులాగ సాధనా నియమాలని బోధించారు. సుహృత్ గ ఎన్నో అనుభూతులని పంచారు... జీవన పాఠాలనీ నేర్పారు...

వైదిక కుటుంబంలో పుట్టినా, తత్త్వశాస్త్ర విద్యార్థినిగా శ్రీ స్వామి వారి సన్నిధి చేరేవరకు వైష్ణవ సంప్రదాయ రీతులు ఏమాత్రం తెలియని అజ్ఞురాలిని. అవి జగ్గయ్యపేటలో ఆచార్య సమాశ్రయణం పొందిన తొలిరోజులు. అమ్మగారు పుండ్రధారణ సమయంలో ఏం చదువుతావు అమ్మాయ్? అని అడిగితే సమాధానం చెప్పరాలేదు. గురుపరంపర చదువుకుంటాం కదా అనుకున్నా మనసులో. కానీ, అమ్మగారు గ్రహించి స్నానానంతరం ద్వాదశనామ



పంజరస్తోత్రంతో పుండ్రం ధరించాలి. శ్రీచూర్ణం అరచేతిలో రంగరించేటపుడు ద్వయమంత్రం అనుసంధానం చేసుకో అన్నారు.

మరొక సందర్భంలో ద్వయమంత్రం ఉదయం మాత్రమే కాదు సర్వాకాల సర్వావస్థలలోను చేసుకోవచ్చని ఆచార్యులు వారు అనుగ్రహించారు కదా! మా పెద్దస్వామివారు ఏదైనా ఆందోళనకర సన్నివేశం ఎదురైనా, చెడుతలంపులు కలిగినా ఆ భావావేశాలు తగ్గేవరకు వేగంగ ద్వయం చదువుకోమన్నారు అని ఆతల్లి చేసిన ఉపదేశం ఎన్నోమార్లు గాడితప్పిన ఆలోచనలని, ఆవేశాలని అదుపులోకి తెచ్చింది. ఇది మీరూ ప్రయత్నించి చూడండి! చక్కటి మానసిక ప్రశాంతత మీ సొంతమౌతుంది!

ఇంకొకసారి ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః అన్న వేదవచనాన్ని ఆచార్యులుపదేశించిన క్రమాన్ని గురించిన చర్చ వచ్చింది. విద్యార్థులుగా మేమెంత శ్రద్ధతో గ్రహిస్తున్నామో పరీక్షించేందుకు అమ్మగారు అప్పుడప్పుడూ ఏమీ తెలియని వారిలాగా ఇవాళ మీ స్వామివారు ఏం పాఠం చెప్పారో నాకూ చెప్పు అంటుండేవారు. అప్పుడు అనేక విధాల ప్రశ్నలు వేసి సరైన అవగాహన కలిగిందా లేదా చూసేవారన్పించేది. అలాంటి ఒక సందర్భంలో... అమ్మాయ్ తీసుకునే ఆహారం వల్లనే మనస్సు బాగుంటుంది అని, ఇది ఒక నియమంగా పెట్టుకో అంటూ ఒక 5 Point formula అనుగ్రహించారు. గుర్తున్నంతవరకు పంచుతున్నా.....

1. శ్రీభగవన్నివేదిత ఆహారం మాత్రమే తీసుకోవాలి. ఇది జాతి ఆశ్రయనిమిత్తదోషాలని తొలగించివేస్తుంది.
2. నివేదన అయ్యేవరకు ప్రసాదం పేరు కూడా బయటవారికి తెలవకుండా, ఇతరులు మనసులో కూడా తలవకుండా చూసుకోవాలి.
3. ద్వయం చదువుతూ లేదా ఆచార్య స్మరణ చేస్తూ భగవంతుని కోసమనే భావనతోనే మడిగా తళియ చేయాలి.
4. నివేదిత ప్రసాదాన్ని మౌనంగా అంతర్యామికి సమర్పణ భావంతో స్వీకరించాలి.
5. భగవద్బంధువులకి సమర్పించిన తర్వాత ఏకాంతంగా, మడిగా, యజ్ఞభావంతో ప్రసాదస్వీకరణ చేయాలి. ఇవి భావదోషాలు రాకుండా చేస్తాయి.

ఇవి పాటించి చూడు నీమనస్సుకి ఎంతస్థైర్యం వస్తుందో! సంకల్పశుద్ధి / సిద్ధి కూడా కలుగుతుందమ్మాయ్! దీనివలన ఇతర ఆటంకాలూ తొలగి సాధన ముందుకి సాగుతుంది అని నేర్పారు. శ్రీస్వామివారి అనుజ్ఞతో దాసురాలు, నాస్నేహితురాలు తోటి తత్త్వశాస్త్ర విద్యార్థిని, ఉషశ్రీ బదరీలో (ఒక ఆరునెలలు) జపం చేసుకునే అవకాశం పొందాము. అప్పుడు అమ్మగారనుగ్రహించిన ఈ 5 పాయింట్స్ త్రికరణ శుద్ధిగా పాటించే అవకాశం లభించింది. తద్వారా ఏమాత్రం నిలకడ లేని నాకు జపంలోఎక్కువ సేపు కూర్చోగలిగే స్థిరచిత్తం అలవడింది. జప విధానం, మంత్రం అన్నీ ఆచార్యులనుగ్రహించినా, కుదురులేని నన్ను జపంలో కూర్చోగలిగేట్టు చేసింది మాత్రము అమ్మగారి మార్గనిర్దేశమే. ఇది ఈ నాటి వేగవంతమైన జీవనానికి కొంచెం కష్టసాధ్యమే కానీ సాధకులకి అసాధ్యం కారాదు. ఇది చదివే అమెరికా ఆత్మ బంధువులకి అర్థమవుతుంది కదూ! పెరుమాళ్‌కి రేపటికి ఏమిసిద్ధం చేయమంటారు అని పాపం ఎంతో ఆత్మీయంగా అడిగితే, రేపటి సంగతి రేపే పెరుమాళ్ చెప్తాడని, వంట చేసేటప్పుడు ఎవ్వరూ ఉండద్దని దాసురాలు ఎందుకు విసిగిస్తుందో!

ఇక ఒక సుహృత్‌లా మనసు పంచుకున్న అమ్మగారిలో ఒక పరిపూర్ణ స్త్రీ మూర్తిని సేవించాను. అచ్చమైన

**భర్తవాల్లభ్యమే తనకు ధారకంగా కుటుంబానికంతటికీ ఆధారమై పోషణ కల్పించేది తల్లి!**



ప్రేమ ఎలా ఉంటుందో తెలిసి వచ్చింది. అమ్మగారికి 14వ ఏట వివాహమై 30సం.ల వయసులోపే భర్తని కోల్పోవడంతో... ఉన్న కొద్ది సంవత్సరాలలో పొందిన ఆనందక్షణాల కన్నా బాధావీచికలే ఎన్నెన్నో ఉన్నాయి. అయినా అమ్మగారికి వారి శ్రీవారి పట్ల ఉన్న ప్రేమ... ప్రతి సంవత్సరం వారు పరమపదించిన రోజు శ్రద్ధతో కార్యక్రమం జరిపించడానికి ఆమె పడే తాపత్రయం విస్మయం కల్గిస్తాయి.

ఇక కలిసి ఉన్న రోజుల్లో వారి శ్రీవారి జ్ఞాపకాలని పంచని సందర్భమే లేదంటే అతిశయోక్తి కాదు. నేటి రోజుల్లో out of sight out of mind అన్నట్లుగా జీవితాలని విడదీసుకుంటున్న, కాస్త కోపంతో ఊ అన్నా, ఆ అన్నా బంధాలు తెంపేసుకుంటున్న వారందరికీ ఆమె ఆదర్శం కాగలదు. పొందిన ప్రేమపూరిత అనుభవాలు కొన్నే అయినా, విధివశాన కల్గిన ఎడబాటు మొదలు తుది శ్వాస దాకా ఆప్రేమనే తలచుకుంటూ, ఆ భావనలే ఆధారంగా అన్నేళ్ళు ఒంటరి పోరాటం చేస్తూ ఆప్రేమ ఫలాలని రక్షించి పోషించుకున్న పరిపూర్ణ స్త్రీమూర్తి అమ్మగారు.

ఇక ఒక హితైషిగా శ్రీస్వామివారి ఆజ్ఞ మేరకు అమెరికా వెళ్ళే ప్రతిసారి ఆలింగనపూర్వక ఆశ్వాసన కల్పిస్తూ.. ఆదరణతో ఎన్నో జాగ్రత్తలు చెప్పేవారు. ఇలా.ఎన్నెన్నో... జ్ఞాపకాలు.. ఆతల్లి ఆదరణలో..

ఎప్పుడైనా కోప్పడినా.. ఆచార్యకైంకర్యంలో దోషాలు జరగకుండా సరిచేయడానికి మాత్రమే అన్నది ప్రతి ఒక్కరికీ తెలుసు! ఇది అమ్మపెట్టేరెండింటిలో ఒక పార్శ్వమే అని రెండవదానికి సిద్ధమై పోయేవాళ్ళం! అదేనండీ! అమృత ప్రాయమైన అమ్మగారు కలిపి పెట్టే కై ప్రసాదం కోసం. మీకు పెడితే మీ స్వామివారికి పెట్టినట్లేనమ్రా అని ఆర్ద్ర హృదయంతో ఆమె పెడుతుంటే పొందిన రసాస్వాదన అనిర్వచనీయం. అది అమ్మగారి సాధన, ప్రేమ కలిపి పంచే రుచి అనితర సాధ్యం!

ఒకసారి ఆరుచి మనకెందుకు రాదు అనుకుంటే, ఉష్శ్రీ అమ్మగారి ఆవకాయ రుచే వేరు అది మనకిరాదు అంది. అమ్మగారినే అడిగి ఆవకాయ తీసుకొని వేడి వేడి అన్నం తెచ్చి అమ్మవేసినట్లే నెయ్యిపోసి కలిపి, నా పెరుమాళ్ళకి, ఆరాధనలో వేంచేపుచేసుకున్న మన ఆచార్యులవారికి ఆరగింపు చేస్తూ అమ్మ మీకిలా పెట్టాలన్న తపన పడుతున్నారు స్వామీ అని సమర్పించాను. శ్రీస్వామివారు ఆ చిత్రంలోనుండే ఒక చిన్న చిరునవ్వు నవ్వినట్లన్పించింది. తీరా ప్రసాదం రుచి చూస్తే అద్భుతంగానే ఉంది, కానీ....., అమ్మగారి చేతిరుచి రాలేదు. ఆశ్చర్యం వేసింది. అవగతమైంది ఇంతమంది వ్రాసినట్లుగ, అమ్మగారి ప్రసాదాల రుచికి కారణం secret ingredients ఆ తల్లి సాధన, పదిమందికి పెట్టాలన్న అన్నపూర్ణ ప్రేమ. ఇవి అనితర సాధ్యాలు సుమా... ఇంకా ఎన్నెన్నో.. జ్ఞాపకాలు, మరొక అవకాశం తీసుకుని పంచుకుందాం...

అమృతమూర్తియైన ఆచార్యులననుగ్రహించిన అమ్మగారికి అనేక ప్రణామాంజలులతో...

అమ్మపై ఆర్తితో తప్త హృదయులైన ఆచార్యులకి సాంత్వన పూర్వక దాసోహము సమర్పిస్తూ...

ప్రపన్న వైశారదీ
శారదా రామానుజదాసి,
తత్త్వశాస్త్ర విద్యార్థిని

❖❖❖❖❖❖

**అమ్మ ప్రేమను పొందినవారికే అచ్చమైన ప్రేమలోని మాధుర్యం, త్యాగం అర్థమయ్యేది!**





**శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామివారిని సేవించిన**
**ఆనందంతో 85వ పడిలో ప్రవేశించిన**
**అమ్మగారి జన్మదిన వేడుకలు**



ఆచార్యుని అనుగ్రహంతో...



85వ జన్మదిన వేడుకలు



**తనయలే తల్లులై**
**అమ్మని పసిపాపని చేసి జరిపిన**
**చివరి పుట్టినరోజు వేడుకలు**
**8.9.2020**



క్షమించడంలో అమ్మకు మించినవారు లేరు.





పరమాత్ముని సన్నిధినుండి శ్రీరామానుజ సహస్రాబ్ది పనులు పర్యవేక్షించి, వేగంగా జరిపింప దివికేగిన అమ్మగారి - శ్రీమతి అలివేలుమంగతాయార్ల

# పరమపదోత్సవము



శ్రీమత్ పరమహంస పరివ్రాజకులు, ఉభయవేదాంత ప్రవర్తకులు, సత్య సంకల్పులు అయిన శ్రీ పెద్ద జీయర్‌స్వామివారి శ్రీచరణ సంబంధాన్ని, వారి పూర్వాశ్రమంలో వంశ సంబంధాన్ని కూడా పొందిన శ్రీమతి అలివేలుమంగ తాయార్, మనందరి ఆచార్యచరణులైన శ్రీ చిన్న జీయర్ స్వామివారి మాతృమూర్తి 11వ తేదీన నిర్మల చిత్తంతో వారి కుటుంబ సభ్యులను దుఃఖ సాగరంలో నిలిపి ఆచార్య సన్నిధానాన్ని చేరుకున్నారు.

4వ తేదీ శ్రీస్వామివారు, అమ్మగారిని సేవించుకొన్నారు. 7వ తేదీ భాద్రపద భరణీ నక్షత్రం. అమ్మగారి 85వ తిరునక్షత్రం మన జీవా నుండి వారితో సాన్నిహిత్యం కల కుమారి కల్పన, శ్రీమతి కృష్ణకుమారి మొదలైన వారందరూ వెళ్ళి ఉత్సాహంగా ఈ వేడుకలతో ఆమెను ఆనందింపచేశారు. చిన్న కిరీటం కూడా పెట్టి సంతోషింపచేశారు.



10వ తేదీ శ్రీజయంతి – కృష్ణాష్టమి ఉత్సవాన్ని కూడా సేవించుకొన్నారు. 11వ తేదీ రాత్రి 10.30 గంటలకు తమ కుమార్తె శ్రీమతి తాయార్‌గారి భవనంలో అనాయాసంగా ఆచార్యచరణ సన్నిధికి చేరారు. అమ్మగారికి జరగవలసిన అన్ని కార్యక్రమాలు, శ్రీస్వామివారి నిర్దేశంతో విధిగా జరిగాయి. ఈ విషయాన్ని శ్రీస్వామివారు మంగళాశాసన సందేశంలో ఈ సంచికా రంభంలోనే సంగ్రహంగా వివరించారు.

శ్రీమాన్ డా. రామేశ్వరరావుగారు మొదటి నుండి తాము పెద్ద కుమారుడా అన్నట్లు నిలబడి అమ్మగారి కార్యక్రమాలకు కావలసిన ఏర్పాట్లన్నీ చేశారు. అమ్మగారి విషయంలో సకుటుంబంగా వారుచూపిన శ్రద్ధ, వారు చేసిన వ్యవస్థ, అమ్మగారి పట్ల వారికున్న ఆరాధ్యభావం కార్యరూపంలో కనిపించింది.

శ్రీస్వామివారి మార్గదర్శనంలో – అమ్మగారి చిన్న కుమారులు, బెంగుళూరు నుండి వచ్చిన శ్రీమాన్ మంగయాచార్యస్వామి, అన్ని కార్యక్రమాలను ఓపికగా, చాలా శ్రద్ధగా నిర్వహించారు. శ్రీ అమ్మగారి కుటుంబ సభ్యులందరూ కార్యక్రమంలో మంగయాచార్యులుగారికి పూర్తిగా చేదోడు వాదోడుగా ఉండి తమ తమ శ్రద్ధను, నిష్ఠను కూడా కార్యరూపంలో చూపారు. పురోహితులైన శ్రీమాన్ సామంతాచార్యులు, శిష్టులైన పెద్దలందరూ మెచ్చుకొనేలా విధానాన్ని పూర్తిగా పాటిస్తూ మంచి నైపుణ్యంతో అమ్మగారి 13 రోజుల కార్యక్రమాన్ని చేయించి శ్రీస్వామివారి అనుగ్రహానికి పాత్రులయ్యారు.

23వ తేదీ 13వ రోజున తమిళనాడులోని దివ్యదేశాలలో, మన పెద్ద స్వామివారితో ప్రారంభమై శ్రీ చిన్న జీయర్‌స్వామివారి ద్వారా వర్ధమానమైన అన్ని మఠాలలోను, ఆలయాలలోను స్వాములకు అత్యద్భుతంగా తదీయారాధనలు జరిగాయి. భాగ్యనగరం చుట్టూ ఉండే అన్ని వైష్ణవాలయాలలో కూడా తదీయారాధనలు జరిగాయి. శ్రీమాన్ శ్రీధరాచార్య (వాసుస్వామి), శ్రీమాన్ ప్రహ్లాదాచార్యస్వామి, అపోలో భట్టర్‌స్వామి ప్రభృతులు తమ బృందాన్ని సహాయంగా తీసుకొని ఈ తదీయారాధన కార్యక్రమాన్ని శ్రద్ధతో జరిపించారు.

మన చెన్నై జెట్‌వారు దివ్యదేశాలలో వస్త్ర దానం, తదీయారాధన జరిగే వ్యవస్థ చేశారు. శ్రీఅమ్మగారి విషయంలో గౌరవంతో ఎంతోమంది మహానుభావులు, ఆయా క్షేత్రాలలో స్వతఃస్ఫూర్తంగా తదీయారాధనా కార్యక్రమాన్ని ప్రేమతో జరిపారు. శ్రీస్వామివారి రథసారథి, శ్రీమాన్ వేణుగోపాల్‌స్వామి ఉత్తరం, దక్షిణం నేపాల్ అంతటా పరిచయం ఉన్న మహనీయులు. ఆన్‌లైన్‌లో ధనాన్ని పంపించి ఆయా క్షేత్రాలలో వారు, అమ్మగారి పేరుతో తదీయారాధన చేయించారు. కార్యక్రమానికి భోక్తలను ఋగ్వేద ఘనపాఠి శ్రీమాన్ సందుగుల రాఘవాచార్యస్వామి, శ్రీస్వామివారి ఆజ్ఞతో ఆహ్వానించారు.

అమ్మగారి కర్మను నిర్వహించిన కుమారులు శ్రీమాన్ మంగయాచార్య స్వామి, అమ్మగారి మనుమలు శ్రీమాన్ టి.ఎస్. కృష్ణమాచార్యులు, చి.విష్ణుచిత్తన్, పురోహితులు శ్రీమాన్ సామంతాచార్యస్వామి గోదావరి, కృష్ణా, కావేరి, ప్రయాగరాజలో త్రివేణీ సంగమానికి వెళ్ళి అస్థి నిమజ్జన కార్యక్రమాన్ని శ్రద్ధగా నిర్వహించారు.

9వ రోజు ఆమశ్రాద్ధంలో యోగ్యులైన ఆరుగురు స్వాములు పాల్గొన్నారు. వారందరినీ వెండి గ్లాసు, చెంబులు, వస్త్రాలతో సంభావించారు.

**ఆమశ్రాద్ధం : 6 గురు స్వాములు**

1. శ్రీమాన్ నేపాల్ కృష్ణమాచార్యులు
2. శ్రీమాన్ వంగీపురం సామంతాచార్యులు
3. శ్రీమాన్ మరింగంటి గోవర్ధనాచార్యులు
4. శ్రీమాన్ ఆరవెల్లి పవన్ కుమారాచార్యులు
5. శ్రీమాన్ ఉపేంద్రాచార్యులు
6. శ్రీమాన్ మిథిలేశ్ తివారీ

10వ రోజు బంధువులు, జ్ఞాతులు, ఆప్తులందరూ అమ్మగారి పేరుతో ధర్మోదకాలను సమర్పించారు.

ఆగామి సంచిత కర్మలు ఆచార్య కృపవల్ల నశిస్తాయి.



11వ దినాన ఏలూరు నుండి వేంచేసిన శ్రీమాన్ ఈ.రామానుజాచార్యస్వామి ఏకోద్దిష్ట కార్యక్రమం జరిగింది.

23వ తేదీన 12వ రోజు షోడశ – సపిండీకరణ కార్యక్రమంలో 16 మంది స్వాములలో 15 మంది స్వాములు ఋగ్వేదీయులే అన్వయించారు. అంతా వైదిక స్వరూపాన్ని పాటిస్తూన్న మహనీయులు. భోక్తలుగా పాల్గొన్న మరొక ఏడుగురు స్వాములు కూడా చక్కటి వైదిక మార్గాన్ని అనుసరిస్తున్న మహనీయులు. వీరందరికీ వెండి చెంబులు, గ్లాసులు, వస్త్రాదుల నర్పించారు.

**షోడశం : 16 మంది స్వాములు**

1. శ్రీమాన్ ఓలేటి వంశీకృష్ణమాచార్యులు – ఋగ్వేది
2. శ్రీమాన్ ఓలేటి గీతాచార్యులు – ఋగ్వేది
3. శ్రీమాన్ ఓలేటి యాదగిరి ఆచార్యులు – ఋగ్వేది
4. శ్రీమాన్ ఓలేటి శ్రీనివాసాచార్యులు – ఋగ్వేది
5. శ్రీమాన్ సందుగుల లక్ష్మణాచార్యులు – ఋగ్వేది
6. శ్రీమాన్ సందుగుల అజయ్‌కుమారాచార్యులు – ఋగ్వేది
7. శ్రీమాన్ సందుగుల వేణుగోపాలాచార్యులు – ఋగ్వేది
8. శ్రీమాన్ ఎన్.సిహెచ్. లక్ష్మణాచార్యులు – యజుర్వేది
9. శ్రీమాన్ ఫణిహారం శ్రీకాంతాచార్యులు – ఋగ్వేది
10. శ్రీమాన్ కొదమసింహం భరద్వాజాచార్యులు – యజుర్వేది
11. శ్రీమాన్ సందుగుల లక్ష్మణాచార్యులు – ఋగ్వేది
12. శ్రీమాన్ దరిపల్లి రఘురామాచార్యులు – ఋగ్వేది
13. శ్రీమాన్ సందుగుల రామాచార్యులు – ఋగ్వేది
14. శ్రీమాన్ సందుగుల లక్ష్మణాచార్యులు – ఋగ్వేది
15. శ్రీమాన్ సందుగుల కృష్ణమాచార్యులు – ఋగ్వేది
16. శ్రీమాన్ కలకోట వేణుగోపాలాచార్యులు – యజుర్వేది

**సపిండీకరణము : 7 గురు స్వాములు**

1. శ్రీమాన్ మరింగంటి గోవర్ధనాచార్యులు – యజుర్వేది
2. శ్రీమాన్ సౌమిత్రి ప్రణయాచార్యులు – యజుర్వేది
3. శ్రీమాన్ సముద్రాల భరద్వాజాచార్యులు – యజుర్వేది
4. శ్రీమాన్ డింగరి శ్రీరామాచార్యులు – యజుర్వేది
5. శ్రీమాన్ అమరవాది వేణుమనోహరాచార్యులు – ఋగ్వేది
6. శ్రీమాన్ ముడుంబై శ్రీకాంతాచార్యులు – యజుర్వేది
7. శ్రీమాన్ సందుగుల శ్రీనివాసాచార్యులు – ఋగ్వేది

**దశదానములు : 10 మంది స్వాములు**

1. శ్రీమాన్ ముడుంబై శ్రీనివాస భట్టరాచార్యులు
2. శ్రీమాన్ సౌమిత్రి శ్రీధరాచార్యులు (వాసు)
3. శ్రీమాన్ ముడుంబై యశ్వంత్
4. శ్రీమాన్ రాచకొండ సుదర్శనాచార్యులు

జీవుడు పరమాత్మను చేరేదాకానే శాస్త్రం తర్వాత దానితో పని లేదు.



5. శ్రీమాన్ జాతవరం విష్ణు
6. శ్రీమాన్ ముడుంబై కృష్ణమాచార్యులు
7. శ్రీమాన్ కె. సి. భూపతి
8. శ్రీమాన్ పొడిచేటి శ్రీనాథాచార్యులు
9. శ్రీమాన్ కృష్ణమాచార్యులు (అన్నవరం)
10. శ్రీమాన్ ఏ. సచిన్ శ్రీనివాస్

**సోదకుంభదానం**

శ్రీమాన్ రేజేటి సుదర్శనాచార్యులు

12వ రోజున వైదికంగా అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి, అమ్మగారి కుటుంబసభ్యులకు వైదికాశీర్వచనం చేశారు వేదపండితులు స్వాములు. ఆయుర్వేదాలయంలోనే ఈ కార్యక్రమాలు జరిగాయి. చివరకు పుణ్యాహవాచనంతో స్థానశుద్ధి చేశారు. పురోహితులవారి సమ్మానంతో ఈ కార్యక్రమం పూర్తయింది. దైహికంగా అమ్మగారికి జరుపవలసిన కర్మకాండను పెద్దలు, శ్రీస్వామివారి సమక్షంలో శ్రద్ధగా జరిపించారు.



12వ రోజు సాయంకాలం అంటే 22వ తేదీ నాడు కార్యక్రమాన్ని నిష్ఠతో నిర్వహించిన పురోహితులు, శ్రీమాన్ సామంతాచార్యస్వామికి శిష్యులైన పెద్దల సమక్షంలో సమ్మానం చేసి శ్రీస్వామివారు, కృతజ్ఞతను తెలియజేస్తూ మంగళాశాసనం చేశారు.

22వ తేదీ సాయంకాలం 6 గంటల తరువాత దివ్యసాకేత ఆలయంలో శ్రీస్వామివారి పర్యవేక్షణలో లాంఛనంగా శ్రీఅమ్మగారి పరమపదోత్సవం, నారాయణోపనిషత్ అనుసంధాన పూర్వకంగా ప్రారంభమైంది. శ్రీస్వామివారి వేద విశ్వవిద్యాలయం సీతానగరంలో ఉండి వేదాలలోని విభిన్న శాఖలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆయా దివ్యక్షేత్రాలలో వాచిక సేవలందిస్తున్న వేద పండితులు, ఈ అమ్మగారి పరమపదోత్సవంలో పాల్గొన్నారు. ఇతిహాస పురాణ-ఆగమాది గ్రంథాలను పారాయణ చేయడానికి భాగ్యనగరం, వరంగల్ ప్రాంతాలనుండి స్వాములు వేంచేశారు.

దివ్యప్రబంధ సేవాకాలానికి శ్రీస్వామివారి ఆజ్ఞ ప్రకారం, విభిన్న దివ్యదేశాలనుండి శ్రీమాన్ తిరుక్కోట్టియూర్ మాధవన్‌స్వామి, యోగ్యులైన 12 మంది స్వాములను వేంచేపుచేసుకొచ్చారు. పారాయణపరులైన యోగ్య పండితులను గుర్తించి ఆహ్వానించడంలో మన స్వామివారి పాఠశాలలో అధ్యయనం చేసిన ఋగ్వేదం ఘనపాఠి రాఘవాచార్యులుగారు, దివ్యసాకేతాలయ ప్రధానార్చకులు శ్రీమాన్ రఘుదత్తుస్వామి, ఆగమపండితులు శ్రీమాన్ ముడుంబై మధుసూదనాచార్యస్వామి, అథర్వవేద విద్వాంసులు శ్రీమాన్ ప్రహ్లాదాచార్య స్వామి లాంటి పెద్దలు శ్రద్ధతో బాధ్యతను వహించారు. అమ్మగారి ఉత్సవంలో వందలమంది యోగ్యులైన స్వాములు, తమ తమ వాచిక సేవలను అర్పించారు. ఆయా గ్రంథాలను విభాగంచేసి పూర్తయ్యేలాగా పారాయణ క్రమాన్ని శ్రీస్వామివారు వ్యవస్థీకరించారు.

23వ తేదీ ఉదయం ఆలయంలో శాత్తుముఱై పూర్తయ్యాక 9 గంటలకు దివ్యసాకేత పెరుమాళ్ళు, శ్రీస్వామివారి ఆరాధ్య పెరుమాళ్ళు కూడా ఛత్ర చామరాది ఉపచారాలతో భాగవతగోష్ఠితో కలిసి దివ్యసాకేత మండపానికి వేంచేశారు. పరమపదోత్సవ కార్యక్రమాన్ని స్వాములకు, భక్తజనానికీ శ్రీస్వామివారు వివరించారు. అన్ని గ్రంథాల విన్నపాలు పెరుమాళ్ళ సన్నిధిలో జరిగాయి.





ఆ తరువాత స్వాములు, దివ్యసాకేత ఆలయంలోని మూడు అంతస్తులలో విభాగం చేసి పారాయణ ప్రారంభించారు.

దివ్యసాకేత రాముని సన్నిధిలో వేదాలలోని ఏడు శాఖలు– ఋగ్వేదం, శుక్ల యజుర్వేదంలోని కాణ్వ– మాధ్యందిన శాఖలు, కృష్ణ యజుర్వేదంలో – మైత్రాయణి, తైత్తిరీయ శాఖలు, సామవేదంలోని కౌథుమశాఖ, అథర్వవేదంలో శౌనకశాఖ పారాయణలను, బృందం బృందంగా కూర్చొని మన స్వామివారి పాఠశాలలో అధ్యయనం చేసిన వేదవిద్వాంసులు శ్రద్ధతో కమనీయకంఠంతో శ్రావ్యంగా పెరుమాళ్ళకు విన్నవించారు. రెండవ అంతస్తులో శ్రీరంగనాథుని సన్నిధిలో– ఇతిహాస పురాణాది గ్రంథపారాయణ సాగింది. మూడవ అంతస్తు శ్రీవైకుంఠనాథ పెరుమాళ్ళ సన్నిధిలో దివ్యప్రబంధంలోని **3000** వేల పాశురాల ప్రబంధాన్ని స్వాములు, వీనుల విందుగా గానం చేశారు.

నాలుగవ ఆయిరం నమ్మాళ్వారుల తిరువాయ్‌మొజి ప్రబంధాన్ని దివ్యసాకేత మండపంలో శ్రీవారి పెరుమాళ్ళ సన్నిధిలో కొంతమంది స్వాములు, మధురకంఠంతో గానం చేశారు. ఇలాగా **23, 24** తేదీలలో ఒకే క్రమంలో కార్యక్రమం ఏ లోటూలేకుండా జరిగింది.



### 'శ్రీసుదర్శనార్చన' సి.డి. ఆవిష్కరణ

శ్రీతాళ్ళపాక అన్నమాచార్యులవారి పెద్ద కుమారులు శ్రీ పెద్ద తిరుమలాచార్యులు రచించిన 'శ్రీసుదర్శనార్చన' అనే పాటని శ్రీమాన్ పవన్‌గారు నృత్య రూపంలో అందంగా కూర్చారు. ఈ సి.డిని శ్రీస్వామివారు ఆవిష్కరించి వారికి మంగళాశాసనం చేశారు.






**ప్రవచనాలు - అమ్మగారిని గురించిన అనుభవాలు**

ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటలవరకు పరమపూజ్యులైన ఆరుగురు జీయర్‌స్వాములు, పండితోత్తములైన పెద్దలు అర్చిరాది మార్గాన్ని, అమ్మగారి వ్యక్తిత్వాన్ని ఉద్దేశించి ప్రవచించారు. సాయంకాలం 5 గంటలనుండి భాగవతోత్తములు, పెద్దలు, అమ్మగారిని గురించిన తమ తమ మధురాను భూతులను పంచుకొన్నారు.

25 తేదీ పరమపదోత్సవానికి ప్రధానమైన దినం. ఉదయం ఆలయంలో గోష్ఠి పూర్తయిన తరువాత 10 గంటలకు స్వాములందరూ తమ తమ పారాయణలను సుసంపన్నం చేసుకొన్నారు.

**ఇయల్ గోష్ఠి**

స్వాములందరూ క్రమబద్ధంగా ఏడుగురు ఒక పంక్తిలో ఉండేలాగ కరోనాను గుర్తిస్తూ వైయక్తిక శౌచాన్ని పాటిస్తూ ఇయల్‌గోష్ఠికి చెరకుగడలను తీసుకొని వేద పండితులు, దివ్యప్రబంధ అధ్యాపకులు, జీవా గురుకుల విద్యార్థులు, అందరికీ మార్గదర్శులుగా సప్తర్షులు లాగా ఏడుగురు జీయర్‌స్వాములు-

1. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామివారు
2. శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్‌స్వామివారు
3. శ్రీశ్రీశ్రీ అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామివారు
4. శ్రీశ్రీశ్రీ వ్రతధర రామానుజ జీయర్‌స్వామివారు
5. శ్రీశ్రీశ్రీ అహోబిల రామానుజ జీయర్‌స్వామివారు
6. శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్‌స్వామివారు
7. శ్రీశ్రీశ్రీ విల్లిపుత్తూర్ శఠకోప రామానుజ జీయర్‌స్వామివారు

"రామానుజనూత్తందాది"ని అనుసంధానం చేస్తూ దివ్యసాకేత బాహ్యవీథిలో పరిక్రమణగా ముందు నడిచారు. ఆ తరువాత దివ్యప్రబంధ అధ్యాపకులు, క్రమబద్ధంగా 'రామానుజ నూత్తందాది'నే సామూహికంగా ఏకకంఠంగా అనుసంధానం చేస్తూ నడచారు. వారి వెనుక పంక్తి బద్ధంగా వేదపండితులు, వేద పారాయణ చేస్తూ గోష్ఠిలో పాల్గొన్నారు. ఆ వెనుక పంక్తులలో భగవన్నామ సంకీర్తన చేస్తూ శ్రద్ధాళువులైన భాగవతోత్తములు, వైకుంఠయాత్రోత్సవపు ఇయల్‌గోష్ఠిలో సహభాగులయ్యారు. ఆలయపు నాలుగు ద్వారాలలో కూడా స్వాములకు పాదప్రక్షాళన-మంగళహారతులు జరిగాయి. తూర్పు ద్వారంనుండి ఆలయం లోపలికి ప్రవేశించారు. ఆలయ పరిక్రమణచేసి సాకేతరాముని సన్నిధిలో పెరుమాళ్ళకు హారతిని సమర్పించారు.

ఆ తరువాత అదేక్రమంలో శ్రీరంగనాథుడి సన్నిధిలో, అలానే శ్రీవైకుంఠనాథుని సన్నిధిలో కూడా పెరుమాళ్ళకు మంగళహారతిని సమర్పించి 'శ్రీరామానుజనూత్తందాది' ప్రబంధాన్నే అనుసంధానం చేస్తూ క్రమబద్ధంగా దివ్యసాకేత మండపంలోని పూర్వద్వారానికి

యోని జన్మ క్షణికం జ్ఞాన జన్మ శాశ్వాత పథం చేరుస్తుంది.



విచ్చేశారు. అక్కడ స్వాములకు పాదప్రక్షాళన, రామానుజనూత్తందాది ఇయల్ శాత్తుముత్తై, పరమార్థశ్లోక ద్వయ అనుసంధానం చేసుకొని సాకేత మండపంలోపలికి ప్రవేశించారు.

వేద-ఇతిహాస పురాణాది గ్రంథశాత్తుముత్తై, పారాయణపరులైన పండితులకు సమ్మానం, దివ్యదేశపు మాలలు, శేషవస్త్రాలు, పెరుమాళ్ళకు సమర్పించి అమ్మగారి చిత్రపటానికి పెరుమాళ్ళ అనుగ్రహంగా సమర్పించారు.

అమ్మగారి విషయంలో నేపాల్ కృష్ణమాచార్యులుగారు కూర్చిన చరమ శ్లోకమాలికను శ్రీస్వామివారు అందరిచేత అనుసంధింపచేశారు. ఇయల్ గోష్ఠి ప్రారంభంలో వైకుంఠోత్సవ వైభవాన్ని, పరమపదంలో నిత్యముక్తులు, అర్చిరాది మార్గంగా వెళ్ళిన ముక్తజీవుడిని ఎలా సమ్మానిస్తారో? ఉపనిషత్తులు ఎలా వర్ణిస్తున్నాయో? తెలుగులోను, హిందీలోను శ్రీస్వామివారు వివరించారు.

అనంతరం శ్రీమాన్ తారకరామారావుగారు గానం, సంగీత సారథ్యంలో శ్రీశ్రీశ్రీ అహోబిల రామానుజ జీయర్‌స్వామివారు, భద్రాచలం శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యస్వామి, శ్రీమాన్ డా.అద్దంకి శ్రీనివాస్‌గారు రచించిన 'జయమని పాడరే అలివేలమ్మకు' సి.డి ని శ్రీస్వామివారు ఆవిష్కరించారు.

ఆ తరువాత ప్రపన్నవైశారదిగారి సంపాదకత్వంలో అనేక మంది పెద్దలు, పిన్నలు అమ్మగారితో వారికున్న అనుభవాలతో కూర్చిన 'మాతృసవనము' అనే సావనీర్‌ని శ్రీస్వామివారు ఆవిష్కరించి డా. రామేశ్వరరావు దంపతులకి మొదటి ప్రతినిచ్చారు. అనంతరం శాత్తుముత్తై పూర్తయ్యాక తదీయారాధన కార్యక్రమం జరిగింది.

### పండితులకు వసతులు

శ్రీమాన్ సూర్యనారాయణ దంపతులు, శ్రీమాన్ రవి-కిరణ్మయి దంపతులు, శ్రీమాన్ మోహన్‌రావు దంపతులు అలానే మన గురుకుల పాత విద్యార్థులు, విశేషించి పరమపదోత్సవంలో పాల్గొన్న వేద-దివ్యప్రబంధాది పారాయణ కైంకర్యంలో పాల్గొన్నవారికి జీవా గురుకుల భవనంలో అన్ని సౌకర్యాలతో తగిన ఏర్పాట్లను, తదీయారాధనను వారికర్పించి ధన్యులయ్యారు.

అమ్మగారి కుటుంబసభ్యులు అందరున్ను, చక్కటి మడికట్టుకొని భాగవతోత్తములకు తదీయారాధనలో ప్రసాదవితరణం చేశారు. మన వికాసతరంగిణివారు, శ్రీమాన్ భవానీప్రసాద్ నేతృత్వంలో, వచ్చిన అతిథులకు, శ్రీరామానుజ సహస్రాబ్ది, జీవా కార్యకర్తలందరికీ శ్రద్ధతో తదీయారాధనను అందజేశారు. దివ్యసాకేత అర్చకవర్గం, జీవా అధికారులు, సీతానగరం, జీవా గురుకుల అధ్యాపకులు, విద్యార్థులు తమ తమ స్థానాల నుండి అందరూ శ్రద్ధతో సముచిత సేవలనందిచారు.

మన జీయర్ సంస్థలకు హితైషులైన శ్రీమాన్ డా. రామేశ్వరరావుగారి కుటుంబం, శ్రీమతి వసుమతీభాస్కరరావు, శ్రీమతి వనజాభాస్కరరావు, చెన్నై జెట్ వికాసతరంగిణివారు, శ్రీస్వామివారి అభిమానులు, శిష్యులు ఇలా ఎంతోమంది ఉదారులైన మహానుభావులు, పరోక్షంగాను, ప్రత్యక్షంగాను ఇది మా సొంత కార్యక్రమం అనే భావంతో కార్యక్రమాన్ని అభూతపూర్వ వైభవంగా నడిపించారు. అమ్మగారిపట్ల, అకృత్రిమమైన సేవలను అందించిన మహానుభావులలోని హృదయ వైశాల్యం ప్రత్యక్షంగా కనిపించింది.

ఇదంతా భగవద్రామానుజుల సంబంధ ప్రభావం కదా!!

మన జగదాచార్యులైన శ్రీ చిన్న జీయర్‌స్వామివారు, ప్రతిదినం కార్యక్రమ సమాపన సందర్భంలో, వేంచేసి ఉండి కార్యక్రమాన్ని వైభవంగా నడిపించిన పరమహంస పరివ్రాజకులైన జీయర్ స్వాములకు, పారాయణపరులైన పండితోత్తములకు, మార్గదర్శకులైన మహామహోపాధ్యయ శ్రీమాన్ డా. సముద్రాల వేంకట రంగరామానుజాచార్యస్వామివారికి, అన్ని కోణాలనుండి సేవలనందించిన భాగవతోత్తములకు, ఛాత్ర బృందానికి, కార్యక్రమాన్ని తిలకించి పులకరించిన శ్రద్ధాలువులకు కృతజ్ఞతను తెలియచేశారు. డా.రామేశ్వరరావు గారు, అమ్మగారికి జ్యేష్ఠ పుత్రులు లాగా ఉండి అన్నింటినీ నడిపించారు. సంస్థకు వారు మొదటినుండి సమర్పించిన సేవలకు అవధి లేదు. వారికి కృతజ్ఞత చెప్పడానికి కూడా శబ్దాలు చాలవు అని వారి నిష్కల్మష సంప్రదాయ నిష్ఠను శ్రీస్వామివారు గుర్తుచేసుకొన్నారు.





ఋగ్వేదము



శుక్ల యజుర్వేదము - కాణ్వశాఖ

# వేద విన్నపాలు



మాధ్యందిన శాఖ



మైత్రాయణీ శాఖ




తైత్తిరీయ శాఖ

మోక్షము తప్పదనే నిశ్చయంతో ఉండండి.




సామవేదము



అధర్వవేదము


భగవచ్ఛాస్త్రము


శ్రీరామాయణము

# వేద - ఇతిహాస విన్నపాలు


శ్రీవిష్ణుపురాణము


శ్రీమద్భాగవతము


శ్రీవేంకటాచల మాహాత్మ్యము


వేదార్థ సంగ్రహము

నారాయణుడు ఒక్కడే రక్షకుడని నమ్మి ఆశ్రయించాలి.




శ్రీభాష్యము


గీతాభాష్యము


గద్యత్రయము


# స్తోత్ర - నాలాయిర దివ్య ప్రబంధ విన్నపాలు


శ్రీసుదర్శన శతకము


శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రము


నాలాయిర దివ్యప్రబంధము





ఇయల్ గోష్ఠికి ముందు స్వాములకు మాలధారణ

# ఇయల్ గోష్ఠి



ఇయల్ గోష్ఠికి చెరకు గడలతో స్వాములు



ఇయల్ గోష్ఠికి బయలుదేరుతున్న శ్రీస్వామివారితో
శ్రీమాన్ మంగయాచార్యులుగారు



పాదప్రక్షాళన



పాదప్రక్షాళన చేస్తున్న శ్రీమాన్ శ్రీకుమారి, రామేశ్వరరావుగార్లు

జీవులంతా జ్ఞానం కలవారే.



సంచరించే ఇక్షువనమా?

# ఇయల్ గోష్ఠి



పాదప్రక్షాళన సమర్పిస్తున్న శ్రీమాన్ మంగయాచార్య దంపతులు



శాత్తుముఱై



శ్రీమాన్ మంగయాచార్యులుగారికి సత్కారం



శ్రీమాన్ వేణుస్వామికి సత్కారం

భగవంతుణ్ణి చేరాలంటే పుణ్యపాపాలు రెండు అడ్డే! ఆయన తప్ప ఇవి ఎవరు తొలగించలేరు.





విచ్చేసిన జీయర్ స్వాములకు, సేవలందించినవారికి కృతజ్ఞతాపూర్వక మంగళాశాసనాలు చేస్తున్న శ్రీస్వామివారు



వేద పండితులను సత్కరిస్తున్న
శ్రీమాన్ శ్రీకుమార్, రామేశ్వరరావు గారు దంపతులు



'జయమని పలకరే అలివేలమ్మకు' సి.డి. ఆవిష్కరణ



మాతృసవనము పుస్తకావిష్కరణ



అమ్మగారి చిత్రపటాన్ని, శ్రీమతి విమలా భాస్కరరావుగారికి
అందిస్తున్న శ్రీస్వామివారు



అమ్మగారి బంధువర్గం, విచ్చేసిన భక్తులు



శ్రీమాన్ డా. రామేశ్వరరావు, శ్రీకుమారి గార్లకు
మంగళాశాసనం చేస్తున్న శ్రీస్వామివారు

భగవంతుని జన్మ కర్మ దివ్యమైనవి.





భక్త తదీయారాధన

అమ్మగారి కుటుంబసభ్యులు, శ్రద్ధగా అమ్మగారికి సమర్పించిన సేవలను శ్రీస్వామివారు ప్రస్తావించారు. "మహనీయులైన శ్రీ పెద్దజీయర్‌స్వామివారితో దైహికంగాను, పారమార్థికంగానూ రెండు సంబంధాలు అదృష్టవశాత్తు మీకు లభించాయి. సంప్రదాయాన్ని కాపాడుతూ సంతతని శ్రీభగవద్రామానుజ సిద్ధాంత సంరక్షకులుగా తయారు చేయండి" అని వారికి హితోపదేశం చేస్తూ అమ్మ, విషమ పరిస్థితులను కూడా తాము తట్టుకొని, ఆచార్యులను నమ్ముకొని నిష్ఠతో మనకు చూపిన మహోపకారాన్ని ముందుకు సాగించాలన్నారు. "అందరూ కలిసి ఈ వైకుంఠోత్సవాన్ని వైభవంగా జరిపించారు. మేం నిమిత్తమాత్రమే" అన్నారు శ్రీస్వామివారు. చివరగా "అమ్మగారి ఇష్టదైవం శ్రీశ్రీనివాసుడు. ఆ శ్రీనివాసుడి చలవవల్ల ఏ లోటూలేకుండా జరిగింది" అంటూ శ్రీశ్రీనివాసుడి అనుగ్రహాన్ని వారికి వస్త్రాది రూపంలో అందించారు.

జీవా గోశాల ఇన్‌ఛార్జ్ చిరంజీవి వీరబాబు ఈ 5 రోజుల కార్యక్రమాలలో గోవులకు చక్కటి గ్రాసాన్ని పెద్దల ద్వారా అందించాడు. ఇతనికి శ్రీస్వామివారు మంగళాశాసనం చేశారు.

## వేద-ఇతిహాస - పురాణ - ఆగమ- దివ్యప్రబంధ అనుసంధానంలో పాల్గొన్న మహనీయులు

### కౌషీతకీ ఉపనిషత్

1. ఉ.వే. శ్రీమాన్ డా. ఎస్. వి. రంగరామానుజాచార్యులు

### అర్చిరాది మార్గం

2. ఉ.వే. శ్రీమాన్ నేపాల్ కృష్ణమాచార్యులు

### ఋగ్వేదము

3. శ్రీమాన్ సందుగుల రాఘవాచార్యులు, సలక్షణ ఘనపాఠి
4. శ్రీమాన్ సందుగుల లక్ష్మణాచార్యులు
5. శ్రీమాన్ ముడుంబై శ్రీకాంతాచార్యులు
6. శ్రీమాన్ ఓలేటి వంశీకృష్ణమాచార్యులు
7. శ్రీమాన్ సందుగుల రామభద్రాచార్యులు

### శుక్ల యజుర్వేదం - కాణ్వశాఖ

8. శ్రీమాన్ ఆర్.వి. వరదన్‌స్వామి
9. శ్రీమాన్ మోదేకుర్తి సంతోష్‌కుమార్
10. శ్రీమాన్ కె. విష్ణువర్ధనాచార్యులు
11. శ్రీమాన్ పుష్పేంద్రాచార్యులు
12. శ్రీమాన్ కిడాంబి కృష్ణమాచార్యులు
13. శ్రీమాన్ ఉల్లంగంటి సురేశ్‌కుమార్
14. శ్రీమాన్ రష్మిరంజన్ మహాపాత్రో

### మాధ్యందిన శాఖ

15. శ్రీమాన్ అంకిత్ ఆచార్య
16. శ్రీమాన్ పునీత్, వారి విద్యార్థి బృందం

### మైత్రాయణీ శాఖ

17. శ్రీమాన్ కల్వకుంట్ల వరప్రసాదాచార్యులు
18. శ్రీమాన్ గోవర్ధనం రంగనాథాచార్యులు
19. శ్రీమాన్ గణదలం అనంతశయనాచార్యులు

భగవంతుడు కృపకు పరవశుడు మనం కర్మకు పరవశులం.



20. శ్రీమాన్ మరింగంటి సంతోష్‌కృష్ణమాచార్యులు
21. శ్రీమాన్ టి. హయగ్రీవాచార్యులు
22. శ్రీమాన్ సముద్రాల గోపీకిశోర్
23. శ్రీమాన్ సింహాచలం కేశవాచార్యులు
24. శ్రీమాన్ వేలూరి ఆదిత్య
25. శ్రీమాన్ కిడాంబి శ్రీకాంతాచార్యులు
26. శ్రీమాన్ వానమామలై రాహుల్
27. శ్రీమాన్ అచ్యుత సత్యనారాయణ
28. శ్రీమాన్ మోటుపల్లి అరుణ్‌కుమారాచార్యులు

## తైత్తిరీయ శాఖ

29. శ్రీమాన్ కరి పురుషోత్తమాచార్యులు, సలక్షణ ఘనపాఠి
30. శ్రీమాన్ గట్టు శేషాచార్యులు
31. శ్రీమాన్ వేదాన్తం వేంకట నరసింహాచార్యులు
32. శ్రీమాన్ మరింగంటి గోవర్ధనాచార్యులు
33. శ్రీమాన్ కలకోట వేణుగోపాలాచార్యులు
34. శ్రీమాన్ ఆచ్చి లక్ష్మణాచార్యులు
35. శ్రీమాన్ గుదిమెళ్ళ తిరుమల శ్రీకాంతాచార్యులు
36. శ్రీమాన్ ఏ. సచిన్ శ్రీనివాస్
37. శ్రీమాన్ వేదాన్తం శ్రీవాత్సవ రామానుజాచార్యులు
38. శ్రీమాన్ ఆచ్చి వేంకట పవన్

## సామవేదము

39. శ్రీమాన్ ప్రశాంత్ షడంగి ఆచార్య
40. శ్రీమాన్ ఖగేంద్ర
41. శ్రీమాన్ ముఖేశ్
42. శ్రీమాన్ సుదర్శనాచార్యులు
43. శ్రీమాన్ వి. విష్ణుచైతన్య
44. శ్రీమాన్ కాందూరి వేంకట రమణాచార్యులు

## అథర్వవేదము

45. శ్రీమాన్ భట్టర్ సందర ప్రహ్లాదాచార్యులు
46. శ్రీమాన్ టి. పి. రాజగోపాలాచార్యులు
47. శ్రీమాన్ పవనర్చక్
48. శ్రీమాన్ టి.కె.వి. రామానుజాచార్యులు
49. శ్రీమాన్ సీతారామాచార్యులు
50. శ్రీమాన్ వానమామలై మనోజ్‌కుమారాచార్యులు
51 శ్రీమాన్ భట్టర్ సుకుమారాచార్యులు
52. శ్రీమాన్ కె.సి.భూపతి
53. శ్రీమాన్ సముద్రాల ఆదిత్యాచార్యులు
54. శ్రీమాన్ శ్రియఃపతి ఆచార్యులు
55. శ్రీమాన్ తిరుమల మద్దాలి విష్ణు

## భగవచ్ఛాస్త్రము

56. శ్రీమాన్ ముడుంబై మధుసూదనాచార్యులు
57. శ్రీమాన్ ఆరవెల్లి పవన్‌కుమారాచార్యులు
58. శ్రీమాన్ గోవర్ధనగిరి నవీన్‌కుమారాచార్యులు

## శ్రీరామాయణము

59. శ్రీమాన్ వరదన్, నిత్యపారాయణదార్
60. శ్రీమాన్ ఆసూరి మరింగంటి రామమోహనాచార్యులు – బాలకాండ
61. శ్రీమాన్ శేషం శ్రీనివాసదేశికులు – అయోధ్యాకాండ
62. శ్రీమాన్ శ్రీభాష్యం జయకృష్ణమాచార్యులు – అయోధ్యాకాండ
63. శ్రీమాన్ పరాంకుశం వేంకటనరసింహాచార్యులు – అరణ్యకాండ
64. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల లక్ష్మణాచార్యులు – కిష్కింధ, ఉత్తర కాండలు
65. శ్రీమాన్ కారంపూడి కిరణాచార్యులు – కిష్కింధ, ఉత్తర
68. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల వేంకట నరసింహాచార్యులు – సుందరకాండ
67. శ్రీమాన్ నల్లదీగ వేంకట శ్రీధరాచార్యులు – యుద్ధకాండ
68. శ్రీమాన్ శేషభట్టర్ వేంకట రమణాచార్యులు – యుద్ధకాండ
69. శ్రీమాన్ గట్టు రంగాచార్యులు – సుందరకాండ
70. శ్రీమాన్ నల్లంతిగళ్ వేంకట శ్రీనివాసాచార్యులు – సుందరకాండ
71. శ్రీమాన్ మరింగంటి వరదన్ అయ్యంగార్ – సుందరకాండ

## శ్రీవిష్ణు పురాణము

72. శ్రీమాన్ జగన్నాథాచార్యులు, నిత్యపారాయణదార్
73. శ్రీమాన్ భట్టర్ వేణుగోపాలాచార్యులు
74. శ్రీమాన్ అమరవాది వేణుగోపాలాచార్యులు
75. శ్రీమాన్ బెల్లంకొండ కృష్ణమాచార్యులు
76. శ్రీమాన్ సందుగుల వేణుమాధవన్

## శ్రీమద్భాగవతము

77. శ్రీమాన్ భాగవతుల వంశీ – 1, 2, 3 స్కంధములు
78. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల శేషాచార్యులు – 4, 5 స్కంధములు
79. శ్రీమాన్ పరాంకుశం రఘునాథాచార్యులు – 6, 7 స్కంధములు
80. శ్రీమాన్ ఎస్.వి.ఎస్. కృష్ణమాచార్యులు – 8, 9 స్కంధములు
81. శ్రీమాన్ మార్గపురి నరసింహాచార్యులు – 10 వ స్కంధము
82. శ్రీమాన్ పీతాంబరం రఘునాథాచార్యులు – 10 వ స్కంధము
83. శ్రీమాన్ కమలేశ్ స్వామి – 11, 12 స్కంధములు

## శ్రీవేంకటాచల మాహాత్మ్యము

84. శ్రీమాన్ ముడుంబై శ్రీనివాస భట్టరాచార్యులు
85. శ్రీమాన్ సముద్రాల వేణుగోపాలాచార్యులు

## వేదార్థ సంగ్రహము

86. శ్రీమాన్ రఘుపుంగవాచార్యులు

## వేదాన్త దీపము

87. శ్రీమాన్ గొడవర్తి సంపత్

బ్రతికినన్నాళ్ళు వంద చేతుల ఆర్జించాలి! వెయ్యి చేతుల వితరణ చేయాలి.



## శ్రీభాష్యము

88. శ్రీమాన్ కందాళ లక్ష్మీనరసింహాచార్యులు
89. శ్రీమాన్ ఆచ్చి పాండురంగాచార్యులు
90. శ్రీమాన్ భాగవతుల లక్ష్మణాచార్యులు

## గీతాభాష్యము

91. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్యులు

## గద్యత్రయము

92. శ్రీచరణ్ మరియు జీవా గురుకుల విద్యార్థులు

## సుదర్శన శతకము

93. శ్రీమాన్ రాచకొండ సుదర్శనాచార్యులు

## శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము

94. విద్యార్థులు, భాగవతోత్తములు

## నాలాయిర దివ్య ప్రబంధము

95. శ్రీమాన్ గోష్ఠీపూర్ణాచార్యులు
96. శ్రీమాన్ ఎంబార్ దామోదరాచార్యులు
97. శ్రీమాన్ మాధవన్ స్వామి (తిరుక్కోట్టియూర్)
98. శ్రీమాన్ వేంకటేశన్ అయ్యంగార్
99. శ్రీమాన్ ఎన్.సిహెచ్. రామానుజాచార్య
100. శ్రీమాన్ కాంచీపురం రామానుజన్
101. శ్రీమాన్ తిరుచ్చేరై కె.ఎస్. నారాయణన్
102. శ్రీమాన్ శ్రీవిల్లిపుత్తూర్ తిరువేంగళాచార్యులు
103. శ్రీమాన్ ఏ.టి.కె. రంగనాథన్
104. శ్రీమాన్ ఎన్.ఎస్. బాలాజీ
105. శ్రీమాన్ సారంగనాథ్
106. శ్రీమాన్ సారంగపాణి
107. శ్రీమాన్ సుదర్శన్
108. శ్రీమాన్ శెల్వమణి
109. శ్రీమాన్ మరింగంటి రామలక్ష్మణాచార్యులు
110. శ్రీమాన్ దెబ్బట వేంకటేశ్
111. శ్రీమాన్ కలకోట శ్రీకాంతాచార్యులు
112. శ్రీమాన్ సముద్రాల వంశీకృష్ణమాచార్యులు
113. శ్రీమాన్ విష్ణు
114. శ్రీమాన్ రవితేజ
115. శ్రీమాన్ కందాడై కౌశిక్
116. శ్రీమాన్ వానమామలై సాగర్
117. శ్రీమాన్ శాంతమూర్తి అభిషేక్
118. శ్రీమాన్ ఎన్.సిహెచ్. మురళీకృష్ణ
119. శ్రీమాన్ పురాణం నరసింహమూర్తి

❁ ❁ ❁

120. శ్రీమాన్ గోవర్ధనం భట్టరాచార్యులు
121. శ్రీమాన్ సౌమిత్రి శ్రీధరాచార్యులు (వాసు)
122. శ్రీమాన్ భాష్యకార్



ఆచార్యోపదేశం లేనివారికి ఆత్మ జ్ఞానంపై విశ్వాసం కలుగదు.





కృతజ్ఞతాజ్ఞాపనం

శ్రీఅమ్మగారి వైకుంఠోత్సవంలో ఎంతోమంది భాగవతోత్తములు, తమంత తామే చాలా శ్రద్ధతో ఆర్థికరూపంగా సేవలందించి తమ కార్యక్రమంగానే ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. అందరికీ కృతజ్ఞత తెలియజేయడానికి వాక్కులు చాలవు. అయినా కర్తవ్యాన్ని స్మరిస్తోంది మన 'భక్తినివేదన'.

1. చలిమెడ మెడికల్ కళాశాలల నిర్వాహకులు శ్రీమాన్ డా.లక్ష్మీనరసింహరావు దంపతులు
2. శ్రీమాన్ ఏ.ఎన్.ఎస్. శ్రీరామ దంపతులు, శేలం
3. శ్రీమాన్ చిట్టినేని శ్రీనివాస్ దంపతులు, భాగ్యనగరం
4. పార్లమెంట్ సభ్యులు శ్రీమాన్ ప్రభాకర్‌రావు-మంజుల
5. శ్రీమాన్ డా. జి. శోభా-ప్రసాద్, జెట్ యు.ఎస్.ఏ
6. వి.టి.సేవా, యు.ఎస్.ఏ.
7. మన భారత్ వికాసతరంగిణి అన్ని శాఖలవారు

ఇలాగా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను శ్రీ అమ్మగారి విషయంలో పరిపూర్ణమైన ఆదరాన్ని అందరూ తమ తమ సేవల ద్వారా తెలియజేశారు. అన్ని విధాలుగా అమ్మగారి వైకుంఠోత్సవంలో తమ తమ స్థానం నుండి అన్వయించినవారికి, శ్రీ చిన్న జీయర్‌స్వామివారు, ఉత్సవాంతంలో కృతజ్ఞతా పూర్వకంగా మంగళాశాసనాన్ని పలికారు. ఇలాగా సెప్టెంబర్ 25వ తేదీ సాయంకాలం పరమపదోత్సవ కార్యక్రమం సుసంపన్నమైంది.

❖❖❖❖❖❖

ఎవరి నాలుక పై హరి అనే రెండు అక్షరాలు ఉంటాయో అతడు గంగ వలె పవిత్ర తీర్థుడు.



శ్రీమతే నారాయణాయ నమః
శ్రీమతే రామానుజాయ నమః

# శ్రీమాతుశ్చరమ - పద్యాని



1 వర్షే శార్వరినామ్ని భాద్రబహుళే పక్షే, భృగోర్వాసరే,
శ్రీమత్సింహగతే రవౌ హి నవమీతిథ్యా మథార్ద్రోదుని ।
శ్రీనారాయణ సంయమీంద్ర చరణ ద్వంద్వైక నిష్ఠాన్వితా,
సద్వృత్తాహ్యాలువేలుమంగజననీ, స్వాచార్య-పాదావగాత్ ॥

2 భాద్రమాసేऽసితే పక్షే నవమ్యాం భృగువాసరే ।
శ్రీమన్నారాయణాచార్య పాదాంబుజ సమాశ్రితా ॥

3 అల్వేలుమంగా జననీ జ్ఞాన సన్తతి దాయినీ ।
ప్రాగాత్ స్వాచార్య చరణౌ నిత్య మజ్ఞాత నిగ్రహా ॥

4 త్రిపాద్విభూతి సామ్రాజ్యే నిత్య - ముక్త గణాన్వితా ।
భగవత్పరిచర్యాయాం రమతాం జననీ సదా ॥

5 మాతస్త్వదీయ సన్నిష్ఠా మస్మాస్వపి ప్రసారయ ।
స్వభావ మార్దవం త్వత్కం త్వదీయేషు ప్రపూరయ ॥


6 త్వదీయం మృదు భాషిత్వ మాత్మీయేభ్యః ప్రసాదయ ।
అకల్మషాం మనోవృత్తిం త్వదీయాం ప్రతిపాదయ ॥

7 మాతః! మానస మండపే ప్రతికలం విభ్రాజమానా భవ,
మాతః! దృష్టిపథే సుసంచరాత్ర మహతా ప్రేమ్ణా సమారాధితా ।
కారుణ్యామృతవారిణా హి సతతం సంసేచయాస్మాన్ ముదా
మాతః! త్వం భగవత్కటాక్ష మనఘం సర్వేషు సంధుక్షయ ॥

8 శ్రీమన్నారాయణాచార్య - యతీశ్వర కృపాన్వితే! ।
తద్వంశకీర్తి - వర్ధిన్యై మాతస్తే నిత్యమంగళమ్ ॥

భగవంతుణ్ణి పొందడానికి భగవంతుడే సాధనం ఇతరమైనవి ఏవి కావు.






ఓమ్ అస్మత్ గురుభ్యోనమః

కాశ్యపాన్వయ సంజాతం నారాయణ పదాశ్రితం ।
శ్రీమన్నారాయణం వందే యతీశ్వర శ్రియాజుషమ్ ॥

జగదాచార్యులు మన అందరికీ ప్రత్యక్ష ఆరాధ్యదైవమైన శ్రీశ్రీశ్రీ చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి పదసన్నిధిలో దాసోహ పూర్వక ప్రణామాంజలులు అర్పిస్తూ...
భగవద్బంధువులారా!

ఈగ్రంథం పూర్తిగా చదివి బరువెక్కిన హృదయాలతో నిట్టూరుస్తూ... కన్నీరు జారవిడుస్తున్నారు కదూ... నిజమే! జగదాచార్యుని మనకి అనుగ్రహించిన జగన్మాతలేని లోటు తీరనిదే.. కానీ, ఇందరి భావనలు తెలిసాక ఆ తల్లి అందరి హృదయాలలో.. ఆచార్య నిష్ఠా రూపంలో తిష్ఠ వేసుకుని కూర్చుని ఆచార్య కైంకర్యంలో ముందుకు నడిపిస్తున్నారన్న గ్రహింపు కొంత ఊరటనిస్తోంది కదూ.

మనస్వామిలోని దివ్యతేజమై, చిరునగవు దరహాస చంద్రికలు వెదజల్లే ఆ దివ్య మంగళ విగ్రహ రూపము తానై నిత్యదర్శనం అనుగ్రహిస్తూనే ఉంటారు! ప్రేరణనందిస్తూనే ఉంటారు!!! ఆ తల్లి తనలోని అమ్మ ప్రేమ, ఆచార్యుల పట్ల భక్తి విశ్వాసములు రంగరించి పోతపోసి మనకి ఆచార్యులుగా అందించారు.

భక్తుల పాలిట కల్పవృక్షంలా, ఆర్తుల పాలిట కామధేనువులా అనుగ్రహ వృష్టిని కురిపించే ఆచార్యుల ఆజ్ఞా బద్ధులమై.. భగవద్భాగవత కైంకర్యపరులము కాగలగడమే ఆ త్యాగమూర్తికి నిజమైన నివాళి.

గత 3 సంవత్సరాలుగా శ్రీరామానుజుల సమతామూర్తిని లోకావిష్కృతం కాగా సేవించాలనే తపనతో కర్మకృత దేహంలో బందీగా ఉండడానికే ప్రయత్నించి, ఇక ఆలస్యం జరగరాదని ఆ ఆటంకాలని తొలగించగలిగే దివ్యదేహాన్ని ధరించారు. పెరుమాళ్ళకి పురుషకారం చేసి మనలను ముందుకి నడిపిస్తారు..

ఆసక్తితో  ఆర్తితో కలసి ముందడుగు వేద్దాం! ఈ సంవత్సరం పూర్తయ్యేలోపే సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని ఆ అమృతమూర్తికి శ్రద్ధతో సమర్పించుకుందాం! చేయవలసిందల్లా ప్రతి ఒక్కరం మనకున్న దేహ బంధువులు ఆత్మ బంధువులు స్నేహితులు ఇరుగుపొరుగు అందరినీ ప్రేమార పలకరించి, సమతా సందేశాన్నందిస్తూ ఈ మహోద్యమంలో.. ఉడతా భక్తి కైంకర్యపరులయ్యేట్లు ప్రోత్సహించడమే! ఆలస్యమెందుకు .. అందరం కలిసి అడుగుముందుకు వేద్దాం! కలసి పంచుకుంటూ.. పెంచుకుందాం... సమతాస్ఫూర్తిని సాధిద్దాం!

ఈ అవకాశం అనుగ్రహించిన ఆచార్యుల శ్రీచరణాలకు కృతజ్ఞతతో దాసోహమంటూ సత్వరమే సహకరించిన మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదములతో.. సమతామూర్తి ఆవిష్కరణలో త్వరలో కలుద్దాం!

❖❖❖❖❖❖

**త్వరలో ఆవిష్కృతం కానున్న సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం.**



విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారైక విహారిణే।
శ్రీమన్నారాయణాచార్య స్వామినే నిత్య మంగళమ్ ॥

యావత్ప్రపంచ సంపూజ్య చరణాయ మహాత్మనే।
శ్రీమన్నారాయణాచార్య యతిరాజాయ మంగళమ్ ॥

మంగళాశాసన పరైః మదాచార్య పురోగమైః।
సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్ ॥

❖❖❖❖❖❖

భగవదర్పితమైన జీవనమే జీవనం.